REH102B102

అధ్యాత్మరామాయణము


ఆంధ్రవ్యాఖ్యానసహితము



వ్యాఖ్యాత:
పురాణపండ రామమూర్తి

ప్రథమముద్రణ

దుర్ముఖి సంక్రాంతి



ప్రతులకు

పైండా సూర్యనారాయణమూర్తి

అధ్యాత్మప్రచారకసంఘము

దేవాలయంవీధి, కాకినాడ

★

అధ్యాత్మప్రచారకసంఘము

ఆలమూరు, తూర్పుగోదావరి



మూల్యము

పదిరూపాయలు

సర్వహక్కులు

గ్రంథకర్తవి

ముద్రణ

శ్రీపతి ముద్రణాలయము

కాకినాడ

యు ద్ధ

ఉ త్త ర

4

పరిశీలనము

భారతీయ వేదాంతసారమయిన అధ్యాత్మరామాయణము ఆంధ్ర వ్యాఖ్యానముతో ప్రథమసంపుటము సుందరకాండపర్యంతము వెలువడినది.

అనంతరము ద్వితీయసంపుటమునకు ఉదారహృదయముతో విరివిగా సహాయపరచి ముద్రణకు కాగితమును సమకూర్చిన ఈ సుహృద్దాతలను పరమేశ్వరుడు తన కరుణాపీక్షణములతో సదైశ్వర్యవంతులుగ నొనరుచునుగాక.

ఈ సంపుటమునకు కాగితము నొసంగిన భక్తవరులు.

(శ్రీ) బొల్లాప్రగడ రామమూర్తిగారు
,, మేడిశెట్టి వెంకట్రావుగారు
,, రెడ్డి వెంకట్రావుగారు
,, కనుమూరి వెంకట్రావుగారు
,, బొజ్జా ధర్మరాజుగారు
,, నూకల రామచంద్రంగారు
,, దామిశెట్టి సత్యనారాయణమూర్తిగారు

అంచనాలను దాటి మరి రెండురీముల కాగితము కావలసివచ్చినదని తెలిసినంతనే దానిని పంపిన (శ్రీ) కనుమూరి వెంకటరావుగారికి మా ప్రత్యేకాభినందనలు.

నిస్వార్థముగ, నిరాడంబరముగ, నుస్తుముగ రామకార్యముగా భావించి ఈ సహకారము నొసంగిన వీరికి మా కృతజ్ఞతలు.

* * * *

చరాచరజగచ్చక్రపరిభ్రమణకార్యోత్తత్పరుడయిన పరమేశ్వరుని అమేయశక్తిపై విశ్వాసమునుగల కుటుంబములలో పేరెన్నికగన్నది శ్రీ దంటువారి వంశము. ఈవంశమున వేదాధ్యయనపరులుకూడ నుండెడివారు. అంచ కీ. శే. దంటు తిమ్మయ్యగారి కుమారులు సోదరభావంలో పంచపాండవులను స్మృతికి తెస్తారు.

శ్రీయుత సూర్యారావుగారు
,, రామమూర్తిగారు
,, విశ్వనాధంగారు
,, కృష్ణమూర్తిగారు
,, భాస్కరరావుగారు

ఈ సోదరు లయిదుగురు నాగరకప్రపంచ సభ్యతానుకూలవర్తనులు.

ఇందు సూర్యారావుగారు డి. యస్. నారాయణ కంపెనీ స్థాపించి కాకినాడలోనేగాక ఆంధ్రదేశమున కొన్నిశాఖలు నెలకొల్పి దేశదేశాలతో దిగుమతి, ఎగుమతి వ్యాపారాదులలో ప్రముఖస్థానాన్ని పొందారు. ఈసంస్థలద్వారా కొన్నివేల కుటుంబములకు పోషణ జరుగుచున్నది. చిరకాలము ఆంధ్రబ్యాంకి డైరెక్టరుగ నుండుటయే కాక కళాపోషణలో ఖ్యాతిగన్నవారు. ప్రస్తుతము వీరు అన్నిరంగము లందలి బాధ్యతలు వీడి ప్రశాంతిగ విశ్రాంతి తీసికొనుచున్నందున సోదరులు, యువకులు అయిన శ్రీ భాస్కరరావు ఆయారంగములలో అడుగుపెట్టి సక్రమముగ నిర్వహించుచు ప్రజల మన్ననలందుచున్నారు. ప్రజాభిమానమునకు తారాణమే వారికి లభించిన ఛైర్మన్‌పదవి.

ఆంధ్రబ్యాంకి డైరెక్టరుగ వీరు పనిచేయుచున్నారు. విశాల మయిన హృదయము, ప్రశాంతమయిన వ్యాపారము వీరిజీవితమునకు వన్నెనిచ్చినవి.

9A



శ్రీ దంటు భాస్కర రావు


పురపాలక సంఘాధ్యక్షులు

2B

ఈ అధ్యాత్మరామాయణము ప్రథమసంపుటము ఆవిష్కారము జరిగిన యనంతరము ఈ అధ్యాత్మప్రచారకసంఘ వార్షికోత్సవము జరిగిననాటి సభాప్రారంభకులుగ విచ్చేసిన క్షణములో శ్రీ భాస్కర రావుగారి హృదయమున శ్రీరామచంద్రుడు ప్రవేశించినాడు. నాడే, ఈ ద్వితీయసంపుట ముద్రణవ్యయమును భరింతుమని వాగ్దానము చేసి నాము. చేసి, చెల్లించినారు.

శ్రీ దంటు తిమ్మయ్య-సుభద్రమ్మగారల గర్భశుక్తిముక్తాఫలంగా ఆవిర్భవించిన ఈవర్ధమానునికి పరమేశ్వరుడు సర్వరంగముల సహకార మొసంగునుగాక యని ప్రార్థించుచున్నాను.

—వ్యాఖ్యాత.



యుద్ధకాండ విషయసూచిక

ప్రథమసర్గ

శ్రీరాముడు హనుమంతుని ప్రశంసించుట, సముద్రోల్లంఘనమును గూర్చి విచారించుట, సుగ్రీవుడు శ్రీరామున కుత్సాహము పురికొల్పుట, రాముడు ప్రశ్నింప హనుమంతుడు లంకానగర స్వరూపమును జెప్పుట, శ్రీరాముని యాజ్ఞచేశమున సుగ్రీవుడు వానరసైన్యసమేతముగ ప్రయాణము సాగించుట, సర్వసైన్యసమేతముగ శ్రీరాముడు సముద్రతీరమును చేరుట, సేనా నివేశనము, సముద్రమును దాటు లెట్లని వానరులు విచారించుట, సీతనుగూర్చి శ్రీరాముడు విచారించుట, శ్రీరామ స్వరూపవర్ణనము. 3–15

ద్వితీయసర్గ

లంకయందు హనుమంతునిచే జేయబడిన లంకాదహనాదులచే లజ్జితుడై రావణుడు మంత్రులతో నాలోచించుట, మంత్రులు రావణున కుత్సాహము కలిగించుట, కుంభకర్ణుడు రావణునకు సీతారాముల స్వరూపముల జెప్పి నీతినిబోధించుట, ఇంద్రజిత్తు తన పరాక్రమమును జెప్పుచు, సర్వులను జయింతు నని రావణున కుత్సాహము కల్గించుట, విభీషణుడు రావణునకు హితోపదేశ మొనర్చుట, రావణునిచే తిరస్కరింపబడి విభీషణుడు సీతారాముల సత్యస్వరూపమును చెప్పి రామునివలన సర్వరాక్షసవినాశనము తప్పదని పలుకుచు శ్రీరాముని శరణుజొచ్చుటకు బోవుట. 16–39

తృతీయసర్గ

విభీషణుడు శ్రీరాముని చేరుట, సుగ్రీవుడు విభీషణుని అనుమానించి వానిని సంహరించుటకు అనుజ్ఞ నిమ్మని శ్రీరాముని కోరుట, శ్రీరామాజ్ఞచే సుగ్రీవుడు విభీషణుని రామునికడకు గొనివచ్చుట, విభీషణుడు శ్రీరాముని స్తుతించుట, శ్రీరామవిభీషణసంవాదము, విభీష

ణుని లంకారాజ్యమునకు పట్టాభిషిక్తుని జేయుట, సుగ్రీవవిభీషణులు సంభాషించుట, రావణప్రేరితులైన శుకసారణులు రామసైన్యమును చూడవచ్చుట, వానరులు శుకసారణులను బట్టుట, రామాదేశమున దూతలను వదలివేయుట, సుగ్రీవ శుకసంవాదము, శౌర్యాలుడు శ్రీరామ బలాదులు రావణునకు జెప్పుట, రామదర్శనమున యుప్పొంగిన సము ద్రునిపై రాముడు కోపించుట, సముద్రుడు స్వస్వరూపముతో వచ్చి రాముని స్తుతించుట, సముద్రుడు సేతుబంధన విధానము చెప్పుట, సముద్రోపదేశమున శ్రీరాముడు. ఆగ్నేయాస్త్రమును ద్రుమకుల్య ప్రాంతమున గల ఆభీరులపై వదలుట, సేతుబంధన విధానమును నలుడు గ్రహించుట. 40–66

చతుర్థసర్గ

సేతుబంధ నారంభమున రామలింగేశ్వర ప్రతిష్ఠ చేయుట, నలుడు సేతువును బంధించుట, శ్రీరామాదులు సేతువును దాటుట, లంకను జూచుట, రావణుని చూచుట, శుకుడు రావణునకు శ్రీరామ పరాక్రమమును, సీతారాముల యథార్థతత్వమును ఉపదేశించుచు శరీరము క్షణభంగురమని చెప్పుట. 67–82

పంచమసర్గ

రావణుడు శుకుని నిందించుట. శుకుడు స్వగృహమునకు బోవుట, శుకుని జన్మాంతర వృత్తాంతము, శుకునకు రాక్షసదేహప్రాప్తి వర్ణనము, శుకునకు పూర్వదేహము కలుగుట, మాల్యవంతుడు వచ్చుట, మాల్యవంతుడు రావణునకు నీతి నుపదేశించుట, రావణుడు మాల్యవంతుని తిరస్కరించుట, శ్రీరాముడు ప్రాసాదమందున్న రావణుని శ్వేతచ్ఛత్రాదులను నరికివేయుట, రాక్షస వానర యుద్ధారంభము, ఇంద్రజిత్తు సర్వసేనాసమూహార్చన మొనర్చుట, హనుమంతుడు ద్రోణగిరిని దెచ్చుట, వానరులు తిరిగి లేచుట, ద్రోణపర్వతమును హనుమంతుడు యథాస్థానమందుంచుట, రావణాజ్ఞచే రాక్షసులు యుద్ధమునకువచ్చుట, వానరరాక్షసుల యుద్ధము, అతికాయాదులు మరణించుట. 83–125

షష్ఠ సర్గ

అతికాయాదుల మరణమునకు దుఃఖించి రావణుడు స్వయముగ యుద్ధమునకు వచ్చుట, సుగ్రీవాదులను మూర్ఛాగతుల నొనర్చి రావణుడు మయదత్తమైన శక్త్యస్త్రమును విభీషణునిపై ప్రయోగించుట, విభీషణరక్షణకై లక్ష్మణు డాశక్త్యస్త్రమునకు గురియై మూర్ఛిల్లుట, రావణుడు లక్ష్మణు నెత్త ప్రయత్నించి విఫలుడగుట, హనుమంతుని ముష్టిఘాతముచే రావణుడు రక్తముగ్రక్కుచు రథముపై మూర్ఛిల్లుట, హనుమంతుడు లక్ష్మణుని గొనిపోవుట, రామరావణ యుద్ధము, రావణుడు పరాజితుడగుట, లక్ష్మణుని కొరకు రాముడు విలపించుట, రామాజ్ఞను పొంది హనుమంతుడు ద్రోణగిరికి ప్రయాణమగుట, రావణుడు కాలనేమిని హనుమంతుని ప్రయాణము నాటంకపరచుమని చెప్పుట, కాలనేమి రావణునకు నీతి నుపదేశించుట. 126–142

సప్తమ సర్గ

కాలనేమిపై రావణుడు కోపించుట, కాలనేమి హనుమంతుని గమనము నాటంకపరుప నేగుట, కాలనేమి శిష్యసమేతమగు ఆశ్రమము కల్పించుట, హనుమంతుడు కాలనేమిని పూజీయమడుగుట, కాలనేమి శిష్యులు హనుమంతునకు కొలను జూపుట, మకరి హనుమంతుని బట్టుట, హనుమంతుని యనుగ్రహముచే శాపవిముక్తరాలై ధాన్యమాలి స్వస్వరూపము నంది కాలనేమి వృత్తాంతము జెప్పుట, కాలనేమితో హనుమంతుడు యుద్ధమొనర్చి వానిని సంహరించుట, హనుమంతుడు ద్రోణాద్రిని తెచ్చుట, సంజీవిచే లక్ష్మణు డుజ్జీవించుట, రావణుడు కుంభకర్ణుని మేలొకుపుని దూతల కాజ్ఞాపించుట, కుంభకర్ణుడు రావణునింద్దకు వచ్చుట, రావణకుంభకర్ణ సంవాదము. కుంభకర్ణుడు రావణునకు రాముడు సాక్షాత్పరబ్రహ్మ యని చెప్పుట.

143–161

అ ష్ట మ స ర్గ

రావణునిచే అధిక్షేపింపబడిన కుంభకర్ణుడు యుద్ధమునకు బయలుదేరుట, కుంభకర్ణవిభీషణ సంవాదము, రామకుంభకర్ణుల యుద్ధము, రాముడు కుంభకర్ణుని సంహరించుట, రామదర్శనమునకు నారదుడు వచ్చుట, నారదకృత శ్రీరామస్తుతి, కుంభకర్ణుని మరణమునకు రావణుడు విలపించుట, ఇంద్రజిత్తు రావణునకు ధైర్యము చెప్పుట, ఇంద్రజిత్తు నికుంభిలా ప్రవేశము, ఇంద్రజిత్తును సంహరించుటకు లక్ష్మణుని పంపు విషయమై రామవిభీషణు లాలోచించుట. 162–187

న వ మ స ర్గ

శ్రీరాముడు లక్ష్మణుని ఇంద్రజిత్తుపై యుద్ధమునకు పురికొల్పుట, లక్ష్మణాదులు ఇంద్రజిత్తుపై యుద్ధమునకు బోవుట, లక్ష్మణాదులు ఇంద్రజిత్తుయొక్క బలమును మర్దించుట, ఇంద్రజిత్తు యుద్ధమునకు వచ్చుట, ఇంద్రజిత్తు తన బలమును జెప్పుట, ఇంద్రజిత్తు విభీషణు నధిక్షేపించుట, లక్ష్మణుడు ఇంద్రజిత్తుతో యుద్ధమొనర్చుట, లక్ష్మణుడు ఇంద్రజిత్తును సంహరించుట, ఇంద్రజిత్తు వినాశనమునకు దేవత లానందించుట, లక్ష్మణాదులు శ్రీరాముని జేరుట, రామలక్ష్మణ సంవాదము, ఇంద్రజిత్తు మరణమునకు రావణుడు విలపించుట, రావణుడు కృద్ధుడై సీతను నశింపజేయ బూనుట, సుపార్శ్వుడు రావణునకు సీతావినాశనము తగదని చెప్పుట, రావణుడు స్వగృహమును చేరి సభాభవనమునకు వచ్చుట.
188–204

ద శ మ స ర్గ

అవశిష్టబలముతో రావణుని యుద్ధము, అపజయమును పొంది రావణుడు శుక్రుని చేరుట, శుక్రాదేశమున రావణుడు హోమారంభము చేయుట, విభీషణాదేశమున శ్రీరాముడు సుగ్రీవాదులను హోమవిఘ్నార్థము బంపుట, సరమ వానరులకు హోమదేశము చూపుట, వానరులు హోమస్థానమును చేరుట, మందోదరిని అవమానింప యత్నించుట, మందోదరి విలపింప రావణుడు లేచి వచ్చుట, హోమవిఘ్న

మొనర్చి వానరులు శ్రీరాముని వద్దకు వచ్చుట, అజ్ఞానజనితములగు శోకాదులు తుచ్ఛములని రావణునకు బోధించుట, మందోదరి రావణునకు రాముడు పరబ్రహ్మ యని చెప్పుట. 205–218

ఏకాదశ సర్గ

రావణుని యుద్ధప్రవేశము, హనుమదాది వానరులతో సంగ్రామము, రామరావణ యుద్ధారంభము, ఇంద్రుడు మాతలిచే తన రథమును బంపుట, రామరావణ యుద్ధము, రావణుని నాభియం దమృతమును శోషింపజేయుమని విభీషణుడు శ్రీరామునకు జెప్పుట, శ్రీరాముడు రావణుని నాభియందున్న అమృతమును శోషింపజేయుట, రామరావణుల ఘోరయుద్ధము, మాతలి యుపదేశమున రాముడు రావణుని మర్మమును భేదించుట, రావణుని పతనము, రావణతేజము రాముని యందు ప్రవేశించుట, రావణుడు విష్ణుసాయుజ్యముసందుటను జూచిన దేవతలు రావణుని యదృష్టమును ప్రశంసించుట, నారదుడు దేవతలకు ధర్మతత్త్వము నుపదేశించుట. 219–238

ద్వాదశ సర్గ

రాముడు సుగ్రీవాదులతో భాషించుట, మందోదరి మొదలగు అంతఃపురకాంతలు యుద్ధభూమికి వచ్చి విలపించుట, విభీషణుని విచారము, రాముడు జీవునియొక్క నిత్యానిత్యత్వతత్త్వమును జెప్పుట, లక్ష్మణుడు విభీషణాదుల ననునయించుట, రామునిచే అనుజ్ఞాతుడై విభీషణుడు మందోదరి మొదలగు అంతఃపురకాంతల నూరార్చుట, రావణునకు సంస్కారము చేయుట, మాతలి రథముతోకూడ స్వర్గమునకు బోవుట, రామాదేశమున లక్ష్మణాదులు లంక కేగుట, విభీషణ పట్టాభిషేకము, శ్రీరామాజ్ఞచే హనుమంతుడు సీతవద్ద కేగుట, సీతాహనుమంతుల సంవాదము, రామాజ్ఞచే విభీషణుడు సీతను గొనివచ్చుట, రాముడు సీతతో వ్యతిరేకముగ భాషించుట, సీత అగ్నియందు శపథమొనర్చుట. 239–274

త్ర యో ద శ స ర్గ

ఇంద్రాదులు రామునివద్దకు వచ్చుట, దేవతలు శ్రీరాముని స్తుతించుట, బ్రహ్మ శ్రీరాముని స్తుతించుట, ఇంద్రుడు శ్రీరాముని స్తుతించుట, శ్రీరాముడు విమానమందున్న దశరథుని జూచుట, రామా దేశమున ఇంద్రుడు అమృతమును వర్షించి యుద్ధమున మృతులైన వానరులను జీవింపజేయుట, విభీషణుడు స్వర్ణరత్నాభరణాదులతో వానరులను బహూకరించుట, రాక్షస, వానరసైన్యసమేతముగా రామ లక్ష్మణులు సీతాసమేతముగ పుష్పకము నధిరోహించి అయోధ్యకు ప్రయాణమగుట. 275–296

చ తు ర్ద శ స ర్గ

విమానమునుండి సీతకు రాముడు యుద్ధభూమిని వివరించి చెప్పుట, శ్రీరాముడు సీతకు మార్గమందలి విషయ విశేషములు చూపుట, శ్రీరాముడు సర్వపరివారసమేతముగ భరద్వాజాశ్రమము నకు వచ్చుట. రామభరద్వాజ సంవాదము, భరద్వాజుడు శ్రీరాముని స్తుతించుట, భరద్వాజుడు శ్రీరామాదులను ఆతిథ్యమునకు ప్రార్థించుట, రాముడు హనుమంతునివద్దకు బోవుట, హనుమంతుడు గుహునితో సంభాషించుట, హనుమంతుడు నందిగ్రామమును జేరుట, భరత హనుమంతుల సంవాదము. భరతాజ్ఞచే శత్రుఘ్నుడు అయోధ్య నలం కరింపజేయుట, అయోధ్యానగరవాసులు శ్రీరాముని ప్రార్థింప వచ్చుట, శ్రీరాముడు సపరివారముగ నందిగ్రామము చేరుట. 297–319

ప ం చ ద శ స ర్గ

శ్రీరాముడు భరతునివల్ల రాజ్యమును గ్రహించుట, జటా విమోచనము, శ్రీరామాదుల అయోధ్యానగర ప్రవేశము, రామా జ్ఞచే భరతుడు సుగ్రీవాదులను తగు భవనములందు ప్రవేశపెట్టుట, శ్రీరామ పట్టాభిషేక సమాలోచన, శ్రీరామ పట్టాభిషేకము, సీతా సమేతముగ సింహాసనాసీనుడైన శ్రీరాముని శంకరుడు స్తుతించుట, ఇంద్రాదులు శ్రీరామునితో పలుకుట. 320–340

షోడశసర్గ

రామరాజ్యమున భూమండల సౌభాగ్య వర్ణనము, శ్రీరాముని వితరణ, రామునిచే నొసగబడిన హారమును సీత హనుమంతున కొస గుట, సీతారాములు హనుమంతునకు వరము లిచ్చుట, హనుమం తుడు హిమవంతమున కేగుట, రాముని అనుజ్ఞను పొంది గుహుడు స్వగృహమునకు బోవుట, విభీషణ, సుగ్రీవాదులు సంతోషచిత్తులై రామాజ్ఞను పొంది వారి వారి నివాసములకు బోవుట, రాముడు లక్ష్మ ణుని యువరాజు నొనర్చుట, రామరాజ్య పరిపాలన, రాము డశ్వమే ధాది యాగము లొనర్చుట, అధ్యాత్మరామాయణ పఠన శ్రవణ ఫల నిరూపమునము, అధ్యాత్మ రామాయణము సదా శివప్రోక్తమే యని నిరూపించుట. 341--353

★

ఉత్తరకాండ

ప్రథమసర్గ

రాముడు రాజ్యముచేయుచుండ విశ్వామిత్రాదులు చూడ వచ్చుట, మహర్షులు శ్రీరాముని స్తుతించుట, అగస్త్యాదులు ఇంద్రజిత్తు పరాక్రమమును ప్రశంసించుట, శ్రీరాముడు అగస్త్యుని రావణాదులను వదలి ఇంద్రజిత్తును ప్రశంసించుటకు కారణ మడుగుట, అగస్త్యుడు రావణాదుల జన్మవృత్తాంతమును జెప్పుట, పులస్త్యుని శాపమున తృణబిందు ఋషికుమార్తె గర్భము ధరించుట, తృణబిందు తన కుమార్తెను పులస్త్యుని కిచ్చుట, ఆమెకు విశ్రవుడు జన్మించుట, భరద్వాజుని కుమార్తెను విశ్రవసుడు వివాహమాడుట, విశ్రవసున కామెయందు వైశ్రవణుడు (కుబేరుడు) జన్మించుట. తపమునకు మెచ్చి బ్రహ్మ కుబేరునకు ధనాధిపత్యము నిచ్చుట, తండ్రి యాజ్ఞచే కుబేరుడు లంక కేగుట, ధనద (కుబేర) సుమాలుల సమాగమము, సుమాలి తన కుమార్తె కైకసిని విశ్రవసువును వరింపుమని బంపుట, కైకసి (నైకషి) విశ్రవసువు ఆశ్రమమునకు వచ్చి విశ్రవుని సేవించుట, సేవకు మెచ్చి విశ్రవుడు వరమును కోరుమనుట, కైకసి విశ్రవుని భర్తగా వరించుట, విశ్రవుడు దివ్యజ్ఞానముచే నామె వృత్తమును గ్రహించుట, విశ్రవుడు కైకసిని పరిణయమగుట, నీవు దారుణసమయమున నన్ను పొందితివి గాన నీకు క్రూరకర్ములు దయింతురని జెప్పుట, కైకసి విచారించుట, సత్త్వగుణసంపన్నుడగు కుమారుడొకడుకూడ కలుగునని వరమిచ్చుట, కైకసి గర్భమునుండి రావణ, కుంభకర్ణ, శూర్పణఖా, విభీషణాదులు జన్మించుట, అగస్త్యుడు శ్రీరాముని స్తుతించుట. 355–375

ద్వితీయసర్గ

కైకసి ప్రబోధముచే రావణాదులు గోకర్ణక్షేత్రమున ఘోరతప మొనర్చుట, వారలకు బ్రహ్మ వరము లిచ్చుట, సుమాలి, ప్రహస్తుల

ప్రబోధపలన రావణుడు లంక నాక్రమించుట, కుబేరుడు కైలాసమున అలకాపురిని చేరుట, శూర్పణఖను విద్యుజ్జిహ్వాన కిచ్చి వివాహము చేయుట, మయుడు తన కుమార్తె మందోదరిని రావణున కిచ్చి వివాహము చేయుట, మయుడు శక్త్యస్త్రమును రావణున కొసంగుట, వైరోచన దౌహిత్రి వృత్రజ్వాలను కుంభకర్ణుడు పరిణయమగుట, సరమా విభీషణపరిణయము మందోదరికి మేఘనాదుడు జన్మించుట, కుంభ కర్ణునకు నిద్రించుటకు గృహనిర్మాణ మొనర్చుట, కుంభకర్ణుడు నిద్రించుట, రావణుడు ప్రపంచ దిగ్విజయ మారంభించుట, రావణుడు పుష్పకమును హరించుట, రావణునిచే యమ, వరుణులు పరాజయము నొందుట, ఇంద్రుడు రావణుని బంధించుట, మేఘనాదుడు రావణుని విడిపించి ఇంద్రుని బంధించుట, మేఘనాదునకు వరమొసగి బ్రహ్మ ఇంద్రుని విడిపించుట, కైలాసమును జయింపబోయిన రావణుని నందికేశ్వరుడు శపించుట, కార్తవీర్యార్జునుడు రావణుని బంధించుట, పులస్త్యుడు కార్తవీర్యుడు రావణుని విడచుట, రావణుడు వాలిచే పరాభవింపబడి సఖ్యమొనర్చుట, అగస్త్యుడు స్తుతిరూపముగ శ్రీరామ మాహాత్మ్యమును వర్ణించుట. 376–411

తృతీయసర్గ

వాలి సుగ్రీవుల జన్మవృత్తాంతమును చెప్పుమని శ్రీరాముడు అగస్త్యుని కోరుట, అగస్త్యుడు వాలి సుగ్రీవుల చరిత్ర చెప్పుట. బ్రహ్మ వాలి సుగ్రీవులకు కిష్కింధానగరము నిచ్చుట, అగస్త్యుడు పునః రాముని స్తుతించుట, అగస్త్యుడు శ్రీరామునకు సీతాపహరణకారణ వర్ణనద్వారా సనత్కుమార రావణసంవాదము చెప్పుట. 412–424

చతుర్థసర్గ

రావణ నారదసంవాదము, నారదోపదేశమున రావణుడు శ్వేతద్వీపమునకు యుద్ధమునకు బోవుట, శ్వేతద్వీపమున స్త్రీలు రావణుని నిగ్రహించుట, అగస్త్యమహర్షి శ్రీరాముని స్తుతించి తన ఆశ్రమ

మునకు బోవుట, పుష్పకము రాముని వద్దకు వచ్చుట, రామరాజ్య వర్ణన, బ్రాహ్మణబాలకుని అకాలమరణమున శ్రీరాముడు శూద్రకుని సంహరించి బ్రాహ్మణబాలుని జీవింపచేయుట, రాముడు రాజ్యము చేయుట, శ్రీరాముడు సీతకు జరుగబోవు వృత్తాంతమును జెప్పుట, లక్ష్మణుడు సీతను అరణ్యమున విడచుట, వాల్మీకి సీతను తన ఆశ్రమ మునకు గొనిపోవుట, శ్రీరాముడు మునివ్రతము నవలంబించుట.

425–440

పంచమసర్గ

లక్ష్మణుడు ప్రశ్నింప రాముడు నృగచరితము మొదలగు ప్రాచీన గాథలు చెప్పుట, శ్రీరామగీత.

441–491

షష్ఠసర్గ

లవణాసురభయమున ఋషులు రాముని కడకు వచ్చుట, మునులు లవణాసురవృత్తాంతము రామున కెరింగించుట, శత్రుఘ్నునకు, రాముడు దివ్యశరము నిచ్చి లవణవధోపాయము జెప్పి పంపుట, శత్రుఘ్నుడు లవణాసురుని సంహరించి మధురానగరము నాక్రమించుట, వాల్మీకి ఆశ్రమమున సీత కవలలను కనుట, వాల్మీకి సీతా పుత్రులకు కుశలవులను నామములు నిర్దేశించుట, వాల్మీకి స్వయముగ కుశలవులకు సావిత్రీ దీక్షనిచ్చి (ఉపనయన మొనర్చి) సాంగముగ శతుర్వేదములనుపదేశించుట, వేదోపబృంహణమునకుగాను శ్రీరామా యణము నుపదేశించుట, స్వర, లయాదులతో గూడిన రామాయణ గానమును విని మహర్షులు అపూర్వమగు నా కావ్యగానమున కానం దించుట, రాము డశ్వమేధయాగము చేయుట, రామాశ్వమేధమునకు చాతుర్వర్ణములవారు వచ్చుట, రాజర్షులు, బ్రహ్మర్షులు అశ్వమేధము నకు వచ్చుట, రామాయణగానమొనర్చు కుశలవులతో వాల్మీకి ప్రయాణమగుట, మార్గమున కుశుడు బంధమోక్షములనుగూర్చి ప్రశ్నించుట, వాల్మీకి కుశునకు మోక్షసాధనము నుపదేశించుట.

492–505

సప్తమసర్గ

వాల్మీకి యుపదేశమున కుశుడు భ్రమను వదలుట, వాల్మీకి కుశలవులకు శ్రీమద్రామాయణము శ్రీరాముడు వినుటట్లు అశ్వమేధ యాగమున గానముచేసి శ్రీరాము డెట్టి కానుకలిచ్చినను గ్రహింప వద్దని చెప్పుట, చిత్రచరిత్రవృత్త సంభరితమైన రామాయణగానము నకు రాము డానందించి మహాపరిషన్మధ్యమున రామాయణమును వినిపింప కుశలవులకు అవకాశ మిచ్చుట, రాముడు కుశలవులనుజూచి విస్మయమందుట, కుశలవులు రామాయణగానము చేయుట, శ్రీరాముడు కుశలవులకు పదివేలు సువర్ణముద్ర లిమ్మని భరతున కాదేశించుట, కుశలవులు వనవాసులమగు మాకు బంగారునాణెములతో పనిలేదని చెప్పుట, కుశలవులు వాల్మీకిని చేరుట, రాముడు కుశలవులు సీతాపుత్రులని నిశ్చయించుట, శ్రీరాముడు సీతతోకూడ వాల్మీకిని గొనిరమ్మని శత్రుఘ్నాదులకు ఆజ్ఞాపించుట, వాల్మీకి సీతను గొని వచ్చుట, శపథము చేసినచో సీతను గ్రహింతునని వాల్మీకితో రాముడు చెప్పుట, వాల్మీకితో సీత యష్టభూమిని ప్రవేశించుట, సీత పరిశుద్ధు రాలని వాల్మీకి శపథమొనర్చుట, కుశలవులు శ్రీరాముని పుత్రులేయని వాల్మీకి చెప్పుట, బ్రహ్మాదులు యజ్ఞవేదికకు వచ్చుట, సీతాశపథము, భూదేవి సింహాసనంతోకూడ వచ్చి సీతను గ్రహించుట, జానకితో భూమాత రసాతలమునకు పోవుట, సీతావియోగమునకు వానరులు దుఃఖించుట, సీతావియోగమునకు రాముడు దుఃఖించుట, బ్రహ్మణులు, ఋషులు, రామునకు దుఃఖోపశమనవాక్యములు చెప్పుట, శ్రీరాముడు ఋత్విక్గణమును విసర్జించుట, కుశలవులతో అయోధ్యకు వచ్చుట, రాముడు ఏకాంతవాసమొనర్చుట, కౌసల్య శ్రీరాముని మోక్షమార్గము చెప్పుమని అడుగుట, రాముడు మోక్షమార్గము నుపదేశించుట, కౌసల్యా, కైకేయీ, సుమిత్రలు పరమగతినందుట.

అ ష్ట మ స ర్గ

మేనమామచే పిలువబడి రామాజ్ఞనుపొంది భరతుడు గంధర్వులపై యుద్ధమునకు బోవుట, గంధర్వులను జయించుట, పుష్కరావతికి పుష్కరుని తక్షశిలకు తక్షుని పట్టాభిషిక్తుల నొనర్చుట, భరతుడయోధ్యకు వచ్చి రాముని సేవించుట, రామాదేశమున లక్ష్మణుడు పశ్చిమదేశములకు బోయి భిల్లులను జయించుట, పశ్చిమదేశములకు అంగద, చిత్రకేతులను పట్టాభిషిక్తుల నొనర్చుట, లక్ష్మణుడయోధ్యకు వచ్చి శ్రీరాముని సేవించుట, కాలుడు మునివేషమున అయోధ్యకు వచ్చుట, లక్ష్మణుడు కాలునిరాకను రామున కెరిగించుట, శ్రీరాముడు కాలుని దర్శించి పూజించుట, కాలుడు సంభాషించునపు డొరు లుండరాదని పలుకుట, లక్ష్మణుని ద్వారమందుంచి శ్రీరాముడు లోనికివచ్చినవారికి మరణదండన విధింతునని శాసించుట, కాలుడు రామునితో తన ఆగమన కారణము చెప్పుట, శ్రీరాముడు వైకుంఠగమనము నంగీకరించుట, దూర్వాసుడయోధ్యకు వచ్చుట, దూర్వాసుడు రాపదర్శనము కావలెనని లక్ష్మణునితో చెప్పుట, లక్ష్మణుడు ముహూర్త కాల మూగుడని దూర్వాసుని ప్రార్థించుట, దూర్వాసుడు కోపించుట, లక్ష్మణుడు వంశక్షేమము, దేశక్షేమమును కోరి దేహత్యాగము నంగీకరించి శ్రీరాముని వద్దకు బోవుట, శ్రీరాముడు కాలునకు అనుజ్ఞనిచ్చి దూర్వాసునివద్దకు వచ్చుట, శ్రీరాను డాతిథ్యమిచ్చుట, శ్రీరాముడు కాలునివాక్యములు స్మరించి విచారించుట, లక్ష్మణుడు ధర్మాచరణావశ్యకము విధియని శ్రీరామునకు చెప్పుట, శ్రీరాముడు వసిష్ఠ, సుమంత్రాది మంత్రిగణ పరివృతుడై వారి యాదేశమున లక్ష్మణుని పరిత్యజించుట, సరయూ నదియందు లక్ష్మణుడు భౌతికదేహమును త్యజించుట, నారాయణ చతుర్థాంశరూపుడగు శేషుని (లక్ష్మణుని) రాకనుజూచి ఋషులు దేవతలు స్వాగత మిచ్చి పూజించుట. 525–538

నవమసర్గ

లక్ష్మణపరిత్యాగమున ఖిన్నుడైన రాముడు భరతునికి పట్టాభిషేకము చేయ నుద్యమించుట, ప్రజలు దుఃఖించుట, భరతుడు రాజ్యమును నిరాకరించుట, అయోధ్యారాజ్యమును కుశునకు, ఉత్తర కోసలమును లవునకు యిచ్చుట, శత్రుఘ్నునికొరకు దూతలను పంపుట, శత్రుఘ్నుడు దూతలవలన వృత్తాంతము తెలిసి సుబాహు యూపకేతు లగు తనపుత్రులను మధురా, విదిశలకు పట్టాభిషిక్తుల నొనర్చి అయోధ్యకు వచ్చుట, వానరులు, రాక్షసులు అయోధ్యకు వచ్చుట, సర్వులు రామునితో మహాప్రస్థానమునకు వత్తుమని ప్రార్థించుట, హనుమజ్జాంబవంతవిభీషణాదుల మహాప్రస్థాన నిషేధము, వశిష్ఠుడు మహాప్రస్థానిక కర్మ లారంభించుట, రామాదులు నగరమును వదలి మహాప్రయాణమును సాగించుట, సరయూతీరమునకు బ్రహ్మాదులు వచ్చి రాముని ప్రార్థించుట, రాముడు చతుర్భుజరూపము ధరించుట, లక్ష్మణుడు ఆదిశేషు డగుట, భరతశత్రుఘ్నులు చక్ర, శంఖ రూపముల నొందుట, సీత లక్ష్మియగుట, బ్రహ్మాదులు విష్ణురూపుడగు రాము ని స్తుతించుట, రామాజ్ఞచే బ్రహ్మ నరవానరరాక్ష సాదులకు సాంతానిక లోకములను ప్రసాదించుట, వానరరాక్ష సాదులు తమ తమ పూర్వరూపములగు దివ్యరూపములు ధరించుట, నరులు సరయూజలప్రవేశమున మానవ దేహములు త్యజించి దివ్యదేహములు ధరించుట, శ్రీరాముని అనుసరించిన నరవానరరాక్షసులేకాక సరీసృపాది సర్వజీవులు సరయూజలమున దేహత్యాగమొనర్చి సాంతానికలోకములకు బోవుట, అధ్యాత్మ రామాయణ పఠన, పాఠన, శ్రవణాదులవలన కలుగు ఫలనిరూపణ వర్ణనము--మంగళం మహత్.

539–558

రామాయణమందలి మహర్షుల జీవితవిశేషములతో
మనువుల సంక్షిప్త చరిత్ర కథారూపమున
అనుబంధముగా చేర్చబడినది.

యుద్ధకాండ

౫

యుద్ధకాండము

ప్రథమసర్గ

హనుమంతుడు లంకలో సీతాదేవిని దర్శించి రామునకు నివేదించినాడు. రామావతార ముఖ్యప్రయోజనమగు రావణాది వధను ప్రతిపాదించువాడై యుద్ధకాండమును ప్రారంభించు చున్నాడు.

శ్రీ మహా దేవ ఉవాచ :—

యథావదాభాషితం వాక్యం శ్రుత్వా రామో హనూమతః
ఉవాచానంతరం వాక్యం హర్షేణ మహతా వృతః॥

హనుమంతుడు తాను లంకలోచేసిన పనులన్నిటిని చెప్పగా విని శ్రీరామచంద్రుడు మహత్తరానంద మనస్కుడై ఇట్లనెను.

కార్యం కృతం హనుమతా దేవైరపి సుదుష్కరం
మనసాఽపి యదన్యేన స్మర్తుం శక్యం న భూతలే॥

హనుమంతుడు చేసిన సముద్రలంఘనము, లంకాదహనము మొదలగు కృత్యములు దేవతలకుకూడ అసాధ్యములయినవి. అంతే గాదు, ఇతరు డెవ్వడును మనస్సులోకూడ "నే నీపనులను చేయగలను" అని ఊహింప శక్యముగానివి.

శతయోజనవిస్తీర్ణం లంఘయే త్కః పయోనిధిమ్
లంకాం చ రాక్షసైర్గుప్తాం కో వా ధర్షయితుం క్షమ॥

నూరుయోజనముల వెడల్పు గల మహాభయంకరమగు సముద్రమును మరెవ్వడు లంఘించగలడు! ఇంద్రజిత్తు మొదలగు రాక్షసులచే రక్షింపబడు లంకానగరమును నాశనమొనర్చుటకు మరెవ్వడు సమర్థుడగును.

భృత్యకార్యం హనుమతా కృతం సర్వ మశేషతః
సుగ్రీవ స్యాభవ్యో లోకే న భూతో న భవిష్యతి॥

ఈతడు సుగ్రీవునికి భృత్యుడొనరించు కార్యమును నిశ్శేషముగ నొనరించినాడు. హనుమంతునివంటి భృత్యుడు లోకములో భూత కాలమున లేడు. భవిష్యత్తున ఉండబోడు. ఉత్తమభృత్యలక్షణమును వాల్మీకి ఈవిధముగా వివరించినాడు. "యోహి భృత్యో నియుక్తస్సన్ భర్త్రా కర్మణి దుష్కరే, కుర్యాత్త దనురూపంహి త మాహుః పురుషోత్తమమ్, యో భృత్యః పరమం కార్యం న కుర్యా న్నృపతేః ప్రియమ్ సర్వోద్యుక్త స్సమర్థో హి త మాహుః పురుషాధమమ్" దుష్కరకర్మ యందు నియుక్తుడై ప్రభువుకు అనుకూలముగ కార్యమును సాధించు వాడు పురుషోత్తముడు. సమర్థుడైయుండియు నియుక్తుడై రాజునకు ప్రియమొనరించనివాడు అధముడు.

అహం చ రఘువంశ శ్చ లక్ష్మణ శ్చ కపీశ్వరః
జానక్యా దర్శనే నాద్య రక్షి తాః స్మో హనూమతా॥

హనుమంతుడు జానకినిదర్శించి వచ్చులచే నేను, రఘువంశము, లక్ష్మణుడు, సుగ్రీవుడు రక్షితులమయితిమి. జానకి కన్పించకపోయిన తద్వియోగమున తాను మరణింతుననియు, లక్ష్మణుడు తన ననుసరించు ననియు యీవార్త విని భరతాదు లందరు నశించి రఘువంశమే లేకుండ పోవుననియు, ఇట్టి సర్వనాశమును జూచి సుగ్రీవుడుకూడ ప్రాణత్యాగ మొనర్చును గాన హనుమంతుడు ఇట్టిస్థితినుండి రక్షించినాడని రాముని భావము.

సర్వథా సుకృతం కార్యం జానక్యాః పరిమార్గణమ్
సముద్రం మనసా స్మృత్వా సీదతీవ మనో మమ॥

ఈవిధముగా పరిశీలించినచో సీతాన్వేషణమొనర్చి హనుమంతుడు ఉత్తమపుణ్యకార్య మొనర్చినాడు. సరే! ఇక ప్రకృతమునకు వత్తము. లంకానగరమునకు మనకు మధ్య శతయోజనవిస్తీర్ణమగు సముద్రమున్నది. దానిని తలచుకొనిన నాకు చింతకలుగుచున్నది.

కథం నక్రఝషాకీర్ణం సముద్రం శతయోజనమ్
లంఘయిత్వా రిపుం హన్యాం కథం ద్రక్ష్యామి జానకీం॥

తిమి తిమింగల నక్రాదులచే భీషణమగు సముద్రము నూరు

యోజనము లున్నది. దానిని లంఘించి రావణుని వధించు టెట్లు? జానకిని చూచు టెట్లుసంభవించును?

శ్రుత్వా తు రామవచనం సుగ్రీవః ప్రాహ రాఘవమ్
సముద్రం లంఘయిష్యామో మహానక్రఝషాకులమ్
లంకాం చ విధమిష్యామో హనిష్యామోఽద్యరావణమ్॥

రాముని సందేహాపూరితవచనములను విని సుగ్రీవు డిట్లు పలి కెను. రామా! చింతించకుము. మనము నిశ్చయముగా సముద్ర మును లఘింపగలము. మహోమకర, మత్స్యాకులమగు దానిని దాటి లంకానగరమును ముట్టడించి నాశన మొనర్చెదము. అత్వరలో రావ ణుని వధించగలము.

చింతాం త్యజ రఘుశ్రేష్ఠ చింతా కార్యవినాశినీ
ఏతాన్ పశ్య మహోసత్త్వాన్ శూరాన్ వానరపుంగవాన్
త్వత్ప్రియార్థం సముద్యుక్తాన్ ప్రవేష్టు మపి పావకమ్॥

రామా! మానసిక చింత ప్రారంభితకార్యమును సర్వథా నాశన మొనగ్చునది. అట్టిదానిని త్యజించుము. మహోసత్త్వులు, మహా ఈ వానరవృషభులను చూడుము. వీరందను నీకై నాకు ప్రియము నాచ రించుటకై అగ్నిలో దుముకమన్నను దుముకుటకు సిద్ధముగానున్నారు.

సముద్రతరణే బుద్ధిం కురుష్వ ప్రథమం తతః
దృష్ట్వా లంకాం దశగ్రీవం హత ఇత్యేవ మన్మహే॥

కనుక నీవు ఇప్పుడు ప్రథమమున సముద్రమును దాటుటకు ఉపాయమును ఆలోచించుము. ఆ తరువాత లంకానగరమును చూచె దముగాక! లంక మనకంటబడినవెంటనే దశగ్రీవుడు నిహతుడుగానే భావించును.

న హి పశ్యామ్యహం కంచిత్ త్రిషు లోకేషు రాఘవ
గృహీతధనుషో యస్తే తిష్ఠే దభిముఖో రణే॥

రామా! నేను లోకత్రయమందు జరిగిన అనేకయుద్ధములను చూచితిని. కాని నీవు ధనస్సును చేతధరించి నిలబడగా అభిముఖముగా రాగల ధనుర్ధారి ఒక్కడును కన్పడడు.

సర్వథా నో జయో రామ భవిష్యతి న సంశయః
నిమిత్తాని చ పశ్యామి తథా భూతాని సర్వశః॥

నాకనేకములగు శకునములు కన్పడుచున్నవి. అవి సర్వథా మన జయమునే సూచించుచున్నవి. కనుక నిస్సంశయముగా మనకు విజయము లభింపగలదు.

సుగ్రీవచనం శ్రుత్వా భక్తివీర్యసమన్వితమ్
అంగీకృత్యా బ్రవీ ద్రామో హనూమంతం పురఃస్థితమ్॥

ఇట్లు సుగ్రీవుడు భక్తిప్రపత్తులతోడను, ఆత్మశౌర్యద్యోతకముగాను ధైర్యమును చెప్పగా రాముడు హృష్టహృదయుడై అతని ఆలోచన నంగీకరించెను. తరువాత లంకానగరమును సర్వమును పరిశీలించి వచ్చిన హనుమంతుని పిలచి ఇట్లు ప్రశ్నించెను.

యేన కేన ప్రకారేణ లంఘయామో మహార్ణవమ్
లంకాస్వరూపం మే బ్రూహి దుస్సాధ్యం దేవదానవైః
జ్ఞాత్వా తస్య ప్రతీకారం కరిష్యామి కపీశ్వర॥

హనుమా! సంశయము లేదు. మనము ఏదో ఒక ఉపాయమున శతయోజనవిస్తీర్ణమయిన సముద్రమును దాటెదము. నీవు లంకా నగరమునంతను చూచివచ్చితివి గదా! దాని స్థితినంతను వివరింపుము. అది దేవదానవులకుకూడ దుస్సాధ్యమని విన్నాను. దాని స్వరూపమును అవగత మొనర్చుకొనినచో సాధించువిధానమును ఆలోచించెదను.

ఇక్కడ రాముడు యుద్ధతంత్రరీత్యా నగర నిర్మాణవిధానమును వివరింపుమని కోరినాడు. లంకలో ఎన్ని దుర్గము లున్నవి? అవి ఎట్లున్నవి? సైన్యసంఖ్య, ద్వారదుర్గక్రియ, గుప్తికర్మ, రాక్షసనివసనములు-వీటిస్థితిని వర్ణింపమనినాడు- కతి దుర్గాణి దుర్గాయాం లంకాయాం బ్రూహి తానిమే, జ్ఞాతు మిచ్ఛామి తత్సర్వం దర్శనాదివ వానర, బలస్య పరిమాణం చ ద్వారదుర్గ క్రియామపి, గుప్తికర్మ చ లంకాయా రక్షసాం నివసనానిచ. అని ద్వారదుర్గక్రియ అనగా అగ్ని, గోతులు, జలము మొదలగువాటిచే ప్రవేశద్వారములను దుర్గమముచేయుట. ప్రాకారము, పరిఘ మొదలగువాటి నిర్మాణము గుప్తికర్మ.

శ్రుత్వా రామస్య వచనం హనూమాన్ వినయాన్వితః
ఉవాచ ప్రాంజలి ర్దేవ యథాదృష్టం బ్రవీమి తే॥

శ్రీరాముని ప్రశ్నవినిచి హనుమంతుడు వినయభావముతో అంజలి ఘటించి "చూచినది చూచినట్లు చెప్పెద" నని చెప్పదొడగెను.

లంకా దివ్యపురీ దేవ త్రికూట శిఖరే స్థితా
స్వర్ణప్రాకారసహితా స్వర్ణాట్టాలకసంయుతా॥

దేవా ! లంకానగరము సామాన్యనగరములవంటిది గాదు. అది దివ్యనగరము. త్రికూటమను పర్వతముయొక్క శిఖరమందు నిర్మింప బడినది. దానిప్రాకారములు స్వర్ణవర్ణమయములు. ఆ ప్రాకారముల రక్షణకు నిర్మింపబడిన బురుజులుగూడ స్వర్ణప్రభాసమానములు.

పరిఖాభిః పరివృతా పూర్ణాభి ర్నిర్మలోదకైః
నానోపవనశోభాఢ్యా దివ్యవాపీభి రావృతా
గృహైర్వివిత్ర శోభాఢ్యైర్మణి స్తంభమయై శ్శుభైః॥

నగరప్రాకారమును చుట్టుకొని నలువైపుల నిర్మలజలపూరితము లగు కందకము లున్నవి. నగరమునం దంతటను సుందరములు, సుఖావహములు అగు ఉద్యానము లనేకము లున్నవి. ప్రజల ఉపయోగార్థమై స్వచ్ఛజలపూరితములగు నూతులు నగరమునం దంతటను ఉన్నవి. విచిత్ర శోభాయుతములు, మణిమయస్తంభ విరాజితములు, మంగళచిహ్న చిహ్నితములు అగు గృహములతో లంకానగరము నిండియున్నది.

పశ్చిమద్వార మాసాద్య గజవాహాః సహస్రశః
ఉత్తరే ద్వారి తిష్ఠంతి సాశ్వవాహాః సపత్తయః
తిష్ఠం త్యగ్నిబదసంఖ్యాకాః ప్రాచ్యా మపి తథైవచ॥
రక్షిణో రాక్షసా వీరా ద్వారం దక్షిణ మాశ్రితాః
మధ్యకక్ష్యే ఒప్యసంఖ్యాతా గజాశ్వరథపత్తయః॥

లంకానగర పశ్చిమద్వారమందు వేలకొలది గజారూఢులయిన సైనికులు రక్షకులుగా నుందురు. ఉత్తరద్వారదేశమున అశ్వారూఢులగు సైనికులు, కాల్బలముకూడ రక్షకులుగా నుందురు. తూర్పు

ద్వారము నూరుకోట్లమంది సైనికులు కాపుందురు. అట్లే దక్షిణ ద్దిగ్వారమునుకూడ నూరుకోట్లమంది రక్షించుదురు. ఇట్లు చతుర్ద్వారములనేగాక నగరమధ్యభాగమందును లెక్కకు మిక్కుటముగా గజములు, అశ్వములు, కాల్బలములు ఉన్నవి.

రక్షయంతి సదా లంకాం నానాస్త్ర కుశలాః ప్రభో
సంక్రమై ర్వివిధై ర్లంకా శతఘ్నిభి శ్చ సంయుతా॥

పైన చెప్పబడిన స్థలములందుండి నగరమును రక్షించువారందరు వివిధప్రకారములగు ఆయుధములను ఉపయోగించుటలో నిపుణులు. అనేక దేవాసుర సంగ్రామములందు ఆరితేరినవారు. అంతేగాక లంకా నగరములోనికి ప్రవేశించుటకు సేతువులు నిర్మితములై యున్నవి. కాని అవన్నియు మూసివేయబడియున్నవి. ప్రతివారు నగరములో ప్రవేశించలేరు. మార్గము లన్నియు శతఘ్నులు మొదలగు యంత్రములచే సురక్షితములై యున్నవి.

ఏవం స్థితేఽపి దేవేశ శృణు మే తత్ర చేష్టితమ్
దశాననబలౌఘస్య చతుర్థాంశో మయా హతః॥

ఇట్లు లంకానగరము సర్వవిధముల సురక్షితమై యున్నప్పటికిని నేను నిర్భయముగా ప్రవేశించి సంచరించితిని. అద్భుతములగు కృత్యములు నొనరించితిని. మొత్తము రావణుని బలసమూహములో నాల్గవ భాగము నాచే నశింపజేయబడినది.

వాల్మీకిరామాయణమున నాల్గవవంతు బలము నశింపజేసినట్లు చెప్పబడలేదు.

దగ్ధా లంకాపురీ స్వర్ణప్రాసాదో ధర్షితో మయా
శతఘ్న్యాః సంక్రమా శ్చైవ నాశితా మే రఘూత్తమ॥

అత్యంతసుందరమగు నగరమంతయు దగ్ధమొనర్పబడినది. స్వర్ణవినిర్మితరాజ ప్రాసాదమును పూర్తిగ కూలద్రోయబడినది. నగర రక్షకములగు శతఘ్నులు, నగరమార్గములగు సేతువులు నాశితములయినవి.

నీసేవకుడనగు నేనే ఇంత చేయగలిగినప్పుడు నీకు శత్రునగరము సులభసాధ్యమని చెప్పుచున్నాడు.

దేవ త్వద్దర్శనా దేవ లంకా భస్మీకృతా భవేత్
ప్రస్థానం కురు దేవేశ గచ్ఛామో లవణాంబుధేః
తీరం సహ మహావీరై ర్వానరౌఘైః సనుంతతః॥

దేవ! రావణపాలితమగు లంకానగరము ఒక్కసారి నీవు తీవ్రముగా చూచినతోడనే పూర్తిగ దగ్ధమై భస్మముకాగలదు. కనుక అతిశీఘ్రముగా రణయాత్రను ప్రారంభింపుము. ఈ మహావానర సైన్యములతోగూడి దక్షిణసముద్రతీరమును సర్వమును ఆక్రమించె దముగాక!

శ్రుత్వా హనుమంతో వాక్య మువాచ రఘునందనః
సుగ్రీవసైనికా సర్వా ప్రస్థానా యాభినోదయ॥

హనుమంతుని ఉత్సాహపూరితమగు వాక్యములను విని రఘు నందనుడు సుగ్రీవుని "సైనికుల నందరను విజయయాత్రకై బయలుదేర దీయుము" అని ఆజ్ఞాపించెను.

వెంటనే యుద్ధయాత్రను సల్పవలె నని దానికి కారణము చెప్పు చున్నాడు.

ఇదానీ మేవ విజయో ముహూర్తః పరివర్తతే
అస్మి న్ముహూర్తే గత్వా ఽహం లంకాం రాక్షససంకులాం॥
సుప్రాకారం సుదుర్ధర్షాం నాశయామి సరావణామ్
ఆనేష్యామి చ సీతాం మే దక్షిణాక్షి స్ఫుర త్యధః॥

ఇప్పుడు విజయము అను సార్థకనామము గల ముహూర్తము నడచుచున్నది. ఈ ముహూర్తమున బయలుదేరిన చో మనము నిశ్శం కగా లంకానగరము ప్రవేశించగలము. ప్రవేశించి భయంకర రాక్షస సంకులము, అభేద్యప్రాకారసంయుతము, శత్రువులకు అభేద్యము అగు లంగానగరమును, దాని పాలకుడగు రావణునితోగూడ నాశనమొనర్ప గలము. ఇట్లు శత్రుహనన మొనర్చి సీతను తిరిగి తెచ్చెదను. ముహూ

ర్తబలమును సమర్థించుచు నా దక్షిణనేత్రము అదరుచున్నదికూడను. కనుక వెంటడే బయలుదేరుము.

పైన చెప్పిన ముహూర్తము వాల్మీకమున వివరింపబడినది. "అస్మిన్ముహూర్తే సుగ్రీవ ప్రయాణ మభిరోచయే యుక్తో ముహూర్తో విజయః ప్రాప్తో మధ్యందినాకరః,...ఉత్తరాఫల్గునీ హ్యద్య శ్వస్తు హస్తేన యోక్ష్యతే అభిప్రయామి సుగ్రీవ సర్వానీకసమావృతాం" అని ఆసమయమున సూర్యుడు ఆకాశమధ్యమును అలంకరించినాడు. అనగా అభిజిన్ముహూర్తము. అంతేగాక చంద్రుడు ఉత్తరఫల్గునీనక్షత్రముతో కూడియున్నాడు. మరునాడయిన హస్తతో కూడగలడు. చంద్రుడు ఉత్తరఫల్గునితో కూడినవాడు రామునికి సాధనతార యగును. మరునాడు సిధనతార యగును. కనుక నేడే బయలుదేరెద మనుచున్నాడు. అయితే జ్యోతిశ్శాస్త్రము ననుసరించి అభిజిన్ముహూర్తము దక్షిణదిశకు ప్రయాణమునకు పనికిరాదు. దీనికి సమాధాన మిది. లంకానగరము కిష్కింధకు దక్షిణదిశగాగాక దక్షిణపూర్వదిశగా నున్నదని గోవింద రాజీయన్యాఖ్యానము.

ప్రయాతు వాహినీ సర్వా వానరాణాం తరస్వినాం
రక్షన్తు యూథపాః సేనా మగ్రే పృష్ఠే చ పార్శ్వయోః॥

మహాబలశాలురగు యోధులతో గూడిన వానరసైన్య మంతయు ఈ ముహూర్తమున బయలుదేరుగాక. సేనానాయకు లందరు సేనలయొక్క ముందు వెనుకభాగములను, పార్శ్వభాగములనుకూడ రక్షించెదరుగాక.

హనూమంత మథారుహ్య గచ్ఛామ్యగ్రే ఽంగదం తతః
ఆరుహ్య లక్ష్మణో యాతు సుగ్రీవ త్వం మయా సహ॥

నేను హనుమంతుని భుజస్కంధముల నధిరోహించి ముందు నడచెదను. నా వెనుక లక్ష్మణుడు అంగదుని పైనెక్కి రాగలడు. నీవు నాతో నీప్రక్కనే నడచెదవుగాక.

గయో గవాక్షో గవయో మైన్దో ద్వివిద ఏవ చ
నలో నీలః సుషేణ శ్చ జాంబవాం శ్చ తథా ఒపరే
సర్వే గచ్ఛన్తు సర్వత్ర సేనాపాః శత్రుఘాతినః॥

శత్రునాశకులను గయు గవయు గవాక్ష మైన్ద ద్వివిద నల నీల సుషేణ జాంబవదాదులు అన్నివైపులనుండి సేనలను రక్షించుచు మన వెంట వచ్చెదరుగాక.

ఇ త్యాజ్ఞాప్య హరీ ణ్ రామః ప్రతస్థే సహలక్ష్మణః
సుగ్రీవసహితో హృష్టాత్ సేనామధ్యగతో విభుః॥

రాము డిట్లు వానరుల నందరను ఆజ్ఞాపించి సలక్ష్మణసుగ్రీవుడై అత్యంత హృష్ట చిత్తముతో బయలెడలెను.

వారణేంద్రనిభా స్సర్వే హరయో కామరూపిణః
క్ష్వేలంతః పరిగర్జంతో జగ్మ స్తే దక్షిణాం దిశమ్॥

యుద్ధయాత్రాసముచితమైనగతులతో, కిలకిలారావములతో కామరూపులు, ఐరావతసమానసపరాక్రములు అగు వానరులందరు దక్షిణదిశగా ప్రయాణమొసర్చిరి.

భక్ష్యంతో యయు స్సర్వే ఫలాని చ మధూని చ
ప్రువన్తో రాఘువ స్యాగ్రే హనిష్యామో ఒద్య రావణమ్॥

వారు మార్గమధ్యమున అరణ్యములందలి కందమూలఫలములను భక్షించుచు, మధువులను పానమొనరించుచు రాఘవునితో మేమే రావణుని పూర్తిగ వధించినైచెదమని ప్రతిజ్ఞలు చేయుచు ప్రయాణ మొనర్చుచుండిరి.

ఏవం తే వానరశ్రేష్ఠా గచ్ఛ న్త్యతులవిక్రమాః
హరిభ్యా ముహ్యమానౌ తౌ శుశుభా తే రఘూత్తమా
నక్షత్రైశ్చ సేవితౌ యద్వ చ్చంద్రసూర్యా వి వాంబరే॥

ఈవిధముగా పానరపుంగవు లందరు ప్రయాణించుచుండగా మహాబలపరాక్రమసంపన్నులగు వారిమధ్య హనుమదంగదులచే వహిం

పబడు రామలక్ష్మణులు ఆకాశమున నక్షత్రసేవితులగు చంద్రసూర్యుల వలె మిక్కిలి ప్రకాశించిరి.

ఆవృత్య పృథివీం కృత్స్నాం జగామ మహతీ చమూః
ప్రస్ఫోటయంతః పుచ్ఛాగ్రా నుద్వహంత శ్చ పాదపా
శైలా నారోహయంత శ్చ జగ్ము ర్మారుతవేగతః॥

ఆ మహత్తరమగు వానరసైన్యము భూమినంతను ఆచ్ఛాదించి ప్రయాణించినది. అందలి వీరు లందరు శౌర్యావేశముచే భూమిని పాదములతో ఘట్టితమొనర్చుచు తోకచివరలందు పెద్ద వృక్షములను బంధించుకొని, పర్వతముల నెక్కి దిగుచు వాయువేగమున దక్షిణదిశకు వెళ్ళినది.

అసంఖ్యా తా శ్చ సర్వత్ర వానరాః పరిపూరితాః
హృష్టా స్తే జగ్ము రత్యర్థం రామేణ పరిపాలితాః॥

రామపరిపాలితులగు వానరులు అసంఖ్యాకముగా భూమిని ఆచ్ఛాదించి హృష్టచిత్తులై ముందుకు నడచిరి.

గతా చమూ ర్దివారాత్రం క్వచి న్నాసజ్జితక్షణమ్
కాననాని విచిత్రాణి పశ్యన్ మలయసహ్యయోః॥

ఇట్లా సైన్యము రాత్రింబగళ్ళు ప్రయాణముచేసి మార్గములో ఎక్కడను క్షణమైనా ఆగక విచిత్రములగు అరణ్యములను పరిశీలించుచు మలయసహ్యపర్వతములను సమీపించిరి.

తే సహ్యం సమతిక్రమ్య మలయం చ తథా గిరిమ్
అయయు శ్చానుపూర్వేణ సముద్రంభీమనిస్వనం।

వారు క్రమముగా సహ్యపర్వతమును, మలయపర్వతమును దాటి భయంకరనాదముతో ఆకాశమునంటుచున్న సముద్రమునుచేరిరి.

అవతీర్య హనూమంతం రామ స్సుగ్రీవసంయుతః
సలిలాభ్యాం మహాపాద్య రామో వచన మబ్రవీత్॥

అంతట రాముడు హనుమంతుని భుజాగ్రమునుండి క్రిందికి దిగి సుగ్రీవునితో గలిసి జలసమీపమునకు నడచి అక్కడ సుగ్రీవునితో ఇట్లు పలికెను.

ఆగతాస్మో వయం సర్వే సముద్రం మకరాలయం
ఇతో గన్తు మశక్యం నో నిరుపాయేన వానరాః
అత్ర సేనానివేశోఽస్తు మన్త్రయామో ఽస్య తారణే॥

మనము తిమి తిమింగల మకారాదులచే భయంకరమగు సముద్రమును చేరితిమి. కాని ఈ పైన ఏదో ఒక ఉపాయ మొనరించనిదే వానరులు ముందుకు సాగలేరు. కనుక సేనలను ఇక్కడ విడియించి ఏదైన యుపాయమును ఆలోచించెదముగాక.

శ్రుత్వా రామస్య వచనం సుగ్రీవః సాగరాంతికే
సేనాం న్యవేశయత్ క్షిప్రం రక్షి తాం కపికుంజరైః॥

శ్రీరాముని వచనములను విని సుగ్రీవుడు వెంటనే సేనలను విడియించుమని సేనానాయకులను ఆజ్ఞాపించెను. వారందరు సేనలను విడియింపజేసిరి.

తే పశ్యన్తో విషేదుస్తం సాగరం భీమదర్శనం
మహోన్నతతరంగాఢ్యం భీమనక్రభయంకరమ్॥

మహోన్నతములగు తరంగములచే ఆకాశము నంట ప్రయత్నించుచు, మహాకాయములగు తిమి తిమింగల నక్రాదులచే భయకారకమగుచు తమ హృదయములను కంపితమొనర్చు సాగరమును చూచి వారు ఖిన్నమనస్కులయిరి.

అగాధం గగనాకారం సాగరం వీక్ష్య దుఃఖితాః
తరిష్యామః కథం ఘోరం సాగరం వరుణాలయమ్॥

అగాధము, ఆకాశమువలె విస్తృతము అగు భయంకర సముద్రమును చూచి వానరులు ఈఘోరమయిన జలరాశిని ఎట్లు తరింపగలమా అని దుఃఖింపసాగిరి.

హన్తవ్యో ఽస్మాభి రద్యైవ రావణో రాక్షసాధమః
ఇతి చిన్తాకులాః సర్వే రామపార్శ్వే వ్యవస్థితాః॥

మనము అతిశీఘ్రముగా రాక్షసాధముడయిన రావణుని వధించ వలెను. మన కీ సముద్రము అడ్డువచ్చినది. అని చింతావ్యాకులిత చిత్తులయి వానరులందరు శ్రీరాముని పరివేష్టించియుండిరి.

రామః సీతా మనుస్మృత్య దుఃఖేన మహతా వృతః
వ్యలప జ్జానకీం సీతాం బహుధా కార్యమానుషః
అద్వితీయ శ్చిదాఽఽనన్దైకః పరమాత్మా సనాతనః॥

ఇట్లు వానరు లందరు దుఃఖనిభృతచిత్తులు కాగా శ్రీరాముడును తాను అద్వితీయము సనాతనము చిదానందైక పరమాత్మ అయియుండియు మానుషభావమున అనేకవిధముల జనకపుత్రియగు సీతను స్మృతికి తెచ్చుకొని విలపింపనారంభించెను.

రావణవధరూపమయిన కార్యసాధనకే రాముడు విలపించుచున్నాడు గాని వియోగవ్యథాభారముతో కాదని స్థిరీకరించుచున్నాడు.

యస్తు జానాతి రామస్య స్వరూపం తత్త్వతో జనః
తం న స్పృశతి దుఃఖాది కిము తాఽఽనంద మవ్యయమ్॥

రాముడు పరమాత్మస్వరూపుడని అనుభవపూర్వకముగా గ్రహించిన వ్యక్తిని సాంసారికములగు దుఃఖము లేవియు స్పృశింపవు. అట్టిచో స్వయముగ నాశనరహితుడు, ఆనందస్వరూపుడు అగు అతనిని వియోగ దుఃఖ మెట్లు బాధింపగలదు?

దుఃఖహర్ష భయక్రోధలోభమోహమదాదయః
అజ్ఞానలింగా న్యేతాని కుతః సన్తి చిదాత్మని॥

దుఃఖము, హర్షము, భయము, క్రోధము, లోభము, మోహము, మదము అనునవన్నియు అజ్ఞానచిహ్నములు. రాముడు చైతన్యస్వరూపుడగు పరమాత్మ. అజ్ఞానము జడము. జడవస్తుపు యొక్క గుణములు చైతన్య మయుడగు రాముని ఎట్లు స్పృశింపగలవు?

దేహాభిమానినో దుఃఖం న దేహస్య పరాత్మనః
సంప్రసాదే ద్వయాభావాత్ సుఖమాత్రం హి దృశ్యతే॥

దుఃఖమనునది దేహము నాశ్రయించుకొనియుండి దానిని అభిమానించు జీవునకుమాత్రమే కలుగును. వాస్తవమునకు దేహమునకును, పరమాత్మకును లేశమాత్రమును దుఃఖముండదు. జీవుని ఆవరించుకొని యుండిన అజ్ఞానము తొలగిపోగా వాస్తవమయిన జ్ఞాన ప్రకాశము కలుగును. ఆస్థితిలో రెండు అను భావమే ఉండదు. ఆ అద్వైతభావమున అఖండానందమే అనుభవితమగును.

బుద్ధ్యాద్యభావాత్ సంసుప్తౌ దుఃఖం తత్ర న దృశ్యతే
అతో దుఃఖాదికం సర్వం బుద్ధేరేవ న సంశయః॥

ఉదాహరణకు మనము నిద్రించునపుడు బుధ్యాదులు లేకపోవుటచే ఆసమయమున దుఃఖము అనునది కన్పించదు. అనగా దుఃఖాదికము బుద్ధికి సంభవించినదేగాని ఆత్మకు సంబంధించినదికాదని నిర్ణయము తేలుచున్నది.

రామః పరాత్మా పురుషః పురాణో
నిత్యోదితో నిత్యసుఖో నిరీహః
తథాఽపి మాయాగుణసంగతోఽసౌ
సుఖీవ దుఃఖీవ విభావ్యతే బుధైః॥

శ్రీరాముడు ప్రకృతికంటె పరమైన ఆత్మస్వరూపుడు. సృష్టికి పూర్వమందున్న పురాణపురుషుడు. నిత్యము నహాభ్యుదయము నందువాడు. అనగా నిత్యప్రకాశుడు అని భావము. నిత్యానందమయుడు. నిస్పృహుడు. ఇట్టి గుణములు గలవాడయినను లోకసంగ్రహమునకై మాయాగుణములతో కూడియున్నాడు. ఆకారణమునచే సుఖదుఃఖములకు వశుడయినట్లు ప్రపంచము చే భావింపబడుచున్నాడు. వాస్తవమునకు రాముడు సీతకై దుఃఖించలేదని మొత్తముమీద తాత్పర్యము.

ద్వితీయ సర్గ

హనుమంతుడు సర్వరాక్షస వీరులు చూచుచుండగా లంకా నగరమునంతను దగ్ధమొనర్చి వెళ్ళిన అనంతరము, లజ్జితుడయిన రావణుడు "రాముడు లవణోదధీతీరమున విడిసినా" డని విని ప్రవర్తించిన విధానము నీసర్గయందు ప్రతిపాదించుచున్నాడు.

శ్రీ మహాదేవ ఉవాచ :—

లంకాయాం రావణో దృష్ట్వా కృతం కార్యం హనూమతా
సైవతై రపి దుఃసాధ్యం హ్రీయం కించి దవాఙ్ముఖః
ఆహూయ మంత్రిణ స్సర్వా నిదం వచన మబ్రవీత్ ॥

ప్రపంచజేతయైన తనను అనాదరించి హనుమంతుడొనర్చిన దేవతలకు గూడ దుస్సాధ్యమయిన కార్యమును చూచి రావణుడు లజ్జావనతశిరస్కుడయ్యెను. అనంతరము రాముడు ససైన్యుడై సుగ్రీవ లక్ష్మణుడై సముద్రతీరమును చేరినట్లు విని మంత్రుల నందరను ఆహ్వానించి వారితో నిట్లనెను.

హనూమతా కృతం కర్మ భవద్భి ర్దృష్ట మేవ తత్
ప్రవిశ్య లంకాం దుర్ధర్షాం దృష్ట్వా సీతాం దురాసదాం
హత్వా చ రాక్షసా న్వీరా వక్షం మన్దోదరీ సుతమ్॥

వానరమాత్రుడయిన హనుమంతుడు దేవతలకు గూడ దుర్నిరీక్ష్యమయిన లంకలో ప్రవేశించినాడు. అత్యంతరహస్యము, అన్యులకు చొరరానిది అగు స్థలమునను సీతను చూచినాడు. అశోకవనమునంతను నాశనమొనర్చి జంబుమాలి మొదలగు రాక్షస సేనానులను, మన్దోదరీ సుతుడయిన అక్షకుమారుని గూడ వధించినాడు. అతడు చేసిన ఈ ఘోరకృత్యములన్నియు మీసమ్ముఖమునసే జరిగినవి.

దగ్ధ్వా లంకా మశేషేణ లంఘయిత్వా చ సాగరమ్
యుష్మా న్సర్వా నతిక్రమ్య స్వస్థో ఽగాత్ పున రేవ సః ॥

అనంతరమందు వానరుడుచేసినపని అతి భయంకరమయినది. మనసు చూచుచుండగనే లంకానగరమునంతను దగ్ధమొనరించినాడు. త్రిలోకజేతలయిన మిమ్ములనందరను కాదని, ఇంతపనిచేసియు ఏవిధమగు నష్టకష్టములకు లోనుగాక అతి స్వస్థశరీరముతో లంకాసముద్రమును దాటిపోయినాడు.

కిం కర్తవ్య మితో ఽస్మాభి ర్న్యాయం మన్త్రివిశారదాః
మంత్రయధ్వం ప్రయత్నేన యత్కృతం మే హితం భవేత్ ॥

మీరందరు రాజ్యతంత్రకోవిదులు. ఒక శత్రువు మనలను ఈ విధముగ పరాభవించి పోయినాడు. రాము డిప్పుడు సముద్రతీరమున నున్నాడు. ఇప్పుడు మనము చేయవలసిన కార్యక్రమమేమి? మీరందరు బాగుగా విచారించి నాకు హితమును బోధింపుడు.

రావణస్య వచ శ్శ్రుత్వా రాక్షసా స్తమథా బ్రువన్
దేవశంకా కుతో రామా త్తవ లోకజితో రణే ॥

రావణుని వచనములను విని రాక్షసు లిట్లుపల్కిరి. మహారాజా ! నీవు త్రిలోకములను జయించినవాడవు. అట్టి నీవు మానవమాత్రుడయిన రామునికి భయపడనక్కరలేదు.

ఇంద్ర స్తు బద్ధ్వా నిక్షిప్తః పుత్రేణ తవ పత్తనే
జిత్వా కుబేర మానీయ పుష్పకం భుజ్యతే త్వయా ॥

నీవు త్రిలోకజేతవుకాగా నీపుత్రుడు దేవేంద్రుని బంధించి లంకానగరమున బంధించిన మహావీరుడు. నీవు బాల్యమునుండి చేసిన అనేక వీరకర్మలున్నవి. యక్షరాజు ఉత్తరదిక్పాలకుడు అగు కుబేరుని పరాజితు నొనరించి అతని పుష్పకమును నీవు అనుభవించుచున్నావు.

యమో జితః కాలదండా ద్భయం నాభూ త్తవ ప్రభో
వరుణో హుంకృతేనైవ జితః సర్వోఽపి రాక్షసాః ॥

సమస్త ప్రాణులను వధించు దక్షిణదిక్పతి యముడు నీచే పరాభూతుడయినాడు. ఆతని కాలదండమునుండి నిన్ను భయపెట్టలేకపోయి

నది. ఇక పశ్చిమదిక్పాలియగు వరుణుడు, ప్రపంచమందలి సర్వరాక్ష సులు ఒక్క హుంకారముచేతనే నీకు వశులయిరి.

మయో మహాసురో భీత్యా కన్యాం దత్త్వా స్వయం తవ
త్వద్వశే వర్తతే ఽద్యాపి కిముతాన్యే మహాసురాః ॥

మయుడు అసురముఖ్యుడు. సర్వమాయానిధానుడు. అట్టివాడే భయభీతుడై తన పుత్రికయగు మండోదరిని నీకు సమర్పించి ఇప్పటికిని నీకు వశుడై సంచరించుచున్నాడు. సర్వాసుర మాయావిశారదుడగు మయుడే వశుడుకాగా ఇతరరాక్షసులనుగూర్చి వేరే చెప్పనక్కరలేదు. నివాతకవచకాలకేయాదులయిన సర్వదానవదైత్యసంఘము లన్నియు రావణవశములై ఉన్నవని వాల్మీకీయు ఉత్తరకాండమున రావణదిగ్విజయఘట్టమునందు వర్ణింపబడినది. చతుర్దశభువనములను జయించి నట్లుగూడ అచ్చట వర్ణితమయినది. ఇట్టి పరాక్రమశాలినగు నీకు మానవమాత్రుడయిన రామునిగూర్చి శంకింపవలసిన అవసరము లేదని మంత్రులు ధైర్యమును పురికొల్పుచున్నారు.

ఇక హనుమంతుడు నిర్భయముగా లంకను దగ్ధమొనర్చి నిరపాయుడై వెడలిపోవుటకు కారణమును చెప్పుచున్నారు.

హనుమద్దర్శనం యత్తు త దవజ్ఞాత కృతం చ నః
వానరో ఽయం కి మస్మాక మస్మిన్ పౌరుషదర్శనే
ఇత్యుపేక్షిత మస్మాభిః ధర్షణం తేన కిం భవేత్ ॥

ఇక హనుమంతుడు నిరపాయముగా వెడలిపోవుటకు కారణము. అతడు సామాన్యవానరుడుకదా అని మేమందరము లెక్క చేయలేదు. అజాగ్రత్తగా నుంటిమి. మామా పౌరుషమును కన్నరచ ఉపేక్షించి తిమి. అట్లుగాక మేము అతనిని ఎదుర్కొనినచో అల్పుడగు వాడు ఏమిచేయగలడు ?

వయం ప్రమత్తాః కిం తేన వంచితాః స్మో హనూమతా
జానీమో యది తం సర్వే కథం జీవన్ గమిష్యతి ॥

నాకేమి చేయగలడని మేమందరము ప్రమత్తులమై ఉంటిమి. కనుకనే అతనిచే వంచితులమయితిమి. అట్లుగాక ఆత డిట్లుచేయునని ఎఱిగియున్నట్లయిన సజీవుడై ఇక్కడనుండి ఎట్లు వెళ్ళగలడు ?

ఆజ్ఞాపయ జగత్కృత్స్నమవానర మమానుషమ్
కృత్వా యాస్యామహే సర్వే ప్రత్యేకం వా నియోజయ ॥

నీవు మమ్ములను ఆజ్ఞాపించినచే వెంటనే సృష్టిలోని సర్వవానరులను, సర్వమానవులను నాశనమొనర్చెదము. ఈ కార్యమునకై మమ్ములనందరను అజ్ఞాపించినను సరే, లేదా ఏ ఒక్కనికైన ఆజ్ఞ ఇచ్చినను సరే, నీ అభిమతానుసార మొనర్పుము.

కుంభకర్ణ స్తదా ప్రాహ రావణం రాక్షసేశ్వరమ్
ఆరబ్ధం య త్త్వయా కర్మ స్వాత్మనాశాయ కేవలమ్॥

ఇట్లు ప్రహస్తాదిమంత్రు లందరు రావణునకు ధైర్యమును పురిగొల్పి అతని సోదరుడయిన కుంభకర్ణు డిట్లనెను. రాక్షసేశ్వరా ! సీతను అపహరించి నీవు ప్రారంభించిన ఈపని నిన్ను నశింపజేయునదిగానున్నది.

న దృష్టో ఽసి తదా భాగ్యాత్ త్వం రామేణ మహాత్మనా
యది పశ్యతి రామ స్త్వాం జీవనా ఽఽదాయాసి రావణ॥

రావణా ! నీ అదృష్టమువలన సీతాపహరణకాలమందు నీవు రాముని దృష్టిసమ్మోహమున బడలేతివి. ఆకారణముననే బ్రతికిపోతివి. ఇకముందైనను సరే రాముడు నిన్ను చూచినచో సజీవుడవై మరల లేవు.

రామో న మానుషో దేవః సాక్షాన్నారాయణో ఽవ్యయః
సీతా భగవతీ లక్ష్మీ రామపత్నీ యశస్వినీ
రాక్షసానాం వినాశాయ త్వయా సీతా సుమధ్యమా॥

శ్రీరామచంద్రుని నీవు సామాన్యమానవునిగా తలచుచున్నావు. నీతలంపు సరియైనదిగాదు. అతడు దేవదేవుడు. నాశనరహితుడు అగు సాక్షాన్నారాయణుడు. ఇక అతనిభార్య సీతాదేవి సదా నారాయణు

నాశ్రయించియుండు మోహమాయాస్వరూపిణియైన లక్ష్మీదేవి. నీవు ఆమెను అపహరించికొనువచ్చుటనగా నీతోబాటు రాక్షససర్వనాశనము సంభవించినదన్నమాట.

విషపిండ మివాఽఽగీర్య మహామీనో యథాతథా
ఆసీతా జానకీ పశ్చా త్త్వయా కిం వా భవిష్యతి॥

నదిలో జీవించు ఒక గొప్పమీనముకూడ గేలము చివర నున్న మాంసఖండమును నోటితో బట్టుకొని విషపిండమును తినిన బానిపలె జీవితము నష్టము కొల్పోవుకో అన్నట్లు జానకీదేవిని దెచ్చి లంకయం దుంచితివి. ఇక రామకోపమునకు గురియైన నీతోబాటు ఈ సర్వ రాక్షసులు ఏమగుదురో తెలియదు.

యద్య ప్యనుచితం కర్మ త్వయా కృత మజానతా
సర్వం సమం కరిష్యామి స్వస్థచిత్తో భవ ప్రభో॥

సరే! ఇప్పు డేమన్నను లాభములేదు. అజ్ఞానముచే నీవు అనుచితము స్వనాశకారకము అగు కర్మ నాచరించితివి. అయినను నేను నాపరాక్రమముచే అంతను సమమొనర్చెదను. నీవు స్వస్థచిత్తుడవు కమ్ము. అనగా రామలక్ష్మణులను, సుగ్రీవాదులను నా పరాక్రమముచే వధించెద నని భావము. కుంభకర్ణుడు ఆరునెలలు నిద్రించి ఒక్కరోజున మేల్కొని ఆహారమును సేవించును. స్వయముగా మేల్కొనిన ఆరోజున అతడు అజేయుడని బ్రహ్మవరము. ఆవరమునందలి విశ్వాసముతోనే సర్వము చక్కబరచెదనని ధైర్యమును పలికినాడు.

కుంభకర్ణవచః శ్రుత్వా వాక్య మింద్రజి దబ్రవీత్
దేహి దేవ మమానుజ్ఞాం హత్వా రామం సలక్ష్మణం
సుగ్రీవం వానరాం శ్చైవ పున ర్యాస్యామి తేఽంతికమ్॥

కుంభకర్ణుని ధైర్యపూరితవచనములను విని రావణపుత్రు డగు ఇంద్రజిత్తు ఇట్లనెను. తండ్రీ! నా కనుజ్ఞ నిమ్ము. రామలక్ష్మణులను సుగ్రీవాది వానరులను క్షణములో వధించి తిరిగి నీసమీపమునకు వచ్చెదను అని. మేఘనాథుడు- మండోదరీరావణుల పుత్రుడు; తపో

మహిమచే అప్రమేయ శక్తిసామర్థ్యములను గడించినవాడు. రావణుడు ఇంద్రునిపై దండెత్తినపుడు ఇంద్రుడు అతనిని బంధించుటకు సిద్ధపడగా తన మహాపరాక్రమమును జూపి మేఘనాథుడు తండ్రిని విడిపించుటే గాక, ఇంద్రుని బంధించి లంకానగరమునకు గొనివచ్చినాడు. అంతట చతురాననుడు అతనికి ఇంద్రజిత్తను బిరుదునిచ్చి ఇంద్రుని విడిపించినాడు. రావణుని మించిన పరాక్రమశాలియగు అతడు ఈవిధముగ ధైర్యమును పుణికిపుచ్చుకొన్నాడు.

తత్రా ఽగస్తో భాగవత ప్రధానో
విభీషణో బుద్ధిమతాం వరిష్ఠః
శ్రీరామపాదద్వయ ఏకతానః
ప్రణామ్య దేవారి ముపోపవిష్టః॥

ఇట్లు రావణుడు మంత్రులనుగూడి శ్రీరాముని జయించుటకై మంత్రాలోచన మొనరించుచుండగా, ఈవిషయమును విని విభీషణుడు సభాభవనమునకువచ్చి దేవశత్రువగు అన్నకు నమస్కరించి ఆసనము మునందు ఉపవిష్టు డయ్యెను. విభీషణుడు రాక్షసుడయినను భగవద్భక్తులలో శ్రేష్ఠుడు. రాజనీతి దురంధరుడు. నిత్యము శ్రీరామచంద్రుని పాదకమలమును తన హృదయమందు నిలుపుకొని ఏకాగ్రతతో భజించువాడు.

విలోక్య కుంభ శ్రవణాది ద్రైత్యాన్
మత్త ప్రమత్తా నతివిస్మయేన
విలోక్య కామాతుర మప్రమత్తో
దశాననం ప్రాహ విశుద్ధబుద్ధిః ॥

అతడు సభాభవనమున బలదర్పగర్వితులు, రామాదులను సులభముగా జయించగలమనుభావమున స్వాసరభేదమును గణించనివారు అగు కుంభకర్ణేంద్రజిత్ప్రహస్తాది రాక్షసవీరులను పరిశీలించినాడు. అన్నయగు రావణుడు కామాతురుడైనవారి మాటలను అంగీకరించుచుండుటను చూచినాడు. ఇట్లు సభాభవసమునందలి వాతావరణమునంతను

పరిశీలించి నిర్మలచిత్తముతో విషయమునంతను అవగాహన మొనర్చు కొని రావణునితో ఇట్లు పలికినాడు.

న కుంభకర్ణేంద్రజితౌ చ రాజం
స్తథా మహాపార్శ్వమహోదరౌ తౌ
నికుంభ కుంభౌ చ తథా ఽతికాయః
స్థాతుం న శక్తా యుధి రాఘవస్య ॥

రాజా ! నీకు ధైర్యమును చెప్పు ఈ కుంభకర్ణుడుగాని, ఇంద్రజిత్తుగాని, మహాపార్శ్వమహోదరులుగాని, కుంభనికుంభులుగాని, అతికాయుడుగాని, మరెవ్వరుగాని యుద్ధభూమిలో రాఘవుని ఎదిర్చి నిలబడగలవారుగారు.

సీతాభిధానేన మహాగ్రహేణ
గ్రస్తో ఽసి రాజన్నచతే విమోక్షః
తామేవ సత్కృత్య మహాధనేన
దత్త్వా ఽభిరామాయ సుఖీభవ త్వం ॥

రాజా ! నీవు సీత అను గొప్పగ్రహముచే గ్రహించబడి పీడితుడవగుచున్నావు. ఇక నీకు మోక్షము లేదు. లోకములో సూర్యచంద్రులు రాహుకేతుగ్రస్తులై తిరిగి విమోక్షము నందుచున్నారు. కాని సీతాగ్రహగ్రస్తుడవయిన నీకు మోక్షము లేదని భావము. అయితే మోక్షమునంది సుఖించుటకు మార్గ మొకటున్నది. ఆమెను ఉపాయనసహితనుగా శ్రీరామున కర్పింపుము. నీకు సుఖము కలుగగలదు.

యావన్న రామస్య శితాశ్శిలీముఖా
లంకా మభివ్యాప్య శిరాంసి రక్షసాం
ఛిందంతి తావద్రఘునాయకస్య భో
స్తాం జానకీం త్వం ప్రతిదాతు మర్హసి ॥

శ్రీరాముడు సముద్రమునుదాటి లంకలో ప్రవేశించి తళతళ మెఱయు తీక్ష్ణశరములను వర్షించి, నగరమునందలి రాక్షసుల శిరములను ఛేదించకమునుపే జానకిని ఆయనకు సమర్పించుట యుక్తము.

యావన్న భోగాః కపయో మహాబలా
హరీంద్రతుల్యా నఖదంష్ట్రిమోధినః
లంకాం సమాక్రమ్య వినాశయన్తి తే
తావద్ధృతం దేహి రఘూత్తమాయ తాం॥

ఆకాశమార్గమున ఎగురుచు యుద్ధమొనరించు కపిపీనులందరు మహాబలశాలురు. సింహసదృశపరాక్రములు, నఖదంష్ట్రములు ఆయుధములుగా గలవారు. వారు లంకానగరమున ప్రవేశించి సర్వనాశన మొనరింపకమునుపే సీతాదేవిని రఘూత్తమునకు వెంటనే సమర్పింపుము.

జీవన్న రామేణ విమోక్ష్యసే త్వం
గుప్తం సురేంద్రైరపి శంకరేణ
న దేవరాజాంకగతో న మృత్యోః
పాతాలలోకానపి సంప్రవిష్టః॥

రాక్షసరాజా! సీతను సమర్పింపక దేవగణాధీశ్వరులను శరణు జొచ్చినను నీవు రాముని బారినుండి తప్పించుకపోజాలవు. శంకరుడు నీకభయమిచ్చి రక్షింపదలచినను దేవరాజు తన సోదరునివలె నిన్ను దాచినను లేదా మృత్యుదేవతయే నిన్ను స్వయముగా రక్షించుటకుద్యుక్తమయినను రామబాణములనుండి తప్పించుకొనలేవు. ఈలోకమును వదలి పాతాళమును ప్రవేశించినను సురక్షితుడవుగావు.

శుభం హితం పవిత్రంచ విభీషణవచః ఖలః
ప్రతిజగ్రాహ నైవాఽసౌ మ్రియమాణ ఇవౌషధం
కాలే న చోదితో దైత్యో విభీషణ మథాబ్రవీత్॥

రాక్షసకులమునంతకు మంగళకరము, ధర్మభావసమన్వితమగుటచే పవిత్రము అగు విభీషణవచనమును మరణాసన్నుడగు రోగి ఔషధమును సేవించుటకు ఇష్టపడనట్లు ఖలుడు కాలచోదితుడు అగు దైత్యేశ్వరుడు అంగీకరింపక ఇట్లనెను.

మద్దత్తభోజ్యైః పుష్టాంగో మత్సమీపే వసన్నపి
ప్రతీప మాచర త్యేష మమైవ హితకారిణః
మిత్రభావేన శత్రు ర్మే జాతో నాస్త్యత్ర సంశయః॥

వీడు నావద్ద నుండుచు, నే నిచ్చుభోగములచే పురిపుష్ట శరీరుడై అత్యంత హితమొనర్చిన నాకే అనిష్టమును ఆచరించుచున్నాడు. ఇట్టి వీడు నాకు మిత్రుడుగాడు. మిత్రుడుగా సంచరించు శత్రుడు. ఇందులో సందేహమేమియును లేదు.

అనార్యేణ కృతఘ్నేన సంగతి ర్మే న యుజ్యతే
వినాశ మభికాంక్షంతి జ్ఞాతీనాం జ్ఞాతయః సదా ॥

వీడు తనకంటె పెద్దనగు నన్ను అవమానించు అనార్యుడు. చేసినమేలును మరచు కృతఘ్నుడు. ఇట్టి మిత్రరూపుడగు శత్రువ్రతో కలిసియుండుట అయుక్తము. అసలు జ్ఞాతులు, జ్ఞాతులయొక్క నాశనమును గోరెదరు.

యో ఽన్యత్రైవం విధం బ్రూయా ద్వాక్య మేతం నిశాచరః
హన్మి తస్మిన్క్షణేనైవ ధిక్త్వాం రక్షః కులాధమమ ॥

ఇప్పుడు నీవుపలికిన వాక్యములనే మరియొక నిశాచరు డెవ్వడయినను పలికినట్లయిన క్షణములో ఆ రాక్షసకులాధముని సంహరించి యుందును. సోదరుడవగుటచే నిన్ను చంపకవిడుచుచున్నానని భావము.

రావణే నేవముక్తస్తు పరుషం స విభీషణః
ఉత్పపాత సభామధ్యా ద్గదాపాణి ర్మహాబలః ॥

రావణు డిట్లు పరుషముగా దూషించగా విభీషణుడు సహింపలేక సభామధ్యమునుండి గదాపాణియై ఆకాశమునకు ఎగిరెను.

చతుర్భి ర్మంత్రిభి స్సార్ధం గగనస్థో బ్రవీ ద్వచః
క్రోధేన మహతా ఽఽవిష్టో రావణం దశకంధరమ్॥

విభీషణు ననుసరించియే అతని మంత్రులు నలుగురును ఆకాశమున కెగిరిరి. అంతట ఆకాశస్థుడయిన విభీషణుడు మహత్తర క్రోధవశుడై దశకంధరుని గూర్చి ఇట్లు పలికెను.

మా వినాశ ముపైహీతి ప్రియవాదిన మేవ మాం
ధిక్కరోషి తథాఽపి త్వం జ్యేష్ఠో భ్రాతా పితు స్సమఃll

రాఘున్నసితో విరోధించి వినాశము నందకు మని ప్రియమగు హితము నుపదేశించగా కృతఘ్ను డని నిందాపూర్వకముగా ధిక్కరించితివి. అయినను నీవు నాకు అన్నవు. జ్యేష్ఠభ్రాత పిత్రసమానుడని పెద్దలు చెప్పుదురు. ఆకారణమున ప్రేమవశుడవై నీకు మరియు బోధింప గోరుచున్నాను.

కాలో రాఘవరూపేణ జాతో దశరథాలయే
కాలీ సీతాభిధానేన జాతా జనకనందినీll

నీహాహ్యమును చూచినచో నీపాటికాలుడే దశరథగృహమున రాఘవుడుగాను, మహాకాళి జనకగృహమున సీతగాను జన్మించినట్లు తోచుచున్నది. ఇక్కడ కాలు డనగా సర్వకాలనియమకుడగు పరాత్పరు డనియు, కాళి యనగా మహామాయ యనియు భావము.

తా వుభా వాగతా వత్ర భూమే ర్భారాపనుత్తయే
తేనైవ ప్రేరిత స్త్వన్తు న శృణోషి హితం మమll

సాక్షా ద్యోగమాయాపరాత్పరులు సీతారామరూపమున జన్మించి నీతోబాటు రాక్షసుల నందరను వధించి భూభారమును హరించుటకై ఇచ్చటకు వచ్చినట్లు నాకు తోచుచున్నది. ఆ మహాకాలునిచే ప్రేరేపింపబడియే నీవు నాహితవచనములను చెవినిబెట్టుట లేదు.

శ్రీరామ ప్రకృతేః సాక్షాత్ పరాస్తా త్సర్వదాస్థితః
బహి రన్త శ్చ భూతానాం సమం సర్వత్ర సంస్థితఃll

సత్త్వరజస్తమోగుణాత్మకమై జగద్రూపపరిణామమునందు ప్రకృతికంటె పరమందుండువాడును ఆద్యంతములు లేక సర్వదా ఉండువాడును, సర్వభూతములలోపలను, వెలుపలనుకూడ ఖాళీ లేకుండ వ్యాపించియుండువాడును అగు పరమాత్మయే శ్రీరాముడు.

నామరూపగుణాదులు కన్పట్టుచుండగా రాముని పరమాత్మ యని ఎట్లనెద వను శంకకు సమాధాన మిచ్చుచున్నాడు.

నామరూపాదిభేదేన తత్తన్మయ ఇవామలః
యథా నానాప్రకారేషు వృక్షే ప్యేకో మహానలః
తత్తద్ధాకృతిభేదేన భిద్యతే ఽజ్ఞానచక్షుషా
పంచకోశాదిభేదేన తత్తన్మయ ఇవా ఽఽబభౌ॥

పరమాత్మ పరిశుద్ధస్వరూపు డయినను నామము, రూపము, అంతఃకరణ మొదలగు భేదవస్తువులందు ప్రతిబింబించి లోకమునకు అట్లు వస్తుమయుడుగ కన్పించును. కాని నామరూపాదు లతని స్వరూపములు కావు. లోకములో అగ్ని వృక్ష లతాగుల్మాదులయందు వేరువేరుగ కన్పించినను విజ్ఞానికి అది ఒక్కటేగాని వేరువేరు స్వరూపములు గలది గాదు. అట్లే పంచకోశముల ననుసరించి పరమాత్మ వేరుగ కన్పించినను వాస్తవమునకు ఒక్కడే. జ్ఞాననేత్రమును సంపాదించిన వ్యక్తి పరమాత్మయొక్క ఏకత్వమును దర్శింపగలడు.

శరీరములో అన్నమయకోశము, ప్రాణమయకోశము, మనోమయకోశము, విజ్ఞానమయకోశము, ఆనందమయకోశము-అని అయిదు కోశము లున్నవి. ఈ అయిదుకోశములలో ఒక్కొక్కదానిని ఆత్మగా ప్రతిపాదించుచు శ్రుతు లున్నవి. ఈదేహము అన్నాదివికారమగుటచే అది అన్నమయకోశ మనబడును. "సవాఏషపురుషోఽన్నరసమయః" అను తైత్తిరీయశ్రుతి పరమాత్మ అన్నమయకోశస్వరూపు డని ప్రతిపాదించుచున్నది. కర్మేంద్రియములతోగూడిన ప్రాణాపానవ్యానోదాన సమానములను పంచప్రాణములు ప్రాణమయకోశ మనబడును. "అన్యోన్తరాత్మా ప్రాణమయః" అని తైత్తిరీయశ్రుతి ప్రాణమయకోశమును పరమాత్మగాప్రతిపాదించుచున్నది. కర్మేంద్రియసహితమయిన మనస్సు మనోమయకోశ మనబడును. "అన్యోఽన్తరాత్మా మనోమయః" అని తైత్తిరీయశ్రుతి దానిని ఆత్మగా ప్రతిపాదింపుచున్నది. బుద్ధి జ్ఞానేంద్రియములతోగూడి విజ్ఞానమయకోశ మగుచున్నది. "అన్యోఽంతరాత్మా విజ్ఞానమయః" అని తైత్తిరీయశ్రుతి దానిని ఆత్మగా ప్రతిపాదించుచున్నది. కోశమువలె ఆచ్ఛాదితమై ఆనందయుతమయినది ఆనందమయ

కోశము. "అన్యోఽన్తరాత్మా ఆనందమయః" అని తైత్తిరీయశ్రుతి. ఈశ్రుతుల నన్నిటిని ఖండించు ప్రబలశ్రుతి "ప్రత్యగస్థాలో ఽచిక్షుర ప్రాణో ఽమనోకర్తా చైతన్యం చిన్మాత్రం సత్" అనునది.

నీలపీతాదియోగేన నిర్మలస్ఫటికో యథా
సవేవ నిత్యముక్తోఽపి స్వమాయాగుణబింబితః॥

లోకములో పరిశుద్ధమగు స్ఫటికము నలుపు పసుపు మొదలగు రంగులతో కలిసి తనుకూడ నల్లగాను, పసుపుగాను కవ్వించుటను చూచుచున్నాము. అట్లే పరమాత్మయు తాను నిత్యముక్తుడయ్యును తనయొక్క మాయయొక్క సత్వరజస్తమములను త్రిగుణములందు ప్రతి బింబించుచున్నాడు,

కాలః ప్రధానం పురుషో వ్యక్తం చేతి చతుర్విధః
ప్రధానపురుషాభ్యాం స జగత్కృత్సృం సృజత్యజః
కాలరూపేణ కలవాం జగతః కురుతే ఽవ్యయః ॥

పరమాత్మ తమోగుణమందు ప్రతిబింబించి కాలుడుగాను, రజో గుణమందు ప్రతిబింబించి ప్రధానపురుషులుగాను, సత్త్వగుణమందు ప్రతి బింబించి వ్యక్తము లేక మహత్తుగాను మారును. అనగా కాలప్రధాన పురుషవ్యక్తములు పరమాత్మయొక్క నాల్గు మాయప్రతిబింబితరూపము లని భావము. ప్రధానపురుషులవలన సర్వజగత్సృష్టి జరుగును. కాలుడు జగత్సంహార మొనర్చును. వ్యక్తుడు జగత్పాలన మొనర్చును.

కాలరూపీ స భగవాన్ రామరూపేణ మాయయా
బ్రహ్మణా ప్రార్థితో దేవ స్త్వద్వధార్థ మిహాఽగతః॥

పై కాలరూపు డగు పరమాత్మయే బ్రహ్మప్రార్థితుడై స్వమా యతోగూడ రాముడుగా జన్మించినాడు. ఇస్పుడు నిన్ను వధించుటకే వచ్చుచున్నట్లు భావించుచున్నాను. సంహారకారకు డగు కాలస్వరూపు డగుటచే రాముడు నిన్ను వధించియే తీరు ననిభావము.

తదవ్యగ్రా కథం కుర్యాత్ సత్యసంకల్ప ఈశ్వరః
హనిష్యతి త్వాం రామస్తు సపుత్రబలవాహనమ్ ॥

పరమాత్మయగు రాముడు సత్యసంకల్పుడు. అతని సంకల్పము మరియొకవిధ మెట్లగును ? నిశ్చయముగా రాముడు నిన్ను సపుత్రబలముగా వధింపగలడు.

హన్యమానం న శక్నోమి ద్రష్టుం రామేణ రావణ
త్వాం రాక్షసకులం కృత్స్నం తతో గచ్ఛామి రాఘవమ్
మయి యాతే సుఖీ భూత్వా రమస్వ భవనే చిరమ్ ॥

రావణా ! శ్రీరాముడును మృత్యుగతుని చేయుచున్నప్పుడు నేను చూడలేను. నీవేగాక నీతోబాటు ఈ రాక్షసకులమంతయు వధింపబడగలదు. అట్టి దారుణసంఘటనను చూడలేను. కనుక నేను రాముని వద్దకే పోవుచున్నాను. నేను వెళ్ళినతరువాత నీవు జ్ఞాతివిరోధిశూన్యుడవై సుఖింపుము. ఈ విభీషణవాక్యములో ఒకపరమార్థము స్ఫురింపుచున్నది. క్రోధితుడగు రామునిచే రావణాదిరాక్షసకుల మంతయు నాశన మందగలదు. కనుక అట్లుగాకుండ రాక్షసకులమును కొంత వరకు కాపాడుటకే రాముని యొద్దకు పోయెద నని విభీషణునిభావము.

విభీషణో రావణవాక్యతాడి క్షణాత్
విసృజ్య సర్వం సపరిచ్ఛదం గృహం
జగామ రామస్య పదారవిందయోః
సేవాభికాంక్షీ పరిపూర్ణమానసః ॥

రావణుని నిందావాక్యములను భరింపజాలక విభీషణుడు క్షణములో సమస్తసంపదలను వదలి శ్రీరామపాదారవిందసేవాతత్పరుడై భక్తిపరిపూర్ణమనస్కుడో రామసమీపమున కేతెంచెను.

హనుమంతుడు లంకను దగ్ధ మొనర్చి వెళ్ళినతరువాత రావణ మంత్రాలోచన, విభీషణపరిత్యాగములు వాల్మీకిరామాయణమున యుద్ధకాండ ఆరవసర్గ మొదలు పదునారవసర్గవరకు విస్తృతముగా వర్ణితములయినవి. ఆభాగమును పరిశీలించినచో రావణాది రాక్షసుల అధర్మపరతయు, విభీషణుని సచ్ఛీలమును వ్యక్తము కాగలవు. ఆధుని కులు కొందరు విభీషణుని గృహచ్ఛిద్రకారకుడగుదోషిగా వేరొకాను

టలోని ఔచిత్యానౌచిత్యములు బోధపడగలవు. కనుక సంక్షేపముగా ఆభాగమును ఇంపు పొందుపరచుచున్నాము-

లంకానగరమునంతను ధ్వంస మొనర్చి హనుమంతుడు వెళ్ళిన తరువాత రావణుడు కించిల్లజ్జావనతముఖుడై మంత్రులనందరను చూచి హనుమంతుడికృత్యములను పేర్కొని అనంతరకర్తవ్యమును నిశ్చయింపు డని కోరినాడు. రాక్షసేంద్రుడు పృచ్ఛించిగనే మహాబలులగు రాక్షసులు శత్రుపక్షమునుగూర్చి తెలిసికొనకుండగనే బుద్ధిహీనులై రావణుని పూర్వవిజయముల నుగ్గడించి పరిఘశక్త్యాద్యాయుధములను ధరించిన మనమహాసైన్య ముండగా నీవు విషాదము నందుట తగ దని నాడు. భోగవతిని జయించితివి, కైలాసము నెత్తితివి, మయుని భయ పెట్టి అతనిదుహితను స్వీకరించితివి, వైశ్రవణుని జయించితివి, మృత్యు కాలపాశ, కింకరసహితమగు యమలోకమును జయించితివి, ఇంద్రుని జయించిన మేఘనాథుడు ఇక్కడే ఈమానుషవానరులను జయింపగలడు. ఇతడు అమరసైన్యము నంతను జయించి ఇంద్రుని బంధించి ఇంద్రజిత్తను నామధేయమును సంపాదించినవాడు. ఇట్టిపుత్రుడు గలనీవు భయపడ నక్కరలేదు. నీవు నిశ్చయముగా రాముని వధించగలవు అని ఉత్సాహపరచినాడు. సేనాపతి యగు ప్రహస్తుడు మేమందరము ప్రమత్తులమై ఉండగా హనుమంతుడిట్లు చేసినాడుగాని, నేనొక్కడనే వానరుల నందరను రామలక్ష్మణులతోసహా వధించెద ననినాడు. దుర్మఖుడు నేనే వానరుల నందరను వధించి వచ్చెద ననినాడు. కామరూప ధరులగు రాక్షసులను మానవరూపములతో రామునొద్దకు పంపించి "మేము భరతునిచే పంపబడినార" మని చెప్పించుదము. ఆపై అర్ధరాత్రమున మన మిక్కడనుండి వెళ్ళి వారిపై బడుదము. మానుషరూపధరులై ఉన్న రాక్షసులుకూడ వారిని సంహరించెదరు. ఇట్లు రామలక్ష్మణులు తప్పక విగతజీవులు కాగల రని వజ్రదంష్ట్రుడనువాడు ఉపాయమును చెప్పినాడు. కుంభకర్ణ సుతుడైన నికుంభుడును వజ్రహనుడనువాడును మేము ఒక్కొకళ్ళమే వారినందరను వధించెద మనినారు.

రాక్షసవీరులందరును వివిధాయుధధారులై మేను మేమనుచు రామాదులను వధించుటకు ముందుకు వచ్చినారు.

ఇట్లు మహోత్సాహమును ప్రదర్శించుచున్న వారినందరను వారించి విభీషణు డిట్లనినాడు. "అన్నా ! సామదానభేదములచే ప్రయోజనము సాధింపబడనప్పుడే దండోపాయము ప్రయోగింపబడును. శత్రువులు, ప్రమత్తులు, విరక్తులు, దైవోపహతులు అయినప్పుడే దండము ఉపయోగమునకు వచ్చును. కాని ఇప్పుడు రాముడు అప్రమత్తుడు, విజిగీషువు బలసహితుడు, రోషమును జయించినవాడు, అజేయుడుగాను ఉన్నాడు. అట్టివానిని నీవు ఏవిధముగా జయింపగోరుచున్నావు. సముద్రమును లంఘించి హనుమంతు డొక్కడుచేసిన దుష్కరకర్మనుగూర్చి ఆలోచింపుము. అపరిమేయబలశాలులయిన వానరసైన్యములను రాక్షసులు అవజ్ఞతో చూచుటతగదు. అంతేగాక నీవు అతనిభార్యను అపహరించి అపకార మొనర్చినావు. ఖరదూషణాదుల నతడు ప్రాణరక్షకై వధించినాడు. కనుక ధర్మము అతనిపక్షమున నున్నది.

"పరదారాభిమర్శనమనునది దుష్కృతికరము, అయుష్క్షీణకము, అర్థక్షయకరము అగు ఘోరపాపము. ఈ కలహమునకు కారణమయిన వైదేహి మనకు భయస్థానము. పరాక్రమశాలి, ధర్మానువర్తి అగు రామునితో వైరమును పెంచుట మనకు యుక్తముకాదు. కనుక మైథిలిని ఇచ్చివేయుట మంచిది. రాముడు తన వానరసైన్యముతో లంకానగరమును ముట్టడించకమునుపే రామునకు ఆయనపత్నిని ఇచ్చివేయుటయే మేలు. లేనిచో సర్వరాక్షససహితమగు నగరమంతయు నశించగలదు. నేను నీకు బంధువును. మిక్కిలి హితుడను. ఆకారణమున పథ్యమయివను హితమును బోధించుచున్నాను. రాముడు తన తీక్ష్ణశరజాలమును నీపైకి విడువకముందే మైథిలిని సమర్పింపుము."

రావణుడు విభీషణుని వచనములను విని సభను ముగించి స్వగృహమున కేగినాడు.

సీతాప్రదానమే మనకు యుక్తధర్మమను నిశ్చయమునకువచ్చిన విభీషణు ప్రాతఃకాలమునసే సర్గసంపత్సోభాఢ్యమయిన రావణమందిర మున కేగి మంత్రిమాత్రసహితుడైయున్న అన్నకు ప్రణామపూర్వకమగు రాజదర్శన సముదాచారము నంతను నడిపి రాజుదృష్టితో కన్నరిచిన ఆసనమును అధిష్టించినాడు. ఆసమయమున అక్కడ మంత్రులు తప్ప మరెవ్వరును లేరు. అప్పుడు విభీషణుడు అత్యంతహితకరములు, సహేతుకములు అగు వాక్యములను పలికినాడు. మొదట అతడు స్తుతివాక్యముల రావణుని ప్రసన్నునొనర్చినాడు. అనంతరము దేశకాలప్రయోజనసాధకములను తెలుసుకొనినవాడు స్వపరధర్మాధర్మములను అవగత మొనర్చుకొనినవాడు అగుటచే సీతను తెచ్చిననాటినుండి లంకానగరమున సంభవించుచున్న అనేక దుర్నిమిత్తములను వర్ణించి. ఈ అశుభమునుండి బయటపడుటకు ప్రాయశ్చిత్తము సీతాప్రదానమె అని నాడు." అశుభములను తానొక్కడే చూడలేదు. ఈ మంత్రులందరు ఎరుగుదురు. లంకానగరవాసులందరు ఎరుగుదురు. కాని రాజచిత్తా మహర్తులగుటచే వారెవ్వరు ఈవిషయములను నీకు తెలియజేయుట లేదు. నేను నీకు సోదరుడను. నీక్షేమమును గోరువాడను. కనుక నిర్భయముగా చెప్పుచున్నాను. నా వాక్యములందలి న్యాయాన్యాయ ములను పరిశీలించి నీవు కార్యనిశ్చయము చేయుము" అనినాడు.

కాని రావణుడు కావాక్యములు రుచించలేదు. "నాకు కించిత్తయినను భయములేదు. రాముడు సీతను తిరిగి పొందజాలడు. ఇంద్రాది దేవతలు తోడుగావచ్చినను అతడు నాయెదుట నిలబడలేడు" అని విభీషణుని పంపివేసినాడు.

తదుపరి రాముడు ససైన్యుడై సముద్రతీరమున జేరినవార్తను విని రావణుడు సభాభవనమున కేతించి లంకలోనున్న రాక్షసుల నందరను రప్పించి గొప్ప సభను జరిపినాడు. ఆసభలోనికి లంకలోని సర్వరాక్షసులు, రావణమిత్రులు, మంత్రులు మొదలగువా రందరు

వచ్చిరి. విభీషణుడుకూడ వచ్చి అన్నకు ప్రణమిల్లి ఉచితాసనముపై కూర్చొనినాడు. అంతట రావణుడు ఆసభలో ఇట్లు ఉపన్యసించినాడు-

"నే నింతవరకు చేసిన సమస్త కృత్యములను మీతో ఆలోచించియే చేసితిని. మీతో ఆలోచించి చేసిన పనులేమియు విఫలము కాలేదు. నక్షత్రములతో గూడి చంద్రుడు, దేవతలతో గూడి ఇంద్రుడు సంపదలనుభవించునట్లుగనే నేను మీతోగూడి సర్వసంపదలను అనుభవించుచున్నాను. కనుక ధర్మకామార్థములలో వితర్కరసమయము లంచు ప్రియాప్రియములు, సుఖదుఃఖములు, లాభాలాభములు, హితాహితములు మీరుకూడ వినవలసియున్నది. ఆరుమాసములనుండి నిద్రించుచున్న కుంభకర్ణునుకూడ ఈనాడు మేలొకొనినాడు. అతడు కూడ ఈసభలో ఉపస్థితుడై యున్నాడు. విషయమిది- రాక్షసులు సంచరించు దండకారణ్యమునుండి రాముని ప్రియమహిషి జానకి నాచే తేబడినది. కాని ఆమె నాశయ్యను అధిష్టించగోరుటలేదు. సీతాసదృశమైన స్త్రీ మూడులోకములందు మరియొకతె కన్పించదు..... ఆమెను చూడగనే నేను కామవశుడనయితిని. ఆమె భర్తను ప్రతీక్షించుటకు ఒక సంవత్సరకాలము యాచించినది. నేను అంగీకరించితిని. (ఇది రాక్షసులను విశ్వసింపజేయుటకై రావణుడు కల్పించిన వాక్యము. సీత రాముడు రాకపోయిన మరణించెద నన్నది. కాని, కాలమును యాచించిన శ్లోకార్ధమును చెప్పబడలేదు.) బహుభయంకరజలచరములతో గూడిన సముద్రమును రామలక్ష్మణులు ఎట్లు దాటగలరు? కాని నష్టమటకు వీలులేదు. ఒక్క వానరుడు చేసిపోయినది మీకు తెలియును గదా! కార్యగతి ఎలాఉండునో తెలియదు. మనుష్యులు నన్ను వధింతురను భయములేదు. మీతో గలిసి నేనా దేవాసురయుద్ధమందు విజయము నందితిని. రాజపుత్రులు వరుణాలయతీరమును చేరినారు. కాని సముద్రమును లంఘించుట కష్టసాధ్యము. సీతను తిరిగి యీయకుండ మనమెట్లు ఆచరించవలెనో మీరు మంత్రాలోచన మొనర్చుడు. ఒక

వేళ వానరులు సముద్రమును దాటినను జయము మనకే నిశ్చయము."

కామపరీతచిత్తుడగు నాతని ఉపన్యాసమునువిని కుంభకర్ణుడు క్రోధముతో ఇట్లనెను–

"మొదటనే బాగుగా యోచించి రామలక్ష్మణులను ఓర్చి సీతను తెచ్చినచో యమున యీమానపర్వమును భజించినట్లు నీకు వశమై చిత్తము నర్పించెడిది. ఇప్పుడు మాత్రోచేయు మంత్రాలోచన మును అనాడే చేసినచో సమంజసముగా నుండెడిది. న్యాయమార్గ మున రాజకార్యముల నొనరించురాజు నిశ్చితార్థబుద్ధి యగుటచే తరు వాత దుఃఖించడు. మొదట విచారించకుండా చేయబడు విపరీతము లగు కర్మలు అపాత్రుకు ఇచ్చిన హవిస్సువలె దూషితములగును. ముందు చేయవలసిన మంత్రాలోచనమును కార్యానంతరమునను, మంత్రాలోచనతరువాత చేయవలసిన కార్యమును ముందును చేసిన రాజుకు రాజనీతి తెలియదని చెప్పవలెను. రాజు నయానయములు తెలియక చపలచిత్తముతో కర్మల నారంభించినచో ఇతరశత్రువులు కూడ రంధ్రమునుచూచి కుమారకృతమయిన క్రౌంచపర్వతవివరమందు క్షుద్రములగు హంసలు ప్రవేశించుదురు. కనుక అట్టిరాజుయొక్క బలముకూడ వ్యర్థమగును. అయినను నీపీపనిని ప్రారంభించితివి గనుక నేను రాముడు నిన్ను వధించకుండ కాపాడెదను. శత్రువులను సంహరించి పనిని చక్కబరచెదను. పరిఘమాత్రసహాయుడనై ఇంద్రాదుల నయినను సరే వధించెదను. నీవు సుఖముగానుండుము. నేను రామ లక్ష్మణులను వధించెదను.

కుంభకర్ణు డిట్లు పలికినతరువాత క్రుద్ధుడయిన రావణునితో మహాపార్శ్వ డిట్లనెను–

"రాజా ! నానామృగవ్యాళసమాకులమయిన సుందరవనమును ప్రవేశించి అచ్చట లభించు మధువును పానించనివాడు బాలిశుడగును. నీవు సర్వేశ్వరుడవు. నీకు మరియొక ఈశ్వరు డెవడున్నాడు ? కనుక

శత్రువులను తృణీకరించి వైదేహిని బలవంతముగా రమింపుము. మక్కటవృత్తి నాశ్రయించి (కోడి బలాత్కారముగా దయితను వంచించి రమించును) సీతను వంచించి రమింపుము. లబ్ధకాముడ వైనతరువాత నీకు ఏదయిన శత్రుభయము సంభవించినచో దానిని సులభముగా ఎదుర్కొనవచ్చును. కుంభకర్ణేంద్రజిత్తులు మేము సహాయకులముగా వజ్రధారి అయిన ఇంద్రునికూడ జయించగలరు. విభీషణుడు చెప్పిన సామదానభేదములు అసమర్థులు అనుసరించే ఉపాయములు. సమర్థుడవగు నీకు దండమే శోభస్కరము."

మహాపార్శ్వుని వచనములకు అతని ప్రశంసించి రావణుడు తాను సీతను బలాత్కరించకపోవుటకు కారణమును తెలియజేసినాడు. "పుంజికస్థల అనువేశ్య చతురాననుని భవనమునకు పోవుచుండగా రావణుడు ఆమెను బలాత్కరించి అనుభవించి వస్త్రాపహరణను జేసినాడు. పుంజికస్థల దీనవేషముతో స్వయంభువునివద్దకు వెళ్ళినది. పితామహుడు రావణుని దుశ్చేష్టను ఎరిగి "ఈనాటినుండి రావణుడు బలవంతముగా స్త్రీని పొందినచో శిరము నూరువక్కలు కాగలద"ని శపించినాడు." ఈశాపభయమునచే నేను సీతను బలాత్కరించుటలేదని తెలిపినాడు. తరువాత రాముడు నన్ను ప్రబోధించి మృత్యువును కొనితెచ్చుకొనుచున్నాడని ఆక్షేపించినాడు. వైశ్రవణపాలితమయిన లంకానగరము నాచే జయింపబడినది రాము డొకలెక్కా అని ఉత్సహించినాడు.

నిశాచరేంద్రుని వచనమును, కుంభకర్ణుని గర్జనలను విని విభీషణుడు హితము, అర్థయుక్తము అగురీతిని ఇట్లు పలికెను—

"రాజా! సీతాదేవి నీపాలిటి సర్పము. ఆమెవక్షస్థలమే పడగ. ఆమెలోని చింతయే విషము. చిరునవ్వే తీక్ష్ణమగు దంష్ట్రచింతావశమున ముఖమున చేర్చిన హస్తాంగుళులే పంచశిరములు. ఆమె శరీరమే దీర్ఘమగు సర్పకాయము. దంష్ట్రాయుధులు, నఖాయుధులు, పర్వతశిఖరసమానదేహులు అగు వలీముఖులు లంకను ఆక్రమించక

ముందే ఈసర్పమును రామునకు సమర్పించుము. వజ్రసమానసార ములు, వాయుసమానవేగములు అగు రామప్రయుక్తబాణములు రాక్షసశిరములను బలిగొనకముందే దాశరథికి మైథిలిని సమర్పించుట యుక్తము. ప్రహస్తా ! అశనితుల్యవేగులగు రామచాపవిముక్తశరములు ప్రాణాంతకములై నీశరీరము ప్రవేశించనంతవరకే నిన్ను నీవు శ్లాఘించు కొందువు. యుద్ధమున రాముడెయెదుట కుంభకర్ణేంద్రజిత్తులుగాని, రాజు గాని, మహాపార్శ్వ మహోదరులుగాని, కుంభనికుంభులుగాని, అతికా యుడుగాని మరెవ్వరుగాని నిలబడలేరు. నీజీవనులను సూర్యుడుగాని, దేవతలుగాని, ఇంద్రుడుగాని, సాక్షాత్తు మృత్యువుగాని రాముని భారి నుండి రక్షింపలేరు. ఆకాశ పాతాళములలో ఎక్కడదాగినను నీకు మృత్యువు తప్పదు. (ఈవాక్యములను విభీషణుడు రాజగు రావణుని ప్రత్యక్షముగా అనగూడదు గాన ప్రహస్తునిపై ఆరోపించినాడు.)

విభీషణవచనములను విని ప్రహస్తుడు మేము దేవగంధర్వా సులలో ఎవరికిని భయపడలేదు. రాజపుత్రమాత్రుడయిన రామునకు ఎందుకు భయపడెద మనినాడు.

ప్రహస్తుని వచసములను విని రాజహితాభికాంక్షి, ధర్మార్థ కామములందు స్థిరబుద్ధిగలవాడు, మహాత్ముడు అగు విభీషణుడు ఇట్లనెను–

అధర్మపరుడు స్వర్గమును చేరలేనట్లుగానే నీవు, రాజు, మహో దరుడు, కుంభకర్ణుడు మొదలగువారు రామునిగూర్చిచేసిన కార్యనిర్ణ యము అసమర్థమయినది. కార్యధక్షుడగు రాముని వధించుట మనలో ఎవ్వరికిని శక్యముగాదు. ఇక్ష్వాకువంశప్రభుడయిన రాముడు ధర్మ ప్రధానుడు. అట్టివానివిషయమై దేవతలును కింకర్తవ్యతావిమూఢులు కాగలరు. రావణ కుంభకర్ణ నికుంభ కుంభత్రిశీర్షాతి బలేంద్రజిత్తులు గాని, దేవాంతక నరాంతక అతికాయ మహాకాయ అకంపనాదులు గాని రామునిఎదుట నిలబడలేరు. రావణుడు తీక్ష్ణప్రకృతిగలవాడు.

వ్యసనములందు చిక్కుకొనినవాడు. యుక్తాయుక్తములను సమీక్షించినవాడు. అతడు మిత్రరూపశత్రువులగు మిమ్ములను ఆశ్రయించినాడు. ఇప్పటికైనా మీరు అనంత సహస్రసభోగయుతమయిన మహాబలశాలియగు సర్వాముఖమున చిక్కుకొనిఉన్న ఈతని రక్షించుడు. శత్రువులు కేశాగ్రహణమొనర్చిన సమయమున కూడ పరిపూర్ణకాములగు మిత్రులందరు ఏకమై రాజును విడిపించుట యుక్తము. కనుక ఇంకను కాలాతీతము కాలేదు. ఇతడు సంహారరూపుడయిన రామసాగరునిచే ఆచ్ఛాదింపబడియున్నాడు. పాతాళముఖమున పడిన ఈతనిని మీరందరు ఏకమై ఉద్ధరించుట యుక్తమగును. రాజుకు ఎదుట సుహృజ్జనము చెప్పు పథ్యవాక్యము ఇదే. చక్కగా విచారించి "సీతను రాజపుత్రునకు సమర్పించుటయే మనకర్తవ్య" మని నామతము. మంత్రియగువాడు శత్రువుల బలమును, తనబలమును, స్వపరస్థానవ్యయవృద్ధులను విమర్శించి కార్యనిర్ణయము చేయవలెను.

బృహస్పతిసమాననయకోవిదుడగు విభీషణుని వాక్యములను జాగ్రతగా విని రాక్షసయోధశ్రేష్ఠుడగు ఇంద్రజిత్తు ఇట్లు పలికెను.

"పినతండ్రీ! భయపడినవానివలె అనర్థములగు వాక్యములను ప్రయోగించుచున్నావేమి, మనకులములో పుట్టినవాడెవ్వడును ఇట్లు పలుకడు. సత్యవీర్యపరాక్రమశౌర్యధైర్యతేజోద్భుష్టులతో పరిశోలించినచో ఈకులమున నీవొక్కడవే తప్పబుట్టినావు. వాస్తవమున కాకాజ పుత్రులు మనసైన్యమందలి ఎవడో ఒక ప్రాకృతరాక్షసునికూడ వధించుటకు శక్యులుగారు. కాని నీవుమాత్రము వృథాగా భయపెట్టుచున్నావు. త్రిలోకాధిపతి దేవేంద్రుడు అగు శుక్రుడుకూడ నాచే భూమికి గొని రాబడినాడు. సర్వదేవగణములును భయార్దితములై దశదిశలకు పరుగెత్తినవి. ఐరావతము వికృతముగా ఘీంకరించుచు భూపతితమయినది. నేను దాని దంతముల నూడబెరికితిని. దేవతలందరు భయభ్రాంతులైరి. నేను సర్వదేవతల దర్పమును హరించితిని. సర్వదానవ

వీరులను పరాజితుల నొనర్చితిని. అట్టి నాయెదుట ప్రాకృతమానవు లగు రామలక్ష్మణు లెట్లు నిలువగలరు !"

ఇంద్రసమానుడు, శత్రుదురాసదుడు, మహాప్రభావసంపన్నుడు అగు అతని వచనములను విని విభీషణు డిట్లనినాడు–

తాతా ! నీ వింకను బాలుడవు. నీబుద్ధి మంత్రనిర్ణయమునకు తగినంత పరిపక్వత నందలేదు. కనుక నీ విప్పుడు ఉపన్యసించినదంతయు ఆత్మవినాశకారకమయిన ప్రలాపమాత్రమే. నీవు రావణునకు పుత్రుడవే అయినను వివేకహీనుడవై రాముని వలన చాటోవు విపత్తును గూర్చి వినయు తండ్రినే అనుసరించుటచే పుత్రరూపమునన్న శత్రుడవయితివి. ఇట్టి మంత్రనిశ్చయ మొనర్చి నీవు వధ్యుడవగుదువు. అంతేగాదు బాలుడవు. దృష్టసాహసికుడవు అగు నిన్ను ఈస్థలమున ప్రవేశపెట్టిన వాడుకూడ వధ్యుడే అగును. నీవు కృత్యాకృత్య వివేకశూన్యుడవు, పండితమ్మన్యుడవు, అవినయశీలివి, తీక్ష్ణస్వభావుడవు, అవికసితబుద్ధి గల వాడవు, దుష్టాత్ముడవు, మూర్ఖుడవు, కనుకనే బాల్యచపలములగు వాక్యములను పల్కుచుంటివి. కానిచో బ్రహ్మాదండమువలె ప్రకాశించునవియు, అగ్నిజ్వాలాయుతములును, అంతకసదృశములును అగు రాముని బాణములను సహించెద ననును ? కనుక అనేకములగు కాను కలతోగూడ జానకిని సమర్పించుటచే శోకవిముక్తికి మార్గము.

విభీషణుని వాక్యములను విని రావణుడు క్రుద్ధుడై ఇట్లనినాడు– "శత్రువులతోగాని, సర్పములతోగాని కలిసిమెలిసి వసింపవచ్చును. కాని మిత్రునివలె ఉండి శత్రువుని సేవించువానితో కలిసి జీవింపలేము. సర్వలోకములందలి విజ్ఞాతుల శీలము ఒక్కటిగనే ఉండును. మనకు కష్టములు సంభవించినప్పుడు వాడు సంతుష్టులగుదురు. వాడు స్వజాతి శ్రేష్ఠులను, కార్యసాధనమును, విద్వాంసుని, ధర్మశీలుని, శూరుని సత్యము అవమానించెదరు. అవకాశము లభించినప్పుడు పరాభవించె

దరు. సుఖములలో నిత్యము కలిగియుందురు. కష్టములు ప్రాప్తించ గనే విద్రోహమొనర్తురు. జ్ఞాతులు ప్రచ్ఛన్నహృదయులగుటచే ఘోర భయకారకు లగుచుదురు. జ్ఞాతిభయమునుగూర్చి హస్తిగీతలో చెప్పబడిన శ్లోకములను వినుము.

ఒక పద్మవనములో పాశహస్తులై తనను బంధించవచ్చిన మను ష్యులను చూచి ఏనుగు ఇట్లనినది– అగ్నిగాని, ఇతరములగు ఆయుధ ములుగాని, పాశములుగాని నాకు భయమును కలుగజేయవు. స్వార్థ ప్రయుక్తములగు ఘోరజ్ఞాతిహస్తులే అత్యంతభయావహములు. అవియే మమ్ములను బంధించు ఉపాయమును చెప్పుతవి. అన్నిభయములలోను జ్ఞాతిభయము అత్యంతఘోరమయినది. గోవులయందు సంపద, బ్రాహ్మ ణులయందు దమము, స్త్రీలలో చాపల్యము, జ్ఞాతులయందు భయము తప్పక యుండును. నేను స్వర్గలోకసత్కృతుడ నగుటయు, జ్ఞాతులలో ఉన్న పదవియం దుండుటయు నీకు ఇష్టములేదు. తామరాకులపై నీటి బిందువులవలె అనార్యులతో సంబంధము స్నిగ్ధమయినదిగా నుండదు. తుమ్మెద ఎంతో ప్రీతితో పుష్పమందలి మధువును పానించును. గాని పుష్పముతో సంబంధము నుంచుకొనదు. అనార్యుల సౌహృదమును అట్టిదే. నీవుగాక మరియొక డెవడయిన ఇట్లు పలికి యుండినచో ఈ ముహూర్తమునే ఆ కులపాంసనుని మృత్యువశునిచేసి యుండెడివాడను.

రావణు డిట్లు పరుషముగా మాట్లాడినంతనే న్యాయవాదియగు విభీషణుడు తనమంత్రులగు నల్గురు రాక్షసులతో గలిసి గదాపాణియై ఆకాశమున కెగసెను. రావణుని దూషణ విని అతనికి తీవ్రక్రోధము కలిగినది. అతడు ఆకాశముననుండియే ఇట్లు వలికెను– "నీవు నా సోద రుడవు. కనుక నీయిష్టమువచ్చినట్లు నన్ను దూషింపవచ్చును. జ్యేష్ఠుడు తండ్రివంటివాడని ఎరుగుదును. కాని అతడు ధర్మమార్గమునలేదు. అంతేగాక ఇప్పుడు నన్ను జ్ఞాతివని నిందించినదంతయు అసృతము. నేను

ఈ అనృతమునుమాత్రము క్షమించను. నీహితమునుకోరు నేను నీతి యుక్తమగువాక్యమును పలికితిని. కాని కాలవశుడవగు నీవు వినుటలేదు. రాజా ! ప్రియవాదులగు పురుషులు అతి సులభముగా దొరకుదురు. కాని అప్రియమగు పథ్యవాక్యమును చెప్పువారు, వినువారుకూడ దొరకుటకూడ దుర్లభము. సర్వభూతములను బంధించు కాలపాశముచే బంధితుడవైన నిన్ను ఉపేక్షించలేను. ప్రవాహమునకు అడ్డుగానున్న ఇసుకకట్టలు నిలబడలేనట్లు రామభాణప్రవాహమున రాక్షసవీరులు నశించుసమయము మాసన్నమయినది. సామర్థ్యమున్నచో నిన్ను, లంకా నగరమును రక్షించుకొనుము. హితైషినగు నాఉపదేశము నీకు రుచించుటలేదు. కాలదష్టులు, గతాయుష్కులు అగు వారికి సుహృదుపదేశము రుచించకపోవుట సహజమే.

ఇట్లు చివరవరకు బోధించిన అనంతరము విభీషణుడు రావణుని పరిత్యజించి ధర్మతత్పురుషుడగు రాముని చూడ నేగినాడు. ఈ మొత్తమును పరికించి చూచినచో విభీషణునిలో మనకు అధర్మతిరస్కారమును, ధర్మతత్పరతయే కాన్పించును గాని మరి యేలోభమును కన్పట్టదు.

తృతీయ సర్గ

శ్రీ మహాదేవ ఉవాచ :—

విభీషణో మహాభాగై శ్చ తుర్భి ర్మంత్రిభిః సహా
ఆగత్య గగనే రామసమ్ముఖే సమవస్థితఃll

రావణునిచే నిందించబడిన విభీషణుడు ధర్మాత్ములగు తన నల్లుకు మంత్రుల సహితముగా ఆకాశమార్గమున సముద్రమును దాటి లక్ష్మణ సుగ్రీవాదులతో గలిసి ఉపవిష్టుడయిఉన్న స్థలమునకువచ్చి ఎదురుగా ఆకాశమున నిలబడెను.

ఈగ్రంథమున విభీషణుడు రావణుని పరిత్యజించి తిన్నగా రామునివద్దకు వచ్చినట్లు వర్ణితమయినది. కొన్ని వాల్మీకిరామాయణ ప్రతులందు అతడు ముందు తల్లిని దర్శించి వృత్తాంతము నంతను నివేదించి ఆమె ఆశీర్వాదమునుపొంది కైలాసమునకు వెళ్ళినట్లున్న అక్కడ శివునియొక్కయు వైశ్రవణునియొక్క అనుజ్ఞనుపొంది శ్రీరాముని దర్శింప నేగెననియు వర్ణింపబడినది. కొన్ని రామాయణములందు మాత్రము ఈవృత్తాంతము దొరుకుటలేదు.

ఉచ్చై రువా చ భోఽ స్వామిన్ రామ రాజీవలోచన
రావణ స్యానుజో ఽహం తే దారా హర్తు ర్విభీషణఃl
నామ్నా భ్రాత్రా నిరస్తో ఽహం త్వా మేవ శరణంగతఃll

విభీషణు డట్లు రామున కెదుట నిలబడి ఉచ్చైస్వరమున ఇట్లు పలికెను— "ఓ స్వామీ ! రామచంద్రా ! రాజీవలోచనా ! నేను నీ భార్యను హరించిన రావణుని సోదరుడను. నా సోదరుడగు రాక్షసేశ్వరుడు నను వెడలనడచినాడు. ఆకారణమున నేను నిన్నే శరణుజొచ్చుచున్నాను.

రావణుడు తనను పరిత్యజించుటకు కారణమును చెప్పుచున్నాడు.

హితముక్తం మయా దేవ తస్య చా విహితాత్మనఃl
సీతాం రామాయ వైదేహీం ప్రేషయేతి పునఃl పునఃll

సీతను అపహరించుట అధర్మము. కనుక విదేహరాజపుత్రిక యగు ఆమెను రామునకు సమర్పింపుమని అనేకవిధముల హితమును బోధించితిని. ఆత్మహితము నెరుగని అతనికి నామాటలు రుచించలేదు.

ఉక్తో ఽపి న శృణోత్యేష కాలపాశవశం గతః
హన్తుం మాం ఖడ్గమాదాయ ప్రాద్రవద్రాక్ష సాధమః॥

నాసోదరుడు కాలపాశమునకు వశుడైనాడు. ఆకారణమున నా హితబోధమును చెవిని బెట్టలేదు. సరికదా ఖడ్గహస్తుడై నన్ను వధించుట కుద్యుక్తుడైనాడు.

తతో ఽచిరేణ సచివైశ్చతుర్భిః సహితోభయాత్
త్వా మేవ భవమోక్షాయ ముముక్షు శరణం గతః ॥

రావణుడు నన్ను వధించునను భయమున అతిశీఘ్రముగా ఈ నల్గురుమంత్రుల సహితముగా భక్తులను సంసారసాగరమునుండి తరింపజేయు నీసన్నిధికివచ్చి, ముముక్షువునై నిన్ను శరణుపొందు చున్నాను. మోక్షేచ్ఛతోడనే నిన్ను శరణుజొచ్చుచున్నాను గాని రాజ్యాభిలాషముచేగాదని విభీషణుడు స్పష్టపరచినాడు.

విభీషణ వచః శ్రుత్వా సుగ్రీవో వాక్య మబ్రవీత్
విశ్వాసార్హో నతేరామ మాయాహీ రాక్షసాధమః ॥

శరణాగతుడయిన విభీషణుని వాక్యములనువిని సుగ్రీవు డిట్లు పలికెను–రామా ! రాక్షసులు మాయావిశారదులు. కనుక ఈతడును విశ్వాసార్హుడుగాడు.

సీతా హర్తు ర్విశేషేణ రావణ స్యానుజో బలీ
మంత్రిభిః సాయుధై రస్మాన్ వివశేని హనిష్యతి ॥

ఇతడు విశేషించి సీతను అపహరించిన రావణుని బలశాలియగు సోదరుడు. సాయుధులగు మంత్రులతో మనలోఉండి అవకాశమును చూచి మనలను వధింపగలడు. కనుక ఈతనిని నమ్మరాదు. మహత్తర మగు ఘోరయుద్ధము రాబోవుచుండగా రావణుడు ఇతనిని పరిత్యజించి

యుండడని సుగ్రీవుని ఉద్దేశ్యము. కనుకనే "రావణ స్యానుజో బలీ" అనినాడు.

త దాజ్ఞా పయమేదేవ వానరై ర్హన్యతా మయమ్
మమైవం భాతితేరామ బుద్ధ్యా కిం నిశ్చితం వద ॥

కనుక నాకు ఆజ్ఞనిచ్చినచో వానరభటులను నియోగించి వీరిని వధింపజేసెదను. ఇది నాబుద్ధికి తోచిననిర్ణయము. అయితే నీవు ఏమి నిశ్చయించితివో తెలియజేయుము.

శ్రుత్వా సుగ్రీవవచనం రామః సస్మిత మబ్రవీత్
య దీచ్ఛామి కపిశ్రేష్ఠ లోకా న్సర్వా న్స హేశ్వరా న్
నిమిషార్ధేన సంహన్యాం సృజామి నిమిషార్ధతః ॥

సుగ్రీవుని వచనములను విని శ్రీరాముడు స్మితసుందరవదనుడై ఇట్లు పలికెను–వానరరాజా ! విభీషణునిగూర్చి భయపడకుము. నేను కోరినచో ఈ సమస్తలోకములను వాటి వాటి ప్రభువులతోగూడ ఉపసంహరించి నిమిషార్ధములో తిరిగి సృజింపగలను. నేను స్వర్గలోకేశ్వరుడను గాన విభీషణుడు శత్రుభావమునసే వచ్చియున్నచో భయపడనక్కరలేదని రాముడు సుగ్రీవునికి సూచించినాడు.

అతో మయా ఽభయం దత్తం శీఘ్రమానయ రాక్షసమ్
సకృ దేవం ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదామ్యే తత్ వ్రతం మమ ॥

కనుక నేను విభీషణునకు అభయమిచ్చితిని. అతనిని అనుచరులతోగూడ శీఘ్రముగ నాసమీపమునకు తెండు. ఈ సర్వలోకములలో ఎవడయిననుసరే ఆర్తుడై "నేను నీవాడను" అనునో వానికి ముందు వెనుక లాలోచింపక వెంటనే అభయమిచ్చెదను. ఇది వట్టిమాటగాదు. నా దృఢవ్రతమిది.

రామస్య వచనం శ్రుత్వా సుగ్రీవో హృష్టమానసః
విభీషణ మథా ఽనాయ్య దర్శయామాస రాఘవం ॥

రాముడు సుదృఢవచనములనువిని సుగ్రీవుని మనస్సు ఆనంద సంభరితమయినది. అతడు నెంటనే విభీషణుని కెమకేగి స్వాగతమిచ్చి కొనివచ్చి రాముసిదృష్టి కెమట నిలబెట్టెను.

శరణాగతసంరక్షణము ఉత్తమోత్తమమగు మానవీయభావ ములలో ఒకటి. వాల్మీకీయరామాయణమున విభీషణ శరణాగతి మహా త్వపూర్ణఘట్టములలో ఒకటి. విభీషణునికి శరణునొసంగుటకు ముందు రాముడు సుగ్రీవాదులతో జేసిన మంత్రాలోచనముకూడ పఠింపవలసిన విషయము. రావణుని మంత్రులయు, రాముని మంత్రులయు పార తంత్ర్య స్వాతంత్ర్యములను తెలుసుకొనుటకు కూడ అది ఉపయోగించ గలదు. పాఠకులకు విభీషణశరణాగతికి సంబంధించిన ఈ రామాయణ భాగమును సంక్షేపముగా నిచ్చుచున్నాము.

విభీషణుడు తన నలుగురు అనుచరులతో గలిసి ఆకాశమార్గ మున శ్రీరాముని శిబిరమునకు వచ్చి సుగ్రీవాదులకు తనను పరిచయము చేసికొని సర్వలోకశరణ్యుడగు రాముసన్నిధికి కొనిపొమ్మని వేడు కొంటాడు. "నివేదయతమాం క్షిప్రం రాఘవాయ మహాత్మనే, సర్వ లోక శరణ్యాయ విభీషణ ముపస్థితం" అని. సుగ్రీవుడు మొదలగు వాన రులు అతని ప్రార్థననువిని, అతనిని అచ్చటనే వదలి శ్రీరామునకు అతని ఆగమనవార్తను నివేదించినారు. అంతట శ్రీరాముడు సుగ్రీవాదుల సమ్మతిని తెలియజేయుమంటాడు. అంతట సుగ్రీవు డిలా అన్నాడు– "ఇతడు శత్రుసైన్యమునుండి అకస్మాత్తుగా మనసైన్యమునకు వచ్చి వాడు. గుడ్లగూబ కాకులను నశింపజేయునట్లు అవకాశమును చూచు కొని మనసేనలను నశింపజేయవచ్చును. ఇతడు రాక్షసశ్రేష్ఠుడు. మాయావి. కాపురూపుడు. కావలసినచో అంతర్ధానముకూడ నంద గలడు. ఇతడు రావణుని గుప్తచరుడై మనవద్దకు వచ్చియుండును. కనుక ఇతనిని నమ్మరాదు. ఇతనిని రావణుడు పంపియుంటాడు. మొదట నమ్మకముగా ఉండి తరువాత మోసగించగలడు. కనుక మంత్రులతో గూడ ఇతనినిపట్టి చంపుటమేలు."

అంగదు డిలా అనినాడు :—

విభీషణుడు శత్రువువద్దనుండి వచ్చినాడు. కనుక అవశ్యము అతనిని శంకింపవలసినదే. అవకాశమును చూచుకొని అతడు ప్రహరించగలడు. హితమును-అహితమును వివేచనచేసి మనము బలమును సమకూర్చుకొనవలసి యున్నది. అధికముగా దోషములున్నవానిని పరిత్యజించి, అధికగుణయుక్తునే చేర్చుకొనవలసి యున్నది. విభీషణునిలో అధికదోషములు కన్పడినచో పరిత్యజించండి. అధికగుణములు కన్పడినచో స్వీకరించండి.

జాంబవంతు డిలా అనినాడు :—

"ఇతడు యుద్ధసమయంలో వచ్చినాడు. కనుక తప్పక ఇతడు రావణునిచేతనే పంపబడి ఉంటాడు."

మైందు డిలా అనినాడు :—

ఇతడు రావణుని తమ్ముడు. మధురమగు శబ్దములతో మొదట ఇతని వృత్తాంతమునంతను అడిగి తెలిసికొండము. సద్బుద్ధి అయినచో స్వీకరింపవచ్చును. అసద్బుద్ధి అయినచో యథోచితముగా ఆచరించవచ్చును.

హనుమంతు డిలా అనినాడు :—

"ప్రభూ ! మీరు సర్వశాస్త్రవిష్ణాతలు. సర్వశక్తిసంపన్నులు. సర్వసమర్థులు. మీకు కర్తవ్యమునుబోధించుపాటివాడనా. మీ బుద్ధిబలంముందు బృహస్పతియొక్క మంత్రాలోచనముకూడా తుచ్ఛమయినది. నేను నా స్వబుద్ధి ననుసరించిగాని, ఆస్త్రీచేగాని, పరామర్శించిగాని ఏమీ చెప్పను- మీ ఆజ్ఞానుకోధము ననుసరించి చెప్పెదను. విభీషణుని ఇచ్చటకే పిలిచి అతని వృత్తాంతమునంతను తెలుసుకొనుట మంచిది. ఒక్కసారిగా ఇక్కడకు పిలిపించుట మంచిదిగాదు. కాని దూతనుపంపి తెలుసుకొనుటయు మంచిదేగాదు. అతడు మిమ్ములను రావణునికంటె అధికపరాక్రమశాలిగాగాని, గుణవంతునిగాగాని భావించివచ్చినట్లయిన తెలివైనపని చేసినాడనే చెప్పవలెను. అట్టిచో

దూతనుపంపి అడిగినట్లయిన అతడు అనుమానించగలడు. దుఃఖమున్నా కలుగగలదు. అతని మాటలసరళిలో దుష్టభావమేమీ కన్పించుట లేదు. ముఖముకూడ ప్రసన్నముగానే ఉన్నది. అందుచే సందేహము కలుగుటలేదు. అతడు ధూర్తుడే అయినచో నిశ్శంకగా స్వస్థచిత్తతతో మీ ఎదుటకు రాలేడు. రావణుడు బలగర్వితుడని, పాపపరాయణుడని గ్రహించి అతనిని వధించి రాజ్యమును సంపాదించుటకై అతడిచ్చటకు వచ్చియుండును. కనుక మీరు విభీషణుని చేర్చుకొనుటే మంచిది."

హనుమంతు నీతిధర్మభక్తియుతమగు వచనములనువిని శ్రీరామ చంద్రు డిట్లనెను.

"మీరందరూ నాహితము నాకాంక్షించి విషయపరామర్శ చేసినారు. నా అభిప్రాయమును వినండి-

మిత్రభావేన సంప్రాప్తం నత్యజేయం కథంచన
దోషో యద్యపి తస్యస్యాత్ ఏతాన్మేతదగర్హితమ్ ॥

మిత్రభావమున నన్ను జేరినవారిని, అతనియందు దోషమున్నను సరే త్యజించను. అట్లు త్యజించుట సత్పురుష గర్హ్యమయిన కార్యము. స్వీకరించుట సత్పురుష సమ్మతము."

అంతట సుగ్రీవుడు మరల ఇట్లనినాడు :–

"రామా ! విభీషణుడు దుష్టుడయినను కావచ్చును. శిష్టుడయినను కావచ్చును. కాని అతడు రాక్షసుడు. ఆపదసమయములో అతడు తనసోదరునే త్యజించినా డనగా, ఇతరులను త్యజించడని నమ్మ కమేమిటి ? స్వజాతీయులు సమీపవర్తులు అగు కొంద రప్పుడప్పుడు శత్రులకు సహాయముచేయుట ఉన్నది. కాని అవకాశము దొరకినప్పుడు వారినికూడ ప్రహరింతురు. ఇతడుకూడ ఈకారణములవల్లనే వచ్చి యుంటాడు. అంతేగాక శాస్త్రములలో శత్రువుల బలమును దరికి రానీయుట దోషమని చెప్పబడినది. ఇందులో సహజంగా మోసమే జరుగుతుంది."

ఈవిధంగా సుగ్రీవుడు అనేక యుక్తులతో రాముని ఎదుట తన వ్యతిరేకతను ప్రదర్శించినాడు. రాముడు వాటిని సావధానముగ విని ప్రసన్నుడై అతని హితచింతనను ప్రశంసించి ఇట్లనినాడు-

"మిత్రమా ! ఈ రాక్షసుడు దుష్టుడుగానీ, శిష్టుడుగానీ, నన్నే మియు జేయలేడు. నేను తలచినచో పృథ్వినైనున్న యక్ష రాక్షస పిశాచ దానవ లందరును అంగుళ్యగ్రభాగముచే నాశనముచేయగలను. కపోతమువంటి చిన్నపక్షియే శరణాగతు డయిన శత్రువుకు తన శరీర మాంసము నర్పించి సత్కరించగా నేను ఇతని నెట్లు త్యజించగలను ?"

బద్ధాంజలి పుటం దీనం యాచంతం శరణాగతమ్
న హన్యా దనృశం స్వార్థమపి శత్రుం పంతప॥
ఆర్తో వా యది వా దృప్తః పరేషాం శరణం గతః
అరిః ప్రాణాన్ పరిత్యజ్య రక్షితవ్యః కృతాత్మనా॥
సచేత్ భయాద్వా మోహాద్వా కామాద్వామపి న రక్షతి
స్వయా శక్త్యా యథాన్యాయం తత్పాపం లోకగర్హితమ్॥
వినష్టః పశ్య తత్తస్య రక్షిణం శరణం గతః
ఆదాయ సుకృతం తస్య సర్వం గచ్ఛేద రక్షితః॥
ఏవం దోషో మహానత్ర ప్రపన్నా నామ రక్షణే
అస్వర్గ్యం చాయస్యం చ బలవీర్య వినాశనం॥

శత్రువు అంజలిఘటించి దీనముగా శరణును యాచించినప్పుడు అతడు క్రూరబుద్ధితో నున్నను సరే వధించరాదు. శత్రువు దుఃఖములోనున్నను సరే, గర్వితుడైనను సరే ఇతరు లభయముచే శరణన్నప్పుడు కృతాత్ముడయిన పురుషుడు తన ప్రాణముల లక్ష్యపెట్టక అతనిని రక్షించవలెను. ఎవడైనా భయమోహకామములకు వశుడై శరణన్న శత్రువును తనశక్తి ననుసరించి రక్షించకపోయినచో ప్రపంచములో అతడు నిందనీయుడగుచున్నాడు. రక్షార్థియై వచ్చినవాడు రక్షితుడు గాక రక్షకుని ఎదుటనే చంపబడినచో రక్షకకృతములగు పుణ్యము

లన్నియు చంపబడినవానిని జేయుతవి. అతడు స్వర్గమున కేగును. ఈ విధముగా శరణాగతుని రక్షింపకపోయినచో అత్యధికములగు దోషము లున్నవి. శరణాగతుని రక్షింపనివాడు స్వర్గభ్రష్టు, అపయశభాజనుడు, బలవీర్యహీనుడు అగును.

ఇట్లు ఉపన్యసించి రాముడు తన శరణాగతత్రాణ వ్రతమును ఉద్ఘాటించినాడు.

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ॥

అనంతరము రాముడు సుగ్రీవుని కిట్లాజ్ఞనిచ్చినాడు-

ఆనయైనం హరిశ్రేష్ఠ దత్తమస్యాభయం మయా
విభీషణోవా సుగ్రీవయదివా రావణ స్స్వయమ్॥

సుగ్రీవా ! అతడు విభీషణుడైనను సరే ! లేక రావణుడైనను సరే ! అతనికి నేను అభయమిచ్చితిని. కాన అతనిని నాయెదుటకు గొనిరమ్ము.

విభీషణస్తు సాష్టాంగం ప్రణిపత్య రఘూత్తమం
హర్షగద్గదయా వాచా భక్త్యా చ పరయాన్వితః॥

అంతట విభీషణుడు శ్రీరామచంద్రునకు సాష్టాంగదండప్రణామ మాచరించి ఇష్టప్రభు దర్శనసంజనితమయిన ఆనందోద్వేగములో కంఠము గద్గదముకాగా భక్తి పరవశుడయ్యెను.

రామం శ్యామం విశాలాక్షం ప్రసన్నముఖపంకజం
ధనుర్బాణ ధరం శాంతం లక్ష్మణేన సమన్వితం
కృతాంజలిపుటో భూత్వా స్తోతుం సముప చక్రమే॥

శ్యామవర్ణశరీరుడు, విశాలనేత్రుడు, ప్రసన్నమయిన ముఖ పద్మము గలవాడు, ధనుర్బాణములను ధరించియు శాంతుడుగా ఉన్న వాడు, లక్ష్మణసహితుడు అగు శ్రీరామున కెదుట నిలబడి అంజలిపట్టి విభీషణుడు ఇట్లు స్తుతింపసాగెను.

విభీషణ ఉవాచ :—

నమస్తే రామరాజేంద్ర నమః సీతా మనోహర
నమస్తే చండకోదండ నమస్తే భక్తవత్సల॥

రామా ! సర్వజగత్ప్రభూ ! నమస్కారము. సీతామనోహరా ! నమస్కారము. ప్రచండకోదండధారీ ! నమస్కారము. భక్తులను వాత్సల్యముతో పరిపాలించు రామా ! నమస్కారము.

నమో ఽనంతాయ శాంతాయ రామాయామిత తేజసే
సుగ్రీవ మిత్రాయ చ తే రఘూణాం పతయే నమః॥

అపరిచ్ఛిన్నుడు, రాగోద్వేషాదిరహితుడు, యోగిహృత్కుహర మందు నివసించువాడు, అనంతబలవీర్య సంపన్నుడు, ప్రతాపశాలి యగు సుగ్రీవునికి మిత్రుడు సర్వరఘువంశపాలకుడు అగు శ్రీరామ చంద్రునకు ప్రణామములు.

జగ దుత్పత్తి నాశానాం కారణాయ మహాత్మనే
త్రైలోక్యగురవే ఽనాది గృహస్థాయ నమో నమః॥

సత్త్వరజస్తమోగుణముల నాశ్రయించి త్రిమూర్తిరూపధరుడవై సృష్టిస్థితిలయముల నాచరించు కారణస్వరూపుడ వీవు. త్రిలోకము లకు స్వస్వకర్మముల నుపదేశించు గురుడవు నీవు. మాయయే పత్నిగా గల సర్వప్రాచీనగృహస్థుడవీవు. మాయ యను పత్నితో గలసి జగ దుత్పత్తి స్థితిలయములకు నీవు కారణుడవైతివని భావము.

త్వమా దిర్జగతాం రామ త్వమేవ స్థితి కారణం
త్వమన్తే నిధనస్థానం స్వేచ్ఛా చారస్త్వ మేవహి॥

రామా ! సర్వబ్రహ్మాండసృష్టికి పూర్వమందుండి జగన్నిర్మాణ మొనరించువాడవు నీవే. సృష్టికాలమున వాటిని పోషించు విష్ణుస్వరూ పుడవు నీవే. సృష్ట్యంతమున దానిని నశింపజేయు రుద్రుడవు నీవే. నీ వొక్కడవే స్వతంత్రుడవు కన్పించుచున్నావు. అనగా "పరమాత్మ వగు నీవే మూర్తిత్రయాత్మకుడవుగా సృష్టిస్థితిలయముల నొనరించు చున్నావు" అని భావము. అయితే దేవమానవాదులవలె స్వకృత

శుభాశుభకర్మఫలప్రేరితుడవై గాక స్వతంత్రముగానే సృష్ట్యాదికము నొనరించుచున్నావు. (ఈవిషయమును సూచించుటకే "స్వేచ్ఛాచారః" అని ప్రయోగింపబడినది.)

చరాచరాణాం భూతానాం బహిరన్త శ్చ రాఘవ
వ్యాప్యవ్యాపకరూపేణ భవాన్ భాతి జగన్మయః॥

రాఘవా ! నీవు భూతములను సృష్టించి ఊరకొనుటలేదు. చరాచరరూపములయిన సర్వభూతముల వెలుపలను, లోపలనుకూడ వ్యాప్యవ్యాపకరూపమున ప్రకాశించుచున్నావు. కనుకనే విజ్ఞులు నిన్ను జగన్మయునిగా ప్రతిపాదించినారు. వస్తువుయొక్క అంతర్భాగమున వ్యాప్యరూపమునను, బహిర్భాగమున వ్యాపకరూపమునను పరమాత్మయే ఉండును. కనుకనే వ్యాప్యవ్యాపకరూపుడని చెప్పబడినది.

త్వన్మాయ యాపహృతజ్ఞానా నష్టాత్మానో విచేతసః
గతాగతం ప్రపద్యన్తే పాపపుణ్యవశాత్సదా॥

కాని లోకస్థులు భవదీయమగు మాయచే హరింపబడిన జ్ఞానము గలవారై ఆత్మపదార్థమును తెలిసికొనలేక వివ్వాలు లగుచున్నారు. ఆకారణమునసే పాపపుణ్యరూపములయిన కర్మల నాచరించి తత్ఫలమును అనుభవించుటకై జన్మరూపమున యీ ప్రపంచమునందు ఉద్భవించి మరణరూపమున తిరోహితులగుచున్నారు.

తావ త్సత్యం జగద్భాతి శుక్తి కారజతం యథా
యావన్న జ్ఞాస్యసే జ్ఞాన చేతసానాన్య గామినా॥

ముత్యపుచిప్పయొక్క స్వరూపము నెఱుగనివాడు దానినిచూచి వెండి యని భ్రమించును. లేదా దానిని దూరమునుండి చూచి వెండిగా భావించును. మరియొకడు అది ముత్యపుచిప్ప యని తెలియజేసినప్పుడు లేదా తాను దగ్గరకు వెళ్ళి చూచినప్పుడు అతని భ్రమ తొలిగి యథార్థ జ్ఞానము కలుగును. అట్లే జ్ఞానపరిశుద్ధమయిన నిశ్చలమయిన మనస్సుచే ఆత్మవిజ్ఞానమును అవగతమొనర్చుకొనినవాడు అజ్ఞానమును దూర

ముగా పోద్రోలి జగత్తును మిథ్య యని తెలుసుకొనును. అజ్ఞాన మున్నంతవరకే జగత్తు సత్యముగా భాసించు నని భావము.

త్వ దజ్ఞా వాత్సదా యుక్తాః పుత్రదారగృహాదిషు
రమన్తే విషయా సర్వానంతే దుఃఖ ప్రదా విభో॥

ఆత్మస్వరూపుడవగు నిను తెలిసికొనకపోవుటచే జగత్తు సత్య ముగ భాసించుటయేగాక అనర్థకారకమయిన విషయాసక్తుడ పెరు గును. జీవులు పుత్రులు, భార్య, గృహము, ధనము మొదలగు లౌకిక వస్తువులయందు ఆసక్తిని వృద్ధిచేసికొని నిత్యము విషయసుఖలోలు లై యుందురు. విషయసుఖములు తాత్కాలికముగ ఆనందమునిచ్చి తరు వాత దుఃఖఫలప్రదాయకములుగా నుండును. కాని జీవుడు విషయ కాల్యమును వదలి జ్ఞానమార్గమును పట్టుటకు ప్రయత్నింపడు. దీనికం కంతకు నీమాయయే కారణము.

త్వ మిన్ద్రో ఽగ్ని ర్యమో రక్షో వరుణ శ్చ తథా ఽనిలః
కుబేర శ్చ తథా రుద్ర స్త్వ మేవ పురుషో త్తమః ॥

బలాధిష్ఠానపురుషుడగు ఇంద్రుడవు నీవే. తేజోఽధిష్ఠాన దేవత యగు అగ్నివినీవే. సర్వజీవసంహారకుడగు యముడవునీవు. నైఋత దిక్పాలకుడగు రాక్షసుడవునీవు. పశ్చిమ దిక్పాలకుడై జలములందుండు వరుణుడవునీవు. వాయుదేవుడవు నీవు. ధనాధీశ్వరుడగు కుబేరుడవునీవు. ఈశాన్యదిక్పాలకుడగు రుద్రుడవు నీవు. ఈ అష్టదిక్పాలకులనుకూడ శాసించు పురుషోత్తముడవుకూడ నీవు.

ఇంద్రాదులు సర్వజగత్సేవ్యులు. జగత్పాలకులు కూడాను. వారి స్వరూపన నీవే ఉన్నావనుటచే రాముడు సర్వజిత్సేవ్యుడని స్పష్ట మయినది.

త్వ మణో ర ప్యణీయాం శ్చ స్థూలాత్ స్థూలతరః ప్రభో
త్వం పితా సర్వలోకానాం మాతా ధాతా త్వ మేవ హి ॥

నీవు అణువుకంటె సూక్ష్ముడవు. స్థూలముకంటె స్థూలుడవవు. అనగా సృష్టిలో సూక్ష్మాతిసూక్ష్మమైనవాడవు. స్థూలాతిస్థూలమయిన

వాడవు నీవే అని భావము. "య ఏష అణిమా" అని ఛాందోగ్యోపని షత్తున్న, 'అణోరణీయాన్' 'మహతోమహీయాన్' అని కఠోపనిష త్తున్న పరమాత్మయొక్క- సూక్ష్మత్వ స్థూలత్వములను ప్రతిపాదించు చున్నవి. చైతన్యము సర్వజగత్తనందు నిండియుండు వస్తువు. దానికి స్వరూపమనునది లేదు. ఆ చైతన్యస్వరూపుడవు నీవే అని భావము. సృష్టిరూపమున పరిణమించు మాయకూడ అతనియందే ఉండుటచేతను ఆ సృష్టికి అతడు ఉపాదానకారణుడగుటచేతను మహత్తుకంటె మహత్తముడు. నీవు సర్వజగత్తులకు తల్లివి, తండ్రివి కూడను. జీవకృతము లగు కర్మలకు ఫలమునిచ్చు ధాతవుకూడ నీవే.

ఆదిమధ్యాంతరహితః పరిపూర్ణో ఽచ్యుతో ఽవ్యయః
త్వం పాణిపాదరహితః చక్షుశ్రోత్రవివర్జితః ॥

నీవు నిత్యుడవగుటచే జన్మస్థితి అంతము అనుగుణములు లేని వాడవు. అనగా పరమాత్మసృష్టికి పూర్వము సృష్టికాలమున సృష్టి లయానంతరమునకూడ ఉండువాడని భావము. నిత్యము వృద్ధిక్షయ ములులేని పరిపూర్ణుడవు. క్షరత్వము (తగ్గుదల) లేనివాడవగుటచే నీవు అచ్యుతుడవనబడుచున్నావు. నామరూపాదులు లేనివాడవగుటచే సామాన్యప్రాణులవలె హస్త, పాదములుగాని, చక్షు శ్రోత్రాదులు గాని లేనివాడవు. అనగా ఈ అవయవము లేవియు లేకపోయినను వీటి ధర్మములకు సాక్షిగా ఉండువాడవని భావము.

శ్రోతా ద్రష్టా గ్రహీతా చ జవన స్త్వం ఖరాంతకః
కోశేభ్యో వ్యతిరిక్త స్త్వం నిర్గుణో నిరపాశ్రయః ॥

లోకములో చెవులులేనివాడు వినలేడు. నేత్రములులేనివాడు చూడలేడు. హస్తములులేనివాడు గ్రహించలేడు. పాదములు లేని వాడు నడువలేడు. కాని ఇవేవియు లేకనే నీవు ఈకృత్యములనన్ని టిని చేయుదువు. "అపాణిపాదో జవనోగ్రహీతా పశ్యత్యచక్షుః సశృ ణోత్యకర్ణః" అని శ్వేతాశ్వతరోపనిషత్తు. నీవు త్రిగుణరహితుడవు. లేదా శబ్దాదిగుణరహితుడవు. సగుణమయిన పదార్థము దానిగుణము

నశించగా అదియును నశించును. కాని నీకు గుణమే లేకపోవుటచే నాశమున్న లేదని భావము. అన్నమాయాది పంచకోశములకంటె వేరయినవాడవు. అనగా ఏవిధమయిన ఆశ్రయము లేక అన్నిటికి ఆశ్రయుడవని భావము.

నిర్వికల్పో నిరాకారో నిరీహో నిరుపాధితః
సద్భావరహితో ఽనాదిపురుషః ప్రకృతేః పరః ॥

నీవు వికల్పరహితుడవు. వికల్పాత్మకమయిన మరియొకరూపము లేనివాడవు. అద్వైతుడవు అని భావము. ఆకారశూన్యుడవగుటచే నీవు ఇంతవాడవు అను పరిమాణముండదు. నిస్పృహుడవు అగుటచే కర్మబంధముండదు. ఉపాధిరహితుడవగుటచే పరిచ్ఛిన్నరహితుడవు. వ్యక్తమై దృగ్గోచరమయిన వస్తుభావము లేనివాడవు. అత్యంత పురాణ పురుషుడవు. సృష్టిస్వరూపమయిన ప్రకృతికంటె పరమందమంమవాడవు

మాయయా గృహ్యమాణ స్త్వం మనుష్య ఇవ భావ్యసే
జ్ఞాత్వాత్వాం నిర్గుణ మజం వైష్ణవా మోక్షగామినః ॥

కాని నీవు మాయ నంగీకరించి లోకోద్ధరణకై మనుష్యరూపమును గ్రహించుటచేతను, నీవుకూడ సామాన్యమానవులవలె రాగద్వేషాదులను ప్రదర్శించుటచేతను, అజ్ఞానులు నిన్ను తమవంటి మానవునిగానే భావించుచున్నారు. సర్వవ్యాపకుడవగు నీలీలలను అవగాహన చేసికొన్న భక్తులుమాత్రము నిర్గుణము, జన్మరహితము అగు నీయుధార్థ స్వరూపమును అవగాహన చేసుకొని సంసారబంధములను త్రెంపుకొని మోక్షము నందుచున్నారు.

అహం త్వత్పాదసద్భక్తిః శ్రేణీం ప్రాప్య రాఘవ
ఇచ్ఛామి జ్ఞానయోగాఖ్యం సోధ మార్గోధు మిశ్వరమ్॥

నేను నీపాదపద్మములందు నిశ్చలమయిన భక్తిభావమును కుదుర్చుకొని, ఆ నిచ్చెనద్వారా జ్ఞానయోగ మను సోపానమును అధిరోహించదలచుచున్నాను. అనగా భక్తిని ఆధారముగా చేసుకొని జ్ఞానమును, విజ్ఞానమును సంపాదించి ముక్తుడను కాగోరుచున్నానని భావము.

నమః సీతాపతే రామ నమః కారుణికోత్తమ
రావణారే నమస్తుభ్యం త్రాహి మాం భవసాగరాత్॥

సీతామనోవల్లభా! రామా! నమస్కారములు. కరుణార్ద్ర హృదయ! నమస్కారములు. రావణునికి శత్రువయిన రామా! నన్ను ఈ సంసారసముద్రమునుండి ఉద్ధరింపుము.

తతః ప్రసన్నః ప్రోవాచ శ్రీరామో భక్తవత్సలః
వరం వృణీష్వ భద్రం తే వాంఛితం వరదోఽస్మ్యహం॥

విభీషణుని భక్తి ప్రపతిసహితమగు స్తుతిని విని ప్రసన్నచిత్తుడయిన రాముడు "నీ కభీష్టమయిన వరమును కోరుకొనుము. దానిని తప్పక నెరవేర్చెదను" అని పలికెను.

విభీషణ ఉవాచ:—

ధన్యోఽస్మి కృతకృత్యోఽస్మి కృతకామోఽస్మి రాఘవ
త్వత్పాదదర్శనాదేవ విముక్తోఽస్మి న సంశయః॥

నేను ధన్యుడ నయితిని. నా జీవితకర్తవ్యము నెఱవేరినది. నా వాంఛితము లన్నియు ఈడేరినవి. నిస్సంశయముగా నేను నీ పాదపద్మ సందర్శనమాత్రమునచే భవబంధవిముక్తుడ నైతిని.

నాస్తి మత్సదృశో ధన్యో నాస్తి మత్సదృశః శుచిః
నాస్తి మత్సదృశో లోకే రామ త్వన్మూర్తి దర్శనాత్॥

రామా! నేను నీ దివ్యమంగళవిగ్రహమును దర్శించి ధన్యుడ నయితిని. ఈలోకములో నాతో సమానుడగు ధన్యజీవి మరియొకడు లేడు. నావంటి పరిశుద్ధజీవనుం డింకొకడు ఉండడు.

కర్మబంధవినాశాయ త్వత్ జ్ఞానం భక్తిలక్షణం
త్వద్ధ్యానం పరమార్థం చ దేహి మే రఘునందన।

సంసారములో ఉండి ఇంతవరకు నేను చేసిన కర్మబంధముల నుండి విముక్తిని సంపాదించుటకు భక్తిలక్షణమగు భవదీయాత్మ జ్ఞానమును నాకు ప్రసాదించుము. నిత్యము నీమూర్తినే హృదయకమ

లమునం దుంచుకొని ధ్యానించు భాగ్యమును నాకు కలుగజేయుము. జీవితపరమార్థమును ప్రసాదించుము. రామా ! నేను కోరిన దిదియే.

న యాచే రామరాజేంద్ర సుఖం విషయసంభవం
త్వత్పాదకమలే సక్తా భక్తి రేవ సదా స్తు మే॥

రామా ! పరరాజలోకమూర్ధన్యా ! లౌకికములగు విషయసుఖములవలన సంప్రాప్తించు ఆనందమును నేను యాచించుట లేదు. నిత్యము నీదివ్యపాదపద్మములందే లగ్నమయిన ఉత్కృష్టతమమగు భక్తి భావమునే నేను కోరుచున్నాను.

ఓ మి త్యుక్త్వా పునః ప్రీతో రామః ప్రోవాచ రాక్షసమ్
శృణు వక్ష్యామి తే భద్ర రహస్యం మమ నిశ్చితమ్॥

విభీషణు డిట్లు నిస్పృహభావముతో విషయసుఖములను కోరక భవబంధమోక్షకారకమగు భక్తినే కోరుటచే ప్రీతహృదయుడయ్యి రాముడు ఇట్లనెను- భద్రా ! నా రహస్య మొకటి యున్నది. దానిని సవిస్తరముగా చెప్పెదను వినుము.

మద్భక్తానాం ప్రశాంతానాం మోగీనాం వీతరాగిణాం
హృదయే సీతయా నిత్యం వసా మ్యత్ర న సంశయః॥

ప్రశాంతచిత్తులై నిత్యమూ నన్నే సర్వస్వముగా నమ్మిన భక్తుల యొక్కయు, శమదామాది షట్కసంపన్నులై సంసారసుఖములనుండి విరక్తమయిన హృదయములు గల యోగీశ్వరులయొక్క హృదయకమల ములయందు నేను సీతాసహితుడనై నిత్యము నివసించుచుందును. ఇందులో సంశయమునకు తావులేదు.

తస్మా త్త్వం సర్వదా శాంతః సర్వకల్మషవర్జితః
మాం ధ్యాత్వా మోక్ష్యసే నిత్యం ఘోరసంసారసాగరాత్॥

అకారణమున నీవు నిత్యము శాంతచిత్తుడవై రాగద్వేషాది సర్వకల్మషవిసర్జిత భావమున సీతాసహితుడ నగు నన్ను ధ్యానించు చుండిన చో ఈ ఘోరాతిఘోరమైన సంసారసముద్రమునుండి ముక్తు డవు కాగలవు.

స్తోత్ర మేత త్పఠే ద్యస్తు లిఖేద్వా శృణుయా దపి
మత్ప్రీతయే మమాభీష్టం సారూప్యం సమవాప్నుయాత్।

ఎవడైనను ఇప్పుడు నీచే చేయబడిన స్తోత్రమును నిర్ణిప్తబుద్ధితో నాప్రీతికై లిఖించినను, లేక పఠించినను, లేక వినినను సర్వకల్మషము లును విసర్జించి సారూప్యముక్తిని పొందగలడు.

ఇ త్యుక్త్వా లక్ష్మణం ప్రాహ శ్రీరామో భక్తభక్తిమాన్
పశ్య త్వాదానీ మే ష్టైష మమ సందర్శనే ఫలమ్
లంకారాజ్యేఽభిషేచ్యామి జలమాన యసాగరాత్॥

ఇట్లు విభీషణునకు వరప్రదానమొనర్చి భక్తులయందు దృఢానురాగము గల శ్రీరామచంద్రుడు లక్ష్మణుని జూచి ఇట్లు పలికెను– లక్ష్మణా! విభీషణుడు నన్ను సందర్శించినందులకు సద్యఃఫలము నంద గలడు. ఇతని లంకారాజ్యమునం దభిషేకించెదను. సముద్రజలముల గొనిరమ్ము.

యావ చ్చన్ద్రా ర్కౌ చ సూర్యా శ్చ యావ త్తిష్ఠతి మేదినీ
యావ న్మమ కథా లోకే తావ ద్రాజ్యం కరో త్వసౌ॥

ఈ విభీషణుడు చంద్రసూర్యు లున్నంతవరకును, భూమి ఉండు వరకును, నాచరిత్రము లోకమున ప్రచారితమై ఉండువరకును లంకా రాజ్యమును పరిపాలించుచుండుగాక. అనగా కల్పాంతమువరకు రాజ్య మొనరించుగాక అని భావము.

ఇ త్యుక్త్వా లక్ష్మణేనాంబు హ్యానాయ్య కలశేన తమ్
లంకా రాజ్యాధిపత్యార్థ మభిషేకం రమాపతిః
కారయామాస సచివైః లక్ష్మణేన విశేషతః॥

ఇట్లు లక్ష్మణుని నాదేశమిచ్చి అతనిచే సాగరజలపూరితమయిన కలశమును తెప్పించి, లక్ష్మణునిచేతను, సుగ్రీవమంత్రులచేతను విభీష ణునికి లంకారాజ్య పట్టాభిషేక మొనర్చెను.

సాధు సా ధ్వితి తే సర్వే వానరా స్తుష్టువు ర్భృశమ్
సుగ్రీవో ఽపి పరిష్వజ్య విభీషణ మథా బ్రవీత్॥

విభీషణాభిషేకమును జూచి వానరు లందరును "సాధు సాధు" అని తమ సంతోషమును ప్రకటించిరి. అనంతరమందు సుగ్రీవుడు అతనిని కౌగలించుకొని ఇట్లు పలికెను.

విభీషణ వయం సర్వే రామస్య పరమాత్మనః
కిం కరా స్తత్ర ముఖ్య స్త్వం భక్త్యా రామపరిగ్రహాత్
రావణస్య వినాశే త్వం సాహాయ్యం కర్తు మర్హసి॥

విభీషణా ! మనమందరమును పరమాత్మస్వరూపుడగు రాముని కింకరులము. మన అందరిలోను రాముడు నిన్నిట్లు బహూకరించుటచే నీవు ముఖ్యుడవు. కనుక రావణుని వధించుటకు నీవు యుక్తమగు సహాయ మొనరించుట మంచిది.

వి భీ ష ణ ఉ వా చ :—

అహం కియాఁ సహాయ స్తే రామస్య పరమాత్మనః
కిం తు దాస్యం కరిష్యే ఽహం భక్త్యా శక్త్యా త్వమాయయా॥

సుగ్రీవా ! పరమాత్మ యగు రామునకు సహాయ మొనరించుటకు నే నెవడను ? కాని నేనొక దాసుడను. భక్తిశ్రద్ధలతో నాశక్తి ననుసరించి కపటము లేకుండ ప్రభుదాస్య మొసరించెదను.

దశగ్రీవేణ సందిష్టః శుకో నామ మహాసురః
సంస్థితో హ్యంబరే వాక్యం సుగ్రీవ మిద మబ్రవీత్॥

ఇట్లిక్కడ రాముడు విభీషణునకు శరణు వొసగి, లంకా రాజ్యమునం దభిషేకించుచుండగా అక్కడ దశగ్రీవుడు శుకు డను ఒక మహాసురుని గుప్తచరునిగా రామసైన్యములను పరిశీలించి రమ్మనియు, సుగ్రీవునితో కొంచెము మాట్లాడి రాముని తో భేదమును కల్గించుమనియు చెప్పి పంపెను. అతడు రాజాజ్ఞను శిరసావహించి సుగ్రీవునివద్దకు వచ్చి ఆకాశమునసే నిలబడి ఇట్లు పలికెను.

శ్రు త్వా మాహ రావణో రాజా భ్రాతరం రాక్షసాధిపః
మహాకులప్రసూత స్త్వం రాజా ఽసి వనచారిణాం॥

సుగ్రీవా! రాక్షసచక్రవర్తి యగు రావణుడు సోదరతుల్యుడ వగు నీ కిట్లు సందేశించినాడు. నీవు ఋక్షరజసుని ఉత్తమకులమున జన్మించి తివి. అంతేగాక భూమండలమున నున్న సర్వ వానరభల్లూకములకు చక్రవర్తివి.

మమ భ్రాతృసమాన స్త్వం తవ నా స్త్వస్థవిప్లవః
అహం య దహరం భార్యాం రాజపుత్రస్య కిం తవ॥

వాలి నాకు సఖుడగుటచే భ్రాతృసమానుడు. నీవు అతని సోద రుడవగుటచే నాకు వాలివంటివాడవు. అట్టివాడవు నీవు నా ప్రయోజన మును పాడుచేయుట తగదు. (సీతాసంయోగము రావణుని ప్రయోజ నము. సీతను విడిపించుట తగదని భావము.) నేను దశరథరాజ పుత్రుని భార్యను హరించినందువలన నీకు వచ్చు నష్టమేమియు లేదు. రాముడు మానవుడు. నీవు వనచరుడవు. కనుక మీ యిద్దరికి సంబం ధము పనికిరాదని రావణుని సూచన.

కిష్కింధాం యాహి హరిభి ర్లంకా శక్యా న దేవతైః
ప్రాప్తుం కిం మానవై ర ల్పసారై ర్వానరయూథపైః॥

కనుక నీవు నీ వానరసైన్యముతోగూడ కిష్కింధకు తిరిగి పొమ్ము. అట్లుగాక చలముతో లంకమీదకే దండెత్తి వచ్చినచో దేవతలకే సాధించుటకు అశక్యమయిన మానగరమును అల్పసత్త్వులగు మానుష వానరులకు సాధ్య మెట్లగును. వ్యర్థప్రయత్న మొనర్పక వెనుకకు తిరిగి పొమ్మని భావము.

తం ప్రాప యంతం వచనం తూర్ణ ముత్పుల్లత్య వానరాః
ప్రాపద్యంత తదా క్షిప్రం నిహన్తుం దృఢముష్టిభిః॥

ఇట్లు సుగ్రీవునకు రావణసందేశమును వినిపించుచున్న శుకుని వానరులు ఒక్కసారిగా ఎగసిపట్టుకొని అతిదృఢములగు ముష్టిప్రహార ములచే వధింప సమకట్టిరి.

వానరై ర్హన్యమాన స్తు శుకో రామ మథాబ్రవీత్
న దూతా ఘ్నంతి రాజేంద్ర వానరా వారయ ప్రభో॥

వానరులు తనను ముష్టిప్రహారములచే వధింప ప్రయత్నింపగా శుకుడు రాముని సంబోధించి ఇట్లు విలపించెను- మహారాజా ! దూతలను వధించుట యుక్తముగాదు. కనుక నన్ను వధించుచున్న ఈ వానరులను వారింపుము.

రామః శ్రుత్వా తదా వాక్యం శుకస్య పరిదేవితమ్
మావధి ష్టేతి రామ స్తాన్ వారయామాస వానరాన్॥

అంతట రాముడు శుకుని ఆక్రోశమును విని "దూతను వధింప రాదు" విడువు డని వానరులకు ఆజ్ఞాపించెను. వానరులును అతనిని చంపక విడిచిరి.

పున రంబర మాసాద్య శుకః సుగ్రీవ మబ్రవీత్
బ్రూహి రాజన్ దశగ్రీవం కిం వక్ష్యామి ప్రజా మ్యహం॥

వానరులచే విడువబడిన శుకుడు మరల ఆకాశమున కెగసి సుగ్రీవునితో నిట్లనెను- "రాజా ! నేను వెళ్ళుచున్నాను. దశగ్రీవునికి ఏమి సమాధానమును చెప్పుమనెదవో ఆదేశించుము."

సుగ్రీవ ఉవాచ :—

యథా వాలీ మమ భ్రాతా తథా త్వం రాక్షసాధమ
హన్తవ్య స్త్వం మయా యత్నాత్ సపుత్రబలవాహనః॥

నిజముగా నాకు వాలి యెట్టిసోదరుడో నీవును అట్టివాడవే. కనుక రాక్షసాధమా ! వాలి నాకు ఏవిధముగా చంపదగినవాడయినాడో అట్లే నీవును చంపదగినవాడవు. కాని వాలికంటె నీలో ఒక్క విశేషమున్నది. వాలిని ఒక్కనినే చంపిన సరిపోయినది. కాని నిన్ను సపుత్రమిత్రఅమాత్యబల సమేతముగా వధించెదను.

బ్రూహి మే రామచంద్రస్య భార్యా హృత్వా క్వ యాస్యసి
తతో రామాజ్ఞయా ధృత్వా శుకం బద్ధ్వా ఽన్వరక్షయత్॥

రావణునకు నావాక్యముగా ఇట్లు చెప్పుము- "నీవు నా ప్రభువయిన రామచంద్రుని భార్యను అపహరించి ఎక్కడదాగినను ప్రాణ

రక్షణ చేసికొనలేవు.'' ఇంతలో శ్రీరాముడు శుకుని బంధించి జాగ్రత్తగా ఉంచుమని ఆజ్ఞాపించగా సుగ్రీవుడు దానిని పరిపాలించెను.

శార్దూత్రో ఒపి తతః పూర్వం దృష్ట్వా కపిబలం మహత్
యథావత్ కథయామాస రావణాయ స రాక్షసః
దీర్ఘచింతాపగో భూత్వా సిశ్వాస న్నాస మందిరే॥

అంతకు పూర్వమే రావణనియుక్తుడై వచ్చి వానరసైన్యము నంతను పరిశీలించి వెళ్ళిన శార్దూలు డను చారుడు వానరసైన్యము యొక్క అపరిమేయత్వమును వారి ఉత్సాహమును, శుకనిర్భంధమును సవిస్తరముగా వర్ణించి చెప్పెను. దానిని విని రావణుడు వేడినిట్టూర్పు విడిచి స్వమందిరమున చింతాగ్రస్తహృదయుడై కూర్చొనెను.

విభీషణునకు అభయప్రదాన మొనరించిన అనంతరము రాముడతనిని సముద్రతరణమునకు ఉపాయమును పృచ్ఛించినాడు. విభీషణుడు నియమపాలన మొనర్చి సముద్రము నుపాసించినచో అతడు ప్రసన్నుడై మార్గము నివ్వగలడని రామునకు సలహా నిచ్చినాడు. విభీషణుని ఈ సలహా సహజధర్మస్వభావుడయిన రామునకు పండితుడగు విభీషణుని వాక్యము రుచించినది.

"ఇత్యార్షస్తీర్య కుశాన్ నక్తం తీరే నదనదీపతేః
సంవివేశ తదా రామో వేద్యా మివ హుతాశనః॥
పరేణ యుక్తః తపసా నరేశ్వరః
పరేణ వీర్యేణ చ శత్రుకర్షణః
స్మృత్వా మతిం సాగరదర్శనే తదా
బభూవ తూష్ణీం నియతః స పార్థివః॥

"ఆ సాయంకాలమున నదనదీపతియగు సముద్రుని తీరమున దర్భలను పరచి శ్రీరాముడు యజ్ఞవేదిపై హుతాశనుడువలె ఉపవిష్టుడయ్యెను. అత్యధిక తపశ్శాలియు, అత్యధికబలశాలియు అగు శత్రునాశకుడు సాగరుని సందర్శించవలెనని అభీష్టమున మౌనపూర్వకమగు నియమమును పాటించెను."

మూడు రాత్రు లట్లుతడు దర్భశయనమున నియతవ్రతుడయి యుండెను. కాని సాగరుడు దర్శనమీయ లేదు. దానితో రామునికి సముద్రునిపై అత్యధికక్రోధము కల్గినది. తగినట్లు పూజించినను సాగరుడు మందభావుడై ఉండుటచూచి క్రోధోద్రిక్తుడయిన రాముడు లక్ష్మణుని ధనువిమ్మని పుచ్చుకొనెను.

స త్రిరాత్రోషిత స్తత్ర నయజ్ఞో ధర్మవత్సలః
ఉపాసత తదా రామః సాగరం సరితాం పతిమ్ ॥
న చ దర్శయతే రూపం మందో రామస్య సాగరః
ప్రయతే నాఽపి రామేణ యధార్హా మపి పూజితః ॥
సముద్రస్య తతః క్రుద్ధో రామో రక్తాంతలోచనః
సమీపస్థ మువా చేదం లక్ష్మణం శుభలక్షణం ॥

వాల్మీకి రామాయణమునన్న ఈ సాగరోపాసనము అధ్యాత్మ రామాయణమందు వర్ణింపబడలేదు. సముద్రునిపై రాముని క్రోధము మాత్రమె వర్ణింపబడినది.

తతః సముద్ర మాలోక్య రామో రక్తాంతలోచనః
పశ్య లక్ష్మణ దుష్టో ఽసౌ వారిధి ర్మా ముపాగతమ్ ॥
నాభినందతి చస్మాత్మా దర్శనార్థం మమానఘ
జానాతి మానుషో యం మే కిం కరిష్యతి వానరైః ॥

ఎంతకాలమునకు ప్రసన్నుడుగాక ఉత్తాలతరంగాయతుడై యున్న సాగరునిజూచి శ్రీరాముడు క్రోధారుణితలోచనుడై లక్ష్మణునితో ఇట్లు పలికెను– లక్ష్మణా ! చూడుము. ఈ దురాత్ముడగు సముద్రుడు తన సమీపమునకు వచ్చిన నన్ను గుర్తించుటలేదు. నా దర్శన మొనర్చుకొనుటకై ఇంకను వచ్చుటలేదు. వీడు మనుష్యుడను. వానరసహాయుడను. నన్నేమిచేయగలడని భావించుచున్నట్లున్నాడు.

అద్య పశ్య మహాబాహో శోషయిష్యామి వారిధిమ్
పాదై రైవ గమిష్యంతి వానరా విగతజ్వరాః ॥

ఈనాడు నామహత్వమును చూడుము. ఈ సముద్రమునంతను ఇంకించెదను. దానితో వానరులు నిర్భయులై పాదచారులుగనే లంకా ద్వీపమున ప్రవేశింతురుగాక.

ఇత్యుక్త్వా క్రోధతామ్రాక్ష ఆరోపితధనుర్ధరః
తూణీరా ద్బాణ మాదాయ కాలాగ్ని సదృశప్రభమ్
సంధాయ చాప మాకృష్య రామో వాక్య మథాబ్రవీత్ ॥

ఇట్లు క్రోధోద్రిక్తుడయిన రాముడు లక్ష్మణుడిచ్చిన ధనుస్సును గ్రహించి ధనుఃకోటియందు జ్యాపట్టి నారోపించి తూణీరమునుండి ప్రళయకాలాగ్నివలె మండుచున్న శరమును దీసి దానిని చాపమున సంధించి ఆకర్ణాంతము ఆకర్షించి ఇట్లు పలికెను.

పశ్యన్తు సర్వభూతాని రామస్య శరవిక్రమమ్
ఇదానీం భస్మసాత్ కుర్యాం సముద్రం సరితాంపతిమ్ ॥

శ్రీరాముని అస్త్రశక్తిని సృష్టియందలి ఇతరభూతము లన్నియు చూచుగాక ! తక్షణమే సర్వనదనదీపతియగు సముద్రుని భస్మమొనరించివైచెదను. జలభూతమగు సముద్రము భస్మభూత మొనరించుచున్నాను. దీనిని చూచి ఇతరభూతము లేవియు నాకు అవజ్ఞనొనరింపకుండుగాక అని భావము.

ఏవం బ్రువతి రామే తు సశైలవనకాననా
చచాల వసుధా చైవ దిశ శ్చ తమసా వృతాః ॥

రాముడీవిధముగ క్రోధఘూర్ణితహృదయుడై పలుకగా సపర్వతారణ్యయుక్తమగు భూమండలమంతయు భయకంపితమైనది. ఆకాశమున్న, దిక్కులన్న ఘోరాంధకారయుక్తము లైనవి.

చుక్షుభే సాగరో వేలాం భయాత్ యోజనమత్యగాత్
తిమినక్రఝషాకీర్ణా ప్రతప్తా సరితత్పతిః ॥

రాముని భీషణప్రతిజ్ఞను వినగనే సాగరముకూడ క్షోభించెను. అది అత్యంతభయావృతమై తీరమును పదలి ఒక యోజనము వెనుకకు

జరిగెను. సముద్రమందలి తిమితిమింగలకమకరాది భయంకర జంతువు లన్నియు భయపీడితము లయినవి.

ఏతస్మి న్నంతరే సాక్షాత్ సాగరో దివ్యరూపధృత్
దివ్యాభరణసంపన్నః స్వభాసా భాసయన్ దిశః॥

ఈరీతిపున భయగ్రస్తు డయిన సాగరుడుకూడ దివ్యరూపమును ధరించినవాడై, దివ్యములగు రత్నాభరణభూషితుడై, తన శరీరప్రకాశముచే దిక్కులను తేజోవంతముచేయుచు పైకి వెడలివచ్చెను.

వాల్మీకమున సాగరధర్షణమున కొంత విశేషమున్నది. రాముడు మొదట ధనుస్సును గ్రహించి సముద్రమున కొన్ని బాణములను వదలినాడు. వాటిచే సాగరమందలి జంతువు లన్నియు పరిత్రస్తములయినవి. అప్పటికిని సాగరుడు దర్శనమీయలేదు. రాముడు చాపమున బ్రహ్మాస్త్రమును సంధించినాడు. ఆసమయమున లక్ష్మణుడు జగత్సంక్షోభము సంభవించు నని "వద్దు వద్దు" నుచు ధనుస్సును నొకచేత పట్టుకొనినాడు. అయినను రాముడు బ్రహ్మాస్త్రమును సంధించినాడు. ఆంతట సాగరుడు దర్శన మిచ్చినాడు. భాగవతమున సాగరప్రకటన మిట్లు వర్ణింపబడినది- యద్రోషవిభ్రమ వివృత్తకటాక్షపాతసంభ్రాంత నక్రమకరో భయశీర్ణఘూర్ణః సింధు శ్శిరస్యరహణం పరిగృహ్య రూపీ పాదారవింద ముపనమ్య బభాష ఏతత్- అని. పద్మపురాణోత్తరఖండమందు మరొక విశేషము వర్ణింపబడినది. రాముడు మొదట శార్జ ధనుస్సు ఘుచ్చుకొని కొన్ని బాణములతో సముద్రమును శుష్కింపజేసెను. తరువాత సముద్రుడు ఆర్తుడై శరణనగా వారుణాస్త్రమున దానిని తిరిగి పూరించినట్లు అక్కడ వర్ణింపబడినది.

రాముని సాగరుడు దర్శించిన విధానమును ప్రతిపాదించుచున్నాడు.

స్వాంతస్థదివ్యరత్నాని కరాభ్యాం పరిగృహ్య సః
పాదయోః పురతః క్షిప్త్వా రామ స్యోపాయనః బహూన్॥

సాగరుడు తనయందున్న అమూల్యములగు రత్నములను పళ్ళెర ములందు గ్రహించి వాటినే పుష్పములుగా రామపాదములం దర్పించుచు,

సమీపమునకువచ్చి అనేకస్తుతులను కానుకలను అతనిపాదముల ముందుం చెను.

దండవత్ప్రణిపత్యాహ రామం రక్తాంతలోచనమ్
త్రాహి త్రాహి జగన్నాథ రామ త్రైలోక్యరక్షక॥

శ్రీరాముని పాదపద్మములకు సాష్టాంగదండప్రణామము లాచరించి సముద్రుడిట్లు విన్నవించెను– జగన్నాథా ! నీవు త్రిలోకరక్షకుడవు. క్రోధమును ఉపసంహరించుకొని నన్ను సంరక్షింపుము.

జడో ఽహం రామ తేసృష్టిః సృజతానిఖిలంజగత్
స్వభావమన్యథాకర్తుం కఃశక్తో దేవనిర్మితమ్॥

రామా ! పూర్వము నీవు భూతసృష్టిచేయువేళ నన్ను జడవస్తువుగా సృష్టించితివి. దేవా ! భవద్దత్తమయిన జడస్వభావమును పరిత్యజించు శక్తి నాకెక్కడిది ? జడమగుటచే పరేంగితమును తెలిసికొనలేక ఆలస్యమును చేసితినని సముద్రుని భావము.

స్థూలాని పంచభూతాని జడా న్యేవ స్వభావతః
సృష్టాని భవ త్రైతాని త్వదాజ్ఞాం లంఘయంతి న॥

నీవు పంచభూతములను జడస్వభావయుతములుగానే సృష్టించితివి. ఆకారణమున అవి తమ జడస్వభావమును అతిక్రమించినచో నీ ఆజ్ఞను అతిక్రమించిన వగును. కనుక అవి నీ యాజ్ఞోల్లంఘనమును చేయజాలవు.

తామసాదహమో ఽరామ భూతాని ప్రభవన్తి హి
కారణానుగమా త్తేషాం జడత్వం తామసం స్మృతః॥

స్థూలములగు పంచభూతములు తామసాహంకారమునుండి జనించును. కనుక వీటియందు కారణగుణమయిన జడత్వము నిండియుండును.

నిర్గుణస్య నిరాకారో యదా మాయాగుణా ప్రభో
లీల యాఽంగీకరోషి త్వం తదా వై రాజనామవా॥

పరమాత్మ వగు నీవు స్వతః నిర్గుణుడవు, నిరాకారుడవు అయి నప్పటికిని లీలామానుషరూపమున మాయాగుణములను అంగీకరించి నప్పుడు విరాట్పురుషుడ వగుదువు. హిరణ్యగర్భనామకుడ వగుదువని భావము. హిరణ్యగర్భునియందు త్రిగుణములు ఉండును.

గుణాత్మనో విరాజ శ్చ సత్వా ద్దేవా బభూవిరే
రజోగుణాత్ ప్రజేశాద్యా మన్యో ర్భూతపతి స్తవ॥

త్రిగుణాత్మకు డగు విరాట్పురుషునియందున్న సత్వగుణమువలన దేవతలు సృష్టించబడిరి. రజోగుణమున మనువు, ఇంద్రుడు మొదలగు ప్రభువులు సృష్టించబడిరి. తామసగుణమున భూతపతి, లయకారకుడు అగు రుద్రుడ సృష్టించబడినాడు. ఇక్కడ దేవతలనగా సనకాదులగు మునులని భావము.

త్వా మహం మాయయా చ్ఛన్నం లీలయా మానుషాకృతిం
జడబుద్ధి ర్జడో మూర్ఖః కథం జానామి నిర్గుణమ్॥

నీవిప్పుడు మాయావరణయుక్తుడవై లీలామానుషరూప మును ధరించియున్నావు. అట్టి నిన్ను జడుడను, మూర్ఖుడను, వివేక శూన్యుడను అగు నే నెట్లు నిర్గుణపరమాత్మగా తెలిసికొనగలను?

దండ ఏవ హి మూర్ఖాణాం సన్మార్గప్రాపకః ప్రభో
భూతానా మమరశ్రేష్ఠ పశూనాం లగుడో యథా॥

మూర్ఖులగు జడబుద్ధులను యుత్తమమార్గమునకు తెచ్చుటకు దండమే యోగ్యమయిన ఉత్తమసాధనము. పశువులను దారిలో పెట్టు టకు కర్ర ఎంత ఉపయుక్తమయినదో మాబోటి జడులను నడిపించు టకు దండము అంత శ్రేష్ఠమయినది.

శరణం తే వ్రజా మీశ శరణ్యం భక్తవత్సల
అభయం దేహి మే రామ లంకామార్గం దదామి తే॥

ప్రభూ! నీవు శరణన్న భక్తులయందు వాత్సల్యభావమును కలిగి యుండువాడవు. కనుక నీ శరణుజొచ్చుచున్నాను. నాకు అభయము నిమ్ము. నీకు లంకకుపోవు మార్గమును చూపెదను

శ్రీ రా మ ఉ వా చ :—

అమోఘో ఽయం మహాభాణః తస్మిన్దేశే నిపాత్యతాం
లక్ష్యం దర్శయ మే శీఘ్రం బాణ స్యామోఘపాతినః ॥

నే నిప్పుడు ధరించిన బ్రహ్మాస్త్రము వ్యర్థమగుటకు వీలు లేదు. ఇది ఏప్రదేశమును దగ్ధమొనరించగలదు ? నాకు అతిశీఘ్రముగా ఒక లక్ష్యమును కన్పరచుము. అమోఘమగు ఈ అస్త్రము దానిని దగ్ధ మొనర్పగలదు.

రామస్య వచనం శ్రుత్వా కరే దృష్ట్వా మహాశరమ్
మహోదధి ర్మహాతేజా రాఘవం వాక్య మబ్రవీత్ ॥

సముద్రుడు శ్రీరాముని వచనములనువిని అతని హస్తమందున్న అమోఘశరమునుకూడ చూచి మహాతేజశ్శాలియగు అతడు రామున కిట్లనెను.

రామో త్తరప్రదేశే తు ద్రుమకుల్య ఇతి శ్రుతః
ప్రదేశ స్తత్ర బహవః పాపాత్మానో దివానిశం
భాధంతే మాం రఘుశ్రేష్ఠ తత్ర తే పాత్యతాం శరః ॥

రామా ! ఇక్కడకు ఉత్తరదిక్కుగా ద్రుమకుల్యమను ద్వీపమున్నది. దానిపై అనేకులగు పాపాత్ములు నివసించుచున్నారు. వారు రాత్రింబవళ్ళు నన్ను బాధించుచున్నారు. కనుక నీ యీ శరము వారిపైబడి దహించుగాక !

రామేణ సృష్టో బాణ స్తు క్షణా దాభీరమండలమ్
హత్వా పునః సమాగత్య తూణీరే పూర్వవత్ స్థితః ॥

సముద్రు డిట్లు లక్ష్యమును నిర్దేశించగనే రాముడు బ్రహ్మాస్త్ర మును విడిచినాడు. అది క్షణములో పాపాత్ములగు ద్రుమకుల్యాద్వీ పస్థా ఽభీకులను దగ్ధమొనర్చి తిరిగి తూణీరమును చేరెను.

తతో ఽబ్రవీ ద్రఘుశ్రేష్ఠం సాగరో వినయాన్వితః
నల స్సేతుం కరో త్వస్మిన్ జలే మే విశ్వకర్మణః
సుతో ధీమాన్ సమర్థో ఽస్మిన్ కార్యే లబ్ధవరో హరిః ॥

అంతట సాగరుడు వినయావనతశిరస్కుడై శ్రీరామచంద్రుని కిట్లనెను—విశ్వకర్మసుతుడగు నలుడనువాడు మీ సైన్యమున నున్నాడు. అతడు నాజలములపై సేతునిర్మాణ మొనగ్చుటకు సమర్థుడు. అతడు వరప్రభావసంపన్నుడగుటచే ఈకార్యమును నెరవేర్పగలడు.

విశ్వకర్మ మంధరపర్వతమున నలుని తల్లికి నావంటి పుత్రుడు నీకు జనించునని వరమిచ్చినాడు. ఆకారణమున నలునియందు విశ్వకర్మ కున్న శక్తులన్నియు యున్నవి. సాగరుడు రామునకు తనను పరిచ యముచేయగా ఈవిషయము చెప్పినాడు. మొదటనే ఎందుకు చెప్ప లేదను శంక రాకుండుటకై నన్నుగూర్చి నేను చెప్పుకొనుట యుక్తము కాదని దూరకొంటిని. అని నలుడు చెప్పినట్లు వాల్మీకము.

కీర్తిం జానంతు తే లోకాః సర్వలోకమలాపహామ్
" ఇత్యుక్త్వా రాఘవం నత్వా యయౌ సింధురదృశ్యతామ్ ॥

నాపై సేతుబంధమొనర్చిన నీ దివ్యకీర్తిని లోకములు గానము చేయుగాక. ఇట్లు వాక్రుచ్చి సముద్రుడు రామునకు అభివందనము లాచరించి అదృశ్యుడయ్యెను

తతో రామస్తు సుగ్రీవలక్ష్మణాభ్యాం సమన్వితః
నల మాజ్ఞాపయ చ్ఛీఘ్రం వానరైః సేతుబంధనే ॥

అంతట రాముడు లక్ష్మణసుగ్రీవులతో ఆలోచించి శీఘ్రముగా వానరుల సహాయముతో సముద్రమునకు సేతువును బంధించుమని నలునకు ఆజ్ఞనిచ్చెను.

తతో ఽతిహృష్టః ప్లవగేంద్రయూథపైః
మహానగేంద్రప్రతిమై ర్వృతో నలః
బబంధ సేతుం శతయోజనాయతం
సువిస్తృతం పర్వతపాదపై ర్దృఢమ్ ॥

రామాజ్ఞనువిని అత్యంతసంతుష్టహృదయుడయిన నలుడు పర్వతోపమాన శరీరలగు వానరసైనికులతోగూడి నూరుయోజనముల పొడవుగలిగి, పదియోజనముల వెడల్పుగల సేతువును పర్వతములను వృక్షములను ఉపయోగించి బంధించెను.

చతుర్థసర్గ

తృతీయసర్గలో సేతుబంధనార్థము సాగరుని ఆదేశము వర్ణితమయినది. ఈ సర్గలో సేతుబంధనమును శ్రీరామసాగరతర ణమును వర్ణించువాడై దండయాత్ర నిర్విఘ్నముగ సమాప్తి నందుటకు రాము డొనర్చిన రామలింగేశ్వరప్రతిష్ఠను గ్రంథ కర్త ప్రతిపాదించుచున్నాడు.

శ్రీ మహా దేవ ఉవాచ :—

సేతుమారభమాణస్తు తత్ర రామేశ్వరం శివమ్
సంస్థాప్య పూజయిత్వాఽహ రామో లోకహితాయచ॥

శ్రీరాముడు వానరులను సేతునిర్మాణమునకై ఆజ్ఞాపించుటకు ముందుగనే శుభముహూర్తమున ఇష్టదేవతయగు శివుని లింగప్రతిష్ఠా పన మొనర్చెను. ఆ శివలింగము రాముచే ప్రతిష్ఠితమగుటచే దానికి రామేశ్వరుడను ప్రసిద్ధి కలిగినది. శివుని ప్రతిష్ఠించి పూజించి లోక హితము నాకాంక్షించుచు ఇట్లు శాసించెను.

ఈ రామేశ్వరప్రతిష్ఠ వాల్మీకి రామాయణమందును, ఇతరము లగు చాల పురాణములందు ఏ కనిపించుటలేదు. కూర్మపురాణమున మాత్రము ఈవిషయము ప్రభివ్యక్తమయినది. "సేతుమధ్యే మహాదేవ మీశానం కృత్తివాససం, స్థాపయామాస లింగస్థం పూజయామాస రాఘవః" అని. ఈ శ్లోకమువలన రామేశ్వరప్రతిష్ఠ సేతుమధ్యమున జరిగినట్లు తెలియుచున్నది. కాని ఈగ్రంథమున తీరమున సేతునిర్మా ణమునకంటె ముందు ప్రతిష్ఠింపబడినట్లున్నది.

ప్రణమేత్ సేతుబంధం యో దృష్ట్వా రామేశ్వరం శివం
బ్రహ్మహత్యాదిపాపేభ్యో ముచ్యతే మదనుగ్రహాత్ ॥

ఏ వ్యక్తిని నామాన మే నిర్మింపబడిన సేతువును సంద ర్శించి నాచే ప్రతిష్ఠితుడయిన ఈశివుని దర్శించునో అతడు బ్రహ్మ

హత్య గోహత్య మొదలగు మహాపాపములను చేసినవాడయినను సరే నీ అనుగ్రహవిశేషమున తక్షణమే పాపవిముక్తి నందగలడు.

"కూర్మపురాణమున రామేశ్వర ఫలశ్రుతి . రామునకు దర్శన మిచ్చిన శివుడు వరప్రదానముగా ఇట్లు చెప్పును–తస్యదేవో మహా దేవః పార్వత్యా సహశంకరః ప్రత్యక్షమేవభగవాన్ దత్త్వాన్ వర ముత్తమం–శ్రీరామునకు పార్వతీసహితుడగు శంకరుడు ప్రత్యక్షముగా ఉత్తమోత్తమమగు వరము నిట్లొసగెను. యే త్వయా స్థాపితం లింగం ద్రక్ష్యంతీదం ద్విజాతయః మహాపాతక సంయుక్తాస్తేషాం పాపం వినం క్ష్యతి. అన్యానిచైవ పాపాని స్నాతస్యాత్రమహోదధౌ, దర్శనాదేవ లింగస్య నాశం యాంతి న సంశయః. యావత్ స్థాస్యంతి గిరయో యావదేషా చ మేదినీ యావత్ సేతుశ్చ తావచ్చ స్థాస్యత్యత్ర తిరోహితః. స్నానందానం తపః శ్రౌద్ధం సర్వంభవతు చాక్షయమ్, స్మరణా దేనలింగస్య దిన పాపం ప్రణస్యతి– నీచే స్థాపింపబడిన ఈలింగ మును దర్శించినవారు మహాపాతకాదులనుండి విముక్తి నందెదరు. సముద్రములో స్నానమొనర్చి లింగమును సందర్శించినమాత్రమున సర్వపాపములు నశించిపోవును. పర్వతము లున్నంతకాలము, భూమి ఉన్నంతకాలము, ఈ సేతువు ఉన్నంతకాలము నేను ఈలింగమున తిరోహితుడనై ఉందును. ఈస్థలమున చేసిన స్నానదానతపః శ్రౌద్ధాము లన్నియు అక్షయములగును. ఈలింగమును స్మరించినంతమాత్రమున ఆనాడు చేసిన పాపములన్నియు నశించును." అని.

సేతుబంధే నరః స్నాత్వా దృష్ట్వా రామేశ్వరం హరం
సంకల్పనియతో భూత్వా గత్వా హరాణసీం నరః॥
ఆనీయ గంగాసలిలం రామేశ మభిషిచ్య చ
సముద్దిశ్య తదాభారో బ్రహ్మప్రాప్నో త్య సంశయమ్॥

మానవుడు మొదట సేతుస్నాన మాచరించి రామేశ్వరుని దర్శించవలెను. అనంతరము దృఢసంకల్పుడై, సదాచారవ్రతుడై వారణాసీక్షేత్రమునకు వెళ్ళి గంగా[illegible]మాచరించి, విశ్వేశ్వరసందర్శన

మొనరించి గంగాసలిలమును తెచ్చి దానిచే రామేశ్వరుని అభిషేకించి పాత్రాదులను సముద్రమున విసర్జించి తిరిగి స్నానమొనర్చినచో అతడు తప్పక బ్రహ్మను పొందగలడు. అనగా బ్రహ్మజ్ఞానపరుడై సంసారబంధ ములనుండి విముక్తు డగునని భావము.

ఇక సేతుబంధన ప్రకారమును చెప్పుచున్నాడు.

కృతాని ప్రథమే నాహ్ని యోజనాని చతుర్దశ
ద్వితీయేన తథా చాహ్ని యోజనాని తు వింశతిః॥
తృతీయేన తథా చాహ్ని యోజనా న్యేకవింశతిః
చతుర్థేన తథా చాహ్ని ద్వావింశతి రితి శ్రుతమ్॥
పంచమేన ప్రయోవింశ దోజనాని సమంతతః
బబంధ సాగరే సేతుం నలో వానరసత్తమః॥

రామేశ్వరలింగ ప్రతిష్ఠాపనానంతరము నలుడు వానరసహాయ ముతో సేతువును బంధించినాడు. సేతువును బంధించుటకు అయిదు రోజులు పట్టినది. మొదటిరోజున పదునాల్గు యోజనములు మాత్రమే సేతువు నిర్మితమయినది. రెండవరోజున ఇరువదియోజనములు నిర్మించ బడినది. మూడవరోజున ఇరువదియొక్క యోజనముల నిర్మాణము సాగినది. నాల్గవరోజున ఇరువది రెండు యోజనములు సాగినది. అయి దవరోజున ఇరువది మూడు యోజనములు నిర్మించబడి సేతువు పూర్తి అయినది. సేతువు నూరుయోజనములు పొడవు పదియోజనములు వెడల్పుగలిగియున్నదనియు, ఉత్తరకాలమునుండి లంకాద్వీపమువరకు సాగరసీమంతమువలె నున్నదని వాల్మీకి వర్ణించినాడు- "దశయోజన విస్తీర్ణమాయతం శతయోజనం నలశ్చక్రే మహాసేతుం మధ్యే నదనదీ పతేః..... కూలాత్తూత్తర ఆరభ్యో లంకా కూలే ప్రతిష్ఠితః, సాగరస్యైష సీమంత శ్చిత్రకూటో వ్య దృశ్యత" అని.

తేనైవ జగ్ముః కపయో యోజనానాం శతం ద్రుతమ్
అసంఖ్యాకాః సువేలాంచిం రుషహుః ప్లవంగోత్తమాః॥

ఆసేతుప్రమాణమగనే అసంఖ్యాకులయిన వానరభటులు నూరు యోజనముల సముద్రమును దాటి లంకాద్వీపమున ప్రవేశించి సువేల మను పర్వతమును అధిష్ఠించిరి.

ఆరుహ్య మారుతిం రామో లక్ష్మణో ఽప్యంగదం తథా
దిదృక్షూ రాఘవో లంకా మారుకో హ చలం మహత్॥

శ్రీరామచంద్రుడు హనుమంతుని భుజమునపైనను, లక్ష్మణుడు అంగదుని భుజమునపైనను అధిష్ఠించి సముద్రమును దాటిరి. అనంతరము రాముడు లంకానగరమును పరిశీలించుటకై సువేలశిఖరమును అధిరోహించిరి.

దృష్ట్వా లంకాం సువిస్తీర్ణాం నానాచిత్రధ్వజాకులాం
చిత్రప్రాసాదసంబాధాం స్వర్ణప్రాకారతోరణామ్
పరిఖాభిః శతఘ్నీభిః సంక్రమైశ్చ విరాజితామ్॥

వారాసమయమున చిత్రవిచిత్రములగుధ్వజములచే అలంకరింపబడినదియు, చిత్రములగు మణికాంతులతోగూడిన రాజప్రాసాదములతోగూడినదియు, బంగరురంగల ప్రకాశించు ప్రాకారములను సింహద్వారములును కలదియు, జలపూరితములగు కందకములతోడను, శతఘ్నీయంత్రములతోడను పరిరక్షించబడుచు, నగరప్రవేశార్థ వినిర్మిత సేతువులు గలిగినదియు, అత్యంత విస్తీర్ణతగలదియు అగు లంకానగరమును చూచిరి.

ప్రాసాదో పరివిస్తీర్ణప్రదేశే దశకంధరః
మంత్రిభిః సహితో వీరైః కిరీటదశకోజ్వలః॥
నీలాద్రిశిఖరాకారః కాలమేఘసమప్రభః
రత్నదంష్ట్రైః సితచ్ఛాయైర్ రక్షోభిః పరిశోభితః॥

అంతట లంకానగరాధీశ్వరుడగు రావణుడు అత్యంత విశాలమగు ప్రాసాదోపరిభాగమున పడితలలయందు పది మణిమయోజ్వలములగు కిరీటములను ధరించి, మంత్రిసహితుడై విరాజిల్లెను. ఆసమయమున అతని స్వరూపము నీలవర్ణపర్వతమువలె ఉజ్వలమణికాంతుల నీను

చున్నది. అతని శిరోభాగమునకు పైన రత్నమయదండము గల సితచ్ఛత్రము శోభింపుచుండెను. రాముడు లంకతోపాటు ఇట్టిరావణునికూడ చూచెనని భావము.

ఏతస్మి న్నంతరే బద్ధో ముక్తో రామేణ వై శుకః
వానరై స్తాడిత స్సమ్యక్ దశానన ముపాగతః॥

సముద్రమును దాటినతరువాత విముక్తు డయిన శుకుడు, వానరులచే తాడితుడై ప్రాసాదాగ్రభాగమున నున్న రావణునివద్దకు చేరెను.

ప్రహస్య రావణః ప్రాహ పీడితః కిం పరై శ్శుక
రావణస్య వచ శ్శ్రుత్వా శుకో వచన మబ్రవీత్॥

శుకుని జూచి రావణుడు నవ్వుచూ "శుకా! శత్రువులచే తాడితుడవైతివా, ఏమి?" అని ప్రశ్నించెను. అంతట శుకుడు రావణున కిట్లు నివేదించెను.

సాగర స్యోత్తరే తీరే ఽబ్రవం తే వచనం యథా
తత ఉత్లుప్యత్య కపయో గృహీత్వా మాం క్షణా త్తతః
ముష్టిభి ర్నఖదంష్ట్రై శ్చ హన్తుం లోప్తుం ప్రచక్రముః॥

రాజా! నేను నీఆజ్ఞ ననుసరించి నీవు సుగ్రీవునితో పలుకుమనిన భేదవాక్యముల నన్నిటిని పలికితిని. ఇంతలో అనేకులగు కపులు ఆకాశమునకు ఎగిరి నన్ను పట్టి బంధించిరి. వారు కృపారహితులై ముష్టిఘాతములచేతను, దంతములచేతను నను వధించుట కుద్యుక్తులైరి.

తతో మాం రక్ష రక్షేతి క్రోశంకం రఘుపుంగవ
విసృజ్య తా మితి ప్రాహ విసృష్టో ఽహం కపీశ్వరైః
తతో ఽహ మాగతో భీత్యా దృష్ట్వా తద్వానరం బలం॥

అంతట నేను రాముని పేరొక్కసి చూతను వధించుచున్నారు. అది ధర్మవిరుద్ధమని ఆక్రోశించితిని. అది విని రాఘవశ్రేష్ఠుడు చూతను విడువుడని ఆజ్ఞాపించినాడు. వానరులు నన్ను విడిచిరి. నేను ఆవానర బలము నంతను పరిశీలించి భయపడుచునే ఇక్కడకు వచ్చితిని.

రాక్షసానాం బలౌఘస్య వానరేంద్రబలస్య చ
నైతయో ర్విద్యతే సంధిః దేవదానవయో రివ॥

దేవసైన్యములకు దానవసైన్యములకు యుద్ధభూమిలో కలయిక ఎట్లు అసమీచీనముగా నుండునో అట్లే మన రాక్షససైన్యములకును సుగ్రీవుని వానరసైన్యములకును కలయిక సరిగానుండదు.

"వానరులు అల్పసత్త్వులు. కనుక మీరు లంకానగరమును ఏమియు ఆక్రమింపజాలరు. తిరిగి కిష్కింధకు సైన్యసహితుడవై తిరిగి పొమ్ము." అని రావణుడు సుగ్రీవునికి సందేశము నంపినాడు. శుకుడు రావణుని ఆసందేశమును సమాధానముగా వానరసైన్యములు మన కంటె శక్తిగలవి అని ఈశ్లోకమున సూచించినాడు.

పుర్యా ప్రాకార మాయాంతి క్షిప్ర మేకతరం కురు
సీతాం వాస్మై ప్రయచ్ఛాశు యుద్ధం వా దీయతాం ప్రభో॥

వానరులు కేవలమెల్లుండి పుర్యాకారములను నధిరోహించగలరు. కనుక నీవు అతిశీఘ్రముగా సీతను రామునకు తిరిగి ఇచ్చివేయుటయో లేక యుద్ధమునకు సన్నద్ధమగుటయో ఈరెంటిలో నేదో ఒకటి చేయ వలసియున్నది.

మా మాహ రామ స్త్వం బ్రూహి రావణ మద్వచ శ్శుక
యద్బలం చ సమాశ్రిత్య సీతాం మే హృతవా నసి
తద్దర్శయ యథాకామం ససైన్యః సహబాంధవ॥

రాముడు రావణునకు చెప్పమని నాతో ఇట్లనినాడు- "రావణా ! నీవు ఏ బలశక్తుల నాధారముగా గొని నా భార్యయగు సీతను హరించి తివో వాటిని నీ ఇచ్చవచ్చినట్లు ససైన్యుడవుగాను, సబాంధవుడవుగాను నాకు కన్పరుచుము." అనగా నీవు బ్రహ్మవలన పొందిన వరములుగాని, దేవేంద్రాదులను జయించి సైన్యములుగాని నాయెదుట నిలువజాలవని రాముని సందేశము.

శ్వఃకాలే నగరీం లంకాం సప్రాకారాం సతోరణాం
రాక్షసం చ బలం పశ్య శరై ర్విద్ధ్వంసితం మయా॥

రేపు ప్రాతఃకాలమునకే ప్రాకారయుతము సుందరసింహద్వార యుతము అగు లంకానగరస్థితి ఎట్లుండునో తెలియగలదు. నా శర విధ్వంసితమయిన రాక్షససైన్యముయొక్క స్థితినిగూడ దర్శించగలవు.

ఘోరరోష మహం మోక్ష్యే బలం ధారయ రావణ!
ఇత్యుక్త్వా పరరా మూధ రామః కమలలోచనః॥

"రావణా! నాలో ప్రవృద్ధమగుచున్న భయంకరమగు కోపాగ్నిని నీపై ప్రయోగించుచున్నాను. కనుక నీ సమస్త శక్తియుక్తులను ఏకత్రితమొనర్చుకొని యుండుము." ఇట్లు చెప్పి కమలపత్రాక్షుడగు రాముడు విరమించినాడు.

రాముని సందేశమును చెప్పిన అనంతరము శుకుడు శత్రుసైన్య మందలి విశేషములను వర్ణించుచున్నాడు.

ఏకస్థానగతా యత్ర చత్వారః పురుషర్షభాః
శ్రీరామో లక్ష్మణ శ్చైవ సుగ్రీవ శ్చ విభీషణః॥

శ్రీరాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, విభీషణుడు–ఈ నలుగురును సర్వపురుషశ్రేష్ఠులు. అట్టి బలశాలురు నలుగురును ఒకేస్థానమున చేరి ఒక్కటయినారు.

ఏత ఏవ సమర్థా స్తే లంకాం నాశయితుం ప్రభో!
ఉత్పాట్య భస్మీకరణే సర్వే తిష్ఠంతు వానరాః॥

తక్కిన హనుమదాంగదాదివానరులనందరను అటుంచుము. పైపైజెప్పిన రామాదులు నలుగురే లంకానగరమును సర్వమును పెరికి భస్మీపటలమొనర్చుటకు సర్వసమర్థులు.

తస్య తాదృగ్బలం రూపం తేజః ప్రహరణాని చ
వధిష్యతి పురం సర్వ మేక స్తిష్ఠంతు తే త్రయః॥

ఆ నల్గురిలోను లక్ష్మణాదులను అటుంచి రాము డొక్కడే ఈ సమస్తనగరమును నాశమొనర్చుటకు సమర్థుడగును. అతడు అందుకు సమర్థమయిన అంతస్సారము గలవాడు. అతని బాహ్యారూపమును అతని మహానుభావత్వమును చాటుచున్నది. ఆతని మహత్తరమగు

తేజస్సు నాన్యత్రో దుర్లభము. అతని చాపమునుండి విముక్తములయిన శరములు నగరనాశమునకు సమర్థములయినవి.

రామాదుల నల్గురిని పేరొక్కని ఇక వానరవీరశ్రేష్ఠులను పేరొక్కనుచున్నాడు.

పశ్య వానరసేనాం తా మసంఖ్యాకాం ప్రపూరితాం
గర్జంతి వానరా స్తత్ర పశ్య పర్వతసన్నిభాః
నశక్తా స్తేగణయితుం ప్రాధాన్యేన బ్రవీమి తే ॥

ఈ నల్గురు వీరులను అటుంచి ఈ అసంఖ్యాకమగు వానరసైన్యమును చూడుము. అది మహావీరపరిపూరితము. పర్వతసమానదేహులగు వారందరును సింహములవలె గర్జించుచున్నారు. వారిని లెక్కపెట్టి ఇంతమంది అని లెక్కించుట శక్యముగాదు. కనుక కొందరినిమాత్రము పేరొక్కనెదను, వినుము.

ఏష యో ఽభిముఖో లంకాం నదం స్తిష్ఠతి వానరః
యూథపానాం సహస్రాణాం శతేన పరివారితః
సుగ్రీవసేనాధిపతి ర్నీలో నా మాగ్నినందనః ॥

అడుగో ! లంకానగరమునకు అభిముఖుడై మహానాదమొనర్చుచున్న వానరుడు నీలుడనువాడు అగ్ని దేవుని పుత్రుడు. ఒక లక్షమంది వానరసేనానులతో కూడియున్న ఇతడు సుగ్రీవుని సర్వసైన్యాధ్యక్షుడు.

ఏష పర్వతశృంగాభః పద్మకింజల్క సన్నిభః
స్ఫోటయత్య భిసంరబ్ధో లాంగూలం చ పునః పునః
యువరా జోంగదో నామ వాలిపుత్రో ఽతివీర్యవాన్ ॥

ఆపైన మహాపర్వతశిఖరమువంటి స్వరూపము కలిగి, పద్మకేసరములవంటి రోమములతో ప్రకాశించుచు, అత్యంతసంరంభోద్వేగములతో వాలమును మాటిమాటికి చలింపజేయుచున్న వీరశ్రేష్ఠుడు అంగదుడనువాడు. అతడు నీసఖుడయిన వాలియొక్క కుమారుడు. ఇప్పుడు వానరరాజ్యమునకు యువరాజు.

యేన దృష్టా జనకజా రామస్యా తీవ వల్లభా
హనూమా నేష విఖ్యాతో హతో యేనతవాత్మజ॥

అడుగో! అతడు హనుమంతుడు. అతడే రామునికి ప్రాణము లకంటె ప్రియమయిన సీతాదేవిని అశోకవనమున దర్శించినవాడు. ప్రఖ్యాతమహావీరు డగు ఇతడు నీపుత్రు డగు అక్షుని వధించినవాడు.

శ్వేతో రాజతసంకాశో మహాబుద్ధిపరాక్రమః
తూర్ణం సుగ్రీవ మాగమ్య పున ర్గచ్ఛతి వానరః॥

అదిగో, ఆవైపున ఇప్పుడే సుగ్రీవుని కలుసుకొని సంభాషించి తిరిగి వెళ్ళువాడు– శ్వేతుడను వానరరాజు. అతని శరీరము రజత కాంతుల నీనుచున్నది. అతడు మహత్తరమగు బుద్ధి వైభవమును దానితోబాటు పరాక్రమమును కలిగియున్నాడు.

య స్త్వేష సింహసంకాశః పశ్య త్యతుల విక్రమః
రంభో నామ మహాసత్త్వో లంకాం నాశయితుం క్షమః॥

అతడు రంభుడను వానరరాజు. అతని స్వరూపమే సింహమును తలపించుచున్నది. అతని పరాక్రమమునకు ఇంత అను పరిమాణము లేదు. మహాసత్త్వుడగు అత డొక్కడే లంకానగరమును నాశన మొనర్పగలడు.

ఏష పశ్యతి వై లంకాం దిధక్షన్నివ వానరః
శరభో నామ రాజేంద్రకోటియూథపనాయకః॥

లంకానగరము నంతను భస్మసాత్కృతమొనర్చువానివలె రూక్ష ముగా చూచుచున్న వానరుడు శరభుడనువాడు. అతడు కోటి వానరవీరులకు నాయకుడు.

పనస శ్చ మహావీర్యో హ్యింద శ్చ ద్వివిధ స్తథా
నల శ్చ సేతుకర్తా ఽసౌ విశ్వకర్మసుతో బలీ।

అతడు పనసుడను మహావీరుడు. వీరు హైందద్వివిదులు, ఆశ్వి నుల పుత్రులు. వాడు నలుడు. విశ్వకర్మ సుతుడు. సముద్రముపై సేతువును నిర్మించినవాడు అతడే.

వానరాణాం వర్ణనే వా సంఖ్యానే వా కఈశ్వరః
శూరాః సర్వే మహాకాయాః సర్వే యుద్ధాభికాంక్షిణః॥

నేను ఇప్పుడు నీకు వానరవీరులలో కొలదిమందిసిమాత్రమే చూపితిని. ఇంకను అసంఖ్యాకులగు వీరు ఉన్నారు. అది అట్లుంచి వానరుల బలపరిమాణమును తెలియజేయుటకు సమర్థుడగువా డెవ్వడును లేడు. వారందరును గొప్ప గొప్ప పర్వతసమానములగు శరీరములు గలవారు. దాక్షసులతో ఎప్పుడు యుద్ధమొనరించుదుమా అను ఆకాంక్షను వెలిబుచ్చుచున్నారు.

శక్తాః సర్వే చూర్ణయితుం లంకాం రక్షోగణైః సహా
ఏతేషాం బలసంఖ్యానం ప్రత్యేకం వచ్మి తే శృణు॥

వీరందరును కలిసి రక్షోగణసహితమగు లంకానగరమునంతను చూర్ణమొనరించుటకు సమర్థులు. ఇట్టి మహావానరసైన్యముయొక్క పరిమాణమును ప్రత్యేకముగా పేర్కొనెదను వినుము.

ఏషాం కోటిసహస్రాణి నవ పంచ చ సప్త చ
తథా శంఖసహస్రాణి త థార్బుదశతాని చ॥
సుగ్రీవసచివానాం తే బల మేత ప్రకీర్తితమ్
అన్యేషాం తు బలం నాహం వక్తుం శక్తో ఽస్మి రావణ॥

ఈ పైజెప్పిన నీలాదుల సైన్యములు ఇరువదియొక్కవేల కోట్లు, వేయి శంఖములు, నూరు ఆర్బుదములు ఉన్నవి. ఇది సుగ్రీవుని మంత్రుల సైన్యములుమాత్రమే. ఇతరవీరుల బలమును చెప్పుటకు నేను అశక్తుడను.

వానరసైన్యసంఖ్యా కథనము వాల్మీకమున ఇట్లు జరిగినది.

"శతం శతసహస్రాణాం కోటి మాహు ర్మనీషిణః శతం కోటి సహస్రాణాం శంఖ ఇ త్యభిధీయతే శతం శంఖసహస్రాణాం మహాశంఖ ఇతి స్మృతః మహాశంఖసహస్రాణాం శతం బృంద మితి స్మృతం శతం బృందసహస్రాణాం మహాబృంద మితి స్మృతమ్. మహాబృందసహస్రాణాం శతం పద్మ మితి స్మృతం. శతం పద్మ సహస్రాణాం శతం ఖర్వ

మిహోచ్యతే శతం ఖర్వసహస్రాణాం మహాఖర్వ మితి స్మృతం. మహా ఖర్వ సహస్రాణాం సముద్ర మభిధీయతే శతం సముద్రసాహస్రం మోఘ ఇ త్యభిధీయతే శత మోఘసహస్రాణాం మహౌఘ ఇతి విసృతః– నూరు శతసహస్రములు (అనగా మూరు లక్షలు) కోటి అగును. అట్లే నూరు కోటిసహస్రములు శంఖమగును. నూరు శంఖసహస్రములు మహాశంఖమగును. నూరు మహాశంఖసహస్రములు బృంద మనబడును. నూరు బృందసహస్రములు మహాబృంద మనబడును. నూరు మహా బృందసహస్రములు పద్మ మనబడును. నూరు పద్మసహస్రములు మహా పద్మ మనబడును. నూరు మహాపద్మసహస్రములు ఖర్వ మనబడును. నూరు ఖర్వసహస్రములు మహాఖర్వ మనబడును. వేయు మహాఖర్వ ములు సముద్ర మనబడును. నూరు సముద్రసహస్రములు ఓఘ మగును. నూరు ఓఘ సహస్రములు మహౌఘ మనబడును.

వానరసైన్యములో సైనికులు వేయికోట్లు, నూరు శంఖములు, వేయి మహాశంఖములు, నూరు బృందములు, వేయి మహాబృందములు, నూరు పద్మములు, వేయి మహాపద్మములు, నూరు పర్వతములు, నూరు సముద్రములు ఒక మహౌఘముగా నున్నారు. మొత్తము వానర సైన్యము కోటి మహౌఘములు.

ఇంతవరకు వానరసైన్యమును వర్ణించి రాముని వాస్తవస్వరూప మును బోధచేయుచున్నాడు.

రామో న మానుషః సాక్షా దాదినారాయణః పరః
సీతా సాక్షాజ్జగద్ధాత్రీచిచ్ఛక్తి ర్జగదాత్మికా
తాభ్యా మేవ సముత్పన్నం జగత్ స్థావరజంగమమ్॥

రావణా! శ్రీరాముడు నీవనుకొనునట్లు సామాన్యమానవుడు గాడు. అతడు ఈ సర్వజగత్తుకంటె పరుడైన సాక్షా దాదినారాయ ణుడు. సీత ఈ జగద్భారమునంతను ధరించునదియు, జగత్తుగా పరిణ మించునదియు అగు చిచ్ఛక్తి. అనగా నారాయణునియందలి మహా మాయ యని భావము. ఆ సీతారాముల వాస్తవస్వరూపములనుండి ఈ సృష్టిస్థితిలయములు జరుగుచున్నవి.

తస్మా ద్రామ శ్చ సీతా చ జగత స్తస్థుష శ్చ తౌ
పితరౌ పృథివీపాల తయో ర్వైరీ కథం భవేత్
అజానతా త్వయా సీతా జగన్మా తైవ జానకీ॥

మాయామానారాయణస్వరూపులగుటచే సీతారాములు స్థావర జంగమాత్మకమయిన జగత్తున కంతకును తలిదండ్రులవంటివారు. అట్టి వారితో నీకు విరోధమేల? సీతారాముల యథార్థస్వరూపజ్ఞానము లేకపోవుటచే నీవు జగన్మాత యగు జానకి నపహరించుకొని వచ్చితివి.

క్షణనాశిని సంసారే శరీరే క్షణభంగురే
పంచభూతాత్మకే రాజ న్ పంచవింశతితత్త్వ కే॥

ఈసంసారము క్షణములో నశించునది. అట్లే శరీరముకూడ క్షణములో భగ్నమై నశించునది. ఈశరీరము సంసారముకూడ పంచ భూతాత్మకము. పంచవింశతితత్త్వాత్మకమును పృథివ్యప్తేజోవాయురాకాశములు పంచభూతములు. ఈపంచభూతములు పంచతన్మాత్రలు (సూక్ష్మ పంచభూతములు) పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, మనస్సు అహంకారబుద్ధి, మహత్తత్త్వము, మూలప్రకృతి- ఇవి పంచ వింశతితత్త్వములు.

మలమూత్రాంసాస్థిదుర్గంధభూయిష్ఠే ఽహంకృతాలయే
కే వా ఽఽస్థావ్యతిరిక్తస్య కాయే తవ జడాత్మకే॥

నీయొక్క ఈశరీరము మలము, మాంసము, అస్థులు, దుర్గం ధము మొదలగు అసహ్యపదార్థములతో కూడియున్నది. మీదు మిక్కిలి అహంకారమునకు నివాసస్థానమయినది. చైతన్యరహితమయి నచో మనజాలని జడపదార్థము. అట్టి దీనిపై నీకింత మమకార మెందు లకు?

యత్కృతే బ్రహ్మహత్యాదిపాతకాని కృతాని తే
భోగభోక్తా తయో దేహాః స దేహో ఽత్ర పతిష్యతి॥

ఏ దేహమును సుఖింపజేయుటకై నీవు బ్రహ్మహత్య మొదలగు అనేక పాపకార్యముల నొనరించితివో ఆభోగానుభవసమర్థమగు శరీరము ఈలోకమునసే నాశనము నందగలదు. మానవుడు శరీరమే 'తాను' అనుకొని దానిని సుఖపెట్టుటకై అనేకములగు పాపకృత్యముల నొనరించును. కాని దేహదార్ఢ్యము సడలిపోగానే దాని భోగశక్తి తగ్గిపోవును. అంతేగాక చివరకు జీవుడు ఉత్క్రమణ మొనరింపగా జడమగుటచే అది నశించిపోవును. ఈ వాస్తవము నెరుగక అజ్ఞాని శరీర సుఖములకై ప్రయత్న మొనరించును.

పుణ్యాపాపే సహాయాతే జీవేన సుఖదుఃఖయోః
కారణే దేహ మోగాదినాత్మనః కురుతే ఽనిశమ ॥

పుణ్యాపాపాత్మకములగు కర్మలు సుఖదుఃఖ కారకములు. అవి జీవునితో కూడుకొని దేహముతో గలసి యున్నవగుటచే ఆత్మకు నిత్యము సుఖదుఃఖములను కల్గించును.

వాస్తవమునకు జీవుడు పరమాత్మయొక్క అంశ. కాని అతడు జడమగు దేహముతో కలసియుండుటచే సుఖదుఃఖ కారకములగు పుణ్యపాపకర్మల నాచరించుచు సంసారబంధమున చిక్కుకొనియుండును. సుఖదుఃఖముల ననుభవించుచున్నందువల్ల మోక్షము లభ్యమగుట లేదు.

యావద్దేహో ఒస్మి కర్తా ఒస్మీ త్యాత్మా హంకురుతో ఒవశః
అధ్యాసాత్ తావ దేవ స్యా జ్జన్మనాశాదిసంభవః ॥

జీవాత్మ భ్రమవశమున ఈదేహమే నేను, ఈక్రియల నొనరించిన కర్తను నేను అని అహంకారమునకు వశమై ప్రవర్తించునో అంత వరకు జననమరణాదులు తప్పవు. మానవుడు జగన్మిథ్యాభావమును అనుభవపూర్వకముగా గ్రహించి తనచే చేయబడు కర్మలకు కర్తృత్వమును తనపై ఆపాదించుకొనకుండా ఉన్నచో కర్మచే బంధితుడుకాడని భావము. దేహాదులయందలి అభిమానమే జన్మాదులకు కారణము.

తస్మా త్త్వం త్యజ దేహాదా వభిమానం మహామతే
ఆత్మా హీ నిర్మలః శుద్ధో విజ్ఞానాత్మా ఽచలో ఽవ్యయః
స్వాజ్ఞానవశతో బంధం ప్రతిపద్య విముహ్యతి ॥

మహత్తరమగు బుద్ధివైభవముగల నీవు దేహము, సుఖదుఃఖములు మొదలగువాటియందు అభిమానమును పరిత్యజించుము. అభిమానమును త్యజించగనే నిర్మలము, పరిశుద్ధము అగు ఆత్మజ్ఞానము కలుగును. పరమాత్మ విజ్ఞానస్వరూపుడు. చలనాదిక్రియలు లేనివాడు. నాశనరహితుడు. అట్టి పరమాత్మను అనుభవపూర్వకముగా గ్రహించజాలక మానవుడు అజ్ఞానవశవర్తియై కర్మబంధమున తగులుకొనును. దేహాద్యభిమానమే కర్మబంధమునకు కారణము. కర్మఫలానుభవమను జాలమందు చిక్కుకొనినవాడు విమోహితుడగునేగాని విముక్తిని బడయజాలడు.

తస్మా త్త్వం శుద్ధభావేన జ్ఞాత్వా ఽత్మానం సదా స్మర
విరతిం భజ సర్వత్ర పుత్రదారగృహాదిషు
నిరయే ష్వపి భోగ స్యా చ్ఛ్వశూకరతనా వపి ॥

కనుక నీవు పరశుద్ధభావముతో విజ్ఞానస్వరూపుడగు పరమాత్మను స్మరింపుము. దానికి ముఖ్యసాధనము విరతి. అనగా పుత్రులు, భార్య, గృహము మొదలగు భోగ్యవస్తువులందు విరక్తిని ప్రకటింపవలెను. అయిన జీవులకు తమతమ జాతుల ననుసరించి సుఖతృప్తి కలుగుగదా అట్టిచో ఈతృప్తిని వదలి విరతినెట్లు స్వీకరించగలవనిచో సమాధానము నిచ్చుచున్నాడు. నరకతుల్యములగు ప్రేతభూతాది జన్మలకుకలుగు సుఖమును పంది, కుక్క మొదలగు యోనులయందు జన్మించిన జీవులకు కలుగు సుఖమును మానవాది యోనులందు జన్మించిన జీవులకు కలుగు సుఖమును ఒక్కటేగాని భేదమేమియులేదు. కనుక నరకతుల్యములు, జుగుప్సానహములు అగు విషయములందు విరక్తిని కలిగియుండుటే ఉత్తమము.

దేహం లబ్ధ్వా వివేకాఢ్యం ద్విజత్వం చ విశేషతః
తత్రాపి భారతే వర్షే కర్మభూవకా సుదుర్లభమ్
కో విద్వా నాత్మసాత్కృత్వా దేహం భోగానుగో భవేత్ ॥

సమస్త జీవరాసుల దేహములలోను మానవదేహము అతి వివేకసలపన్నమయినది. అందునను ద్విజుడుగా జన్మించుట ఒక విశేషము. ఆ శరీరమున్ను కర్మభూమియగు భారతవర్షమున జన్మించుట చుర్లభమగు మరియొక పుణ్యవిశేషము. ఇట్టి దేహమునుపొందిన వివేకశీలి యెవ్వడును తనవశమందున్న శరీరమును భోగనశవర్తినిచేయుటకు ఇచ్ఛగించడు.

అత స్త్వం బ్రాహ్మణో భూత్వా పౌలస్త్యతనయ శ్చ సన్
అజ్ఞా నీన సదా భోగా ననుధావసి కిం ముధా ॥

నీకు పైనజెప్పిన ఉత్తమ విశేషములన్నియు సరిపడుచున్నవి. మీరుమిక్కిలి బ్రహ్మయొక్క వంశమున జనించినావు. పులస్త్య ప్రజాపతితనయుడైన విశ్రవసుని పుత్రుడవు. స్వయముగా మహత్తరమగు తపశ్చర్య సలిపినవాడవు. అట్టి నీవు అజ్ఞానివలె భోగములవెనుక పడితివేమి ?

ఇతఃపరం వా త్యక్త్వా త్వం సర్వసంగం సమాశ్రయ
రామ మేవ పరాత్మానం భక్తిభావేన సర్వదా ॥

కనుక ఇకమీదటనయినా నీవు ఈ విషయపరతంత్రతను త్యజించి పరాత్పరుడగు రాముని ఆశ్రయించి శేషజీవితమును భక్తి ప్రపత్తులతో పవిత్రముగా గడుపుకొనుము.

సీతాం సమర్ప్య రామాయ తత్పాదానుచరో భవ
విముక్తః సర్వపాపేభ్యో విష్ణులోకం ప్రయాస్యసి ॥

నీవు జానకిని రామునకు సమర్పించి అతని పాదపద్మములను సేవించుకొనుము. అట్లు చేసినచో సమస్తపాపములనుండి విముక్తినంది విష్ణులోకమును పొందగలవు.

నో చేత్ గమిష్యసే ఽనిరోధః పునరావృత్తివర్జితః
ఆంగీకురుష్వ మద్వాక్యం హిత మేవ వదామి తే ॥

అట్లు ఆచరింపకపోయినచో నీపాపములకు నిష్కృతి లేదు. నీవు పునర్జన్మహీనమయిన ఘోరములగు అధోలోకములను పొందగలవు. నేను నీహితమును వాంఛించు మంత్రినగుటచే ఈ ఉపదేశము నొసరించుచున్నాను. నా ఉపదేశము నంగీకరించుము.

సత్సంగతిం కురు భజస్వ హరిం శరణ్యం
శ్రీరాఘవం మరకతోపలకాంతికాంతం
సీతాసమేత మనిశం ధృతచాపబాణం
సుగ్రీవలక్ష్మణవిభీషణసేవితాంఘ్రిమ్ ॥

దుర్జనసాంగత్యమును పరిత్యజించి సత్పురుషులను సేవించుము. నీలమణి వినీలకాంతి శరీరుడయిన శ్రీరాముని సర్వలోకశరణ్యుడగు ఆదినారాయణునిగా తెలుసుకొని భజించుము. నిత్యము సీతాదేవితో కూడుకొని, శరచాపములను ధరించి సుగ్రీవుడు, లక్ష్మణుడు, విభీషణుడు మొదలగు పరమభక్తాగ్రేసరులచే పూజింపబడు పాదపద్మములు గల శ్రీరామునే హృదయమున ధ్యానించుము.

పంచమసర్గ

శ్రీ మహాదేవఉవాచ :—

శ్రుత్వా శుకముఖోద్గీతం వాక్య మజ్ఞాననాశనమ్
రావణః క్రోధతామ్రాక్షో దహన్నివత మబ్రవీత్ ॥

అజ్ఞానమును నశింపజేసి రామతత్త్వమును ప్రకటించు శుక ముఖోద్గతమయిన తత్త్వోపదేశమును విని రావణుడు క్రోధమును పట్ట లేకపోయెను. అతడు ఒక్క-సారిగ నేత్రములను క్రోధశక్తిమయతేముల నొనర్చి, తీక్ష్ణముగా శుకునిచూచి ఇట్లు పలికెను.

అనుజేవ్య సుమర్యద్ధే గురువ ద్భాషసే కథమ్
శాశితా ఽహం త్రిజగతాం త్వం మాం శిక్ష న్న లజ్జసే ॥

దుర్మతీ ! నీవు సేవకుడవైయుండియు గురువువలె ఉపదేశ మొన ర్చుచుంటివి. త్రిలోకములను జయించి పరిపాలించు నాకు ఉపదేశ మొనర్చు నీకు సిగ్గులేదా ?

ఇదానీ మేవ హన్మి త్వాం కిం తు పూర్వకృతం తవ
స్మరామి తే న రక్షామి త్వాం యద్యపి వధోచితమ్ ॥

ఇట్లు సేవకుని నియమితములయిన హద్దులను మీరి నాకు ఉప దేశమొనర్చు నిన్ను తత్క్షణమే వధించి యుండువాడను. కాని నీవు పూర్వము నాకొనర్చిన సేవలను తలచి వధోచితుడవను నిన్ను క్షమిం చుచున్నాను.

ఇతో గచ్ఛ విమూఢత్వ మే [illegible] తుం న మేక్షమం
మహాప్రసాద ఇత్యుక్త్వా వేపమానో గృహం యయౌ ॥

మూర్ఖా ! నీవు నాయెదుటనుండి వెంటనే వెడలిపొమ్ము. నీవి ప్పుడు పలికినవాక్యములు వినదగినవిగావు. అని రావణుడు శుకుని నిందించగా అతడు మహాప్రసాదమని పలికి ప్రాణభీతిచే స్వగృహమున కేగెను.

శుకుడు రాక్షసుడయ్యాను రావణునకు గాయత్వము నుపదేశించుటకు కారణమును తెలుపుచున్నాడు.

శుకో ఽపి బ్రాహ్మణః పూర్వం బ్రహ్మిష్ఠో బ్రహ్మవిత్తమః
వానప్రస్థవిధానేన వనే తిష్ఠన్ స్వకర్మకృత్ ॥

శుకుడు పూర్వజన్మమున బ్రాహ్మణుడు. బ్రహ్మనిష్ఠాగరిష్ఠుడు. బ్రహ్మవేత్తలలో ఉత్తమవర్గమునకు చెందినవాడు. అతడు తనభార్యతో గలిసి వనమందు నివసించుచు వానప్రస్థాశ్రమవిధులను యోగ్యముగా నిర్వర్తించుకొనువాడు.

దేవానా మభివృద్ధ్యర్థం వినాశాయ సురద్విషాం
చకార యజ్ఞవితతి మవిచ్ఛిన్నాం మహామతిః ॥

అతడు వానప్రస్థుడై దేవతలకు అభ్యుదయము కలుగునట్లుగాను, దేవద్వేషులగు దైత్య దానవరాక్షసులకు అనభ్యుదయము కలుగునట్లు గాను అనేకములగు యజ్ఞములను అవిచ్ఛిన్నముగా అనేకవత్సరములు సాగించెను.

రాక్షసానాం విరోధో ఽభూ చ్ఛుకో దేవహితోద్యతః
వజ్రదంష్ట్ర ఇతి ఖ్యాత స్తత్రైకో రాక్షసో మహాన్ ॥

ఇట్లు మహత్తరములగు యజ్ఞకర్మాచరణద్వారా శుకుడు దేవతలకు హితము నొనరించువాడు కాగా రాక్షసులకు అతడు విరోధియయ్యెను. వజ్రదంష్ట్రుడను ఒకరాక్షసుడు ఈవిషయమును చక్కగా కన్గొనెను.

అంతరం ప్రేప్సు రాతిష్ఠ చ్ఛుకాపకరణోద్యతః
తదా చి దాగతో ఽగస్త్య స్తస్యాశ్రమపదం మునేః ॥

వజ్రదంష్ట్రుడు ఏవిధముగనయినను శుకునికి అపకారము నొనర్చవలెనని రంధ్రాన్వేషణ మొనర్చుచుండెను. ఇంతలో సర్వమునిశ్రేష్ఠుడయిన అగస్త్యమహాముని శుకమునియొక్క ఆశ్రమపదమునకు అతిథిగా ఏతెంచెను.

తేన సంపూజితో ఒగస్త్యో భోజనార్థం నిమంత్రితః
గతే స్నాతుం మునౌ కుంభసంభవే ప్రాప్య చాంతరం ॥

అతిథిగావచ్చిన అగస్త్యమహాముని నిని శుకుడు యథావిధిగా పూజించి భోజనమునకై నిమంత్రించెను. మునికూడ అంగీకరించెను. అంతట కుంభసంభవుడు స్నానార్థమై నదికిపోగా వజ్రదంష్ట్రి డాసమ యమును కనిపెట్టెను.

అగస్త్య రూపధృక్ సో ఒపి రాక్షసః శుక మబ్రవీత్
యది దాస్యసి మే బ్రహ్మన్ ! భోజనం దేహి సామిషమ్ ॥

వజ్రదంష్ట్రిడు అగస్త్యమహాముని రూపమును ధరించి శుకునితో ఇట్లనెను– మునీ ! నాకు భోజనమునిపెట్టుట నీకిష్టమయినచో నాకు మాంససహితమయిన భోజనమును పెట్టుము.

బహుకాలం న భుక్తం మే మాంసం భాగాంగసంభవమ్
తధేతి కారయామాస మాంసభోజ్యం సవిస్తరమ్ ॥

నేను మేకమాంసమును భుజించి చాలకాలమయినది. కనుక నా కామాంసమును వండింపుము. దాని నంగీకరించి శుకమహర్షియు చాలమాంసమును వండించెను.

ఉపవిష్టే మునౌ భోక్తుం రాక్షసో ఒతీవసుందరమ్
శుకభార్యానపు ర్ధృశ్యా తాం చాంతర్హోయ ఖిలః ॥

అగస్త్యమహాముని భోజనమునకు ఉపవిష్టుడుకాగా వజ్రదంష్ట్రిడు సుందరియగు శుకపత్నియొక్క శరీరమున ప్రవేశించి ఆమెను కర్తవ్యాకర్తవ్య వివేకహీన నొనరించివేసెను.

నరమాంసం దదౌ తస్మై సుపక్వం బహువిస్తరమ్
దత్వా పాత్రస్థధారక్షీ త్తతో దృష్ట్వా చుకోప సః ॥

శుకపత్నియందు ప్రవేశించిన రాక్షసుడు అగస్త్యమునియొక్క భోజనపాత్రయందు భాగుగావండిన నరమాంసమును అత్యధికముగా వడ్డించి, వెంటనే ఆమెను విడిచి అంతర్ధానము నందెను. తనపాత్ర

యందలి నరమాంసమును చూచి అగస్త్యమహర్షి క్రోధాంధహృదయుడయ్యెను.

ఆమేధ్యం మానుషం మాంస మగస్త్యాః శుక మబ్రవీత్
అభక్ష్యం మానుషం మాంసం దత్తవా నసి మర్మతే
మన్యాంత్వం రాక్షసోభూ త్వాతిష్ఠత్వం మానుషాశనః ॥

యజ్ఞాది పుణ్యకర్మలయందును భోజనాదులయందును కూడ నిషేధింపబడిన మనుష్యమాంసమును తన భోజనపాత్రయందుచూచి అగస్త్యుడు శుకునితో ఇట్లనెను. మర్మతీ! తినకూడని మనుష్యమాంసమును నాకు వడ్డించితివి. కనుక నీవు రాక్షసుడవై మనుష్యులను తినుచు జీవితమును గడుపుదువుగాక!

ఇతి శప్తః పురా భీత్యా ప్రాహాగస్త్యం మునే త్వయా
ఇదానీం భాషితం మే ఽద్య మాంసం దే హేతి విస్తరమ్
తత్రైవ దత్తం మే దేవ! కిం మే శాపం ప్రదాస్యసి ॥

శుకుడు ఇట్లు అగస్త్యమునిచే శపింపబడి భయభీతుడై అగస్త్యునితో ఇట్లనెను. "మునీ! ఇప్పుడేకదా నీవు మాంసమును వండించి పెట్టుమని నాతో చెప్పితివి. నేను అట్లే నీయాజ్ఞను పాలించితిని. అట్టిచో నన్ను వృథాగా ఏలశపించుచున్నావు?"

శ్రుత్వా శుకస్య వచనం ముహూర్తం ధ్యాన మాస్థితః
జ్ఞాత్వా రక్షఃకృతం సర్వం తతః ప్రాహ శుకం సుధీః ॥

శుకుని ఈ ప్రార్థనావాక్యములనువిని అగస్త్యమహర్షి ఒక్క ముహూర్తకాలము ధ్యాననిమగ్నుడయ్యెను. అతడు దివ్యదృష్టిచే వజ్రదంష్ట్ర రాక్షసుడొనర్చిన మాయాకృత్యమునంతను అవగతమొనర్చుకొని మహర్షి ఇట్లనెను.

తవాపకారిణా సర్వం రాక్షసేన కృతం త్విదమ్
అవిచార్యైవ మే దత్తః శాప స్తే మునిసత్తమ
తథా ఽపి మే వచో ఽమోఘ మేవ మేనం భవిష్యతి ॥

ఈ కార్యమంతయు నీకు చిరకాలమునుండి అపకారమును తల పెట్టుచున్న రాక్షసునిచే జరిగినది. ఇందు నీ తప్పేమియునులేదు. నేను ఆలోచించకుండగనే నిన్ను ఘోరమగు శాపమునకు పాల్పడజేసితిని. అయినను నావచన మమోఘము. అది వెనుదిరగజాలదు. నీవు రాక్ష సుడవయితీరుదువు. అయినను దానికి మోక్షమును ప్రసాదించెదను వినుము.

రాక్షసం వపు రాస్థాయ రావణస్య సహాయకృత్
తిష్ఠ తీవ ద్యదా రామో దశాననవధాయ హి
అగమిష్యతి లంకాయాం సమీపం హానరైః సహ ॥

నీవు రాక్షసశరీరమును ధరించి లంకానగరచక్రవర్తియగు రావ ణునకు సహాయుడవుగా నుండుము. రాముడు దశాననుని వధించుటకు వానరులతోగూడి లంకపైకి దండెత్తివచ్చువరకు నీవు అక్కడనే ఉండుము.

ప్రేషితో రావణేన త్వం చారో భూత్వా రఘూత్తమమ్
దృష్ట్వా శాపా ద్వినిర్ముక్తో బోధయిత్వా చ రావణమ్
తత్త్వజ్ఞానం తతో ముక్తః పరం పద మవాప్స్యసి ॥

ఆసమయమున రావణుడు నిన్ను వానరసైన్యపరిశీలనకు చాపు డుగా నియోగించును. నీవాసమయమున శ్రీరామచంద్రుని దర్శింపగనే శాపవిముక్తుడవగుదువు. అంతట రావణునకు తత్త్వజ్ఞానమును బోధించి ముక్తుడవై పరమపదమును పొందగలవు.

ఇత్యుక్తో ఽగస్త్య మునినా శుకో బ్రాహ్మణసత్తమః
బభూవ రాక్షసః సద్యో రావణం ప్రాప్య సంస్థితః ॥

ఇట్లు అగస్త్యముని శాపమోక్షణమును విధించగనే బ్రాహ్మ ణోత్తముడగు శుకుడు రాక్షసరూపధరుడయ్యెను. అతడు రావణుని చేరి అతని సేవించుచు బహుకాలముండెను.

ఇదానీం చారరూపేణ దృష్ట్వా రామం సహానుజం
రావణం తత్త్వవిజ్ఞానం బోధయిత్వా పున ర్ధృతమ్
పూర్వవద్బ్రాహ్మణో భూత్వా స్థితో వైభీషణైః సహ ॥

ఇంతకాలమునకు అతడు చారరూపుడై రామలక్ష్మణులను దర్శించి శాపవిముక్తుడయ్యెను. తరువాత రావణునకు శ్రీరామతత్త్వము నుపదేశించి అతిశీఘ్రముగా పూర్వమువలెనే బ్రహ్మజ్ఞానియగు బ్రాహ్మణుడుగా మారి వైఖానసులతో గలిసి నివసించెను.

వాల్మీకిరామాయణమున శుకునితోబాటు సారణుడను చారుడు కూడ ఉన్నాడు. వానరబలకథనము వారిద్దరూ చేసినట్లు అందువర్ణింపబడినది. శుకుని పూర్వజన్మవృత్తాంతము వాల్మీకమున కానరాదు. తత్త్వోపదేశమును లేదు. శత్రుసైన్యోత్కర్షను వర్ణించి నంతకే రావణుడు మండిపడి వారిని తన ఎదుటినుండి పంపివేయును. తరువాత శార్దూలాది చారులను రావించి వానరసైన్యములలోనికే పంపినాడు. శార్దూలుడు వానరులచే బంధితుడై రాముని చే విడువబడి తిరిగివచ్చి వానరసైన్యములో చారకర్మ అసంభవమని రావణునకు విన్నవించినాడు. ఆపైన రావణుడు మంత్రులను రావించి వారితో కొంతసేపు మంత్రించి స్వగృహమున కేగును. అక్కడ విద్యుజ్జిహ్వుడను మాయావిశారదుని రావించి రాక్షసమాయాద్వారా సీతను లోబరచుకొనుటకు పథకమును వేసినాడు. రావణుడు అశోకవనమున సీతవద్దకువచ్చి ఇట్లనును. "నావచనముల ననాదరించి నీవే రాముని కై పరితపించుచుంటివో ఆఖర నాశకుడగు రాముడు యుద్ధమున చంపబడినాడు. నీగర్వము దీనితో సమూలముగా విచ్ఛిత్తినందినది. ఇక చచ్చినవానిని విడలి నాపై మనస్సును మరల్పుము. నా భార్యలకందరకు అధీశ్వరివగుము. నీవు స్వల్పపుణ్యురాలవగుటచే ఇంతవరకు సుఖమును కోల్పోలేవి. నీభర్త వధింపబడిన ప్రకారమును వర్ణించెదను వినుము. రాముడు నన్ను వధించుటకై వానరబలముతోగూడ సముద్రమువరకు వచ్చినాడుగదా! సముద్రోత్తరతీరమున అతడు దండు విడిసినాడు. అంతట రాత్రి కాగా మార్గపరిశ్రాంతమయిన సైన్యముతోబాటు రామాదులును నిద్రించినారు. ఈవిషయమును మా చారులచే తెలిసికొని నేను ప్రహస్తుడు సేనానిగా సైన్యముల నంపితిని. వివిధాయుధధారులగువారు నిద్రించు

చున్న వానరుల ననేకులను వధించిరి. ప్రహస్తుడు నిద్రించుచున్న రాముని కంఠమును తన ఖడ్గమున కెరగావించెను. విభీషణుడు నిద్ర నుండి మేల్కొనగనే బంధితుడయినాడు. లక్ష్మణుడు కోతులతోగలిసి తోచినదిక్కుకు పారిపోయినాడు. సుగ్రీవుడు ప్రేవాహీను డయినాడు. హనుమంతుడు నిరస్తహనుడై మృత్యువాత బడినాడు. అగ్లే జాంబవంతుడు, మైందవిదులు, అంగదుడు, కుముదుడు. పనసుడు మొదలగు ఋక్షవానరులు వధింపబడినారు. కొందరు యిచ్చవచ్చిన దిక్కుకు పారిపోయినారు. కొందరు సముద్రమునబడి మరణించినారు. నీభర్తను జంపి నాసైనికులు రక్తముతో తడిసి ధూళిలో పొర్లిన అతని శిరమును దెచ్చినాము." ఇట్లు పలికి రావణుడు ఒక రాక్షసికి "రాముని శిరముతో గూడ విద్యుజ్జిహ్వాని తీసుకొని ర"మ్మని ఆజ్ఞ నిచ్చినాడు. విద్యుజ్జిహ్వుడు రాముని శిరమును, చాపమును మాయానిర్మితము లొనర్చి వాటితో ప్రవేశించి రావణుని ఆజ్ఞప్రకారము మాయా శిరచాపములను సీతయెదుట నుంచినాడు. రావణుడు చాపమును చేతితో తీసికొని. "చూడు, నీ రాముని చాపమును రాత్రి ప్రహస్తుడు తెచ్చినాడు" అని సీత యెదుట నుంచినాడు.

సీత రావణుని ఈమాయను నిజమని భావించినది. మాయా శిరచాపములు వాస్తవములగు శిరచాపములుగానే ఉన్నవి. ఆమెదుఃఖమును పట్టలేక ఆక్రోశించినది. "కైకేయీ ! నీకోరిక నెరవేరినదనినది. మూర్ఛితురాలై కొంతసేపటికి మేల్కొని ఆశిరమును స్పృశించి అక్రోశించ నారంభించినది. "వీరవ్రతానుష్ఠానపరుడవగు రామా ! నేను విధవనై పశ్చిమావస్థ నందితిని. (పశ్చిమావస్థ అనగా చుర్గతి) భర్త మొదట మరణించినచో అది భార్యయొక్క దోషఫలమని చెప్పుదురు. కాని నీవు సుచరితుడవు. నేను సుచరితను. అట్టిచో నాకు ముందుగనే నీవు మరణించుట ఎట్లు సంభవించినది. నీతో వనమునకు వచ్చి రావణునిచే అపహరింపబడి శోకనిమగ్నను కాగా నన్ను రక్షించుటకు వచ్చి నీవు నిహతుడవయితివి. నా అత్త కౌసల్య నీవంటి పుత్రునిచే

దూడలేని ఆవుగా చేయబడినది. మహర్షు లనేకులు నీవు దీర్ఘాయువు వగుదువని ఆదేశించిరి. కాని అల్పాయుష్కుడవగు నీవు వారిమాటలను అన్యథ మొనర్చితివి....." ఇదేవిధముగా జానకి మిక్కిలి దుఃఖించి నది. రావణునితో "ఈ శిరమును మొండెమునకు జతపరచి ఇమ్ము. అహగమించెద" నన్నది. ఇంతలో ఆస్థలమునకు ఒక చారుడు వచ్చి మంత్రులు నీకై వేచియున్నారని రావణునకు నివేదించెను. రావణుడు ఆ స్థలమును వదలి వెళ్ళిపోయెను. రావణుడు వెళ్ళగనే రాముని శిర చాపములు అంతర్ధానమునందినవి.

ఇంతలో దుఃఖపరవశయైయున్న జానకిని విభీషణపత్నియగు సరమ అను నామె ఊరడించినది. ఆమె ఇదియంతయు నిన్ను మభ్య పెట్టుటకు రావణుని పన్నాగమని నచ్చజెప్పినడ. మరియు రాముడు సముద్రముపై సేతువును నిర్మించి లంకలో ప్రవేశించినాడనియు, యుద్ధ మునకు తీవ్రసన్నాహములు జరుగుచున్నవనియు వార్త నందించినది. నిద్రించు రాముని వధించుట రాక్షసులకు శక్యముకాదని ఆమె నచ్చ జెప్పినది. తరువాత సరమ సీతయొక్క ఆదేశము ననుసరించి రావణుని ప్రయత్నములను తెలుసుకొనివచ్చి సీతకు నివేదించినది.

ఆ తరువాత మాల్యవంతుడు రావణునకు సీతాసంప్రదాన ముత్తమమని బోధించినట్లు వాల్మీకము.

తతః సమాగమత్ వృద్ధో మాల్యవాన్ రాక్షసో మహాన్
బుద్ధిమాన్ నీతినిపుణో రాజ్ఞో మాతుః ప్రియః పితా॥

చారుడగు శుకుని నిందించి పంపిన అనంతరము మాల్యవంతుడను వృద్ధరాక్షసుడు రావణుని చూడవచ్చెను. మాల్యవంతుడు తనయౌవన కాలమున మహావీరుడు. రాజనీతిజ్ఞుడు. రావణుని తల్లియగు కైకసికి పెదతండ్రి.

ప్రాహ తం రాక్షసం వీరం ప్రశాంతే నాంతరాత్మనా
శృణు రాజన్ వచో మే ఽద్య శ్రుత్వా కురు యదేప్సితం॥

మాల్యవంతుడు నిర్మలమగు చిత్తముతో వీపుడగు రావణున కిట్లు బోధించెను– రాజా ! నేను నీ కొకమాట చెప్ప వచ్చితిని. దానిని పూర్తిగా వినిన అనంతరము వివేకము నుపయోగించి ఇచ్ఛవచ్చినట్లు చేయుము.

యదా ప్రభృత్తా నగరీం జానకీ రామవల్లభా
తదాది పుర్యాం దృశ్యంతే నిమిత్తాని నిశానన
ఘోరాణి నాశహేతూని తాని మే వదతః శృణు॥

దశాననా ! జానకి రాముని ప్రాణసమాన. ఆమెను నీవు అపహరించుకొని వచ్చి లంకానగరమున నుంచినదగ్గరనుండి మననగరమున అనేకములగు దుర్నిమిత్తములు పొడగట్టుచున్నవి. అవి అత్యంతభయంకరములూ, నాశనసూచకములుగానూ ఉన్నవి. వాటిని వివరించెదను వినుము.

ఖరా స్తనితనిర్ఘోషా మేఘా అశివభయంకరాః
శోణితే నాభివర్షంతి లంకా ముద్దిశ్య సర్వదా॥

నీవు సీతను తెచ్చిననాటినుండియు అత్యంతభయావహములగు మేఘములు అతికఠోరముగా గర్జించుచు, [illegible] వర్షించుచున్నవి.

గుదంతి దేవలింగాని స్వేదన్తి ప్రచలంతి చ
కాలికా పాండురై ర్దంతై ప్రహస న్నగ్రతో స్థితా॥

పసుపు పూజించు దేవప్రతిమలు చెమర్చుచున్నవి. అనిస్థానభ్రష్టము లగుచున్నవి. ప్రతి లంకానగరపౌరుని ఎదుటను కాళికాదేవి నిలబడి పాండురవర్ణముగల దంతములు వెలికి గనబడునట్లు వికటాట్టహాసము చేయుచున్నది.

ఖరా గోషు ప్రజాయంతే మూషకా నకులై స్సహా
మార్జారేణ తు యుధ్యంతే పన్నగా గరుడేన తు॥

మన నగరమున గోగర్భమునందుండి గాడిదపిల్లలు పుట్టుచున్నవి. ఏలుకలు ముంగిసముతోనూ, పిల్లులతోడను యుద్ధమొనర్చుచున్నవి.

సర్వములు గ్రద్దలతో పోల్చబడుచున్నవి. సర్వభూత వ్యవహారములలోను విపర్యాస మొచ్చినదని భావము.

కరాలో వికటో ముండః పురుషః కృష్ణపింగలః
కాలో గృహ్ణాతి సర్వేషాం కాలే కాలే త్వవేక్షతే॥

సర్వ జీవనాశకుడగు కాలపురుషుడు భయంకరమగు రూపమును ధరించి వికటాట్టహాస మొనరుచు లంకానగరమందలి ప్రతిగృహమునకును పోయి ప్రతి విశేషకాలములందును తొంగిచూచుచున్నాడు. ఆ కాలపురుషుని శిరము ముండితమై యుండును. శరీరవర్ణము కృష్ణ పింగళము.

ఏతా న్యన్యాని దృశ్యంతే నిమిత్తా న్యుద్భవంతి చ
అతః కులస్య రక్షార్థం శాంతిం కురు దశాసన
సీతాం సత్కృత్య సదనాం రామా యాశు ప్రయచ్ఛభోః॥

ఇంతేగాక ఇంకను అనేకములగు దుర్నిమిత్తలు పుట్టుచున్నవి. ఇవి కులక్షయమును, జాతిక్షయమును సూచించు దుర్నిమిత్తములు. కనుక రాక్షసకులరక్షణార్థమై మనస్సును సమాధానపరచుకొని శాంతి వహింపుము. సీతను యథార్హముగ సత్కరించి కానుకలతోగూడ శ్రీరామునకు సమర్పించినచో రాబోవు అనర్థము తప్పిపోగలదు.

రామం నారాయణం విద్ధి విద్వేషం త్యజ రాఘవే
యత్పాదపోత మాశ్రిత్య జ్ఞానినో భవ సాగరమ్
తరంతి భక్తిపూతాత్మా తత్తో రామో న మానుషః॥

నీ కొకరహస్యమును చెప్పెదను గ్రహించుము. రాముడు సామాన్యమానవుడు గాడు. అతడు సాక్షాన్నారాయణుడు. ఆకారణమున అతనిపై ద్వేషమును కట్టిపెట్టుము. అతనిపాదమను నావను ఆశ్రయించి జ్ఞానులు సంసారమను మహాసాగరమును తరించుదురు. తద్భక్తిచే పరమపవిత్రమగు ఆత్మగలవారగుదురు. కనుక నీవును జ్ఞానుల ననుసరించుము.

భజస్వ భక్తిభావేన రామం సర్వహృదాలయం
యద్యపి త్వం దురాచారో భక్త్యా పూతో భవిష్యసి
మదాక్యం కురు రాజేంద్ర ! కులకౌశలహేతవే ॥

రాముడు ప్రాణికోటుల హృదయకుహరములే గృహముగా గలవాడు. నీవు ఎన్ని పాపముల నాచరించియున్నప్పటికిని అతనిని భక్తి భావమున భజించినచో పవిత్రుడవు కాగలవు. కులమును రక్షించు చుట్టకై యుక్తమగు నా ఉపదేశమును పాటించుము.

తత్తు మాల్యవతో వాక్యం హిత ముక్తం దశాననః
న మర్షయతి చుస్టాత్మా కాలస్య వశ మాగతః ॥

ఇట్లు మాల్యవంతుడు సర్వరాక్షసహితమును పాటించి ఉపదేశించగా కాలిపురుషుని వశమునందిన ఆదుస్టాత్ముడు రావణుడు దానిని హితముగా గ్రహించలేదు.

హితము నంగీకరించకపోగా దశాసనుడు మాల్యనంతుని దూషించుచున్నాడు.

మానవం కృపణం రామ మేకం శాఖామృగాశ్రయమ్
సమర్థం మన్యసే కేన హీనం ప్రకృతా ముసిప్రియం ॥

మాల్యవంతా ! రాముడు హీనసత్వులయిన మానవులలోని వాడు. నావంటి మహావీరుల దయకు పాత్రుడు కాగలిగినవాడు. నిస్స యుడై చెట్టుపై తిరుగు కోతులను ఆశ్రయించినవాడు. తండ్రిచే పరిత్యజింపబడినవాడు. ఇట్లివానికిష్ట మేక అడవులలో నివసించు మునులకు ఇష్టుడు. అట్టివాని సామర్థ్యము నేమిచూచి నీవు ప్రశంసించుచున్నావు.

రామేణ ప్రేషితో నూనం భాషసే త్వ మనర్గలమ్
గచ్ఛ వృక్షో ఒసి బంధు స్త్వం సోఢం సర్వం త్వ యోచితం ॥

నీవు రాముడు పంపగావచ్చిన దూతవలె నిశ్శంకగా మాట్లాడుచున్నావు. అయినను నిన్ను వదలుచున్నాను. వృక్షుడవు. మీవు మిక్కిలి మాశాఖామహుడవు కనుక క్షమించితిని.

ఇతో మత్కర్ణపదవీం దహా త్యేతత్ వచ స్తవ
ఇ త్యుక్త్వా సర్వసచివైః సహితః ప్రస్థిత స్తదా ॥

నీ నిప్పుడు చెప్పినదంతయు నాకు హితమగుటకు బదులు నాకర్ణ పుటములను భస్మ మొనరించుచున్నది. ఇట్లు నిందించి రావణుడు తన మంత్రులతో గూడి ఆస్థలమునుండి లేచిపోయెను.

వాల్మీకమున రావణుని వచనములనువిని మాల్యవంతుడే వెడలి పోయినట్లు చెప్పబడినది. మాల్యవంతుడు వెడలినతరువాత రావణుడు మంత్రులతో ఆలోచించి నగరగుప్తి నొనరించినాడు. తూర్పుద్వార మున ప్రహస్తుని, దక్షిణద్వారమునందు మహాపార్శ్వమహోదరులను, పశ్చిమద్వారమున మాయాకోవిదుడగు ఇంద్రజిత్తును రక్షణకై నియో గించి ఉత్తరద్వారమున శుకసారణులను నియోగించి తానుగూడ ఆద్వారమునసే ఉండుటకు నిశ్చయించినట్లు వర్ణితమయినది. నగర మధ్యభాగమున విరూపాక్షుడు నియోగించబడినాడు.

ఇట్లు నగరరక్షణకై ఏర్పాట్లు జరుగగా విభీషణుని మంత్రులు అనలుడు, శరభుడు, సంపాతి, ప్రఘసుడు అనువారు నలువురును గుప్త రూపమున వాటినన్నిటిని గ్రహించి విభీషణునకు నివేదించగా అతడు రామునకు తెలియజేసెను. అంతట రాముడు శత్రువులకు ప్రతిగా పూర్వద్వారభేదనమునకు నీలుని, దక్షిణద్వారభేదమునకు అంగదుని, పశ్చిమద్వారభేదనమునకు హనుమంతుని నియోగించి తాను లక్ష్మణు నితోగూడి ఉత్తరద్వారమున రావణునకు ఎదురుగా ఉండ నిశ్చయిం చెను. సుగ్రీవ విభీషణులను మధ్యభాగమున నియోగించెను.

ఇట్లు వినియోగించి రాముడు లంకానగరమును చూడగోరి సువేలపర్వతశిఖరమును లక్ష్మణ సుగ్రీవ విభీషణులతోడను ఇతర వానర ముఖ్యులతోడను అధిరోహించెను. రాముడు అత్యధికసమృద్ధమయిన నగరమును చూచి కులసాంసనుడయిన రావణుని దోషముచే ఇది అం తయు నశించుచున్నదను జాలని ప్రదర్శించినట్లుకూడ అక్కడ వర్ణిత మయినది.

మాల్యవంతుని గర్హించిన అనంతరము రావణుడు యుద్ధమునకు సంసిద్ధు డగుటను వర్ణించుచున్నాడు-

ప్రాసాదాగ్రే సమాసీనః పశ్యన్ వానరసైనికాన్
యుద్ధా యాజ్ఞాపయత్ సర్వాన్ సుసాన్ సముపస్థితాన్॥

అనంతరము రావణుడు రాజప్రాసాదాగ్రభాగము నధిరోహించి అతివేలమయిన వానరసైన్యమును పరిశీలించుచు తన ఎదుట నున్న సేనాపతులకు యుద్ధవిధానమును వివరించినాడు.

ఆసమయమున రాము డొనర్చిన అద్భుతకృత్యమును వర్ణించుచున్నాడు-

రామో ఽపి ధను రాదాయ లక్ష్మణేన సమాహృతమ్
దృష్ట్వా రావణ మాసీనం కోపేన కలుషీకృతః॥

సువేలాద్రిపై నున్న రాముడు ప్రాసాదాగ్రమున నున్న రావణుని చూడగనే అతని హృదయము కోపకలుషితమై లక్ష్మణుని చేతి నుండి ధనుస్సును గ్రహించెను.

కిరీటినం సమాసీనం మంత్రిభిః పరివేష్టితమ్
శశాంకార్ధనిభై రేవ బాణై రేకేన రాఘవః॥
శ్వేతచ్ఛత్రసహస్రాణి కిరీటేదశకం తథా
చిచ్ఛేద నిమిషార్ధేన తదద్భుత మి వాభవత్॥
లజ్జితో రావణ స్తూర్ణం వివేశ భవనం స్వకమ్॥

రావణుడు మంత్రిపరివేష్టితుడై ఉన్న తాసనమున కూర్చుండగా రాఘవుడు ఒక్క అర్ధచంద్రాకార బాణమును ప్రయోగించెను. అది అత్యద్భుతముగా వేయి శ్వేతచ్ఛత్రములను రావణుని శిరములపై నున్న కిరీటదశకమును నిమిషార్ధసమయములో ఛేదించినది. రాముని ఈ అద్భుతకృత్యమునకు సిగ్గుపడి రావణుడు స్వభవనమును చేరెను.

వాల్మీకమున రాము డొనరించినట్లు ఈగ్రంథమున వర్ణింపబడిన ఈకృత్యము కానరాదు. దీనికి బదులుగా రావణుడు కన్పడగనే సుగ్రీ

వుడు క్రోధోద్వేగమును భరించజాలక అతివేగముగా ప్రాసాదాగ్రము పైకి లఘించినట్లును రావణునితో ద్వంద్వయుద్ధ మొనరించినట్లును రావణుడు మాయను ప్రయోగింపబోగా గ్రహించి వెంటనే తిరిగి సువేలాద్రినిచేరి తమవారికి ఆనందమును కలిగించినట్లును వర్ణింపబడినది.

అనంతరము రామాదులందరును సువేలమును అవతరించి లంకాభిముఖులై నడిచిరి. రామలక్ష్మణులు నగరమును సమీపించి తాము రావణాధిష్ఠితమయిన ఉత్తరద్వారమున కెదురుగా నిలబడిరి. మైందద్వివిదులతోగూడి నీలుడు పూర్వద్వారాభిముఖుడై నిలబడెను. గజగవయగవాక్షఋషభసహితుడగు అంగదుడు దక్షిణద్వారమున కభిముఖుడయ్యెను. ప్రమాథిప్రఘసాదిసహితుడై హనుమంతుడు పశ్చిమద్వారమును సమీపించెను. సుగ్రీవుడు మధ్యభాగమున నుండెను. వీరందరికి వేరువేరుగా సైన్యములు విభాగింపబడినవి. ఇట్లు నగరభేదనమునకు తగువారలను నియోగించిన అనంతరము రాముడు మంత్రులతోగూడి మంత్రాలోచన మొనరించి విభీషణుని సలహా ననుసరించి రాజనీతి విశారదుడయిన రాముడు అంగదుని రావణునొద్దకు దూతగా పంపెను. ఈ అంగదరాయబారము వాల్మీకిరామాయణమున ముఖ్యమగు ఒకఘట్టము. ఆభాగమును ఇందు పొందుపరచుచున్నాము. (యుద్ధకాండము, నలుబదిఒకటవసర్గ, ఏబదిఏడవ శ్లోకమునుండి తొంబదవ శ్లోకమువరకు.)

రాఘవ స్సన్నివే శ్యైవం సైన్యం స్వం రక్షసాం వధే
సమ్మంత్ర్య మంత్రిభి స్సార్థం విశ్చిత్య చ పునఃపునః ॥
ఆనంతర్య మభిప్రేప్సుః క్రమయోగార్థతత్త్వవిత్
విభీషణ స్యానుమతే రాజధర్మ మనుస్మరన్
అంగదం వాలితనయం సమాహూలా యేద మబ్రవీత్ ॥

రాముడిట్లు సర్వసైన్యములను రాక్షసవధార్థమై యథాస్థానములందు నియోగించి మంత్రులందరితోడను ఎంతోసేపు అనంతర

మొనరించవలసిన విధానమును నిర్ణయించుటకై కృత్యక్రమమును ఎరిగినవాడగుటచే మంత్రాలోచన మొనర్చెను. అనంతరము రాజధర్మమును స్మరించి విభీషణుని అనుమతి ననుసరించి వాలిపుత్రుడగు అంగదుని సమీపమునకు పిలిచి ఇట్లుపలికెను. చివరిక్షణములో సైతము యుద్ధమును విరమింపజేయుటకై రాముడుకూడ ప్రయత్నించినాడు.

గత్వా సౌమ్య దశగ్రీవం బ్రూహి మద్వచనా త్తవ
లంఘయిత్వా పురీం లంకాం భయం త్యక్త్వా గతవ్యథః ॥

నీవు నిర్భీతుడవై ఏవిధమగు సంకోచమును పెట్టుకొనక ప్రాకారమును లంఘించి లంకాపురమున ప్రవేశించి రావణసభాంతరాళమునకు బోయి నావచనములుగా రావణునకు ఇట్లు చెప్పుము.

భ్రష్టశ్రీతగతైశ్వర్యమూఢ నష్టచేతన
ఋషీణాం దేవతానాం చ గంధర్వాప్సరసాం తథా ॥
నాగానా మథ యక్షాణాం రాజ్ఞాం చ రజనీచర
యచ్చ పాపం కృతం మోహా దవలిప్తేన రాక్షస
నూన మద్య గతో దర్పః స్వయంభువరదానజః ॥

రావణా ! నీ సర్వసంపదలు నశించినవి. నీప్రభుత్వము నశించినది. మృత్యువు నిన్నావేశించినది. జీవనముపై ఆశ లేదు. ఇదివరకు నీవు దర్పితుడవై మహర్షులకును, దేవతలకును, గంధర్వులకును అప్సరసలకును, నాగులకును, యక్షులకును, రాజులకును ఏ యే అపకారముల నొనర్చితివో వాటికి ఫలము ననుభవింపగలవు. బ్రహ్మనిచ్చిన వరదాన ఫలము నీదర్పముచే నశించినది.

యస్య దండధర స్త్వేహం దారాహరణకర్శితః
దండం ధారయమాణ స్తు లంకాద్వారే వ్యవస్థితః ॥

భార్యాపహరణముచే పీడితుడనగు నేను నీకృత్యములకు ఫలమునిచ్చు దండధరుడనై లంకాద్వారమున నున్నాను.

పదవీం దేవతానాం చ మహర్షీణాం చ రాక్షస
రాజర్షీణాం చ సర్వేషాం గమిష్యసి మయా హతః ॥

నాచే నిహతుడవై నీవు దేవతలు, మహర్షులు, రాజర్షులు ఉండు స్థానమును పొందగలవు. నాచే చచ్చుటకూడ నీకు పుణ్యమే అని భావము. లేదా నీవువధించి దానవులస్థానమునే పొందగలవు. అనగా మరణింతువని భావము.

బలేన యేన వై సీతాం మాయయా రాక్షసాధమ
మా మతిక్రామయిత్వా త్వం హృతవా స్తద్విదర్శయ ॥

నీవు ఏబలమును ఆధారముగాగొని నా కపరాధముగావించితివో, నాభార్యను అపహరించితివో దానిని ప్రదర్శించుము.

అరాక్షస మిమం లోకం కర్తా స్మి నిశితైశ్శరైః
న చే చ్ఛరణ మభ్యేషి మా ముపాదాయ మైథిలీం ॥

నా సునిశితశరములచే ఈలోకమును రాక్షసజాతిరహితముగా నొనర్చెదను. ఆకార్యమును అడ్డదలచితివేని మైథిలిని నాకిచ్చి శరణు బొందుము.

ధర్మాత్మా రక్షసాం శ్రేష్ఠ స్సంప్రాప్తో యం విభీషణః
లంకైశ్వర్యం ధ్రువం శ్రీమా నయం ప్రాప్తో హ్యకంటకం ॥

ధర్మపరుడు, రాక్షసశ్రేష్ఠుడు అగు విభీషణుడు నన్ను శరణు వేడినాడు. లంకారాజ్యమును నిష్కంటకముగా ఇతడే పాలింపగలడు.

న హి రాజ్య మధర్మేణ భోక్తుం క్షణ మపి త్వయా
శక్యం మూర్ఖసహాయేన పాపే నాపిదితాత్మనా ॥

అధర్మపరుడవగు నీవు క్షణకాలమున్ను రాజ్యపాలనమొనరించుటకు తగవు. అధర్మపరుడవగుటచే నీవు పాపాత్ముడవు. నామనస్సు నీకు వశమైలేదు. కనుక నీవు మూర్ఖుడవు. అనగా యుక్తాయుక్తవివేక జ్ఞానహీనుడవు. ఈ కారణములచే రాజ్యానర్హుడవు.

యుధ్యస్వ వా ధృతిం కృత్వా శౌర్య మాలంబ్య రాక్షస
మచ్ఛరై స్త్వం రణే శాంతః తతః పూతో భవిష్యసి ॥

రాక్షసా! నీకు మైథిలిని సమర్పించుట ఇష్టము లేకపోయినచో

ధైర్యమునంతను కూడబెట్టుకొని, శూరుడవై యుద్ధభూమిలో నిలువుము. అంతట నా సునిశితశరములచే శాంతినిపొంది పవిత్రుడవు కాగలవు.

యదా వివేశి లోకాం స్త్రీక పక్షిభూతో మనోజవః
మమ చక్షుఃపృథం ప్రాప్య న జీవక ప్రతియాస్యసి ॥

అట్లుగాక మూడులోకములలో ఎచ్చట దాగినను మనోజవము గల పక్షివలె నానేత్రములు నిన్ను వెంటాడగలవు. నానేత్రపథమును పొందిన తరువాత జీవితముతో తిరిగి రాలేవు.

ప్రవీమి త్వాం హితం వాక్యం క్రియతా మూర్ధ్వదైహికం
సుదృష్టా ప్రియతాం లంకా జీవితం తే మయి స్థితం ॥

సర్వరాక్షసులను వధించుటచే నీకు శ్రాద్ధక్రియలను జరుపు వారు ఉండరు. కనుక ఇప్పుడే నీవు నీ ఊర్ధ్వదైహికక్రియలను జరుపు కొనుము. నీప్రాణము నాచేతులలో నున్నది. కాన లంకను, నీ బంధుప్ర లను ఆఖరుసారిగా ఒక్కసారి చూచుకొనుము.

ఇత్యుక్త స్తు తా రేయో రామేణాక్లిష్టకర్మణా
జగా మాకాశ మావిశ్య మూర్తిమా నివ హవ్యవాట్ ॥

ఇట్లు శ్రీరాముడు రావణునకు అందించవలసిన సందేశమును వినిపింపగా దానిని విని తారాపుత్రుడగు అంగదుడు మూర్తీభవించిన అగ్నిహోత్రునివలె ఆకాశమున కెగసి లంకలోనికి వెళ్ళెను.

సో ఽతిపత్య ముహూర్తేన శ్రీమా రావణమందిరం
దద ర్శాసీన మవ్యగ్రం రావణం సచివై స్సహా ॥

అతడు ఒక ముహూర్తకాలమున ప్రాకారాదులను గడిచి రావణమందిరమును చేరెను. శ్రీమంతుడగు అంగదు డాసమయమున మంత్రులతో గలిసి నిశ్చలముగా సింహాసనమున కూర్చొనియున్న రావణుని దర్శించెను.

తత స్తస్యా విదూరే స విపత్య హరిపుంగవః
దీప్తాగ్ని సదృశ స్తస్థా వంగదః కనకాంగదః ॥

కనకకేయూరములను ధరించిన కపిశ్రేష్ఠుడు సభలో ఆసీను డయియున్న రావణునకు ఎదుట అవతరించి మండుచున్న అగ్నిహో త్రునివలె నిలబడెను.

తద్రామవచనం సర్వం అన్యూనాధిక ముత్తమం
సామాత్యం శ్రావయామాస నివే ద్యాత్మాన మాత్మనా ॥

అతడు మొదట తనను పరిచయము చేసికొని, తరువాత రావ ణునకున్ను, అతని మంత్రులకున్ను రామునియొక్క సందేశమును అంతను హెచ్చుతగ్గులు లేకుండా వినిపించెను.

దూతో హం కోసలేంద్రస్య రామ స్యాక్లిష్టకర్మణః
వాలిపుత్రో ంగదో నామ యది తే శ్రోత్ర మాగతః ॥

నేను కోసలేశ్వరుడగు శ్రీరామచంద్రునిదూతను. వాలిపుత్రు డను. అంగదుడనువాడను. నన్నుగూర్చి నీవు ఇదివరకే వినియుందువు.

ఆహ త్వాం రాఘవో రామః కౌసల్యానందవర్ధనః
నిష్పత్య ప్రతియుధ్య స్వ నృశంసపురుషో భవ ॥

శ్రీరాముడు నీకీవిధమున సందేశము నంపినాడు. నృశంసా! నీకు శక్తియున్నచో పురమునుండి వెలికివచ్చి నాతో యుద్ధ మొనరించి పురుషుడ వనిపించుకొనుము.

హం తా స్మి త్వాం సహామాత్యం సపుత్రజ్ఞాతిబాధవం
నిరుద్విగ్నా స్త్రయో లోకా భవిష్యంతి హ తే త్వయి ॥

నేను నిన్ను సపుత్రమిత్రబాంధవముగా వధించుటకు వచ్చి యున్నాను. నాచే నీవు నిహతుడవుకాగా త్రిలోకములు భయరహి తము లగును.

దేవదానవయక్షాణాం గంధర్వోరగరక్షసాం
శత్రు మ దోద్ధరిష్యామి త్వా మృషీణాం చ కంటకం ॥

దేవదానవయక్షగంధర్వోరగరాక్షసులకు శత్రుడవును, తపో ధనులగు మహర్షులకు కంటకప్రాయుడవును అగు నిన్నీనాడు వధించెదను.

విభీషణస్య ఐశ్వర్యం భవిష్యతి హతే త్వయి
న చే త్సీతాకృత్య వైదేహీం ప్రణిపత్య ప్రదాస్యసి॥

నీవు మరణించిన అనంతరము నీ రాజ్యభోగాదులన్నియు విభీషణునకు చెందగలవు. లేనిచో వైదేహిని సమర్పించి ప్రణతుడవు గమ్ము.

ఇత్యేవం పరుషం వాక్యం బ్రువాణే హరిపుంగవే
అమర్షవశ మాపన్నో నిశాచరగణేశ్వరః॥

కపిశ్రేష్ఠుడగు అంగదు డిట్లు పరుషముగా భాషించగా రాక్షస ప్రభువగు రావణుడు తీవ్రమగు క్రోధమునకు వశుడయ్యెను.

తత స్సరోషతామ్రాక్ష శ్శాస సచివాం స్తదా
గృహ్యతా మేష దుర్బుద్ధి ర్వధ్యతా మితి చాసకృత్॥

రావణుడు రోషారుణితలోచనుడై "ఈదుష్టబుద్ధియగు వానరుని పట్టి వధింపుడని తన మంత్రులకు ఆజ్ఞ నిచ్చెను.

రావణస్య వచ శ్శ్రుత్వా దీప్తాగ్నిసమతేజసః
జగృహు స్తం తతో ఘోరా శ్చత్వారో రజనీచరాః॥

రావణు డిట్లు ఆజ్ఞాపించగనే దానిని విని మండుచున్న అగ్నివలె తేజోమయులై ఉన్న నల్గురు రాక్షసవీరులు అంగదుని పట్టుకొనిరి.

గ్రాహయామాస తా రేయు స్స్వయ మాత్మాన మాత్మవా
బలం దర్శయితుం వీరో యాతుధానగణే తదా॥

ఆత్మబలసంపన్నుడగు తారాపుత్రుడు ఆ రాక్షససభామధ్యమున తన బలసామర్థ్యములను ప్రదర్శించుటకై స్వయముగనే ఆ రాక్షసులు పట్టుకొనుచుండ ఊరకుండెను.

స తా న్బాహుద్వయే సక్తా నాదాయ పతగా నివ
ప్రాసాదం శైలసంకాశ ముత్పపా తాంగద స్తదా॥

వారు ఇద్దరిద్దరు చొప్పున అతని రెండుబాహువ్రలను పట్టుకొనగా అతడు మహావేగమున వారితోపాటు పర్వతోన్నతమయిన ప్రాసాదో పరిభాగమును ఎగిరెను.

తేంతరిక్షా ద్వినిర్భూతా స్తస్య వేగేన రాక్షసాః॥
భూమా నిపతితా స్సర్వే రాక్షసేంద్రస్య పశ్యతః॥

అంగదుడు పైకి ఎగురుచు వారిని ఒక్కసారిగా విదలించెను. ఆ వేగమునకు నల్లురు రాక్షసులును రాక్షసేంద్రుడు చూచుచుండగనే భూపతితులయిరి.

తతః ప్రాసాదశిఖరం శైలశృంగ మి వోన్నతం
దదర్శ రాక్షసేంద్రస్య వాలిపుత్రప్రతాపవాన్॥

మహాబలశాలి అగు వాలియొక్క పుత్రుడును, స్వయముగా ప్రతాపశాలి అగు అంగదుడు ఇట్లు నల్వురు రాక్షసులను విదలించి అనంతరము పర్వతశిఖరమువలె అత్యున్నతమయిన రాజప్రాసాద శిఖర మును చూచెను.

త త్పపాత పదాక్రాంతం దశగ్రీవస్య పశ్యతః
పురా హిమవతః శృంగం వజ్రిణే వ విదారితం ॥

దశగ్రీవుడు చూచుచుండగనే అంగదుడు తన పాదముతో ప్రాసాదశిఖరమును తన్నెను. పూర్వము హిమవత్పర్వతశృంగమును ఇంద్రుడు వజ్రముచే భేదించగా అది క్రిందకు పడినట్లు ప్రాసాదశిఖర మున్ను విరిగిపడెను.

భుక్త్వా ప్రాసాదశిఖరం నామ విశ్రావ్య చాత్మనః
వినద్య సుమహానాద ముత్పపాత విహాయసం॥

ఇట్లు అంగదుడు ప్రాసాదశిఖరమును భగ్న మొనర్చి దన కీర్తి ప్రతిష్ఠల నినుమడింపజేసుకొని ఒక్కసారి భయంకరసింహనాదము మొనర్చి ఆకాశమున కెగసెను.

వ్యధయన్ రాక్షసాన్ సర్వాన్ హర్షయన్ శ్చాపి వానరాన్
స వానరాణాం మధ్యే తు రామపార్శ్వ ముపాగతః॥

అతడు రాక్షసుల హృదయములకు బాధను కలుగజేయుచు, వానరులను సంతుష్టుల నొనర్చుచు వానరుల మధ్యనున్న రామపార్శ్వ మున కేగెను.

రావణ స్తు పరం చక్రే క్రోధం ప్రాసాదధర్షణాత్
వినాశం చాత్మనః పశ్య్ నిశ్వాసపరమో భవత్ ॥

రావణుడు ప్రాసాదభజతత్వమును చూచి అత్యంతక్రోధతహృద యుడయ్యెను. తన వినాశనమునకు సంభవించిన దుశ్శకునముగా దీనిని భావించి వేడినిట్టూర్పు విడిచెను.

రామ స్తు బహుభి ర్హృష్టై ర్వినదద్భిః ప్లవంగమైః
వృతో రిపువధాకాంక్షీ యుద్ధా యై వాభ్యవర్తత॥

శ్రీరాముడు అత్యంతానందముతో కిలకిలారావము లొనర్చు చున్న వానరులచే పరివేష్టితుడై రావణవధ నాకాంక్షించుచు యుద్ధ మునకే నిశ్చయించెను.

అంగద రాయబార ప్రారంభమునకు తరువాత యుద్ధప్రారంభ మునకు ముందు సుగ్రీవుని ఆజ్ఞ ననుసరించి, సుషేణుడు అనేకాక్షౌహి ణులతోగూడి ఆకాశగమనమున లంకానగరముపై పర్యటించి కీలక స్థానము లన్నిటిని గ్రహించినట్లు వర్ణింపబడినది. అనేక వానరులు పరి ఘను దాటి ప్రాకారమునుకూడ ఆక్రమించిరి. దీనిచే భయత్రస్తులైన రాక్షసులు రావణున కీవార్తల నివేదించిరి. వానరరుద్ధమయిన నగర మును చూచి రావణుని మనస్సు అసంఖ్యాకులగు వీరిని జయించు టెట్లా అను చింతచే వ్యాకులమయ్యెను. అక్కడ రామున కాసమయ మున రావణాపహృతయై పీడిత యగుచున్న జానకి స్మృతిలోనికి వచ్చినది. ఆకారణమున జనితమయిన క్రోధముతో లంకానగరమును ఆక్రమించు డని వానరులను ఆజ్ఞాపించినాడు. అంతట వానరముఖ్యులు తమ తమ నియోగముల ననుసరించి నగరమును నాల్గువైపులనుండి ముట్టడించిరి. రావణుడుకూడ తన సైన్యములకు నగరమునుండి వెలు వడి యుద్ధమొనరింపుడని ఆజ్ఞల నొసగినాడు. అంతట రాక్షససైన్యము నగరమునుండి వెలువడగా భీకరయుద్ధము కొనసాగినట్లు వాల్మీకము.

ఆహూయ రాక్షసాన్ సర్వాన్ ప్రహస్త ప్రముఖాన్ ఖలః
వానరైః సహ యుద్ధాయ నోదయామాస సత్వరః॥

రాముడు ఒకే బాణముతో కిరీటశ్వేతచ్ఛత్రములను ఛేదించగా లజ్జితుడయిన రావణుడు ప్రహస్తుడు మొదలుగాగల వానరసైన్యముల సన్నిటి "మీరు నగరమునుండి వెలువడి వానరులతో యుద్ధ మొనరింపు" డని ఆజ్ఞ నిచ్చెను.

తతో భేరీమృదంగాద్యైః పణవానకగోముఖైః
మహిషోష్ట్రైః ఖరైః సింహై ర్ద్వీపిభిః కృతవాహనాః॥

రావణుడు ఇట్లు అజ్ఞాపించగనే రాక్షసులు పణవానకభేరీమృదం గాదులగు యుద్ధసూచిక వాద్యములను భయంకరముగా మ్రోగించుచు, మహిషములపైనను, ఉష్ట్రములపైనను, గాడిదలపైనను, సింహాముల పైనను, వీనుగులపైనను ఎక్కి బయలుదేరిరి.

ఖడ్గశూలధనుఃపాశయష్టితోమరశక్తిభిః
లక్షితాః సర్వతో లంకాం ప్రతిద్వార ముపాయయుః॥

ఖడ్గములు, శూలములు, ధనుస్సులు, కర్రలు, శోమరములు, శక్తులు మొదలగు ఆయుధవిశేషములను ధరించిన రాక్షసులు నగర ద్వారములను చేరిరి.

తత్పూర్వ మేవ రామేణ నోదితా వానరర్షభాః
ఉద్యమ్య గిరిశృంగాణి శిఖరాణి మహాంతి చ॥
తరూం శ్చోత్పాట్య వివిధాన్ యుద్ధాయ హరియూథపాః
ప్రేక్షమాణా రావణస్య తా న్య నీకాని భాగశః
రాఘవప్రియకామార్థం లంకా మాపుప్లువుః తదా॥

రావణసేనలు నగరమునుండి వెలువడకముందే రామప్రబోదిత ములయిన వానరసేనలు మహాపర్వతశిఖరములను పెద్ద పెద్ద వృక్షము లను విరుగగొట్టియు, పెరికియు భుజములపై ధరించి రావణుని ఆ సైన్య ముల నన్నిటిని అక్కడక్కడ చూచుచు శ్రీరాముని ప్రియము నాకాం క్షించుచు లంకానగరద్వారముల నధిరోహించిరి.

తే ద్రుమైశ్చ పర్వతాగ్రైశ్చ ముష్టిభి శ్చ ప్లవంగమాః
తతః సహస్రయూథా శ్చ కోటియూథా శ్చ యూథపాః
కోటీశతయుతా శ్చాన్యే సుసుధు ర్నగరం భృశమ్॥

వేలు, లక్షలు, కోట్లు, కోటీశతములుగా యున్న వానరసేనలు వృక్షములను, పర్వతశిఖరములను, దృఢముష్టులను ఆయుధములుగా ఉపయోగించుచు నగరమును సంపూర్ణముగా ముట్టడించివేసిరి.

ఆప్లవంతాః ప్లవంత శ్చ గర్జంత శ్చ ప్లవంగమాః
రామో జయ త్యతిబలో లక్ష్మణ శ్చ మహాబలః
రాజా జయతి సుగ్రీవో రాఘవే ణానుపాలితః
ఇత్యేవంఘోషయం తశ్చ సమంయుయుధు రేఽరిభిః॥

ప్లవంగమవీరులు ఇటు నటు గంతులిడుచు, కిలకిలారావము లొనర్చుచు, అతిబలశ్రేష్ఠుడయిన రాముడు విజయమునందుగాక, మహాబలుడగు లక్ష్మణుడు విజయు డగుగాక, రాఘవపాలితుడగు వానర రాజు సుగ్రీవుడు మహోత్కర్షనందుగాక ! అని జయ ఘోషముల నొనరించుచు రాక్షసులతో యుద్ధమొనర్చిరి.

హనుమా నంగద శ్చైవ కుముదో నీల ఏవ చ
నల శ్చ శరభ శ్చైన మైందో ద్వివిధ ఏవ చ
జాంబవాన్ దధివక్త్ర శ్చ కేసరీ తార ఏవ చ
అన్యే చ బలినః సర్వే యూథపా శ్చ ప్లవంగమాః
ద్వారాణ్యా క్రమ్య తత్యా లంకాయాః సర్వతోతోరుసుధుర్భృశమ్॥

హనుమంతుడు, అంగదుడు, కుముదుడు, నీలుడు, నలుడు, శరభుడు, మైందుడు, ద్వివిదుడు, జాంబవంతుడు, దధిముఖుడు, కేసరి, తారుడు మొదలగువారున్న ఇంకా ఇతర వానరసేనానాయకులున్నూ ద్వారములను లంకానగరములో ప్రవేశించిరి.

తదా వృక్షై ర్మహాకాయాః పర్వతాగ్రై శ్చ వానరాః
నిజఘ్ను స్తాని రక్షాంసి నఖై ర్దంతై శ్చ వేగితాః॥

అంతట వానరులు వృక్షములను, పెద్ద పెద్ద పర్వతశిఖరములను విసరి అనేక రాక్షసవీరులను నిహతుల నొనర్చిరి. అంతేగాక నఖదంతములనుగూడ ఆయుధములుగా ఉపయోగించి అనేకులను వధించిరి.

రాక్షసా శ్చ తదా భీమా ద్వారేభ్యః సర్వతో రుషా
నిర్గత్య భిందిపాలై శ్చ ఖడ్గైః శూలైః పరశ్వధైః॥

అంతట రాక్షసులును అతిభయంకరాకారములతో, క్రోధావేశపరులై ఖడ్గశూల పరశు భిందిపాలాది వివిధ భీకరాయుధధారులై నగరమునుండి నెలువడిరి.

నిజఘ్ను ర్వానరానీకం మహాకాయా మహాబలాః
రాక్షసాం శ్చ తథా జఘ్ను ర్వానరా జితకాశినః॥

మహాబలశాలురగు రాక్షసులు ఆవేశముతో అనేక వానరసైన్యములను యమసదనమున కంపిరి. అంతట దానికి ప్రతిగా జయశీలురగు వానరులును అనేక రాక్షసబలముల సంహరించిరి.

తథా బభూవ సమరో మాంసశోణితకర్దమః
రక్షసాం వానరాణాం శ్చ సంబభూ వాద్భుతోపమః॥

ఆపై వానర రాక్షససైన్యములకు అత్యద్భుతమగు తుముల యుద్ధము సంభవించినది. ఆసమయమున వీరుల మాంసశోణితములు వీరపాదమర్దితములై ఒకవిధమగు బురద ఏర్పడినది.

తే హయై శ్చ గజై శ్చైవ రథైః కాంచనసన్నిభైః
రక్షోవ్యాఘ్రా యుయుధిరే నాదయంతో దిశో దిశ॥

వ్యాఘ్రములవలె క్రూరాతిక్రూరబలులయిన రాక్షసులు రథగజతురగాది వాహనములనధిష్ఠించి భయంకరసింహనాదములతో దశదిశలను పూరించుచు భయంకరయుద్ధ మొనర్చిరి.

రాక్షసా శ్చ కపీంద్రా శ్చ పరస్పరజయైషిణః
రాక్షసాఁ వానరా జఘ్నుః వానరాం శ్చైవ రాక్షసాః॥

ఒకరిపై నొకరు విజయమునందగోరు రాక్షసవీరులును కపీంద్రులు అతిభీకరముగా పోరాడి ఒకరి నొకరు చంపుకొనిరి.

రామేణ విష్ణునా దృష్టా హరయో దివిజాంశజాః
బభూవు ర్బలినో హృష్టా స్తదా పీతామృతా ఇవ॥
విష్ణుదేవుని పరిపూర్ణావతారమగు శ్రీరామునిచే పరిపాలింప బడినవారును దేవతలయొక్క అంశలచే జనించిన వానరులు శత్రువులతో పోరాడుకొలది పరివర్ధితబలశాలు లయిరి. అమృత పానమొనర్చినవారివలె వారి ఉత్సాహము అంతకంతకు అతిశయించి నదేగాని కించిత్తయినను తగ్గలేదు.

సీతాభిమర్ష పాపేన రావణే నాభిపాలితా
హతశ్రీకా హతబలా రాక్షసా జఘ్ను రోజసా
చతుర్థాంశావశేషేణ నిహతా రాక్షసం బలం॥

సీతాదేవిని అపహరించి ఆమెను బాధించిన అధర్మముచే పాప చరితుడయిన రావణునిచే పరిపాలింపబడుటచే రాక్షసులు శోభాదరిద్రులు, శక్తిహీనులు అయిరి. ఆకారణమున వానరులు వారిని సులభముగా జయించిరి. ఇట్లు మొదటినాటి యుద్ధమునసే వచ్చిన సైన్యములో మూడువంతులు నిహతమయి ఒకవంతు మిగిలినది.

స్వసైన్యం నిహతం దృష్ట్వా మేఘనాదా ఽతిరుష్టధీః
బ్రహ్మదత్తవరః శ్రీమా అంతర్ధానం గతో ఽసుర॥

ఇట్లు తనసైన్యమంతయు వానరవీరులచే నిహతముకాగా రావణ పుత్రుడగు మేఘనాథుడు అత్యంతక్రోధపరవశహృదయు డయ్యెను. కాని అతడు బ్రహ్మచే వరములను పొందినవాడును, మాయా విశారదుడును అగుటచే ఒక్కసారిగా అంతర్ధానము నందెను.

సర్వాస్త్రకుశలో వ్యోమ్ని బ్రహ్మాస్త్రేణ సమంతతః
నానావిధాని శస్త్రాణి వానరానీకమర్దయత్
పవర్ష శరజాలాని త దద్భుత మి వాభవత్ ॥

ఇంద్రజిత్తు మాయావిదుడేగాక సమస్త అస్త్రశస్త్రములను సాంగోపాంగముగా ఎరిగినవాడు. అతడు బ్రహ్మాస్త్రము మొదలగు అనేకములగు అస్త్రశస్త్రములను ప్రయోగించి వానరసేనలను మర్దించెను. అతడు కోట్లకొలది బాణములను మేఘముపలె వర్షించుచుండగా అత్యద్భుతముగా నుండెను.

'రామోఽపి మానయన్ బ్రాహ్మ మస్త్ర మస్త్రవిదాం వరః
క్షణం తూష్ణీ మువా సాఽథ దదర్శ పతితం బలమ్
వానరాణాం రఘుశ్రేష్ఠ శ్చకోపానలసన్నిభః ॥

అస్త్రవేత్తలలో శ్రేష్ఠుడయిన రాముడు బ్రహ్మాస్త్రమును గౌరవించి దానికి ప్రతివిధాన మాచరింపక ఊరకుండెను. కాని ఇంతలో చాపకట్టుగాపడి బాధపడుచున్న సైన్యముల నన్నిటిని చూచుసరికి అగ్నికల్పుడయిన అతని క్రోధానలము భగ్గున మండినది.

చాప మానయ సౌమిత్రే బ్రహ్మాస్త్రే ణాసురం క్షణాత్
భస్మీకరోమి మే పశ్య బల మద్య రఘూత్తమ ॥

లక్ష్మణా ! చాపము నిటిమ్ము. ఈ రాక్షసుని క్షణములో బ్రహ్మాస్త్రప్రయోగమున భస్మీపటల మొనర్చెదను. రాఘవా! ఈనాడు నీవు నానిజమయిన శక్తిసామర్థ్యములను చూడగలవు.

మేఘనాదో ఽపి తచ్ఛ్రుత్వా రామవాక్య మతంద్రితః
తూర్ణం జగామ నగరం మాయయా మాయికో ఽసురః ॥

శ్రీరాము డిట్లు బ్రహ్మాస్త్రమున రాక్షసుని వధించెదననిన మాటలను విని మేఘనాథుడు ఆలసింపక మాయాబలము నాశ్రయించి శీఘ్రముగా నగరములోని కేగెను.

పతితం వానరానీకం దృష్ట్వా రామో ఽతిదుఃఖితః
ఉవాచ మారుతిం శీఘ్రం గత్వా క్షీరమహోదధిం ॥

వానరసైన్యమంతయు ఇంద్రజిచ్ఛరజాలవిధ్వస్తమై పడియుండగా చూచి చింతావ్యాకులచిత్తుడయిన రాముడు హనుమంతుని కిట్లు ఆజ్ఞనిచ్చెను. నీవు శీఘ్రముగా క్షీరసముద్రసమీపమునకు పొమ్ము.

తత్ర ద్రోణగిరి ర్నామ దివ్యౌషధిసముద్భవః
త మానయ ధృతం గత్వా సంజీవయ మహామతే
వానరౌఘాణా మహాసత్వా కీర్తి స్తే సుస్థిరా భవేత్ ॥

క్షీరసముద్రతీరమున ద్రోణగిరి అను దివ్యౌషధిజన్మస్థానమయిన పర్వతమున్నది. నీవు అతిశీఘ్రముగా దానిని తెచ్చి అందలి ఔషధముల నుపయోగించి వానరసైన్యసంఘములను జీవింపజేసి సుస్థిరమగు కీర్తిని సంపాదించుకొనుము.

ఆజ్ఞా ప్రమాణ మిత్యుక్త్వా జగా మానిలనందనః
ఆనీయ చ గిరిం సర్వాం వానరా వానరర్షభః
జీవయిత్వా పున స్తత్ర స్థాపయిత్వా యయౌ ధృతమ్ ॥

శ్రీరామని ఆజ్ఞను శిరసావహించి అనిలనందనుడు అతివేగమున ద్రోణగిరిని చేరెను. అతడు ఆపర్వతమును పెకలించి తెచ్చి వానరుల నందరిని జీవితుల నొనరించి తిరిగి ఆపర్వతమును యథాస్థానమున స్థాపించివచ్చెను.

యుద్ధప్రారంభము మొదలుకొని ద్రోణగిరిని తెచ్చుటవరకు ఈగ్రంథమున వర్ణింపబడినకథ వాల్మీకిరామాయణమునకు పూర్తిగా విరుద్ధముగానున్నది. ఇంద్రజిత్తు రామలక్ష్మణులను నాగపాశములచే బంధించుట, గరుత్మంతుడు వారిని బంధవిముక్తుల నొనరించుట మొదలగు కథాభాగము లింపు వర్ణింపబడలేదు. పాఠకుల కుతూహలాపనయనమునకై ఆభాగముల నిక్కడ సంక్షేపముగా నిచ్చుచున్నాము.

వానర రాక్షసులకు ప్రారంభమున కొంతసేపు తుములయుద్ధము జరిగినతరువాత ఉభయసైన్యములందలి ప్రముఖవీరులకు ద్వంద్వ యుద్ధము ఘటిల్లినది. అంగదేంద్రజిత్తులు, ప్రజంఘసంపాతుల (సంపాతి విభీషణనిమంత్రి) జంబుమాలీహనుమంతులు, విభీషణ మిత్రఘ్నులు, గజతపనులు, నీలనికుంభులు, సుగ్రీవప్రఘసులు, లక్ష్మణవిరూపాక్షులు, నైందవద్విజముష్టులు, దివిదాశనిప్రభులు, నలప్రతపనులు, సుషేణవిద్యు

న్మాలులు ద్వంద్వయుద్ధ మొనర్చిరి. రాముడు తనను ఎదుర్కొని బాణములను గుప్పించిన అగ్నికేతు, రశ్మికేతు, దుర్ధర్ష, సుప్తఘ్నులను నలువురు రాక్షసులను నాలుగుబాణములకు ఎరగా జేసినాడు. తక్కిన వానరవీరులు అనేకులను వధించినారు. అనేకులను పరాజితుల నొనర్చినారు. తరువాత జరిగిన లుములయుద్ధములో రామలక్ష్మణులును, వానరులును అనేక రాక్షసులను నిహతులఁ నొనర్చినారు. ఇంతలో సూర్యాస్తమయము జరిగినది. రాత్రికూడ యుద్ధము సాగుచునే యున్నది. వానరులదే జయముగానున్నది. రామలక్ష్మణులు స్పష్టా స్పష్టముగా కన్పించుచున్న రాక్షసులనుకూడ బాణములచే వధించి నారు. నిహతులగుచున్న రాక్షసుల ఆక్రందనధ్వనులు, విజయులగు చున్న వానరుల సింహనాదములు మిన్నుముట్టినవి. అంతట రాక్షసు లనేకులు గుంపుగాగూడి శస్త్రాస్త్రములను వర్షించుచు రాముని చుట్టు ముట్టిరి. కాని రాముడు విచిత్రముగా నిమిషార్ధమున వారినందరను వధించినాడు. వారి ఆక్రందనధ్వనులు ఒక్కసారి సప్తసముద్రము కలగి ఘూపించుచున్నట్లున్నవట. మహాపార్శ్వమహోదరులు, వజ్రదంష్ట్రుడు, శుకసారణులు, కుంభనికుంభులు ఇంకను ఇతర రాక్షసవీరులును అగ్ని శిఖోపములయిన రామబాణపీడితులై యుద్ధభూమిని వదలి ప్రాణము లను దక్కించుకొనిరి.

ఆసమయమున అంగదుడు ఇంద్రజిత్తు నెదుర్కొనెను. ఘోర యుద్ధమొనర్చి అంగదుడు శత్రుని హయసారథుల వధించి విరథు నొన రించెను. విరథుడయిన ఇంద్రజిత్తు తత్క్షణమే రథమును త్యజించి ఆకాశమున కెగసెను. దేవదానవుల కెవ్వరికిని శక్యముగాని కర్మ నాచ రించినందులకుగాను ఆకాశమున దేవతలు, మహర్షులు భూమిపై రామ లక్ష్మణ సుగ్రీవవిభీషణాదులను అంగదుని ప్రశంసించిరట. పరాజితు డయిన ఇంద్రజిత్తు హృదయములో క్రోధజ్వాలలు మండినవి. అంతట రాముడు మాయావియగు ఇంద్రజిత్తునుండి సురక్షితులై సుగ్రీవుని గూడి యుండు డని కపిసేనలను ఆజ్ఞాపించినాడు. బ్రహ్మదత్తవరగర్వితుడును,

మాయాయుద్ధవిశారదుడును అగు రావణి ఆకాశమున అదృశ్యుడై యుండియే తీక్ష్ణములగు బాణములను రామలక్ష్మణులపై ప్రయోగించ సాగినాడు. ఎదుట నిలబడి జయించుట సాధ్యము కాకపోగా నిశాచర రాజపుత్రుడు మాయాయుద్ధమున రామలక్ష్మణులను వధింపదలచి నాగపాశములను ప్రయోగించి వారిని బంధించినాడు.

అంతకు ముందుగనే రాముడు మేఘనాథుడున్నస్థానమును పరిశీలించుడని సుషేణాంగదాదులగు వానరులను నియోగించినాడు. కాని ఇంద్రజిత్తు వారిపై బాణసర్పమును వర్షించి ప్రయత్నహీనుల నొనర్చినాడు. తరువాత నాగపాశములచే బంధించి రామలక్ష్మణులనే తన తీక్ష్ణశరములకు లక్ష్యమొనర్చినాడు. శరరూపమును ధరించి సర్పములచే విద్ధములగు ఆసోదరుల శరీరములనుండి రుధిరము అత్యధికముగా స్రవించసాగినది. "అలక్షితుడనై యుద్ధమొనరించుచుండగా నన్ను త్రిదశేశ్వరు డయినను కనిపెట్టలేడు. ఇక మానవులయిన మీరెంత! రోషవ్యాప్త హృదయుడనగు నేను మిమ్ముల నిద్దరను వెంటనే యమసదనమున కంపెదను" అని పలికి అతడు వారిపై ఇంకను తీక్ష్ణములగు శరములను ప్రయోగించెను. వారి మర్మస్థలముల నన్నిటిని భేదించెను. రాఘవులు రావణిని ఒక్క అగ్గనిమిషమైనను చూడజాలకుండిరి. వారి శరీరములలో ఇంద్రజిత్శరవిద్ధముగాని ప్రదేశము అంగుళమాత్రమయినను లేదట! మర్మము లన్నియు భేదిల్లి, శరీరములనుండి రక్తము ధారలు కట్టుచుండగా ప్రథమమున శ్రీరాముడు బాధను భరింపజాలక మూర్ఛితుడయ్యెను. వారి ఎక్కిడిన ధనుస్సును హస్తమునసే ధరించి మూర్ఛితుడయిన అన్నగారి అవస్థనుచూచి లక్ష్మణుడును శోకపరవశుడై బాధను భరించజాలక మూర్ఛితుడయ్యెను. (ఇంద్రజిత్తు రామలక్ష్మణులను ప్రథమమున నాగపాశములచే బంధించి అనంతరము బాణములతో మర్మస్థలములను వేధించినాడు.) ఇట్లు శరశయనముపై పడియున్న సోదరులనుజూచి వాయుసుతాదులుకూడ ఎంతో దుఃఖించిరి. రామలక్ష్మణులు భూపతితులుగాగా ఇంద్రజిత్తు బాణవర్షమును ఆపెను.

అంతట సుగ్రీవాంగ నీల సుషేణ జాంబవంత హనుమంత విభీషణాదు లాస్థలమునకు వచ్చిరి. రామలక్ష్మణుల ఆ దీనావస్థకు శోకించుచు ఇంద్ర జిత్తుకై ఆకాశముగోనికి చూచిరి. కాని వారికి రావణి కన్పించలేదు. విభీషణుడును మాయావిశారదుడగుటచే అతనిని చూడగలిగెను. అంతట ఇంద్రజిత్తు ఇదివరకు రామప్రహారమర్దితులగు రాక్షసులనుజూచి ఇట్లు పలికెను. "ఈ రామలక్ష్మణులు నా నాగాస్త్రములచే బంధితు లయిరి. ఈ బాధనములనుండి విడిపింప మహర్షి సహితులగు దేవతలు కూడ సమర్థులుగారు. ఈనాటితో లోకభయంకరుడగు నాతండ్రి వ్యధ తీరినది. రామలక్ష్మణులయు, సుగ్రీవాది వానరులయు శక్తిసామర్థ్య ములు వ్యర్థములయినని." ఇట్లు పలికి ఇంద్రజిత్ సుగ్రీవాంగదాదులను వేరువేరుగా బాణములను ప్రయోగించి చిక్కుపరచెను. ఇతరులగు వానరయోధులును అతని తీక్ష్ణబాణములచే పీడితులయిరి. రామలక్ష్మ ణులు మరణించిరని తలచి రాక్షసులు ఇంద్రజిత్తును ఎంతో గౌరవించి పూజించిరి. చలనములేక, ఉచ్ఛ్వాసనిశ్వాసములులేక భూశేయను లయిన రామలక్ష్మణులను మరణించినవారిగా తలచి ఇంద్రజిత్తు పరమ సంతోషముతో లంకానగరమున ప్రవేశించెను.

మూర్ఛాగతులయిన రామలక్ష్మణులను చూడగనే భయగ్రస్తు డయిన సుగ్రీవుడు కన్నీరు విడువసాగెను. అంతట విభీషణుడు యుద్ధ ములలో ఇటువంటి పరిస్థితులు వచ్చుట సహజమని బోధించి అభిమం త్రిత జలములత్తో అతనినేత్రముల తుడిచెను. మన అదృష్టములు బాగుగ నుండినచో రామలక్ష్మణులకు ఇది మూర్ఛయేగాని మృత్యువు కాగూడదు. అంతేగాక ఇది వైక్లబ్యమునకు సమయముగాదు. ఒక్కొ క్కప్పుడు అతిస్నేహము మరణమునకుకూడ కారణము కాగలదు. కార్యనాశకమగు చింతను వదలి ఇప్పుడు మనసైన్యముల స్థితిని విచా రించుము. తిరిగి తెలివి వచ్చువరకు రామలక్ష్మణులను రక్షించవలసి యున్నది. వారు మృత్యుగతులు కాలేదు చూడుము. వారి ముఖశోభ మృత్యుగతులయినవారి కుండదు. నన్నుజూచి ఇంద్రజిత్తుగా భ్రమించి

పకువిడు సైన్యములను చక్కబరచుము. ఇట్లు విభీషణుడు సుగ్రీవుని ప్రబోధితునిజేసి తరువాత పకువిడుచున్న వానరసైన్యమును నిలువరించెను. నీలాంగద సుషేణ కునుద నలగజగవయగవాక్ష శరభ గంధమాదన జాంబవంత హనుమంతాదులగు వానరులందరును దశదిశలను పరిశ్రించుచు సర్వవానరసైన్యములను రక్షించి గర్జించుచ గదలినను రాక్షసు డేమో నను భావమును ప్రకటించిరి.

ఇంద్రజిత్తు నగరమున ప్రవేశించి తండ్రిని దర్శించి నాగపాశబంధములచే బంధితులనొనర్చి రామలక్ష్మణులను వధించితినని చెప్పినాడు. రావణుడు సంతుష్టాంతరంగుడై పుత్రుని కౌగలించుకొని మూర్ధాఘ్రాణమొనర్చి అభినందించి స్వగృహమునకు పంపెను. రావణుడు రామలక్ష్మణులు మరణించిరని భావించి సీతను రక్షించుచున్న త్రిజట యను రాక్షసిని రావించి "రామలక్ష్మణులు యుద్ధభూమిలో మరణించినారు. జానకిని పుష్పకముపై కెక్కించి వారిని కనపర్చుము. దానితో నిరాశతో నన్ను చేబట్టగలదు." అని ఆజ్ఞాపించినాడు. త్రిజట అట్లే అని సీతను పుష్పకముపై కెక్కించి యుద్ధభూమికి తీసుకునెళ్ళినది. విధ్వంసిత కవచులు, భ్రష్టచాపులు, శరమయ దేహులు అయి భూమిపై పడియున్న రామలక్ష్మణులను చూచి జానకి దుఃఖార్తయై ఇట్లు విలపించినది.

"మానవలక్షణములు తెలిసిన జ్ఞానులు, ఈమె పుత్రవంతురాలు కాగలదు. పుణ్యస్త్రీగనే మరణించును. విధవ కాదు" అని చెప్పిరి. కాని వారిమాటలు ఈనాడు అన్యతములయినవి. యజ్ఞానుష్ఠానపరులు నన్ను యజ్ఞకర్త యగువాని భార్యగా జెప్పిరి. కాని చాము డీవిధముగ మృతిసందుటచే వారును సన్యతవాదులే అయిరి. మహావీరుడగు పార్థివుని పత్నియై ధన్యురాలగు నన్ను జ్ఞానులమాటలుకూడ నేడు అన్యతములయినవి. పాదములందున్న ఈ పద్మములు నరేంద్రునితో కలిసి అభిషిక్తురా లగుటను సూచించు నన్న వాక్యములు వృథా అయినవి. వైధవ్యసూచకయు లగు లక్షణము లేవియు లేకపోయినను నాకాదశ ఎట్లు ప్రాప్తించినదో తెలియదు. ఈ శుభలక్షణము లన్నియు

వ్యర్థమయినట్లున్నవి. (వైధవ్యసూచకము లగు దుర్లక్షణములు సాము
(దికశాస్త్రమున చెప్పబడినవి– పాదాంగుష్ఠములు ఒకదానిపై మరొకటి
ఆరూఢమయినచో ఆస్త్రీ బహుభర్తల నయినను సరే వధించి పరునితో
లేచిపోవును. నడచుచున్నప్పుడు కనిష్ఠిక భూమిని స్పృశింపకపోయిన
ఇద్దరు పతులను హతమొనర్చును. రెండవ(వేలు భూమిని స్పృశింపక
పోయిన ముగ్గురు భర్తలను వధించును. రోమకూపములలో ఒకే
రోమము ఉన్నట్లయిన రాజపత్ని యగును. రెండు రోమములున్న
సుఖముగా నుండును. మూడు రోమములున్న వైధవ్యదుఃఖము ననుభ
వించును.) అన్వర్థములగు ఈ పద్యములు స్త్రీలకు శోభాకారకములని
లక్షణజ్ఞులు చెప్పినారు. కాని వారిమాటలున్ను వితథము లయినవి.
కేశములు సూక్ష్మములుగాను, సమముగాను, నీలవర్ణముగాను ఉన్నవి.
కనుబొమలు కలియక విడివిడిగా నున్నవి. జంఘలు వర్తులములుగాను,
రోమరహితములుగాను ఉన్నవి. దంతములు దగ్గరదగ్గరగా కలిసి
యున్నవి. శంఖప్రదేశములు (నేత్రములకు దగ్గరగానున్న లలాటపార్శ్వ
ములు, గూబలు.) నేత్రములు, కరములు, పాదములు, గుల్భములు,
ఊరువులు యోగ్యములుగా నున్నవి. వృత్తాకారమగు గోళ్లు గలిగి
(వేళ్ళ సమానముగా నున్నవి. స్తనములు వర్తులగాను, మాంసల
ములుగాను, మగ్నచూచుకములుగాను ఉన్నవి. నాభి ఉన్నతమగు
పర్యంతప్రదేశము గలిగి లోతుగా నున్నది. పార్శ్వభాగములును, వక్ష
స్థలమును ఉచితమగు రీతిని ఉన్నవి. శరీరవర్ణము మణికాంతివలె అతి
స్నిగ్ధ మయినది. శరీరమందలి రోమములు అతిమృదువయినవి. పది
పాదాంగుళులు, రెండుపాదములు–మొత్తము ఈ పన్నెండు అవయవ
ములచేతను భూమిపై పూర్తిగ సుప్రతిష్ఠిత నగు నన్ను సర్వశుభలక్షణ
వతినిగా సాముద్రికులు పేర్కొనినారు. హస్తపాదములయొక్క (వేళ్ళ
యవాకార రేఖలు గలిగి ఛిద్రరహితములుగా ఉండి, నిత్యమందస్మిత
యగు నీమె శుభలక్షణ యని కన్యాలక్షజ్ఞులు పల్కుచుండెడివారు.
ఈమె తప్పక అభిషిక్తరాజై పట్టమహిషి కాగలదని వారనెడివారు.

కాని వారి వాక్కు లన్నియు అన్యతము లయినవి. ఈ సోదరు లిద్దరునూ నాకొరకై జనస్థానమును అన్వేషించి, సముద్రమును దాటి ఇచ్చటికి వచ్చినారు. సర్వాస్త్రవిదులయ్యును అదృశ్యుడై మేఘనాథుడు యుద్ధమొనర్చుటచే అభాగ్యనగు నావలన సహాతు లయినారు. రామలక్ష్మణు లీవిధమున మరణింపగా నాకొరకై గాని, నా తల్లికొరకై గాని దుఃఖించను. కాని రాముడు సీతాలక్ష్మణసమేతుడై ఎప్పుడు వచ్చును, వారిని ఎప్పుడు చూచెదను అని దుఃఖించుచు ఎదురుచూచు అత్త కౌసల్యకై దుఃఖించెదను."

ఇట్లు దుఃఖించుచున్న జానకిని త్రిజట ఓదార్చసది. "జానకీ విచారించకుము. నీ భర్త మరణించినట్లు తోచుట లేదు. దానికి కారణము లున్నవి వినుము– అధిపతులు యుద్ధమున మరణించినచో సైనికుల ముఖములు కోపయుక్తములుగాను, ఉత్సాహవంతములుగాను ఉండవు. అంతేగాక ఈ పుష్పకవిమానము దివ్యమగుటచే వాహు గతచేతను లయినచో విధవయగు నిన్ను వహించదు. సముద్రములో చుక్కాని విరిగినచో నావ ఎట్లు వ్యాకులమగునో అట్లే వీరు మరణించినచో సేనలు హతోత్సాహులై పారిపోగలవు. అట్లుచేయక వీరు కోతుల్తునులను రక్షించుచున్నారు. నామాటలయందు విశ్వాసముంచి నీవు స్వస్థురాలవుగమ్ము. నీపై జనించిన స్నేహముచే నే నీమాటలను చెప్పుచున్నాను. నే నింతవరకు ఎన్నడును అసత్యమును పలుక లేదు. నీ పవిత్రచారిత్ర్యసౌశీల్యములు నన్ను లోబరచుకొన్నవి. వీరి మహాత్మ్య భావత్వమును పరికించినచో ఇంద్రాదులయిన దేవతలుకూడ వీరిని వధింపలేరని తోచుచున్నది. అంతేగాక వీరి ముఖములు జీవనలక్ష్మ్మి యుతములై కన్పట్టుచున్నవి. కనుక వారికై మరణించు నిశ్చయమును విరమింపుము."

త్రిజటవాక్యములను విని జానకి "నీవాక్యములు యథార్థము లగుగాక" అని కృతాంజలియై పలికినది. పుష్పకము తిరిగి అశోకవన మును చేరినది.

తరువాత కొంతసేపటికి శరపీడితుడై యున్నప్పటికిని అధిక సత్త్వశాలియగుటచే రాముడు విగత మోహుడై మేల్కొనెను. మేల్కొని సుధీరదేహుడు, విషణ్ణుడు అగు లక్ష్మణుని జూచి పరమదుఃఖార్తహృదయుడై ఎంతో చింతించెను. (ఈభాగము భ్రాతృస్నేహప్రతిపాదక ఘట్టములలో ఉత్తమోత్తమ మయినది. సోదరునికై సర్వధర్మములను మరచి రాము డెంతపరవశు డయినాడో తెలియజేయగలము. ఆ భాగమును ఇక్కడ పొందుపరచుచున్నాము.

కిం ను మే సీతయా కార్యం కిం కార్యం జీవితేన వా
శయానం యో ఽధ్య పశ్యామి భ్రాతరం యుధి నిర్జితం॥

యుద్ధమందు నిర్జితుడై భూపతితుడైన సోదరుని జూచిన నాకు సీతవలన ఉపయోగ మేమున్నది. అంతేగాదు ఈ జీవితముమాత్ర మెందులకు. అనగా లక్ష్మణుడు రామునకు సర్వాధికుడని భావము.

శక్యా సీతాసమా నారీ మర్త్యలోకే విచిన్వతా
న లక్ష్మణసమో భ్రాతా సచివ స్సాంపరాయితః॥

ఈ భూమండలమును పరిశోధించినచో నాకు సీతవంటి మరియొక స్త్రీ దొరుకవచ్చును. కాని లక్ష్మణునివంటి సోదరుడుగాని కార్యసహాయుడుగాని, యుద్ధనైపుణ్యము గలవాడు గాని మరియొకడు దొరుకడు. ఈ శ్లోకములో లక్ష్మణుని పాత్ర రాముని జీవితములో ఎటువంటిదో వ్యక్తపరుపబడినది.

పరిత్యక్ష్యా మ్యహం ప్రాణం వానరాణాం తు పశ్యతాం
యది పంచత్వ మాపన్న స్సుమిత్రానందవర్ధనః॥

సుమిత్రయొక్క ఆనందమును వర్ధిల్లజేయు లక్ష్మణుడే గనుక మృతినందియున్నట్లయిన నేను ఈ వానరులు చూచుచుండగనే ప్రాణత్యాగ మొనర్చెదను. వనప్రయాణకాలమున సుమిత్ర "రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజాం" అని లక్ష్మణునికి ఉపదేశించినది. ఆమె ఉపదేశమును యోగ్యముగా అనుసరించినవాడగుటచే అతడు తల్లియొక్క ఆనందమును వర్ధిల్లజేసినవా డయినాడు.

కి న్న పావక్ష్యామి కౌసల్యాం మాతరం కి న్న కైకయీం
కథ మంబాం సుమిత్రాం చ పుత్రదర్శనలాలసాం॥
వివత్సాం వేపమానాం చ క్రోశంతీం కురరీ మివ
కథ మాశ్వాసయిష్యామి యదా యాస్యామి తం వినా॥

లక్ష్మణుడు లేకుండా అయోధ్యకు వెళ్ళినచో తల్లులగు కౌసల్యా కైకేయులకు ఏమి చెప్పగలను? పుత్రుసిచూచు కుతూహలముతో ఎదురుచూచుచున్న సుమిత్రకు ఏమి చెప్పగలను? వత్సము మరణింపగా ఆక్రోశించుచున్న ఆవు లేడివలె కంపితగాత్రియై శోకించు ఆమెను ఎట్లు ఓదార్చగలను?

కథం వక్ష్యామి శత్రుఘ్నం భరతం చ యశస్వినం
మయా సహ వనం యాతో వినా తేన గతః పునః॥

భరతశత్రుఘ్నులకు నాతో వనమునకు వచ్చిన ఇతడు లేకుండా తిరిగి వెళ్ళి ఏమి చెప్పగలవాడను?

ఉపాలంబం నశక్ష్యామి సోఢుం బత సుమిత్రయా
ఇ హైవ దేహం త్యక్ష్యామి వ హి జీవితు ముత్సహే॥

నే నొక్కడే తిరిగి వెళ్ళినట్లయిన సుమిత్రయొక్క ఉపాలంభమును (ఎత్తిపొడుపు మాటలను) సహించజాలను. ఇక నాకు జీవితముపైన నే ఇచ్ఛలేదు. ఇక్కడే దేహమును త్యజించెదను.

ధి జ్మాం దుష్కృతకర్మాణం అనార్యం యత్కృతే హ్యసౌ
లక్ష్మణః పతిత శ్శేతే శరతల్పే గతాసువత్॥

దుష్కృత కర్మలు నొనర్చిన అనార్యుడను నేను. నాకొరకై లక్ష్మణుడు శరతల్పమున గతాసువువలె పడియున్నాడు. నేనెంతనీచుడను!

త్వం నిత్యం సవిషణ్ణం మా మాశ్వాసయసి లక్ష్మణ
గతాసు ర్నాద్య శక్నోషి మా మార్త మభిభాషితుం॥

లక్ష్మణా! నీవు ప్రతిదినము సీతకై దుఃఖించునపుడు ధైర్యవచనములను పలికి ఓదార్చువాడవు. కాని ఇప్పుడు ప్రాణరహితుడవై ఆర్తుడనయిన నన్నెందులకు ఓదార్చవు?

యే నాద్య నిహతా యుద్ధే రాక్షసా వినిపాతితాః
తస్యా మేవ క్షితౌ వీర స్య శేతే నిహతః పరైః॥

నేడు ఏ వీరుని చేతనయితే అనేకులగు వీరులు యుద్ధభూమిలో నిహతులై పడిరో ఆభూమిలోనే ఆవీరుడు శత్రుహతుడై పడియున్నాడు.

శయానం శ్మశానే ఽస్మిన్ స్వశోణితపరిప్లుతం
శరజాలై శ్చితం భాతి భాస్కరో ఽస్త మివ వ్రజన్॥

తన రక్తముచేతనే ఎర్రనయిన శరీరముతో ఈ శరతల్పమున పడియుండి ఇతడు అస్తమయమును పొందుచున్న సూర్యునివలె ప్రకాశించుచున్నాడు. శరీరమున గ్రుచ్చుకున్న శరములు సూర్యకిరణముల వలె నున్నవి.

బాణాభిహతమర్మత్వా న్న శక్నో త్యభిభాషితుం
రుజా చాబ్రువతో ప్యస్య దృష్టిరాగేణ సూచ్యతే॥

ఇతడు నాతో సంభాషింపగోరుచున్నాడు. కాని శరవిద్ధమర్మస్థలుడగుటచే మాట్లాడ లేకున్నాడు. కాని మాట్లాడవలెనను ఇతని అభిలాష నేత్రములందు దృశ్యమాన మగు ప్రేమలో కన్పించుచున్నది.

య థైవ మాం వనం యాంతం అనుయాతో మహాద్యుతిః
అహ మప్యనుయాస్యామి తథై వైనం యమక్షయం॥

తల్లి, భార్య, బంధువులు, రాజసుఖములు మొదలగు సర్వమును వదలి వనవాసప్రయాణకాలమున మహాతేజశ్శాలియగు నితడు నన్ను ఎట్లు అనుసరించెనో అట్లే నేనును సర్వప్రేమలను పరిత్యజించి ఇతనితో యమసన్నిధానమును పొందెదను.

ఇష్టబంధుజనో నిత్యం మాం చ నిత్య మనువ్రతః
ఇమా మవస్థాం మ మానార్యస్య దుర్ణయైః॥

ఇతడు నిత్యము బంధుజనులకు ఇష్టుడు. జన్మ మొదలుకొని నన్ను అనుసరించి యుండినవాడు. అట్టి సోదరుడు ఈనాడు నా దుష్కృత్యములచే ఈ అవస్థను పొందినాడు.

సుకుట్టే నాపి వీరేణ లక్ష్మణేన న సంస్మరే
పరుషం విప్రియం వాఽపి శ్రావితం న తదాచన ॥

మహావీరుడగు ఇతడు ఎంతటి క్రోధమునకు వశుడయినను పరుషమగు ప్రియరహితవాక్యము ఎన్నడూ పలుక లేదు.

విసస్రజైత వేగేన పంచబాణశతాని యః
ఇష్వస్త్రేష్వధిత స్తస్మా త్కార్తవీర్యా చ్చ లక్ష్మణః ॥

కార్తవీర్యార్జునుడు తన సహస్రబాహువులతోడను అయిదువందల చాపములను గ్రహించి అయిదువందల బాణములను ఎంతలో ప్రయోగించెడివాడో లక్ష్మణుడు అదేకాలమున తన రెండుబాహువుల తోడను అన్ని బాణములను వదలగలడు. అంతేగాక శస్త్రాస్త్ర జ్ఞానమందు కార్తవీర్యుని మించినవాడు కూడను.

అస్త్రైరస్త్రాణి యో హన్యా చ్చక్రస్యాపి మహాత్మనః
సోఽ యమస్మాం హత శ్శేతే మహార్హాశయనోచితః ॥

దేవేంద్రప్రయుక్తములగు సమంత్రకములగు అస్త్రముల నన్నిటిని ప్రత్యస్త్రములచే నివారింపగల సమర్థుడితడు. హంసతూలికా తల్పములందు శయనించవలసిన ఇతడు యుద్ధభూమిలో శయనించి యున్నాడు.

అస్మి న్మహాహ్రే సుగ్రీవ ప్రతియాత మిహోర్ణసి
మత్వా రాజ్ఞ మయా హీనో రావణాం ఽభిద్రవేద్బలీ ॥

సుగ్రీవా నీవీక్షణమునను ససైన్యుడవై తిరిగి వెళ్ళుట మంచిది. లేనిచో నేను లేనని బలశాలియగు రావణుడు నిన్ను ఏమయినను చేయగలడు.

య న్మయా న కృతో రాజా రాక్షసానాం విభీషణః
త చ్చ మిథ్యాప్రలప్తం మాం ప్రదక్ష్యతి న సంశయః॥

విభీషణునకు నిన్ను రాజు నొనరించెదనని మాట ఇచ్చితిని. కాని ఆమాట అసత్యమయినది. ఈవిధమయిన మిథ్యాప్రలాపము నన్ను తప్పక దహించగలదు.

అంగదం తు పురస్కృత్య ససైన్య స్ససుహృజ్జనః
సాగరం తర సుగ్రీవ నీలే చ నలేన చ॥

సుగ్రీవా ! యువరాజను అంగదుని, సేనాధిపతియగు నీలుని, నలుని, ఇతరమిత్రులను, సేనలను వెంటనిడుకొని శీఘ్రముగా సముద్ర మును దాటి వెళ్ళుము.

కృతం హనుమతా కార్యం యు దన్యై స్దుష్కరం రణే
ఋక్షరాజేన తుష్యామి గోలాంగూలాధిపేన చ॥

హనుమంతుడు నాకై సముద్రతరణాదులను అనేక దుష్కర కార్యముల నాచరించినాడు. యుద్ధమందును అనన్యపరాక్రమమును ప్రదర్శించినాడు. జాంబవంతుడును నాకై చేసిన ఘోరయుద్ధమునకు పరితుష్టుడయితిని.

అంగదేన కృతం కర్మ మైందేన ద్వివిదేన చ
యుద్ధం కేసరిణా సంఖ్యే ఘోరం సంపాతినా కృతం॥
గవయేన గవాక్షేణ శరభేణ గజేన చ
ఆహ్వయే శ్చ హరిభ ర్యుద్ధం మదర్థే త్యక్తజీవితైః॥

అంగదుడు నాకై ఎంతో శ్రమపడినాడు. మైందద్వీదులు నాకై శ్రమించినారు. కేసరిసంపాతులు ఘోరయుద్ధ మొనర్చినారు. గజ గవయగవాక్షశరభాదులగు ఇతరవానరులు నాకై జీవితములపై నాశ వదలుకొని యుద్ధమొనర్చినారు.

న చాతిక్రమితుం శక్యం దైవం సుగ్రీవ మానుషైః
యత్తు శక్యం వయస్యేన సుహృదా చ పరంతప
కృతం సుగ్రీవ తత్సర్వం భవతా ధర్మభీరుణా॥

మనుష్యప్రయత్నములచే మనము ఎంత ప్రయత్నించినను దైవ మును అతిక్రమింపలేము. ధర్మభీరుడవగు నీవు సుహృదుడగు వయస్యు డు చేయగలిగినదంతయు చేసినావు. కాని లాభములేకపోయినది.

మిత్రకార్యం కృత మిదం భవద్భి ర్వానరర్షభాః
అనుజ్ఞాతా మయా సర్వే యథేష్టం గంతు మర్హథ॥

వానగ్రశ్రేష్ఠులను మీరెల్లరు మిత్రకార్యసాధనకై ప్రాణములను లెక్కచేయక ప్రయత్నించినారు. అయినను ఇకమీద నేనుచేయగలిగిన దేమియు లేదు. నేను అనుజ్ఞ నిచ్చుచున్నాను. మీరెల్లరు మీ ఇష్టమువచ్చినట్లు వెళ్ళవచ్చును.

రణభూమిలో విగతసంజ్ఞుడయిన లక్ష్మణునికై దుఃఖించుచున్న రాముని వచనములను విని సుగ్రీవాదులగు వానరులు బదులుపలుకలేక దిగులుగా కూర్చొనియుండిరి. అంతట దూరమున సైన్యములను సరిజేయుచున్న విభీషణుడు రామప్రబోధవార్తను విని అతిశీఘ్రముగా పరువిడ రా నారంభించెను. ఆసమయమున అతనిని చూచి వానరులనేకులు ఇంద్రజిత్తనుభ్రమచే భయభీతులై పారిపోసాగిరి. వానరుల ఈ భయమును చూచి సుగ్రీవుడు అంగదుని కారణమడిగెను. అంగదుడు రామలక్ష్మణుల దీనావస్థ దీనికి కారణము కావచ్చనెను. ఇంతలో గదాపాణియగు విభీషణు డాస్థలమునకు వచ్చెను. సుగ్రీవుడు జాంబవంతునితో "విభీషణుని చూచియే సేనలు భయపడుచున్నవి. నీవు పోయి వాటిని నిలువరింపుమనెను. జాంబవంతుడు యథార్థమును తెలిపి సేనలను ప్రకృష్ట మొనర్చెను. విభీషణుడు రామలక్ష్మణుల దీనస్థితిని జూచి విచారించగా సుగ్రీవు డతనిని ఓదార్చెను.

తరువాత సుగ్రీవుడు సుషేణునితో "నీవు కొంతమంది వానరులను సహాయులుగా గొని ఈ రామలక్ష్మణులను కిష్కింధకు చేర్చుము. నేను మిగిలినసేనలతో రావణుని సపుత్రమిత్రబాంధవముగా వధించి జానకిని తెచ్చెదను" అని చెప్పెను. అంతట సుషేణు డతని కిట్లు ధైర్యమును చెప్పెను– "నేను అనేక దేవాసురయుద్ధములను చూచితిని. అందు దానవులు దేవతలను తీక్ష్ణశరములచే వేదించి విసంజ్ఞుల నొనర్చెడివారు. అట్టివారి నందరను సురగురువు మంత్రవిద్యలచేతను, ఓషధుల చేతను బ్రతికించెడివాడు. సంజీవవిశల్యకరణులను ఓషధులు క్షీరసాగర మందున్న చంద్ర ద్రోణములను పర్వతములపై నున్నవి. సంపాతి పన సులా విషయము నెరుగుదు. ఇప్పు డెవ్వరైన వాటిని తెచ్చినచో వీరు తప్పక జీవించగలరు. ఈ వాయుసుతుడయిన హనుమంతు డక్కడకు వెళ్ళినచో తేగలడు."

ఇట్లు సుషేణుడు పలుకుచుండగనే పక్షవాతముచే అనేక అద్భుతములను సృష్టించుచు గరుత్మంతు డాస్థలమునకు వచ్చెను. పక్షవాతమునచే లంకాద్వీపమందలి సర్పము లన్నియు సముద్రమున దాగినవట. ఇక రామలక్ష్మణ శరీరములను బంధించి సర్పము లెట్లుండగలవు? అగ్ని వలె మండుచున్న వైనతేయు డాప్రదేశమునకు రాగనే వారిని బంధించిన సర్పములు భయత్రస్తములై పరువులిడినవి. సుపర్ణుడు రామలక్ష్మణుల నభినందించి తన హస్తముతో వారి శరీరములను నిమిరెను. దానితో వారిశరీరములందలి వ్రణము లన్నియు మాయమై నీరోగులు పూర్వవద్బలశాలురు అయిరి. పేరితేజోవీర్యబలోత్సాహములు ద్విగుణీకృతములయినవట. వైనతేయుడు వారిద్దరిని లేపి కూర్చుండబెట్టి కౌగలించుకొనెను. అంతట రాముడు అత్యంతహర్షముతో వైనతేయుని పరిచయము నడిగెను. "నేను గరుత్మంతుడను, నీకు మిత్రుడను మీకు సహాయమొనర్చుటకే ఇక్కడకు వచ్చితిని. కద్రూపుత్రులగు నాగములనేకములు శరరూపములను ధరించి ఇంద్రజిత్తునొద్ద నున్నవి. ఈ బంధములను నేనుతప్ప దేవదానవాసురయక్షగంధర్వాదులుగాని మరెవ్వరుగాని విడిపింపలేరు. నీ కీసహాయ మొనర్చుటచే ధన్యుడనైతిని. రాక్షసుడు మిమ్ములను నాగశరములచే బంధించినాడని విని మన పూర్వస్నేహమును పరిపాలించుటకై వచ్చితిని. నాకు సెలవిమ్ము. వెళ్ళివచ్చెదను. మన స్నేహ మెక్కడిదని పృచ్ఛించకుము. యుద్ధానంతరము కృతకృత్యుడనైనతరువాత వెల్లడికాగలదు. రాక్షసులు మాయాయుద్ధవిశారదులు. కాన జాగ్రత్తగా ఉండవలసినది" ఇట్లు పలికి వైనతేయుడు రాముని వద్ద సెలవు తీసికొని వెడలిపోయెను. రామలక్ష్మణులు ప్రబోధితులుకాగా వానరసేనలు ఆనందముతో గర్జనల నొనరించినవి.

ఈ నాగబంధఘట్ట మంతము అధ్యాత్మరామాయణమున వర్ణితముకాలేదు. మీదు మిక్కిలి రాముడు బ్రహ్మాస్త్రప్రయోగమొనర్చెద ననగా విని ఇంద్రజిత్తు యుద్ధభూమిని వదలివెళ్ళినట్లు వ్రాయబడినది. ఈభేదమంతయు కల్పభేదము ననుసరించినదని పౌరాణికమతము.

పూర్వవ ద్భైరవం నాదం నానరాణాం బలౌఘతః
శ్రుత్వా విస్మయ మాపన్నో రావణో వాక్య మబ్రవీత్ ॥

మేఘనాథుడు తన తీక్ష్ణశరజాలములచే వానరసైన్యముల నన్ని టిని విసంజ్ఞుల నొనర్చి వచ్చినతరువాత తిరిగి వారి భయంకరసింహ నాదములను విని రావణుడు విస్మయచకితుడయ్యెను. అతడు తనవద్ద నున్న సేనాధ్యక్షులకు ఇట్లాజ్ఞల నిచ్చెను.

రాఘవో మే మహాన్ శత్రుః ప్రాప్తో దేవనిర్మితః
హంతుం తం సమరే శీఘ్రం గచ్ఛన్తు మమ యూథపాః ॥

రాఘవుడు నాకు ప్రబలశత్రువయినాడు. అతనిని నాకై దేవతలు నిర్మించినట్లు తోచుచున్నది. కనుక సేనానులగు మీరెల్లరు ససైన్యులై వానిని వధించుటకు బయలుదేరి వెళ్ళుడు.

మంత్రిణో బాంధవాః శూరా యే చ మత్ప్రియకాంక్షిణం
సర్వే గచ్ఛన్తు యుద్ధాయ త్వరితం మమ శాసనాత్ ॥

నా క్షేమమును కోరు మంత్రులు, బాంధవులు, ఇతరశూరులు, నగరవాసులు సర్వులూ నా ఆజ్ఞను శిరసావహించి యుద్ధభూమికి వెళ్లుడు.

యే న గచ్ఛన్తి యుద్ధాయ భీరవః ప్రాణవిప్లవాత్
తా న్హనిష్యా మ్యహం సర్వా న్మచ్ఛాసనపరాఙ్ముఖా ॥

ఎవరు ప్రాణభయముచే నా శాసనము నతిక్రమించి యుద్ధ భూమికి వెళ్ళరో వారినందరను నేను ఇక్కడనే వధించెదను.

తచ్ఛ్రుత్వా భయసంత్రస్తా నిర్జగ్ముర్ణరకోవిదాః
అతికాయః ప్రహస్తశ్చ మహాపార్శ్వమహోదరౌ
దేవశత్రు ర్నికుంభశ్చ దేవాంతకనరాంతకౌ
అపరే బలినః సర్వే యయు ర్యుద్ధాయ వానరైః ॥

రావణుని కఠోరశాసనమును విని భయభీతులయి రణకోవిదులగు అతికాయుడు, ప్రహస్తుడు; మహాపార్శ్వమహోదరులు, దేవశత్రువగు నికుంభుడు, దేవాంతక నరాంతకులు మొదలగువారును, ఇంకను

నగరమునన్న బలశాలురందరును వానరులతో యుద్ధమొనర్చుటకు వెళ్ళిరి.

ఏతే చాన్యే చ బహవః శూరాః శతసహస్రశః
ప్రవిశ్య వానరం సైన్యం మమంథు ర్బలదర్పితాః ॥

పైనజెప్పిన మహావీరులును, ఇతర వేలకొలది మహాశూరులును బలదర్పితులై వానరసైన్యసాగరమున ప్రవేశించి సముద్రమును మథించి నట్లు మథించిరి. అనగా వానరసైన్యమును చిందరవందర చేసిరని భావము.

భూషుండై ర్భిందిపా లై శ్చ బాణైః ఖడ్గైః పరశ్వధైః
అన్యై శ్చ వివిధై రస్త్రై ర్నిజఘ్ను ర్హరియూథపాన్ ॥

వారు భూషుండములు, భిందిపాలములు, బాణములు, ఖడ్గములు, గండ్రగొడ్డళ్ళు, ఇంకను వివిధాయుధములను ఉపయోగించి వానరసేనానాయకులను అనేకులను సంహరించిరి.

తే పాదపైః పర్వతాగ్రై ర్నఖదంష్ట్రై శ్చ ముష్టిభిః
ప్రాణై ర్విమోచయామాసుః సర్వరాక్షసయూథపాన్ ॥

ప్రత్యర్థులగు వానరసేనానులు వృక్షములను, పర్వతశిఖరములను, నఖములను, దంతములను, ముష్టులను ఉపయోగించి రాక్షస సేనాపతుల ననేకులను సంహరించిరి.

రామేణ నిహతాః కేచిత్ సుగ్రీవేణ తథా వరే
హనూమతా చాంగదేన లక్ష్మణేన మహాత్మనా
యూథపై ర్వానరాణాం తే నిహతాః సర్వరాక్షసాః ॥

ప్రహస్తాది వానరయోధులలో కొందరు రామునిచే నిహతులయిరి. కొందరిని సుగ్రీవుడు వధించెను. అంగదహనూమల్లక్ష్మణులు కొందరి కొందరిని వధించి తిక్కన మహావీరులు సామాన్య రాక్షసుల నందరను వధించిరి.

రామతేజసి సమ్రూఢిర్య్ వానరా బలినో ఽభవన్
రామశక్తివిహీనానా మేవం శక్తిః కుతో భవేత్ ॥

శ్రీరామచంద్రుడు నిత్యధర్మపరుడగుటచే అతని మహాతేజముచే రక్షితులగు వానరులు మహాబలశాలురయిరి. కనుకనే రాక్షసులను వధించగలిగిరి. కాని రాక్షసులు అధర్మపరుడగు రావణునిచే పరిపాలితులు. కనుక వారి కట్టి శక్తిసామర్థ్యము లెట్లు సంభవించును ?

సర్వేశ్వరః సర్వమయో విధాతా
మాయా మనుష్యత్వలిడంబనేన
సదా చిదానందమయో ఒపి రామో
యుద్ధాదిలీలాం వితనోతి మాయామ్ ॥

శ్రీరామచంద్రుడు సర్వబ్రహ్మాండ నియామకుడు. సర్వబ్రహ్మాండములందును వ్యాపించియుండువాడు. సృష్టిప్రవర్తకుడు, శుద్ధచైతన్యమూర్తి. అయినను లోకసంగ్రహణమునకై మాయామానుషరూపధారియై యుద్ధము మొదలగు అనేకలీలలను ప్రవర్తింపజేయుచున్నాడు. ఇదియంతయు మాయాస్వరూపమేగాని మరియొకటికాదు.

ఈ సర్గయందలి "తచ్ఛ్రుత్వా భయసంత్రస్తా నిర్జగ్ముర్లంకా రణకోవిదాశ్" అను శ్లోకములో దాని తరువాతిశ్లోకములోను రాక్షసవీరులందరును యుద్ధమునకు వెడలిరనిచెప్పి, సర్గాంతమున వారందరు మరణించినట్లు వర్ణింపబడినది. ఈవృత్తాంతము వాల్మీకిరామాయణమునకు పూర్తికా భేదించునదిగా నున్నది. నాగపాశ బంధవిమోక్షణానంతరమున రావణుడు వరుసగా ధూమ్రాక్షుడు, వజ్రదంష్ట్రుడు, ప్రహస్తుడు అను నలుపురను ఒకరితరువాత నొకరిని వానరసైన్యములపైకి పంపగా ధూమ్రాక్షు, అకంపనులను హనుమంతుడును, వజ్రదంష్ట్రుని అంగదుడును, ప్రహస్తుని నీలుడును వధించినట్లు వాల్మీకము. ప్రహస్తుడు రావణుని సర్వసేనాధిపతి. దేవాసురయుద్ధములలో అరితేరినవాడు. అట్టివాడు మరణించగనే రావణుడు అతికాయాదులగు పుత్రులను కుంభనికుంభాదులగు సోదరపుత్రులను, ఇతరసేనానులను వెంటబెట్టుకుని యుద్ధభూమికి బయలుదేరినట్లు వర్ణింపబడినది.

పంచమ సర్గ

శ్రీ మహాదేవ ఉవాచ :—

శ్రుత్వా యుద్ధే బలం నష్ట మతికాయముఖం మహత్
రావణో దుఃఖసంతప్తః క్రోధేన మహతా వృతః ॥

అతికాయుడు మొదలుగాగల రాక్షసవీరులందరును యుద్ధ భూమిలో నిహతులయినారనివిని రావణుడు దుఃఖభారమును భరింప లేకపోయెను. క్రమముగా ఆదుఃఖము క్రోధముగా పరివర్తనచెందెను.

నిధా యేంద్రజితం లంకారక్షణార్థం మహాద్యుతిః
స్వయం జగామ యుద్ధాయ రామేణ సహ రాక్షసైః ॥

మహాప్రభావశాలియగు రావణుడు లంకానగరరక్షణార్థమయి ఇంద్రజిత్తును నియమించి తాను స్వయముగా రామునితో యుద్ధ మొనర్చుటకు ససైన్యుడై పురము వెలువడెను.

దివ్యం స్యందన మారుహ్య సర్వశస్త్రాస్త్రసంయుతం
రామ మే వాభిదుద్రావ రాక్షసేంద్రో మహాబలః ॥

సమస్త శస్త్రాస్త్రసంయుతమగు దివ్యరథమునపై ఆరూఢుడై రాక్షసచక్రవర్తి రాముడున్న దిక్కుకే రథమును తోలించెను.

వానరాణ బహుశో హత్వా బాణై రాశీవిషోపమైః
పాతయామాస సుగ్రీవప్రముఖాన హరియూథపాన్ ॥

కాలకూట విషయుక్తములగు సర్పములవలె భయంకరములయిన శరములను వర్షముగా గురిపించి రావణుడు అనేకులగు వానరయోధులను మృత్యుగతులను చేసెను. అంతట సుగ్రీవాదులగు నాయకులు అర్ధమూర్ఛితులుగా వారినికూడ బాణపాతముచే ఓడించెను.

గదాపాణిం మహాసత్వం తత్ర దృష్ట్వా విభీషణం
ఉత్ససర్జమహాశక్తిం మయిదత్తాం విభీషణే ॥

ఇంతలో అతనికి విభీషణుడు కొదమరుపడినాడు. విభీషణుని చూడగనే రావణునిక్రోధము భగ్గునమండినది. వెంటనే దానవశిల్పి మయు

మయుడిచ్చిన మహాశక్తిని చేధరించి దానిని విభీషణునిపై ప్రయోగించెను.

తా మాపతంతీ మాలోక్య విభీషణవిభూతినీం
ధత్తాభయో ఒయం రామేణ వధార్హో నా య మాసురః ॥

రావణప్రయుక్తమయిన శక్తి మహానాదమొనరించుచు విభీషణునిమీదకు రాసాగెను. దానిని చూడగనే లక్ష్మణుడు "ఇది విభీషణుని వధించగలదు. కాని రాముడు అతనికి అభయమిచ్చినాడు కనుక అతడు వధింపబడుట యుక్తముగాదు" అని భావించెను.

ఇ త్యుక్త్వా లక్ష్మణో భీమం చాప మాదాయ వీర్యవాన్
విభీషణస్య పురతః స్థితో ఒకంప ఇ వాచలః
సా శక్తి ర్లక్ష్మణతనుం వి వే శా మోఘశక్తితః॥

ఇట్లు విభీషణుని రక్షించవలెనని భావించి లక్ష్మణుడు భయంకరమగు చాపమును ధరించి ధైర్యముతో నిష్కంపమగు శైలమువలె విభీషనుని ముందుకువచ్చి నిలబడెను. రావణప్రయుక్తమగు శక్తి అమోఘమయిన దగుటచే లక్ష్మణశరీరమున ప్రవేశించెను.

యావత్యః శక్తయో లోకే మాయాయోనిసంభవన్తి హి
తాసా మాధారభూతస్య లక్ష్మణస్య మహాత్మనః
మాయాశక్త్యా భవే త్కిం వా శేషాంశస్య హరేస్తనోః॥

ఈసృష్టిలోని శక్తులన్నియు యోగమాయనుండి జనించుచుండును. మహాత్ముడగు లక్ష్మణుడు ఆయోగమాయకు ఆధారభూతుడయిన శేషస్వరూపుడు. శేషుడు శ్రీమన్నారాయణ దేహములో ఒక అంశము. అట్టిలో లక్ష్మణుని ఈ రావణప్రయుక్తమగు శక్తి ఏమి చేయగలదు ?

తథాపి మానుషం భావ మాపన్నః తదనువ్రతః
మూర్ఛితః పతితో భూమా త మాదాతుం దశాననః
హస్తై స్తోలయితుం శక్తో న బభూ వాతినిస్పృహః॥

అయినను మానుషభావము నాశ్రయించి జగత్తున అవతరించుటచే ఆ మనుష్యస్వభావమునే ఆశ్రయించి లక్ష్మణుడు మూర్ఛితుడయ్యెను. అంత భూపతితుడయిన అతనిని దశాననుడు తనతో నగరమునకు కొనిపోవుటకై తన ఇరువది చేతులను ఉపయోగించి ఎత్తబోయెను. కాని కైలాసాచలము నెత్తిన అతనికి లక్ష్మణునెత్తుట సాధ్యముకాకపోయినది. రావణునకు తన ఈ అశక్తతపై విస్మయూశ్చర్యములు కలిగినవి.

రావణుడు లక్ష్మణుని శరీరము ఎత్తలేకపోవుటకు కారణమును ప్రతిపాదించుచున్నాడు-

సర్వస్య జగతః సారం విరాజం పరమేశ్వరం
కథం లోకాశ్రయం విష్ణుం తోలయే ల్లసురాక్షసః॥

రావణుడు సర్వజగత్సృష్టితో పోల్చిచూచినచో అతి తక్కువ శక్తిసామర్థ్యములు గలవాడు. షీక లక్ష్మణుడు సర్వజగత్సారతత్త్వమయిన పరమాత్మస్వరూపుడు. మాయయందు ప్రతిబింబించి సృష్టిగా పరిణమిల్లిన విరాట్స్వరూపుడు. అనంతస్వరూపమున సర్వజగద్భారమును వహించువాడు. విష్ణుస్వరూపుడై అంతట వ్యాపించియుండువాడు. అట్టివానిని రావణు డెట్లు ఎత్తగలడు? లోకవిడంబనార్థమై విష్ణువు వేరు వేరు రూపములలో అవతరించినాడే కాని వాస్తవమునకు రామలక్ష్మణులలో భేదము లేదని భావము.

గ్రహీతుకామం సౌమిత్రిం రావణం వీక్ష్య మారుతిః
ఆజఘా నోరసి క్రుద్ధో వజ్రకల్పేన ముష్టినా
దేన ముష్టిప్రహారేణ జానుభ్యా మసత ద్భువి॥

మూర్ఛితుడయిన సౌమిత్రుని గ్రహించుటకు ప్రయత్నించుచున్న రావణునిచూచి హనుమంతుడు అత్యంతక్రోధముతో దృఢమగు ముష్టిని బంధించి అతని వక్షస్థమును వేధించెను. వజ్రసమానమయిన ఆముష్టియొక్క ప్రహారమును సహించజాలక రావణుడు మోకాళ్ళపై కొరిగెను.

ఆస్యే భ్య శ్చ నేత్రశ్రవణై ఉద్యమ్య రుధిరం బహు
విధూర్ణ మానననయనో రథోపస్థ ఉపావిశత్ ॥

ఆముష్టిఘాతముచే అతని దశముఖములనుండియు, నేత్రముల నుండియు, చెవులనుండియు రక్తము స్రవింపసాగినది. కళ్ళు తిరుగు చుండగా అతడు రథముపైకిపోయి కూర్చొని విశ్రాంతి తీసికొన సారం భించెను.

అథ లక్ష్మణ మాదాయ హనూమాన్ రావణార్దితం
ఆనయ ద్రామసామీప్యం బాహుభ్యాం పరిగృహ్యాతం॥

తరువాత హనుమంతుడు రావణప్రయుక్త శక్తి పీడితుడయిన లక్ష్మణుని గ్రహించి బాహువులపై నుంచుకొని శ్రీరాముని సమీపమునకు తెచ్చెను.

హనుమంతుడు లక్ష్మణశరీరమును ఎత్తగలుగుటకు కారణమును ప్రతిపాదించుచున్నాడు–

హనూమతః సుహృత్త్వేన భక్త్యా చ పరమేశ్వరః
లఘుత్వ మగమ ద్దేవో గురూణాం గురు రప్యజః

హనుమంతుడు పరాత్పరస్వరూపులగు రామలక్ష్మణులకు సుహృదుడు. భక్తుడు. ఈకారణమున గౌరవనీయమగు వాటికన్నిటికన్నను గురుడగు (బహువైనవాడు) ప్రభువు, లక్ష్మణుడు లఘుత్వమును పొందెను.

సా శక్తి రపి తం త్యక్త్వా జ్ఞాత్వా నారాయణాంశజం
రావణస్య రథం ప్రాణా ద్రావణో ఽపి శనై స్తతః
సంజ్ఞా మవాప్య జగ్రాహ బాణాసన మథో రుషా॥

రావణప్రయుక్తమగు శక్తియున్ను లక్ష్మణుడు ఆదినారాయణుని అంశ యని గ్రహించి, అతనిని వదలి పునః రావణ రథమును చేరెను. అక్కడ హనుమంతుని ముష్టిఘాత పీడితుడయిన రావణుడును మెల్ల మెల్లగా ఆగతసంజ్ఞుడై చాపమును చేత ధరించెను.

రామ మే వాభిదుద్రావ దృష్ట్వా రామో ఽపి తం కృధా

ఆహూయ జగతాం నాథో హనూమంతం మహాబలం
రథస్థం రావణం దృష్ట్వా అభిదుద్రావ రాఘవః॥

రావణుడు కోపపూరితహృదయుడై చాపమును హస్తమున ధరించి రాముడున్న దిక్కులకే రథమును తోలించెను. అంతట శ్రీరాముడు హనుమంతుని భుజస్కంధముల నధిరోహించి రథస్థుడయిన రావణుని ఎదుర్కొనెను.

జ్యాశబ్ద మకరో త్తీవ్రం వజ్రనిష్పేషనిస్వనం
రామో గంభీరయా వాచా రాక్షసేంద్ర మువాచ హ॥

జగన్నాథుడగు శ్రీరాముడు హనుమంతుని భుజములపైనుండి వజ్రధ్వని సమానమయిన జ్యా శబ్దమును చేసెను. తరువాత గంభీరమగు వాక్యముల నుపయోగించుచు రావణున కిట్లనెను.

రాక్షసాధమ! తిష్ఠాద్య క్వ గమిష్యసి మే పురః
కృత్వా ఽపరాధ మేవం మే సర్వత్ర సమదర్శినః॥

రాక్షసాధమా! నేను సర్వులను సమానదృష్టితో చూచువాడను. అట్టి నాకు అపరాధమొనర్చిన నీవు నాయెదుటనుండి ఎట్లు తప్పించుకొని పోగలవు? సీతను అపహరించుటే గాక లక్ష్మణుని మూర్ఛితు నొనరించుట మరియొక గొప్ప అపరాధమును రావణు డొనరించినాడు.

యేన బాణేన నిహతా రాక్షసా స్తా జనాలయే
తేనైవ త్వాం హనిష్యామి తి ష్ఠాద్య మమగోచరే॥

జనస్థాన నివాసులగు ఖరదూషణాదులు ఏ బాణముచే నిహతులయినారో ఆబాణముచేతనే నిన్ను వధించెదను. నీవు నాయెదుట పారిపోక నిలబడుము.

శ్రీరామస్య వచః శ్రుత్వా రావణో మారుతాత్మజం
వహన్తం రాఘవం సంఖ్యే శరై స్తీక్ష్ణై రతాడయత్॥

శ్రీరాము డిట్లు రావణునిగూర్చి పరుషముగా పలుకుచుండగా అతడు పిని క్రోధితుడై యుద్ధమున రాముని భుజస్కంధములపై వహించుచున్న మారుతిని తీక్ష్ణశరములచే వేధించెను.

హత స్యాపి శరై స్తీక్ష్ణై ర్వాయుసూనోశ్చ స్వతేజసః
వ్యవర్ధత పున స్తేజో నదర్ద చ మహాకపిః॥

వాయుపుత్రుడు సహజతేజశ్శాలి. ఆకారణమున రావణబాణ ఘాతములు అతని నేమియు చలింపజేయలేకపోయినవి. ఆబాణములు తగులుటచే అతని ఉత్సాహము మరింత పెరిగినది. అతడు సింహనాద మొనరించెను.

తతో దృష్ట్వా హనూమంతం సవ్రణం రఘుసత్తమః
క్రోధ మాహారయామాస కాలయుద్ధ ఇ వాపరః॥

రావణుడు హనుమంతుని శరీరము వేదించగా దానిని చూచి రాముడు ప్రణయకాలయుద్రునివలె మండిపడెను.

సాశ్వం రథం ధ్వజం సూతం శస్త్రౌఘం ధను రంజసా
ఛత్రం పతాకా తరసా చిచ్ఛేద శితసాయకైః॥

రాముడు తీక్ష్ణములగు శరములను ప్రయోగించి అశ్వయుత మయిన రథమును, ధ్వజమును సూతుని అతడు ప్రయోగించి బాణజాల మును, ఛత్రమును ఛేదించివేసెను.

తతో మహాశరే ణాఽఽశు రావణం రఘుసత్తమః
విభ్యాధ వజ్రకల్పేన పాకారి రివ పర్వతమ్
రామబాణహతో వీరః చచాల చ ముమోహ చ॥

ఆ తరువాత రాఘవశ్రేష్ఠుడగు రాముడు ఒక మంత్రపూతమగు మహాశరమును ప్రయోగించి దేవేంద్రుడు వజ్రాయుధముతో పర్వతమును వేధించినట్లు రావణశరీరమును వేధించెను. ఆబాణపాతమున మహావీరుడగు రావణుని ధైర్యము చలించినది. అతడు మూర్ఛాగ్రస్తు డయ్యెను.

హస్తా న్నిపతిత శ్చాప స్తం సమీక్ష్య రఘుసత్తమః
అర్ధచంద్రేణ చిచ్ఛేద తత్కిరీటం రవిప్రభమ్॥

ఆసమయమున అతని చాపము చేతినుండి జారి పడినది. ఈ అవ కాశమునుచూచి రాముడు అర్ధచంద్రాకారమయిన శిలీముఖమును ప్రయోగించి సూర్యునివలె నెలుగు రావణుని కిరీటమును ఛేదించెను.

ఇట్లు విరథుడు, వికలుడు, విగళితచాపుడు అయిన రావణుని చూచి జాలిపడి రాముడు పలుకుచున్నాడు.

అనూజానామి గచ్ఛ త్వ మిదానీం భాణపీడితః
ప్రవిశ్య లంకా మావిశ్య శ్వ పశ్యసి బలం మమ॥

రావణా! నీవు చాలసేపటినుండి యుద్ధమొనర్చుచు అలసి యున్నావు. అంతేగాక ఇప్పుడు నా తీక్ష్ణబాణ పీడితుడవైనావు. కనుక నీవిప్పుడు నగరమున ప్రవేశించి అలసట తీర్చుకొనుము. తిరిగి రేపు నా శక్తిని చూడగలవు.

రామబాణేన సంవిద్ధో హతదర్పో ఽభ రావణః
మహత్యా లజ్జయా యుక్తో లంకాం ప్రావిశ దాతురః॥

ఇట్లు రామబాణపీడితుడై తను త్రిలోకజేత నను గర్వము హతముకాగా లజ్జావృతమనస్కుడై నగరప్రవేశ మొనర్చెను.

రామో ఽపి లక్ష్మణం దృష్ట్వా మూర్ఛితం పతితం భువి
మానుషత్వ ముపాశ్రిత్య లీనయా ఽనుశుశోచ హా॥

ఇట్లు రావణు నిహతప్రభు నొనరించి రాముడు మూర్ఛితుడయి యున్న లక్ష్మణునివద్దకు వచ్చెను. భూపతితుడై మృతప్రాయుడైయున్న సోదరునిజూచి మానుషభావమును ప్రకటించుచు కొంతసేపు శోకించెను.

తతః ప్రాహ హనూమంతం వత్స జీవయ లక్ష్మణమ్
మహౌషధీః సమానీయ పూర్వవ ద్వానరా నపి॥

తరువాత అతడు హనుమంతునితో ఇట్లు పలికెను-వత్సా! నీవు ఇదివరకువలెను విశల్యసంజీవకరణులను ద్రోణాచలమునుండి తెచ్చి

లక్ష్మణుని, ఈ వ్యధితులయిన వానరులను బ్రతికించుము.

తథేతి రాఘవే ణోక్తో జకా మాఽశు మహాకపిః
హనూమా న్వాయువేగేన క్షణా త్తీర్త్వా మహోదధిమ్ ॥

శ్రీరాము డాజ్ఞాపించగనే కపిశ్రేష్ఠుడగు హనుమంతుడు చిత్త మని శీఘ్రముగా బయలుదేరెను. అతడు వాయువేగమున సముద్ర మును దాటెను.

ఏతస్మి న్నంతరే చారా రావణాయ న్యవేదయ
రామేణ ప్రేషితో దేవ హనూమా న్క్షీరసాగరమ్
గతో నేతుం లక్ష్మణస్య జీవనార్థం మహౌషధీః ॥

హనుమంతుడు ఓషధ్యానయనమునకై బయలుదేరిన వార్తను వినిన చారులు రావణునకు ఇట్లు నివేదించిరి–హనుమంతుడు సంజీవ విశల్యకరణులనుదెచ్చి లక్ష్మణుని జీవింపజేయుటకై రామునిచే క్షీర సాగరమునకు పంపబడినాడు.

శ్రుత్వా తచ్చారవచనం రాజా చింతాపరో భవత్
జగామ రాత్రా వేకాకీ కాలనేమిగృహం క్షణాత్ ॥

చారులు తెచ్చిన వార్త నాలించి రావణునకు అత్యధికమగు చింత కలిగెను. అంతట అతడు ఆ రాత్రమునయే ఏకాకిగా కాలనేమి అను రాక్షసుని గృహమున కేగెను.

గృహాగతం సమాలోక్య రావణం విస్మయాన్వితః
కాలనేమి ర్ముని వేదం ప్రాంజలి ర్భయవిహ్వలః ॥

రాక్షసచక్రవర్తి ఇట్లు ఏకాకిగా అర్ధరాత్రమున తనగృహమున కేతెంచుట జూచి కాలనేమి ఒక్కసారిగా విస్మయభయవిహ్వలత్వము లకు లోనయినాడు. అతడు చక్రవర్తిని గౌరవించి ప్రాంజలియైనాడు.

అర్ఘ్యాదికం తతః కృత్వా రావణ స్యాగ్రతః స్థితః
కిం తే కరోమి రాజేంద్ర! కి మాగమనకారణం
కాలనేమి ర్ముని వేదం రావణో దుఃఖపీడితః ॥

తదనంతరం రావణుని అర్ఘ్యపాద్యాదివిధులచే పూజించి కాలనేమి రావణుని ఎదుట నిలబడి వినయముగా ఇట్లు పలికినాడు. "మహారాజా! ఈ సేవకుని గృహమున కేతెంచుటకు కారణమేమి? నావలన నీకు జరుగగల ముఖ్యకార్యమేది?" కాలనేమి ఇట్లు వినయముతో ప్రశ్నించగా దుఃఖపీడితుడయిన రావణు డిట్లు బదులుపలికినాడు.

మమాపి కాలవశతః కష్ట మేత దుపస్థితం
మయా శక్త్యా హతో వీరో లక్ష్మణః పతితో భువి ॥

మానవులందరును కాలమునకు వశులై సంచరించెదరు. నేను కాలవశుడనై నీయొద్దకు వచ్చితిని. నాకు ఈసమయమున ఒక మహత్తరమయిన కష్టమొకటి సంభవించినది. నేను నేటియుద్ధమున లక్ష్మణుని మయదత్తమయిన శక్తిచే నిహతు నొనరించినాను. అతడిప్పుడు యుద్ధభూమిలో పడియున్నాడు.

తం జీవయితు మానేతు మౌషధీర్హనుమాన్ గతః
యథా తస్య భవే ద్విఘ్న స్తథా కురు మహామతే ॥

సంజీవశల్యకరణులను ఔషధములను ఉపయోగించినచో అతడు పునఃజీవించగలడు. అప్పుడే వాటిని తెచ్చుటకు హనుమంతుడు బయలుదేరి వెళ్ళినాడు. అత డాఔషధములను తెచ్చుటలో ఆలస్యమగునట్లు విఘ్నమొనరింపవలసి యున్నది. నీవు సర్వమాయావిశారదుడవు. కనుక నీవే ఈవిఘ్నమొనర్చుటలో సమర్థుడవు. ఈవిషయమును చెప్పుటకే నేను వచ్చితిని.

హనుమంతునికి మార్గములో విఘ్నము నాపాదించు విధానమునుకూడ బోధించుచున్నాడు-

మాయయా మునివేషేణ మోహాయస్వ మహాకపిం
కాలాత్యయో యథా భూయాత్ తథా కృష్ణాహిమందిరే ॥

నీవు మాయామహర్షి రూపమును ధరించి హనుమంతుడు వెళ్ళు మార్గములో ఉండవలెను. ఉండి ఆకాశమార్గమునవెళ్ళు కపి

శ్రేష్ఠుడగు హనుమంతుని వంచించి కాలాపహరణమగునట్లు చూడ వలెను. అట్లొనరించి తదుపరి నీవు స్వగృహమునకు తిరిగిరావచ్చును.

సూర్యోదయాత్పూర్వమే చికిత్స జరుగకపోయినచో శక్తిహతు డయిన లక్ష్మణుని ప్రాణములు నిలువవు. కనుక రావణుడు తొందరనది సూర్యోదయమునకు ముందు ఓషధులను తేకుండా హనుమంతునికి కాలహరణమును కలుగజేయుమని రావణుని ఆదేశము.

రావణస్య వచః శ్రుత్వా కాలనేమి రువాచ తం
రావణేశవచో మే ఽద్య శృణు ధారయ తత్త్వతః ॥

రావణుని ఆదేశవాక్యములను విని కాలనేమి ఇట్లనెను-రావణా! రాక్షసచక్రవర్తీ! నీకొక యథార్థమగు విషయమును విన్పించెదను. సావధానుడవై వినుము.

ప్రియం తే కరవా ణ్యేవ ప్రాణా ధారయా మ్యహం
మారీచస్య యథా ఽరణ్యే పురా ఽభూ న్మృగరూపిణః
తథైవ మే న సందేహో భవిష్యతి దశానన ॥

అయితే నేను ప్రాణములకై భయపడుచుంటిననుకొనుచున్నా వేమో! ఆసందేహము నీకక్కరలేదు. నాకు ప్రాణములు తృణప్రా యములు. ఇదివరకు సీతాపహరణకాలమున నాతండ్రి మారీచున కేగతి పట్టినదో అదే నాకును సంభవింపగలదని నాకు తెలుసును. అయినను నీకు ప్రియమునే నేను ఆచరించెదను. దానికిముందు కొంత హితబోధ చేయదలచితిని.

హతాః పుత్రాశ్చ పౌత్రాశ్చ బాంధవా రాక్షసాశ్చ తే
భూతయిత్వా ఽసురకులం జీవితే నాఽపి కిం తవ ॥

ఇంతవరకు జరిగిన యుద్ధములో నీపుత్రులు, పౌత్రులు, బంధు వులు, మంత్రులు, ఇతరరాక్షసవీరులు మృత్యుముఖమున పడినారు. ఇక ఇట్లే యుద్ధమొనర్చినచో రాక్షసకులమే నాశనమందగలదు. అసుర కులమే నాశనముకాగా ఇక నీవు బ్రతికి ఏమిచేయుదువు?

రాజ్యేన వా సీతయా వా కిం దేహేన జడత్మనా
సీతాం ప్రయచ్ఛ రామాయ రాజ్యం దేహి విభీషణే
వనం యాహి మహాబాహో రమ్యం మునిగణాశ్రయమ్ ॥

అసురకులమే నాశనమయినప్పుడు నీకు సీత యెందులకు, రాజ్య సుఖము లెందులకు? చైతన్యము లేనిచో జడమయిన ఈ దేహ మెందులకు? కాన జానకిని శ్రీరామునకు సమర్పించి రాజ్యమున విభీషణుని నిలుపుము. ఆపై తపశ్శాలురగు మహర్షులు నివసించు ఏ దేని తపోవనమునకు వానప్రస్థుడవై పొమ్ము.

వానప్రస్థుడై చేయవలసిన సత్కృత్యములను బోధించుచున్నాడు.

స్నాత్వా ప్రాతః శుభజలే కృత్వా సన్ధ్యాదికాః క్రియాః
తత ఏకాంత మాశ్రిత్య సుఖాసనపరిగ్రహః ॥

ప్రాతఃకాలమునసే మంగళప్రదములగు నదీజలములలో స్నానమాచరించి, అనంతరము సంధ్యావందనము మొదలగు కృత్యములను నిర్వర్తించుకొనుము. ఆపైన ఏకాంతస్థానమునకు పోయి ఉత్తమమగు ఆసనము నొకదానిని కల్పించుకొనుము.

విసృజ్య సర్వతః సంఘు మితరాణ్ విషయాన్ బహిః
బహిః ప్రవృత్తాక్షగణం శనైః ప్రత్యక్ ప్రవాహయ
ప్రకృతే ర్భిన్న మాత్మానం విచారయ సదా ఽనఘ॥

వానప్రస్థాశ్రమవిధానమున భగవత్కథాశ్రవణాద్యతిరిక్తమైన బాహ్యవిషయములను సమీపమునకు రానీయరాదు. ఆకారణమున బాహ్యవిషయ సుఖప్రదములయిన భోగాదులతోడి సంపర్కమును త్యజించవలెను. ఒకవేళ మనస్సుగాని, ఇతర యింద్రియములుగాని బాహ్యవస్తువుల వైపునకు ఆకర్షితములయినచో క్రమక్రమముగా మరల్చి ఆత్మాభిముఖముగా ప్రవర్తింపజేయుము. బాహ్యవిషయములన్నియు ప్రకృతియొక్క వికారములు. ఆత్మ ప్రకృతికంటె భిన్న

మయిన సత్యము చైతన్యవంతము అగు వస్తువు. కనుక నీమనస్సును ప్రకృతిని వదలి ఆత్మను మననము చేయునట్లు నియమించుము.

"ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో ని దిధ్యాసి తవ్యః" అని బృహదారణ్యకశ్రుతి.

చరాచరం జగ త్కృత్స్నం దేహబుద్ధీంద్రియాదికం
ఆబ్రహ్మస్తమ్బపర్యంతం దృశ్యతే శ్రూయతే చ యత్
సైషా ప్రకృతి రిత్యుక్తా సైవ మా యేతి కీర్తితా॥

జీవులయొక్క శరీరము బుద్ధి ఇంద్రియములు మొదలగునవి యును, ఈసృష్టిలో హిరణ్యగర్భబ్రహ్మ మొదలుకొని సామాన్య తృణ లతాగుల్మాదులవరకును ఉన్న చరాచరరూపమయిన బ్రహ్మాండము లన్నియును పైనజెప్పిన ప్రకృతియే. ఆ ప్రకృతియే మాయ అని చెప్ప బడుచున్నది.

సర్వజగత్తు ప్రకృతిస్వరూపమే అని పైశ్లోకమున ప్రతిపాదించి ఈ శ్లోకమున మూలప్రకృతివికారమునొందు విధానమును ప్రతిపాదించుచున్నాడు.

సర్గస్థితివినాశానాం జగద్వృక్షస్య కారణం
లోహితశ్వేతకృష్ణాది ప్రజాః సృజతి సర్వదా॥

ఈ జగత్తు అను మహావృక్షమునకు మూడుదశ లున్నవి. ఒకటి ఉత్పత్తిదశ. రెండు స్థితిదశ. మూడు నాశనదశ. ఈ మూటికిని క్రమముగా బ్రహ్మ విష్ణు మహేశ్వరులను కారణముగా పేర్కొందురు. కాని ఈ ముగ్గురును ప్రకృతియొక్క వికారస్వరూపులే. ప్రకృతిలో రజోగుణ మనియు, శ్వేతగుణ మనియు, తమోగుణ మనియు మూడుగుణము లుండును. ఈ మూడుగుణముల అన్యక్తదశే మూలప్రకృతి. ఈమూడు గుణములు ప్రకోపించినప్పుడు లోహితగుణము (రజోగుణము) వలన బ్రహ్మయు, శ్వేతగుణము (సత్త్వగుణము) వలన విష్ణువును, తమో గుణము వలన రుద్రుడును ఏర్పడుదురు. ఈ ముగ్గురే సృష్టిస్థితిలయ కారకులు.

జీవాత్మ మాయాస్వరూపములగు విషయములందు లగ్నమగు రీతిని ప్రతిపాదించుచున్నాడు.

కామక్రోధాదిపుత్రాఢ్యా హింసాతృష్ణాదికన్యకా
మోహాయ త్యనిశం దేవ మాత్మానం స్వగుణే ర్విభుమ్॥

చైతన్యస్వరూపుడగు పరమాత్మ ప్రకృతిలో ప్రతిబింబించి దానిని ప్రవర్తింపజేయుచున్నాడు. అట్లు ప్రతిబింబితచైతన్యమే జీవుడు. వాస్తవమునకు పరమాత్మకూ జీవునకూ భేదము లేదు. అయినను ప్రకృతి ఊరకొనదు. కామక్రోధమోహలోభమదమాత్సర్యములను ఆరు వికారములు మహామాయ యగు ప్రకృతికి పుత్రులవంటివి. హింసతృష్ణ మొదలగు క్రూరభావములు పుత్రికలవంటివి. ప్రకృతి ఈ పుత్రపుత్రికా సహాయమున తనయందున్న (దేహమునందున్న) జీవుని నిత్యము మోహపెట్టుచున్నది. జీవుడు తాను పరమాత్మయయ్యు మాయా ఆవరణయుక్తు డగుటచే త్రిగుణాత్మకమయిన ప్రకృతికి వశుడగుచున్నాడు.

కర్తృత్వాభోక్తృత్వాముఖా స్స్వగుణా నాత్మ నీశ్వరే
ఆరోప్య స్వవశం కృత్వా తేన క్రీడతి సర్వదా॥

ఆత్మగాని, ఆత్మస్వరూపు డగు జీవుడుగాని వాస్తవమునకు కర్తృత్వ భోక్తృత్వ రహితులు. (నేను ఈపని చేయుచున్నాను, నేను దీనిని అనుభవించుచున్నాను అను భావము లేక నిర్లిప్తులై యుండువారు) కాని ప్రకృతి జీవుని ఆవరించి తనగుణములయిన కర్తృత్వ భోక్తృత్వాదుల నారోపించి తనకు వశవర్తిని జేసుకొనుచున్నది. జీవుడును తనస్వరూపమును తాను గ్రహించలేక ప్రకృతిచేతిలో కీలుబొమ్మ అగుచున్నాడు.

శుద్ధో ప్యాత్మా యథా యుక్తిః పశ్య తీవ సదా బహిః
విస్మృత్య చ స్వ మాత్మానం మాయాగుణవిమోహితః॥

జీవుడు పరమాత్మవలె శుద్ధ డయియుండియు ప్రకృతియొక్క గుణములచే మోహితుడై యుండుటచే తన సచ్చిదానందమయము,

నిత్యముక్తబుద్ధము అగు స్వరూపమును విస్మరించును. అంతట స్వస్వ రూపవివేక మొనర్పజాలక బాహ్యములగు విషయములనే సత్యము లుగా భావించుచు నిత్యము ఇంద్రియాదుల తృప్తికై కర్మల నాచరించుచు జననమరణాది రూపములయిన కాలచక్రమున పరిభ్రమించుచుండును.

ఈ కాలచక్రమునుండి విడివడుటకు మార్గమును బోధించుచున్నాడు.

యదా సద్గురుణా యుక్తో బోధ్యతే బోధరూపిణా
నివృత్తిదృష్టి రాత్మానం పశ్యత్యేవ సదా స్ఫుటం
జీవన్ముక్త స్తదా దేహీ ముచ్యతే ప్రాకృతైర్గుణైః॥

మననదిధ్యాసాపూర్వకముగా బ్రహ్మజ్ఞానమును అనుభవము నకు తెచ్చుకొనినవాడు తాను స్వయముగా బ్రహ్మరూపుడు లేక జ్ఞానరూపు డగును. అట్టి జ్ఞానరూపు డగు బ్రహ్మనిష్ఠుడే ఇత రులకు బ్రహ్మజ్ఞానమును ప్రసాదించ సమర్థు డగును. ప్రకృతికి వశీ భూతుడయిన జీవుడు ఏదైన పుణ్యవిశేషమున అట్టి జ్ఞానస్వరూపుని సాంగత్యమును పొందినప్పుడు అతనిని తన గురువుగా స్వీకరించును. అట్టి సద్గురుబోధచే బాహ్యవిషయములందలి దృష్టిని మరలించి జీవుడు తన స్వస్వరూపమును అనగా శుద్ధ బుద్ధ ముక్త స్వభావమయిన తన యథార్థస్థితిని దర్శించగలడు. అట్టి ఆత్మజ్ఞానము కలిగిన జీవుడు తనం తట తానే ప్రాకృతికగుణబంధములనుండి విడివడును.

జ్ఞానసంపాదనకు సద్గురువుయొక్క ఆవశ్యకత ఈశ్లోకమున చెప్పబడినది. శ్రుతికూడ- "తద్విజ్ఞానార్థం స గురు మేవా భిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం ఆచార్యవాన్ పురుషో వేద" అని ప్రతిపాదించుచున్నది. పరమాత్మ జ్ఞానసంపాదనకై శిష్యుడు సమి త్పాణియై శ్రోత్రియుడు బ్రహ్మనిష్ఠుడు అగు గురువును సమీపింప వలెను. ఆచార్యవంతుడే బ్రహ్మను తెలిసికొనగలడు అని వైశ్రుతి

యొక్క భావము. ఆత్మ జ్ఞాని జీవన్ముక్తు డగుననుటకు శ్రుతి- "భిద్యతే హృదయ గ్రంథిశ్ఛిద్యంతే సర్వసంశయాః క్షీయం తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే" అని పరమాత్మ స్వరూప సాక్షాత్కార మయినప్పుడు అజ్ఞానరూపములయు హృదయగ్రంథులు భేదింపబడు ననియు, సమస్త సంశయములు నశించుననియు, సర్వకర్మలు క్షీణించు ననియు పైశ్రుతియొక్క అభిప్రాయము.

పైశ్లోకములో 'యుక్తః' అనుశబ్దమునకు కూడుకొనినవాడు అని సామాన్యార్థమును గాక "జ్ఞానమును పొందినవాడు" అని చెప్ప వలెను.

'యుక్తు' ని గూర్చి భగవద్గీత ఇట్లు ప్రతిపాదించుచున్నది.

యదా వినియతం చిత్తం ఆత్మన్యే వావతిష్ఠతే
నిస్పృహం సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా॥

అని

ఇట్లు కాలనేమి రావణునకు ఆత్మానాత్మల భేదమును, ఆత్మ జ్ఞానసాధనమార్గమును చెప్పి రావణునిగూడ ముక్తిసందుటకు ప్రయ త్నించుమని బోధించుచున్నాడు.

త మ ప్యేనం సదాత్మానం విచార్య నియతేంద్రియః
ప్రకృతే రన్య మాత్మానం జ్ఞాత్వా ముక్తో భవిష్యసి॥

నీవును సద్గురువు నాశ్రయించి సత్యస్వరూపుడయిన పరమాత్మ జ్ఞానమును సంపాదించి తరువాత ఇంద్రియములను జయించి నిదిధ్యాస నొనర్చినచో జగద్రూపమయిన ప్రకృతికంటె పరమయిన పరమాత్మను అనుభవపూర్వకముగా గ్రహించి జీవన్ముక్తుడవు కాగలవు.

"ఇంద్రియములను జయించి మనన నిదిధ్యాసల నొనర్చి ఆత్మ జ్ఞానమును సంపాదించుటకు అసమర్థుడనందువా" దానికి మరియొక సాధనమును చెప్పుచున్నానని సగుణారాధనను సూచించుచున్నాడు.

ధ్యాతుం య ద్యసమర్థోసి సగుణం దేవ మాశ్రయ
హృత్పద్మకర్ణికే స్వర్ణపీఠే మణిగణాంచితే
మృదుసూక్ష్మతరే తత్ర జానక్యా సహా సంస్థితం॥

ఒకవేళ నీవు నిర్గుణపరమాత్మను ధ్యానించుటకు అసమర్థుడ వైనచో సగుణరూపమును ఆశ్రయింపము. దానిప్రకారమును చెప్పు చున్నాను వినుము. హృదయరూపమయిన పద్మకర్ణికయందు పర మాత్మయగు శ్రీరాముని స్వరూపమును ధ్యానించవలెను. ఆధ్యాన స్వరూపము ఇట్లుండవలెను. ఎదుటగా మణిగణముచే నిర్మింపబడి మృదుసూక్ష్మములగు శోభలను ప్రసరించుచున్న రత్నపీఠమున జానకీ సహితుడయిన రాముని ప్రతిష్టించిన ట్లూహింపవలెను.

వీరాసనం విశాలాక్షం విద్యుత్పుంజనిభాంబరమ్
కిరీటహారకేయూరకౌస్తుభాదిభి రన్వితమ్॥
నూపురైశ్చ కటకై ర్భాంతం తథైవ వనమాలయా
లక్ష్మణేన ధనుర్ద్వంద్వకరేణ పరిసేవితం॥

వీరాసనమునునైచి విశాలములగు నేత్రములతోడను, విద్యు త్పుంజ ప్రభలనీను వస్త్రములతోడను ప్రకాశించుచు, కిరీటమును, హారమును, కేయూరములను, కౌస్తుభాదిమణులను, నూపురములను, కంకణములను, వనమాలను ధరించి శోభించుచున్న వానినిగా భావించ వలెను. ప్రక్కన రెండుచాపములను చేత ధరించిన లక్ష్మణునిచే సేవింప బడుచున్న వానినిగా ఊహించవలెను.

ఏవం ధ్యాత్వా సదాత్మానం రామం సర్వహృదిస్థితం
భక్త్యా పరమయా యుక్తో ముచ్యతే నాత్ర సంశయః॥

సమస్త జీవహృదయాంతరాళములందును వ్యాపించియుండు శ్రీరాముని ఈదివ్యరూపమును మనసాధ్యానించు భక్తుడు నిస్సందేహ ముగా విముక్తుడు కాగలడు.

శృణు వై చరితం తస్య భక్తై ర్నిత్య మనన్యధీః
ఏవం చేత్ కృతపూర్వాణి పాపాని చ మహా న్త్యపి
క్షణా దేవ వినశ్యన్తి యథాగ్నా తూలరాశయఃll

నిత్యము ఇత డలౌకికవిషయములను పరిత్యజించి శ్రీరాముని భక్తుల చరిత్రములను మాత్రమే ఏకాగ్రబుద్ధితో వినుచుండును. ఇట్లు గనుక నీవు భక్తితో శ్రీరాముని సేనించినచో ఇంతవరకు నీవొనరించిన పాపకర్మల దుష్కృతమంతయు నశించును. అవి పర్వతాకారములలో ఎంతవృద్ధినందియున్నను రామభక్తి యను అగ్ని అంటుకొని దూదిపర్వతములవలె దగ్ధమగును.

భజస్వ రామం పరిపూర్ణకామం
విహాయ వైరం నిజభావయుక్తఃl
హృదా సదాభావితభావరూప
మనామరూపం పురుషం పురాణంll

శ్రీరాముడు సృష్టికి ముందున్న పురాణ పురుషుడు. నామ రూపాది ప్రాకృతవికారములు లేనివాడు. హృదయములో నిత్యము భావించువారి భావనలో స్థిరముగా ఉండువాడు. లౌకికవ్యక్తులవలె కోరికలు లేని పూర్ణకాముడు. అట్టి మహాత్మునిపై శత్రుత్వమును త్యజించి భక్తిభావముతో భజించుము.

సప్తమ సర్గ

శ్రీ మహాదేవ ఉవాచ :—

కాలనేమివచః శ్రుత్వా రావణో ఽమృతసన్నిభమ్
జజ్వాల క్రోధతామ్రాక్షః సర్పిరద్భ్య ఇ వాగ్నిమత్ ॥

ఇట్లు కాలనేమి అమృతోపమానములయిన తత్త్వవాక్యములచే జీవనకల్యాణకారకమగు హితము నుపదేశించగా అది కాలవశంగతు డయిన రావణునకు రుచించలేదు. పైగా అగ్నితోకూడిన నేయి నీళ్ళ వలన ఇంకను మండునట్లు క్రోధాకులితలోచనుడై మండిపడెను. సహజముగా నీరు అగ్ని నాశకము. కాని ఘృతవర్ధితమయిన అగ్నిలో నీరు పోసినచో అదికూడ అగ్నివర్ధకమగును. అట్లే కాలనేమియొక్క శాంత వచనములు రావణునకు రుచింపకపోగా క్రోధవర్ధకములైనవని భావము.

నిహన్మి త్వాం దురాత్మానం మచ్ఛాసనపరాఙ్ముఖమ్
పరైః కించి ద్గృహీత్వా త్వం భాషసే రామకింకరః॥

క్రోధపరీతాత్ముడయిన రావణుడు కాలనేమి కిట్లనెను— దురాత్ముడా ! నేనొకటి ఆజ్ఞాపించగా దానికి వ్యతిరేకముగా పలుకుచున్నావు. నిన్నీక్షణమునే నిహతు నొనర్చెదను. నీమాటలు రాముని సేవకులగు హనుమదాదులు మాట్లాడువాక్యములవలె నున్నవి. దీనిని చూడగా శత్రువులనుండి ఏదో లంచము గ్రహించినట్లు తోచుచున్నది.

కాలనేమి రువా చేదం రావణం దేవ కిం కృధా
న రోచతే మే వచనం యది గత్వా కరోమి తత్ ॥

రావణుని క్రోధవచనములను విని కాలనేమి ఇట్లు విన్నవించెను— దేవా ! క్రోధ మెందులకు ? నేను హితమునుకోరి పథ్యమును పలికితిని. నాపథ్యము రుచింపకపోయినచో నేనువెళ్ళి నీయాజ్ఞను నిర్వర్తించెదను.

ఇ త్యుక్త్వా ప్రయయౌ శీఘ్రం కాలనేమి ర్మహాసురః
నోదితో రావణే నైవ హనూమద్విఘ్న కారణాత్ ॥

మహారాక్షస శిఖామణియైన కాలనేమి ఇట్లు విన్నవించుకొని రావణప్రచోధితుడై సంజీవిని మొదలగు ఓషధులను తెచ్చుటకు క్షీర సాగరమునకు వెళ్ళుచున్న హనుమంతునికి విఘ్నమును సమకూర్చుటకై శీఘ్రముగా బయలుదేరి వెళ్ళెను.

స గత్వా హిమవత్పార్శ్వం తపోవన మకల్పయత్
తత్ర శిష్యైః పరివృతో మునివేషధరః ఖలః
గచ్ఛతో మార్గ మాసాద్య వాయుసూనో ర్మహాత్మనః॥

సర్వరాక్షసమాయావిశారదుడగు కాలనేమి హనుమంతుని కంటె ముందుగ హిమవత్పర్వతపార్శ్వదేశమున కరిగి అక్కడ ఒక తపోవనమును కల్పించెను. అందు తాను మహర్షి వేషధారుడై కొందరు శిష్యులతోగూడ కలిసియుండెను.

తతో గత్వా దదర్శాథ హనూమా నాశ్రమం శుభం
చింతయామాస మనసా శ్రీమాన్ పవననందనః॥

ఓషధులను తెచ్చుటకై బయల్వెడలిన హనుమంతుడు మార్గ మధ్యమునన్న ఈ ఆశ్రమమును చూచి తనమనసులో ఈవిధముగా వితర్కించెను.

పురా నదృష్ట మేతన్మే మునిమండల ముత్తమమ్
మాన్యో విభ్రంశితో వా మే భ్రమో వా చిత్తసంభవః॥

నే నిదివరకు వచ్చినప్పుడు ఇక్కడ ఈమహర్షి సంయుతమగు తపోవనమును చూడలేదు. ఒకవేళ నేను మార్గమును తప్పియుందునా? లేక నాచిత్తము భ్రమించినదా?

య ద్యావిశ్యా శ్రమపదం దృష్ట్వా ముని మశేషతః
పీత్వా జలం తతో యామి ద్రోణాచల మనుత్తమమ్॥

నేను ఈఆశ్రమమందుదిగి కొద్దిసేపు విశ్రమించి ఇక్కడి మునిని, ఆయన శిష్యులను చూచి జలపానమొనర్చి దప్పితీర్చుకొని అనంతరము ద్రోణాచలమునకు వెళ్లెదను.

ఇత్యుక్త్వా ప్రవివే శ్రీమాన్ సర్వతో యోజనాయ తమ్
ఆశ్రమం కదలీశాలఖర్జూరపనసాదిభిః॥

హనుమంతు డిట్లు భావించి ఎటుచూచినను ఒక యోజనము వైశాల్యమున్న ఆ మాయా ఋష్యాశ్రమమున ప్రవేశించెను. ఆ యాశ్రమమం దంతటను శీతలవాతావరణకారకములగు కదళీ శాల ఖర్జూర పనసాది వృక్షజాలములు కన్నులపండువుగా నుండెను.

సమావృతం పక్వఫలై ర్నమ్రశాఖై శ్చ పాదపైః
వైరభావవినిర్ముక్తం శుద్ధం నిర్మలలక్షణం॥

ఆ వృక్షము లన్నియు పండిన పండ్లభారముచే వంగిన కొమ్మ లతో నమ్రములై యున్నవి. ఆ యాశ్రమవాసులగు మృగము లన్నియు పరస్పరవైరభావమును పరిత్యజించి మిత్రులవలె మెలగుచున్నవి. ఇట్లా యాశ్రమమున ఎక్కడచూచినను నిర్మలమగు శాంతిదేవి దర్శన మిచ్చు చుండెను.

తస్మిన్ మహాశ్రమే రమ్యే కాలనేమిః సరాక్షసః
ఇంద్రయోగం సమాస్థాయ చకార శివపూజనం॥

మహాసుందరమై హృదయహారకమగు ఆ తపోవనమున మారీచ రాక్షసపుత్రుడగు కాలనేమి ఇంద్రయోగము (కపటము) నాశ్రయించి శివపూజన మొనర్చుచుండెను.

హనుమా నభిహా ద్యాఽఽహా గౌరవేణ మహాసురమ్
భగవన్ రామదూతోఽహం హనూమా న్నామ నామతః
రామకార్యేణ మహతా క్షీరాబ్ధిం గన్తు ముద్యతః॥

హనుమంతుడు కాలనేమిని నిజమగు మహర్షిగానే భావించి నాడు. అతడు మహాగౌరవముతో ఆ కపటఋషియొక్క పాదములకు అభివందనము లాచరించి ఇట్లు విన్నవించినాడు– మహాత్మా! నేను పరాత్పరుడైన రాముని దూతను. నాపేరు హనుమంతుడు. ఇప్పుడు లంకానగరమున రావణునితో యుద్ధమొనరించు రామునకు ఒక మహా

త్తరమగు అవసరము కలిగినది. ఆ అవసరమును పురస్కరించుకొని నేను క్షీరసముద్రమునకు పోవుచున్నాను.

తృషా మాం బాధతే బ్రహ్మ న్నుదకం కుత్ర విద్యతే
యథేచ్ఛం పాతు మిచ్ఛామి కథ్యతాం మే మునీశ్వర॥

బ్రహ్మర్షీ ! నేను జలపానమొనర్చి చాలకాలమయినది. నన్నిప్పుడు విపరీతమగు జలతృష్ణ పీడించుచున్నది. నేను ఎథేచ్ఛగా జల పాన మొనర్పగోరుచున్నాను. ఇక్కడ ఎక్కడైన సరోవర మున్నచో చెప్పుము.

తచ్ఛ్రుత్వా మారుతే ర్వాక్యం కాలనేమి స్త మబ్రవీత్
కమండులుగతం తోయం మమ త్వం పాతు మర్హసి॥

వాయుపుత్రుని ప్రార్థనను విని కాలనేమి ఇట్లనెను- నా కమండలమందు జలమున్నది. దానిని త్రాగి నీవు నీతృష్ణను చల్లార్చుకొనవచ్చును.

భుంక్ష్వా చేమాని పక్వాని ఫలాని తదనన్తరమ్
నివసస్వ సుఖే నాత్ర నిద్రాం మేహి త్వరాస్తుమా॥

ఇవిగో ! ఇని ఈ ఆశ్రమమందు పండిన పండ్లు. వీటిని కడుపార భక్షించి, ఇక్కడ సుఖముగా విశ్రమించుము. కొంతసేపు నిద్రించి అలసటను తీర్చుకొని తరువాత వెళ్ళవచ్చును.

భూతం భవ్యం భవిష్యం చ జానామి తపసా స్వయమ్
ఉత్థితో లక్ష్మణ: సర్వే వానరా రామవీక్షితా:॥

నేను తపోబలముచే భూతభవిష్యద్వర్తమానకాలములను గ్రహించగలను. ఇప్పుడు నీవు సుఖముగా విశ్రమించవచ్చును. కారణమేమన నీవేలక్ష్మణుని చికిత్సకై వెళ్లుచున్నావో దాని అవసరము లేదు. లక్ష్మణుడు పునఃఉత్థితుడయినాడు. అంతేగాక రామపాలితులగు సర్వవానరులును స్వస్థులయినారు. ఇక్కడ సుఖముగా నిద్రించి నీవు తిరిగి లంకకు పోవచ్చునని బోధించినాడు.

తచ్ఛ్రుత్వా హనుమా నాహ కమండలుజలేన మే
వశ్యామ్య త్యధికా తృష్ణా తతో దర్శయ మే జలమ్॥

కపటమహర్షియొక్క వచనములను విని, హనుమంతు డిట్లనెను– ఈ చిన్న కమండలువు జలములచే నా తృష్ణ చల్లారదు. నాకు మిక్కిలి దాహము వైచుచున్నది. కాన ఏదైన పెద్ద జలాశయమున్న చూపింపుము.

తథే త్యాజ్ఞాపయామాస వటుం మాయావికల్పితం
వటో దర్శయ విస్తీర్ణం వాయుసూనో ర్జలాశయమ్॥

హనుమంతుని ప్రార్థన నంగీకరించి కాలనేమి రాక్షస మాయా కల్పితుడైన శిష్యవటువు నొకనిని పిలిచి "ఈ హనుమంతునకు అత్యంత విస్తీర్ణమయిన ఆశ్రమజలాశయమును కన్పుచ్చు" మని ఆజ్ఞ నిచ్చెను.

వటువు నాజ్ఞాపించి సరోవరమున జలపానముచేయు విధానమును హనుమంతునకు చెప్పుచున్నాడు.

నిమీల్య చాక్షిణీ తోయం పీత్వా గచ్ఛ మమాంతికం
ఉపదేక్ష్యామి తే మంత్రం యేన ద్రక్ష్యసి చౌషధీ:॥

నీవు ఆసరోవరమున నేత్రములను మూసుకొని జలపానము చేయుము. ఆతరువాత నావద్దకు తిరిగివచ్చినచో ఒకమంత్రమును ఉపదేశించెదను. ఆమంత్రబలమున నీవు ఓషధులను తేలికగా దర్శించ గలవు. కండ్లు తెరచి జలపానమొనర్చినచో జలాశయమందున్న మకరి కన్పించగలదు. గాన మూసుకొని జలపానమొనర్పు మనినాడు. హనుమంతునకు సందేహము కలుగకుండుటకై మంత్రోపదేశ మొనర్చెద ననియు, మంత్రోపదేశమున కది నియమమనియు చెప్పినాడు.

తథేతి దర్శితం శీఘ్రం వటునా సలిలాశయమ్
ప్రవిశ్య హనుమాం స్తోయ మపిబ న్మీలితేక్షణ:॥

గురువుయొక్క ఆజ్ఞ ననుసరించి మాయావటువు జలాశయమును కన్పర్చెను. హనుమంతుడు దానిలో దిగి కండ్లు మూసుకొని జలపానమొనర్చెను.

తత శ్చాఽఽగత్య మకరీ మహామాయా మహాకపిమ్
అగ్రత స్తం మహావేగాత్ మాకుతిం ఘోరరూపిణీ॥

ఇట్లు హానుమంతుడు నేత్రమీలన మొనర్చి జలాశయమున జలపాన మొనర్చుచుండగా ఒక ఘోరస్వరూపముగల మొసలి అతనిని గ్రసించెను. ఆ మొసలి మిక్కిలి మాయావిని అగుటచే అతివేగముగా కపిశ్రేష్ఠుని పట్టి మ్రింగుటకు ప్రయత్నించెను.

తతో దదర్శ హానుమాన్ గ్రసన్తీం మకరీం రుషా
దారయామాస హస్తాభ్యాం వదనం సా మమార హ॥

అంతట హానుమంతుడు తనను పట్టి లాగుచున్న మకరిని క్రోధ దృక్కులతో జూచి రెండుచేతుల దాని పదనమును పట్టి చీల్చివేసెను. వానితో ఆ మొసలి మరణించెను.

తతో ఽన్తరిక్షే దదృశే దివ్యరూపధరాంగనా
ధాన్యమా లీతివిఖ్యాతా హనూమంత మ థాబ్రవీత్॥

ఇక్కడ సరోవరములో హానుమంతుడు మొసలని వధించగనే ఆకాశమున దివ్యరూపధారిణియగు ఒక స్త్రీ కన్పించెను. ఆమె నామ ధేయము ధాన్యమాలి. ఆమె హనుమంతుని కిట్లు పలికెను.

త్వత్ప్రసాదా దహం శాపా ద్విముక్తా ఽస్మి కపీశ్వర!
శప్తాఽహం మునినా పూర్వ మత్సరాత్ కారణాంతరే॥

హే కపిశ్రేష్ఠా! ఒకానొక కారణమున నేను పూర్వము శపింప బడి మకరినయితిని. నేను ఒక అప్సరసను. ధాన్యమాలి అనుదానను. ఈనాడు నీప్రసాదమువలన నాకు శాపవిముక్తి కలిగినది.

ధాన్యమాలి ఒకసారి విమానమున అతివేగముగా కుబేరభవన మునకు వెళ్ళుచు క్రింద ఆశ్రమములోనున్న మహర్షిని ఎరుగక అవ మానపర్చినది. ఆముని పేరు యక్ష్ముడు. అతడు వెంటనే గంధమాదన గిరిపైనున్న సరోవరములో మకరివగుమని శాపాయుధమును ప్రయో గించినాడు. అంతట ఆమె అతనిని వేడుకొనగా శాపవిమోచనమును కలుగజేయునని తెలి

యజేసినాడు. ఈగ్రంథమున గంధమాదనమునకు బదులు హిమాలయ సరోవరమున ధాన్యమాలి ఉన్నట్లు చెప్పబడినది.

ధాన్యమాలి కాలనేమియొక్క కపటమును వెల్లడించుచున్నది.

ఆశ్రమే యస్తు తే దృష్టః కాలనేమి ర్మహాసురః
రావణప్రహితో మార్గవిఘ్నం కర్తుం త హానఘ॥

ఈ ఆశ్రమమున నీకు కన్పించిన మహర్షి నిజమయిన ఋషికాడు. అతడు కాలనేమి అను మాయావిశారదుడయిన మహాసురుడు. అతడు మార్గమున నీకార్యమునకు విఘ్నము నాపాదించుటకై రావణునిచే పంపబడినాడు.

మునివేషధరో నా సౌ ముని ర్వ్యాపవిహింసకః
జహి దుష్టం గచ్ఛ శీఘ్రం ద్రోణాచల మనుత్తమమ్॥

బ్రహ్మర్షులగు మహర్షులను హింసించు రాక్షసుడే మునివేషమును ధరించి ఈ ఆశ్రమమున నున్నాడు. నీ వాదుష్టుని వెంటనే వధించి శీఘ్రముగా ఓషధులను తెచ్చుటకు ద్రోణాచలమున కేగుము.

గచ్ఛా మ్యహం బ్రహ్మలోకం త్వత్ స్పర్శా ద్ధూతకల్మషా
ఇత్యుక్త్వా సా మయా స్వర్గం హనూమా న ప్యథాశ్రమమ్॥

నీవు నన్ను స్పృశించుటవలన నా సర్వకల్మషములు నశించినవి. కనుక నేను బ్రహ్మలోకమున కేగి చతురాననుని సేవించెదను. ధాన్యమాలి ఇట్లు హనుమంతునితో భాషించి తాను బ్రహ్మలోకమునకు వెళ్ళెను. హనుమంతుడును కాలనేమిడున్న ఆశ్రమకుటీరమును చేరెను.

ఆగతం తం సమాలోక్య కాలనేమి రభాషత
కిం విలంబేన మహతా తవ వానరసత్తమ
గృహాణ మత్తో మంత్రాం స్త్వం దేహి మే గురుదక్షిణాం॥

జలపానముచేసి తిరిగివచ్చిన హనుమంతుని నిలోకించి కాలనేమి ఇట్లనెను. "వానరశ్రేష్ఠా! ఇక ఆలస్యమెందులకు. ఓషధులను త్వరగా సంపాదించుటకై ఉపదేశించెదనన్న మంత్రములను గ్రహిం

చుము. మంత్రగ్రహణమునకు ముంపు ఆచారము ననుసరించి గురు దక్షిణను సమర్పింపుము."

ఇ త్యుక్తో హనుమా న్ముష్టిం దృఢం బధ్వా హ రాక్షసమ్
గృహాణ దక్షిణా మేతా మి త్యుక్త్వా నిజఘాన తం ॥

కాలనేమి ఇట్లు పలుకగనే హనుమంతుడు ముష్టిని దృఢముగా బంధించి "ఇదిగో దక్షిణ, గ్రహించుము" అని అతనిని ప్రహరించెను.

విసృజ్య మునివేషం స కాలనేమి ర్మహాసురః
యుయుధే వాయుపుత్రేణ నానామాయావిధానతః ॥

అంతట కాలనేమికూడ తన కపటమునివేషమును విసర్జించి రాక్షసమాయాధురంధరుడగుటచే అనేకవిధముల మాయలను ప్రదర్శించుచు హనుమంతునితో యుద్ధమొనర్చెను.

మహామాయికదూతో ఽసౌ హనుమా న్మాయినం రిపుః
జఘాన ముష్టినా శీర్ష్ణి భగ్నమూర్ధా మమార సః ॥

శ్రీరాముడు పరమాత్మయగుట సర్వజగత్సృష్టికారకమగు మహా మాయాశక్తికికూడ ప్రభువైనవాడు. మహామాయయే అతనిశక్తి. అట్టి రాముసిదూత హనుమంతుడు. అతడు రామునికి అనన్యభక్తుడగుటచే మహామాయికులగువారికి శత్రుడు. సర్వరాక్షసులను అవలీలగా వధించగలవాడు. అట్టివానిముందు కాలనేమియొక్క మాయలేమి సాగగలవు? అతడు ఒక దృఢమగు ముష్టిప్రహారముచే రాక్షసుని శీర్షమున ప్రహరించెను. దానితో తల బద్దలయి అతడు మరణించెను.

తతః క్షీరనిధిం గత్వా దృష్ట్వా ద్రోణం మహాగిరిమ్
అదృష్ట్వా చౌషధీ స్తత్ర గిరి ముత్పాట్య సత్వరః ॥

హనుమంతుడిట్లు కాలనేమిని వధించి అతివేగముగా క్షీరసముద్రతీరమును చేరెను. అచ్చట ద్రోణమను మహాపర్వతమును దర్శించెను. కాని అతనికి సంజీవిని, విశల్యకరణి మొదలగు ఓషధులు కన్పించలేదు. సూర్యోదయాత్పూర్వమే లంకానగరమునకు వెళ్ళవలసినవా

డగుటచే ఓషధులను వెదకుటకై సమయమును వెచ్చించక పర్వతమునే పెరికివేసెను.

ద్రోణగిరిని పెరుకునప్పుడు ఆతనిని పర్వతరక్షకులు మూడు కోట్లమంది గంధర్వులు అడ్డుకొనగా వారిని వధించెనని వాల్మీకము. ద్రోణగిరి అయిదు యోజనముల వెడల్పు, ఏడు యోజనముల పొడవు, పది యోజనముల ఎత్తు ఉన్నదట. దానిని హనుమంతుడు అవలీలగా ఎత్తివేసెను.

గృహీత్వా వాయువేగేన గత్వా రామస్య సన్నిధిమ్
ఉవాచ హనుమాన్ రామ మానీతో యం మహాగిరిః
య ద్యుక్తం కురు దేవేశ విలంబో నాత్ర యుజ్యతే ॥

అట్లు ద్రోణపర్వతమును పెరికి దానిని హస్తమున ధరించి హనుమంతుడు వాయువేగమున శ్రీరాముని సన్నిధికి చేరెను. చేరి అతడు రామునితో ఇట్లు పలికెను. రామా! నాకు ఔషధములు ప్రత్యేకముగా తెలియకపోవుటచే ఈపర్వతమునే పెరికి తెచ్చితిని. నీకు యుక్తమగురీతిని ముందు కార్యగతిని నడపింపుము. తెల్లవారు చున్నది. లక్ష్మణుని బ్రతికించుటకై ఆలస్యముచేయక త్వరపడుడు.

శ్రుత్వా హనుమతో వాక్యం రామః సంతుష్టమానసః
గృహీత్వా చౌషధీః శీఘ్రం సుషేణేన మహామతిః
చికిత్సాం కారయామాస లక్ష్మణాయ మహాత్మనే ॥

హనుమంతుని వచనములనువిని రాముడు సంతుష్టాంతరంగు డయినాడు. అంతట వైద్యశిఖామణియగు సుషేణుడు రామాజ్ఞ ననుస రించి పర్వతమునపైకెక్కి దానినుండి సంజీవవిశల్యకరణులను వెదకి తెచ్చెను. ఆ మహౌషధుల నుపయోగించి మహాత్ముడు లక్ష్మణునికి చికిత్స నొనరించెను.

విశల్యకరణి అనగా బాధను హరించు ఔషధము. సంజీవిని అనగా జీవింపజేయు ఔషధము.

తతః సుప్తోత్థిత ఇవ బుద్ధ్వా ప్రోవాచ లక్ష్మణః
తిష్ఠ తిష్ఠ క్వ గన్తా ఽసి హన్మీదానీం దశానన ॥

సమ్యక్చికిత్సితుడయిన లక్ష్మణుడు ప్రత్యాగతచేతనుడై నిద్ర నుండి లేచినవాడువలె లేచెను. అతడు లేచుచునే పీరత్వాప్రదర్శక ముగా "రావణా ! ఆగుమాగుము. ఎక్కడకు పోగలవు. ఇప్పుడే నిన్ను వధించెదను." అని పలుక నారంభించెను.

ఇతి బ్రువన్త మాలోక్య మూర్ధ్న్యవఘ్రాయ రాఘవః
మాగతిం ప్రాహ వత్సాద్య త్వత్ప్రసాదా న్మహాకపే
నిరామయం ప్రపస్యామి లక్ష్మణం భ్రాతరం మమ ॥

లేచుచునే వీరత్వమును ప్రదర్శించుచున్న సోదరుని ఆలింగన మొనర్చుకొని, మూర్ధాఘ్రాణమొనర్చి రాముడు హనుమంతునితో ఇట్లనెను. "కపిశ్రేష్ఠా ! నేడు నీ అనుగ్రహమున నాసోదరుడు అపాయ మునుండి రక్షింపబడినాడు. నాసోదరుని నీకృపవలననే సజీవునిగా చూడగలుగుచున్నాను."

లక్ష్మణమూర్ఛకు సంబంధించిన ఈవృత్తాంతము వాల్మీకి రామాయణమునకు భేదించుచున్నది. రావణుడు మొదటిసారి యుద్ధ మునకు వచ్చినప్పుడు స్వయంభూదత్తమయిన శక్తిని ప్రయోగించి లక్ష్మ ణుని మూర్ఛితు నొనర్చినాడు. అతనిని గ్రహించి కొనిపోవుటకు ప్రయ త్నింపగా హనుమంతుడు ముష్టిఘాతమున రావణుని వివశునొనర్చి వ్యర్థప్రయత్ను నొనర్చినాడు. లక్ష్మణుడు కొంతసేపటికి స్వయముగనే స్వస్థుడయినట్లు వర్ణింపబడినది. తరువాత రావణుడు కుంభకర్ణుని మేలొకొల్పి యుద్ధమున కంపును. కుంభకర్ణుడు మరణించినతరువాత దుఃఖితుడగు తండ్రిని ఓదార్చి అతికాయు, నరాంతక దేవాంతకాదు లగు అతని పుత్రులు యుద్ధమునకు వచ్చి మరణించిరి. ఆపైన ఇంద్ర జిత్తు బ్రహ్మాస్త్రాదులను ప్రయోగించి మాయాయుద్ధమున రామలక్ష్మణ సహితముగా వానరసైన్యము నంతను సమ్మోహిత మొనర్చినాడు.

అంతట జాంబవత్ప్రేరితుడై హనుమంతుడు ద్రోణగిరినుండి సంజీవివిశల్య కరణులను గొనివచ్చి అందరను సజీవుల నొనర్చినాడు. ఆపైన ఇంద్ర జిత్తు నికుంభిలాహోమమును ఒనర్చువాడై వానరులను ఏమరించుటకు మాయాసీతను నిర్మించి హనుమదాదుల ఎదుట ఖండించినాడు. విభీ షణునివలన ప్రబోధితులై రామలక్ష్మణులు యుద్ధసన్నద్ధులు కాగా, ఇంద్రజిత్తు హోమమొనరించు సంగతిని గ్రహించి విభీషణుడు లక్ష్మ ణునిచే అతని చంపించును. ఆమరునాడు పుత్రశోకపీడితుడగు రావణుడు యుద్ధమున కేతెంచి విభీషణునిపై శక్తిని ప్రయోగించగా లక్ష్మణు డడ్డుపడినట్లు వాల్మీకమున వర్ణితమయినది.

లక్ష్మణుడు సజీవుడయిన అనంతరము రామాజ్ఞ ననుసరించి హనుమంతుడు ద్రోణగిరిని తిరిగి స్వస్థానమున స్థాపించివచ్చెనని వాల్మీకము.

ఇత్యుక్తా వానరై స్సార్ధం సుగ్రీవేణ సమన్వితః
విభీషణమతే నైవ యుద్ధాయ సమవస్థితః ॥

శ్రీరాము డిట్లు హనుమంతుని ప్రశంసించిన అనంతరము సుగ్రీవ విభీషణాదులతో ఆలోచించి సర్వవానరసైన్యములను పురికొల్పుకొని యుద్ధమునకు సన్నద్ధు డయ్యెను.

పాషాణైశ్చ పాదపై శ్చైవ పర్వతాగ్రై శ్చ వానరాః
యుద్ధా యాభిముఖా భూత్వా యయు స్సర్వే యుయుత్సవః
రావణో వివ్యధే రామబాణై ర్వృద్ధో మహాసురః॥

వానరసేనలు యుద్ధమందు గాఢమగు అభిలాషగలవారై పెద్ద పాషాణములను, వృక్షములను, పర్వతశిఖరములను ఆయుధములుగా ధరించి నగరాభిముఖులయిరి. ఈ యావద్వృత్తాంతమును చారుల వలన వినిన రాక్షసశ్రేష్ఠుడగు రావణుడు ఎంతో చింతించెను. అంతే గాక నిన్న రామబాణములచే తగిలిన గాయములచేతనుకూడ ఎంతో బాధపడెను. అనగా స్వయముగా యుద్ధమునకు అసమర్థుడయ్యె నని భావము.

మాతంగ ఇవ సింహేన గరుడే నేవ పన్నగః
అభిభూతో ఽగమ ద్రాజా రాఘువేణ మహాత్మనా
సింహాసనే సమావిశ్య రాక్షసా నిద మబ్రవీత్॥

శ్రీరాముని తీక్ష్ణశరములు శరీరమున ప్రవేశించి పీడితుడయిన రావణుడు సింహాముచే ఆక్రమింపబడిన యేనుగువలెను, గరుడునిచే గ్రసించబడిన సర్పమువలెను, భయభీతుడయ్యెను. రామునిచే పరాభవింపబడి దుఃఖసమాకులచిత్తుడై అతడు తన ఎదుటనున్న రాక్షసులతో ఇట్లనెను.

మానుషే ణైవ మే మృత్యు మాహా ప్యూర్వం పితామహాః
మానుషో హి న మాం హన్తుం శక్తో ఽస్తి భువి కశ్చన॥

పూర్వకాలమున లోకపితామహుడగు బ్రహ్మ మనుష్యునిచేతనే నీకు మృత్యువు సంభవిస్లు నని పేరొక్కనినాడు. కాని సామాన్య మానవుడయినచో ఎవ్వడయినను సరే నన్ను వధించుటకు సమర్థుడు గాడు.

మనుష్యునిచేతనే మృత్యుగ్రస్తుడ వగుదువను బ్రహ్మవచనము రావణునిచే వాల్మీకమందును స్మరింపబడినది- "పురాణం బ్రహ్మణ ఇదం వచనం సముపస్థితం మానుషేభ్యో విజానీహి భయమిత్యేవ తత్తథా" అని.

తతో నారాయణః సాక్షా న్మానుషో ఽభూ న్న సంశయః
రామో దాశరథి ర్భూత్వా మాం హన్తుం సముపస్థితః॥

నారాయణుడే మనుష్యరూపమున దశరథపుత్రు డయిన రాము నిగా జన్మించినాడను మాటలో సందేహములేదు. అతడే ఇప్పుడు నన్ను వధించుటకు వచ్చియున్నాడు.

అనరణ్యో న యు త్పూర్వం శప్తో ఽహం రాక్షసేశ్వరాః
ఉత్పత్స్యతే చ మద్వంశే పరమాత్మా సనాతనః॥
తేన త్వం పుత్రపౌత్రై శ్చ బాంధవై శ్చ సమన్వితః

హనిష్యసే న సందేహ ఇ త్యుక్త్వా మాం దివంగతః
స ఏవ రామః సంజాతో మదర్థే మాం హనిష్యతి॥

ఇక్ష్వాకువంశీయుడయిన అనరణుడు నన్ను పూర్వము శపించి నాడు. ఆశాపమిది. నావంశములో సనాతనుడగు పరమాత్మ ఉద్భవించగలడు. అతనిచే నీవు సపుత్రపౌత్రబాంధవముగా నిహతుడవు కాగలవు. ఇట్లు శపించి అతడు దివమున కేగినాడు. ఆశాపములో పేర్కొనిన సనాతనుడే రాముడుగా జనించినాడు. కనుక ఇతడు నన్ను తప్పక వధించగలడు. అనరణుడు అయోధ్యానగరప్రభువు. ఇక్ష్వాకు వంశీయుడు. రాజర్షి యని పేరొందినవాడు. రావణుడు అయోధ్యపై దండెత్తి యుద్ధమున కాహ్వానించి వధించినాడు. మరణించుటకు ముందు అతడు రావణుని శపించి ప్రాణములను త్యజించినాడు.

రాముడు నారాయణుని అవతారమను భావమునకు వచ్చియు రావణుడు జయింతునను ఆశను విడువలేదు. ఆకారణమున కుంభకర్ణుని మేలొకొపుటకు నియోగించుచున్నాడు.

కుంభకర్ణ స్తు మూఢాత్మా సదా నిద్రావశం గతః
తం విబోధ్య మహాసత్త్వ మానయంతు మమాన్తికం॥

కుంభకర్ణుడు బయటి ప్రపంచంలో ఏమిజరుగుచున్నదో తెలిసి కొనకుండా మూఢుడై. నిద్రకు వశుడై ఉన్నాడు. అతడు మహాసత్త్వ శాలి. అతడు రామలక్ష్మణులను జయింపగలడేమో! అతనిని మేల్కొ లిపి నాయెదుటకు తీసికొనిరండు.

యుద్ధమున విజయమునందుటకు కాక కుంభకర్ణునికికూడ రామ బాణవధచే గల్గు మోక్షమును ప్రసాదింపగోరియే అతనిని అకాలమున రావణుడు మేలొకొలిపినాడని భక్తుల అభిప్రాయము.

ఇ త్యుక్తా స్తే మహాకాయా స్తూర్ణంగత్వా తు యత్నతః
విబోధ్య కుంభశ్రవణం నిన్యూ రావణసన్నిధిమ్
నమస్కృత్య స రాజాన మాసనోపరిసంస్థితః॥

ప్రభువగు రావణు డిట్లాజ్ఞాపించగనే మహాకాయులగు రాక్ష సులు అతిశీఘ్రముగా కుంభకర్ణుని మందిరమునకు వెళ్ళి ఎంతో ప్రయత్న ముపై మేల్కొలిపిరి. అతడును లేచి రావణుని సమీపమునకు వచ్చి నమస్కరించి అతడు చూపిన ఆసనముపై కూర్చుండెను.

రాక్షసులు కుంభకర్ణుని లేపుటకు చేసిన ప్రయత్నమును వాల్మీకి అతి విపులముగా వర్ణించినాడు. లేళ్ళను, మహిషములను, వరాహ ములను వేలకొలది వధించి వాటి మాంసమును వండి కుంభకర్ణునికి భోజ నము పర్వతాకారమున పోసిరట. వేలకొలది రక్తకుంభములను, మద్య కుంభములను అతని ఎదుట నుంచిరట. ధరించుటకు వస్త్రాభూషణము లను, అనుభవించుటకు స్రక్చందనాదులను కుంభకర్ణ మందిరమున సిద్ధ పరచిరట. అతని ప్రబోధించుటకు భేరీమృదంగాది వాద్యముల వాయించి రట. ఏనుగులను మీద నడపించిరట. ఎట్టకేలకు అతడు మేల్కొని తనకై సిద్ధపరుపబడిన మాంసాదులను భుజించి తరువాత ముఖప్రక్షాళ నాదులను ముగించుకొని రావణాజ్ఞ ననుసరించి సభాభవనమునకు బయలుదేరినాడు. అతడు రాజమార్గమున నడచుచుండగా సుదీర్ఘము అత్యంత విశాలము అగు భయంకరస్వరూపము నగర బహిఃప్రదేశ మునన్న వానరసేనలకు కన్పించినదట. కుంభకర్ణుని చూడగనే ఏదో మహాభూతము యుద్ధమునకు రాబోవుచున్నదని తలచి భయపడి సైన్య ములు చెల్లాచెదరు కాజొచ్చినవి. రాముడు విభీషణు నడిగి యథార్థత తెలిసికొనినాడు. వానరసైన్యములు భయపడకుండుటకై విభీషణుని సలహా ననుసరించి అదొక అయోనిర్మిత యంత్రమని నీలునిచే సైన్య ములకు చెప్పించినట్లు వాల్మీకమున వర్ణింపబడినది.

త మాహ రావణో రాజా భ్రాతరం దీనయా గిరా
కుంభకర్ణ నిబోధత్వం మహత్ కష్ట ముపస్థితమ్॥

లేచివచ్చి ఆసనోపవిష్టుడైన సోదరుని జూచి రాక్షసచక్రవర్తి రావణుడు దీనమగు వచనముల నిట్లు పలికినాడు- కుంభకర్ణా నీవు నిద్ర

మత్తునుండి మేల్కొంటి వనుకొనెదను. ఇప్పుడు మనకందరకు ఒక మహత్తరమైన కష్టము సంభవించినది.

రామేణ నిహతాః శూరాః పుత్రాః పౌత్రాశ్చ బాంధవాః
కిం కర్తవ్య మిదానీం మే మృత్యుకాల ఉపస్థితే॥

శ్రీరాముడు లంకానగరముపై దండెత్తివచ్చి మహావీరులగు సేనానాయకుల నందరను వధించినాడు. పుత్రులు, పౌత్రులు, ఇతర బంధులు మొదలగువా రందరు రామబాణములకు లక్ష్యములయిరి. ఇది నాకు మృత్యుసమయ మాసన్నమయిన ట్లున్నది. ఈ సమయమున నిన్ను ప్రబోధింపక తప్పలేదు. కర్తవ్య మేమిటో ఉపదేశించుము.

ఏష దాశరథీ రామః సుగ్రీవసహితో బలీ
సముద్రం సబల స్తీర్త్వా మూలం నః పరికృన్తతి॥

దశరథపుత్రు డయిన ఈ రాముడు సుగ్రీవునితోగూడ మహాశక్తి సంపన్నుడయినాడు. ఇతడు శతయోజనవిస్తీర్ణ మయిన సముద్రమునకు వారధిని నిర్మించి ససైన్యుడై దానిని దాటినాడు. లంకానగరము నంతను ముట్టడించి సమూలముగా మనవంశమునే నాశన మొనర్చుచున్నాడు.

యే రాక్షసా ముఖ్యతమా స్తే హతా వానరైర్యుధి
వానరాణాం క్షయం యుద్ధే న పశ్యామి కదాచన॥

మనసేనలలో ముఖ్యతములగు ప్రహస్తాది మహావీరులు వానర నాయకులచే వధింపబడిరి. కాని వానరవీరులలో ఒక్కడును మరణించి నట్లు కన్పించుటలేదు. శత్రువుల విజయము దాదాపు స్థిరమయినదని ధ్వనించుచున్నాడు.

కుంభకర్ణుని మేల్కొలుపుటకు కారణమును తెలియజేయు చున్నాము.

నాశయస్వ మహాబాహో యదర్థం పరిబోధితః
భ్రాతు రర్థే మహాసత్వ ! కురు కర్మ సుదుష్కరమ్॥

వానరవీరులను వధించు వీరు లెవ్వరును లేకపోవుటచే నిన్ను ప్రబోధించితిని. నీవు మహాసత్త్వసంపన్నుడవు. అందుచే వానర సైన్యములను రామలక్ష్మణసహితముగా నశింపజేయుము. ఈ అనన్య దుష్కరమగు కార్యమును నీవొక్కడవే సాధించగలవాడవు. నీసోదరునికై నీశక్తిని కన్పరుచుము.

శ్రుత్వా తద్రాక్షసేంద్రస్య వచనం పరిదేవితమ్
కుంభకర్ణో జహా సోచ్చైఃి వచనం చేద మబ్రవీత్॥

దీనమగు రాక్షసేంద్రుని వచనములను విని కుంభకర్ణుడు గట్టిగా నవ్వి ఇట్లు పలికెను.

పురామంత్రవిచారే తే గదితం య న్మయా నృప!
త దద్య త్వా ముపగతం ఫలం పాపస్య కర్మణఃి॥

వెనుక మంత్రాలోచనాసమయమునను నేను నా అభిప్రాయములను వెల్లడించియుంటిని. నే నానాడు చెప్పినదే నేడు సంభవించినది. మనముచేసిన పాపకర్మకు ఫలిత మిది.

పూర్వ మేవ మయా ప్రోక్తో రామో నారాయణఃి పరఃి
సీతా చ యోగమా యేతి బోధితో ఒపి న బుధ్యసే॥

నేను ఇదివరకే సీతారాముల యథార్థత్వమును నీకు తెలియ జేసితిని. రాముడు సాక్షా న్నారాయణుని అవతారము. ప్రకృతికంటె పరమయిన ఈశ్వరు డతడు. సీత యోగమాయ. ఈవిషయము నీకు బోధింపబడినను నీవు తెలుసుకొనలేకున్నావు.

ఏకదా ఒహం వనే సానౌ విశాలాయా స్థితో నిశి
దృష్టో మయా ముని స్సాక్షా న్నారదో దివ్యదర్శనఃి
త మబ్రువం మహాభాగ! కుతో గంతా ఒసి మే వద॥

ఒకనాటి రాత్రికాలమున నేను ఒక వనపర్వతమందలి విశాలమగు సానువులలో సంచరింపుచుండగా సాక్షాత్ జ్ఞానస్వరూపుడగు నారద మహర్షి నాకు కన్పించినాడు. ఆయనను చూచి నేను "మహాత్మా! నీవు ఎక్కడనుండి వచ్చుచున్నావు చెప్పుము." అని అడిగితిని.

ఇ త్యుక్తో నారదః ప్రాహ దేవానాం మంత్రణే స్థితః
తత్రోత్పన్న ముదంతం తే వక్ష్యామి శృణు తత్వతః॥

నేనిట్లు ప్రశ్నించగా నారదమహర్షి ఇట్లు తన వృత్తాంతమును చెప్ప మొదలిడినాడు– నేను ఇంతవరకు దేవతలు మంత్రాలోచన మొనరించు సభలోఉండి వచ్చుచున్నాను. అక్కడ బుట్టిన విశేషము లను సంపూర్ణముగ వివరించెదను వినుము.

యువాభ్యాం పీడితా దేవాః సర్వే విష్ణు ముపాగతాః
ఊచు స్తే దేవదేవేశం స్తుత్వా భక్త్యా సమాహితాః
జహి రావణ మక్షోభ్యం దేవ త్రైలోక్యకంటకమ్॥

మీ అన్నదమ్ము లిద్దరిచేతను పీడితులయిన ఇంద్రాదిదేవత లందరును విష్ణుమూర్తిని శరణుజొచ్చిరి. ఆయన దర్శనమీయగా వా రందరు భక్తిప్రపత్తులతో స్తుతించి ఇట్లు ప్రార్థించిరి– ''రావణుడు వర బలదర్పితుడై త్రిలోకములను బాధించుచున్నాడు. అతనిని నీవు ఏదైన ఉపాయముతో వధించుము.

మానుషేణ మృతి స్తస్య కల్పితా బ్రహ్మణా పురా
అత స్త్వం మానుషో భూత్వా జహి రావణకంటకం॥

ఇదివరకు బ్రహ్మ వరములనిచ్చినప్పుడు రావణుని మృతి మను ష్యునికి సాధ్యమగునట్లు చేసినాడు. కనుక నీవు మానుషరూపమును ధరించి లోకకంటకుడగు వానిని వధించవలసినది.

తథే త్యాహ మహావిష్ణుః సత్యసంకల్ప ఈశ్వరః
జాతో రఘుకులే దేవో రామ ఇ త్యభివిశ్రుతః॥

మహావిష్ణువు దేవతల ప్రార్థన నంగీకరించి అట్లే అనెను. సత్య సంకల్పుడగు నారాయణుడు రఘుకులమందు జన్మించి రాము డనుపేర ప్రసిద్ధినందినాడు.

స హనిష్యతి వః సర్వా ని త్యుక్త్వా ప్రయయా మునిః
అతో జానీహి రామం త్వం పరం బ్రహ్మ సనాతనం॥

నారాయణావతారుడయిన రాముడు తప్పక మీ అన్న దమ్ములను వధించగలడు. నారదమహర్షి ఇట్లుచెప్పి తనదారిని పోయెను. కనుక రావణా! నీవు రాముని పరబ్రహ్మ యగు సనాతన పురుషునిగా గ్రహించుము.

త్యజ వైరం భజ స్వాద్య మాయామానుషరూపిణం
భజతో భక్తిభావేన ప్రసీదతి రఘూత్తమః॥

సనాతనపురుషుడగు రామునితోడి వైరమును త్యజించుము. మాయామానుషరూపుడగు పరమాత్మను సేవింపుము. రఘునాయకుడు భక్తిభావముతో భజించిన వారియెడ ప్రసన్నుడుకాగలడు.

భక్తి ర్జనయతీ జ్ఞానస్య భక్తి ర్మోక్షప్రదాయినీ
భక్తిహీనేన యత్కించిత్ కృతం సర్వ మసత్సమమ్॥

పరాత్పరునియందలి భక్తియే జ్ఞానమును కలుగజేయును. భక్తి జనితజ్ఞానము సంసారబంధములనుండి మోక్షమును ప్రసాదించును. భక్తిహీనుడై సత్కార్యము లెన్ని చేసినను అవి అసత్కార్యములుగనే పరిణమించును.

అవతారా స్సుబహవో విష్ణో ర్లీలానుకారిణః
తేషాం సహస్రసద్మనో రామో జ్ఞానమయ శ్శివః॥

సృష్టిప్రారంభమునుండి లీలావిలాసుడగు విష్ణుదేవుని అనేక అవతారములు సంభవించినవి. కాని రామావతారము వాటి అన్నిటి కంటె ఉత్తమమయినది. ఒకవేయి యితరఅవతారములును రామావతారముతో సమానములు కాజాలవు. వాస్తవమునకు రాముడు జ్ఞానస్వరూపుడు. శివస్వరూపుడునుకూడ. శివస్వరూపు డనగా కల్యాణకరమగు శుభరూపము గలవాడనియు లేక మన ఇష్టదైవమగు శివుని కంటె అభిన్నుడనియు భావము.

రామం భజన్తి నిపుణా మనసా వచసా ఽనిశమ్
అనాయాసేన సంసారం తీర్త్వా యాంతి హరేః పదమ్॥

సంసారసాగరమునుండి తరించు ఉపాయముల నెరిగిన మహాత్ములు నిత్యము మనోవాక్కాయకర్మలచే శ్రీరాముని సేవించి అనాయాసముగా ఈ భవసముద్రమును దాటి నారాయణుని స్థానమును పొంది నిత్యముక్తులగుదురు.

యే రామ మేవ సతతం భువి శుద్ధసత్వా
ధ్యాయంతి తస్య చరితాని పఠంతి సన్తః
ముక్తా స్త ఏవ భవభోగమహోపాశైః
సీతాపతేః పద మనన్తసుఖం ప్రయాన్తి॥

ఏ మహాత్ములు పరిశుద్ధమనస్కులై నిత్యము శ్రీరామచంద్రుని దివ్యమంగళవిగ్రహమునే ధ్యానించుచుందురో అతని భక్తానుగ్రహ దుష్టశిక్షణగూపములయిన చరిత్రములను పఠించుచుందురో వారు వెంటనే సంసారభోగములను భయంకర నాగపాశములనుండి విడువడి అనంతసుఖావహమయిన సీతాపతి పాదపద్మములనే పొందుదురు.

అష్టమసర్గ

శ్రీ మహాదేవఉవాచ :—

కుంభకర్ణవచః శ్రుత్వా భ్రుకుటీవికటాననః
దశగ్రీవో జగా దేవం ఆసనా దుత్పత న్నివ॥

కుంభకర్ణు డీవిధమున సీతను రామునకు సమర్పించి అతనిని పరమాత్మగా సేవించుమని హితోపదేశ మొనర్చగా దశాననున కది రుచించలేదు. అతడు ఒక్కసారిగా క్రోధోద్వేగమున కనుబొమలనుముడివైచి ముఖము భయంకరముకాగా తాను కూర్చున్న సింహాసనమునుండి ఎగిరిపడువాడువలె ఇట్లనుపలికెను.

త్వ మానీతో న మే జ్ఞానబోధనాయ సుబుద్ధిమాన్
మయాకృతం సమీకృత్య యుధ్యస్వ యది రోచతే
నో చే ద్గచ్ఛ సుషుప్త్యర్థం నిద్రా త్వాం బాధతే ఽధునా॥

కుంభకర్ణా! నీవు బుద్ధిమంతుడవనియు, నీతిశాస్త్రవిదుడవనియు నాకు తెలియును. కాని నేను నిన్ను ఇప్పుడు నాకు జ్ఞానబోధచేయుమనుద్దేశముతో మేల్కొలుపలేదు. నేను ఇంతవరకు చేసినది మంచిదయినను సరే చెడ్డదయినను సరే అంగీకరించి నీకు ఇష్టమయినచో యుద్ధమొనరింపుము. లేకపోయినచో నిద్రాప్రియుడవు గనుక పోయి నిద్రింపుము.

ఈశ్లోకములో రావణుడు తన అభిమానమును కన్పరచినాడు. కాని వాల్మీకమున నే దోషమునే చేసినా భ్రాతృప్రేమ నంగీకరించి యుద్ధమొనరింపుమని దీనముగా పల్కును- అస్మిన్ కాలే హి యద్యుక్తం తదిదానీం విధీయతాం సమీపనయమద్దోషం విక్రమేణ సమీకురు యది ఖల్వస్తి తే స్నేహో భ్రాతృత్వం చావ గచ్ఛతి యది వాకార్య మే తత్తే హ్యాదికార్యతమం మతం అని. ఆపైన నీవు పోయి నిద్రించుము. నిద్రించుహాని నెవరును వధింపరు అని కొంత అభిమానమును కూడ కన్పరచినాడు.

రావణస్య వచః శ్రుత్వా కుంభకర్ణో మహాబలః
రుష్టో ఽయ మితి విజ్ఞాయ తూర్ణం యుద్ధాయ నిర్యయౌ॥

రావణుని వాక్యములను విని కుంభకర్ణుడు తన అన్న క్రోధాంధుడైయున్నాడని గ్రహించినాడు. అంతట అతిశీఘ్రముగా యుద్ధభూమికి బయల్వెడలినాడు.

స లంఘయిత్వా ప్రాకారం మహాపర్వతసన్నిభః
నిర్యయౌ నగరాత్తూర్ణం భీషయన్ హరిసైనికాన్॥

గొప్పపర్వతమువలె మహోన్నతమయిన కాయముగలవాడగుటచే కుంభకర్ణుడు ద్వారములను దాటి వెళ్ళలేడు. ఆకారణమున అతడు ప్రాకారమును లంఘించియే నగరముండి నెలువడినాడు. భీషణాకారుడయిన అతనిని చూడగనే వానరసైన్యము లన్నియు భయభీతములయినవి.

స ననాద మహానాదం సముద్ర మభినాదయన్
వానరాన్ కాలయామాస బాహుభ్యాం భక్షయన్ రుషా॥

కుంభకర్ణుడు యుద్ధభూమిలో ప్రవేశించి మహోత్సుమగు సింహనాద మొనరించెను. ఆ మహానాదమునకు సముద్రము ఘూర్ణిల్లినది. దిక్కులు ప్రతిధ్వనించినవి. అతడు ముందుకు సాగి తన సుదీర్ఘ బాహువులతో వానరవీరులను గ్రహించి భక్షించసాగెను. అత్యంతాయుతములగు అతని పాదములక్రిందబడి చాలమంది నలిగిపోజొచ్చిరి.

కుంభకర్ణం తదా దృష్ట్వా సపక్ష మివ పర్వతమ్
దద్రువు ర్వానరాః సర్వే కాలాంతక మి వాఖిలాః॥

సుదీర్ఘములగు బాహువులు రెక్కలవలె నుండగా మహోన్నత పర్వతమువలెనున్న కుంభకర్ణునిచూడగనే సర్వవానరవీరులును ప్రళయసమయకాలపురుషునివలె భావించి ధైర్యమును విడిచి పరువిడ నారంభించిరి.

కుంభకర్ణుని నిశ్వాసవాయువుచే గొందరు వానరులు ఆకర్షితులై వాతళగుహాకారమైన ముఖములోనికి విప్రిప్త లయిరనియు, నాసాపుట

ములలోకూడ కొందరు ప్రవేశించిరనియు, కర్ణరంధ్రములగుండగూడ లోనికి వెళ్ళిరనియు మహాకవి వాల్మీకి వర్ణించినాడు.

భ్రమన్తం హరివాహిన్యాం ముద్గరేణ మహాబలమ్
కాలయంతం హరీ వేగా ద్భక్షయంతం సమంతతః
చూర్ణయంతం ముద్గరేణ పాణిపాదై రనేకధా॥

కుంభకర్ణుడు ముద్గరమను మహాయుధమును చేతధరించి వానర సైన్యసముద్రమున ఈదులాడజొచ్చెను. అతడు ముద్గరప్రయోగమున అనేకులగు కపిశ్రేష్ఠులను మృత్యుగ్రస్తుల నొనరించెను. కొందరిని భక్షింపజొచ్చెను. కొందరిని హస్తపాదములచే చూర్ణీకృతుల నొనరించెను.

కుంభకర్ణం తదా దృష్ట్వా గదాపాణి ర్విభీషణః
ననామ చరణౌ తస్య భ్రాతు ర్జ్యేష్ఠస్య బుద్ధిమాన్
విభీషణో ఽహం భ్రాత ర్మే దయాం కురు మహామతే॥

ఇట్లు వానరసైన్యమున వీరవిహారమొనర్చుచున్న కుంభకర్ణుని జూచి నీతికోవిదుడు, ధర్మపరుడు అగు విభీషణుడు అన్నగారి పాదములకు అభివాదము లాచరించెను. అత డాసమయమున గదాపాణియై యుండెను. నమస్కరించి అతడు అన్నతో ఇట్లనెను- సోదరా! నేను నీతమ్ముడనగు విభీషణుడను. నాపై దయాదృష్టిని బరపుము.

రావణస్తు మయా భ్రాత ర్బహుధా పరిబోధితః
సీతాం దేహీతి రామాయ రామ స్సాక్షా జ్జనార్దనః
న శృణోతి చ మాం హన్తుం ఖడ్గ ముద్యమ్య చోక్తవాన్॥

అన్నా! నేను సోదరుడగు రావణునికి ఎంతో హితము నుపదేశించితిని. "రాముడు సాక్షా న్నారాయణుడు, జానకి మహామాయ, ఆమెను తిరిగి రామునకు సమర్పింపుము" అని బోధించితిని. కాని అతడు నామాటలను చెవినిబెట్టలేదు. పైగా నన్ను వధించెదనని ఖడ్గము నెత్తినాడు,

ధి క్త్వాం గచ్ఛేతి మాం హత్వా పదా పాపిభి రావృతః
చతుర్భి ర్మంత్రిభి స్సార్ధం రామం శరణ మాగతః॥

నీవు శత్రుపక్ష పాతివి. ఛీ పొమ్ము అని దూషించి పాపాత్ము లగు మంత్రుల దుర్బోధను చెవినిబెట్టి నన్ను కాలితో తన్ని నాము. అంతట నేను నా నల్వురుమంత్రులతోడను గూడి శ్రీరామచంద్రుని శరణుజొచ్చితిని.

త చ్ఛ్రుత్వా కుంభకర్ణో ఽపి జ్ఞాత్వా భ్రాతర మాగతం
సమాలింగ్య ఽఽహ వత్స త్వం జీవ రామపదాశ్రయః॥

కుంభకర్ణు డంతవరకు యుద్ధోన్మాదములో నున్నాడు. కాని విభీషణుని వాక్యము లతనిని ప్రకృతిస్థు నొనరించినవి. సోదరుడు ఎదు టికి వచ్చినాడను జ్ఞాన మతనికి కలిగినది. అంతట అతడు సోదరుని కౌగలించుకొని ఇట్లనెను- వత్సా! నీవు యుక్తమగుపని జేసితివి. శ్రీరాము నాశ్రయించి సజీవుడవుగా నుండుము.

కులసంరక్షణార్థాయ రాక్షసానాం హితాయ చ
మహాభాగవతో ఽసి త్వం పురా మే నారదా చ్ఛ్రుతమ్॥

నీవు రాముని ఆశ్రయించి కులమును పూర్తిగా నాశనము గాకుండా రక్షించగలవు. రాక్షసజాతికే హితము నొనరించినవాడవు కాగలవు. నీవు మహాభాగవతోత్తముడవని పూర్వము నేను నారద మహర్షిపలన వింటిని.

గచ్ఛ తాత మ యేదానీం దృశ్యతే న చ కించన
మదీయో వా పరో వా ఽపి మదమత్త విరోచనః॥

వత్సా! ఇప్పుడు నీవు నాయెదుటనుండి దూరమునకు తొలగి పొమ్ము. నాకే ఆవేశమున ఏనియు కన్పించుటలేదు. వీడు నావాడు యీడు ఇతడు అనుభేదమేమియు నాకు లేదు. నా నేత్రములు మైకము కమ్ముకొనియున్నవి. కనుక నీవు నాయెదుటనుండి తొలగి సురక్షితు డవు కమ్ము.

ఇ త్యుక్తో ఽభ్రుముచో భ్రాతు శ్చరణా వభివంద్య సః
రామపార్శ్వ ముపాగత్య చింతాపర ఉపస్థితః॥

ఇట్లుపలికిన అన్నగారి వచనములను విని విభీషణుడు ప్రేమాశ్రువ్రులను రాల్చుచు కుంభకర్ణుని పాదములకు అభివందనము లాచరించెను. తదువాత శ్రీరాముని ప్రక్కకు వచ్చి కులమంతయు నశించుచున్నందులకు ఎంతో విచారించెను.

ఈసమయమున వాల్మీకి సుగ్రీవకుంభకర్ణుల యుద్ధమును వర్ణించినాడు. కుంభకర్ణుడు ఘోరయుద్ధమొనర్చి ముద్గరఘాతమున సుగ్రీవుని మూర్ఛితునొనర్చి అతనిని బాహుపులతో గ్రహించి లంకానగరములో ప్రవేశించినాడు. దానిని చూచి హనుమంతుడు పరాక్రమమును చూపి రాజును విడిపింపవలెనని దలచినాడు. కాని సుగ్రీవుడు చిన్నబుచ్చుకొనునేమో అనియు, అతడే ప్రబోధితుడై తిరిగి రాగలడను నమ్మకము తోడను ఊరకొనినాడు. కుంభకర్ణుడు లంకానగర రాజమార్గమున పోవుచుండగా సుగ్రీవుడు మూర్ఛనుండి తేపకొనినాడు. ఆసమయమున నతడు తన కపిత్వమును కన్పరిచి కుంభకర్ణుని కర్ణ నాసాచ్ఛేదమొనర్చినాడట- తతః కరాగ్రైఃసహ సోర్ధ్వ మేత్య రాజా హరీణా మమరేంద్ర శత్రోఃి చకర్త కర్ణౌ దశనైశ్చ నాసాం దదార పార్శ్వేషుచ కుంభకర్ణమ్॥ కపిరాజు రాక్షసుని హస్తములనుండి పైకి వెడలివచ్చి గోళ్ళతో కర్ణములను, పండ్లతో ముక్కును ఛేదించి పార్శ్వములను వేధించెను. అంతట కుంభకర్ణుడు బాధచే నదించుచు క్రోధావిలహృదయుడై సుగ్రీవుని నేలకు వేసి కొట్టెను. సుగ్రీవుడు లాఘవమును కన్పరిచి అతివేగముగా ఆకాశమున కెగిరి రామునివద్దకు చేరెను. కర్ణనాసాహీనుడై రక్తము కారుచుండ ప్రస్రవణగిరివలె భాసించెనట.

కుంభకర్ణో ఽపి హస్తాభ్యాం పాదాభ్యాం పేషయన్ హరీన్
చచార వానరీం సేనాం కాలయన్ గంధహస్తివత్॥

అంతట కుంభకర్ణుడు చేతులతోడను, పాదములతోడను వానరులను నలిపివేయుచు ఆమహాసైన్యములో క్షుద్రజంతువులను పాదముల క్రింద త్రొక్కివేయు మదపుటేనుగువలె సంచరించెను.

దృష్ట్వా తం రాఘవః క్రుద్ధో హాయవ్యం శస్త్ర మాదరాత్
చిక్షేప కుంభకర్ణాయ తేన చిచ్ఛేద రాక్షసః
సముద్గరం దక్షహస్తం తేన ఘూరం ననాద సః॥

ఇట్లు వానరవీరుల నందరను భయార్దితుల నొనరించుచు విహరించుచున్న కుంభకర్ణునిజూచి రాఘవుడు క్రుద్ధుడై సమంత్రకముగా వాయవ్యాస్త్రమును ప్రయోగించెను. ఆ యస్త్రము ముద్గరాయుధ సహితమైన హస్తమును ఛేదించెను. దానితో పీడితుడయిన అసురుడు ఘోరముగా సింహనాదమొనర్చెను.

సహస్తః పతితో భూమా వనేకాగ్ర మర్దయగ్ కర్నీగ్
పర్యన్త మాశ్రితా స్సర్వే వానరా భయవేపితాః
రామరాక్షసయో ర్యుద్ధం పశ్యన్తః పర్యవస్థితాః॥

సముద్గరమయిన హస్తము భూమిపై వ్రాలగా దానిక్రిందబడి వేలకొలది వానరులు నలిగి మరణించిరి. దానితో భయత్రస్తులయిన వానరులు కుంభకర్ణునిసమీపమునకు బోక దూరముగా నిలబడి రామ రాక్షసులయుద్ధమును పర్యాలోకనమొనర్చ మొదలిడిరి.

కుంభకర్ణ శ్ఛిన్నహస్తః సాల ముద్యమ్య వేగతః
సమరే రాఘవం హన్తుం దద్రావతమధీచ్ఛినత్
సాలేన సహితం వామహస్త మైంద్రేణ రాఘవః॥

ఇట్లు కుడిచేయి తెగిపడగా కుంభకర్ణుడు వామహస్తమున ఒక సాలవృక్షమును ధరించి రాఘవునిపై కురికెను. అంతట రాముడును అతిశీఘ్రముగా ఐంద్రాస్త్రమును ప్రయోగించి వృక్షముతోగూడ భుజదండమును మూలమునకు ఛేదించెను.

ఛిన్న బాహు మథాఽఽయాంతం నర్దంతం వీక్ష్య రాఘవః
ద్వా వర్ధచంద్రా ని నిశితా వాదా యాస్య పదద్వయం
చిచ్ఛేద పతితౌ పాదౌ లంకాద్వారి మహాస్వనౌ॥

ఇట్లు రెండుబాహువులును ఛేదించబడగా కుంభకర్ణుడు అత్యంత విస్తీర్ణములగు పాదములతో గంతులిడుచు వానరులను త్రొక్కివేయుచు

రామునిపైకి రాసాగెను. అంతట రాముడు రెండు నిశితములగు అర్ధ చంద్రభల్లములను ప్రయోగించి పాదద్వయమును ఛేదించెను. ఆపాద ములు మహానిస్వనముతో లంకానగర ద్వారమున క్రిందపడినవి.

నికృత్తపాణిపాదో ఽపి కుంభకర్ణో ఽతిభీషణః
బడవాముఖవ ద్వక్త్రం వ్యాదాయ రఘునందనం
అభిదుద్రావ నినదన్ రాహు శ్చంద్రమసం యథా॥

హస్తములు, పాదములు ఛేదించబడినప్పటికిని యుద్ధభయంకరుడగు కుంభకర్ణుడు తనఘోరప్రయత్నమును విరమింపలేదు. అతడు బడబాగ్నివలెమండుచున్న జిహ్వాగల ముఖమును వికృతముగా తెరచుకొని రాముని మ్రింగుటకై రాజొచ్చెను. (పాదములు ఛేదించబడుటచే ప్రాకుచు రాజొచ్చెనని తెలియునది.) కుంభకర్ణుని ఈ ప్రయత్నము చంద్రుని గ్రసించుటకువచ్చు రాహువుయొక్క ప్రయత్నమువలెనున్నది.

అపూరయ చ్ఛరాన్గై శ్చ సాయకై స్తద్రఘూత్తమః
శరపూరిత వక్త్రో ఽసౌ చుక్రోశాతిభయంకరః॥

అట్లు నోరుతెరచి మహానాదము చేయుచుండగా రఘూత్తముడు వేలకొలది, లక్షలకొలది శరములను ప్రయోగించి ముఖబలమును పూరించెను. దానితో అతడు అతిభయంకరముగా కొట్టుకొనుచు ఆక్రోశించెను.

అథ సూర్యప్రతీకాశ మైంద్రం శర మనుత్తమమ్
వజ్రాశని సమం రామ శ్చిక్షే పాసురమృత్యవే॥

అనంతరము శ్రీరామచంద్రుడు కుంభకర్ణుని వధించుతలపుతో సూర్యునివలె తీక్ష్ణముగా ప్రకాశించుచున్న అమోఘమగు ఐంద్రాస్త్రమును సంధించి విడచెను. అది పిడుగువలె శత్రువుపై నడచెను,

స త త్పర్వతసంకాశం స్ఫురత్కుండలదంష్ట్రికమ్
చకర్త రక్షో ఽధిపతేః శిరో వృత్ర మి వాశనిః॥

ఆ ఐన్ద్రాస్త్రము పర్వతోపమానమైనట్టియు, ప్రకాశితకుండల మండితమును, తీక్ష్ణదంష్ట్రాయుతమును అగు రాక్షసశ్రేష్ఠుని శిర

స్సును ఇంద్రప్రయుక్తమయిన వజ్రము వృత్రాసురుని ఛేదించినట్లు ఛేదించెను.

తచ్ఛిరః పతితం లంకాద్వారి కాయో మహోదధౌ
శిరో ఽస్యారోధయత్ ద్వారం కాయో నక్రా ద్యచూర్ణయత్॥

అట్లు ఛేదించబడిన కుంభకర్ణునిశిరము లంకాద్వారమున పడి ద్వారావరోధము కల్పించినది. అతని మహత్తమమగు శరీరము సముద్రమందు పడి ఝుషనక్రతిమితిమింగలాదులను చూర్ణమొనర్చినది.

తతో దేవాః సఋషయో గంధర్వాః పన్నగాః ఖగాః
సిద్ధా యక్షా గుహ్యకా శ్చ అప్సరోభిశ్చ రాఘవమ్
ఈడిరే కుసుమాసారై ర్వర్షంత శ్చాభినందితాః॥

ఇట్లు లోకభయంకరుడగు కుంభకర్ణుని వధించిన శ్రీరామచంద్రుని ఇంద్రాది దేవతలును, నారదాది ఋషులును, చిత్రసేనాది గంధర్వులును, వాసుక్యాది పన్నగులును, వైనతేయాది గరుడులును, సిద్ధ యక్ష గుహ్యకులును ఆనందముతో స్తుతించిరి. అప్సరసలు నృత్యమొనర్చిరి. కల్పవృక్షము అతనిపై పుష్పవర్షమును కురియించెను.

ఆజగామ తదా రామం ద్రష్టుం దేవమునీశ్వరః
నారదో గగనా త్తూర్ణం స్వభాసా భాసయన్ దిశః॥

అంతట దేవర్షి శ్రేష్ఠుడయిన నారదమహర్షి తన దివ్యతేజస్సుచే దిక్కులను ప్రకాశింపజేయుచు రాక్షసవధరూపమయిన మహాకార్య మాచరించిన శ్రీరామచంద్రుని దర్శించి స్తుతించుటకై ఆకాశమునుండి భూమికి అవతరించెను.

రామ మిందీవరశ్యామ ముదారాంకం ధనుర్ధరం
ఈషత్తామ్రవిశాలాక్ష మైంద్రాస్త్రాంచితబాహుకమ్॥

ఔదార్యమహితుడయిన రాముని శరీరవర్ణ మాసమయమున నల్లగలువశోభలనుమించి యున్నది. హస్తమున మహత్తరమగు చాప రాజమును శోభిల్లుచున్నది. ఇప్పుడే కుంభకర్ణుని వధించిన అతని నేత్ర

ములు ఈషత్తామ్రవర్ణాంచితములై యున్నవి. అతనిచేత ధనుస్సుతో పాటు కుంభకర్ణుని వధించి తిరిగి వచ్చిన ఐంద్రాస్త్రము వెల్లొందు చున్నది.

దయార్ద్రదృష్ట్యా పశ్యన్తం వానరాన్ శరపీడితాన్
దృష్ట్వా గద్గదయా వాచా భక్త్యా స్తోతుం ప్రచక్రమే॥

ఇంతవరకు భయంకరపీడితులయిన కుంభకర్ణునిచే పీడితులయిన వానరసైనికులను దయార్ద్రదృష్టితో పరికించుచున్నాడు. అట్టి వత్సల మూర్తిని దర్శించి నారదమహర్షి గద్గదకంఠముతో ఇట్లు స్తుతింప నారంభించెను.

నారద ఉవాచ:—

దేవదేవ! జగన్నాథ! పరమాత్మా సనాతన
నారాయణాఖిలాధార విశ్వసాక్షి న్నమోస్తు తే॥

దేవా! నీవు హిరణ్యగర్భాది సర్వదేవులకును ఆరాధ్యుడవగు ప్రభుడవు. సర్వబ్రహ్మాండములను పరిపాలించు విష్ణుస్వరూపుడవు. జగద్రూపమున పరిణమించు ప్రకృతికంటె పైనఉండు ఆత్మస్వరూపుడవు. ఆదిమధ్యాంతములు లేక నిత్యము ఉండువాడవు. సర్వజీవులకు ఆశ్రయస్థానుడవు. అఖిలసృష్టికి ఆధారభూతుడవు. విశ్వమందు జరుగు సమస్తకర్మలకు సాక్షిగానుండి వాటిని చూచుచుండువాడవు. అట్టి నీకు ప్రణామములు.

విశుద్ధజ్ఞానరూపో ఽపి త్వం లోకా నతివంచయన్
మాయయా మనుజాకారః సుఖదుఃఖాదిమా నివ॥

నీవు స్వచ్ఛమగు జ్ఞానమే స్వరూపముగా గల నిరాకారుడవు. అయినను లోకములకు ఆదర్శమును స్థాపించుటకై నీయథార్థస్వరూపమును మరుగుపరచుకొని మాయ నంగీకరించి మనుష్యస్వరూపముతో సుఖదుఃఖముల ననుభవించువానివలె కన్పించెదవు.

త్వం మాయయా గుహ్యమానః సర్వేషాం హృది సంస్థితః
స్వయంజ్యోతిఃస్వభావ స్త్వం వ్యక్త ఏ వామలాత్మనాం॥

నీవు జీవస్వరూపమున మాయచే ఆవరింపబడినవాడవై సమస్త ప్రాణుల హృదయమందును ఉండు సర్వాంతర్యామివి. నీ యీ యథార్థతత్వమును అజ్ఞానులు గ్రహింపజాలరు. కాని విశుద్ధసత్త్వజ్ఞానముగల మహర్షులకును, మహర్షితుల్యులకును స్వప్రకాశస్వభావముగల నీ స్వరూపము విదితపూర్వమే.

ఉన్మీలయ సృజ స్యేత న్నేత్రే రామ జగత్త్రయమ్
ఉపసంహ్రియతే సర్వం త్వయా చక్షుర్నిమీలనాత్ ॥

రామా ! నీవు ఈసర్వబ్రహ్మాండములను అనాయాసముగా సృష్టించువాడవు. నీవు ఒక్కసారి కళ్ళు తెరచిన చో జగత్త్రయము సృష్టించబడును. ఒక్కసారి కళ్ళు మూసిన చో జగత్త్రంతయు ఉపసంహరించబడును. సృష్టిస్థితిలయములు నీకు లీలలువంటివని భావము. "తదైక్షత బహుస్యామ" అను శ్రుతి "యదాస్వపితి శాంతాత్మా తదా సర్వం నిమీలతి" అని స్మృతి.

యస్మి న్సర్వ మిదం భాతి యత శ్చేతచ్చరాచరమ్
యస్తా న్న కించి ల్లోకే ఽస్మిం స్త్వాన్మే తే బ్రహ్మణే నమః॥

"సర్వం ఖ ల్విదం బ్రహ్మ" అను ఉపనిషన్మహావాక్యప్రతిపాదితుడవగు బ్రహ్మవు నీవు. నీలోనే ఈజగత్త్రంతయు ప్రకాశించుచున్నది. ఈస్థావరజంగమాత్మకమయిన జగత్తు నీనుండే ఉద్భవిల్లుచున్నది. నీవు తప్ప ఈప్రపంచమున మరియొకటిలేదు. అట్టి బ్రహ్మస్వరూపుడవగు నీకు నమస్కారము. నీవు తప్ప మరియొకటి లేదనగా బ్రహ్మేతరిక్తమయిన జగత్తు మిథ్యయని భావము.

ప్రకృతిం పురుషం కాలం వ్యక్తావ్యక్తస్వరూపిణం
యం జానంతి మునిశ్రేష్ఠా స్త్వాన్మే రామాయ తే నమః॥

జగద్రచనావిధానములో ప్రకృతి, పురుషుడు, కాలము, వ్యక్తము, అవ్యక్తము అను పదార్థము లేవిఅయితే వినబడుచున్నవో అవన్నియు నీస్వరూపములే అని సనకాది మహర్షులు, గ్రహించిరి. అట్టి శ్రీరామునకు ప్రణామములు.

ప్రకృతి అనగా శుక్లలోహిత కృష్ణాత్మకమయిన మూలప్రకృతి. జీవస్వరూపమున పరిణమించి ప్రకృతికి సేవ్యుడుగానుండు తత్త్వము పురుషుడు. కాలమనగా నిమిషాదికాలము. వ్యక్తమనగా పంచీకృత భూతపంచకము. అవ్యక్త మనగా అపంచీకృత భూతపంచకము. వేదా వ్యక్తవ్యక్తకములకు స్థూలసూక్ష్మశరీరము లనియు చెప్పనచ్చును. పురుషశబ్దమునకు సృష్టికర్త యగు హిరణ్యగర్భునిగాను అర్థము చెప్ప వచ్చును. మొత్తము స్థూలసూక్ష్మజగత్త్రయము రామస్వరూపమే యని భావము.

వికారరహితం శుద్ధం జ్ఞానరూపం శ్రుతి ర్జగౌ
త్వాం సర్వజగదాకారమూర్తిం చా ప్యాహ సా శ్రుతిః॥

"ప్రకృతి పురుషం" అను శ్లోకమున పరమాత్మ జగద్రూపుడుగా చెప్పబడినది. అయినచో జగత్తు వికారసహితమయినది. వికారసహితు డగువాడు పరమాత్మ ఎట్లయినాడను ప్రశ్నకు ఈశ్లోకమునను, రాబోవు శ్లోకమునను సమాధానము నిచ్చుచున్నాడు- రామా! నీవు జగ ద్రూపుడవయినను జన్మమరణాదిరూపమయిన వికారములు లేనివా డనియు శ్రుతి చెప్పినది. "అజో హ్యేకో జుషమాణో ఽనుశేతే జహా త్యేనాం భుక్తభోగా మజో ఽన్యః" అని శ్వేతాశ్వతరశ్రుతి. "విజ్ఞాన మానందం బ్రహ్మ" అని బృహదారణ్యకము.

"హిరణ్యగర్భః సమవర్త తాగ్రే భూతస్య జాతః పతి రేక ఆసీత్" (ఋగ్వేదము) "ఇంద్రో జాతో ఽత రాజతే" (ఋగ్వేదము) అగ్ని ర్మూర్ధాది వః కకుత్పతిః పృథివ్యాః" (ఋగ్వేదము) మొదలగు శ్రుతివాక్యములు హిరణ్యగర్భుడు, ఇంద్రుడు, అగ్ని మొదలగువారిని జగత్సృష్ట, జగత్పాలకాదులనుగా చెప్పుచున్నది. ఈవిరోధము కన్పిం చుచుండగా రాము డొక్కు సృష్టిస్థితిలయకారకుడను శంకకు సమాధా నము నిచ్చుచున్నాడు.

విరోధో దృశ్యతే దేవ వైదికో వేదవాదినాం
నిశ్చయం నాధిగచ్ఛన్తి త్వత్ప్రసాదం వినా బుధాః॥

వేదములలో పరస్పరవిరోధము కన్పించుచున్నదన్న మాటవాస్తవమునకు సరియైనది గాదు. విరోధము శుకపాఠము నొనరించు వేదపాఠకులదిగాని వేదార్థము తెలిసినవారిదిగాదు. ఎంతటి పండితులయిన భవదీయప్రసాదము లేకుండా తత్త్వనిశ్చయ మొనరింపజాలరు. "తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి" (బృహదారణ్యకం) "త మేవ విది త్వాఽతి మృత్యు మేతి"(శ్వేతాశ్వతరం) మొదలగు వేదాంతవాక్యముల విచారణ చేయకుండా తత్త్వనిర్ణయము చేయలేము. కాన వేదపాఠము కాక వేదార్థజ్ఞానము ముఖ్యమని భావము. ఉపనిషత్తులు నిన్నే జగత్సృష్టిస్థిత్యాదికారకునిగా ప్రసాదించుచున్నవనియు నారదుని అభిప్రాయము.

మాయయా క్రీడితో దేవ న విరోధో మనా గపి
రశ్మిజాలం రవే ర్యద్వత్ దృశ్యతే జలవత్ భ్రమాత్
భ్రాన్తిజ్ఞానా త్తథా రామ త్వయి సర్వే ప్రకల్పితే॥

జగత్తు మాయ. జగత్స్వరూపుడనగు నేనును మాయయేగదా అనినచో దానికి సమాధానము నిచ్చుచున్నాడు- దేవా ! నీవు క్రీడార్థమై మాయను అనుసరించుచున్నావు. కనుక నీ చైతన్యస్వరూపము నకు విప్రతిపత్తి లేదు. మరుభూమిలో సూర్యరశ్ములను చూచి జనులు నీరుగా భావించినట్లే జగత్తును నీవాస్తవస్వరూపముగా భావించుచున్నారు. ఇది మిథ్యాజ్ఞానము. మిథ్యాజ్ఞానకారణముననే జగత్తు నీయందు ఆరోపింపబడుచున్నది.

ప్రకృతి జడము. జడము సృష్టిగా పరిణమింపలేదు. కనుక చైతన్యస్వరూపుడయిన పరమాత్మ ప్రకృతియందు ప్రతిబింబించి చలనము కలుగజేయుచున్నాడు. అప్పుడు సృష్టి ఏర్పడుచున్నది. అందుచే చైతన్యము వినా సృష్టిలేదు. కనుకనే పరమాత్మ జగన్నాయుడుగా చెప్పబడినాడు. మాయావశులు ఈ యథార్థమును తెలిసికొనక జడప్రకృతినే సత్యమని భావించుచున్నారు.

మనసో విషయా ద్దేవ రూపం తే నిర్గుణం పరం
కథం దృశ్యం భవే ద్దేవ దృశ్యాభావే భజే తథం॥

దేవా ! నీవు చైతన్యస్వరూపుడవయినను మాయ నంగీకరించి మనుష్యరూపమున అవతరించుటకు కారణమిది- నీ నిర్గుణరూపము మనస్సుకుమాత్రమే విషయము. అనగా మనననిధిధ్యాసలద్వారానే అనుభవపూర్వకముగా గ్రహించగలిగినది. కాని మానవులందరు దానిని అవగతమొనర్చుకొనుటకు శక్తులుగారు. కనుక సామాన్యమానవుల నేత్రములకు విషయమై వారిని తరింపజేయుటకే నీవు ఈరూపమును ధరించితివి. దృష్టివిషయము కానప్పుడు వారు నిన్ను భజించుట అసంభవముకదా !

అత స్త్వ వావతా రేషు రూపాణి నిపుణా భువి
భజంతి బుద్ధిసంపన్నా స్తర స్త్యేవ భవార్ణవమ్॥

ఆకారణమున నిపుణులగు బుద్ధిమంతులు నీ అవతారములందలి రూపములను భక్తిప్రపత్తులతో సేవించి ఈసంసారసముద్రమును తరించెదరు.

కామక్రోధాదయ స్త్వత శ్శత్రవ శ్శ పరిపంథినశ్శ
భీషయంతి తదా చేతో మార్జారా మూషికం యథా॥

కామక్రోధమోహలోభమదమాత్సర్యములారును చేతనమునకు శత్రువులవలె అపకారులు. మార్జాలములు అనేకములు ఒక్క మూషికము నెట్లు భయపెట్టునో అట్లే ఇది చిత్తమును భయపెట్టును. మనుష్యుడు భయరహితుడై ఇతరులను భజింపడు. అట్టిచో అతనికి భయమేమిటను ప్రశ్నవచ్చినది. కామక్రోధాదులే భయకారకములు. కామాదులు బహువచనము. చిత్తము ఒకేవస్తువు. లోకములో ఒకడు ఒక్కనివలనకంటె అనేకులు ఏకమై ఎదుర్కొనినప్పుడు అధికముగా భయపడుటను మనము చూచుచున్నాము. అట్లే కామాదులనేకములు చిత్తమును ఒక్కదానినిచేసి భయపెట్టుచుండును. ఈ అర్థమును బోధించుటకే మార్జాలములనేకములు మూషికము నొక్కదానిని భయపెట్టునట్లని దృష్టాంతము నిచ్చినాడు.

త్వన్నామ స్మరతాం నిత్యం త్వద్రూప మపి మానసే
త్వత్పూజానిరతానాం తే కథామృతపరాత్మనాం
త్వద్భక్తిసంగినాం రామ సంసారో గోష్పదాయతే॥

శ్రీరామచంద్రా ! నిత్యమూ హృదయకమలములందు నీరూప మునే ప్రతిష్ఠించికొని, నీ పవిత్రనామమునే స్మరించుచు నీ దివ్యమంగళ విగ్రహమునే పూజించుచు, నీ లీలలనే గానమొనరించుచు భక్తివ్రతము సల్పు మహాత్ములకు ఈ భవసముద్రము గోష్పాదమువంటి దగును. నీ భక్తులు అతిసులభముగా మోక్షమును పొందుదురని భావము.

అతస్తే సగుణం రూపం ధ్యాత్వా ఽహం సర్వదా హృది
ముక్త శ్చరామ లోకేషు పూజ్యో వా సర్వదైవతైః॥

ఆకారణమున నేను నిత్యము నీ సగుణరూపమునే హృత్కమల మందు ప్రతిష్ఠించుకొని ధ్యానించుచు ముక్తుడనై సర్వదేవతలకు పూజ్యుడనై దేవర్షినై సంచరించుచున్నాను. నా మహత్వమునకు కారణము నీయందలి భక్తియే.

రామ త్వయా మహత్ కార్యం కృతం దేవహితేచ్ఛయా
కుంభకర్ణవధే నాద్య భూభారో ఽయం గతః ప్రభో॥

శ్రీరామా ! నేడు నీవు ఒకమహత్కార్యము కృత్యము నొనరించి తివి. దీనివలన దేవతలకు అత్యంత హితము చేకూరినది. ఈ కుంభ కర్ణుడు వధింపబడుటచే చిరకాలమునుండి పీడింపబడుచున్న భూమియొక్క భారము చాలవరకు తొలగిపోయినది.

శ్వో హనిష్యతి సౌమిత్రి రింద్రజేతార మాహవే
హనిష్యసే ఽథ రామ త్వం పరశ్వో దశకంధరం॥

రేపు సుమిత్రా పుత్రుడయిన లక్ష్మణుడు ఇంద్రుని జయించిన మేఘనాథుని యుద్ధమున వధించగలడు. ఆతరువాత నీవు లోకకంటకు డగు రావుని వధించగలవు.

పశ్యామి సర్వం దేవేశ సిద్ధై స్సహ నభోగతః
అనుగృహ్ణీష్వ మాం దేవ గమిష్యామి సురాలయం॥

నీ వింతవరకు యుద్ధభూమిలో చేసిన వీరకృత్యముల నన్నిటిని ఇంద్ర, సిద్ధ, యక్షాదులతోగూడికొని ఆకాశముననుండి చూచుచునే ఉన్నాను. ఇకముందుగూడ చూచుచుండెదను. కనుక రామా! ఇక నాకు సురాలయమున కరుగుటకు అనుజ్ఞ నిమ్ము.

ఇ త్యుక్త్వా రామ మామంత్ర్య నారదో భగవా ఁ బుషిః
యయౌ దేవైః పూజమానో బ్రహ్మలోక మకల్మషమ్॥

ఇట్లు మహాతపశ్శాలియైన దేవర్షి నారదుడు రాముని వద్ద సెలవు తీసికొని దేవతలచే పూజింపబడుచు బ్రహ్మలోకమునుగూర్చి ఏగెను.

భ్రాతరం నిహతం శ్రుత్వా కుంభకర్ణం మహాబలః
రావణః శోకసంతప్తో రామే ణాక్లిష్టకర్మణా
మూర్ఛితః పతితో భూమౌ వృత్తాయ విలలాప హ॥

మహాబలశాలియై దేవేంద్రాదులనుగూడ హతప్రభుల నొనర్చిన కుంభకర్ణుడు రామునిచే అతివిలాసముగా చంపబడుటను విని రావణుని దుఃఖమునకు పారము లేకపోయినది. అతడు మూర్ఛితుడై భూమిపై బడి చిరకాలము సోదరునికై దుఃఖించెను.

పిత్రవ్యం నిహతం శ్రుత్వా పితరం చాతివిహ్వలం
ఇంద్రజి త్రావహ శోకార్తం త్యజ శోకం మహామతే॥

పినతండ్రి కుంభకర్ణుడు మరణించగా విహ్వలుడై దుఃఖించుచున్న రావణుని జూచి ఇంద్రజిత్తు ఇట్లు ధైర్యమును పలికెను. తండ్రీ! నీవు మతిమంతుడవు. సామాన్యునివలె దుఃఖించుట తగదు. కాన దుఃఖమును త్యజించుము.

కుంభకర్ణునికై రావణుడు దుఃఖించుచుండగా అతని పుత్రులు దేవాంతక నరాంతక త్రిశిరా ఉతికాయులును, సోదరులు మహోదర మహాపార్శ్వులునుకూడ దుఃఖాక్రాంతులయినట్లు వాల్మీకము. (వీరందరును ప్రహస్తాదులతోబాటు మరణించినట్లు అయిదవసర్గయందు చెప్పబడినది. "శ్రుత్వా యుద్ధే బలం నష్ట మతికాయ ముఖం మహత్" అని ఆరవ

సర్గ (ప్రారంభమున చెప్పబడినది.) తరువాత దేవాంతక నరాంత కాదుల యుద్ధము వర్ణింపబడినది. పాఠకుల కుతూహాలమును నివారిం చుటకై వారి యుద్ధమును సంక్షిప్తముగా ఇచ్చెదను.

మహోదరుడు ఐరావతకులోత్పన్నమయిన సుదర్శన మను గజ రాజము నధిష్ఠించి సర్వాయుధసమాయుక్తుడై యుద్ధభూమికి బయలు దేరెను. మహాపార్శ్వుడు గదాపాణియై బయల్వెడలెను. త్రిశిరుడు మూడుశిరములపై కిరీటములు శోభిల్లుచుండగా ధనుర్ధరుడై ఉత్తమమగు రథము నధిరోహించెను. ఆ సర్వధానుష్కశ్రేష్ఠుడయిన అతికాయుడు కాంచన విచిత్రమకుటమును ధరించి సూర్యరశ్మిప్రభాభాసమానమయిన మేరువువలె ఉత్తమమగు రథముపై వెల్గొందెను. నరాంతకుడు ఉచ్చైఃశ్రవసమానమయిన హయము నధిరోహించి వజ్రసమానమయిన ప్రాసాయుధమును ధరించెను. దేవాంతకుడు పరిఘమును హస్తమున ధరించి మందరగిరిధారియైన విష్ణుని విడంబించెను.

కొంతపేపు రాక్షస వానరసైన్యములకు ఘోరమగు తుముల యుద్ధము సంభవించెను. వానరులు అనేక రాక్షససైనికులను నిహతుల నొనర్చిరి. స్వసైన్యమునొక్క దీనదశనుజూచి హయారూఢుడయిన నరాంతకుడు నిశితమగు శక్తిని హస్తమున ధరించి మహాసముద్రమును మీనముప్రవేశించినట్లు వానరసైన్యమందు ప్రవేశించి వీరవిహార మొన రించసాగెను. తన కెదురయిన వానరులనెల్లరను ప్రాసమునకు బలిగావిం చెను. అతని హయముచెళ్ళిన మార్గమంతయు పర్వతకాయులగు వానరకళేబరములతో నిండి మాంసశోణితకర్దమము వ్యాపించినదట. గిరిశృంగములు మహావృక్షములు చిద్రుపలుచిద్రుపలై పడినవట. ఇట్టి భీషణవీరమూర్తి యెదుట నిలువజాలక వానరులందరును సుగ్రీవుని శరణుజొచ్చిరట. సుగ్రీవుడు నరాంతకుని వధించుటకు అంగదుని ప్రేరే పించెను. కేవల నఖదంష్ట్రములే ఆయుధములుగా గలిగిన వాలిపుత్రుడు నరాంతకుని యెదుటకువచ్చి "ఈ సామాన్యవానరులపై పరాక్రమము నెందులకు వ్యర్థ మొనరించెదవు. వజ్రసమానమగు నాదేహమున ప్రాస

మును ప్రయోగింపు" మనెను. నరాంతకప్రయుక్త మగు ప్రాసము అంగదుని శరీరమును స్పృశించి ద్విధాభగ్నమయినది. అంతట అంగదుడు అరచేతితో అశ్వమూర్ధమున ప్రహరించి వధించెను. అంతట నరాంతకుడు ముష్టితో వాలిపుత్రుని శిరముపై ప్రహరించెను. ప్రహార తీవ్రతకు అంగదుడు నెత్తురుకక్కుకొనెను. కొంచెముసేపు విహ్వలుడై తిరిగి స్వస్థుడై దృఢముష్టిని బంధించి తీవ్రముగా ప్రహరించెను. దానితో అతడు రక్తమును వమనమొనర్చుచు భూపతితుడై ప్రాణములను వదలెను.

నరాంతకుని గతిజూచి దేవాంతకత్రిశీర్ష మహోదరులు అంగదుని ముట్టడించిరి. అంగదుడు ఒక మహావృక్షమును పెరకి ప్రయోగింపగా వారు దానిని తిలశః ఖండించిరి. అనేకములగు వృక్షములను వర్షముగా ప్రయోగింపగా అవియు ఖండితము లయినవి. ముగ్గురు మూడువైపుల నుండి పీడించుచున్నను అంగదుడు చలింపలేదు. అంగదుడు మహావేగముగా దేవాంతకు డధిష్ఠించిన గజరాజమును హస్తతలముచే ప్రహరించి దాని దంతమును పెరకి రాక్షసునిపై విసరెను. దేవాంతకుడు పరిఘముతో అంగదుని ప్రహరించగా అతడు విహ్వలుడై మోకాళ్ళపై బడి తిరిగి వేగముగా ఆకాశమున కెగిరెను. ఎగురుచున్న అతనిని త్రిశిరుడు లలాటమున వేధించెను. ఇట్లు ముగ్గురు రాక్షసులచే పీడితు డగుచున్న అంగదునికి బాసటగా హనుమంతుడు, నీలుడు వచ్చిరి. నీలుడు త్రిశిరునిపై శైలాగ్రమును ప్రయోగించెను. అతడు దానిని బాణములచే చూర్ణీకృత మొనర్చెను. దేవాంతకుడు పరిఘహస్తుడై హనుమంతుని ఎదుర్కొనెను. అతడు తీవ్రముష్టిఘాతమున దేవాంతకుని ప్రహరించెను. మూర్ధము పిండీకృతమై నేత్రములనుండియు, ముఖమునుండియు రక్తమును వమనమొనర్చుచు అతడు గతాశుడయ్యెను.

అంతట త్రిశీర్షుడు క్రుద్ధహృదయుడై నీలునిపై బాణములను వర్షించెను. శరవర్షవిద్ధగాత్రుడగు నీలుడు కొలదిసేపు మూర్ఛాచ్ఛన్నుడయ్యెను. తిరిగి లేచి సవృక్షముగా ఒక పర్వతమును పెరకి మహోద

దునిపై ప్రయోగించెను. శైలపాతముచే మహోదరుడు గజరాజుతో గూడ భూతలగతుడై ప్రాణములను విడిచెను.

ఇట్లు పినతండ్రి మరణించగా సంక్రుద్ధుడయిన త్రిశిరుడు హనుమంతుని వివిధాయుధములచే వేధించెను. వాయుసూనుడు గిరిశిఖరమును విసరెను. రాక్షసుడు దానిని భగ్నమొనర్చెను. హనుమంతుడు ద్రుమవర్షమును కురిపించెను. అవియు వితథములగుట చూచి హనుమంతుడు క్రుద్ధుడై సింహము గజరాజములను చీల్చునట్లు రథహయములను నఖములతో చీల్చెను.

త్రిశిరుడు కాళరాత్రి వంటి శక్తిని గ్రహించి ప్రయోగించెను. ఉల్కవలె వచ్చిపడుచున్న దానిని అనిలపుత్రుడు గ్రహించి భగ్నమొనరించెను. అంతట రాక్షసుడు ఖడ్గమును అతనివక్షముపై విసరెను. ఖడ్గాభిహతుడయిన హనుమంతుడు హస్తతలముచే త్రిశిరుని వక్షమును ప్రహరించెను. దానితో మహాతేజశ్శాలియయిన రాక్షసరాజపుత్రుడు ఆయుధములను జారవిడిచి మూర్ఛితుడయ్యెను. ఇంతలో హనుమంతుడు త్రిశిరప్రయుక్తఖడ్గమును గ్రహించి సర్వరాక్షసులను భయత్రస్తులనొనరించెను. త్రిశిరుడు పునఃఆగతసంజ్ఞుడై ముష్టితో హనుమంతుని ప్రహరించెను. హనుమంతుడు నిశితాశితో రాక్షసుని శిరములను ఛేదించగా ఇంద్రచ్ఛేదితములయిన విశ్వరూపుని శిరములనలె నేలరాలినవి. ఆ తరువాత గజారూఢుడయిన మహోపాస్ఫ్యుడు ఋషభుడను వానరశ్రేష్ఠునితో రణమాచరించి మరణించెను.

ఇట్లు సోదరులును పినతండ్రులును వానరవీరులచే మడియుట జూచి బ్రహ్మవత్తవడగు అతికాయుడు సువిశాలము, సర్వాయుధసంపన్నము అగు రథము నధిరోహించి సింహనాదమొనర్చుచు వానరసైన్యమును సమీపించెను. అతని సువిశాలకాయమును జూచి వానరులు కుంభకర్ణుడు తిరిగి వచ్చినాడేమో అని భయకంపితులయిరట. వారందరును భయత్రస్తులై రాముని శరణుబొందిరి. రాముడు విస్మితుడై ఇతడెవ్వడని విభీషణుని పృచ్ఛించెను. విభీషణుడు అతికాయుని వృత్తాం

తమును రామునకు తెలియజేసెను. "ఇతడు అతికాయుడనువాడు. రావణునకు ధాన్యమాలి యను అప్సరసవలన జనించినవాడు. ఇతడు యుద్ధభూమిలో శాపణసమానుడు. వృద్ధులను సేవించి వేదములను అధ్యయనమొనరించినవాడు. సర్వధర్మములు, శాస్త్రములు తెలిసినవాడు. సర్వాస్త్రవిదుడు. సామదానభేదదండాత్మకములయిన చతుర్విధరాజనీతుల నెరిగినవాడు. ఈతని బాహుబలముచే లంకానగరము సురక్షితముగా నున్నది. ఇతడు ఘోరతపస్సుచే బ్రహ్మనారాధించి అభేద్యమగు కవచమును, అర్క-భాస్వరమయిన విశాలరథమును, దేవాదులచే అవధ్యత్వమును వరములుగా బడసినాడు. ఇతని బాణాసారమున వజ్రముకూడ సుస్తంభితమయినది. వరుణుని పాశముకూడ ఇతనియెడ వ్యర్థమయినది" ఇంతలో అతికాయుడు వానరసైన్యమును సమీపించి ధనుష్టంకార మొనర్చెను.

మైందద్వీదనీలకుముదశరభాదులగు వానరసేనాపతులు భీమకాయుడగు అతికాయునిపై వృక్షషండములను, గిరిశృంగములను వర్షించసాగిరి. అస్త్రవేత్తలలో అగ్రగణ్యుడయిన అతికాయుడు వాటినన్నిటిని ఛేదించెను. శత్రుబాణములచే వ్యథితమర్మములగు ఆ వానరవీరులు అతనిని తిరిగి ఎదుర్కొన సాహసించజాలకపోయిరి. ఆ రాక్షసేంద్రుడు యుద్ధమొనరించజాలనివానరుల నెవ్వరిని వధింపక తిన్నగా రాముని ఎదుటకు వచ్చి "నేను రథస్థుడనై యున్నాను. ఆకారణమున సామాన్యునితో యుద్ధమొనరించుట తగదు. దృఢమగు పరిశ్రమ మొనరించిన వాడెవ్వడయిన నున్నచో యుద్ధమొనరింపవచ్చును." అని పలికెను. అతని ఆమాటను వినగనే శత్రుహంతకుడు క్రుష్ణుడై చాపమును ధరించి నిలబడెను. అతడు హస్తమున శరమును ధరించి అతికాయునెదుట నారి సారించి జ్యాశబ్దముచే రజనీచరులను భయకంపితుల జేసెను. సౌమిత్రి యొక్క చాపనిర్ఘోషమును విని అతికాయుడు విస్మితుడయ్యెను. అతడు నిశితబాణమును చేతధరించి ఇట్లనెను- లక్ష్మణా! నీవు బాలుడవు. కాలసదృశుడనయిన నాతో యుద్ధమొనరింపగోరకుము. నా దృఢబాహు

విసృష్టములయిన శరజాలమును హిమవంతుడుకూడ సహించలేడు. సుఖ నిద్రితమయియున్న నన్ను మండించకుము. చాపమును క్రిందనుంచి ప్రాణములను రక్షించుకొనుము. శూలసమానములయిన నా నిశితశర ములు నీవర్పమును హరించగలవు. ఈవిషసర్పసదృశబాణము సింహము ఏన్గునువలె నీరక్తమును పానమొనర్పగలదు.

అతికాయుని మాటలు సౌమిత్రుని క్రుద్ధునొనర్చినవి. "మాటలు చెప్పినంతమాత్రమున నీవు వీరుడవుకావు. ఆత్మస్తుతి నిందనీయము. పౌరుషశాలియే శూరుడని చెప్పబడును. సర్వాయుధశాలియైన నీవు రథముపైనుండి నీసామర్థ్యమును కన్పరచుము. నేను బాలుడని గర్వించు చున్నావు. నేను బాలుడనో, వృద్ధుడనో నీమృత్యువే చెప్పగలదు. బాలుడయిన విష్ణువు త్రిలోకములను ఆక్రమించినాడు" అని తీవ్ర ముగా బదులుపలికినాడు.

అంతట లక్ష్మణాతికాయుల యుద్ధమును దర్శించుటకు దేవగంధర్వ యక్షగుహ్యకమహర్షులు ఆకాశమున నిలబడిరి. అతికాయుడు ఒక అర్ధచంద్రబాణమును లక్ష్మణునిపై ప్రయోగించగా కాలసర్పమువంటి దానిని లక్ష్మణుడు ఛేదించెను. దానితో పడగపై దెబ్బతగిలిన సర్పమై అతికాయుడు అయిదుబాణములను ప్రయోగించగా వాటిని లక్ష్మణుడు మధ్యమునసే ఛేదించెను. ఛేదించి మరియొక్క నిశితబాణమును చాప మున సంధించి లలాటమును గురిచూచి విడలెను. దానితో అతికా యుడు. రుద్రబాణప్రకంపితమయిన త్రిపురగోపురమువలె చలించెనట. "నా శత్రువు సామాన్యుడు కా" డని మనస్సులో ప్రశంసించెనట. ఇట్లు వారు కొంతసేపు శస్త్రయుద్ధ మొనరించినతరువాత అతికాయుడు ఒక ఘోరశరమును లక్ష్మణుని స్తనాంతరమున నాటెను. దానితో అతడు కొంచెము చలించుచు త్వరలోనే దానిని పెరికివేసెను. తరువాత వారు శస్త్రయుద్ధ మొనర్చిరి. ఐంద్రాగ్నేయాస్త్రములను పరస్పరము ప్రయోగించుకొనుచు వారు చిరకాలము యుద్ధమొనర్చిరి. తరువాత లక్ష్మణుడు అనేక తీక్ష్ణబాణములను అతికాయుని శరీరము పైకి

వదలగా అవి అతని అభేద్యకవచమును స్పృశించి క్రిందపడిపోయి నవి. లక్ష్మణుడు ఇంకను సహస్రములకొలది బాణములను ప్రయోగించెను. కాని అవి అన్నిటికి మొదటివాటిగతియే పట్టినది. అంతట విస్మితుడయిన లక్ష్మణుని కర్ణోపాంతమున వాయుదేవు డిట్లు పలికెను- ''ఇతడు బ్రహ్మదత్తమయిన అభేద్యకవచమును ధరించినాడు. కనుక బ్రహ్మాస్త్రమును ప్రయోగించి భేదించుము. మరియొకవిధమున ఈతడు అవధ్యుడు'' అంతట లక్ష్మణుడు సర్వభూతములు భయకంపితము లగు చుండగా బ్రహ్మాస్త్రము నభిమంత్రించి శత్రువుపై ప్రయోగించెను. దానిని చూచి అతికాయుడుసత్వరుడై శక్తితోమరాదులగు అనేకాయు ధములను ప్రయోగించెను. కాని బ్రహ్మాస్త్రము వాటినన్నిటిని త్రోసివేయుచు సకిరీటమగు అతని శిరమును ఛేదించెను.

అతికాయాది పుత్రమరణమును విని శోకసముద్రనిమగ్నుడయిన రావణుని జూచి ఇంద్రజిత్తు రామలక్ష్మణులను నేడు ఏమయినను సరే వధించితీరెదనని ప్రతిజ్ఞచేసి ససైన్యుడై పురమువెలువడినాడు. అచ్చట అగ్నినిర్వేల్చి బ్రహ్మాస్త్రమును హోమమొనర్చెను. తరువాత తన రథచాపములనుకూడ అభిమంత్రించి రథారూఢుడై ఆకాశమున కెగిరి నాడు. అతడు బ్రహ్మాస్త్రము నాశ్రయించి వివిధాయుధములను ప్రయో గించి వానరసైన్యముల మర్మములను ఛేదించినాడు. హనుమజ్జాంబ వంతసుగ్రీవసుషేణాదులగు వానరయూథపతుల నందరను ప్రత్యేకముగా శరములచే విద్ధమర్మాల నొనర్చినాడు. రామలక్ష్మణులనుగూడ వివశుల నొనర్చినాడు. సర్వవానరసైన్యములు గతజీవములు గతసంజ్ఞములు అయినవి. స్వయంభువదత్తవరుడైన ఇంద్రజిత్తు దినపంచమభాగములో అరువదిపేడుకోట్ల వానరవీరులను వధించెనట. (సప్తషష్టిర్వా తాః కోట్యో వానరాణాం తరస్వినాం అహ్నాపంచమశేషేణ వల్లభేన స్వయంభువః- 'అహ్నాపంచమశేషేణ' అనగా పగటిలో అయిదవభాగమయిన సాయా హ్నామని భావము. ప్రాతఃకాలము, సంగవము, మధ్యాహ్నము, అప రాహ్ణము. సాయాహ్నము అని పగలు అయిదుభాగనుల క్రింద విభ

జించబడినది. ఒక్క సాయాహ్న కాలములో ఇంద్రజిత్తు వానరులను వధించెను.)

రాముడు లక్ష్మణునితో మనము బ్రహ్మాస్త్రమును అవమానించ రాదు. కనుక నాతోపాటు నీవును బాధను సహించుమనినాడు. ఇట్లు విభీషణుడు తప్ప తక్కిన వానరు లందరు రామలక్ష్మణులతో సహా మూర్ఛితులయినారు. ఒక్క హనుమంతుడుమాత్రము ఎట్లో జీవము లను ధరించియున్నాడు. అంతట విభీషణహనుమంతులు సజీవులెవ్వరైన ఉన్నారేమో చూచుటకు సైన్యములను వెదకుచుండగా ఒకచో జాంబ వంతుడు కండ్లు కన్పడక వ్యగ్రుడై కన్పించినాడు. విభీషణుడు తనను తెల్పుకొనగా అతడు హనుమంతుడు సజీవుడై యున్నాడా! అతడు ఒక్కడు బ్రతికియుండినచో అందరమూ బ్రతికియున్నట్లే" అని పలికి నాడు. హనుమంతుడు తనను తెల్పుకొని ప్రణామ మాచరించగా ద్రోణపర్వతమునకు పోయి సంజీవిని, విశల్య మొదలగు ఓషధులను కొనిరమ్మని ఆదేశించినాడు. హనుమంతు డాకార్యము నాచరించి రామలక్ష్మణులను వానరసేనలను బ్రతికించినాడు.

అంతట సుగ్రీవుడు లంకానగరమున ప్రవేశించి ధ్వంసమొనర్పు డని సేనల కాజ్ఞనిచ్చినాడు. హనుమదాదులు నగరమును సర్వనాశన మొనర్చుచుండగా ఎదుర్కొనిన రాక్షసులను రామలక్ష్మణులు వధించి నాగు. వానరసేన ఔద్ధత్యమును మాన్పుటకై రావణుడు కుంభకర్ణ పుత్రులయిన కుంభనికుంభులను, వారికి సహాయులుగా యూపాక్ష, శోణితాక్ష, ప్రజంఘ, కంపనులను పంపినాడు. అంగదుడు కంపనశోణి తాక్షులనువధించగా చూచి యూపాక్షప్రజంఘు లతనిని పొదవినారు. సైందద్వివిదులు తోడుగా అంగదుడు ప్రజంఘుని వధించినాడు. సైందుడు యూపాక్షుని వధించినాడు.

ఇట్లు తనకు సహాయులుగా వచ్చిన వీరులు నిహతులగుట జూచి కుంభుడు శరములను వర్షించుచు అంగదుని ఎదుర్కొనినాడు. అంగ దుడు కొంతసేపు యుద్ధమొనరించి అలయుట జూచి రాముడు జాంబ

వంతుడు సుషేణుడు మొదలగు వానరయోధులను అతనికి బాసటగా పంపినాడు. కాని వారందరును కుంభశరార్దితులయినారు. అంతట సుగ్రీవుడు అంగదుని వెనుక కుంచితాను కుంభు నెదుర్కొనినాడు. కొంత ఘోరయుద్ధము జరిగిన తదువాత కుంభుడు సుగ్రీవునిచే నిహతుడయినాడు. అతని సోదరుడయిన కుంభుడు హనుమంతుని ముష్టిఘాతమున కెరయైనాడు. తదువాత రావణుడు ఖరపుత్రుడయిన మకరాక్షుని పంపగా రామునిచే అతడును నిహతుడయినాడు.

ఇట్లు కుంభనికుంభమకరాక్షాదులు నిహతులగుటవిని రావణుడు ఇంద్రజిత్తును యుద్ధమునకు వెళ్ళమని ఆజ్ఞాపించెను. అతడును తిరిగి తన హోమప్రాప్తమయిన దివ్యరథము నధిష్టించి మాయావృతుడై గుప్తముగా నుండి ఆశీవిషోపమములయిన శరములను వర్షించి వానరులను బడలు పరుపసాగెను. దానిని చూచి లక్ష్మణుడు తాను బ్రహ్మాస్త్రమును ప్రయోగించి ఇంద్రజిత్తుతోపాటు సర్వరాక్షసులను వధించెదననగా రాము డతనిని వారించినాడు. ఇత డొక్కడు అపరాధికాగా రాక్షసకులమునే నశింపజేయుట ఉచితముకాదని బోధించి గుప్తముగా నున్నను ఇతనిని పీడింప సమర్థములగు అస్త్రములను ప్రయోగించెదననగా ఆ మాటలను విని ఇంద్రజిత్తు యుద్ధమును విసర్జించి నగరప్రవేశ మొనర్చినాడు. ఇంద్రజిత్తు మరల రామలక్ష్మణులను వంచించుటకై తన రథమున సీత నిడుకొని పశ్చిమద్వారమున నెలువడి హనుమదాదులు చూచుచుండగా ఆమెను వధించినాడు. హనుమదాదులు దుఃఖవివశులై రామున కీవృత్తాంతమును వినిపించుటకు పోగా ఇంద్రజిత్తు తాను నికుంభిలా ప్రదేశమునకు వెళ్ళినట్లు వాల్మీకము. సీతయొక్క మృత్యువును విని శోకించుచున్న రామునకు విభీషణుడు ఇంద్రజిత్తుయొక్క మాయను వివరించి నికుంభిలాహోమవిఘ్నమునకై ప్రేరేపించినట్లు వర్ణితము. ఈగ్రంథమున ఈవిషయమంతయు వదలివేయబడినది.

మయి జీవతి రాజేంద్ర మేఘనాదే మహాబలే
దుఃఖ స్యావసరః కుత్ర దేవాంతక మహామతే॥

మహారాజా ! నీవు అనన్యసామాన్యమగు బుద్ధివైభవముగల వాడవు. సర్వదేవతలును నీపరాక్రమమునకు నెరచి పరువిడినారు. అట్టి నీవు దుఃఖించవలసిన అవసర మేమివచ్చినది ? అంతేగాక మేఘు నాదుడను నేను జీవించియుండగా నీకువచ్చిన విపత్తేమియున్నది. మేఘు నాదు డనగా మేఘమువలె నాదమొనరించువాడని అర్థము. అతడు పుట్టినతోడనే మేఘమువలె రోదించెనట. అందుచే మేఘనాదుడని నామకరణ మొనర్పబడినది. తరువాత దేవాసురసంగ్రామమున ఇం ద్రుడు రావణుని బంధించగా అతడు తండ్రిని విడిపించి ఇంద్రునే బంధించి లంకానగరమునకు తెచ్చినాడు. అంతట బ్రహ్మ అతనికి ఇంద్రజిత్తు అని బిరుదమునిచ్చి ఇంద్రుని విడిపించినాడు.

వ్యేతు తే దుఃఖ మఖిలం స్వస్థో భవ మహీపతే
సర్వం సమీకరిష్యామి హనిష్యామి చ తే రిపూ ॥

రాజా ! నీదుఃఖమునంతను తొలగించెదను. స్వస్థచిత్తుడ వగుము. నీశత్రువులను వధించి సమస్తమును చక్కబరచెదను.

గత్వా నికుంభిలాం సద్య స్తర్పయిత్వా హుతాశనమ్
లబ్ధ్వా రథాదికం తస్మా దజేయో ఽహం భవా మ్యరేః ॥

నేను తక్షణమే నికుంభిలకు వెళ్ళి అగ్నియందు హోమము లాచరించి దివ్యములగు రథకవచాదులను సంపాదించి అజేయుడనై శత్రువులను వధించెదను.

ఇ త్యుక్త్వా త్వరితం గత్వా నిర్దిష్టం వనస్థలమ్
రక్తమాల్యాంబరధరో రక్తగంధానులేపనః
నికుంభిలాస్థలే మూనీ హవనా యోపచక్రమే ॥

ఇట్లు తండ్రికి ధైర్యమునుచెప్పి ఇంద్రజిత్తు అతిత్వరితముగా యజ్ఞాదులకై ప్రత్యేకించబడిన నికుంభిలకు పోయి రక్తమాల్యాంబరము లను ధరించి, రక్తగంధమును శరీరమునకు లేపనమొనర్చి మౌనియై హోమమును ప్రారంభించెను.

విభోషణో ఽథ త చ్ఛ్రత్వా మేఘనాదస్య చేష్టితమ్
ప్రాహ రామాయ సకలం హోమారంభం దురాత్మనః ॥

అంతట విభీషణుడు చారులవలన ఇంద్రజిత్తు నికుంభిలాహోమము నొనరించుచున్నాడని విని ఆ హోమమునుగూర్చియు, తత్ఫలితమును గూర్చియు రామునకు సర్వమును నివేదించెను.

సమాప్యతే చే ద్ధోమో ఽయం మేఘనాదస్య దుర్మతేః
తదా ఽజేయో భవే ద్రామ మేఘనాదః సురాసురైః
అతః శీఘ్రం లక్ష్మణేన ఘాతయిష్యామి రావణిమ్ ॥

మేఘనాదుడు మిమ్ములను సర్వవానరులను జయించు దుర్బుద్ధితో ఈ యజ్ఞమును ప్రారంభించినాడు. ఈయజ్ఞము సమాప్తినంది నచో అతడు దేవదానవాదులకుగూడ అజేయుడు కాగలడు. ఆకారణమున నేను లక్ష్మణుని గొనిపోయి వానిని వధింపజేసెదను.

అజ్ఞాపయ మయా సార్ధం లక్ష్మణం బలినాం వరమ్
హనిష్యతి న సందేహో మేఘనాదం త వానుజః ॥

కనుక నాతో లక్ష్మణుడు వచ్చునట్లు ఆజ్ఞాపింపుము. లక్ష్మణుడు ప్రపంచమందలి బలశాలురలో శ్రేష్ఠుడు. అతడు నిస్సంశయముగా ఇంద్రజిత్తును వధించగలడు.

శ్రీ రా మ ఉ వా చ :—

అహ మేవ గమిష్యామి హన్తు మిద్రజితం రిపుమ్
ఆగ్నే యేన మహా స్త్రేణ సర్వరాక్షసఘాతినా ॥

విభీషణుని వాక్యములనువిని సోదరవత్సలుడయిన రాము డిట్లనెను. మేఘనాదుడు ఇంద్రుని జయించినవాడు. కనుక నేనే అతనిని వధించెదను. సర్వరాక్షసులను వధించెడి ఈ ఆగ్నేయాస్త్రమును ప్రయోగించి అతనిని వధించెదను.

విభీషణో ఽపి తం ప్రాహ నా సా వన్యై ర్నిహన్యతే
యస్తు ద్వాదశవర్షాణి నిద్రాహారవివర్జితః

తే నైవ మృత్యు ర్నిర్దిష్టో బ్రహ్మణా ఽస్య దురాత్మనః ॥

విభీషణుడు రామున కిట్లు బదులుపలికెను– ఈ దురాత్ముడు లక్ష్మణుడు వినా మరియొకరిచే వధ్యుడుకాడు. పదిరెండుసంవత్సరములు నిద్రాహారములను విసర్జించినవాడే ఇతనిని వధించగలడని బ్రహ్మ యొక్క వరమున్నది.

లక్ష్మణ స్తు అయోధ్యాయా నిర్గ మ్యాయా త్వయా సహా
తదాది నిద్రాహారాదీ న్న జానాతి రఘూత్తమ
సేవార్థం తవ రాజేంద్ర జ్ఞాతం సర్వ మిదం మయా ॥

రామా ! లక్ష్మణుడు అయోధ్యను వదలి నీతో వనమునకు వచ్చిననాటినుండి నీసేవలో మునిగి నిద్రాహారములను విసర్జించినాడు. ఈవిషయమును నేను పూర్తిగ తెలిసికొంటిని. కనుక ఇతడే ఇంద్ర జిత్తును వధింపగలడు.

తదాజ్ఞాపయ దేవేశ లక్ష్మణం త్వరయా మయా
హనిష్యతి న సందేహ శ్శేషః సాక్షాద్ధరాధరః ॥

కనుక అతిత్వరగా లక్ష్మణుడు నాతో వచ్చునట్లు ఆజ్ఞాపింపుము. రామా ! భూభారమునంతను అనాయాసముగా వహించు శేషస్వరూపుడవు. ఇతడు నిస్సంశయముగా శత్రువును వధించగలడు.

త్వ మేవ సాక్షా జ్జగతా మధీశో
నారాయణో లక్ష్మణ ఏవ శేషః
యువాం ధరాభారనివారణార్థం
జాతౌ జగన్నాటకసూత్రధారౌ ॥

రామా ! నీవు ఈజగత్తులకు ప్రభువైయుండి పరిపాలించు నారాయణస్వరూపుడవు. లక్ష్మణుడు సర్వజగద్భారమును వహించు శేషస్వరూపుడు. జగన్నాటకసూత్రధారులను మీరిద్దరును దుష్టులను వధించి భూభారమును హరించుటకు జన్మించిరి.

నవమ సర్గ

శ్రీ మహా దేవ ఉవాచ :—

విభీషణవచః శ్రుత్వా రామో వాక్య మథాబ్రవీత్
జానామి తస్య రౌద్రస్య మాయాం కృష్ణాచ్ఛ విభీషణ ॥

రామలక్ష్మణుల స్వస్వరూప ప్రతిష్ఠాపూర్వకములగు విభీషణుని వాక్యములను విని రాము డిట్లు పలికెను— విభీషణా ! నీవు చెప్పినది వాస్తవమే. ఇంద్రజిత్తుయొక్క రౌద్రస్వరూపమును, శాంబరమాయా విశారదత్వమును నేను పూర్తిగ ఎరుగుదును.

స హి బ్రహ్మాస్త్రవి చ్ఛూరో మాయావీ చ మహాబలః
జానామి లక్ష్మణ స్యాపి స్వరూపం మమ సేవనం
జ్ఞా త్వైవా ఽఽస మహం తూష్ణీం భవిష్య త్కార్యగౌరవాత్ ॥

అతడు సర్వాస్త్రశ్రేష్ఠమయిన బ్రహ్మాస్త్రముయొక్క యథార్థ స్వరూపమును ఎరిగినవాడు. మహాశూరుడు, మహాబలశాలి మీదు మిక్కిలి మాయావి. నేను లక్ష్మణునియొక్క వాస్తవస్వరూపమును కూడ ఎరుగుదును. ఆదిశేషుడే ఇట్లవతరించి నిద్రాహారవివర్జితుడై నన్ను సేవించుచున్నాడను విషయము నాకు తెలియనిదిగాదు. భవిష్యత్తులో రాబోవు ఇంద్రజిద్వధారూపమయిన కార్యగౌరవమును ఊహించియే నేను ఆహారాదులకై అతనిని ప్రోత్సహించలేదు.

ఇత్యుక్త్వా లక్ష్మణం ప్రాహ రామో జ్ఞానవతాం వరః
గచ్ఛ లక్ష్మణ సైన్యేన మహతా జహి రావణిమ్
హనూమత్ప్రముఖైః సర్వై ర్యూథపైః సహ లక్ష్మణ ॥

జ్ఞానులలో శ్రేష్ఠుడగు రాము డిట్లు విభీషణుని సమాధానపరచి లక్ష్మణున కిట్లాజ్ఞాపించెను— "లక్ష్మణా ! హనుమంతుడు మొదలగు సేనాధిపతులను, ఇతర వానరసైన్యములను వెంటనిడుకొని నికుంభిల యందు హోమమాచరించుచున్న రావణపుత్రుని వధింపుము.

జాంబవా నృక్షరాజో ఽయం సహ సైన్యేన సంవృతః
విభీషణ శ్చ సచివైః సహ త్వా మభియాస్యతి
అభిజ్ఞ స్తస్య దేశస్య జానాతి వివరాణి సః ॥

భల్లూకచక్రవర్తి జాంబవంతును ససైన్యుడై నీతో ఉండును. తన నల్లుమమంత్రులతోడను గూడి విభీషణుడు నిన్ననుసరించును. అతడు ఇంద్రజిత్తు హోమమాచరించుచున్న స్థలమును, అతని ఇతర ఛిద్రములను బాగుగా ఎరుగును. వీరి సహాయముచే రావణుని జయించుమని రాముని భావము.

రామస్య వచనం శ్రుత్వా లక్ష్మణ: సవిభీషణ:
జగ్రాహ కార్ముకం శ్రేష్ఠ మన్య ద్భీమపరాక్రమ: ॥

శత్రువులయెడ భయంకరమగు పరాక్రమమును కన్పరచు లక్ష్మణుడు మరియొక శ్రేష్ఠకార్ముకమును చేతధరించి రామాజ్ఞాను సారము విభీషణునితో గలిసి నికుంభిలకు ప్రయాణమయ్యెను.

రామపాదా వుపస్పృశ్య హృష్ట: సౌమిత్రి రబ్రవీత్
అద్య మత్కార్ముకా న్ముక్తా: శరా నిర్భిద్య రావణిమ్
గమిష్యంతి హి పాతాళం స్నాతుం భోగవతీజలే ॥

సౌమిత్రి బయలుదేరుముందు అన్నగారి పాదాభివందన మాచరించి హర్షముతో ఇట్లనెను– రామా ! నేడు నా ధనుర్విద్య సఫలము కాగలదు. నాచాప వినిర్గతనిశితశరములు రావణవ్రజశరీరమును భేదించి భూమిలో చొచ్చుకునిపోయి పాతాళమున ప్రవేశించి భోగవతీ జలములలో రక్తమును క్షాళితమొనర్చుకొనగలవు.

ఏవ ముక్త్వా స సౌమిత్రి: పరిక్రమ్య ప్రణమ్య తమ్
ఇంద్రజిన్నిధనాకాంక్షీ యయౌ త్వరితవిక్రమ: ॥

ఇట్లు పీరోత్సాహమును ప్రకటించుచు పలికి సుమిత్రాపుత్రుడు అన్నకు ప్రదక్షిణనమస్కారము లాచరించి ఇంద్రజిత్తును వధించు తీవ్రాకాంక్షతో త్వరితముగా వెళ్లెను.

వానరై ర్బహుసాహాస్రై ర్హనుమాన్ ప్లవగోత్తమై
విభీషణ శ్చ సహితో మంత్రిభి స్త్వరితం యయౌ
జాంబవత్ప్రముఖా ఋక్షాః సౌమిత్రిం త్వరయాన్వయుః॥

ఇట్లు లక్ష్మణుడు బయలుదేరగనే అనేకవేల వానరసైన్యము లతో హనుమంతుడును, తన నల్గురుమంత్రులతో విభీషణుడును, తన భల్లూకసేనలతో జాంబవంతుడును అతనిని అనుసరించిరి.

గత్వా నికుంభిలాదేశం లక్ష్మణో వానరైః సహ
అపశ్య ద్బలసంఘాతం దూరా ద్రాక్షససంకులమ్॥

ఇట్లు ఋక్ష వానరులతో గలిసి లక్ష్మణుడు నికుంభిలా ప్రదేశ మును సమీపించెను. అతనికి కొంతదూరమునుండియే హోమమొన ర్చుచున్న ఇంద్రజిత్తును పరివేష్టించియున్న రాక్షససంకులమయిన సేనాని వహము దృష్టి గోచరమయ్యెను.

ధను రానమ్య సౌమిత్రి ర్వ్యస్తో భూ ద్భూరివిక్రమః
అంగదేన చ వీరేణ జాంబవాన్ రాక్షసాధిపః॥

అతడు వెంటనే ధనుస్సును జ్యావల్లీయుతమొనర్చి యుద్ధసన్నద్ధు డయ్యెను. మహాబలపరాక్రమసంపన్నుడగు లక్ష్మణుడు సిద్ధముకాగానే అంగదజాంబవంతులును పర్వతగిరిశృంగములను ధరించి ఆయత్తులయిరి.

తదా విభీషణః ప్రాహ సౌమిత్రిం పశ్య రాక్షసా
యం దేత ద్రాక్షసానీకం మేఘశ్యామం విలోక్యతే
అ స్యానీకస్య మహతో భేదనే యత్నవా భవ॥

అంతట విభీషణుడు వినుమని లక్ష్మణునితో ప్రథమమున ఆచ రించవలసిన కర్తవ్యమును తెలియజేసినాడు- లక్ష్మణా ! అదిగో మేఘ సమూహమువలె కన్పడు ఆసైన్యమంతయు హోమనిమగ్నుడయిన ఇంద్రజిత్తును రక్షించుచున్నది, మొట్టమొదట నీవు ఈ మహాసైన్య మును భేదించుటకు ప్రయత్న మొనర్పుము.

రాక్షసేంద్రసుతో ఽప్యస్మిన్ భిన్నే దృశ్యో భవిష్యతి
అభిద్ర వాఽఽశు యావ ద్వై నైతత్కర్మ సమాప్యతే
జహి వీరదురాత్మానం హింసాపరమధార్మికమ్॥

ఈసైన్యము భేదించబడి చెల్లాచెదురుకాగా రాక్షసచక్ర వర్తి పుత్రుడగు మేఘనాదుడు గోచరముకాగలడు. అతడు చేయు హోమకర్మ సమాప్తినందకమునుపే ఈసైన్యమును నాశనమొనరించి అతనిని యుద్ధమున కాహ్వానించి వధింపుము. ఇట్లతనిని వధించుట అధర్మముగాదు. అతడు నిత్యహింసయే పరమధర్మముగా గలవాడు.

విభీషణవచః శ్రుత్వా లక్ష్మణః శుభలక్షణః
ववర్ష శరవర్షాణి రాక్షసేంద్రసుతం ప్రతి॥

ఇట్లు విభీషణుడు ఉపదేశించగా మంగళకరలక్షణసంపన్నుడైన లక్ష్మణుడు రావణపుత్రునిపైకి శరజాలములను వర్షించెను.

పాషాణైః పర్వతాగ్రైశ్చ వృక్షైశ్చ హరియూథపాః
నిర్జఘ్నుః సర్వతో వైత్యాం స్తేఽపి వానరయూథపాః॥

వానరసేనలును పెద్దపెద్ద పాషాణములను, పర్వతశిఖరములను, వృక్షములను ప్రయోగించి రాక్షసులను వధింపసాగిరి. అంతట రాక్షసులును వానరుల నెదుర్కొని వధింపసాగిరి.

పరశ్వధైః సితైర్బాణైః రసిభిర్ష్టితోమరైః
నిర్జఘ్నుర్వానరానీకం తదా శబ్దో మహానభూత్
స సంప్రహార స్తుములః సంజజ్ఞే హరిరక్షసామ్॥

రాక్షసుల పరశువులను, నిశితబాణములను, కర్రలను, తోమరములను, ఖడ్గములను ప్రయోగించి వానరానీకమును మర్దించిరి. ఇట్లు రాక్షస వానరసైన్యములు వారి సింహనాదములు, వీరవచనములు, పదఘట్టనలు, వారి పరస్పరప్రహారములు కలిసి ఒక తుములమగు మహా శబ్దమును సృష్టించి ఆకాశమును పూరించినవి.

ఇంద్రజి త్సాబలం సర్వం మర్ద్యమానం విలోక్య సః
నికుంభిలాం చ హోమం చ త్యక్త్వా శీఘ్రం వినిర్గతః॥

కొంతసేపటికి హనుమదంగదాదులు రాక్షససైన్యములను విశేషముగా పట్టి వధించిరి. సైన్యముల హాహాకారములు మినుముట్టినవి. తనసైన్య మిట్లు మర్దించబడుటను సహింపజాలక రావణపుత్రుడగు ఇంద్రజిత్తు నికుంభిలాప్రదేశమున తా నొనరించు హోమమును త్యజించి తనవారిని రక్షించుకొనుటకై వచ్చెను.

రథ మారుహ్య సధనుఃక్రోధేన మహతా ఽగమత్॥
సమాహ్వయిత్వా సౌమిత్రిం యుద్ధాయ రణమూర్ధని
సౌమిత్రే మేఘనాదో ఽహం మయా జీవ న్న మోక్ష్యసే॥

అతడు ధనుష్పాణియై రథము నధిరోహించి అత్యధికక్రోధముచే మండిపడుచు యుద్ధభూమికి వచ్చి లక్ష్మణు నిట్లు యుద్ధమున కాహ్వానించెను- "సౌమిత్రీ ! ఇదిగో ఆరాక్షసులతో నీకు పనియేమి ? నేను మేఘనాదుడను. ఈనాడు నీవు సజీవుడవై తిరిగి వెళ్ళవు.

తత్ర దృష్ట్వా పితృవ్యం స ప్రాహ నిష్ఠురభాషణమ్
ఇహైవ జాతఃసంవృద్ధఃసాక్షా ద్భ్రాతా పితు ర్మమ॥

ఇంతలో అతనికి లక్ష్మణుని ప్రక్కనే పినతండ్రియగు విభీషణుడు కన్పించినాడు. అతనిని చూడగనే ఇంద్రజిత్తుయొక్క క్రోధము మిన్ను ముట్టినది. అతడు అతినిష్ఠురముగా ఇట్లనెను- నీవు లంకానగరమున రాక్షసకులములో జన్మించినవాడవే. అంతేగాదు నాతండ్రికి సాక్షాత్తు సోదరుడవు.

య స్త్వం స్వజన ముత్సృజ్య పరభృత్యత్వ మాగతః
కథం ద్రుహ్యసి పుత్రాయ పాపీయా నసి దుర్మతిః॥

కాని బంధుజనమును పరిత్యజించి ఈనాడు శత్రువులకు భృత్యుడవైనావు. పుత్రతుల్యుడనయిన నా మర్మముల నన్నిటిని శత్రువునకు తెలిపి పాపాత్ముడవేగాక దుర్మతివిగూడ అగుచున్నావు. స్వజనమును వదలుటవలన పాపాత్ముడను, పుత్రుని మర్మములను వెల్లడించి ద్రోహము తలపెట్టుటవలన దుర్మతి అయినాడని భావము.

వాల్మీకమున ఇంద్రజిత్తు విభీషణుని నిందించిన వాక్యములు ఇవి– ''ఇహ త్వం జాతవృద్ధో ఽసి సాక్షా ద్భ్రాతాపితు ర్మమ, కథ ద్రుహ్యసి పుత్రాయ పితృవ్యః సన్ నిశాచర. న జ్ఞాతిత్వ న భ్రాతృత్వం న జాతి స్త్వ మర్హతే ప్రమాణం న చ సౌహార్దం న ధర్మం ధర్మదూ షక శోచ్య స్త్వ మసి దుష్కృత్తే నిందనీయ శ్చ సాధుభిః, య స్త్వం స్వజన ముత్సృజ్య పరభృత్యత్వ మాగతః. నైత చ్చిత్తిలయా బుద్ధ్యా త్వం వేత్సి మహాదన్తర, క్వ చ స్వజనసంవాసః క్వ చ నీచపరాశ్రయః. గుణవా న్వా పరః జనః స్వజనో నిర్గుణో ఽపి వా నిర్గుణః స్వజనః శ్రేయా న్ యః పరః పర ఏవ సః. నిరనుక్రోశతా చేయం యాదృశీ తేనిశాచర స్వజనేన త్వయా శక్యా ప్రతిష్ఠా వా సుఖాని వాయది త్వం పరుషా ణ్యుక్తా సిత్రా మమ నిశాచర గౌరవా త్ప్రణయా ద్వాఽపి త ద్ధైవ పరిసాన్త్వితః. యథైవ ప్రణయా ద్వాఽపి గురు ర్వదతి విప్రియం తథైవ స పునర్మూఢ శ్రేలాలయ త్యవిచారయన్. గుణవన్మిత్రనాశార్థ మమిత్ర ముపచీయ తే శాలిస్తంబసమిూస్థం శ్యామాక మివ తం త్యజేత్॥

''నీవు వృద్ధుడవు. సాక్షాత్తు నాతండ్రికి సోదరుడవు. అట్టి బంధుడవైయుండియు పుత్రుడ నగు నాకు ద్రోహమును తలపెట్టు చున్నావు. నీవు ధర్మమును కలుషమొనర్చువాడవు. నీకు బంధు భావము లేదు. భ్రాతృప్రేమయు లేదు. శాస్త్రప్రమాణమును గాని, సౌహార్దమునుగాని, నీకు లేదు. స్వజనమును వదలి పరుల భృత్యపదవిని స్వీకరించిన నీవు చివరకు దీనిఫలమును అనుభవింపగలవు. సాధువులు నిన్ను నిందించగలరు. స్వీయబంధువర్గముతో కలిసియున్న దానికిని, పరులను ఆశ్రయించుకొనియుండుదానికిని ఉన్న మహత్తరమగు భేద మును భ్రష్టబుద్ధిగల నీవు గ్రహించజాలవు. పరులు ఎంతటి గుణవంతు లయినను స్వజనులు ఎంతటి గుణహీను లయినను గుణవంతుడగు పరుని కంటె గుణహీనుడయిన స్వజనుడే అధికుడు. పరుడు పరుడే గాని స్వజ నుడు కా లేడు. ఇప్పుడు భ్రాతృపుత్రుడనగు నాయెడ నీవు కన్నరుమ ఈ నిర్దయ నీకు ప్రతిష్ఠనుగాని, సుఖమునుగాని చేకూర్చునది కాజాలదు.

ఇక నాతండ్రి నిన్ను నిందించినాడను మాట యొకటున్నది. పరుష ముగా మాట్లాడినను పెద్దవాడను గౌరవమును పురస్కరించుకొనిగాని, సోదరుడను ప్రేమతోగాని అట్లే నీవు సన్మార్గమును బోధింపవలసినది. ఒకొకప్పుడు గురుస్థానీయుడు ప్రేమచే అప్రియమును పలికినను, అతడే మరియొకసారి ఏవిధమగు స్వార్థములేకనే లాలించగలడు. గుణ వంతుడగు మిత్రుని వదలి శత్రువును సేవించువానిని శాలిస్తంభసమీప మునవున్న శ్యామాకమునువలె పరిత్యజించవలెను.

దీనికి విభీషణుడిచ్చిన సమాధానము.

"కులే యద్యపి జాతోఽహం రక్షసాం పాపకర్మణాం గుణో యః ప్రథమో న్యాణాం తన్మే శీల మరాక్షసః న రమే దారుణే నాహారాజ్యేన పాపకర్మణా భ్రాత్రా విషమశీలేన న చరం స్యే దురాత్మనా హరణం చ పరస్వానాం పరదారాభిమర్షణం సుహృదా మభిశంకా చ త్రయో దోషాః క్షయావహాః. మహర్షీణాం వధో ఘోరః సర్వదేవైశ్చ విగ్రహః క్రోధశ్చ వాభిమాన శ్చ వైరత్వం ప్రతికూలతా ఏతే దోషాః తవ పితు ర్జీవితైశ్వర్యనాశనాః గుణా ప్రచ్ఛాదయన్త్యస్య పర్వతా నివ నీరదాః"

"నేను రాక్షసకులములో జన్మించినప్పటికిని నాశీలము రాక్ష సత్వరహితమై మానవశ్రేష్ఠులకు ముఖ్యమయినది. ఆకారణమునసే నేను దారుణమగు పాపకర్మలకుగాని, రాజ్యసుఖములకుగాని ఒడిగట్టెడి వాడనుగాను. అట్టిచో విషమస్వభావముగల సోదరునితో ఎట్లు కలిసి యుండగలను? పరధనములను అపహరించుట పరదారల నభిగమిం చుట, మిత్రులను శంకించుట అను మూడును నాశనకారకములగు దోషములు. మీతండ్రిలో ఈమూడుదోషములేగాక మహర్షులను వధించుట, దేవతలతో శత్రుత్వము వహించుట, వృథాక్రోధము, దురభి మానము, శత్రుప్రకృతి, సర్వజగద్విపరీతకూల్యము అను సర్వదుర్గుణ ములు నీతండ్రియందున్నవి. అవి అతని ఐశ్వర్యమును, జీవితమును కూడ అపహరించు దోషములు. అతనిలో కొన్ని గుణము లున్నను

ఈ దుర్గణములు మేఘములు పర్వతములను ఆచ్ఛాదించునట్లు వాటిని ఆచ్ఛాదించియున్నవి."

ఇ త్యుక్త్వా లక్ష్మణం దృష్ట్వా హనూమత్ప్రముఖాన్ స్థితాన్
ఉద్యదాయుధనిస్త్రింశే రథే మహతి సంస్థితః॥

ఇంద్రజిత్తు విభీషణుని పరుషవచనములచే దూషించి, తదువాత హనుమంతుని మూపుపై నధిష్ఠించియున్న సౌమిత్రిని జూచి, సర్వాయుధసంపన్నము, దారుణఖడ్గసంయుతము, దివ్యప్రభావభాసితము అగు తన రథము నధిరోహించెను.

మహాప్రమాణ ముద్యమ్య ఘోరం విస్ఫారముత్ ధనుః
అద్య వో మామకా బాణాః ప్రాణాన్ పాస్యంతి వానరాః॥

అతడు అత్యంతము పొడవైన చాపమును చేతధరించి దానిని సారించుచు వానరులతో ఇట్లనెను. ఈనాడు నాచాపముక్త నారాచములు మీ ప్రాణములను పానమొనర్పగలవు.

తతః శరం చాశరధిః సంధా యామిత్రకర్షణః
ససర్జ రాక్షసేంద్రాయ క్రుద్ధః సర్ప ఇవశ్వసన్
ఇంద్రజిద్రత్తనయనో లక్ష్మణం సముదైక్షత॥

శత్రునాశకుడగు దాశరథి దండతాడిత భుజంగమువలె నిశ్వాసమును వదలుచు ఒక తీక్ష్ణశరమును చాపమున సంధించి రాక్షసరాజ పుత్రునిపై వదలెను. దానితో ఇంద్రజిత్తుయొక్క నేత్రములు ఆరక్తములయినవి. అతడు లక్ష్మణుని నిర్దహించుచున్నవాడువలె తీవ్రముగా చూచెను.

శక్రాశనిసమస్పర్శై ర్లక్ష్మణో నాహతః శరైః
ముహూర్త మభవ న్మూఢః పునః ప్రత్యాహృతేంద్రియః
దద ర్శావస్థితం వీరం వీరో దశరథాత్మజమ్॥

ఇంద్రుని వజ్రాయుధమువలె సుతీక్ష్ణములు, బాధాకరములు అయిన లక్ష్మణప్రయుక్త శరజాలముచే విద్ధదేహుడై మేఘనాదుడు ఒక

ముహూర్త కాలము నిస్సంజ్ఞు డయ్యెను. తదుపాత పునః మూర్ఛ విముక్తుడై ఇంద్రియజ్ఞానము కలిగినది. ఆసమయమున అతడు తన యెదుట అచలమువలె నిలబడిన దశరథపుత్రుని జూచెను.

సోఽ భిచక్రామ సౌమిత్రిం క్రోధసంరక్త లోచనః
శరాఁ ధనుషి సంధాయ లక్ష్మణం చేద మబ్రవీత్॥

లక్ష్మణునిజూడగనే అతని క్రోధము ద్విగుణీకృతమయినది. అతని నేత్రములు క్రోధానలపూరితములై రక్తవర్ణములయినవి. అతడు తీక్ష్ణములగు శరములను సంధించి లక్ష్మణునితో ఇట్లు పలికెను.

యది తే పథమే యుద్ధే న దృష్టో మే పరాక్రమః
అద్య త్వాం దర్శయిష్యామి తి ష్ఠేదానం వ్యవస్థితః॥

మొదట మనకు జరిగిన యుద్ధమున నాపరాక్రమము నీకు వివి తము కాకపోయినచో ఈనాడు నాయెదుట దృఢముగా నిలబడుము. నాశక్తి సామర్థ్యములను ప్రదర్శించెదను.

ఇ త్యుక్త్వా సప్తభి ర్బాణై రభివివ్యాధ లక్ష్మణం
దశభి శ్చ హనూమంతం తీక్ష్ణధారైః శరోత్తమైః॥

ఇట్లు పలుకుచు మేఘనాదుడు ఏడు బాణములను ప్రయోగించి లక్ష్మణుని శరీరమును వేధించెను. సునిశితములగు పది ఉత్తమశరము లను ప్రయోగించి హనుమంతుని నొప్పించెను.

తతః శరశతై ర్ముక్తై సంపర్యుక్తేన వీర్యవాఁ
క్రోధా ద్విగుణసంరబ్ధో నిర్బిభేద విభీషణం॥

ఆతదువాత లక్ష్మణుని ప్రక్కనేడున్న విభీషణుని చక్కగా గురి చూచి క్రోధముతో తన బాహుశక్తిని ద్విగుణీకృతమొనర్చి ఆ నారిని ఆకర్ణాంతము ఆకర్షించి నూరు తీక్ష్ణ బాణములతో వేధించెను.

లక్ష్మణో ఽపి తథా శత్రుం శరవర్షై రవాకిరత్
తస్య బాణైః సుసంవిద్ధం కవచం కాంచనప్రభమ్
వ్యశీర్యత రథోపస్థే శిలశః పతితం భువి॥

అంతట లక్ష్మణుడును తీక్ష్ణములగు శరములను వర్షముగా కురి యించి అతనిని ముట్టడించెను. ఆశరఘాతములచే మేఘనాదుని శరీర మును రక్షించుచున్న దృఢకవచమును ఛేదింపబడినది. బంగరు రంగుల నీను ఆ కవచము తిలలవలె విశీర్ణమై రాలిపోయెను.

తతః శరసహస్రేణ సంక్రుద్ధో రావణాత్మజః
బిభేద సమరే వీరం లక్ష్మణం భీమవిక్రమమ్ ॥

అంతట రావణపుత్రుడు క్రోధపూరితహృదయుడై తనుగూడ వేలకొలది శరములను వర్షించి శత్రుభీకరపరాక్రమశాలియగు లక్ష్మ ణుని శరీరమున గ్రుచ్చెను.

వ్యశీర్య తాపత దివ్యం కవచం లక్ష్మణస్య చ
కృత్తిప్రత్తికృతానోన్యం బభూవతు రభిద్రుతౌ ॥

దానితో లక్ష్మణుని శరీరమును రక్షించుచున్న దివ్యకవచము కూడ శీర్ణమై పడెను. ఇట్లు ఆ వీరశ్రేష్ఠులిరువురు అన్యోన్యము ప్రతీకా రము లొనరించుకొనుచు చిరకాలము యుద్ధమొనరించిరి.

అభీక్ష్ణం నిస్వసంతౌ తౌ యుధ్యేతాం తుములం యుధి
శరసంవృతసర్వాంగౌ సర్వతో రుధిరోక్షితౌ ॥

వారు అదేపనిగా నిశ్వసించుచు తుములయుద్ధ మొనరించిరి. కొంతసేపటికి వారి సర్వాంగములు శరవిద్ధములయినవి. వారి శరీరముల నుండి రక్తము సెలయేళ్ళై ప్రవహించ సాగెను.

సుదీర్ఘకాలం తౌ వీరా వన్యోన్యం నిశితైః శరైః
అయుధ్యేతాం మహాసత్వౌ జయాజయవివర్జితౌ ॥

ఇట్లు లక్ష్మణ ఇంద్రజిత్తులు పరస్పరము సుతీక్ష్ణములగు శిలీముఖ ములచే నొప్పించుకొనుచు జయాపజయములనుగూర్చి ఆలోచించక మహోత్తరమగుశక్తిని ప్రదర్శించుచు యుద్ధమొనర్చిరి.

ఏతస్మిన్నంతరే వీరో లక్ష్మణః పంచభిః శరైః
రావణేః సారథిం సాశ్వం రథం చ సమచూర్ణయత్ ॥

ఇట్లు ఘోరరణము జరుగుచుండ ఒక అవకాశమును గ్రహించి లక్ష్మణుడు అయిదు శరములను ప్రయోగించి రావణపుత్రుని సారథిని, అశ్వములను, రథమును భగ్నమొనర్చెను.

చిచ్ఛేద కార్ముకం తస్య దర్శయన్ హస్తలాఘవం
సోప్యన్యత్కార్ముకం భద్రం సజ్యం చక్రే త్వరాన్వితః ॥

తరువాత లక్ష్మణుడు హస్తలాఘవమును ప్రదర్శించుచు మేఘనాదుని ధనుస్సును ఖండించెను. అంతట ఇంద్రజిత్తును అతిశీఘ్రముగా మరియొక కార్ముకమును చేధరించి ధనఃష్కోటికి నారి బిగించెను.

తచ్చాపమపి చిచ్ఛేద లక్ష్మణస్తిభి రాశుగైః
తమేవ చ్ఛిన్నధన్వానం విధ్యా ధానేకసాయకైః ॥

లక్ష్మణుడును వెనువెంటనే మూడు ఆశుగములను ప్రయోగించి ఆ చాపమునుకూడ ముక్కలుగావించెను. ఖండితచాపుడయిన శత్రువుపై ఇంకను అనేకబాణములను వర్షించి శరీరమును వికలమొనర్చెను.

పున రన్యత్సమాదాయ కార్ముకం భీమవిక్రమః
ఇంద్రజిల్లక్ష్మణం బాణైః శతైరాదిత్యసన్నిభైః
బిభేద వానరాన్సర్వాన్ బాణైరాపూరయన్ దిశః ॥

శత్రుభయంకర పరాక్రముడగు ఇంద్రజిత్తు ఇట్లు నొచ్చియు భయపడక మరియొక కార్ముకమును చేతధరించి సూర్యకిరణములవలె మండుచున్న బాణములను ప్రయోగించి లక్ష్మణుని శరీరమును భేదించెను. అంతేగాక బాణవర్షముచే దిక్కులను అంధకారమయముగావించి వానరులనందరను భేదించెను.

తత ఐన్ద్రిం సమాధాయ లక్ష్మణో రావణిం ప్రతి
సంధాయాకృష్య కర్ణాంతం కార్ముకం దృఢనిష్ఠురం
ఉవాచ లక్ష్మణో వీరః స్మరన్ రామపదాంబుజం ॥

ఇంద్రజిత్తు ఇట్లు విజృంభించగా లక్ష్మణుడు క్రోధమూర్తియై రావణిని వధించదలచెను. తలచి తూణీరమునుండి ఇంద్రదేవతాత్మక

మయిన ఐంద్రాస్త్రమును దీసెను. తీసి ధనుస్సున సంధించి దానిని ఆకర్ణాంతము ఆకర్షించి దృఢముష్టిగలవాడై శ్రీరాముని పాదపద్మము లను స్మరించుచు ఇట్లు పలికెను.

ధర్మాత్మా సత్యసంధ శ్చ రామో దాశరథి ర్యది
త్రిలోక్యా మప్రతిద్వంద్వ స్త దేవం జహి రావణిమ్ ॥

దశరథపుత్రుడగు శ్రీరాముడు నిత్యభరతచిత్తుడేని, సత్యసంధుడేని, త్రిలోకములందును ప్రతిపీరుడు లేనివాడేని ఈ అస్త్రము రావణపుత్రుని జీవముల నపహరించుగాక. వాల్మీకిరామాయణమున లక్ష్మణుని ఈ శపథము ఇట్లున్నది–ధర్మాత్మా సత్యసంధ శ్చ రామో దాశరథి ర్యథా పౌరుషే చాప్రతిద్వంద్వ స్తథామం జహి రాక్షసం పితృభక్తో దేవవరో వీరవ్యూహరణేరతః భక్తానుకంపీ భూతానాం తథేమం జహి రాక్షసమ్'' అని.

ఇత్యుక్త్వా బాణ మాకర్ణా ద్వికృష్య త మజిహ్మగమ్
లక్ష్మణః సమరే వీరః ససర్జేంద్రజితం ప్రతి ॥

ఇట్లు రామనామమును, రామశక్తిని స్మరించి లక్ష్మణుడు అత్యంత క్రూరమగు ఆబాణమును ఆకర్ణాంతము లాగి ఇంద్రజిత్తును గూర్చి ప్రయోగించెను.

స శరః సశిరస్త్రాణం శీమజ్జ్వలితకుండలం
ప్రమ థ్యేంద్రజితః కాయాత్ పాతయామాస భూతలే ॥

అంతట లక్ష్మణప్రయుక్తమయిన ఐంద్రాస్త్రము అత్యంత శోభాయుక్తమై, రత్నకుండల ప్రభాభాసమానమగు ఇంద్రజిత్తుయొక్క శిరమును అతనికాయమునుండి ఖండించి భూపతితు నొనర్చెను.

తతః ప్రముదితా దేవాః కీర్తయంతో రఘూత్తమం
వవర్షుః పుష్పవర్షాణి స్తువంత శ్చ ముహు ర్ముహుః ॥

లక్ష్మణు డిట్లు ఇంద్రజిత్తును ఐంద్రాస్త్రమున కెరగావింపగా దేవతలందరును అత్యంత ముదితహృదయు లయ్యిరి. వారు రాఘువ

శ్రేష్ఠుడగు సుమిత్రాపుత్రుని కీర్తించనారంభించిరి. వారు ఆనందాతిరేకమున అతనిపై పుష్పములను వర్షించిరి. అనేకవిధముల ప్రశంసించిరి.

జహర్ష శత్రో భగవాన్ సహ దేవైః మహర్షిభిః
ఆకాశే ఽపి చ దేవానాం శుశ్రుతే దుందుభిస్వనః
విమలం గగనం చాసీత్ స్థిరా ఽభూ ద్విశ్వధారిణీ ॥

మేఘనాదుడు లక్ష్మణునిచే వధింపబడగా దేవగణయుతుడును మహర్షి సహితుడును అగు దేవేంద్రుడు మహదానందము ననుభవించెను. ఆకాశమున దేవతలు ఆనందసూచకముగా దుందుభులను మ్రోయించిరి. ఆకాశము ఏనూత్రము ఉత్పాతములులేనిదై నిర్మలమాయెను. అంతవరకు రాక్షసభారమున కంపించుచున్న భూదేవి స్వస్థయై జనసందోహమును భరించసాగినదట !

నిహతం రావణిం దృష్ట్వా జయజల్పసమన్వితః
గతశ్రమః స సౌమిత్రిః శంఖ మాపూరయ ద్రణే ॥

లక్ష్మణుడిట్లు మేఘనాదుని వధించగనే హనుమదాది వానరులందరును ఒక్కసారిగా ముక్తకంఠముతో జయజయశబ్దముల నొనర్చిరి. తాను పడినశ్రమ ఫలించినతోడనే లక్ష్మణుడు తన శ్రమనంతను మరచి ఉత్సాహముతో విజయశంఖమును పూరించెను.

సింహనాదం తతః కృత్వా జ్యాశబ్ద మకరో ద్విభుః
తేన నాదేన సంహృష్టా వానరా శ్చ గతశ్రమాః ॥

యోగీశ్వరుడగు లక్ష్మణుడు శంఖమును పూరించిన అనంతరము సింహనాదము నొనరించెను. తదువాత రాక్షసుల గుండె లవియునట్లు ధనుష్టంకారము నొనరించెను. శత్రుభయంకరమగు ఆశబ్దము వానరుల హృదయముల కాహ్లాదకరమయినది. వారు యుద్ధములో పడిన శ్రమనంతయు మరచిపోయిరి.

వానరేంద్రై శ్చ సహిత స్తువద్భి ర్హృష్టమానసైః
లక్ష్మణః పరితుష్టాత్మా దదర్శాభ్యేత్య రాఘవం ॥

అతరువాత సంతుష్టహృదయాంతరంగుడయిన లక్ష్మణుడు, మిత్రులు, హృష్టమానసులు అగు వానరసేనాధిపతులతో గలిసి అన్న గారి సమీపమునకు వచ్చి ఆయనను దర్శించెను.

హనూమద్రాక్షసాభ్యాం చ సహితో వినయాన్వితః
వవందే భ్రాతరం రామం జ్యేష్ఠం వానయణం విభుమ్
త్వత్ప్రసాదా ద్రఘుశ్రేష్ఠ హతో రావణి రాహవే ॥

హనూమద్విభీషణులు వెంటరా లక్ష్మణుడు వినయభావముతో సోదరుని సమీపించి అతనిని సాక్షాన్నారాయణునిగా భావించి సాష్టాంగ దండప్రణామ మాచరించెను. తరువాత అతడు అన్నతో ఇట్లు పలికెను. "ఓ రఘుశ్రేష్ఠా! భవదీయానుగ్రహముచే మేఘనాదుడు యుద్ధమున వధింపబడినాడు."

శ్రుత్వా తల్లక్ష్మణా ద్భక్త్వా త మాలింగ్య రఘూత్తమః
మూర్ధ్న్యుత్ఘ్రాయ ముదితః సస్నేహ మిద మబ్రవీత్ ॥

లక్ష్మణు డిట్లు అహంకారరహితుడై భక్తిప్రపత్తులతో పలికిన వాక్యములను విని శ్రీరామచంద్రుడు మిక్కిలి ప్రేమతో అతని నాలింగన మొనర్చుకొని, మూర్ధాఘ్రాణమొనర్చి ప్రేమతో ఇట్లు పలికెను.

సాధు లక్ష్మణ! తుష్టోఽస్మి కర్మతే చుష్కరం కృతమ్
మేఘనాదస్య నిధనే జితం సర్వమరిందమ॥

ఓ శత్రునాశకుడగు లక్ష్మణా! నీవు అత్యంతము నిపుణముగా శత్రువధను చేసితివి. నిజముగా నీ యీపని అనన్యదుష్కరమయినది. ఒక్క మేఘనాదుడు మరణించినచో రావణుడును వధింపబడినట్లే నిజముగా నీ యీకృత్యముచే విజయము మనకు లభించినట్లే అయినది.

అహోరాత్రై స్త్రిభి ర్వీరః కథంచిత్ వినిపాతితః
నిస్సపత్నః కృతో ఽస్మ్యద్య నిర్వాస్యతి హి రావణః
పుత్రశోకా న్మయా యోద్ధుం తం హనిష్యామి రావణం॥

లక్ష్మణా ! మహావీరుడగు మేఘనాదుడు నీచే ఎంతో కష్టముతో మూడు అహోరాత్రములలో చంపబడినాడు. నీ యీదుష్కరకర్మచే నేడు శత్రుశూన్యుడ నయినాను. ఇక ఇప్పుడు పుత్రశోకపీడితుడగు రావణుడు నాతో యుద్ధమొనర్చుటకు రాగలడు. అతనిని తేలికగా చంపివైచెదను.

మేఘనాదం హతం శ్రుత్వా లక్ష్మణేన మహాబలం
రావణః పతితో భూమౌ మూర్ఛితః పునరుత్థితః॥

ఇట్లు ఇక్కడ రామచంద్రుడు సోదరునితో ప్రేమసల్లాపము లాడుచుండగా అక్కడ లంకానగరమున రావణునకు లక్ష్మణునిచే మహాబలుడగు ఇంద్రజిత్తు వధింపబడినాడని తెలిసినది. పుత్రమరణ వార్త చెవినిబడినతోడనే అతడు మొదలునరికిన కదళీషండమువలె భూపతితుడయ్యెను. కొంతసేపటికి అతికష్టముచే మేల్కొనెను.

విలలాప పితిదీనాత్మా పుత్రశోకేన రావణః
పుత్రస్య గుణకర్మాణి సంస్మరన్ పర్యదేవయత్॥

ఆగతసంజ్ఞుడై రావణుడు పుత్రశోకమున దీనమగు ఆత్మగల వాడై ఇంద్రజిత్తుచేసిన ఆయా ఘనకార్యములను తేరొకొనుచు చాల సేపు దుఃఖించెను.

అద్య దేవగణా స్సర్వే లోకపాలా మహర్షయః
హత మింద్రజితం జ్ఞాత్వా సుఖం స్వప్స్యంతి నిర్భయాః
ఇత్యాది బహుశః పుత్రలాలసో విలలాప హ॥

ఈనాడు ఇంద్రజిత్తు వధింపబడినాడని విని ఇంద్రాది దేవతలును, అష్టదిక్కులను పరిపాలించు దిక్పాలురును, మహర్షులును సుఖముగా నిద్రించుదురు. అని బహువిధముల పుత్రుని గుణగణమును తేరొకొనుచు దుఃఖించెను.

తతః పరమసంక్రుద్ధో రావణో రాక్షసాధిపః
ఉవాచ రాక్షసా న్సర్వా న్నినాశయిషు రాహవే॥

అనంతరము పరమక్రుద్ధహృదయుడై రాక్షసచక్రవర్తి యుద్ధమున శ్రీరాముని వధించు ఇచ్ఛగలవాడై సర్వరాక్షసులను యుద్ధమునకు సంసిద్ధులుగండు అని ఆజ్ఞాపించెను.

స పుత్రవధసన్తపః శూరాః క్రోధవశం గతః
సంవీక్ష్య రావణో బుద్ధ్యా హంతుం సీతాం ప్రచక్రమే ॥

రావణుడు సహజముగా శూరుడు. అయినను ఈసమయమున శత్రువుచే ప్రాణాధికప్రియుడయిన కుమారుడు వధింపబడుటచే అతడు క్రోధోద్రేకమునకు వశుడైనాడు. ఈ అనర్థమున కంతకు మూలకారణము సీతయే అను భావము కలిగి తత్క్షణమే ఆమెను వధించు ఉద్దేశ్యముతో అశోకవనమునకు త్వరగా నడచెను. సీతను సంహరించినచో రాముడును మరణించగలడని రావణుడు తలచినాడని భావము.

ఖడ్గపాణి మథాఽఽయాంతం క్రుద్ధం దృష్ట్వా దశాసనం
రాక్షసేమధ్యగా సీతా భయశోకాకులా ఽభవత్ ॥

చేత ఖడ్గమును ధరించి మూర్తీభవించిన క్రోధమువలె వచ్చుచున్న దశాసనునిచూచి రాక్షసస్త్రీల మధ్యనున్న జానకి భయశోకములచే అత్యంత వ్యాకులచిత్తయయ్యెను.

ఏతస్మి న్నంతరే తస్య సచివో బుద్ధిమాఞ్ శుచిః
సుపార్శ్వో నామ మేధావీ రావణం వాక్య మబ్రవీత్ ॥

ఇంతలో రావణుని వెనుకనే సుపార్శ్వుడను మంత్రి వచ్చెను. అతడు బుద్ధిమంతుడు. పరిశుద్ధుడు. మేధావి. అతడు సీతను సంహరింప నుద్యుక్తుడయిన రావణునికి ఇట్లు పలికెను.

నను నామ దశగ్రీవ సాక్షా ద్వైశ్రవణానుజః
వేదవిద్వ్యవ్రతస్నాతః స్వకర్మపరినిష్ఠితః
అనేకగుణసంపన్నః తథం స్త్రీవధ మిచ్ఛసి ॥

రాజా ! దశగ్రీవా ! నీవు మహోత్తరమగు బ్రహ్మవంశమున జనించినవాడవు. దిక్పాలకుడగు వైశ్రవణుని సోదరుడవు. అంతేగాక

నీవును వేదవేదాంగముల నధ్యయనమొనర్చినవాడవు. స్వధర్మకర్మల యందు స్థిరమగు బుద్ధిగలవాడవు. అంతేగాక అనన్య దుర్లభములగు యోగ్యగుణములుగల శూరుడవు. అట్టి నీవు సామాన్యునివలె స్త్రీ వధ నేల జేయుదలచుచుంటివి ?

జిత్వా చ త్రిదశా న్సర్వా న్స్వవశే స్థాప్య తా నపి
త్రైలోక్యం యశసా వ్యాప్తం స్త్రీవధం హాతు మిచ్ఛతి ॥

నీవు లోకసామాన్యుడగు వీరుడవుగావు. ఇంద్రాదిదేవతల నందరను జయించి వారినందరను స్వాధీనపరచుకొని పరిపాలించు చక్రవర్తివి. నీయశస్సు త్రిలోకవ్యాప్తమయినది. అట్టివానిని కళంకిత మొనర్పగోరుచున్నావా ! ఈ స్త్రీవధవలన నీకీర్తి అపహృతము కాగలదు.

అస్మాభి స్సహితో యుద్ధే హత్వా రామం చ లక్ష్మణం
ప్రాప్స్యసే జానకీం శీఘ్రు మిత్యుక్తః స వ్యవర్తత ॥

ఇప్పుడు సీతను వధించుట నీకర్తవ్యముగాదు. మాతోగూడి యుద్ధమునకు బయలుదేరి రామలక్ష్మణులను వధించి వీర్యశుల్కముగా జానకిని బడయగలవు. ఇప్పుడు నీకర్తవ్యము యుద్ధము—అని ఇట్లు సుపార్శ్వుడు బోధించగా రావణుడును అంగీకరించి వెనుకకు మరలెను.

తతో దురాత్మా సుహృదా నివేదితం
వచః సుధర్మం ప్రతిగృహ్య రావణః
గృహం జగా మాశు శుచా విమూఢధీః
పునః సభాం చ ప్రయయౌ సుహృద్వృతః ॥

ఇట్లు రావణుడు మిత్రుడు, మంత్రి అగు సుపార్శ్వుని వాక్యములను పరిగ్రహించి స్వగృహమునకు పోయి కొంతసేపు విశ్రాంతి తీసికొనెను. అనంతరము మిత్రులతోగూడి పునఃసభాభవనమునకు నెడలెను.

దశమ సర్గ

శ్రీ మహాదేవ ఉవాచ :—

స విచార్య సభామధ్యే రాక్షసైః సహ మంత్రిభిః
నిర్యయౌ యోద్ధవ శిష్టాసై రాక్షసైః రాఘవం
శలభః శలభైర్యుక్తః ప్రజ్వాలం త మివానలమ్॥

సీతను వధించు ఉద్దేశ్యమును విరమించిన అనంతరము కొంత సేపు విశ్రాంతిని తీసికొని రావణుడు సుహృదులతో గలిసి సభాభవనమునకు విచ్చేసినాడు. అచ్చట మంత్రులు, మిత్రులు మొదలగు రాక్షసులతో అనంతరకర్తవ్యమునుగూర్చి విచారించినాడు. వారిసలహా ననుసరించి మిగిలిన కొద్దిమంది రాక్షసవీరులతో గలసి రాఘవుని నిర్జించు నుద్దేశ్యముతో బయలుదేరినాడు. అతని ఈ యుద్ధయాత్రశలభము, తోడి శలభములతోగూడి అగ్నిని జయించుటకు బయలుదేరినట్లున్నది.

తతో రామేణ నిహతాః సర్వే తే రాక్షసాయుధి
స్వయం రామేణ నిహత స్తీక్ష్ణబాణేన వక్షసి
వ్యథితస్త్వ రితం లంకాం ప్రవివేశ దశాననః॥

అంతట శ్రీరామచంద్రుడు సుతీక్ష్ణములగు శరముల వర్షించి రాక్షససేనల నన్నిటిని రూపుమాపెను. అంతేగాక రావణునిగూడ తీవ్రముగా వేధించెను. హృదయస్థానమున గ్రుచ్చుకొనిన శరములచే పీడితుడై సర్వలోకములను జయించిన దశాననుడు ఆర్తుడై లంకానగరమున ప్రవేశించెను.

దృష్ట్వా రామస్య మహాశః పౌరుషం చాప్యమానుషం
రావణో మారుతే శ్చైవ శీఘ్రం శుక్రాంతికం యయౌ
నమస్కృత్య దశగ్రీవః శుక్రం ప్రాంజలి రబ్రవీత్॥

శ్రీరామచంద్రుని అమానుషపరాక్రమమును, మరుత్పుత్రుని వీరత్వమును చూచి, వారిని జయించు ఉపాయమును గానక రావ

ణుడు రాక్షసకులగురువగు శుక్రాచార్యుని సన్నిధికి వెళ్ళి అభివందనము లాచరించి ప్రాంజలియై ఇట్లు పలికెను.

భగవన్ రాఘవేణైవం లంకా రాక్షసయూథపైః
వినాశితా మహావైత్యా నిహతాః పుత్రబాంధవాః
కథం మే దుఃఖసందోహ స్త్వయి తిష్ఠతి సద్గురౌ॥

ఆచార్యా! శ్రీరాము డిన్నిదినములనుండి లంకానగరమును ముట్టడించి సర్వరాక్షసవీరులను నాశనమొనర్చినాడు. మహత్తరశక్తి సంపన్నులగు దైత్యశ్రేష్ఠు లందరును యుద్ధభూమిలో దీర్ఘనిద్రను చెంది యున్నారు. నీవంటి సద్గురువు ఉండికూడా నాకిట్టి ఘోరవిపత్తు సంభవించినదిగదా!

ఇతి విజ్ఞాపితో దైత్యగురుః ప్రాహ దశాననం
హోమం కురు ప్రయత్నేన రహసి త్వం దశానన॥

రావణు డిట్లు ప్రాంజలియై దీనముగా వేడుకొనగా దానవగురుడగు శుక్రు డిట్లనెను- దశాననా! నీవు రహస్యప్రదేశమునుచేరి ఒక హోమము నాచరింపుము.

యది విఘ్నేన చేద్ధో మే తస్మాద్ధోమా నలోత్థితః
మహా రథ శ్చ వాహా శ్చ చాపతూణీర సాయకాః
సంభవిష్యంతి హైర్యక్తా స్త్వ మజేయో భవిష్యసి॥

ఆ హోమము నిర్విఘ్నముగా సమాప్తినొందినచో హోమాగ్నినుండి ఒక దివ్యమహిమాయుతమయిన రథమును, అశ్వములును, చాపతూణీరసాయకములును ఉద్భవిల్లగలవు. వాటిని సాధనములుగా చేసికొనినచో నీవు రాఘవునికే గాదు సర్వదేవతలకును అజేయుడవగుదువు.

గృహాణ మంత్రాన్ మద్దత్తా న్గచ్ఛ హోమం కురుద్రుతమ్
ఇత్యుక్త స్త్వరితం గత్వా రావణో రాక్షసాధిపః
గుహాం పాతాల సదృశీం మందిరే స్వేచకార హ॥

ఇవిగో! నేను ఉపదేశించుచున్న ఈ మంత్రములను గ్రహించుము. త్వరగా స్వగృహమునకు పోయి హోమ మాచరింపుము. అని శుక్రాచార్యుడు పలికి మంత్రముల నుపదేశించెను. రావణుడును వాటిని గైకొని అతిత్వరగా అంతఃపురమునకు పోయి తన స్వీయమందిరమున భూమిలో పాతాళమువంటి గుహ నొకదానిని నిర్మించెను.

లంకా ద్వారక పాటాది బద్ధ్వా సర్వత్రయత్నతః
హోమద్రవ్యాణి సంపాద్యయా న్యుక్తా న్యభిచారికే
గుహాం ప్రవిశ్య చైకాంతే మానీహోమం ప్రచక్రమే॥

రావణుడు శత్రువు లెవ్వరును చొరకుండుటకై నగరద్వారముల నన్నిటిని బంధించివేయుటకు ఆజ్ఞాపించెను. తదువాత అభిచారహోమమునకు అవసరమగు హోమద్రవ్యముల నన్నిటిని సంపాదించి పాతాళ గృహమున ప్రవేశించెను. అచ్చట మానవ్రతధారియై శుక్రోపదిష్ట విధానమున హోమమును ప్రారంభించెను.

ఉత్థితం ధూమ మాలోక్య మహాంతం రావణానుజః
రామాయ దర్శయామాస హోమధూమం భయాకులః॥

రావణుడు మానియై పాతాళహోమము నొనరించుచుండగా హోమధూమము పాతాళగృహమునుండి వెలువడి బయట అంతటను అత్యధికముగా వ్యాపించెను. దానిని చూచి విభీషణుడు భయభీతుడై శ్రీరామునకు కన్పరిచెను.

పశ్య రామా దశగ్రీవో హోమం కర్తుం సమారభత్
యది హోమః సమాప్త స్యాత్తదా ఽఽకేయో భవిష్యతి
అతో విఘ్నాయ హోమస్య ప్రేషయా ఽశువరీ శ్వరా॥

రామా! అటు చూడుము. దశగ్రీవుడు పాతాళహోమమును ప్రారంభించెను. ఆ ధూమము ఆ హోమమునకు సంబంధించినట్టిదే. ఒకవేళ ఆహోమమే సఫలమయినట్లయిన తత్ప్రాప్త సాధనములతో రావణుడు ముల్లోకములకు అజేయుడు కాగలడు. కాన నీవు హనుమ

దంగదాది వానరయూథపులను పంపి హోమమునకు విఘ్నము నొనరింపుము.

తథేతి రామః సుగ్రీవ సమ్మతేనాం గదం కపిం
హనూమ త్ప్రముఖాన్ వీరాన్ ఆదిదేశ మహాబలమ్॥

విభీషణుని మాటల నియ్యకొని శ్రీరాముడు హనుమదాది వీరులతోగూడిన మహాబలశాలియగు అంగదునికి ఆదేశించెను.

ప్రాకారం లంఘయిత్వా తే గత్వా రావణమందిరమ్
దశకోట్యః ప్లవంగానాం గత్వా మందిరరక్షకాన్
చూర్ణయాంమాసురశ్వాంశ్చగజాంశ్చన్య హావక్షణాత్ ॥

శ్రీరాముని ఆదేశము ననుసరించి అంగదాదివీరులు పదికోట్ల మంది వానరులను వెంటనిడుకొని ప్రాకారములను లంఘించి రావణ మందిరమును సమీపించిరి. అచ్చట మందిరమును రక్షించుచున్న రాక్షసవీరుల నందరను వధించిరి. వారి గజాశ్వరథాదిసాధనములను కూడ చూర్ణ మొనర్చిరి.

తత శ్చ సరమానామ:ప్రభా తే హస్తసంజ్ఞయా
విభీషణస్య భార్యా సా హోమస్థాన మశూచయత్ ॥

ఇంతలో తెల్లవారినది. కాని పాతాళగృహమును ప్రవేశించు మార్గము వారికి తెలియలేదు. వారి కష్టము నెరిగి విభీషణుని పత్ని యగు సరమ అనునామె హస్తసంజ్ఞతో రావణ హోమస్థాన ప్రవేశ మార్గమును తెలియజేసినది.

గుహాపిధానపాషాణ మంగదః పాదఘట్టనైః
చూర్ణయిత్వా మహాసత్వ్యః ప్రవివేశ మహాగుహాం ॥

అంతట అంగదుడు పాతాళగృహప్రవేశద్వారమును మూసివేసిన పాషాణఫలకమును పాదఘట్టనలచే బ్రద్దలుగొట్టెను. పాషాణ ఫలకము చూర్ణముకాగా మహాసత్త్వుడగు అతడు గుహాలోనికి ప్రవేశించెను.

దృష్ట్వా దశాననం తత్ర మీలితాక్షం దృఢాసనం
తతో ఒంగదాజ్ఞయా సర్వే వానరా వివిశు ర్గుహామ్ ॥

అంగదుడు పాతాళగుహాలోనికి ప్రవేశించి నిమీలితాక్షుడై దృఢాసనమునందున్న రావణుని చూచెను. చూచి మిగిలిన వానరుల కందరకు సంజ్ఞచేయగా హనుమదాదులును అందు ప్రవేశించిరి.

తతః కోలాహలం చక్రు స్తాడయంత శ్చ సేవకా
సంభారా శ్చిక్షిపు స్తత్ర హోమకుండే సమంతతః ॥

వారు రావణుని మౌనవ్రతమును భగ్న మొనరించుటకై మొదట దిక్కులు పిక్కటిల్లునట్లు కోలాహల మొనర్చిరి. అచ్చట రావణునకు సహాయకులుగానున్న సేవకులను ముష్టిఘాతముల నొప్పించిరి. హోమ సంభారములను ఇటు నటు విరజిమ్మిరి. కొన్నిటిని హోమకుండములో పారవైచిరి.

స్రువ మాచ్ఛిద్య హస్తా చ్చ రావణస్య బలా ద్రుషా
తేనైవ సంజఘా నాఽఽశు హనూమా న్ప్లవగాగ్రణీ: ॥

అంతట ప్లవంగశ్రేష్ఠుడగు హనుమంతుడు రావణుని చేతనున్న స్రువమును లాగికొని కోపపూరితహృదయుడై శక్తినంతను వినియోగించి దానితోడనే అతనిని మోదెను.

ఘ్నంతి దంతై శ్చ కాష్టై శ్చ వానరాస్తమిత స్తతః
న జహౌ రావణో ధ్యానం హతో ఒపి విజిగీషయా ॥

కాని రావణుడు చలించలేదు. అంతట వానరులు దంతముల తోను, నఖములతోను రావణుని శరీరమును చీల్చిరి. కాని అతడు మాట్లాడలేదు. ఎన్ని దెబ్బలు శరీరమునిండ పడినను రాముని జయించవలెనను ప్రబలమగు ఇచ్ఛగల అతడు మౌనవ్రతమును విడువలేదు.

ప్రవి శ్యాన్త:పురే వేశ్మ న్యంగదో వేగవత్తర:
సమానయ తేశబంధే ధృత్వా మందోదరీం శుభాం
రావణ స్యైవ పురతో విలపన్తీ మనాథవత్ ॥

ఎన్ని ప్రయత్నముల నొనర్చినను రావణుడు మౌనవ్రతమును త్యజించకపోవుసరికి అంగదుడు ఒక నూతనమగు ఉపాయమును ఆలోచించెను. అతడు వెంటనే గుహానుండి వెలికివచ్చి అంతఃపురమునకు బోయి శుభప్రదమగు శరీరసౌందర్యముగల మండోదరి కేశపాశమును బలాత్కారముగ పట్టుకొని ఈడ్చి తెచ్చెను. ఆసమయము అంగనార్షితయగు నామె అనాథవలె రోదనమొనర్చెను.

ఇచ్చట పక్షికిజరుగు అవమానమును సహింపలేక రావణుడు వ్రతమును త్యజించు ననుభావముతో అంగదుడు ఈనీచకర్మ నాచరించినట్లును ప్రతిపాదింపబడినది. కాని మహాకవి వాల్మీకి వానరులను ఇట్టి నీచకర్మకు పాల్పడునట్లు చిత్రించలేదు. అక్కడ పాతాళహోమవృత్తాంతమే వర్ణితముకాలేదు. అంతేగాక వివిధసమయములందు వానరులు అత్యధికశిష్టాచారవంతులుగా చిత్రించబడినాడుకూడను.

విదదా రాంగద స్తస్యాః కంచుకం రత్నభూషితం
ముక్తా విముక్తాః పతితాః సమంతా ద్రత్నసంచయైః
శ్రోణిసూత్రం నిపతితం త్రుటితం రత్న చిత్రితం॥

అంగదుడు మండోదరిని రావణుని ఎదుటికి తెచ్చి విలపించుచున్న ఆమెయొక్క కంచుకమును గోళ్ళతో చింపివైచెను. ఆమె మెడలో ధరించిన ముత్యాలహారముల నన్నిటిని త్రెంచివేయగా మంచి ముత్యము లన్నియు వెదజిమ్మినట్లు పడినవి. వివిధరత్నములును తెగి క్రిందపడినవి. రత్నాలంకృతమయిన ఆమెయొక్క కటిసూత్రము (ఒడ్డాణము) తెగిపడినది.

కటిప్రదేశా ద్విప్రస్తా నీవీ తస్యైవ పశ్యతః
భూషణాని చ సర్వాణి పతితాని సమంతతః॥

దుఃఖవివశయైన మండోదరియొక్క కటిప్రదేశమునుండి నీవీబంధమున్ను జారినది. ఆమెశరీరమందు ధరించిన భూషణము లన్నియు క్రింద జారిపడినవి. ఇదంతయు రావణుడు చూచుచుండగనే జరిగినది.

దేవగంధర్వకన్యా శ్చ నీతాహృష్టైః ప్లవంగమైః
మందోదరీ రురో దాథ రావణ స్యాగ్రతో భృశమ్
క్రోశంతీ కరుణం దీనా జగాద దశకంధరం॥

అంగదుడు చేసిన ఈకార్యమునుచూచి తక్కిన వానరులును అత్యంతహృష్టహృదయులై శౌమును ఇతర రావణపత్నులను దేవగంధర్వవంశజాతలను కొప్పులు పట్టి ఈడ్చుకొనివచ్చి రావణుని ఎదుట పరాభవింపసాగిరి. అంతట మండోదరి రావణుని పేరొక్కని ఇట్లు విలపించెను.

నిర్లజ్జో ఽపి పరైః రేవం కేశపాశై ర్వికృష్యతే
భార్యా తవైవ పురతః కిం జుహోషి న లజ్జసే!

సిగ్గులేనివాడా! నీభార్య ఇట్లు పరునిచే పరాభవించబడుచుండగా సిగ్గును విడిచి ఇంకను హోమము నొనర్చుచున్నావు.

హన్యతే పశ్యతో యస్య భార్యా పాపై శ్చ శత్రుభిః
మర్తవ్యం తేన తత్రైవ జీవితా న్మరణం వరం॥

ఎవనిభార్య పాపులగు శత్రువులచే పరాభవింపబడునో అతడు వెనువెంటనే అనగా తత్కాలమున, తత్స్థలమునందే ఆత్మహత్యచేసికొనుట మంచిది. భార్యకు పరాభవము జరిగినతరువాత ఆభర్త జీవించి యుండుటకంటె మరణించుట మేలు.

హా! మేఘనాద! తే మాతా క్లిశ్యతే బత వానరైః
త్వయి జీవతి మే దుఃఖ మీదృశం చ కథం భవేత్
భార్యా ఆజ్ఞా చ సన్త్యక్తా భర్తృ మే జీవితాశయా॥

హా పుత్రా! మేఘనాదా! నీవే బ్రతికియుండినచో నాబ్రతుకు ఈ దీనస్థితికి వచ్చునా! నీవు లేకుండుటచే నీతల్లి ఇట్టికష్టముల పాలయి నదిగదోయీ! శత్రువులను జయించి రాజ్యపాలన మొనర్పవలెనను పేరాశచే పత్నీగౌరవమునుగూడ నాభర్త విస్మరించినాడుగదా!

శ్రుత్వా తద్దేవితం రాజా మన్దోదర్యా దశాననః
ఉత్తస్థౌ ఖడ్గ మాదాయ త్యజ దేవీ మితి బ్రువ౯
జాఘూ నాంగద మవ్యగ్రః కటిదేశే దశాననః॥

అంగదావమానితయై మండోదరి ఇట్లు విలపించుచుండగా ఆమె యొక్క ఆర్తనాదమును విని వ్రతస్థుడయిన దశాననుడు వానరులకృత్య మును సహింపలేకపోయినాడు. అతడు వెంటనే ప్రక్కనున్న ఖడ్గ మును చేతధరించి "దేవిని వదలుమురా !" అని అదలించుచు ఆసనము నుండి లేచి అంగదుని కటిప్రదేశమున గాయపరచెను.

తదోత్సృజ్య యయుః సర్వే విధ్వంస్య హవనం మహత్
రామపార్శ్వ ముపాగమ్య తస్థుః సర్వే ప్రహర్షితాః॥

రావణు డిట్లు హోమకార్యమును మధ్యలోనే విరమించగా దానిని కోరుచున్న వానరులందరును ఆనందాతిరేకముతో శ్రీరాముని సన్నిధానమును చేరి ప్రణమిల్లి సర్వమును నివేదించిరి.

రావణ స్తు తతో భార్యా మువాచ పరిసాన్త్వ్యయ౯
దైవాధీన మిదం భద్రే జీవతా కిం న దృశ్యతే॥

వానరులు వెడలిపోయిన తరువాత రావణుడు భార్య ననున యించుచు ఇట్లు పలికెను- శోభనప్రదురాలా ! మనవశమున ఏమి యున్నది ? సర్వజగత్తు దైవమునకు అధీనమయి యున్నది. ప్రాణి యున్నవాడు తన జీవితకాలములో ఎటువంటి అసంభవములను చూడ వలసియుండునోగదా !

త్యజ శోకం విశాలాక్షి ! జ్ఞాన మాలంబ్య నిశ్చితం
అజ్ఞానప్రభవః శోకః శోకో జ్ఞానవినాశకృత్॥

ప్రియే ! విశాలాక్షి ! అజ్ఞానమును పరిత్యజించి దుఃఖమును విడువుము. శోకము అనునది అజ్ఞానకారణమున ఉద్భవిల్లునది. అది జ్ఞానజ్యోతిని నశింపజేయు సామర్థ్యము గలది.

అజ్ఞానప్రభవా ఽహం ధీ శరీరాది ష్వనాత్మనః
తన్మూలపుత్రదారాదిసంబంధః సంసృతి స్తతః॥

అజ్ఞానకారణమునచే ఆత్మకాని దేహేంద్రియాదులయందు అహంభావము కలిగి వాటినే ఆత్మగా భావించుదుము. దేహేంద్రియాదులయందలి అహంభావమే పుత్రధారధనప్రధానమయిన ఈషణత్రయమునకు కారణము. ఈ యీషణత్రయమే జన్మజరామరణరూపమయిన సంసృతికి కారణమగుచున్నది. ఈషణత్రయమే సుకృత దుష్కృతరూపములయిన కర్మల నాచరింపజేయును. ఆకర్మఫలానుభవమునకే జన్మాదుల భజించవలసినది అనిభావము.

హర్ష శోకభయక్రోధలోభమోహస్పృహాదయః
అజ్ఞానప్రభవా హ్యేతే జన్మమృత్యు జన్మమృత్యుజరాదయః॥

ఒక్క శోకమేగాక మన మనుభవించు సంతోషము, భయము, క్రోధము, లోభము, మోహము, స్పృహ మొదలగునవికూడ అజ్ఞానమునుండి జనించినవే. అంతేగాక జన్మమృత్యువు, ముసలితనము మొదలగునవికూడ అజ్ఞానమువలన కలిగినవే.

ఆత్మా తు కేవలః శుద్ధో వ్యతిరిక్తో హ్యలేపకః
ఆనందరూపో జ్ఞానాత్మా సర్వభావవివర్జితః॥

వాస్తవమునకు దుఃఖాదులన్నియు దేహేంద్రియాదులకేగాని ఆత్మకు సంబంధించినవిగావు. వాస్తవమునకు ఆత్మ సర్వజగత్తుకంటె వేరైన ఏకవస్తువు. అది నిష్కళంకమయినది. ప్రకృతి వ్యతిరిక్తమయినది. సాంసారిక కళంకము లేనియు అంటనిది. అఖండానందస్వరూపమయినది. జ్ఞానస్వరూపమయినది. అట్టి పరమాత్మకు ఏవిధమయిన భావమును లేదు.

సంయోగో వా వియోగో వా విద్యతే కేన చిత్సతః
ఏవం జ్ఞాత్వా స్వమాత్మానం త్యజ శోక మనిందితే! ॥

మనము నిత్యము కలసియున్నను సరే లేదా ఏకారణముచేనయిన వియోగము సంభవించినను సరే నే జెప్పిన ఆత్మస్వరూపమును జ్ఞప్తికి తెచ్చుకొనినచో సర్వతాపములు హరించును. కాన ప్రస్తుతము నీశోకమును విడువుము.

ఇదానీ మేవగచ్ఛామి హత్వా రామం సలక్ష్మణం
ఆగమిష్యామి నో చే ద్మాం ధారయిష్యతి సాయకైః
శ్రీరామో వజ్రకల్పై శ్చ తతో గచ్ఛామి తత్పదమ్ ॥

నేను తత్ క్షణమే యుద్ధభూమికి పోయెదను. రామలక్ష్మణుల నిద్దరిని వధించి తిరిగివచ్చెదను. లేదా రాముడు తీక్ష్ణబాణములతో నన్ను వధించగలడు. వజ్రతుల్యములగు శరములను ప్రయోగించి నన్ను వధించినచో అతని శాశ్వతస్థానమయిన వైకుంఠమును పొందెదను.

తదా త్వయా మే కర్తవ్యా క్రియా మచ్ఛాసనా త్ప్రియే
సీతాం హత్వా మయా సార్ధం త్వం ప్రవేక్ష్యసి పావకం ॥

నేను యుద్ధములో మరణించినచో నా ఆజ్ఞ ననుసరించి నీవొక కార్యమును చేయవలసియున్నది. నీవు సీతను వధించి నాతోగలిసి చితిలో ప్రవేశించుము. ఇదే నీవు నాకు చేయవలసినపని.

ఏవం శ్రుత్వా వచ స్తస్య రావణ స్యాతిదుఃఖితా
ఉవాచ నాథ మే వాక్యం శృణు సత్యం తథా కురు ॥

ఇప్పటికిని మాత్సర్యము విడువని భర్తయొక్క వచనములనువిని రావణపత్ని అత్యంత దుఃఖపరవశురాలయినది. ఆమె భర్తకు నీతి బోధ చేయదలచి ఇట్లనినది-''నాథా! నేనొకసత్యమును వాక్కుచ్చెదను. దానినివిని ఆచరణలో పెట్టుము.

శక్యో న రాఘవో జేతుం త్వయా చాన్యైః తదాచన
రామో దేవవరః సాక్షా త్ప్రధానపురుషేశ్వరః ॥

నాథా! శ్రీరాముని నీవు జయింపజాలవు. నీవేగాదు మరెవ్వరును ఏసమయమందునుకూడ అతనిని జయింపలేరు. దానికి కారణమిది- శ్రీరాముడు సాక్షాత్ దేవదేవుడయిన శ్రీమన్నారాయణుడు. ప్రకృతి పురుషతత్త్వములకు కూడ అధీశ్వరుడగు పరమాత్మ అతడు.

మత్స్యో భూత్వా పురాకల్పే మనుం వైవస్వతం ప్రభుః
రరక్ష సకలాపద్భ్యో రాఘవో భక్తవత్సలః ॥

శ్రీరాముడు భక్తవత్సలుడు. అతడు పూర్వాకల్పమున మత్స్య మూర్తియై వైవస్వతమనువును సమస్తవిపత్తులనుండియు రక్షించినవాడు.

రామః కూర్మోఽ భవ త్పూర్వం లక్ష యోజనవి స్తృతః
సముద్రమథనే పృష్ఠే దధార కనకాచలమ్ ॥

ఈ శ్రీరాముడే పూర్వము క్షీరమథనకాలమున లక్ష యోజన విస్తృతశరీరుడై కూర్మరూపమును ధరించి, క్షీరసముద్రమున మునిగిన మంధరపర్వతమును పృష్ఠమున ధరించి నిలబెట్టెను.

హిరణ్యాక్షో ఽతిదుర్వృత్తో హతో ఽనేన మహాత్మనా
క్రోడరూపేణ వపుషా క్షోణీ ముద్ధరతా త్వచిత్ ॥

పూర్వమొకప్పుడు అతి దుర్వినీతుడయిన హిరణ్యాక్షుని కారణమున భూమి జలార్ణవమగ్నము కాగ ఈ రాఘవుడే వరాహరూపమును ధరించి హిరణ్యాక్షుని సంహరించి భూమిని తిరిగి యథా పూర్వము ప్రతిష్ఠించినాడు.

త్రిలోకకంటకం దైత్యం హిరణ్యకశిపుం పురా
హతవాన్ నారసింహేన వపుషా రఘునందనః ॥

హిరణ్యకశిపుడను దితివంశసంజాతుడు వరదర్పితుడై త్రిలోకములను లొంగొని కంటకుడై పరిపాలించుచుండగా, ఇతడే నరసింహరూపమును ధరించి ఆక్రూరుని చీల్చి వధించినాడు.

విక్రమై స్త్రిభి రేవాసౌ బలిం బద్ధ్వా జగత్త్రియమ్
ఆక్రమ్యాదాత్ సురేంద్రాయ భృత్యాయ రఘుసత్తమః ॥

బలిచక్రవర్తి స్వర్గమును జయించి ఇంద్రపదవి నధిష్ఠించి యుండగా ఈ శ్రీరాముడే భక్తవత్సలుడై వామనస్వరూపమును ధరించి దానరూపమున బలినుంచి మూడడుగుల భూమినిగొని, సరిగా మూడు పాదములతోడనే విక్రమించి బలిని బంధించెను. బంధించి ముల్లోకములను తిరిగి తన భృత్యుడయిన ఇంద్రునకు ఒసగెను.

రాక్షసాఃక్షత్రియాకారా జాతాఃభూమేర్భరావహాఃఽ
తాన్హత్వా బహుశో రామో భువం జిత్వా హ్యదాన్మనేః॥

లోకభయంకరులగు రాక్షసు లనేకులు భూమిపై క్షత్రియ రూపమున జనించగా భూమి వారిభారమును భరించలేకపోయినది. అంతట ఈరాముడే పరశురామరూపమున వారినందరను వధించి సమస్త పృథ్విని జయించినాడు. జయించి దానిని అశ్వమేధయాగమున కశ్యపమహాముని కి దక్షిణగా ఒసగినాడు.

స ఏవ సాంప్రతం జాతో రఘువంశే పరాత్పరః
భవదర్థే రఘుశ్రేష్ఠో మానుషత్వ ముపాగతః ॥

ఆ పరాత్పరుడే ఇప్పుడు నీవు లోకములకుపెట్టు పీడలనుండి రక్షించుటకై రఘుకులమున మనుష్యరూపమున జనించినాడు.

తస్య భార్యా కిమర్థం వా హృతా సీతా వనా ద్బలాత్
మమ పుత్రవినాశార్థం స్వస్యాపి నిధనాయ చ ॥

ఎవ్వడైతే నిన్ను వధించుటకు జన్మించినాడో, అతనిభార్యనే నీవు అపహరించితివి. దానికి ఫలముగా నాపుత్రుడు మరణించినాడు. ఇక నీవును స్వయముగా నిధనము నందగోరుచున్నావు.

ఇతః పరం వా వైదేహీం ప్రేషయస్వ రఘూత్తమే
విభీషణాయ రాజ్యం తు దత్వా గచ్ఛామహే వనమ్ ॥

ఇకమీదట నీవు వైదేహిని శ్రీరామచంద్రునిసన్నిధికి పంపించుము. ఆపైన విభీషణునకు రాజ్యాభిషేక మొనర్చి మనమిద్దరమును వానప్రస్థులము అగుదము.

మండోదరీ వచః శ్రుత్వా రావణో వాక్య మబ్రవీత్
కథం భద్రే రణే పుత్రాన్ భ్రాతౄన్ రాక్షసమండలమ్
ఘాతయిత్వా రాఘవేణ జీవామి వనరోచరః ॥

మండోదరియొక్క హితవాక్యములను విని రావణుడిట్లు బదులు పలికెను. భద్రే! ఇప్పటికి నాసోదరులు, పుత్రులు, ఇతరబాంధవులు పూర్తిగా నశించిపోయినారు. వారినందరను ఇట్లు రాముని బాణముల కెరజేసి నేనొక్కడను బ్రతుకుపై ఆశతో వనమున కెట్లు పోగలను.

రామేణ సహ యోత్స్యామి రామబాణైః సుశీఘ్రగైః
విదార్యమాణో యాస్యామి తద్విష్ణోః పరమంపదం ॥

నేను ఏవిధముగానయిననుసరే వానప్రస్థుడను కాలేను. నేను రామునితో తప్పక యుద్ధమొనరించెదను. ఆసుతీక్ష్ణములు, శీఘ్రగాములు అయిన అతని బాణములకు గురియై భిన్నశరీరుడనై మరణించి అతని స్థానమయిన వైకుంఠమును పొందుదును.

జానామి రాఘవం విష్ణుం లక్ష్మ్యంశం జానామ జానకీం
జ్ఞాత్వైవ జానకీ సీతా మయా నీతా వనా ద్బలాత్ ॥

నేను రాముడు విష్ణువనువిషయమును ఎరుగుదును. జానకి సాక్షా ద్లక్ష్మీదేవియనియు ఎరుగుదును. తెలిసియే అరణ్యమునుండి జానకిని బలాత్కారముగా అపహరించి తెచ్చితిని.

రామేణ నిధనం ప్రాప్య యాస్యా మితిపరంపదం
విముచ్య త్వాం తు సంసారే గమిష్యామి సహా ప్రియే ॥

శ్రీరామునితో యుద్ధమొనరించి నిహతుడనై పరమపదవిని పొందుదుననుభావముతోడనే జానకిని అపహరించి తెచ్చితిని. నేనిప్పుడు నిన్నిచ్చట వదలి మృతులగు బాంధవులతోపాటు ఏగెదను.

పరమానందమయీ శుద్ధా సేవ్యతే యా మునుక్షుభిః
తాం గతిం తు గమిష్యామి హతో రామేణ సంయుగే
ప్రక్షాళ్య కల్మషా ణీహా ముక్తిం యాస్యామి దుర్లభాం॥

నేను రామునిచే నిహతుడనయినచో జీవితమునచేసిన పాపము లన్నియు క్షాళితములు కాగలవు. అప్పుడు ముముక్షువులగు వారలు వే పరిశుద్ధము, ఆనందస్వరూపమునగు పరమపదమును కోరి సాధనము చేయుదురో ఆదుర్లభమగుగతినే పొందగలను.

క్లేశాదిపంచకతరంగయుతం భ్రమాఢ్యం
దారాత్మజాప్తధనబంధుసఖాభియుక్తమ్

జ్ఞానలాభజనిరోష మనంగజాలం
సంసారసాగర మతీత్య హరిం వ్రజామి॥

అవిద్య, నేను అనుభావము, రాగము, ద్వేషము, అభినివేశము అను నవి పంచక్లేశములు. అవియు, లోభమోహప్రమాదములు, ఈ సంసారమను సముద్రమును తరంగములవంటివి. అనిత్యములగు వస్తువులందు నిత్యములను భావము కలిగియుండుట అవిద్య, శరీరాదులే నేను అను భావము అస్మితా అనబడును. రాగద్వేషములు ప్రసిద్ధములే. మరణాదులయందు త్రాసము అభినివేశము. ఇవి పంచక్లేశములని యోగశాస్త్రమున వర్ణితములయినవి. భార్య, పుత్రులు, మిత్రులు, బంధువులు, ధనము మొదలగునవి ఈ సముద్రమున ఝష మీనసర్పతిమితిమింగలాది భయంకర జంతుసమూహముల వంటివి. స్వకీయమయిన రోషమే సముద్రమందున్న బడబాగ్ని కామమే సముద్రమున బంధించియుంచు పాశము. ఇట్టి సంసార సముద్రమును రామబాణకృపచే సునాయాసముగా తరించివైచెదను.

ఏకాదశసర్గ

శ్రీ మహాదేవఉవాచ :—

ఇత్యుక్త్వా వచనం ప్రేమ్ణా రాజా మందోదరీం తథా
రావణః ప్రయయౌ యోద్ధుం రామేణ సహ సంయుగే ॥

కృతనిశ్చయుడైన రావణుడు ఈవిధముగా మండోదరికి తన ఉద్దేశ్యమును ఆమూలముగా వివరించి చెప్పి ఎంతో ప్రేమతో ఆమెకు వీడ్కోలిచ్చి శ్రీరామునితో ఘోరసంగ్రామ మొనరించుటకై బయలు దేరెను.

దృఢం స్యందన మాస్థాయ వృతో ఘోరై ర్నిశాచరైః
చక్రైః షోడశభి ర్యుక్తం సవరూధం సకూబరం ॥

అతడు సారథికి రథము నాయత్తపరపుమని ఆజ్ఞాపించెను. సారథి సుదృఢమగు రథమును, సర్వాంగసంపూర్ణముగ అలంకరించి కొని తెచ్చెను. ఆరథము దేవభయంకరులగు నక్రంచరులచే పరివేష్టింపబడి యుండెను. బృహత్తరమగు ఆరథమునకు పదునారుచక్రము లమర్పబడి యుండెను. చక్రరక్షకులు దానిని రక్షించుచుండిరి. దృఢమగు యిరుసు గలిగియుండెను.

పిశాచవదనై ర్ఘోరైః ఖరై ర్యుక్తం భయావహం
సర్వాస్త్రశస్త్రసహితం సర్వోపస్కరసంయుతం
నిశ్చక్రామాథ సహసా రావణో భీషణాకృతిః

ఆరథమును పిశాచముఖములవంటి ముఖములుగల భయంకరము లగు ఖరములు (గాడిదలు) వహించుచున్నవి. ఆరథముపై సమస్తము లగు అస్త్రశస్త్రములు తమ తమ స్థానములలో అమర్చబడియున్నవి. ఇతరములగు యుద్ధపరికరములుగూడ దానియందున్నవి. అట్టి మహత్తరమగు రథము నధిష్ఠించి రావణుడు శత్రుభీషణాకృతియై నగరము నుండి వెలువడెను.

ఆయాంతం రావణం దృష్ట్వా భీషణం రణకర్కశం
సంత్రస్తాఽ భూత్తదా సేనా వానరీ రామపాలితా
హనూమా నథ చోత్పత్య రావణం యోద్ధు మాయయా
ఆగత్య హనుమాన్ రక్షోహన్మో స్యతలవిక్రమః
ముష్టిబంధం దృఢం బధ్వా తాడయామాస వేగతః.

అనేకములగు దేవదానవయుద్ధములలో ఆరితేరిన రావణుని భీషణమూర్తిని చూచి శ్రీరామచంద్రరక్షితమగు వానరసైన్యము భయకంపితహృదయము గలవయ్యెను. తనసైన్య మిట్టి భయభీతమగుట చూచి, హనుమంతుడు ఒక్కసారిగా ఎగిరి రావణుని రథమువద్దకు యుద్ధమొనరించుటకు వచ్చి అతివేగముగా దృఢమగు ముష్టిని బంధించి మహాబలపరాక్రమశాలియగు అతడు రావణుని వక్షమున ప్రహరించెను.

తేన ముష్టిప్రహారేణ జానుభ్యా మపతద్ రథే
మూర్ఛితోఽ భ ముహూర్తేన రావణః పునరుద్ధితః
ఉవాచ చ హనూమంతం క్రూరో ఒసి మమ సమ్మతః ॥

హనుమంతుని దృఢముష్టిప్రహారముచే రావణుడు మోకరిల్ల బడెను. కొంతసేపు మూర్ఛావశుడైయుండి తిరిగి మేల్కొని అతడు— "హనుమా ! నీవు నాకునచ్చిన క్రూరుడవు." అని ప్రశంసించెను.

హనూమా నాహ తం ధి బ్మాం య త్వం జీవసి రావణ
త్వం త్వావ ముష్టినా మక్షో మమ తాడయ రావణ
పశ్చా న్మయా హతః ప్రాణా మోక్ష్యసే నాత్ర సంశయః॥

రావణుని ప్రశంశావాక్యములనువిని ఛీ ! నావీరత్వము కాల్పనా ? ముష్టిఘాతమును తినియు నీవు యింకను బ్రతికియున్నావు. సరే యిక నీబలమును ప్రదర్శించుము. ముష్టిని బంధించి నావక్షమున ప్రహరించుము. ఆతరువాత నిశ్చయముగా నీవు నాచే వధింపబడుదువు. యిందు సందేహములేదు.

తధేతి ముష్టినా వక్షో రావణే నాపి తాడితః
విఘూర్ణనూ ననయనః కించిత్ కల్మష మాయయౌ॥

రావణుడు అట్లే అని దృఢమగు ముష్టిని బంధించి హనుమం తుని వక్షమున ప్రహరించెను. దానితో హనుమంతుడు కళ్ళు తిరు గుడువడగా కొంతసేపు మూర్ఛాగ్రస్తు డయ్యెను.

సంజ్ఞా మవాప్య కపిరాట్ రావణం హన్తు ముద్యతః
తతో ఽన్యత్ర గతో భీత్వా రావణో రాక్షసాధిపః॥

అనంతరము కొంతసేపటికి కపీశ్వరుడు లబ్ధసంజ్ఞుడై రావణుని వధించుటకు కృతనిశ్చయు డయ్యెను. అతని నిశ్చయమును గ్రహించిన రావణుడు భీతితో అన్యస్థలమునకు తప్పుకొనెను.

హనూమా నంగద శ్చైవ నలో నీల స్తథైవ చ
చత్వారః సమరే తావ ద్ధృష్ట్వా రాక్షసపుంగవాన్॥

అంతట హనుమంతుడు, అంగదుడు, నలుడు, నీలుడు అను నల్వురువానరులు ఒకసారి రాక్షసవీరు లందరిని కలియజూచిరి. అనగా రాక్షససైన్యముల నన్నిటిని పరిశీలించి వారిలో వీరులను గ్రహించిరని భావము.

అగ్నివర్ణం తథా సర్పరోమాణ ఞ్చ ఖడ్గరోమకమ్
తథావృశ్చికరోమాణం నిజఘ్నుః క్రమశో ఽసురాన్॥

వానరనల్వురను క్రమముగా అగ్నివర్ణుడు, సర్పరోముడు, ఖడ్గరోముడు, వృశ్చికరోముడు అను నల్వురు రాక్షసవీరులను వధించిరి.

చత్వార శ్చతురో హత్వా రాక్షసా స్తీవ్రవిక్రమాన్
సింహనాదం పృథక్ కృత్వా రామపార్శ్వ ముపాగతాః॥

ఇట్లు హనుమదంగదనలనీలులు నల్వురను భీమవిక్రములగు రాక్షసవీరులను వధించి ఆనందాతిరేకమున సింహనాదముల నొనరించి శ్రీరాముని సన్నిధిని చేరిరి.

తతః క్రుద్ధో దశగ్రీవః సన్దశ్య దశనచ్ఛదమ్
వివృత్య నయనం క్రూరో రామ మే వాన్వధావత॥

ఇట్లు తన సేనాపతులు నల్వురును వధింపబడుటను జూచి రావణుని హృదయము క్రోధముచే వశముతప్పినది. అతడు ఒక్కసారి బొడుగరచి నేత్రములు పెద్దవిజేసి వానరసైన్యముల నన్నిటిని కలియజూచి రాముడున్న చోటును తెలిసికొనెను. తరువాత రామునే వధించుటకు వచ్చగలవాడై రథము నతనిపైకి తోలించెను.

దశగ్రీవో రథస్థ స్తు రామం వజ్రోపమైః శరైః
ఆజఘాన మహాఘోరై ర్ధారాభి రివ తోయదః
రామస్య పురతః సర్వా వానరానపి వివ్యధే॥

ఆసమయమున దశకంఠుడు రథముపై నుండెను. రాముడు భూమిపై నిలబడి యుండెను. రావణుడు వజ్రసమానములగు శరములను వర్షించి మేఘము వర్షధారలచే భూమిని కప్పినట్లు రాముని కప్పివేసెను. రామునేగాక రామునికి అడ్డుపడిన వానరవీరుల మర్మస్థలములనుగూడ నొచ్చునట్లుచేసెను.

తతః పావకసంకాశై శ్శరైః కాంచనభూషణైః
అభ్యవర్ష ద్రణే రామో దశగ్రీవం సమాహితః॥

అంతట రాముడును రణమునకు సన్నద్ధుడై సమాహితచిత్తుడై తనను, తన సేనలను బాణవర్షముచే కప్పుచున్న రావణునిపై కాంచన పుంఖములు గల అగ్ని బాణములను ప్రయోగించెను.

రథస్థం రావణం దృష్ట్వా భూమిష్ఠం రఘునందనం
ఆహూయ మాతలిం శక్రో వచనం చేద మబ్రవీత్॥

ఆసమయమున దేవతలు ఆకాశమున నిలబడి రామరావణుల యుద్ధమును జూచుచుండిరి. వారిలో ఇంద్రుడు రావణుడు రథముపై నుండుటను, రాముడు నేలపై నిలబడియుండుటను జూచి రామునకు గూడ యోగ్యమగు సాధనసంపత్తిని కలిగించువాడై తన సారథి యగు మాతలిని జూచి ఇట్లు పలికెను.

రథేన మమ భూమిష్ఠం శీఘ్రం యాహి రఘూత్తమ
త్వరితం భూతలం గత్వా కురు కార్యం మమానఘ॥

మాతలీ ! నీవు వెను వెంటనే నారథమును ఆయత్త మొనరించి భూమిపై నిలబడి యుద్ధమొనరించుచున్న రాముని సమీపించి, అతనికి సహాయుడవై రావణవధ రూపమయిన దేవకార్యమునకు తోడ్పడుము– అని

ఏవ ముక్తో ఽథ తం నత్వా మాతలి ర్దేవసారథిః
తతో హయై శ్చ సంయోజ్య హరిభిః స్యందనోత్తమం
స్వర్గా జ్జయార్థం రామస్య హ్యుపచక్రామ మాతలిః॥

దేవేంద్రు డిట్లు ఆజ్ఞాపించగా మాతలి అతనికి నమస్కరించి శీఘ్రగాములగు హయములను బూన్చిన రథోత్తమమును గొని శ్రీరాముని విజయము నాకాంక్షించుచు స్వర్గమునుండి భూమికి అవతరించెను.

అబ్రవీ చ్చ తతో రామ మ్రతరక్యం రథే స్థితః
ప్రాంజలి ర్దేవరాజేన ప్రేషితో ఽస్మి రఘూ త్తమ॥

రథముతోనూడ భూమికి దిగివచ్చిన ఇంద్రసారథియగు మాతలి రామునకు ప్రాంజలియై ఇట్లు పలికెను– దేవా ! నేను మాతలిని. దేవరాజగు ఇంద్రుడు నన్ను పంపినాడు.

రథో యం దేవరాజస్య విజయాయ తవ ప్రభో
ప్రేషిత శ్చ మహారాజ ధనుషై ంద్ర శ్చ భూషితమ్
అభేద్యం కవచం ఖడ్గం దివ్యతూణీయుగం తథా ॥

ప్రభూ ! ఈరథము దేవరాజగు ఇంద్రునిది. దీనినతడు భవదీయ విజయము నాకాంక్షించుచు పంపినాడు. దీనియందు విజయశీలమగు ఇంద్రధనుస్సు ఉన్నది. అభేద్యకవచము, అప్రతిహతమగు ఖడ్గము, అక్షయతూణీరములు దీనియందున్నవి.

ఆరుహ్య చ రథం రామ రావణం జహి రాక్షసమ్
మమా సారథినా దేవ వృత్రం దేవపతి ర్యథా ॥

రామా ! ఇంద్రసారథినగు నాచే నడుపబడుచున్న రథము నధిరోహించి రాక్షసుడగు రావణుని ఇంద్రుడు వృత్రాసురుని వధించినట్లు వధించుము.

ఇత్యుక్త స్తం పరిక్రమ్య నమస్కృత్య రథోత్తమం
ఆరుహోహ రథం రామో లోకాన్ లక్ష్మ్యాని మోజయన్ ॥

మాతలి ఇట్లు విన్నవించగా రాముడు పరమపవిత్రము, మహిమాన్వితము అయిన ఇంద్రుని రథమునకు ప్రదక్షిణ నమస్కారము లాచరించెను. తరువాత అతడు రథము నధిరోహించి సర్వలోకములను ఆనందలక్ష్మిచే అలరించెను. కొద్దికాలములోనే రావణుని రథస్థుడయిన రాముడు వధించునని లోకములు ఆనందము ననుభవించినవని భావము.

తతో ఽభవన్మహాయుద్ధం భైరవం రోమహర్షణం
మహాత్మనో రాఘవస్య రావణస్య చ ధీమతః ॥

రాము డిట్లు రథము నధిష్ఠించినతరువాత యుద్ధవిశారదుడగు రావణుడు రామునితో ఘోరమగు యుద్ధము నొనరించెను. వారి ఆ యుద్ధము ఆకాశమునుండి పరికించిన దేవతలకుగూడ భీతిని గొల్పినది. ఒక్కసారిగా వారు భయకంపితులై పులకాంచితగాత్రులయిరి.

ఆగ్నేయేన చ ఆగ్నేయం వైవం వైవేన రాఘవః
అస్త్రం రాక్షసరాజస్య జఘాన పరమాస్త్రవిత్ ॥

రావణుడు సర్వయుద్ధ విశారదుడు. రాముడు సర్వాస్త్రశస్త్రముల ప్రయోగోపసంహారములను సరహస్యములుగా ఎరిగినవాడు. కనుకనే రావణుడు ఆగ్నేయాస్త్రము నభిమంత్రించి ప్రయోగింపగా అతడు ఆయస్త్రమునే ప్రతిగా ప్రయోగించి ఉపశమింపజేసినాడు. వైవాస్త్రమునుకూడ అట్లే వ్యర్థమొనరించినాడు.

తత స్తు ససృజే ఘోరం రాక్షసం చాస్త్రమస్త్రవిత్
క్రోధేన మహతా ఽవిష్టో రామ స్యోపరి రావణః ॥

ఇట్లు తను ప్రయోగించిన అస్త్రములు రెండును ఉపసంహరింపబడగా రావణుని క్రోధము మిన్నువుట్టినది. అతడు రాక్షసమను భీకరాస్త్రమును మంత్రించి రాముని పై ప్రయోగించెను.

రావణస్య ధనుర్ముక్తాః సర్వా భూత్వా మహావిషాః
శరాః కాంచనపుంఖా రాఘవంభా పరితో ఽపతన్ ॥

రావణుడు రాక్షసాస్త్రమును ప్రయోగించిన వెంటనే అతని ధనుస్సునుండి అనేక బాణములు బంగారు రెక్కలుగలవి ఉద్భవించ నారంభించెను. అవన్నియు కాలకూటవిషధారణ మొనరించు సర్పములుగా పరివర్తనముజెంది శ్రీరాముని చుట్టు ముట్టినవి.

తైశ్శరైస్సర్పవదనై ర్వ్యమద్భి రనలం ముఖైః
దిశ శ్చ విదిశ శ్చైవ వ్యాప్తా స్తత్ర తదా ఽభవన్॥

రాముని చుట్టుముట్టిన ఆ కాలసర్పము లన్నియు అగ్నిజ్వాల లతో గూడిన విషమును వెలిగ్రక్కు నారంభించినవి. ఆ విషాగ్నులు ఆ ప్రాంతప్రదేశము లన్నిటను వ్యాపించ నారంభించినవి.

రామః సర్వాం స్తతో దృష్ట్వా సమంతా త్పరిపూరితాన్
సౌపర్ణ మస్త్రం తద్ఘోరం పురః ప్రావర్తయ ద్రణే॥

ఇట్లు తన రథముచుట్టు విషముగ్రక్కుచు అంతట వ్యాపించి యున్న ఆ సర్పములను జూచి రాముడు గరుడాస్త్రమును సంధించి మంత్రించి ప్రయోగించెను.

రామేణ ముక్తా స్తే బాణా భూత్వా గరుడరూపిణః
చిచ్ఛిదుః సర్వబాణాం స్తాన్ సమంతా త్సర్వశత్రవః॥

శ్రీరాముయనిచే ప్రయోగింపబడిన సౌపర్ణాస్త్రము అనేక బాణములుగా- గరుడపక్షులుగా రూపొందినది. ఆ గరుడపక్షులు తమ ఎదుట విషాగ్నులను సృష్టించుచున్న సర్పములను చీల్చి చెండాడినవి.

అస్త్రే ప్రతిహతే యుద్ధే రామేణ దశకంధరః
అభ్యవర్ష త్తతో రామం ఘోరాభిః శరవృష్టిభిః॥

శ్రీరాము డిట్లు తన ఘోరమగు అస్త్రమును ప్రతిహతమొనరించగా రాక్షసరాజుయొక్క క్రోధము ఇనుమడించినది. అతడు తీవ్రములగు శరములను సంధించి రామునిపై వర్షమును కురిపింపసాగెను.

తతః పునః శరానీకై రామ మక్లిష్టకారిణం
అర్ధయిత్వా తు ఘోరేణ మాతలిం ప్రత్యవిధ్యత॥

రణరంగమున శత్రువులకు భారముగు దుష్కరకర్మల నొనరించు రాముని పై రావణుడు అనేకములగు శరములను వర్షించి నొప్పించి రథమును నడుపు మాతలినికూడ తీవ్రబాణములచే వేధించెను.

పాతయిత్వా రథోపస్థే రథకేతుం చ కాంచనం
ఐంద్రా నశ్వా నభ్యహన ద్రావణాః క్రోధమూర్ఛితః ॥

క్రోధముచే ఒడలు తెలియని రావణుడు అతివేగముగా బాణములను పరగించి రథమునకు అలంకరణముగానున్న కేతువును రథముపై పడవేసెను. తరువాత ఇంద్రుని రథమునువహించు ఆ యశ్వములను మర్మస్థానములందు వేధించెను.

విషేదు ర్దేవగంధర్వా శ్చారణాః పితర స్తథా
ఆర్తాకారం హరిం దృష్ట్వా వ్యథితా శ్చ మహర్షయః
వ్యథితా వానరేంద్రా శ్చ బభూవుః సవిభీషణాః ॥

రాము డిట్లు క్రోధమూర్ఛితుడయిన రావణునిచే ఆక్రమించబడి బాధపడుచుండగాజూచి దేవతలు, గంధర్వులు, చారణులు, పితృదేవతలు విషాదము ననుభవించిరి. మహర్షుల హృదయములు వ్యథాసంభరితములయినవి. సుగ్రీవాంగద హనుమదాదులగు వానరులును, విభీషణుడుకూడ ఎంతో గ్లాని ననుభవించిరి.

దశాస్యో వింశతిభుజః ప్రగృహీత శరాసనః
దదృశే రావణ స్తత్ర మైనాక ఇవ పర్వతః ॥

పదిముఖములు, ఇరువది బాహువులు గలిగి బాహువులలో శరాసనమును ధరించిన రావణుడు యుద్ధభూమిలో మైనాకునివలె దర్శనీయుడయ్యెను. మైనాకుడు నల్లనివాడు. రావణుడు నల్లనివాడు. మైనాకుని శిఖరములవలె రావణుని శిరములున్నవి. పర్వతస్థవృక్షపంక్తులవలె రాక్షసుని భుజములున్నవి. కనుక మైనాకునివలె రావణుడును దర్శనీయుడయ్యెను.

రామ స్తు భృకుటిం బద్ధ్వా క్రోధసంరక్తలోచనః
కోపం చకార సదృశం నిర్దహ న్నివ రాక్షసమ్ ॥

రావణు డిట్లు దర్పిష్ఠుడై చరించుచుండగా రాము డొక్కసారి కనుబొమలను ముడివేసి క్రోధసంరక్తలోచనుడై రావణునివైపు తీక్ష్ణముగా చూచెను. ఆచూపు ఆతనిని దహించునదిగా నుండెను.

ధను రాదాయ దేవేంద్రధనుడాకార మద్భుతం
గృహీత్వా పాణినా బాణం కాలానలసమప్రభం
నిర్దహ న్నివ చక్షుభ్యాం దదర్శ రిపు మంతికే ॥

అంతట అతడు ఇంద్రధనుస్సు సహజసమహత్త్వసారములుగల అద్భుతమగు తన ధనుస్సును ఎక్కుబెట్టి, చేత కాలాగ్నిసదృశప్రభా రాశిచే ధగద్ధగాయమానమగుచున్న శరమును ధరించి ఎదుటనున్న శత్రువును అగ్నిస్ఫులింగములను గ్రక్కుచున్న నేత్రములతో జూచెను.

పరాక్రమం దర్శయితుం తేజసా ప్రజ్వల న్నివ
ప్రచక్రమే కాలరూపీ సర్వలోకస్య పశ్యతః ॥

ఇంతవరకు రాముడు శాంతముతో ఊరకొనినాడు. అతనిశాంత మును అసమర్థతగా భావించి రావణుడు విజృంభించినాడు. ఇప్పుడు రాముడు తన పరాక్రమమును ప్రదర్శించు ఉద్దేశ్యముతో తేజోరాశి వలె వెలుగజొచ్చినాడు. ఇంతవరకు విషాదమునందుచున్న ఇంద్రాది దేవతలు చూచుచుండగనే రామునిరూపము మృత్యువువలె భయంకర మయినది.

వికృష్య చాపం రామ స్తు రావణం ప్రతివిధ్య చ
హర్షయ న్వానరానీకం కాలాంతక ఇవాఽఽబభౌ ॥

అతడు చేతనున్న చాపమును ఒక్కసారి నారిసారించి బాణ మును సంధించినాడు. ఆబాణముచే శత్రువు మర్మమును భేదించినాడు. రాముని ఈ ఉత్సాహమునుచూచి వానరసైన్యము ఆనందోల్లసిత మయినది. ఆ సమయమున వానరసేనలదృష్టికి రాముడు రావణుని పాలిటి కాలాంతకునివలె తోచినాడు.

క్రుద్ధం రామస్య వదనం దృష్ట్వా శత్రుం ప్రబాధతః
త్రస్తాని సర్వభూతాని చచాల చ వసుంధరా ॥

ఆ సమయమున శత్రుభయంకరమై క్రోధారుణ వర్ణరంజిత మయిన రాముని వదననునుజూచి సర్వభూతములు భయకంపితము లయినవి. సర్వంసహాచక్రము కంపించనారంభించినది.

రామం దృష్ట్వా మహారౌద్రం ఉత్పాతాం శ్చ దారుణాన్
త్రస్తాని సర్వభూతాని రావణం చానిశ మద్భయమ్ ॥

ప్రళయకాలరుద్రునివలె భయంకరరౌద్రమూర్తిని చూడగనే దారుణములగు ఉత్పాతములు ఉద్భవిల్లనారంభించినవి. ఆ యుత్పాత ములకు ఇంద్రాదిదేవతలుగూడ భయకంపితులయిరి. మేరుపువలె ధైర్య శాలియగు రావణునిగూడ భయము ఆవేశించినది. రాముని రౌద్ర స్వరూపము సర్వభూతభయానహాముగా నుండెనని భావము.

విమానస్థాః సురగణాః సిద్ధగంధర్వకిన్నరాః
దదృశుః సుమహాయుద్ధం లోకసంవర్తకోపమం॥

శ్రీరామచంద్రు డిట్లు రౌద్రమూర్తికాగా ఆకాశమున విమాన ములలో కూర్చొని ఇంద్రాదిదేవతలు, కిన్నరులు, గంధర్వులు, సిద్ధులు మొదలగువా రందరును ప్రళయకాలమును జ్ఞప్తికి తెచ్చుచున్న ఆదృశ్య మును పరికించిరి.

ఐంద్ర మస్త్రం సమాదాయ రావణస్య శిరోఽ చ్ఛినత్
మూర్ధానో రావణ స్యాధ బహవో రుధిరోక్షితాః
గగనాత్ ప్రపతన్తి స్మ తాలా దివ ఫలాని హి॥

అంతట రాముడు ఇంద్రదేవతాకమయిన బాణమును సంధించి రావణుని శిరచ్ఛేదమొనరించుటకై ప్రయోగించెను. ఆ శరము తిన్నగా రావణుని దశశిరములను ఛేదించెను. రక్తప్లావితములయిన ఆశిరములు తాళవృక్షములనుండి జారిపడు తాటిపండ్లవలె భూపతితములయినవి.

న దినం న చ నై రాత్రి ర్న సంధ్యా న దిశో ఽపి వా
ప్రకాశం తే న తద్రూపం దృశ్యం తే తత్ర సంగరే
తతో రామో బభూ వాథ విస్మయావిష్టమానసః॥

శ్రీరాముడు రాత్రి పగలు అను భేదము లేకుండ అనేక రోజులు రావణునితో యుద్ధమొనరించినాడు. ఐంద్రాద్యస్త్రములను ప్రయోగించి వాని శిరములను ఛేదించినాడు. కాని ఎన్ని సారులు ఛేదించినను రావణుని శిరోరహితరూపము కంటి కగపడుట లేదు. యథా పూర్వము తలలు తిరిగి ఉద్భవిల్లుచున్నవి. ఈ క్రమమును చూచి రాముడు విస్మయావిష్టహృదయు డయ్యెను.

శత మేకోత్తరం ఛిన్నం శిరసాం హ్యేకవర్చసాం
న హ్యేవ రావణ శ్శాంతో దృశ్యతే జీవితక్షయాత్ ॥

ఒకేవిధమయిన తేజోబలములుగల దశకంధుని శిరములను శ్రీరాముడు నూటఒక్కమారులు ఛేదించినాడు, కాని రావణుని జీవితము నశించి శాంతినందుట అనునదిమాత్రము కన్పించలేదు. అనగా ఎన్నిమారులు తలలు నరకినను రావణునికి బలహీనత అనునది కలుగ లేదని భావము. ఈకారణమునకే రామునకు విస్మయము కలిగినది.

తతః సర్వాస్త్రవి ద్ధీరః కౌసల్యానందవర్ధనః
అన్యై శ్చ బహుభి ర్యుక్త శ్చింతయామాస రాఘవః॥

రావణు డీట్లు ఎంతకును శ్రాంతుడు కాకుండుటను జూచి సమస్తశస్త్రాస్త్రప్రయోగోపసంహారరహస్యములను ఎరిగినవాడును, రణరంగమున అనన్యసామాన్య ధైర్యశాలియును, కౌసల్యాదేవి ఆనందమును వృద్ధినందించువాడును అగు రాము డీట్లు చింతించెను.

యై ర్యే రాబణే ర్హతా దైత్యా మహాసత్త్వపరాక్రమః
త ఐతే నిష్ఫలం యాతా రావణస్య నిపాతనే॥

ఏయే బాణములను మారీచుడు, సుబాహుడు, విరాధుడు, ఖరుడు, దూషణుడు మొదలగు మహాదైత్య దానవులను వధించినవో అత్యధికమహత్త్వసంపన్నములయిన ఆశరములే రావణుని వధించుటలో నిష్ఫలములయినవి. అని-

ఇతి చింతాకులే రామే సమీపస్థో విభీషణః
ఉవాచ రాఘవం వాక్యం బ్రహ్మదత్తవరో హ్యసౌ॥

రాము డిట్లు చింతచే వ్యాకులహృదయుడుకాగా సమీపమునసే ఉన్న విభీషణు డిట్లు పలికెను. "రామా ! రావణుడు చిరకాలము తపస్సు నొనరించి బ్రహ్మదేవునిచే అనేకవరములను పొందినాడు.

విచ్ఛిన్నా బాహవో ఽప్యస్య విచ్ఛిన్నాని శిరాంసి చ
ఉత్పత్స్యంతే పునఃశీఘ్రు మి త్యాహ భగవా నజఃll

ఇతని బాహువులుగాని, ఇతని శిరములుగాని శత్రుబాణ విచ్ఛిన్నములై తిరిగి మొలయుచుండునని బ్రహ్మదేవుడు ఇతనికి వరముల నిచ్చియున్నాడు.

నాభిదేశే ఽమృతం తస్య కుండలాకారసంస్థితం
త చ్ఛోష యాసలాస్త్రేణ తస్య మృత్యు స్తతో భవేత్ll

ఇతని నాభిప్రదేశమున కుండలాకారముగా అమృతము ఉన్నది. మొదట నీవు ఆగ్నేయాస్త్రమును ప్రయోగించి కుక్షియందలి అమృతమును శోషింపజేయుము. అనంతరము అతనిని వధించుట సుకరమగును అని చెప్పెను.

విభీషణవచఃశ్రుత్వా రామఃశీఘ్రపరాక్రమఃll
పావకాస్త్రేణ సంయోజ్య నాభిం వివ్యాధ రాక్షసఃll

విభీషణు డిట్లు ఉపాయమును ఉపదేశింపగనే తీవ్రవేగయుత పరాక్రముడగు రాముడు పావకాస్త్రమును సంధించి రావణుని నాభి ప్రదేశమును వేధించెను. వాల్మీకమున విభీషణుడు ఉపాయమును చెప్పినట్లు వర్ణింపబడలేదు. మాతలియే బ్రహ్మాస్త్రమును ప్రయోగించుమని చెప్పినట్లున్నది.

అనంతరం చ చిచ్ఛేద శిరాంచి చ మహాబలఃll
బహూ నపి చ సంరబ్ధో రావణస్య రఘూత్తమఃll

పావకాస్త్రముతో నాభియందలి అమృతము శోషిల్లజేసిన అనంతరము రాముడు అనేక బాణములను ప్రయోగించి రావణుని అముఖ్యములగు తొమ్మిది శిరములను ఛేదించెను. అధికవేగముగా బాహువులనుగూడ ఛేదించెనని భావింపవలెను.

తతో ఘూరాం మహాశక్తి మాదాయ దశకంధరః
విభీషణవధార్థాయ చిక్షేప క్రోధవిహ్వలః॥

అంతట రావణుడు రహస్యోద్ఘాటన మొనరించి విభీషణుని వధించు తలంపుతో అరిభయంకరమగు శక్తి నొకదానిని గ్రహించి అతనిపై ప్రయోగించెను.

చిచ్ఛేద రాఘవో బాణై స్తాం శితై ర్హేమభూషితైః
దశగ్రీవశిరశ్ఛేదా త్తదా తేజో వినిర్గమత్॥
మ్లానరూపో బభూ వాథ చ్ఛిన్నైః శీర్షై ర్భయంకరైః
ఏకేన ముఖ్యశిరసా బాహుభ్యాం రావణో బభౌ॥

విభీషణుని వధించుటకు వచ్చు ఆ భయంకరశక్తిని రాముడు సునిశితబాణములతో ఖండించెను. దశగ్రీవుడు తన తొమ్మిది తలలు, ఇరువది బాహువులు తెగిపోవుటచే తేజోహీనుడయ్యెను. శత్రుభీకరములగు శిరములు ఛేదింపబడుటచే అతని రూపమే మాడిపోయెను. ఇక ఇప్పుడతనికి ఒక ముఖ్య శిరస్సు, ముఖ్య బాహువులుమాత్రమే ఉన్నవి. ఒక శిరము రెండు బాహువులుమాత్రమే మిగిలినవని భావము.

రావణ స్తు పునః క్రుద్ధో నానాశస్త్రాస్త్రసృష్టిభిః
ఆవర్ష రామం తం రామ స్తథా బాణై ర్వ్యవర్ష చ॥

విభీషణునిపై ప్రయోగించిన భయంకరశక్తి ఇట్లు వ్యర్థముకాగా క్రుద్ధుడయిన రావణుడు అనేకములగు శస్త్రాస్త్రములను ప్రయోగించి కప్పివేసెను. అట్లే రాముడును బాణములను వర్షించి రావణుని ముంచెత్తెను.

తతో యుద్ధ మభూ ద్ఘోరం తుములం రోమహర్షణం
అథ సంస్మారయామాస మాతలీ రాఘవం తథా॥

ఇట్లు రామరావణుల కిద్దరకు ఘోరమగు తుముల యుద్ధము జరిగినది. దానిని జూచిన దేవతలే భయకంపితులు అయినారు. అంతట మాతలి రాముడు రావణవధలో విలంబమొనర్చుచుండగా సహాం.

చజాలక ఇట్లు రామునకు రావణవధ నేడు అవశ్యకర్తవ్యమను విషయమును గుర్తుకు తెచ్చెను.

విసృ జాస్త్రవధా యాస్య బ్రాహ్మ్యం శీఘ్రం రఘూత్తమ
వినాశకాలః ప్రథితో యః సురైః సో ఽద్య వర్తతే ॥

రామా! ఆలస్యము చేయకుము. ఈరోజే రావణుని మృత్యు కాలముగా దేవతలచే నిర్ణయింపబడినది. కనుక బ్రహ్మదేవతాపమయిన అస్త్రమును ఇతనిని సంహరించుటకై ప్రయోగింపుము.

ఉత్తమాంగం న చైతస్య ఛేత్తవ్యం రాఘవ త్వయా
నైవ శీర్ష్ణి ప్రభో వధ్యో వధ్య ఏవ హి మర్మణి ॥

ఈతనిని ఉత్తమాంగమును ఛేదించి చంపరాదు. అది ఛేదించ బడదు. ఇతడు శిరచ్ఛేదమున సంహరింపబడక మర్మస్థానము ఛేదింప బడి మరణించును. కనుక బ్రహ్మాస్త్రమును ప్రయోగించి హృదయ మర్మమును భేదించుము.

తతః సంస్మారితో రా మ స్తేన వాక్యేన మాతలేః
జగ్రాహా స శరం దీప్తం నిశ్వసంత మివోరగం ॥

మాతలి ఇట్లు బ్రహ్మాస్త్రప్రయోగమును ఉపన్యసింపగా రావణ వధవిధానము గుర్తుకువచ్చిన రాముడు కాలసర్పముపలె విషము గ్రక్కుచు ప్రకాశించుచున్న దీప్తబాణమును గ్రహించెను.

యస్య పార్శ్వే తు పవనః ఫలే భాస్కరపావకే
శరీర మాకాశమయం గౌరవే మేరుమందరా ॥

శ్రీరాము డాశరమును చేతధరించి మంత్రమును పఠించి ఆయా దేవతలను దానియం దావహింపజేసినాడు. దాని పార్శ్వములందు పవనుడు అధిష్ఠించినాడు. ములికియందు సూర్యాగ్నులును వసించిరి. ఆకాశతత్త్వము శరీరమును ఆవహించినది. మేరుమందర పర్వతతత్త్వ ములు గురుత్వస్థానము నావహించినవి.

పర్వ స్వపి చ విన్యస్తా లోకపాలా మహౌజసః
జాజ్వల్యమానం వపుషా భాతం భాస్కరవర్చసా ॥

దాని కణుపులయందు అష్టదిక్పాలురు వరుసగా అధిష్ఠించిరి. ఇట్లు సర్వజగజ్జగత్పాలసారాధిష్ఠితమయిన ఆశరోత్తము సప్తార్చివలెను, భాస్కరునివలెను వెలుగొందినది.

త మ్ముగ్ర మస్త్రం లోకానాం భయనాశన మద్భుతం
అభిమంత్ర్య తతో రామ స్తం మహేషుం మహాభుజః
వేదప్రోక్తేన విధినా సన్దధే కార్ముకే బలీ ॥

ఉగ్రస్వరూపము గలిగి సర్వలోకభయాపహారకమగు ఆమహా శరమును అథర్వవేదోక్తవిధి ననుసరించి ధనుస్సునందు సంధించెను.

తస్మిన్ సంధీయమానే తు రాఘవేణ శరోత్తమే
సర్వభూతాని విత్రేసు శ్చచాల చ వసుంధరా ॥

రాము డా శత్రుభయంకరమగు మహాశరమును సమంతకముగా ధనుస్సున సంధించుచుండగా సర్వభూతములు భయకంపితములయినవి. భూమి చలించినది.

స రావణాయ సంక్రుద్ధో భృశ మానమ్య కార్ముకం
చిక్షేప పరమాయత్త స్త మస్త్రం మర్మఘాతినం ॥

ఆసమయమున రామునిహృదయము లోకకంటకుడగు రావణుని ఎడల క్రోధభావముతో నిండియున్నది. అతడు అతిశీఘ్రముగా ధనుస్సు నెక్కిడి ఆకర్ణాంతము ఆకర్షించి మర్మఘాతియనాఅస్త్రమును ప్రయోగించెను.

స వజ్ర ఇవ దుర్ధర్షో వజ్రపాణివిసర్జితః
కృతాంత ఇవ ఘోరాస్యో న్యపత ద్రావణోరసిం ॥

రామ ధనుర్విముక్తమయిన అది దివ్యశరము దేవేంద్ర హస్త విసర్జితవజ్రాయుధమువలెను, భయంకర వివృతముఖ్యుడగు కాలుని వలెను రావణు హృదయమర్మమును వేధించెను.

స నిమగ్నో మహాఘోరః శరీరాంతకరః శరః
బిభేద హృదయం తూర్ణం రావణస్య మహాత్మనః ॥

మహాభయంకరము, శరీరనాశన కారకము అగు రామసాయకము మహాత్ముడగు రావణుని హృదయమును భేదించినది. రావణుడు బ్రహ్మకులోద్భవుడు, నిరంతర వేదాధ్యయనసంపన్నుడు, శివపూజాతత్పరుడు అగుటచే మహాత్ముడనబడినాడు. మహాత్ముడయ్యును పరదారాపహారకుడగుటచే రామబాణమునకు వధ్యుడయినాడని భావము.

రావణ స్యాఽహర త్ప్రాణా న్వివేశ ధరణీతలే
స శరో రావణం హత్వా రామతూణీర మావిశత్ ॥

రామప్రయుక్త దివ్యశరము రావణునుని హృదయమర్మమును వేధించి తత్క్షణమే గతాసుని చేసినది. వెను వెంటనే ధరణీతలమును ప్రవేశించి తిరిగి వెలువడి రామతూణీరము నాశ్రయించినది.

తస్య హస్తా త్పపా తాఽశు సశరం కార్ముకం మహత్
గతాసు ర్భవి వేగేన రాక్షసేన్ద్రో ఒపత ద్భువి ॥

రావణు డాసమయమున రాముని పై ప్రయోగించుటకు చాప మున శరము నెక్కిడబోవుచున్నాడు. కాని ఇంతలోనే రామబాణ మతని మర్మను వేధించినది. దానితో అతని హస్తమునుండి మహత్తర మగు ధనుస్సు శరసహితముగా జారిపడినది. అతివేగముగా రథమునుండి అతనికళేబరము భూమిపై ప్రాలినది.

వాల్మీకిరామాయణమునందును రావణవధ ఈవిధముగానే వర్ణితమయినది–కృతాంత ఇవ చాహార్యో న్యపత ద్రాక్షసోపరి బిభేద హృదయం చైవ రావణస్య దురాత్మనః తస్యహస్తాద్భుతం చాశు కర్ముకం తత్ ససాయకం ప్రాభ్రశ్యత సహ ప్రాణై ర్భ్రశ్యమానస్య జీవితాత్ గతాసు రతవేగోఽ సౌ రాక్షసే న్ద్రో గతద్యుతిః పపాత స్యందనోద్భూతో వృత్రో వజ్రహతో యథా ॥—అని.

తం దృష్ట్వా పతితం భూమౌ హతశేషా శ్చ రాక్షసాః
హతనాథా భయత్రస్తా దుద్రువుః సర్వతో దిశం ॥
దశగ్రీవస్య నిధనం విజయం రాఘవస్య చ
తతో వినేదుః సంహృష్టా వానరా జితకాశినః
వదంతో రామవిజయం రావణస్య చ తద్వధమ్॥

ఈవిధముగా దశకంఠుని మరణమును రాఘవశ్రేష్ఠుని విజయమును చూచిన జయశీలురగు వానరులు అత్యంతసంతుష్ట మానసులయిరి. వారు రామవిజయమును, రావణ పరాజయమును పేర్కొనుచు సింహనాదములను గావించిరి.

అథాంతరిక్షే వ్యవదత్ సౌమ్య స్త్రిదశదుందుభిః
పపాత పుష్పవృష్టి శ్చ సమంతా ద్రాఘవోపరి॥

ఆతపవాత అంతరిక్షమున దేవదుందుభుల మంగళస్వరములు చెలరేగినవి. దేవతలు హృష్టమానసులై రామునిపై పుష్పములను వర్షించిరి.

తుష్టువు ర్మునయః సిద్ధా శ్చారణా శ్చ దివౌకసః
అథాంతరిక్షే ననృతుః సర్వతో ఽప్సరసో ముదా॥

నారద గాలవాది దేవర్షులు ఆనందమున రాముని స్తోత్రగానమున కీర్తించిరి. సిద్ధులు, చారణులు మొదలగు దేవజాతులు ప్రార్థించిరి. రంభ, ఊర్వశి మొదలగు అప్సరసలు ఆనందముగా నాట్యమాడిరి.

రావణస్య చ దేహోత్థం జ్యోతి రాదిత్యవత్ స్ఫురత్
ప్రవివేశ రఘుశ్రేష్ఠం దేవానాం పశ్యతాం సతాం॥

అంతట రామసాయక నిర్భిన్నహృదయుడైన రావణుని దేహమునుండి సూర్యునివలె వెలుగొందు ఒక తేజస్సు వెలువడి నారదాది మహర్షులు, బ్రహ్మాది దేవతలుచూచుచుండగా రాముని లో ప్రవేశించినది.

నిరంతరము రాముని ద్వేషించుచు, అతని భార్య నపహరించిన రావణుని జీవజ్యోతి రాముని లో ఐక్యమగుటకు కారణమును దేవనారదసంవాదరూపమున వివరించుచున్నాడు.

దేవా ఊచు రహో భాగ్యం రావణస్య మహాత్మనః
వయం తు సాత్వికా దేవా విష్ణోః కారుణ్యభాజనాః
భయదుఃఖాదిభి ర్వ్యాప్తాః సంసారే పరిపర్తినః॥

రావణ శరీరమునుండి వెలువడిన జ్యోతి రాముని ప్రవేశించుటను చూచి రాక్షసులు తమలో తా మిట్లు అనుకొనజొచ్చిరి. ఓహో ! ఈ రావణుని భాగ్యము ప్రశంసనీయమై ఉన్నది. మహాత్ములకుకూడ దుర్లభమయిన స్థితిని పొందినాడు.

దేవతలమగు మేము సాత్వికజీవనుల్లమై నిత్యము విష్ణ్వారాధన తత్పరులముగా నున్నాము. విష్ణుదేవుని కరుణకు పాత్రులముగా నున్నాము. అయినను భయము, దుఃఖము మొదలగు సంసార తాప ములచే పీడింపబడుచున్నాము. జననమరణ రూపమయిన సృష్టిచక్ర మున పరిభ్రమించుచున్నాము.

అయం తు రాక్షసః క్రూరో బ్రహ్మహా ఽతీవతామసః
పరదారరతో విష్ణుద్వేషీ తాపసహింసకః
పశ్యత్సు సర్వభూతేషు రామ మేవ ప్రవిష్టవాన్॥

ఈ రావణుడు తామసగుణసంపన్నుడు. బ్రహ్మ హంతకుడు. రాక్షసకులోద్భవుడయిన క్రూరుడు. నిత్యము పరదారల నపహరించి వారి శీలమును నాశనమొనరించువాడు. దేవదేవుడగు విష్ణువును ద్వేషించువాడు. మహాత్ములను హింసించినవాడు. అట్టి దుర్మార్గ ప్రవర్తనుడు సమస్త భూతజాలము చూచుచుండగా తేజోరూపమున శ్రీరామచంద్రుని దివ్యస్వరూపములో ఎట్లు ప్రవేశించినాడు. అతనికి మోక్షసౌభాగ్య మెట్లు కలిగినది ?

ఏవం బ్రువత్సు దేవేషు నారదః ప్రాహసస్మితః
శృణు త్వాత్ర సురా యూయం ధర్మతత్త్వవిచక్షణాః॥

దేవత లీవిధమున తమలో తాము గుసగుసలు పడుచుండగా గ్రహించి నారదుడు చిరునవ్వు నవ్వుచు ధర్మతత్త్వ విచక్షణులగు దేవతలను సంబోధించి రామభక్తి రహస్యము నిట్లు ఉద్ఘాటించెను.

రావణో రాఘవద్వేషా దనిశం హృది భావయన్
భక్త్యా సహ సదా రామచరిత్రం ద్వేషసంయుతః
ప్రత్యా రామాత్మని ధనం భయాత్ సర్వత్ర రాఘవం
పశ్య న్ననుదినం స్వప్నే రామ మేవానుపశ్యతి॥

రావణుడు రామునియందలి ద్వేషముచే నిత్యమూ తన హృదయమున అతనినిగూర్చియే మాట్లాడువాడు. శ్రీరాముడు తనకు మృత్యుకల్పుడను రహస్యమును ఎరిగిననాటినుండియు, భయభ్రమిత

హృదయముతో సర్వత్ర రామమూర్తులనే దర్శించువాడు. స్వప్నము లందుగూడ రామదర్శనమునసే చేసెసివాడు. విష్ణునామమును విన జాలని ఘంటాకర్ణునివలె ద్వేషబుద్ధితో సదా రామునే ధ్యానించు చుండెడివాడని భావము.

క్రోధో ఒపి రావణ స్యాశు గురుబధ్వోధికో భవేత్
రామేణ నిహత శ్చాంతే నిధూతా శేషకల్మషః
రామసాయుజ్య మేహాపి రావణో ముక్తబంధనః ॥

అతనికి శ్రీరామునిఎడల కలిగిన కోపముకూడ గురువులు బంధువులు మొదలగువారి ఉపదేశముల నన్నిటిని మించినది. సర్వధర్మాతిశాయి అనిభావము. ఆతరువాత పరాత్పరుడగు రామునిచే నిహతుడయినాడు. ఈకారణము లన్నిటివలన రావణుని సర్వపాపములు ధూతములయిపోయినవి. ఈవిధమున జన్మమరణరూపములయిన సంసారబంధనములు విడిపోగా ఈతడు సాయుజ్యముక్తిని పొందినాడు.

రామభక్తియందలి నాన్యమగు విశేషమును ప్రతిపాదించు చున్నాడు–

పాపిష్ఠో వా దురాత్మా పరధన
పరదారేషుసక్తో యది స్యాత్
నిత్యం స్నేహా ద్భయా ద్వా రఘుకుల
తిలకం భావయ న్ సంపరేతః
భూత్వా శుద్ధాంతరాత్మా భవశత
జనితా నేకదోషై ర్విముక్తః
సద్యో రామస్య విష్ణో ఃసురవర
వినుతం యాతి వైకుంఠ మాద్యమ్ ॥

మానవుడు నిత్యము పాపకర్మల నాచరించువాడయినను సరే, దురాభవసంయుతుడయినను సరే, పరధన పరస్త్రీలయందు ఆసక్తి కలిగి యున్నవాడయినను సరే ముక్తుడగుటకు అవకాశమున్నది. సాధుపురు

షుడు స్నేహవశమునను, దుష్టుడు భయవశమునను రాముని నిత్యము హృదయమున భావించును. ద్వేషబుద్ధితోనైనను సరే రామస్మరణ మొనర్చువాడు మృత్యుగతుడై పరిశుద్ధాంతరంగుడగును. అంతరంగము పరిశుద్ధమయినచో అనేకవందల జన్మలలో ఆర్జించిన దోషజాలము నుండి విముక్తుడగును. దోషవిముక్తుడై సర్వవ్యాపకుడగు శ్రీరాముని స్థానమగు వైకుంఠధామమును పొందును. "కలౌతద్భక్తికీర్తనాత్" అను వచనము ననుసరించి సగుణభక్తియందలి ఉత్కృష్టత ఇందు వర్ణింప బడినది. అల్పాయుష్కులు, మాయామోహితులు అగు కలియుగ మానవులకు భక్తియే శరణ్యమని తాత్పర్యము.

భక్తిభావముయొక్క ఉత్కృష్టతను ప్రతిపాదించి రావణసంహారకుడగు వీరరాముని నారదుడు స్తుతించుచున్నాడు—

హత్వా యుష్మద్వేదశాస్యం త్రిభువనవిషమం వామహస్తేన చాపం
భూమౌ విష్టభ్య తిష్ఠన్నితరకరధృతం భ్రామయన్బాణ మేకం
ఆరక్తోపాంతనేత్రః శరదలితవపుః సూర్యకోటిప్రకాశో
వీర శ్రీబంధురాంగస్త్రిదశపతినుతః పాతు మాం వీరరామః ॥

మూడులోకములవారికి అజేయుడై వారిని బాధించుచున్న రావణుని వధించి శ్రీరాముడున్నాడు. అతని వామహస్తమున చాపము విరాజిల్లుచున్నది. దానితడు భూమిపై ఆన్చి తాను దాని నూతగా గొని నిలబడినాడు. అతడు రెండవహస్తమున రావణుని వధించిన శరమును ఆడించుచున్నాడు. ఇప్పుడే రావణుని వధించిన అతని నేత్రాంతములు రక్తరంజితములైయున్నవి. రావణ శరదళితశరీరము కోటి సూర్య ప్రకాశపుంజమును తలపించుచున్నది. కించిన్నమితశరీరుడగు అతనిని దేవరాజగు ఇంద్రుడు నుతించుచున్నాడు. అట్టి వీరమూర్తి శ్రీరాముడు నను భవభయమునుండి రక్షించుగాక!

ద్వాదశ సర్గ

శ్రీ మహాదేవ ఉవాచ :—

రామో విభీషణం దృష్ట్వా హనూమంతం తథాంగదం
లక్ష్మణం కపిరాజం చ జాంబవంతం తథా పరాన్
పరితుష్టేన మనసా సర్వానే వాబ్రవీద్వచః॥

సమస్తలోకములను, అష్టదిక్పాలకములను, మృత్యువును కూడ జయించిన మహాప్రతాపశాలియగు రావణుని వధించగనే శ్రీరామ చంద్రుని హృదయము ఆనందముచే తృప్తినందినది. అంతట అతడు విభీషణుడు, హనుమంతుడు, అంగదుడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు మొదలగు మహావీరుల నందరను పరికించి ఇట్లు పలికెను.

భవతాం బాహువీర్యేణ నిహతో రావణో మయా
కీర్తిః స్థాస్యతి వః పుణ్యా యావచ్చంద్రదివాకరౌ॥

ఓ మహావీరులారా ! మీ అందరి బాహుబలమును ఊతగాగొని నేను త్రిలోకకంటకుడగు రావణుని సంహరించితిని. ఆకారణమున మీ అందరి యశస్సు చంద్రసూర్యు లున్నంతకాలము లోకములో స్థిరముగా నుండగలదు.

కీర్తయిష్యంతి భవతః కథా త్రైలోక్యపావనీం
యయోపేతాం కలిహరాం యాస్యంతి పరమాం గతిం॥

స్థిరమగు కీర్తితో గూడిన మీ ఈవిజయకథ త్రిలోకములను పవిత్రముచేయునది. దానిని కీర్తించిన వారి పాపపంకిలము క్షాళితమగును. క్షాళితపాపు లగువారు పరమోత్తమమగు సద్గతిని పొందుదురు. శ్రీరాముని చరిత్రతో కూడియుండుటచే హనుమదాదుల విజయవధ త్రిలోక పావని కల్మషాపహారకము అని భావము.

ఏతస్మిన్నంతరే దృష్ట్వా రావణం పతితం భువి
మందోదరీముఖాః సర్వాః స్త్రియో రావణపాలితాః
పతితా రావణస్యాగ్రే శోచంత్యః పర్యదేవయన్॥

రాము డీవిధముగ తన సైనికుల వీర్యధైర్యములను ప్రశంసించు చుండగా హత శేషులగు రాక్షసులు రావణ మరణవార్తను అంతఃపురము నకు చేర్చిరి. అంతట మండోదరీసహితులగు రావణపత్ను లందరును పెద్దపెట్టున శోకించుచు నగరమున వెలువడి రావణుడు పడియున్న స్థల మును చేరిరి. వారు భూపతితుడయిన రావణుని చూచి అతని గుణగణ ములను పేర్కొనుచు చిరకాలము రోదించిరి.

మండోదరి రావణుని దుర్గుణములనుకూడ పేర్కొని అవియే వినాశకారకములయినవని రోదించినట్లు వాల్మీకము. ''అకస్మా చ్చాభి కామో ఽసి సీతాం రాక్షసపుంగవ ఐశ్వర్యస్య వినాశాయ శరీరస్య మమైహి'' అని.

విభీషణః శుశ్రోచార్తః శోకేన మహతావృతః
పతితో రావణ స్యాగ్రే బహధా పర్యదేవయత్ ॥

దుర్మార్గుడయిన తోడబుట్టినవాడగుటచే రావణుని ఈమరణము విభీషణునిగూడ శోకార్తుని జేసినది. అతడు బిగ్గరగా శోకించుచు రావ ణుని కాయమునకు సమీపమున భూమిపై దొర్లుచు దుఃఖించెను.

రామస్తు లక్ష్మణం ప్రాహబోధయస్వ విభీషణం
కరోతు భ్రాతృ సంస్కారం కిం విలంబేనమావద ॥

మండోదరీ విభీషణులు చిరకాలము దుఃఖించుచుండగా చూచి రాముడు లక్ష్మణునితో ఇట్లనెను. నీవు విభీషణునికి జ్ఞానబోధయొనర్చి ప్రకృతిస్థుని గావింపుము. అతడు మరణించిన అన్నకు అగ్నిసంస్కార మొనర్చినట్లు చేయుము. ఎంతమాత్రము ఆలస్యము కారాదు.

స్త్రియో మందోదరీ ముఖ్యాః పతితా విలపంతి చ
నివారయతుతాః సర్వా రాక్షసీ రావణప్రియాః ॥

మండోదరి మొదలగు స్త్రీలుకూడ భూపతితలై విలపించు చున్నారు. విభీషణుడు తానూరడిల్లి వారిని ఊరడించునట్లు చేయుము. రావణప్రియలగు రాక్షస్త్రీల నందరను ఊరడింపుము-అని.

ఏవముక్తో ఽథ రామేణ లక్ష్మణో ఽగాద్ విభీషణం
ఉవాచమృతకోపాంతే పతితం మృతకోపమం
శోకేన మహతావిష్టం సౌమిత్రిరిదమబ్రవీత్ ॥

శ్రీరాముని ఆజ్ఞ ననుసరించి లక్ష్మణుడు విభీషణునిదగ్గరకు వెళ్ళెను. అప్పుడు విభీషణుడు మృతుడగు సోదరుని కళేబరమునకు సమీపమున మృతునివలె పడియున్నాడు. ఈవిధము మహాశోకావిష్ట హృదయుడగు అతనితో సౌమిత్రి ఇట్లు పలికెను.

యం శోచసి త్వం దుఃఖేన కోయంతవ విభీషణ
త్వం వాఽస్య కతమః సృష్టేః పురేదానీ మతఃపరం ॥

విభీషణా ! నీవు ఎవనికోసమై ఈవిధమున ఒడలు మరచి దుఃఖించుచున్నావు. రావణునికొరకా ? అయితే ఈ రావణుడెవడు ? అతడు నీ కేమగును ? శరీరదృష్ట్యా మీ ఇద్దరకును సంబంధము లేదు గదా ? ఆత్మదృష్ట్యా విచారించనక్కరలేదు. ఆత్మ శుద్ధ బుద్ధ స్వభావము గలిగినది. కనుక దేనితోను సంబంధముకలదిగాదు. సృష్టికి పూర్వమందుగాని, పరమందుగాని మీ ఇద్దరకు ఎట్టిసంబంధమును లేదు. కనుక మధ్యకాలమునను ఉండదు.

సంబంధవిశేషమునగాదు ఇతడు నాసోదరుడు. సోదరవియోగ జన్యమగు దుఃఖము నాది. అనినచో దానికి సమాధానమిచ్చుచున్నాడు-

యద్వత్తో యూథ పతితాః సికతా యాంతి తద్వాఽఽ
సంయుజ్యన్తే వియుజ్యన్తే తథాకాలేన దేహినః ॥

జలప్రవాహమందు కొంత ఇసుక పడినదనుకొనుము. అది ప్రవాహవేగమున కొంతదూరము కలిసే ప్రవాహముతో బడిపోవును. కాని కొంతదూరము పోవుసరికి కొన్ని ఇసుకరేణువులు గురుత్వభారమున ఆగిపోవును. తేలికగానున్న రేణువులు మరికొంతదూరముపోయి భారముచే ఆగిపోవును. అట్లే జీవులదశయు. కాలవశమున జీవులుకొన్ని మాతాపిత్రు, భ్రాతృరూపమున దేహములను ధరించి కొంతకాలము

కలిసియుండును. వాటివాటి కాలము రాగానే నశించిపోవుచుండును. ఆ నశించుటలో ముందువెనుక లగుచుండును. కాన ఈనశించినవారికై ముందు నశించబోవువారు దుఃఖించుట తగదని భావము.

యథా ధానాసువై ధానా భవన్తి న భవంతి చ
ఏవం భూతేషు భూతాని ప్రేరితానీశ మాయయా ॥

ధాన్యమును చల్లగా అందులో కొన్ని వ్యర్థముగా నశించిపోవును. కొన్ని అధికధాన్యమును ఉత్పత్తిచేయును. అట్లే జీవులును పరమేశ్వరుని ప్రేరణననుసరించి జన్మమరణాదులకు వశులగుదురు. జీవుని జన్మమరణాదులు ఈశ్వరునివశమందున్నవేగాని స్వవశమందు లేవని భావము. ఏకగర్భజనితుడయినను కాలవశుడయి రావణుడు మరణించినాడు గాన అతనికై దుఃఖించరాదని లక్ష్మణుడు ఉపదేశించినాడు.

త్వం చాయం పయ మన్యే చ తుల్యాః కాలవశోద్భవాః
జన్మ మృత్యూయదాయస్మాత్తదా తస్మాద్భవిష్యతః ॥

ఈ జనన మృత్యువులనునవి రావణున కొక్కనికే వచ్చినవి కావు. నీవు, మేము, ఇంకా ఇతరులుకూడ సమానముగా కాలమునకు వశులై ఉన్నారు. కర్మకు సహాయకారులుగా జన్మమృత్యువులు ఈశ్వరునిచే సృజించబడినవి. కనుక మనమందరము ఈ రెంటిని తప్పక అనుభవించవలసినదే. వీటిని తప్పించుకొను ఉపాయములేదు. కనుక మృతులైనవానిని గూర్చి శోకించుట అయుక్తము.

ఈశ్వరః సర్వభూతాని భూతైః సృజతి హన్త్యజః
ఆత్మసృష్టైరస్వతంత్రైరన పేక్షోహిబాలవత్ ॥

నీవు చెప్పిన ఉపాయమువలననే రావణుడు చంపబడినాడను కొనుచుంటివేమో! అదియు అనవసరమే ఈశ్వరుడు ప్రతిప్రాణిని చంపుటకే సృజించును. ఈశ్వరసృష్టములగు ప్రాణులు అస్వతంత్రములు. అయితే ఈశ్వరుడు తాను సృజించిన ప్రాణులను తానే ఎందుకు వధించునంటివేమో! లోకములో బాలుడు ఇసుకచే గృహా

దులను నిర్మించి, తిరిగి తనే వాటిని భస్మముచేయునట్లుగనే భగవం తుడును అపేక్షారహితముగా సృజించి అపేక్షారహితముగానే నశింప జేయును. కనుక రావణుని మృతికి నీకర్తృత్వ మేమియును లేదు.

జన్మ మృత్యూ యదా యస్మా త్తదా తస్మా దభవిష్యతః॥

అన్ని జన్మమృత్యువులు అనుల్లంఘనీయములని ప్రతివాదించి నాడు. అయితే ఆ జన్మమృత్యువులు ఎవనికి? జీవునకా? లేక శరీర మునకా? అను ప్రశ్న రాగా సమాధానము చెప్పుచున్నాడు.

దేహాన దేహినో జీవాద్ దేహాద్ దేహోభిజాయతే
బీజా దేవ యథాబీజం దేహేభ్య ఇవ శాశ్వతః
దేహీ దేహవిభాగోయం అవివేక కృతః పురా॥

దేహాభిమానముగల జీవుని దేహామునలన మరియొక దేహాము జన్మించును. దానికి జీవుని దేహమే సాధనమగును. అంతేగాని జీవుని వలన మరియొక దేహాము జన్మించదు. జీవుడు శాశ్వతుడగు పర మాత్మనొక్క అంశయగుట దీనికి కారణము. బీజమునుండి మరి యొక బీజము ఉత్పన్నమగునట్లుగనే ఈ దేహోత్పత్తి జరుగును. అయితే దేహమందున్న జీవుడు దేహముతో పాటు జన్మించినట్లు కన పడునేగాని వాస్తవమునకు జన్మించడు. కనుక ఇప్పుడు ఈశరీరము నశించినదేగాని జీవుడు మరణించలేదని తాత్పర్యము. అయితే ఇతడు మహారాజగుటచే శోకింతునందువేమో! అదియు అనవసరమే. దేహ ములు జీవులలో ఉత్కృష్టత్వ నీచత్వములు ఆత్మవిద్యాగ్రహితములగు అవివేకులచే కల్పింపబడినవి. అనగా సమస్తజీవులు సమస్త శరీరములు సమానములేగాని హెచ్చుతగ్గులు లేవని భావము.

జీవులన్నియు ఒకే పరమాత్మ అయినప్పుడు ఈ అనేకత్వము, జన్మమరణములు మొదలగునవన్నియు ఏమిటి? ఇవి అన్నియు ఎట్లు ప్రకాశించుచున్నవని అను ప్రశ్నకు సమాధాన మిచ్చుచున్నాడు–

నానాత్వం జన్మనాశం చ కుతోవృద్ధిః క్రియాఫలం
ద్రష్టురాభాన్య తద్ధర్మా యథా ఽగ్నేర్దాహ విక్రియాః

త ఇమే దేహ సంయోగాదాత్మ నా భాత్యసద్గ్రహాత్ ॥

సృష్టిలోని అనేకత్వము, జన్మమరణములు, క్షయవృద్ధులు, పుణ్యపాపరూపమయిన కర్మఫలము—మొదలగునవన్నియు దర్శించువాని భ్రాంతిజన్యములేగాని జీవాత్మ ధర్మములు గావు. అగ్నిసంపర్కమున కట్టెలు మండుచు ప్రకాశించినను ప్రకాశము దారుధర్మము కానట్లే జన్మాదులును జీవధర్మములు గావు. అయితే ఈభ్రమ జీవునికి సంబంధించినదేగదా? అనుప్రశ్న వచ్చును. దానికి సమాధాన మిచ్చుచున్నాడు. వాస్తవమునకు భ్రమజ్ఞానము జీవునికి సంబంధించినదిగాదు. అసత్యమగు దేహముత్రో సంపర్కము కలుగుటచే దేహధర్మమగు మిథ్యాజ్ఞానము దానికి కలిగినది. కనుకనే దేహధర్మములగు జన్మాదులు తనకు కలిగినట్లుగా భావించుకొనుచున్నది.

అయితే సంసారోద్భవ లయములు ఎందువలన కలుగుచున్నవి? అను ప్రశ్నకు సమాధాన మిచ్చుచున్నాడు.

ప్రపా యథా తథా నానాధ్యాయతో ఒసత్ సదాగ్రహాత్
ప్రసుప్త స్యాదహం మానాత్తదాభాతి నసంసృతిః॥

లోకములో మనము పాంథులకు జలములనిచ్చి వారి దాహమును తీర్చు పానీయశాలలను చూచుచున్నాము. అవి జలరహితములయినచో నిద్రితములై కోలాహలరహితముగా నుండును. జనసహితములైనప్పుడు కలకలలాడుచు ఆకర్షణీయములుగా నుండును. అట్లే సృష్టియును జరుగుచుండును. అసత్ శూన్యమగు పానీయశాలవంటిది. అది సదాగ్రహము వలన అనగా సత్పదార్థ సంపర్కమున జనసంపర్కమున పానీయశాలవలె ప్రకాశించును. అప్పుడే అది అనేకవిధముల భావింపబడి కన్పించుచుండును. నేను, నాది, నావారు అను భిన్న భావము ఉన్నంతవరకు జగత్తు సత్యమువలె భాసించి శోకాదులకు కారణమగును. మానవుడు నేను, నాది అను అహంభావమును పరిత్యజించినచో అసద్రూపమయిన జగత్తు ప్రసుప్తమగును. అనగా ఉపసంహృతమగును. సృష్టి ప్రకాశించదు. జగత్తు చలివేంద్రవంటిది,

చలివేంద్రలోనికి పాంథు లనేకులు దప్పిక తీర్చుకొనుటకు వచ్చి తాత్కాలికముగా ఒకరినొకరు కలుసుకొన్నను వెంటనే విడిపోదురు. అన్న, తమ్ముడు, మహారాజు మొదలగు బంధుత్వములుకూడ అట్టివే. ఈ మమత్వము అసనూలమయినది. అహంభావమును వదలిన చో ఈ మమత్వ ముండదు. కనుక రావణునికై దుఃఖించుట వ్యర్థము అని లక్ష్మణుడు బోధించినాడు.

అయితే మరణము సంసారబంధమోక్షమునకు నివృత్తికారక మగునుగదా? అనినచో సమాధానము నిచ్చుచున్నాడు.

జీవతో ఽపి తథా తద్వద్విముక్తస్య సహంకృతేః
తస్మా న్నాయా మనోమాత్రం జహ్యా హం మమతాత్మభమమ్॥

మరణమే సంస్కృతిరాహిత్యమునకు కారణముగాదు. అహం కారరహితుడయినవాడు జీవించియుండును ముక్తుడే అగును. అహం కారనాశనమున మమత్వరాహిత్యము కలుగును. మమత్వము లేనిచో బంధనము లుండవు. బంధనములు లేకుండుటయే ముక్తి అనబడును. కనుక నీవును మమత్వరూపమయిన భ్రమను పీడి తకారణమయిన మాయావికారమగు మనస్సును పరిత్యజించుము. ప్రకృతివికారము మనస్సు. అహంభావము, మమత్వము దాని లక్షణములు. మనస్సును నిరాకరించిన అజ్ఞానము తొలగునని భావము. జీవన్ముక్తావస్థ ఈవిధ ముగా వర్ణితమయినది– భిద్యతే హృదయగ్రంథి శ్ఛిద్యంతే సర్వసంశ యాః। క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే..... సుషుప్తి వ జ్జాగ్రతి యోన పశ్యతి స్వయం చ పశ్యన్నపి వాఽద్వయత్వా తః, తథా ఽపి కుర్వన్నపి నిష్క్రియ శ్చ యః స ఆత్మవిన్నాఽన్య ఇతీహ నిశ్చయః॥ అని. ఆత్మవేత్త లౌకికవ్యాపారములకు ఆబాధితు డుగా నుండునని మొత్తము మీద తాత్పర్యము.

కర్తవ్యమును నిర్దేశించుచున్నాడు.

రామభద్రే భగవతి మనో దేహాత్మనీశ్వరే
సర్వభూతాత్మని పరే మాయామానుషరూపిణి॥

బాహ్యేంద్రియార్థ సంబంధాత్ త్యజయిత్వా మనః శనైః
తత్ర దోషాన్ దర్శయిత్వా రామానందే నియోజయ॥

కనుక నీవు మాయాజన్యమగు మమతను వీడుము. శ్రీరామ చంద్రుడు సర్వభూతములందలి జీవాత్మలకు పరుడైనవాడు. అతడు సర్వులదేహములయందున్న జీవులకు ప్రభువు. అట్టి పరాత్పరుడు లోక సంగ్రహమునకై మానవదేహము నంగీకరించి మానవునివలె వ్యవహరించుచున్నాడు. నీవు ఇంద్రియసుఖములయందలి దోషముల నవగత మొనర్చుకొని విరతుడవై మనస్సును ఎల్లప్పుడును ఆనందస్వరూపుడయిన రాముని యందు నియోజించుము. ఇంద్రియదోషము లనగా సంగాదులు. విషయసుఖములను ధ్యానించినచో సంగము కలుగుననియు, సంగమువలన కామము ఉత్పన్నమగు ననియు, కామము క్రోధజనక మనియు, క్రోధము మోహమునకు కారణమనియు, సమ్మోహము స్మృతి భ్రష్టతకును, స్మృతిభ్రష్టత బుద్ధినాశనమునకును, బుద్ధినాశము సర్వనాశమునకు హేతువు లగునని భగవద్గీత- ధ్యాయతో విషయాన్పుం సః సంగస్తేషూ పజాయతే, సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధో ఽభిజాయతే క్రోధా ద్భవతి సంమోహః సంమోహా త్స్మృతి విభ్రమః॥ స్మృతి భ్రంశా ద్బుద్ధి నాశో బుద్ధి నాశాత్ప్రణశ్యతి.

దేహ బుధ్యా భవే ద్భ్రాతా పితామాతా సుహృత్ప్రియః
విలక్షణం యదా దేహా జ్ఞానాత్యాత్మాన మాత్మనా॥
తదాకః కస్యనా బంధుర్భ్రాతా మాతాపితా సుహృత్
మిథ్యా జ్ఞాన వశోజ్జాతా దారాగారా దయః సదా॥

లేని సంసారమును సత్యముగా భావించుట మిథ్యాజ్ఞానము. మిథ్యాజ్ఞానమునవే భార్య గృహము మొదలగువాటియందు మమకార మేర్పడును. మిథ్యాజ్ఞానమునవే దేహము స్థిరమను భావము కలుగును. అందుచే దానిపై అభిమాన మేర్పడును. ఆ అభిమాన కారణమున సోదరుడు, తండ్రి, తల్లి, మిత్రుడు, ఇష్టుడు అను భేదములు

కలిగి మమకార మేర్పడును. ఆ మిథ్యాజ్ఞానమును పరిత్యజించి వాస్తవము, సంసార విలక్షణము అగు ఆత్మజ్ఞానమును అనుభవపూర్వకముగా సంపాదించినచో మాతాపిత్రసోదరాది మమకారము తొలగిపోవును. అనగా బంధవిముక్తి కలుగును. జ్ఞానికి సుషుప్త్యవస్థ కలుగును. ఆ సుషుప్తిని శ్రుతి ఈవిధముగా వర్ణించినది- "అత్ర పితా అపితా భవతి మాతా అమాతా లోకా అలోకా దేనా అదేవా వేదా అవేదా అత్రస్తేనో ఽస్తేనో భవతి భ్రూణహా అభ్రూణహా చాండాలో ఽచాండాలః పౌల్కసో ఽపౌల్కసః శ్రమణో ఽశ్రమణః తాపసో ఽతాపసః అనన్వాగతం పుణ్యేన అనన్వాగతం పాపేన తీర్ణో హి తదా సర్వాన్లోకాన్ హృదయస్య తరతి" జ్ఞాని సర్వసంగములకు దూరుడై, పుణ్యపాప రహితుడై తరించునని మొత్తముమీద భావము.

శబ్దా దయ శ్చ విషయా వివిధాశ్చైవ సంపదః
బలం కోశో భృత్యవర్గో రాజ్యం భూమిః సుతాదయః
అజ్ఞాన జన్యా స్సర్వైతే క్షణసంగమ భంగురాః॥

శబ్దస్పర్శరూపరసగంధాదులగు విషయములును, మానుషదైవాది సంపదలును, మహత్తరములగు సేనలును, రాజకోశమును, భృత్యవర్గమును, రాజ్యమును, భూములును, పుత్రాదులును అజ్ఞానము వలన సంభవించినవి. కనుక వీటితోటి సంబంధములన్నియు క్షణికము త్రుటిలో నశించునవి. శబ్దాదులు పుత్రాదులు మొదలగువాటియందు మమత్వము వీడనిదే ఆత్మజ్ఞానము కలుగదని భావము.

అథో త్విష హృదాకామం భావయన్ భక్తి భావితం
అనువర్త్స్య రాజ్యాది భుంజన్ ప్రారబ్ధమన్వహం॥

కనుక రావణునిగూర్చి దుఃఖించినచో లాభములేదు. దుఃఖమును విడిచి లెమ్ము. హృదయమున పరాత్పరుడయిన రాముని ధ్యానించుము. ఆపై నిర్మలమనస్కుడవై ప్రారబ్ధకర్మ ననుసరించి

రాజ్యపాలనాదుల నొనరింపుము. సంచితము, ప్రారబ్ధము, ఆగామి అని కర్మ మూడువిధములు. జన్మజన్మాంతరములనుండిచేసి కూడబెట్టి నది సంచితకర్మ. ఇదివరకు కూడబెట్టిన కర్మలోనుండి కొంతభాగ మును మనము ప్రస్తుతము అనుభవించుచుందుము. ఇది ప్రారబ్ధకర్మ. ముందు చేయబోవునది ఆగామికర్మ. ప్రస్తుతము జీవికి వర్తమానమున కలుగు సుఖదుఃఖాదులన్ని ప్రారబ్ధకర్మ ననుసరించియే అని తెలియ వలెను.

భూతం భవిష్య దభజక్ వర్తమాన మధాచరక్
విహారస్య యథా న్యాయం భవదోషై ర్న లిప్యసే॥

భూతభవిష్యత్తులను గూర్చి చింతించక వర్తమానమును అనా సక్తుడవై అనుభవించినచో సంసారదోషములు నిన్నంటవు. అనగా సంచితకర్మనుగూర్చిగాని ఆగామికర్మనుగూర్చిగాని చింతించక ప్రారబ్ధ కర్మలు యథోచితముగ అనుభవించుచుండినచో సంసారదోషము లంటవని భావము. సంయతేంద్రియుడైనవాడు కర్మ నొనరించుచుండి నను అది అంటదని శ్రుతులుకూడ చెప్పుచున్నవి. "పుష్కరపలాశ ఆపో న శ్లిష్యంతే ఏవమేవంవిది పాపం కర్మ న శ్లిష్యతే" ఛాందో గ్యము. "కర్మణా లిప్యతే పాపేన తత్సుకృత దుష్కృతే ధు నూతే" కౌషీతకి. "కి మహం సాధునాకరవం కి మహం పాపమకరవం" తైత్తిరీయం.

ఆజ్ఞాపయతి రామస్త్వాం యద్భ్రాతుః సాంపరాయికమ్
తత్కురుష్వ యథాశాస్త్రం రుదతీశ్చాపి మోషితః
నివారయ మహాబుద్ధే లంకాం గచ్ఛంతు మాచిరం॥

నీసోదరుడగు రావణుని మృతశరీరమునకు యథాశాస్త్రముగా ప్రాపంచికర్మల నొనర్పుమని రాముడు నిన్ను ఆజ్ఞాపించుచున్నాడు. నీ వాతని ఆజ్ఞ పరిపాలకుడవుకమ్ము. రావణునికై దుఃఖించుచున్న మం డోదరి మొదలగు అంతఃపురస్త్రీలను ఓదార్చి వేగముగా నగరములో నికి పంపించుము.

శ్రుత్వా యథా వద్వచనం లక్ష్మణస్య విభీషణః
త్యక్త్వా శోకంచ మోహంచ రామ పార్శ్వ ముపాగమత్॥

లక్ష్మణుని వాక్యములు సంపూర్ణముగా వినిన విభీషణుడు శోక మోహములను పూర్తిగా త్యజించి శ్రీరామచంద్రుని సన్నిధికి వచ్చెను.

విమృశ్య బుద్ధ్యా ధర్మజ్ఞో ధర్మార్థసహితం వచః
రామస్యైవాను వృత్యర్థ ముత్తరం పర్యభాషత॥

విభీషణుడు సమయోచితమగు ధర్మవిధానము నెరిగినవాడు. కనుక ధర్మప్రయోజనయుతముగా శ్రీరామచంద్రుని అభిప్రాయమును అనువర్తించుట లెస్సయని భావించి ఇట్లు పలికెను

నృశంస మనృతం క్రూరం త్యక్త ధర్మవ్రతం ప్రభో
నాహ్వోఽస్మి దేవ సంస్కర్తుం పరదారాభిమర్శినం॥

రామా ! నేను ఈ రావణకళేబరమును విధిపూర్వకముగా సంస్కరింప గోరుటలేదు. ఇతడు మానవులకు తగని క్రూరకార్యము లనేకముల నొనరించినాడు. అనేకులగు నిరపరాధ మానవులను వధించినాడు. అసత్యభాషణము లాడినాడు. క్రూరముగా సంచరించినాడు. మానవధర్మమును అతిక్రమించుటే వ్రతముగా పెట్టుకొనిన దుష్టుడీతడు. అంతేగాక తల్లులవలె చూడవలసిన పరదారలను బలిమిని చెరబట్టిన అధర్మపరుడు. కాన నే నీతని సంస్కరింపను.

శ్రుత్వా తద్వచనం ప్రీతో రామోవచన మబ్రవీత్
మరణాంతాని వైరాణి నివృత్తం నః ప్రయోజనం
క్రియ తా మస్య సంస్కారో మమా ప్యేష యథాతవ॥

రావణుని పూర్వ దుష్కృత్యములను పూర్వవైరమును తలుచుకొని విభీషణుడు ఇట్లు పలుకగా రాముడు బోధించుచున్నాడు.

విభీషణా ! నీవన్న మాటలు సరికావు. శత్రుత్వము జీవించి ఉన్నంతవరకేగాని మరణాంతరమున ఉండదాయె. దుర్మార్గుడగు ఇతనిని వధించుటతో మనప్రయోజనము నెరవేరినది. ఇప్పు డితడు నీకే

గాక నాకును సోదరునివంటివాడే. కనుక మూడుపలుకక ఇతనికి అగ్ని సంస్కారము గావింపుము.

"నివృత్తం నః ప్రయోజనం, మమా ప్యేష యథా తవ" అన్న మాటలలో ఒక గంభీరార్థ మిమిడియున్నది. దుష్టశిక్షణమే రాముని ప్రయోజనము. కనుకనే అతడు రావణుని వధించినాడు. తా నిట వధించిన రావణునిపై భ్రాతృభావము చూపుట అతని ధార్మికత్వము నకు నిదర్శనము. చుట్టుని దుష్టత్వము ద్వేషింపవలెనుగాని వ్యక్తిని గాదని రాముని భావము. కనుకనే మానవసామ్యమున రావణుని తన సోదరునిగా భావించుచున్నాడు.

రామాజ్ఞాం శిరసా ధృత్వా శీఘ్ర మేవ విభీషణః
సాన్త్వ వాక్యై ర్మహాబుద్ధిం రాజ్ఞీం మందోదరీం తథా॥
సాంత్వ యామాస ధర్మాత్మా ధర్మబుద్ధి ర్విభీషణః
త్వర యామాస ధర్మజ్ఞః సంస్కారార్థం స్వబాంధవా॥

అంతట విభీషణుడు శ్రీరాముని ఆజ్ఞను శిరసాధరించి యుక్తము లగు ఓదార్పుమాటలతో మతిమంతురాలయిన మండోదరిని ఓదార్చి వాడు. రాణులను నగరములోనికి పంపి తన బంధువులను రావణునికి యథావిధిగా అగ్నిసంస్కార మొనర్చుటకు ఏర్పాట్లు గావింపుడని తొందరపెట్టినాడు.

చిత్యాం నివేశ్యవిధివ త్పితృమేధ విధానతః
ఆహి తాగ్నేర్యథా కార్యం రావణస్య విభీషణః
తథైవ సర్వ మకరోద్బంధుభిః సహామంత్రిభిః॥

అనంతరము చందనాది కాష్ఠములచే చితి నిర్మింపబడినది. విభీషణుడు బంధువుల సహాయముతో రావణుని కళేబరమును చితిపై కెక్కించి పితృమేధోక్తప్రకారమున ఆహితాగ్ని అయిన గృహస్థుకు చేసినట్లుగనే అగ్నిసంస్కారాదులకు శ్రౌద్ధకర్మల నొనరించినాడు.

సంస్కారమునే వివరించుచున్నాడు.

దదౌ చ పావకం తస్య విధియుక్తం విభీషణః
స్నాత్వాచై వార్ద్ర వస్త్రేణ తిలాః దర్భాభి మిశ్రితాః
ఉదకేన చ సమ్మిశ్రాః ప్రదాయ విధిపూర్వకమ్॥

రావణుని శరీరమును చితిపైనుంచి విభీషణుడు విధివిధానము ననుసరించి అగ్నిని ముట్టించెను. తరువాత స్నానమొనరించి ఆర్ద్ర వస్త్రముతోడనే దర్భమిశ్రితములయిన తిలోదకములను విధిపూర్వక ముగా వదలెను.

ప్రదాయ చోదకం తస్మై మూర్ధ్నాచైనం ప్రణమ్య చ
తాః స్త్రియోను నయా మాససాన్త్వ ముక్త్వా పునః పునః
గామ్యతామితితాః సర్వా వివిశుర్నగరం తదా ॥

విభీషణు డిట్లు సోదరుడగు రావణునకు తిలోదకములనిచ్చి శిరసా ప్రణమిల్లెను. అనంతరము మండోదరి మొదలగు రావణపత్ను లను ఓదార్చి అంతఃపురమున కంపెను.

ప్రవిష్టాసు చ సర్వాసు రాక్షసీషు విభీషణః
రామ పార్శ్వ ముపాగత్య తదా ఽతిష్ఠ ద్వినీతవత్ ॥

రావణుని రాణులందరును నగరమున ప్రవేశించిన అనంతరము విభీషణుడు శ్రీరామునివద్దకు వచ్చి నమ్రుడై నిలబడెను.

రామో ఽపి సహసైన్యేన ససుగ్రీవః సలక్ష్మణః
హర్షం లేభే రిపూన్ హత్వా యథావృత్రం శతక్రతుః ॥

శ్రీరామచంద్రుడును దేవేంద్రుడు మహాబలశాలియగు వృత్రా సురుని వధించి ఆనందతరంగముల నోలలాడినట్లే రావణ కుంభకర్ణేంద్ర జిదాది శత్రువులను వధించి ససుగ్రీవుడును, సలక్ష్మణుడును, ససైన్య డును అయి ఆనందించెను.

మాతలిశ్చ తదారామం పరిక్రమ్యాభినంద్య చ
అనుజ్ఞాతశ్చరామేణ యయౌ స్వర్గం విహాయసా ॥

యుద్ధమున సహాయమొనరింపవచ్చిన మాతలియు శ్రీరామ చంద్రునకు ప్రదక్షిణనమస్కారములు నాచరించి, అభినందించి, అనుజ్ఞ గొని ఆకాశమార్గమున సరభుడై ఇంద్రలోకమున కేగెను.

తతో హృష్టమనో రామో లక్ష్మణం చేదమబ్రవీత్
విభీషణాయ మే లంకారాజ్యం దత్తం పురైవహి ॥

సంతోషతరంగితస్వాంతుడగు శ్రీరామచంద్రుడు లక్ష్మణుని జూచి ఇట్లు పలికెను–లక్ష్మణా! నేను ఇదివరకే శరణాగతుడయిన విభీషణునకు లంకారాజ్యమును వాగ్దత్త మొనరించియుంటిని. అసగా రావణవధ నొనరించి లంకకు నిన్ను పట్టాభిషిక్తుడ నొనరింతు నంటిని.

ఇదానీమపి గత్వా త్వం లంకామధ్యే విభీషణం
అభిషేచయ విప్రైశ్చ మంత్రవద్విధిపూర్వకం ॥

కనుక ఇప్పుడు నీవు లంకానగరములో ప్రవేశించి నగరమధ్యమున, పౌరజానపదసమక్షమున సింహాసనమును స్థాపించి వేదవేత్తలగు విప్రుల సహాయమున లంకారాజ్యానునకు అధిపతిగా ఇతనిని అభిషేకించుము. పదునాల్గువత్సరములు పూర్తిగానిదే నగరమున ప్రవేశించుట ప్రతిజ్ఞావిరుద్ధము గాన రాముడు లక్ష్మణున కిట్లు ఆదేశించినాడు.

ఇత్యుక్తో లక్ష్మణః తూర్ణం జగామ సహవానరైః
లంకాం సువర్ణకలశైః సముద్రజల సంయుతైః
అభిషేకం శుభం చక్రే రాక్షసేంద్రస్య ధీమతః ॥

రాము డిట్లాజ్ఞాపించగా లక్ష్మణుడు విభీషణ వానరసహితుడై లంకలో ప్రవేశించెను. అచ్చట బంగారు కలశములచే సముద్రజలము లను తెప్పించి రాక్షసప్రభువుగా విభీషణుని అభిషేకించెను. సర్వరాక్షస లోకమునకు ప్రభువుగా విభీషణుడు నియమింపబడినాడని భావము. ఇట్లా శుభకార్యము జరిగిపోయినది.

తతః పౌరజనైః సార్ధం నానోపాయన పాణిభిః
విభీషణః స సౌమిత్రి రుపాయన పురస్కృతః
దండ ప్రణామ మకరో ద్రామస్యా క్లిష్ట కర్మణః ॥

యథావిధిగా లంకారాజ్యమున అభిషిక్తుడయిన విభీషణుడు పౌరజనులతో గలిసి శ్రీరాముని దర్శింప నేగుదెంచెను. అతనితోపాటు లక్ష్మణుడును వచ్చెను. కానుకల నన్నిటిని శ్రీరాముని ముందుంచి అనన్యసాధారణ కార్యసాధకుడగు అతని పాదపద్మములకు సాష్టాంగ దండప్రణామ మాచరించెను.

రామో విభీషణం దృష్ట్వా ప్రాప్తరాజ్యం ముదాన్వితః
కృతకృత్య మివాత్మా న మ మన్యత సహానుజః ॥

అంతట రాముడు ప్రాప్తరాజ్యలక్ష్మీయుతుడై శోభించుచున్న విభీషణుని చూచి ఆనందితహృదయు డయ్యెను. తానుజేసిన ప్రతిజ్ఞ నెరవేరుటచే సోదరునిపోగూడి తనను కృతార్థునిగా భావించెను.

సుగ్రీవం చ సమాలింగ్య రామోవాక్య మథాబ్రవీత్
సహా యేన త్వయా వీర జితో మే రావణో మహాన్
విభీషణో ఽపి లంకాయాం అభిషిక్తో మయా ఽనఘ ॥

అనంతరము శ్రీరాముడు ఆనందాతిరేకమున సుగ్రీవుని ఆలింగన మొనరించి ఇట్లు పలికెను– సుగ్రీవా ! వీరాధివీరుడవగు నీసహాయమున త్రిలోకవిజేతయగు రావణుడు నాచే జయించబడినాడు. నా ప్రతిజ్ఞ ననుసరించి విభీషణుడు లంకారాజ్యమున అభిషిక్తుడయినాడు–అని.

తతః ప్రాహ హనూమంతం పార్శ్వ స్థం వినయాన్వితం
విభీషణ స్యానుమతో గచ్ఛ త్వం రావణాలయం ॥

అనంతరము శ్రీరాముడు తన పార్శ్వమున వినయవినమితోత్త మాంగుడై నిలబడియున్న హనుమంతునిజూచి ఇట్లు పలికెను. "నీవు విభీషణానుమతమున పూర్వపురావణాంతఃపురమునకు బొమ్ము."

జానక్యై సర్వమాఖ్యా హి రావణస్య వధాదికం
జానక్యాః ప్రతివాక్యంమే శీఘ్రమేవ నివేదయ ॥

జానకికి రావణవధ మొదలగు విషయముల నన్నిటిని వివరముగా చెప్పుము. చెప్పిన అనంతరము ఆమె ప్రకటించు భావమును శీఘ్రముగా నాకు నివేదింపుము.

ఏవ మాజ్ఞా పితో ధీమా౯ రామేణ పవనాత్మజః
ప్రవివేశ పురీం లంకాం పూజ్యమానో నిశాచరైః॥

ఇట్లు ఆజ్ఞాపింపబడి బుద్ధి మదగ్రేసరుడగు పవననందనుడు లంకా నగరమున ప్రవేశించెను. హనుమంతుని చూడగనే నిశాచరు లందరును పూజించసాగిరి.

ప్రవిశ్య రావణగృహం శింశపామూల మాశ్రితాం
దదర్శ జానకీం తత్ర కృశాం దీనా మనిందితాం
రాక్షసీభిః పరివృతాం ధ్యాయంతీం రామ మేవ హి॥

అతడు రాక్షసుల పూజలను ఆదరించి రావణాంతఃపురమును ప్రవేశించెను. అట అశోకవనములో శింశాపావృక్షమూలమును ఆశ్ర యించియున్న జానకిని దర్శించెను. జానకి భర్తృవియోగశోకమున కృశించిన శరీరముగలదై యుండెను. ఆమె ముఖమున దీనత్వము ప్రకటితమగుచుండెను. దుష్టుడగు రావణుడు ఎన్నివిధముల హింసించి నను అపమార్గమును పట్టక రామునినే ధ్యానించుచు అతికష్టమున జీవనమును గడుపు ఆమెను రాక్షసస్త్రీలు పరివేష్టించి యుండిరి.

వినయా వనతో భూత్వా ప్రణమ్య పవనాత్మజః
కృతాంజలిపుటో భూత్వా ప్రహ్వోభక్త్యాగ్రతః స్థితః॥

హనుమంతు డామెకు వినయభావమున నమ్రుడై నమస్కరించెను. అనంతరము భక్తినమ్రుడై అంజలిఘటించి ఎదుట నిలబడెను.

తం దృష్ట్వా జానకీ తూష్ణీం స్థిత్వా పూర్వస్మృతిం యయౌ
జ్ఞాత్వా తం రామదూతం సా హర్షా త్సౌమ్యముఖీ భవత్॥

అతనిని జూచి జానకి మొదట ఏమియు మాట్లాడక ఊరకుం డెను. ఆమె కొంత ఆలోచించి పూర్వసంఘటనలను జ్ఞప్తికి దెచ్చు కొనెను. ఆ యెదుట నిలబడినవాడు రామదూతయగు హనుమంతు డని గ్రహించి హర్షితహృదయయై సౌమ్యముఖి యయ్యెను.

స తాం సౌమ్యముఖీం దృష్ట్వా తస్యాః పవననందనః
రామ స్యభాషితం సర్వమాఖ్యాతు ముపచక్రమే॥

హనుమంతుడును సౌమ్యముఖియగు ఆమెను జూచి శ్రీరామచంద్రు డామెకు జెప్పమని చెప్పినదాని నంతను వివరముగా జెప్ప ప్రారంభించెను.

దేవి రామః స సుగ్రీవో విభీషణ సహాయవాన్
కుశలీ వానరాణాం చ సైన్యశ్చ సహలక్ష్మణః॥

దేవీ ! జానకీ ! సుగ్రీవలక్ష్మణసహితుడు, విభీషణ సహాయుడు అగు శ్రీరామచంద్రుడు కుశలముగా నున్నాడు. అతనికి తోడైన వానర సైన్యముకూడ క్షేమముగా నున్నది.

రావణం ససుతం హత్వా సబలం సహమంత్రిభిః
త్వామాహ కుశలం రామో రాజ్యే కృత్వా విభీషణం॥

శ్రీరామచంద్రుడు నిన్నపహరించిన రావణుని, ఇంద్రజిత్తును అతని కుమారుని, అధర్మోపదేశములు నొసరించు అతని మంత్రులను, సైన్యములనుగూడ వధించి ధర్మాత్ముడగు విభీషణుని లంకారాజ్యమున నిలిపినాడు. నిలిపి ఇప్పుడు తన క్షేమవార్తను నీకంపినాడు.

శ్రుత్వా భర్తుః ప్రియం వాక్యం హర్షగద్గదయాగిరా
కిం తే ప్రియం కరోమ్యద్య న పశ్యామి జగత్రయే
సమం తే ప్రియవాక్యస్య రత్నాన్యా భరణానిచ॥

హనుమంతుడు రామ విజయవార్తరూపమయిన ప్రియమును వినిపింపగనే జానకీదేవి ఆనందమును పట్టలేకపోయినది. హర్షాతిశేకమున ఆమెకంఠము గద్గదమయినది. ఆమె ఇట్లనినది. "హనుమా ! నీ వీనాడు నాకు వినిపించిన ప్రియవాక్యముతో సమానమయిన మరొక వస్తువు త్రిలోకములందును కన్పించుటలేదు. చింతామణ్యాది రత్నాభరణాదులన్నియు ఈ ప్రియవాక్యముతో తులతూగునవి కావు. కనుక నీకు నేను చేయవలసిన ప్రతిప్రియమేదో నాకు కన్పించుటలేదు" అని.

ఏవ ముక్తస్తు వైదేహ్యా ప్రత్యువాచ ప్లవంగమః
రతే ఽభూద్వి విధా ద్వా ఽపి దేవరాజ్యాద్విశిష్యతే
హతశత్రుం విజయినం రామం పశ్యామి సుస్థిరం ॥

వైదేహి ఇట్లు పలుకగా ప్లవంగమశ్రేష్ఠుడగు పవననందను డిట్లనెను. "తల్లీ ! నీవు నాకేయవలసిన కానుక లేమియులేవు. త్రిలోకములందలి రత్నసంపదకంటెను, దేవరాజ్యముకంటెను విశిష్టమయిన దొకటున్నది. అది విజయశ్రీ శోభితమగు శ్రీరాముని దివ్యమంగళవిగ్రహము, మహత్తముడగు శత్రువును వధించి సుస్థిరుడయిన శ్రీరాముని దర్శించుటయే నా కన్నిటిని మించిన బహుమానము.

తస్య తద్వచనం శ్రుత్వా మైథిలీ ప్రాహ మారుతిం
సర్వే సౌమ్య గుణాః సౌమ్యత్వయ్యే వపరినిష్ఠితాః
రామం ద్రక్ష్యామి శీఘ్రం మామాజ్ఞాపయతు రాఘవః ॥

మారుతి వచనములను విని ఆమె ఇట్లనెను. సౌమ్యా ! నీలో మంగళప్రదములు చిత్తాహ్లాదకరములు అగు ఉత్తమగుణములు నిండియున్నవి. సరే ! రాముని చూడనలెను. శ్రీరాముడు నన్నాజ్ఞాపించుగాక.

సీతాదేవి రామదర్శనాభిలాషను వ్యక్తపరచిన అసంతరము వాల్మీకమున ఒక చక్కనివిషయము వర్ణింపబడినది. జానకీదేవి కోమల హృదయమును సూచించిన వర్ణన మది. హనుమంతుడు జానకిని ప్రార్థించినాడు.

"అహం త్వేకం వరం దేవి యాచే దివ్యం ప్రియం మహత్, తన్మే ప్రీత్యాప్రయచ్ఛ త్వం రామ శ్చాప్యనుదిశ్యతాం. ఇమాః శ్రుతా మయా పూర్వం రాక్షస్యో విక్రుతాననాః, అసకృత్పరుషం వాక్యం వదంత్యో రావణాజ్ఞయా। ఇచ్ఛామి వివిధైర్ఘోరైస్తాసాం త్వాం తర్జయంతు మేతాః సుదారుణాః । ఘోరాః క్రూరసమాచారావరమేతం ప్రయచ్ఛమే !"

దేవీ ! నిన్ను ఒకవరమును యాచించుచున్నాను. రాముడును అంగీకరించునని భావించుచున్నాను. ఈ వికృతస్వరూపలగు రాక్షస స్త్రీలు రావణుని ఆజ్ఞచే నిన్ను ఆనేకవిధముల బాధించినట్లు వినియున్నాను. దారుణబుద్ధిగల వీరిని అనేక ప్రహరణములచే నొప్పించుటకు అనుజ్ఞను ప్రసాదించుము.

దానికి జానకీదేవి చెప్పిన సమాధాన మిది.

"రాజ సంశ్రయ వశ్యానాం వర్తతీనాం పరాజ్ఞయా। విధేయానాం చ దాసీనాం న క్రుధ్యేత్ స్వవగర్హ భ॥ భాగ్యవైషమ్య దోషేణ పురస్తా ద్దుష్కృతేన చ ప్రాప్త మే తన్మయా సర్వం స్వకృతంహ్యా పభుజ్యతి పాపానాం వా శుభానాం వా వధార్హాణా మధా పివా కార్యకారణ కర్తృత్వే న కశ్చి ద పరాధ్యతి.

ఈ దాసీలు రాజాజ్ఞానువర్తినులు. స్వతంత్రులు గారు, కనుక వీరిపై క్రోధించరాదు. ఇక నే నీకష్టములను అదృష్టవైపరీత్యమున పూర్వకృత కర్మలకు ఫలముగా అనుభవించితిని. శుభాశుభకర్మలలో కార్యకారణసంబంధము ననుసరించి ఏ ఒక్కరును దోషులుకారు" అని.

తథేతి తాం నమస్కృత్య యయౌ ద్రష్టుం రఘూత్తమం
జానక్యా భాషితం సర్వం రామస్యాగ్రేన్య వేదయత్॥

హనుమంతుడు జానకీదేవికి నమస్కరించి రాఘవశ్రేష్ఠుని దర్శింపనేగెను. అతడు రామునకు సీతాదేవిపలుకుల నన్నిటిని సమగ్రముగా నెరింగించెను.

య న్నిమిత్తో య మారంభః కర్మణాం చ ఫలోదయః
తాం దేవీం శోకసంతప్తాం ద్రష్టుమర్హ్సి మైథిలీం॥

రామా! నీవు ఏ జానకీదేవికొరకై రావణవధ రూపమయిన మహత్తరకార్యమును ప్రారంభించి కృతకృత్యుడవైతివో, ఆదేవిని శోక సంతప్తయయిన దానిని చూచుటకు తగుదువు. అనగా జానకీదేవి నీ దర్శనము నభిలషించుచున్నది. మీరు పరస్పరము దర్శించుకొనుము గాక అని భావము.

ఏవముక్తో హనుమతా రామో జ్ఞానవతాంవరః
మాయాసీతాం పరిత్యక్తుం జానకీ మనవేక్షితాం
ఆదాతుం మనసా ధ్యాత్వా రామః ప్రాహ విభీషణం॥

హనుమంతు డీవిధమున పలుకగా రాముడు "ఈ మాయా సీతను పరిత్యజించి అగ్నిహితమయిన వాస్తవమయిన జానకిని పొందు దునుగాక" అని మదిలో భావించి విభీషణునితో ఇట్లు పలికెను.

గచ్ఛ రాజన్ జనకజాం ఆనయాశు మమాంతికం
స్నాతాం విరజవస్త్రాఢ్యాం సర్వాభరణభూషితాం॥

రాజా! నీవు వెంటనే నగరములోనికి వెళ్ళుము. జానకిని అభ్యంగనస్నాత నొనరించి, స్వచ్ఛదుకూలముల గట్టజేసి, సర్వాభరణాలంకృతనొనర్చి నాసమీపమునకు గొనిరమ్ము.

విభీషణోఽపి తచ్ఛ్రుత్వా జగామ సహమారుతిః
రాక్షసీభిః సువృద్ధాభిః స్నాపయిత్వాతు మైథిలీం
సర్వాభరణసంపన్నా మారోప్య శిబికోత్తమే॥

విభీషణుడును శ్రీరాముని ఆజ్ఞ వనుసరించి హనుమంతునితో కలసి నగరమునకు వెళ్ళెను. వయోవృద్ధులగు రాక్షసస్త్రీలచే జానకీ దేవిని మంగళస్నానము జేయించి, సమస్తాభరణభూషితనొనరించి ఉత్తమమగు పల్లకీపై అధిష్ఠింపజేసెను.

యాష్టికై ర్బహుభి ర్గుప్తాం కంచుకోష్ణీషిభిః శుభాం
తాం ద్రష్టు మాగతాః సర్వే వానరా జనకాత్మజాం॥

ఆ పల్లకిని రాక్షససేవకులు రామసమీపమునకు గొనిరాసాగిరి. ఆ పల్లకిని కంచుకోష్ణీషధారులైన యాష్టికులు కాపాడుచుండిరి. (యష్టులను అనగా బెత్తములను ధరించి యుండు అంతఃపురరక్షకులగు షండులు యాష్టికులనబడుదురు) అంతట వానరసేనలు జానకీదేవి ఎట్లుండునో చూడవలెనను కుతూహలములతో గుంపులు గుంపులుగా ఎగబడసాగిరి.

తాం వారయంతో బహవః సర్వతో వేత్రపాణయః
కోలాహలం ప్రకుర్వంతో రామపార్శ్వముపాయయుః॥

వేత్రహస్తులగు కంచుకులు వేలకొలదివానరులను వారించుచు, రామసమీపమునకువచ్చు చుండిరి. అప్పుడు వానరుల కలకలము మిన్ను ముట్టినది.

దృష్ట్వా తాం శిబికారూఢాం దూరా దథ రఘూత్తమః
విభీషణ కిమర్థం తే వానరాః వారయంతిహి॥

శ్రీరాముడు దూరమునుండియే శిబికారూఢయై వచ్చు జానకిని జూచినాడు. ఆమెను దర్శింపకుతూహలపడు వానరులను వారిని వారించు వేత్రహస్తులను జూచినాడు. ఆ కోలాహలమునంతయు జూచి విభీషణునితో ఇట్లు పలికినాడు– విభీషణా ! ఈ కోలాహల మేమిటి ? వేత్రహస్తులు వానరుల నేల వారించుచున్నారు.

పశ్యంతు వానరాః సర్వే మైథిలీం మాతరం యథా
పాదచారేణ సాయాతు జానకీ మమ సన్నిధిమ్॥

వానరులకు జానకి మాతృసదృశురాలు. ఆమెను వానరులం దరును తల్లివలె దర్శించెదరుగాక. కనుక జానకి నావద్దకు ఏతెంచుగాక.

శ్రుత్వా తద్రామవచనం శివికా దవరుహ్య సా
పాదచారేణ శనకై రాగతా రామసన్నిధిమ్ ॥

శ్రీరాముడు విభీషణునితో పలుకు వచనములు సీతాదేవి చెవిని బడినవి. ఆమె వెంటనే శిబికమునుండి దిగి పాదచారిణియై మెల్లిగా శ్రీరాముని సన్నిధికి చేరెను.

రామో ఽపి దృష్ట్వా తాం మాయాసీతాంకార్యార్థనిర్మితాం
అహార్య వాదాన్బహుశః ప్రాహ తాం రఘునందనః ॥

అంతట శ్రీరాముడు రావణవధార్థమై నిర్మితమయిన మాయా సీతను పరిత్యజించి అగ్ని నిహితమయిన నిజసీతను పరిగ్రహించువాడై, తన ఎదుటకు వచ్చిన ఆమెను అనేకవిధముల దుర్భాషలాడెను.

అమృష్యమాణా సా సీతా వచనం రాఘవోదితం
లక్ష్మణం ప్రాహ మే శీఘ్రం ప్రజ్వాలయ హుతాశనం
విశ్వాసార్థం హి రామస్య లోకానాం ప్రత్యయాయచ ॥

శ్రీరాము డాడిన పరుషవాక్యములచే దీనభావమునుపొంది జానకి లక్ష్మణుఁజూచి ఇట్లుపలికెను. "లక్ష్మణా ! శీఘ్రముగా చితిని

పేర్చి అగ్నిని ప్రజ్వలింపజేయుము, అగ్నిలో ప్రవేశించి శ్రీరామున కును, ప్రపంచమునకును నా నిర్దోషిత్వముపై విశ్వాసమును కల్గిం చెదను."

రాఘవస్య మతం జ్ఞాత్వా లక్ష్మణోఽపి తథైవ హి
మహాకాష్ఠచయం కృత్వా జ్వాలయిత్వా హుతాశనం
రామపార్శ్వముపాగమ్య తస్థౌ తూష్ణీ మరిందమ: ॥

సీతాదేవి వచనములనువిని లక్ష్మణుడు శ్రీరాముని ముఖము వైపుకు చూచినాడు. రాముడును ముఖసంజ్ఞచే అమోదమును తెలిపి నాడు. అంతట అతడు పెద్దపెద్ద కాష్ఠములను ప్రోగుచేసి దానికి అగ్నినిచేర్చి జ్వలింపజేసి రాముని పార్శ్వమునకువచ్చి నిలబడినాడు.

తతః సీతా పరిక్రమ్య రాఘవం భక్తిసంయుతా
పశ్య తాం సర్వలోకానాం దేవరాక్షస యోషితాం ॥

అగ్ని ప్రజ్వరిల్లుచుండగా జానకి భర్తయగు రాఘవునికి భక్తి ప్రపత్తులతో ప్రదక్షిణ నమస్కారము లాచరించినది. ఆసమయమున ఆ శోకపూర్ణమగు దృశ్యమును వానరరాక్షసులేగాక ఆకాశసంచారు లగు దేవతలు, మునులుగూడ తిలకించుచుండిరి.

ప్రణమ్య దేవతాభ్యశ్చ బ్రాహ్మణేభ్యశ్చ మైథిలీ
బద్ధాంజలిపుటా చేద మువాజా గ్నిసమీపగా ॥

జానకి బ్రహ్మ, ఇంద్రుడు, రుద్రుడు మొదలగు దేవతలకును, బ్రహ్మజ్ఞానులగు మహర్షులకును అభివందనము లాచరించిన తరువాత హస్తద్వయమును ముకుళిత మొనర్చి ఆమె అగ్నిసమీపమునకు వచ్చి ఇట్లుపలికినది.

యథా మే హృదయం నిత్యం నాపసర్పతి రాఘవాత్
తథా లోకస్య సాక్షీ మాం సర్వతః పాతు పావకః ॥

"నాహృదయము నిత్యము శ్రీరామచంద్రుని దివ్యమంగళవిగ్రహ ధ్యానమునుండి తొలగకుండా ఉండునేని సర్వలోకముల యొక్కయు

సదసత్కర్మలకు సాక్షియగు అగ్నిభగవానుడు నన్ను దగ్ధముగాకుండ రక్షించుగాత."

ఏవ ముక్త్వా తదా సీతా పరిక్రమ్యహుతాశనం
వివేశ జ్వలనం దీప్తం నిర్భయేణ హృదాసతీ ॥

ఇట్లు పలికి జానకి జాజ్వల్యమానుడయిన అగ్నిహోత్రునికి ప్రదక్షిణ మాచరించినది. అనంతరము పతివ్రతయగుటచే నిర్భీకహృదయముతో ఆమె ప్రదీప్తాగ్నిలో ప్రవేశించినది.

దృష్ట్వా తతో భూతగణాః ససిద్ధాః
సీతాం మహావహ్నిగతాం భృశార్తాః
పరస్పరం ప్రాహు రహో స సీతాం
రామః శ్రియం స్వాం కథ మత్యజ జ్ఞః ॥

ఆకాశ సంచారులై ఈ దృశ్యమును జూచు బ్రహ్మేంద్రాది దేవగణములును, సిద్ధసాధ్యాదులును ఒక్కసారిగా శోకసంతప్త హృదయులయి ఆక్రందలయినారు. మహావహ్నిలో ప్రవేశించిన జానకిని చూచి వారు తమలో తాము "ఈ రాముడు అజ్ఞానివలె స్వకీయలక్ష్మియగు జానకిని ఎందులకు పరిత్యజించుచున్నాడు" అని అనుకొనజొచ్చిరి.

అగ్నిప్రవేశవృత్తాంతము ఈగ్రంథమున అతిసంక్షేపముగా వర్ణింపబడినది. అంతియేగాక మాయసీతను పరిత్యజించుటకై రాముడు తలచిన పన్నాగమిదియని స్పష్టపరుచబడుటచే పాఠకహృదయమునకు ఈ ఘటన పాత్రకొనినదిగాదు. కాని అది కవి వాల్మీకికృతరామాయణము. ఈఘట్టము కరుణారసజనకమయిన ఒక మార్మికఘట్టము. అక్కడ జానకి మాయాసీతగాదు. ఆమె శ్రీరాముని సుఖదుఃఖసాక్షిణియగు సాక్షాద్వేదేహాతేసయ. సద్గోషశీలసంపన్న. అట్టి మహాసాధ్వి అగ్నిప్రవేశము మహాకవి కవిత్వధారను ప్రవహింపజేసినది. అభాగమును ఇంచు పొంచుపరచుచున్నాము. పాఠకులు వాల్మీకి కవిత్వామృతమును గ్రోలెదరుగాక–

తాం తు పార్శ్వస్థితాం ప్రహ్వాం రామ స్సంప్రేక్ష్య మేథిలీం
హృదయాంతర్గతక్రోధో వ్యాహర్తు ముపచక్రమే ॥

వానరరాక్షసులు చూచుచుండగ లజ్జాన్వయై తన పార్శ్వ భాగమున నిలబడిన జానకిని చూచి రాముడు క్రోధితహృదయుడై ఇట్లు పలుకదొడగెను.

ఏషాసి నిర్జితా భద్రే శత్రుం జిత్వా మయా రణే
పౌరుషాద్య దనుష్ఠేయం తదేతదుపపాదితం ॥

భద్రే! యుద్ధభూమిలో శత్రువును జయించిన నాచే నీవు నిర్జితురాలవయినావు. పౌరుషశీలియైనవాడు చేయవలసిన కార్యమును చేసినాను.

గతోఽస్మ్యంత మమర్షస్య ధర్షణాసంప్రమార్జితా
అవమాన శ్చ శత్రుశ్చ మయా యుగప దుద్ధృతౌ॥

ని న్నపహరించిన రావణునియెడ జనించిన క్రోధము తన అవ మానదుఃఖమును తొలగిపోయినది. అవమానము శత్రువు అను రెండు శల్యములు ఒక్కసారిగా పెరికివేయబడినవి.

అద్య మే పౌరుషం దృష్ట మద్య మే సఫల శ్శ్రమః
అద్య తీర్ణప్రతిజ్ఞ స్త్వా త్ప్రభవా మీహ చాత్మనః॥

నేడు నాపౌరుషము సాకారమయినది. నాశ్రమ అంతయు ఫలించినది. యథాప్రతిజ్ఞగా కార్యము నొనరించియుండుటచే నా ప్రాభవము వ్యక్తమయినది.

యా త్వం విరహితా నీతా చలచిత్తేన రక్షసా
దైవసంపాదితో దోషో మానుషేణ మయాజితః॥

చంచలమనస్కుడగు రావణునిచే నీవు అపహరింపబడగా తిరిగి జయించినాను. దైవదత్తమయిన ఈదోషమును మనుష్యుడనయిన నేను జయించితిని.

సంప్రాప్త మవమానం య స్తేజసా న ప్రమార్జతి
క స్తస్య పురుషాకోఽస్తి పురుషస్యాల్ప తేజసః॥

ఎవడయినను తనకు సంభవించిన అవమానమును స్వీయ తేజస్సు చే పరిహరించుకొనని వాడు అల్ప తేజస్కు డనబడును. అట్టివానికి పురుషార్థమే లేదు.

లంఘనం చ సముద్రస్య లంకాయా శ్చావమర్దనం
సఫలం తస్య త చ్లాఘ్యం మహత్కర్మ హనూమతః॥

నా యీపురుషార్థసాధనకు తోడ్పడిన హనుమంతుని శ్లాఘ్యపరిశ్రమయు సఫలత నొందినది. సముద్రలంఘనము, లంకాదహనము మొదలగు కర్మలు వ్యర్థములుకా లేదు.

యుద్ధే విక్రమత శ్చైవ హితం మంత్రయతశ్చ మే
సుగ్రీవస్య స సైన్యస్య సఫలో ఽద్య పరిశ్రమః॥

యుద్ధమందును, పరాక్రమ ప్రదర్శనావసరమందును, హితమంత్రాలోచనమందును నాకు సుగ్రీవుడు తోడ్పడినాడు. సేనాసహితుడయిన ఈ వానరరాజుయొక్క మహత్తరశ్రమయు సఫలమయినది.

నిర్గుణం భ్రాతరం త్యక్త్వా యోమాం స్వయముపస్థితః
విభీషణస్య భక్తస్య సఫలో ఽద్య పరిశ్రమః॥

గుణహీనుడై అధర్మపదసంచారియైన సోదరుని త్యజించి ఈ విభీషణుడు నన్ను శరణుజొచ్చినాడు. నాకు పరమభక్తుడయిన ఈతడు విజయమున కన్నివిధముల తోడ్పడినాడు. ఈతని పరిశ్రమయు నా విజయరూపమున ఫలించినది. రాముడు పలికిన వాక్యములం దెచ్చటను సీతాదర్శనమువలన కలిగిన ఆనందమును వెల్లడించక కార్యసాఫల్యమును మాత్రము ఉగ్గడించుటచే నీకై యుద్ధము చేయలేదనియు, కేవలము ప్రభావప్రకటనకే యుద్ధము చేసితిననియు, రావణుని నిర్జించుటతో నాపని తీరిపోయినది. కనుక నీతో నాకేమియు సంబంధము లేదను ధ్వని కలుగుచున్నది.

ఇత్యేవం బ్రువత స్తస్య సీతా రామస్య తద్వచః
మృగీవో త్ఫుల్లనయనా బభూ వాశ్రుపరిప్లుతా॥

శ్రీరాము డీవిధమున నిరాశాద్యోతకములగు వచనములను పలుకగా విని శంకాకులచిత్తయై రాముని ఆడు లేడివలె ఉత్ఫుల్లనయనయై చూడసాగినది. అప్పు డామె నేత్రములు అశ్రుపరిప్లుతములై యుండెను.

పశ్యత స్తాం తు రామస్య భూయః క్రోధో వ్యవర్ధత
ప్రభూ షాజ్యావసిక్తస్య పావకస్యేవ దీప్యతః ॥

సీతాదేవి ఉత్ఫుల్లనయనయై తనను చూడగా రామునికోపము ఆజ్యముపోసిన అగ్నివలె మండినది.

సబద్ధ్వా భ్రుకుటీం వక్త్రే తిర్యక్ప్రేక్షితలోచనః
అబవీ త్పురుషం సీతాం మధ్యే వానరరక్షసాం ॥

అతడు నిటలతలబద్ధ భ్రుకుటీయుగళుడై ముఖము ప్రక్కకు త్రిప్పికొని, క్రోధపూరితకటాక్షముల నామెపై ప్రసరింపజేయుచు వానర రాక్షసులు వినుచుండగా ఇట్లు పరుషములను పలికెను.

యత్కర్తవ్యం మనుష్యేణ ధర్షణాం పరిమార్జతా
తత్కృతం సకలం సీతే శత్రుహస్తా దమర్షణాత్ ॥
బిభ్రతాజీవలోకస్య తపసాభావితాత్మనా
అగస్త్యేన దురాధర్షామునినా దక్షిణేవదిక్ ॥

అవమానమును ప్రతిఘటించుటకు పౌరుషశీలియైనవా డేమి చేయునో దానినంతయు నేను నెరవేర్చితిని. ఆత్మవంతుడగు అగస్త్య మహర్షి దక్షిణదిశను జయించినట్లుగ నేను నిన్ను శత్రుహస్తముల నుండి విడిపించితిని.

విదితశ్చా స్తు తే భద్రే యో ఽయం రణపరిశ్రమః
స తీర్ణ స్సుహృదాం వీర్యా న్నత్వదర్థం మయా కృతః ॥

ఇప్పుడు నీకు నేను ఈయుద్ధపరిశ్రమను ఎందులకుచేసితినో అవగతమై ఉంటుంది. నేను తిరిగి నిన్ను పొందుటకై ఈ మహాశ్రమను చేయలేదు.

రక్షతా తు మయా వృత్త మపవాదం చ సర్వశః
ప్రఖ్యాతస్యా త్మవంశస్య వ్యంగం చ పరిరక్షతా॥

నా శీలమును రక్షించుకొనుటకును, అపవాదము రాకుండుట కును, లోకప్రసిద్ధినందిన నా వంశము అపఖ్యాతి పాలుగాకుండుటకును నే నీ యుద్ధమును ఒనరించితిని.

ప్రాప్తచారిత్ర సందేహా మమ ప్రతిముఖే స్థితా
దీపో నేత్రాతురస్యేవ ప్రతికూలాఽసి మే దృఢం॥

పరగృహమందు వసించుటచే సందేహచరిత్రవైన నీవు నా యెదుట నిలబడి నేత్రరోగికి దీపమువలె ప్రతికూలవుగానే యున్నావు. ఇక్కడ దీపోపమానముచే "నీ శీలమునుగూర్చి వ్యక్తిగతముగా నాకెట్టి సందేహమును లే" దను ధ్వని కలుగుచున్నది.

తద్గచ్ఛాభ్యనుజ్ఞాతా యథేష్టం జనకాత్మజే
ఏతా దశదిశో భద్రేకార్యమస్తి న మే త్వయా॥

జనకాత్మజే! నీతో నాకు పనిలేదు. కనుక నా అనుజ్ఞ ననుస రించి ఈ విశాలవిశ్వములో ఎచ్చటికైనను సరే పోవచ్చును.

కః పుమాన్ హికులేజాతః స్త్రియం పరగృహోషితాం
తేజస్వీ పునరా దద్యాత్ సుహృల్లేఖ్యేన చేతసా॥

ఉత్తమకుల సంజాతుడును, తేజస్సాలియు అగు పురుషు డెవ్వ డును పరగృహవాస మొనర్చిన స్త్రీని శంకారహితమై స్నేహార్ద్రమయిన చిత్తముతో స్వీకరింపలేడు.

రావణాం క పరిభ్రష్టాం దృష్టాం దుష్టేన చేతసా
కథంత్వాం పునరా దద్యాం కులం వ్యపదిశన్ మహత్॥

దుష్టుడగు రావణుని అంకమందు పరిభ్రష్టురాలవై అతనిచే దుష్టచిత్తముతో చూడబడిన నిన్ను నా కులమర్యాదను ఎరుగుండియు ఎట్లు స్వీకరింగలను?

తదర్థం నిర్జితామేత్వం యశః ప్రత్యాహృతం మయా
నాస్తి మే త్వయ్యభిష్వంగో యథేష్టం గమ్యతామితః॥

కులగౌరవరక్షణార్థమును, అవమానపరిమార్జనార్థమును రావణుని మహత్తరయుద్ధమున వధించి నిను విముక్తను జేసినాను. ఈవిధముగా ఆత్మగౌరవమును నిలబెట్టుకొని యశశ్శీలినయినాను. అంతేగాని నీయందలి ఆసక్తిచే ఈయుద్ధ మొనర్చలేదు. కనుక నీవు నీ చిత్తమువచ్చినట్లు వెడలవచ్చును.

ఇతిప్రవ్యాహృతం భద్రే మయైతత్కృత బుద్ధినా
లక్ష్మణే భరతేవాత్వం కురుబుద్ధిం యథా సుఖం॥
సుగ్రీవే వానరేంద్రే వా రాక్షసేంద్రే విభీషణే
నివాసయ మనస్సీతే యథా వా సుఖమాత్మనః॥

నే నీమాటలను కృతనిశ్చయుడనై చెప్పుచున్నాను. కాన నీవు నీచిత్తమువచ్చినచోట నివసింపవచ్చును. లక్ష్మణుడు, భరతుడు, వానరరాజగు సుగ్రీవుడు; రాక్షసేశ్వరుడగు విభీషణుడు వీరిలో ఏ ఒక్కరి వద్దనైనను నీవు ఉండవచ్చును. ఇచ్చట లక్ష్మణాదులను పేర్కొని వారిలో ఎవరియందయినను మనసు నుంచుమనుటలో పుత్రసదృశులైన వీరిలో ఎవరివద్దనయిన ఉండుమని రాముని భావము గాని అన్యథా గాదు. మహాపురుషు లెన్నడును నీచబుద్ధిని ప్రోత్సహించరు.

నహి త్వాం రావణో దృష్ట్వా దివ్యరూపాం మనోరమాం
మర్షయేత చిరం సీతే స్వగృహే పరివర్తినాం॥

సీతా ! దివ్యస్వరూపురాలవు, మనోహరురాలవు అగు నిన్ను తిరిగి నాగృహమున సంచరించుచుండగా చూచి ఈర్ష్యావశుడు కాకుండుగాక.

తతః ప్రియార్హా శ్రవణా తవ ప్రియం
ప్రియాదుప శ్రుత్య చిరస్యమైథిలీ
ము మోచ బాష్పం సుభృశం ప్రవేపితా
గజేంద్ర హస్తాభి హతేవ సల్లకీ॥

చిరకాలము వియోగదుఃఖము ననుభవించియుండుటచే భర్త ప్రథమదర్శనసమయమున ప్రియవాక్యములను వినతగిన జానకి, ప్రాణ

ప్రియుని ఈ అప్రియవాక్యములను విని గజేంద్రహస్తతాడితయైన సల్లకీ లతవలె అల్లలనాడినది. ఆమె నేత్రములు అశ్రుధారాయుక్తము లయినవి.

ఏవముక్తా తు వైదేహీ పరుషం రోమహర్షణం
రాఘవేణ సరోషేణ భృశం ప్రవ్యథితాభవత్ ॥

రోషయుక్తుడయిన శ్రీరాము డీవిధమున పరుషవాక్యములను పలుకగా వైదేహి మిక్కిలి వ్యథితహృదయ యయ్యెను.

సా తదశ్రుత పూర్వం వై జనే మహతి మైథిలీ
శ్రుత్వా భర్తృవచోరూక్షం లజ్జయా వ్రీడితాభవత్ ॥

కోట్లకొలది వానరరాక్షసులున్న ఆ మహాసభలో ఇదివరకు ఎన్నడును వినని పరుషవాక్యములను భర్తృముఖమున విని జనకపుత్రి లజ్జావనతముఖి యయ్యెను.

ప్రవి శంతీవగాత్రాణి స్వాన్యేవ జనకాత్మజా
హాక్చల్యా మైస్స శల్యేవ భృశ మశ్రూణ్యవర్తయత్ ॥

భర్తృవాక్యములకు ఎంతో వ్రీడితయైనది. ఆమె ఆవాక్యము లను వినలేక సంకుచితగాత్ర యైనది. ఆమె అంగములన్నియు ఆమె యందే విలీనమయినట్లనిపించినది. వాక్శూలవ్యథితమయిన ఆమె నేత్ర ములు రోగజుష్టములువలె అశ్రువులను వర్షించనారంభించినవి.

తతో బాష్ప పరిక్లిష్టం ప్రమార్జంతీ స్వమాననం
శనై ర్గద్గదయా వాచా భర్తారమిద మబ్రవీత్ ॥

బాష్పధారలచే మలినమయిన తనముఖమును తుడుచుకొనుచు, జానకి గద్గదకంఠముతో భర్తనుగూర్చి ఇట్లు పలికెను.

కిం మా మసదృశం వాక్యమేదృశం శ్రోత్రదారుణం
రూక్షం శ్రావయసే వీర ప్రాకృతః ప్రాకృతామివ ॥

వీరా ! నీవట్లు నన్ను శ్రోత్రదారుణముగా అనకూడని మాట లను అనుచున్నావేమి ? సాధారణమానవుడు సాధారణమగు తన భార్యను మాటాడినట్లు కఠినముగా మాట్లాడుచున్నావు.

న తథాస్మి మహాబాహో యథాత్వమవగచ్ఛసి
ప్రత్యయంగచ్ఛ మేయేన చారిత్రేణైవ తేశపే ॥

మహాబాహూ ! నీవు నన్ను దుష్టురాలుగా భావించుచున్నావు. కాని నీ యీభావము సరియైనదిగాదు. నీపై శపథమొనర్చి చెప్పుచున్నాను. నా శీలమునొక్క భద్రతనుగూర్చి విశ్వసించుము.

పృథక్ స్త్రీణాం ప్రచారేణజాతింతాం పరిశంకసే
పరిత్యజేమాం శంకాంతు యదితే ఽహం పరీక్షితా ॥

శీలభ్రష్టలయిన సాధారణస్త్రీల ప్రాచుర్యమును భావించి స్త్రీ జాతి నంతను శంకించుచున్నావు. ఇదివరకు నాశీలమును నీవు పరిశీలించియే యొండినచో ఈ శంకాభావమును పరిత్యజించుము. ఎవరో కొందరు దుష్టస్త్రీల నాధారముగాగొని స్త్రీజాతినంతను, అందులో నావంటి పతిపరాయణను శంకించరాదని భావము.

యద్యహం గాత్ర సంస్పర్శం గతాస్మి వివశాప్రభో
కామకారోనమేత్రత్ర దైవం తత్రా పరాధ్యతి ॥

అపహరించుకాలమున దుష్టుడగు రావణుని గాత్రము నాగాత్రమునకు తగిలినదనుమాట యున్నది. వాస్తవమున కాసమయమున నేను వివశను. ఆసమయమున నాభావమున కామమనునది కించిత్తయినను లేదు. నాకుజరిగిన ఆపరాభవమునకు విధివిధానమే కారణముగాని అన్యముగాదు.

మద ధీనంతు యత్తన్మే హృదయంత్వయివర్తతే
పరాధీనేషు గాత్రేషు కిం కరిష్యామ్య నీశ్వరా ॥

నా హృదయము నిత్యము నా అధీనమునను ఉన్నది. అది నీయందే ప్రవర్తిల్లుచున్నది. గాత్రము పరాధీనమయినది. అశక్తురాలను, వివశురాలను అగు నే నాసమయమున ఏమిచేయగలను ?

సహాసంవృద్ధ భావాచ్చ సంసర్గేణ చ మానద
యద్యహంతేన విజ్ఞాతా హతా తేనాస్మి శాశ్వతం ॥

నాకు వివాహ మయిననాటినుండియు నీతోడనే పెరిగితిని. నీతోడనే కలిసియుంటిని. (శీల స్వభావాదులను గ్రహించుటకు అధికముగా తోడ్పడునవి ఈ రెండు ముఖ్యసాధనములు.) అయినప్పటికి నా హృదయము నీకు తెలియకపోయినదనగా నేను శాశ్వతముగా ఆహితుకాల నయితి నన్నమాట.

ప్రేషితస్తే యదా వీరో హనుమా నవలోకకః
లంకాస్థాహం త్వయా వీర కిం తదాన విసర్జితా॥

రామా! నీవు నన్ను న్వేషించుటకై హనుమంతుని పంపినప్పుడే "నిన్ను విసర్జించుచున్నా" నని వార్తనంపలేదు.

ప్రత్యక్షం వానరేంద్రస్య త్వద్వాక్య సమనంతరం
త్వయా సంత్యక్తయా వీరత్యక్తం స్యా జ్జీవితం మయా॥

నీ పీవిషయమును అప్పుడే హనుమన్ముఖమున వార్తగా పంపి నచో భర్తచే త్యజించబడిన నేను ఆవార్త వినిన వెంటనే వానరశ్రేష్ఠుడగు హనుమంతుని ఎదుట ప్రాణత్యాగ మొనర్చియుండెడిదానను.

న వృథా తే శ్రమో ఒయం స్యా త్సంశయే ఒన్యస్య జీవితం
సుహృజ్జనపరిక్లేశే న చాయం నిష్ఫలస్తవ॥

అన్నీ అయియుండినచో నీకీ పరిశ్రమయే యుండెడిదికాదు. ఈ యుద్ధములో జీవితసంశయకారకములగు సంఘటనలు ఘటిల్లియుండెడివి కావు. సుగ్రీవాదులగు ఈ నీమిత్రులకును యుద్ధక్లేశము సంభవించి యుండెడిదిగాదు.

త్వయా తు నరశార్దూల క్రోధ మేవాను వర్తతా
లఘు నైవ వనుష్యేణ స్త్రీ త్వ మేద పురస్కృతం॥

రామా! నీవీసమయమున క్రోధమను దుర్గుణమునకు వశుడవై యున్నావు. అకారణమునసే సామాన్యమానవునివలె మాట్లాడు చున్నావు. పిపేకాది గుణరహితుడయిన ప్రాకృతుడు ఇట్టి పట్టులందు నీవలెనే మాట్లాడును. నీవు స్త్రీత్వమును మాత్రమే పురస్కరించు

కొని మాట్లాడుచున్నావు గాని నా ఉత్కృష్టగుణగణమును లెక్కించుట లేదు.

తన అలౌకిక స్త్రీత్వమును జ్ఞప్తికి తెచ్చుచున్నది.

అపదేశేన జనకాన్నోత్పత్తి ర్వసుధాతలాత్
మమ వృత్తం చ వృత్తజ్ఞ బహుతేన పురస్కృతం॥

నాజన్మప్రకారము నీకు తెలియనిదికాదు. జనకుడు నిమిత్తమాత్రుడుగా నేను భూదేవినుండి జనించిన అయోనిజను. అంతేగాక నా సౌశీల్యమును నీవు బాల్యమునుండియు ఎరిగియేయున్నావు. ఈ నా అలౌకికస్త్రీత్వమును, సౌశీల్యమును విస్మరించి క్రోధవశుడవౌచున్నావు. అయోనిజ యగు స్త్రీ అపవిత్ర యగుట అనునది ఉండదు. కాన సీత అపవిత్రురాలు కాదని భావము.

న ప్రమాణీ కృతః పాణిర్బాల్యే బాలేన పీడితః
మమ భక్తిశ్చ శీలం చ సర్వం తే పృష్ఠతః కృతం॥

బాల్యనయస్సునసే నీవు నా పాణిగ్రహణము నొనరించితివి. అనాటినుండి నాసర్వస్వమగు భక్తిని శీలమును నీకే సమర్పించితిని. ఆ పాణిగ్రహణమునుకూడ నీవు వెనుకకు నెట్టితివి. దానిని ప్రమాణముగా నీవు గ్రహించుటలేదు.

ఏవం బ్రువాణామదతీ బాష్ప గద్గదభాషిణీ
అబ్రవీల్లక్ష్మణం సీతా దీనం ధ్యాన పరం స్థితం॥

సీతాదేవి రామునితో ఇట్లు పలికి రామ కృత సీతాతిరస్కారమున దీనుడై ధ్యాననిమగ్నుడైయున్న లక్ష్మణునితో గద్గదస్వరముతో ఇట్లు పలికెను.

చితాం మే కురు సౌమిత్రే వ్యసన స్యాస్య భేషజం
మిథ్యోపధూతో హతా నాహం జీవితుముత్సహే॥

లక్ష్మణా! నా కోసమయమున కలిగిన మహత్తరమగు ఈబాధకు మందు అగ్నిప్రవేశమే. మిథ్యాపవాద మనెడు ఈ ఆఘాతమును సహించి జీవించజాలను. కాన నాకు చితిని ఏర్పాటుచేయుము.

అప్రీతస్య గుణై ర్భర్త్రా త్యక్తాయా జనసంసది
యాక్షమా మేగతి ర్గంతుం ప్రవేక్ష్యా మ్యవాహనం ॥

పవిత్రగుణ సంపన్న రాలనై యుండియు ఈ మహాసభలో అప్రీతుడయిన భర్తచే త్యజించబడినాను. భర్త పరిత్యక్త నయిన నాకు అగ్నిప్రవేశము తప్ప మరియొక మార్గము లేదు.

ఏవముక్తస్తు వైదేహ్యా లక్ష్మణ పరవీరహా
అమర్షవశమాపన్నో రాఘవానన మైక్షత ॥

వైదేహి ఇట్లు పలుకగా లక్ష్మణుని హృదయ అమర్షభావము నకు వశమయినది. శత్రుహంతకుడగు అతడు దీనవదనుడై రాముని ముఖమును వీక్షించెను.

స విజ్ఞాయ తత శ్చింద రామ స్యాకారసూచితం
చితాం చకార సౌమిత్రి ర్మతే రామస్య వీర్యవా ॥

లక్ష్మణుడు రాముని ముఖముద్రలోనే అతని ఇంగితమును గ్రహించెను. సోదరుని ఆకారవిశేషమునచే అతని హృదయభావమును గ్రహించిన అతడు ఒక చితిని ఏర్పాటుచేసెను.

అధోముఖం తతా రామం శనైః కృత్వా ప్రదక్షిణం
ఉపాసర్పత వైదేహీ దీప్యమానం హుతాశనం ॥

అంతట జానకి అధోముఖుడై కూర్చొనియున్న రామునికి ప్రదక్షిణనమస్కారముల నొనర్చి దేదీప్యమానుడయిన అగ్నిహోత్రుని సమీపించెను.

ప్రణమ్య దేవతాభ్య శ్చ బ్రాహ్మణేభ్య శ్చ మైథిలీ
బద్ధాంజలిపుటా చేద మువా చాగ్ని సమీపతః ॥

అంతట మైథిలి దేవబ్రాహ్మణులకు ప్రణామ మాచరించి బద్ధాంజలియై అగ్నిని సమీపించి ఇట్లు పలికినది.

యదా మే హృదయం నిత్యం నాపసర్పతి రాఘవాత్
తథా లోకస్య సాక్షీమాం సర్వతః పాతు పావకః ॥

నిజముగా నాహృదయము శ్రీరామునినుండి కించిత్తయినను భ్రంశతనందదేని లోకకర్మలకు సాక్షిభూతుడయిన అగ్నిభట్టారకుడు వన్ను రక్షించుగాక !

యథామాం శుద్ధచారిత్రాం దుష్టాం జానాతి రాఘవః
తథా లోకస్య సాక్షీమాం సర్వతః పాతువావకః ॥

విశుద్ధచరిత్రురాలయిన నన్ను రాముడు శంకించుచున్నాడు. నేను నిజముగా విశుద్ధచారిత్రనే అయినచో అగ్నిహోత్రుడు నన్ను రక్షించుగాక !

కర్మణా మనసా వాచా యథా నాతి చ రామ్యహం
రాఘవం సర్వధర్మజ్ఞం తథా మాంపాతు పావకః॥

మనోవాక్కాయకర్మలచే నేను సమస్త ధర్మవేత్తయయిన శ్రీరామచంద్రుని అతిక్రమించి చరించనేని ఈ పావకుడు నన్ను రక్షించుగాక.

ఆదిత్యో భగవాన్ వాయుః దిశశ్చంద్ర స్తథైవ చ
అహశ్చాపితథా సంధ్యే రాత్రిశ్చ పృథివీ తథా
యథాన్యేపి విజానంతి తథా చారిత్ర సంయుతాం॥

సర్వకర్మసాక్షి యగు ఆదిత్యుడును సర్వత్రసంచరించు వాయు దేవుడును, దిక్కులును, చంద్రుడును, రాత్రింబగళ్ళును, ఉభయ సంధ్యలును నా విశుద్ధచారిత్రతను ఎరిగియున్నవి. ఇంతేగాక ఇంకను ఏ యే దేవతలు నా పరిశుద్ధతను ఎరిగియున్నారో వారందరును నన్ను రక్షింతురుగాక !

ఏవముక్త్వా తు వైదేహీ పరిక్రమ్య హుతాశనం
వివేశజ్వలనం దీప్తం నిస్సంగే నాంతరాత్మనా ॥

ఇట్లు జానకి సమస్తదేవతలకు నమస్కరించి హుతాశనునికి ప్రదక్షిణ నమస్కారము లాచరించినది. తరువాత తన హృదయమును అన్యములగు బంధనములచే రహితముగా నొనరించి నిస్సంతమనస్కయై ప్రజ్వలితాగ్నియందు ప్రవేశించినది.

జన స్యనుమహాం స్త్రీ స్తో బాలవృద్ధ సమాకులః
దదర్శ మైథిలీం తత్ర ప్రవిశంతీం హుతాశనం ॥

జానకి ఇట్లు అగ్నిప్రవేశము చేయుచుండగా అచ్చట చేరియున్న జనసమూహము బాలవృద్ధసంయుతమయినది. హాహాకారముల నొనర్చినది. అచ్చట కూడియున్న సమూహమంతయు అగ్నిప్రవేశమొనర్చిన మైథిలిని దర్శించిరి.

సాతప్త నవహేమాభాతప్త కాంచన భూషణా
పపాత జ్వాలనందీప్తం సర్వలోకస్య సన్నిధౌ॥

పదారువన్నె బంగారును మించిన శరీరముగల ఆమె బంగారు ఆభరణములను ధరించి జాజ్వల్యమానమైన అగ్నిలో ప్రవేశించినది. దీప్తాగ్నిలో ప్రవేశించ ఆమెను మూడులోకములవారును చూచిరి.

దదృశుస్తాం మహాభాగాం ప్రవిశం తీం హుతాశనం
సీతాం కృతాన్న స్త్రయోలోకాః పుణ్యామాజ్యాహుతీమివ॥

మహత్తరమగు శీలముగల జానకీదేవి అగ్నిలో ప్రవేశించుట పవిత్రమగు ఆజ్యాహుతి అగ్నిలో ప్రవేశించినట్లున్నది. ఆదృశ్యమును ఆసమయమున మూడులోకములును దర్శించినవి.

ప్రచు క్రుశు స్త్రియస్సర్వాస్తాం దృష్ట్వాహన్యవాహనే
పతంతీం సంస్కృతాం మంత్రైర్వసోర్ధారా మివాధ్వరే॥

అగ్నిలో ప్రవేశమొనర్చుచున్న జానకి యజ్ఞవిధానమున మంత్రసంస్కృతమైన ఆజ్యధారవలె నున్నది. అట్టి ఆమె అగ్నిలో ప్రవేశించుచుండగా అచ్చట చేరిన స్త్రీలందరును ఆక్రోశించిరి.

దదృశుస్తాం త్రయోలోకా దేవగంధర్వ దానవాం
శప్తాం పతంతీం నిరయే త్రిదివాద్దేవతా మివ॥

శాపగ్రస్తయై స్వర్గలోకమునుండి నరకమునందు జారిపడుచున్న దేవతవలెనున్న జానకిని దేవగంధర్వాదులగు త్రిలోకములవారును చూచిరి.

తస్యా మగ్నిం విశంత్యాం తు హాహేతి విపుల స్వనః
రక్షసాం వానరణాం చ సంబభూవాద్భుతోపమః॥

పరమపవిత్రయగు సీతాదేవి అగ్నిప్రవేశ మొనర్చుచుండగా దిక్కులన్నియు హాహారవముతో నిండిపోయినవి. వానర రాక్షసుల దృశ్యము అత్యద్భుతముగా కన్పడినది.

తతో హీ దుర్మనా రామః శ్రుత్వైవ వదతాగిరః
దదౌ్య ముహూర్తం ధర్మాత్మా బాష్పవ్యాకులలోచనః॥

పరమపవిత్రయగు జానకి ఇట్లు అగ్నిప్రవేశ మొనర్చినప్పుడు పలికిన వలుకులను వినుచు దుఃఖపరీతచేతస్కుడయ్యెను. ధర్మాత్ముడగు అతడు ముహూర్తకాలమున బాష్పవ్యాకులనేత్రుడయ్యెను.

త్ర యో ద శ స ర్గ

శ్రీరాముని పరుషవాక్యములను విని పతివ్రతాశిరోమణి యగు సీతాదేవి అగ్నిప్రవేశముచేయగా రాముని ఉద్దేశ్యమును గ్రహించ జాలని బ్రహ్మాదిదేవతలు, ఇంద్రాది దిక్పాలురు, మునులు, ఋషులు విస్మయాశ్చర్యచకితహృదయులై ఆస్థలమునకు వచ్చి శ్రీరాముని పరమాత్మగా స్తుతించ నారంభించిరి.

శ్రీ మహా దేవ ఉవాచ :—

తతః శక్రః సహస్రాక్షః యమ శ్చ వరుణ స్తథా
కుబేర శ్చ మహాతేజాః పినాకీ వృషవాహనః
బ్రహ్మా బ్రహ్మవిదాం శ్రేష్ఠో మునిభిః సిద్ధచారణైః
ఋషయః పితరః సాధ్యా గంధర్వాప్సరసోరగాః ॥
ఏతే చాన్యే విమానాగ్ర్యై రాజగ్ము ర్యత్ర రాఘవం
అబ్రువ న్పరమాత్మానం రామం ప్రాంజలయ శ్చ తే॥

ఇట్లు మహాపతివ్రతయగు సీత దేవి తన నిర్దోషత్వమును స్థాపించుకొనుటకు అగ్నిప్రవేశమొనరింపగా వ్యాకులచిత్తులగు దేవతలందరు విచ్చేసిరి. వేయినేత్రములు గల దేవేంద్రుడును, అతని అనుచరులగు యమవరుణకుబేరులును, వృషభవాహనారూఢుడయిన పినాకపాణియు, అచ్చటికి ఆకాశమార్గమున వచ్చిరి.

బ్రహ్మజ్ఞానులలో శ్రేష్ఠుడయిన చతుర్ముఖప్రజాపతి హంసవాహనారూఢుడై సనకసనందనాది మహర్షులును, సిద్ధచారణులును పరివేష్టింప ఏతెంచెను. ఇంకా ఇతరమహర్షులును, పితృదేవతలును, సాధ్యులును, గంధర్వులును, అప్సరసలును, ఉరగులును వచ్చిరి. వీరే గాక ఇంకను ఇతర దేవగణములు తమతమ విమానాదివాహనముల నధిష్టించి సీతాగ్ని ప్రవేశస్థలమును చేరిరి. వారందరును చేతులను జోడించి నమస్కరించి పరమాత్మయగు రాముని ఇట్లు స్తుతింపసాగిరి.

కర్తా త్వం సర్వలోకానాం సాక్షీ విజ్ఞానవిగ్రహః
వసూనా మష్టమో ఽసి త్వం రుద్రాణాం శంకరో భవాన్॥

దేవా ! నీవు సమస్తబ్రహ్మాండములను సృజించువాడవు. సర్వ లోకకృత్యములకు సాక్షిగానుండి పరిశీలించువాడవు. విజ్ఞానమే (అనుభవపూర్వకజ్ఞానము) రూపముగా గలవాడవు. సచ్చిదానందమయుడగుటచే రామస్వరూపము అనుభవపూర్వకముగ గ్రహింపవలసినదే గాని ఇంద్రియగోచరమగునది గాదని భావము. అష్టవసువులలో ఎనిమిదవవాడవు నీవు. ఏకాదశ రుద్రులలో శంకరుడను రుద్రుడవు నీవు. "వసూనాం పావకశ్చాస్మి" "రుద్రాణాం శంకరశ్చాస్మి" అను గీతా వచనముల ననుసరించి వస్తువులలో పావకుడు, రుద్రులలో శంకరుడు పరమాత్మయగు రామునిస్వరూపము లే.

ఆదికర్తా ఽసి లోకానాం బ్రహ్మా త్వం చతురాననః
అశ్వినౌ ఘ్రాణభూతౌ తే చక్షుషీ చంద్రభాస్కరౌ॥

అనంతకోటిబ్రహ్మాండములను సంకల్పముద్వారా సృష్టించు ఆదిపురుషుడవునీవు. దేవమర్త్య, తిర్యగాది ప్రాణికోటులను సృష్టించు చతుర్ముఖబ్రహ్మవును నీవే. దేవవైద్యులగు అశ్వినీదేవతలు నీఘ్రాణేంద్రియ స్థానీయులు. చంద్రభాస్కరులు నేత్రస్థానీయులు. "అశ్వినౌ ఘ్రాణభూతౌ తే" అన్నదగ్గరనుండి పరమాత్మయగు శ్రీరాముని విరాట్పురుషస్వరూపము వర్ణింపబడినది.

లోకానా మాదిరంతో ఽసి నిత్య ఏకః సదోదితః
సదాశుద్ధః సదాబుద్ధః సదాముక్తో గుణోదయః॥

నీవు సృష్టియొక్క ఆద్యంతస్వరూపుడవు. సృష్టించువాడు, లయమొనరించువాడు అనిగాని, సృష్టికి ఆదియందు లయమయిన తరువాతగూడ ఉండువాడని భావము. సత్యుడవు. బంధనరహితుడవు. రాత్రిందినవ్యవహారరహితుడవై నిత్యము ప్రకాశించువాడవు. పరిశుద్ధుడవు. సదా జాగరూకుడవు. సర్వగుణకారణుడవు.

త్వన్మాయాసంవృతానాం త్వం భాసి మానుషవిగ్రహః
త్మన్మామస్మరతాం రామ సదాభాసి చిదాత్మకః ॥

భవదీయ మాయాంధకారముచే సమ్మోహితులగువారికే నీవు మానవుడుగా తోచుచుందువు. కాని నిత్యము నీ పవిత్రనామస్మరణ మొనర్చు భక్తులకు చైతన్యస్వరూపుడవుగా కన్పట్టుచుందువు. నామ స్మరణచే రాముని నిర్గుణము సర్వవ్యాపకస్వరూపజ్ఞానము కలుగు నని భావము.

రావణేన హృతం స్థాన మస్మాకం తేజసా సహ
త్వయా ఽద్య నిహతో దుష్టః పునః ప్రాప్తం పదం స్వకం ॥

త్రిలోక విజయియగు ఈ రావణుడు మా మా స్థానములను, మా మా తేజస్సులను అపహరించినాడు. ఇంతకాలమునకు నీవతనిని వధించుటచే మేము స్వీయాధికారములను పొందగలిగితిమి.

ఏవం స్తువత్సు దేవేషు బ్రహ్మా సాక్షాత్పితామహః
అబ్రవీ త్ప్రణతో భూత్వా రామం సత్యపథి స్థితం ॥

ఈవిధముగ సర్వదేవతలు పరాత్పరుడగు రాముని స్తోత్ర మొన రింపగా సర్వలోకపితామహుడగు చతురాననుడు సత్యస్వరూపుడగు అతనిని ఇట్లు ప్రార్థించెను.

బ్రహ్మోవాచ:—

వందే దేవం విష్ణు మశేషస్థితిహేతుం
త్రాయా మధ్యాత్మజ్ఞానిభి రన్తర్హృది భావ్యమ్
హేయా హేయద్వంద్వవిహీనం పర మేకం
సత్తామాత్రం సర్వహృదిస్థం దృశిరూపం ॥

అవతార ప్రాదుర్భావ పూర్వము చతురాననుడు విష్ణువును స్తుతించి మానవరూపమున అతడు చేయవలసిన కార్యజాతమును వేరొకినాడు. దానిలో ముఖ్యభాగము నిశ్శేషముగా సంపాదిత మయినది. దానిచే బ్రహ్మసంస్తుతుడై స్తోత్రరూపమున రాముని పర

మాత్మత్వమును లోకమునకు నెల్లడించుచున్నాడు. రామా! నీవు అలౌకికుడవు. పరాత్పరుడవు. నీకు వందనములు. కార్యవశమున అర్వాచీనుడవుగా, దశరథపుత్రుడవుగా లోకమునకు కన్పించుచున్నను నీ వాస్తవస్వరూప మిదిగాదు. నీవు విష్ణుస్వరూపుడవు. అనగా సర్వవ్యాపకుడవు. సమస్త బ్రహ్మాండస్థితికి కారణుడవు. చిరకాలము మననిధిధ్యాసలద్వారా ఆత్మతత్వమును గ్రహించుటకు ప్రయత్నమొనర్చిన మహర్షుల ప్రయత్నఫలముగా వారి హృదయములందే అనుభవనీయమగు స్వరూపము గలవాడవు. అనగా అధ్యాత్మవేత్తల హృదయమందే భావించదగినవాడని భావము. ఇది హేయము, ఇది అహేయము అను ద్వంద్వభావము లేనివాడవు. హేయమనగా పరిహరించదగినది. దుఃఖము, కష్టము, పాపము మొదలగునవి అహేయమనగా వదలక గ్రహించదగినవి. సుఖము, సంతోషము, పుణ్యము మొదలగునవి. పరమాత్మ ఈద్వంద్వదృష్టి లేనివాడు సర్వసమానుడు. లేక హేయమనగా అసత్, అహేయమనగా సత్. సదసద్రూపమయిన భేదము లేనివాడు. అనగా నిత్యసద్రూపుడు. కనుకనే ద్వంద్వాతీతుడగు పరసంజ్ఞుడు. సర్వము అతనే అగుటచే ఏకసంజ్ఞుడు. సత్తామాత్రుడు అనగా భావమేగాని అభావమనునది లేనివాడు. సర్వహృదయములందు అంతర్యామిగా వ్యాపించి ఉండువాడు. దృగ్రూపుడు అనగా జ్ఞానస్వరూపుడు. ఏతాదృశలక్షణవిశిష్టుడగు రామునికి వందన మాచరించుచున్నాను. ఔపనిషదకమయిన ఆత్మకు సంబంధించిన విశేషణములన్నియు రామునికై ప్రయోగింపబడినవి. కనుక రామపరమాత్మల అభేదత్వము స్థిరీకరింపబడినది.

రాముని పరమాత్మత్వమును ప్రతిపాదించి అది యతీశ్వర ప్రయత్నవిషయమని చెప్పుచున్నాడు—

ప్రాణాపానౌ నిశ్చయబుద్ధ్యా హృది రుద్ధ్వా
ఛిత్త్వా సర్వంసంశయబంధం సరసోఽన్తఃస్థం
పశ్యంతీశం యం గతమోహా యతయ స్తం
వందే రామం రత్నకిరీటం రవిభాసమ్ ॥

యోగాభ్యాసనిరతులగు యతీశ్వరులు సర్వాంతర్యామియు, ప్రకాశస్వరూపుడును అగు పరమాత్మను దర్శించవలయునన్నెడి దృఢ చిత్తముతో హఠాదియోగములను అభ్యాసమొనరింతురు. అట్టివారు కుంభకవిధానమున ఉచ్ఛ్వాసంచారియగు ప్రాణవాయువును, అధస్సంచారి యగు అపానమును హృదయమందు బంధించుదురు. తత్కారణమున ఈశ్వరుడు ఉన్నాడా లేడా? అను సమస్తశంకలను విచ్ఛిత్తినొనరించు దురు. అంతట వారి పాపకల్మషములన్నియు నశించిపోగా మోహా నిర్ముక్తులగుదురు. మోహము అను మేఘసమూహము విచ్ఛిత్తి నంద గనే జ్ఞానము అను ప్రకాశము గోచరించును. దానితో వారు తాము దర్శింపదలచిన చైతన్యస్వరూపుడగు పరమాత్మను దర్శింతురు. అట్టి యతీశ్వరధ్యేయుడగు పరమాత్మవు నీవే. మాయామానుషుడవుగా ప్రకటితుడవైనావు. ఈరూపమున రత్నకిరీటమును ధరించి జగత్ప్రకాశ దాయకుడయిన సూర్యునివలె ప్రకాశించు నీకు వందనములు.

హఠయోగాదుల నభ్యసించు సామాన్యయోగులకును ఈశ్లోక మందు వర్ణింపబడిన యోగులకును భేదము కలదు. సామాన్యముగా యోగాభ్యాసము శరీరాంతఃశుద్ధినిగోరి చేయబడుచున్నది. అంతేగాక పాతంజలయోగశాస్త్రము ననుసరించి చిత్తవృత్తినిరోధమున ఈశ్వర ప్రణిధానము నొందుటే అభిప్రేతము. కాని ఇక్కడ బ్రహ్మవిషయిక జ్ఞానమునకు సాధనముగనే యోగము అంగీకరింపబడినది. కుంభకవిధాన మున ప్రాణాపానములను బంధించినచో పరమాత్మను అనుభవపూర్వ కముగా గ్రహింపవచ్చును. అయితే దానికి నిశ్చయబుద్ధి అవసరము. అది సంశయమును నివారించును. దానితో విషయబంధములు తొలగి అజ్ఞానము లేక భ్రమ నశించిపోవును. అప్పుడే యోగులు ఆత్మను దర్శింపగలరని భావము.

మాయాతీతం మాధవ మాద్యం జగదాదిం
మానాతీతం మోహవినాశనం మునివంద్యం
యోగిధ్యేయం యోగవిధానం పరిపూర్ణం
వందే రామం రజితలోకం రమణీయం॥

తాను జగద్రూపమున పరివర్తితమై జీవులను మోహబంధమున బంధించి సంసారసాగరమున పరిభ్రమింపజేయు ప్రకృతికంటె అతీతుడై యుండు పరమాత్మవు నీవు. రామా ! నీవే సర్వజగన్మంగళాలయ యగు లక్ష్మీదేవికి ప్రియుడవగు నారాయణుడవు. సృష్టికి ఆదియం దుండి సంకల్పరూపమున సృష్టించు ఆదిపురుషుడవు నీవు. భూతభవి ష్యద్వర్తమానములకు లోబడక దేశకాలాతీతుడనైయుండు అపరిమేయ స్వరూపుడవు నీవు. పరమాత్మఅనంతుడగుటచే ఇంత అని కొలిచి చెప్పటకు సాధ్యపడనివాడని భావము. లేదా శబ్దాద్యగోచరుడని చెప్పవచ్చును. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" అని తైత్తిరీయోపనిషత్తు. ఇంద్రియాగోచరు డనియు చెప్పవచ్చును. 'మనో తీతం' అను పాఠమున శ్రవణమననాదులచే సంస్కరింపబడని లౌకికు నకు అగోచరుడని "నకోత్తమవర్మ" అను వ్యాఖ్యానకారుడు వ్యాఖ్యా నించినాడు. భక్తితో జేరి భజించువారల మాయామోహమును నశిం పజేయువాడవు నీవు. సంసారబంధములను, విషయస్పృహను వదలి అర ణ్యమున మననమొనరించు మునీశ్వరులచే సేవింపబడువాడవు. నిరంతర యోగాభ్యాసరతులగువారల తపస్సునకు లక్ష్యమయినవాడవు. భక్తి జ్ఞానాదిమోక్షమార్గములను స్వచరిత్రబలమున ప్రతిపాదించువాడవు. సగుణమూర్తిగా భక్తికిని, నిర్గుణుడుగా జ్ఞానమునకు ఆధారుడని భావము. పరిపూర్ణుడవు అనగా సర్వశోభస్కరగుణగణములకు ఆల వాలమయినవాడవు. రమణీయమగు మూర్తివైభవమున సమస్త జీవ కోటిని ఆనందపరచు లక్షణములు గలవాడవు. రామా ! ఏతాదృశుడ వగు నీకు వందనమాచరించుచున్నాము. ఈశ్లోకములో భగవంతుని సగుణనిర్గుణరూపములు ఏకకాలమున ప్రశంసింపబడినవి. కనుక సగుణ నిర్గుణగుణములు పరస్పరవిరుద్ధములు కావని తెలియనగును.

భావాభావప్రత్యయహీనం భవముఖ్యై
ర్భోగాసక్తై రర్చితపాదాంబుజయుగ్మమ్
నిత్యం శుద్ధం బుద్ధ మనంతం ప్రణవాఖ్యం
వందే రామం వీర మశేషాసురసారమ్ ॥

శ్రీరామా భావాత్మక ప్రత్యయముగాని, అభావాత్మకప్రత్యయముగాని లేనివాడవు. సృష్టియందలి సర్వపదార్థములు రెండువర్గములుగా విభజించబడి యున్నవి. భావాత్మకములు, అభావాత్మకములు అని. కాని ఈరెండును నాశనశీలములే. పరమాత్మ ఈరెంటికిని అతీతుడగుటవలన నాశనరహితుడు. లేదా భావమున వ్యావహారిక సత్యమయిన స్థూలము. అసత్ అన అతీంద్రియమయిన సూక్ష్మసృష్టి. ఈ రెంటిని అవగతమొనరించుకొను ప్రత్యయమునకు అనగా జ్ఞానమునకు అవిషయమయినవాడు. లేదా భావాభావములన కార్యకారణ ప్రతీతి. అది లేనివాడు పరమాత్మ. లేదా సంసారము మిథ్యయగుట వలన సత్యస్వరూపుడగు పరమాత్మకుకూడ భావప్రత్యయము (ఉన్నాడు అన్నజ్ఞానము) ఉండదు. లేడని చెప్పుదమన్న జ్ఞానవిషయుడగుటవలన అదియు వీలులేదు. అనగా పరమాత్మ అనిర్వచనీయుడు, జ్ఞానవిషయుడు అనుభావము సూచితమయినది. విషయభోగములందు విముఖులయిన శంకరుడు మొదలగు దేవముఖ్యులచే భక్తితో అర్చించబడిన పాదపద్మములుగల మహాత్మడవునీవు. ఆద్యంతములనునవిలేక నిత్యము ఉండు సత్యమయుడవు. జ్ఞానమే స్వరూపముగా గలవాడవు. మరణరహితుడవు. చతుర్వేదసారమగు ప్రణవమంత్రముచే వర్ణింపబడిన పరాత్పరుడవు. లేదా ప్రణవమే నామధేయముగా గలవాడవు. "తస్య వాచకః ప్రణవః" అని పాతంజలసూత్రము. మాయారూపములగు త్రిగుణములచే క్షోభించని వీరుడవు నీవు. లోకకింటకులగు రావణాది రాక్షసుల శక్తిసామర్థ్యములను పరిపూర్ణముగా హరించి వారిని నిర్వీర్యుల నొనరించినవాడవు నీవు. "అశేషా సురదావం" అను పాఠమున సమస్తాసురులకు దావాగ్నివంటివాడవని భావము. రామా! ఏతాదృశ స్వరూపుడవగు నిన్ను వందనపూర్వకముగా స్తుతించెదను.

త్వం మే నాథో నాధితకార్యాఖిలకారీ
మానాతీతో మాధవరూపో ఽఖిలధారీ
భక్త్యా గమ్యో భావితరూపో భవహారీ
యోగాభ్యాసై ర్భావిచేతః సహచారీ॥

రామా ! నీవు సృష్టికర్తనగు నాకు ప్రభుడవు. నాచే ప్రార్థితుడవై సృష్టికి ఆవశ్యకములగు సర్వకార్యములను నిర్వర్తింపజేయువాడవు. దుష్టశిక్షణము శిష్టరక్షణముచేసి సంసారమును నిలబెట్టువాడవు. దేశకాలరూపములకు పరిచ్ఛేద్యుడవుకాక సర్వదేశములకు సర్వకాలములకు సర్వరూపములకు అతీతుడవై ఉండువాడవు. లేదా వాణిచే ఇట్టిది అని చెప్పుటకు అశక్యమయిన స్వరూపము కలవాడవు. సమస్త సృష్టి రూపముగా పరిణమించిన మాయ లేక ప్రకృతికి భర్తవు. అనగా త్రిగుణాత్మకమయిన ప్రకృతిని ప్రేరింపించి కార్యరూపమున పరిణమింపజేయువాడు అని అర్థము. కనుకనే మాయాధవుడు అయినాడు. సమస్త బ్రహ్మాండములను ధరించువాడు. అనగా సృష్టి కాధారమయినవాడని భావము.

లౌకికములగు విషయసంబంధములను త్యజించి అనాసక్తుడై అనన్యభావముతో సేవించి భక్తుల చిత్తమునకు అందువాడు. సర్వాంతర్యామియై యుండుటచే ఇంద్రియచరముగాని నీస్వరూపము భక్తుల లేక జ్ఞానుల భావమునకు విషయమయినది. త్రిగుణాత్మకమయిన మాయను హరించి భక్తులకు జ్ఞానమును కలుగజేయువాడవు. మనన నిధిధ్యానాత్మకమయిన యోగనిరతులైనవారి అంతఃకరణమున సంచరించువాడవు. సచ్చిదానందమయమైన పరమాత్మయొక్క స్వరూపము లౌకికులకందక భక్తులకు యోగులకుమాత్రమే లభ్యమగునని శ్లోకమునకు మొత్తముమీద భావము.

తా మాద్యంతం లోకతతీనాం పర మీశం
లోకానాం కో లౌకికమాప్తై రధిగమ్యం
భక్త్యశ్రద్ధాభావసమేతై ర్భజనీయం
వందే రామం సుందర మిందీవరనీలం॥

నీవు బ్రహ్మాండసృష్టికి ఆద్యంత స్వరూపుడవు. సృష్టిలయములకు రెండింటికీ కారణుడైనవాడు రాముడని భావము. పరమేశ్వరుడవు. సర్వలోక ప్రభువు. లౌకికములగు కొలబద్దలకు వేటికిని అందని

వాడవు. అనిర్వచనీయుడవు. దేశకాలాతీతుడవు. అయినను బుద్ధ్యా దీంద్రియప్రవృత్తులకు ఊహించదగినవాడు. ఇంద్రియప్రవృత్తి లౌకిక మానములు లేక కొలబద్దలు. ఇంద్రియములకు ప్రత్యక్షుడు కాకపోయి నను అనుమానాది ప్రమాణములచే తెలియబడు అస్తిత్వము గలవా డని భావము. భక్తితోడను, శ్రద్ధాభావముతోడను భజించదగిన స్వరూపము గలవాడు. భక్తిశ్రద్ధలు, లేక భక్తిప్రపత్తులు లేకపోయి నచో భజించుట కుదురదు. నల్లగలువ రేకుల లావణ్యముతో శోభించు శ్రీరామచంద్రునకు, నీకు నమస్కరించుచున్నాను. ఈశ్లోకమున సర్వా తీతుడగు పరమాత్మ ఎట్లు గ్రహించబడునో ప్రతిపాదింపబడినది.

కో వా జ్ఞాతుం త్వా మభిమానం గతమానం
మానాసక్తో మాధవశక్తో మునిమాన్యం
వృందారణ్యే వందితవృందారకవృందం
వందే రామం భవముఖవంద్యం సుఖకందం॥

నీవు జ్ఞానస్వరూపుడవు. ఇంద్రియవ్యాపారములకు, దేశకాల ములకు అతీతుడవు. నీవు ఇట్టివాడవు, నీస్వరూప మిట్టిది అని చెప్పుట అసంభవము. వీతరాగులై ఆశ్రమముల నివసించి మహామునులచే సేవింపబడువాడవు. ఇక అస్మదాదుల మన్ననో ఇంద్రియవ్యాపారము లకు లోబడినవారలము. దేహమందు ఆసక్తి గలవారము. ఇట్టి మేము నిన్ను గ్రహించుటకు సమర్థుల మెట్లగుదుము? అనగా నిర్గుణము, అతీం ద్రియము, నిర్వికారము, సచ్చిదానంద లక్షణము అగు నీ స్వరూప మును గ్రహించజాలము. కాన నేను బృందారణ్యమున ఇంద్రాది దేవతలచే సేవించబడునట్టియు, శంకరుడు మొదలగు మహాత్ములకు వందనీయుడయినట్టియు, సర్వసుఖమూలమయినట్టియు నీ సగుణరూపము వేకే ప్రణమిల్లుచున్నాను.

నానాశాస్త్రై ర్వేదకదంబై ప్రతిపాద్యం
నిత్యానందం నిర్విషయజ్ఞాన మనాదిమ్

మత్సేవార్థం మానుషభావం ప్రతిపన్నం
వందే రామం మరకతవర్ణం మధుకేశమ్॥

రామా ! సగుణనిర్గుణాత్మకమయిన భవత్స్వరూపము చతుర్వేదములచేతను వేదోపబృంహణములగు పురాణములచేతను ప్రతిపాదింపబడుచున్నది. నీస్వరూపము నిత్యము ఆనందమున నోలలాడునది. ఆనందమయమే అయినది. సాంసారికములగు విషయజ్ఞానములకు అందనిది. జన్మ అనునది లేక నిత్యమయినది. ఏతాదృశగుణవిశిష్టమయ్యును నీవు నాప్రార్థన నంగీకరించి, నాసేవను సఫలమొనరించుటకు లీలామానుషవిగ్రహ స్వరూపుడవై అవతరించినావు. నీలమణివర్ణము గలిగి మధుకేశ్వరుడవైన శ్రీరామచంద్రా నీకు వందనము. ఇంతవరకు చతురాననుడు భక్తిప్రపత్తులతో శ్రీరాముని సగుణనిర్గుణరూపముల రెండింటిని ప్రశంసించి, తానొనరించిన ఈస్తుతియొక్క పఠనశ్రవణాదుల వలన కలుగు ఫలమును విధించుచున్నాడు.

శ్రద్ధాయుక్తో యః పఠ తీమం స్తవ మాద్యం
బ్రాహ్మం బ్రహ్మజ్ఞానవిధానం భువి మర్త్యః
రామం శ్యామం కామితకామప్రద మీశం
ధ్యాత్వా ధ్యాత్వా పాతకజాలై ర్విగతః స్యాత్ ॥

దేవి జానకి అగ్నిప్రవేశమొనరించిన సమయమున శ్రీరామచంద్రునిగూర్చి చేసిన ఈ స్తోత్రము బ్రహ్మజ్ఞానవిధానమును నిర్దేశించునవి. స్తోత్రములలోకెల్ల శ్రేష్ఠమయినది. అట్టి ఈస్తోత్రముతో పరమేశ్వరుడగు శ్రీరాముని సంతుష్టపరచు భక్తుడు బ్రహ్మజ్ఞానపరుడగును. ఈ స్తోత్రమును పఠించుచు సర్వకామితముల నీడేర్చి పరమాత్మను ధ్యానించినచో సమస్త పాతకసమూహములనుండియు విముక్తుడగును.

శ్రుత్వా స్తుతిం లోకగురో ర్విభావసుః
స్వాంకే సమాదాయ విదేహపుత్రికామ
విభ్రాజమానాం దివమలాభరణద్యుతిం
రక్తాంబరాం దివ్యవిభూషణాంచితామ్ ॥

శ్రుత్వా స్తుతిం లోకగురో ర్విభావసుః
స్వాంకే సమాదాయ విదేహపుత్రికాం
విభాజమానాం విమలాంశుణద్యుతిం
రక్తాంబరాం దివ్యవిభూషణాన్వితాం ॥

లోకపితామహుడగు ప్రజాపతి శ్రీరాముని ఈవిధముగా స్తుతించగా జ్వాలాంతర్గతుడయిన అగ్నిహోత్రుడును దానిని వినినాడు. అతడు తనలో ప్రవేశించిన మాయాసీతను అంతర్హితను జేసి ఇదివరకు రాముడు తనయందుంచిన విదేహరాజతనయను ఒడిలో కూర్చుండ బెట్టుకొని వెలువడివచ్చెను. అసమయమున జానకి అగ్ని సంసర్గమున అరుణకాంతులను వెలిజిమ్ముచున్నది. రక్తవర్ణ విభ్రాజితమయిన వస్త్రమును ధరించి దివ్యములగు సువర్ణరత్నాభరణములను అలంకరించుకొనియుండెను.

ప్రోవాచ సాక్షీ జగతాం రఘూత్తం
ప్రపన్నసర్వార్తిహరం హుతాశనః
గృహాణ దేవిం రఘునాథ జానకీం
పురా త్వయా మయ్యవరోపితాం పనే ॥

సర్వజగత్కర్మలకు సాక్షియై పవిత్రతముడగు అగ్నిదేవుడు శరణన్న వారి సర్వతాపములను హరించు రఘూత్తమునితో ఇట్లు విన్నవించెను. హే! రాఘవా! ఇదివరకు పంచవటియందు నీవు నాయందుంచిన జానకీదేవిని గ్రహించుము అని.

విధాయ మాయాజనకాత్మజాం హరే
దశాననప్రాణ వినాశనాయ చ
హతో దశాస్యః సహపుత్రబాంధవై
ర్నిరాకృతో ఽనేన భవో భువః ప్రభో ॥

వాస్తవమగు ఈ జానకీదేవిని నావద్దనుంచి మాయాజనకజను నిర్మించి ఆమె సహాయమున సపుత్రబాంధవముగా దశకంఠుని వధించి

తివి. అనన్య దుర్లభమగు ఈ మహత్కృత్యము నొనరించి భూభారము నంతను హరించితివి.

తతో ఽతిహృష్టాం పరిగృహ్య జానకీం
రామః ప్రహృష్టః ప్రతిపూజ్య పావకం
స్వాంకే సమావేశ్య సదా ఽనపాయినీం
శ్రియం త్రిలోకీజననీం శ్రియఃపతిః ॥

అగ్ని దేవుని వచనములనువిని శ్రీరాముడు ప్రహృష్టాంతరంగు డయినాడు. శ్రీరామదర్శనమున ఆనందసాగరమున నోలలాడుచున్న జానకీదేవిని ఆతడు అంకస్థ నొనరించుకొని అగ్నిహోత్రుని సర్వవిధ ముల సంభావించెను. లక్ష్మీస్వరూపురాలును, త్రిలోకజననియును, నిత్యకుశలయును, నిత్యము తనయందే సన్నిహితయై యుండునదియును అగు జానకిని పొంది లక్ష్మీనాథుడగు రాముడు శోభించెను.

దృష్ట్వా థ రామం జనకాత్మజాయుతం
శ్రియా స్ఫురంతం సురనాయకో ముదా
భక్త్యా గిరా గద్గదయా సమేత్య
కృతాంజలిః స్తోతు మథోపచక్రమే ॥

జనకాత్మజతో గూడిన శ్రీరాముడు అత్యధిక శోభాసంపన్నుడయినాడు. అతనిని జూడగనే దేవేంద్రుని హృదయమున భక్తి వెల్లువగా పొంగివచ్చినది. దివ్యమంగళదేహులగువారిని వర్ణింపబోవుసరికి కంఠము గద్గదికమయినది. అంతట అతడు కృతాంజలియై ఇట్లు స్తుతించెను.

ఇంద్ర ఉవాచ:—

భజే ఽహం సదా రామ మిందీవరాభం
భవారణ్య దావానలా భాభిరామం
భవానీ హృదాభావితానందరూపం
భవాభావహేతుం భవాదిప్రపన్నం ॥

సర్వదేవదేవుడయిన శ్రీరామచంద్రుడు నల్లగలువల వసుందర కాంతిగల దేహముగలవాడు. సంసారమను మహారణ్యమును దగ్ధ మొనరించు దావాగ్నివంటివాడు. విషయసుఖములు, ఇంద్రియతృష్ణ, అరిషడ్వర్గము సంసారమహారణ్యము. శ్రీరాముడు తన రూపముచేతను, నామముచేతను భక్తులకు సంబంధించి ఈ అరణ్యమును దగ్ధమొనరించి రక్షించువాడు. శంకరపత్నియగు భవానిచే హృదయకమలమున ప్రతిష్ఠిత మొనర్చి భావించబడు ఆనందస్వరూపుడు. సంసారనాశనమొనర్చి భక్తులను బ్రోచుటకు హేతువయినవాడు. శివుడు, బ్రహ్మ మొదలగు వారికిని శరణునొసగువాడు. అట్టి పరాత్పరుని సేవించెదను.

సురానీకదుఃఖౌఘనాశైకహేతుం
నరాకారదేహం నిరాకార మాద్యం
పరేశం పరానందరూపం వరేణ్యం
హరిం రామ మీశం భజే భారనాశం ॥

ఆయాసమయముల అసురులవలన దేవగణములకు కలుగు సమస్త దుఃఖములను నశింపజేయుటకు ఆధారమయినవాడును, నిరాకారుడయ్యును దేవహితమునకై మనుష్యరూపమును ధరించినవాడును, స్తుత్యుడును, పరాత్పరుడును, నిరవధికానందస్వరూపుడును, వరేణ్యుడును, సర్వకల్మషాపహారకుడును, భక్తుడును, భక్తుల సంసారభారమును నశింపజేయువాడును అగు శ్రీరామచంద్రుని స్తుతించెదను.

ప్రపన్నాఖిలానందదేహం ప్రపన్నం
ప్రపన్నార్తినిఃశేషనాశాధిధేయం
తపోయోగయోగీశభావా విభావ్యం
కపీశాదిమిత్రం భజే రామమిత్రం ॥

శరణన్నవారి కందరకు ఆనందమును సమకూర్చు దివ్యమంగళ విగ్రహుడును, భక్తశరణ్యుడును, తాపత్రయములకు భీతిల్లి శరణు జొచ్చినవారి తాపములనన్నిటిని హరించు అవిచలప్రతిజ్ఞ చేసినవాడును, తపోయోగనిరతులయిన యోగీశ్వరుల భావాలయందుండు

వాడును వానరరాజగు సుగ్రీవుని మిత్రుడును, మిత్రస్వరూపుడును అగు రామచంద్రుని స్మరించెదను.

సదాభోగభాజాం సుదూరే విభాంతం
సదాయోగభాజా మదూరే విభాంతం
చిదానందకందం సదా రాఘువేశం
విదేహాత్మజానందరూపం ప్రపద్యే॥

విషయలాలసులై సాంసారికసుఖభోగములందు ఆసక్తులయి జీవించునారి అత్యధికదూరమున నుండునట్టియు, భక్తియోగము నవలంబించి లౌకికసుఖదుఃఖములను పరిత్యజించి భజించువారలకు నిత్యము సమీపముననుండునట్టియు, చైతన్యస్వరూపుడై బ్రహ్మానందదాయకుడైనట్టియు, విదేహరాజపుత్రిక యగు సీతాదేవికి సదా ఆనందమును సమకూర్చునట్టియు, రాఘువంశప్రభువయినట్టియు శ్రీరామచంద్రుని శరణుజొచ్చెదను.

మహాయోగ మాయా విశేషానుయుక్తో
విభాసీశ లీలానరాకార వృత్తి
త్వ దానంద లీలాకథాపూర్ణ కర్ణాః
సదానందరూపా భవం తీహ లోకే॥

రామా! నీవు వాస్తవమునకు రూపరహితుడవే అయినను యోగమాయయొక్క గుణములగు సత్వరజస్తమస్సుల ననుసరించి మానవస్వరూపుడవై అనేకములగు పుణ్యకథలను ప్రవర్తిల్లజేయుచు ప్రకాశించుచున్నావు. నీ యీరూపము లీలాకృతియే గాని వాస్తవము గాదు. నీ పీరూపమున నొనరించి పుణ్యకథలను వినుటచే కర్ణపుటములు ఆనందరసపరిపూర్ణము లగును. ఆకథలే భక్తులకు నిత్యానందప్రదాయకములై ఇహలోకమున ప్రవర్తిల్లుచుండును. అనగా నీ పవిత్రచరిత్రము భక్తులకు ఆనందరసప్రదాయినియై తరింపజేయునదనియు, సగుణరూపము లీలామానుషవిగ్రహమనియు ఇందు ప్రతిపాదింపబడినది.

అహం మానపానాదిమత్తః ప్రమత్తో
న వేదాఖిలేశాభిమానాభిమానః
ఇదానీం భవత్పాదపద్మప్రసాదాత్
త్రిలోకాధిపత్యాభిమానో వినష్టః॥

రామా ! నేను ఇంతవరకును ఇంద్రపదవీగౌరవము, మద్య పానము మొదలగువాటిచే అతిశయితగర్వభావము గలవాడనై మదిం చినవాడనై సంచరించితిని. నేను స్వర్గమర్త్యపాతాళములను త్రిలోక ములకు ఇంద్రుడను అను గర్వమున నీ యథార్థతత్వమును గ్రహించ జాలకపోయితిని. ఇప్పుడు భవదీయపాదపద్మ సందర్శనమున నా త్రిలో కాధి రాజాభిమానము నశించినది. ప్రమత్తత నశించి నీ అనుగ్రహ మున స్వస్థుడనయితిని. అనగా సర్వలోకవిజయుడయిన రావణుని వధించుటచే నీ సర్వాతిశాయిత్వము వెల్లడి అయినది. నీ అనుగ్రహ మున నాయందలి మోహాంధకారము నశించి జ్ఞానమను జ్యోతి వెలిగి నది. దానిచే నీ ఆనందమయ స్వరూపము గోచరమై నా అకించన త్వము బోధపడినది అని భావము.

స్ఫురద్రత్న కేయూరహారాభిరామం
ధరాభారభూతాసురానీకదావం
శరచ్చంద్రవక్త్రం లసత్పద్మనేత్రం
దురావారపారం భజే రాఘువేశం॥

దివ్యకాంతుల నీనుచున్న రత్న కేయురములచేతను ముత్యాల హారములచేతను ఉజ్వలముగా ప్రకాశించుచున్నట్టియు స్వకృతకిల్బిష సహస్రములచే భూదేవికి భారస్వరూపులయిన పాపపు రక్కసులమూక లనెడి మహారణ్యమునకు దావాగ్నివంటివాడును, శరత్కాలచంద్రుని వలె ఉజ్జ్వలశోభాయమానమగు ముఖముగలవాడును, పద్మమువలె రక్తారుణిక నేత్రుడును, సాధారణమానవులకు పొంద శక్యముగాని వాడును అగు రాఘవకుల ప్రభువును భజించెదను.

సురాధీశనీలాభనీలాబ్జకాంతిం
విరాధాదిరక్షోవధా ల్లోకశాంతిం
కిరీటాదిశోభం పురారాతిలాభం
భజే రామచంద్రం రఘూణా మధీశం॥

ఇంద్రనీలమణికాంతిని, నీలోత్పలకాంతివి మించు శరీరలావణ్యము కలట్టియు, విరాధుడు మొదలగు ఘోరరాక్షసులను వధించి లోకశాంతిని స్థాపించినట్టియు, రత్నకిరీటధారియై శోభించునట్టియు, నిత్యము హృదయమున ధ్యానించి పరమసిద్ధిరూపమయిన ఫలలాభమును పొందిన శివుడు గలవాడును, రాఘవప్రభువును అగు శ్రీరామచంద్రుని సేనించెదను.

లసచ్చంద్రకోటిప్రకాశాదిపీఠే
సమాసీన మంకే సమాధాయ సీతాం
స్ఫురద్ధేమవర్ణాం తడిత్పుంజభాసం
భజే రామచంద్రం నివృత్తార్తితంద్రమ్॥

కోట్లకొలది చంద్రులవలె ప్రకాశించి యోగపీఠమున బంగారు కాంతుల వెదజల్లునట్టియు, మెరుపువలె మెరయునట్టియు జానకీదేవిని అంకమున ఆసీననొనర్చుకొని అధివసించియుండు ఆపన్నులకు శరుడై, ఆర్తినితీర్చు శ్రీరామచంద్రుని దివ్యరూపమును మనసార ధ్యానించెదను.

తతః ప్రోవాచ భగవాన్ భవాన్యా సహితో భవః
రామం కమలపత్రాక్షం విమానస్థో నభఃస్థలే॥

బ్రహ్మేంద్రు లిద్దరును స్తుతించిన అనంతరము పార్వతీసహితుడగు శంకరభగవానుడు కమలపత్రాక్షుడగు శ్రీరామునిగూర్చి ఆకాశమార్గమున విమానస్థుడై కన్పడి ఇట్లు పలికెను.

ఆగమిష్యా మ్యయోధ్యాయా ద్రష్టుం త్వాం రాజ్యసత్కృతం
ఇదానీం పశ్య పితర మస్య దేహస్య రాఘవ॥

రామా ! నేను నీవు అయోధ్యలో అభిషిక్తుడవై శోభించుకాలమున దర్శించుటకు వచ్చెదను. ఇదిగో ఇటు చూడుము. నీ యీ

మానవదేహమునకు తండ్రి అయిన దశరథుడు స్వర్గమునుండి నిన్ను చూచుటకు వచ్చియున్నాడు. అతనిని చూడుము.

తతో ఽపశ్య ద్విమానస్థం రామో దశరథం పురః
ననామ శిరసా పాదౌ ముదా భక్త్యా సహానుజః॥

అంతట శ్రీరాముడు తనయెదుట విమానస్థుడై యున్న దశరథుని దర్శించెను. తండ్రిని దర్శింపగనే భక్తియుక్తులతో అతని పాదములకు శిరసా నమస్కార మొనర్చెను. లక్ష్మణుడును అభివాదన మాచరించెను.

అలింగ్య మూర్ధ్న్యవఘ్రాయ రామం దశరథో బ్రవీత్
తారితో ఽస్మి త్వయా వత్స సంసారా ద్దుఃఖసాగరాత్
ఇత్యుక్త్వా పునరాలింగ్య యయౌ రామేణ పూజితః॥

భక్తిప్రపత్తులతో నమస్కరించిన రామలక్ష్మణులను దశరథుడు ఆనందముతో ఆలింగన మొనర్చి మూర్ధ్నాఘ్రాణ మొనర్చినాడు. అనంతరము శ్రీరామునితో–"వత్సా! నీవంటి మహానుభావుడు పుత్రుడు నాకు జన్మించుటచే నాజన్మ చరితార్థతనందినది. దుఃఖసముద్రరూపమయిన సంసారమునుండి నన్నుద్ధరించితివి." అని పలికి తిరిగి ఆలింగన మొనర్చి, పుత్రునిచే పూజితుడై స్వర్గమున కేగెను.

రామో ఽపి దేవరాజం తం దృష్ట్వా ప్రాహ కృతాంజలిం
మత్కృతే నిహతా ఽసంఖ్యా హానరా స్సంతితా న్భువి
జీవ యాఽఽసు సుధావృష్ట్యా సహస్రాక్ష మమాజ్ఞయా॥

అంతట శ్రీరాముడు దేవేంద్రునిచూచి ఇట్లు పలికెను–"సురేశ్వరా! ఈ అసంఖ్యాకులగు వానరులు నాకై యుద్ధమున ప్రాణములనర్పించినారు. కాన అమృతమును వర్షించి వీరి నందరిని పునర్జీవితులనొనరింపుము" అని.

తథే త్యమృతవృష్ట్యా తా జ్జీవయామాస వానరాన్
యే యే మృతా మృధే పూర్వం తే తే సుప్తోత్థితా ఇవ॥

సహస్రాక్షుడును చిత్తమున శ్రీరాముని ఆజ్ఞను పరిపాలించెను. అతని ఆజ్ఞచే మృతులగు వానరులపై అమృతము వర్షితమయినది. మృతవానరులందరును నిద్రనుండి మేలొకొనినవారువలె యుద్ధభూమిలో లేచిరి.

పూర్వవ ద్బలినో హృష్టా రామపార్శ్వ ముపాయయుః
నోత్థితా రాక్షసా స్తత్ర పీయూషస్పర్శనా దపి ॥

పునఃజీవించిన వానరులందరును మృతినందుటకు పూర్వమువలె బలవంతులు, హృష్టచిత్తులు అయిరి. వారందరు అత్యంతానందము ననుభవించుచు శ్రీరాముని సన్నిధికి చేరిరి. యుద్ధభూమిలో మరణించిన రాక్షసులుమాత్రము అమృతస్పర్శ కలిగినను పునర్జీవితులు కాలేదు.

ఇక్కడ రాక్షసులు పునర్జీవితులు కాకపోవుటకు కారణ మిట్లు చెప్పెదరు–శ్రీరాముడు సత్యసంకల్పుడు. ఆకారణమున అతనిశరము లచే మరణించిన రాక్షసులు జీవించుట అసంభవము–అని. భగవంతుని సంకల్పమునకు అన్యథా జరుగదుగదా! కొందరు మరియొక కారణ మును చెప్పెదను. రావణుడు మృతరాక్షసులను లెక్కపెట్టుటకై సము ద్రములో పడవేయించెనని. "మరియొకకారణము కూడ చెప్పబడు చున్నది. యుద్ధములో మరణించిన రాక్షసులను దహనముచేయించి యుద్ధభూమిని అనుకూలము జేయబడిన" దని. ఆ భస్మము సముద్రమున కలుపబడిన దట.

విభీషణ స్తు సాష్టాంగం ప్రణిప త్యాబ్రవీ ద్వచః
దేవ మా మనుగృహ్ణీష్వ యది తే మ య్యనుగ్రహః ॥

మృతవానరులందరును పునర్జీవితులయిన అనంతరము విభీషుడు సాష్టాంగ దండప్రణామ మాచరించి ఇట్లు వలికెను. రామా! నీకు నాయందు పరిపూర్ణానుగ్రహ మున్నదేని నాయందు కరుణభావమును కన్పరిచి నన్ను తరింపజేయుము.

మంగలస్నాన మద్య త్వం కురు సీతాసమన్వితః
అలంకృత్య సహ భ్రాతృ శ్శ్వో గమిష్యామి హే వయం॥

రామా! నేను నాప్రార్థన నంగీకరించి మంగళస్నానము నొన

రింపుము. సీతాదేవిని గూడ చేయించుటకు అనుజ్ఞనిమ్ము. నేడు సీతా లక్ష్మణ సమేతుడనై నా ఆతిథ్యాలంకారములను స్వీకరింపుము. రేపు మనము అయోధ్యకు బయలుదేరుదము.

విభీషణవచః శ్రుత్వా ప్రత్యువాచ రఘూత్తమః
సుకుమారో ఽతిభక్తో మే భరతో మా మపేక్షతే ॥

మంగళస్నానమొనర్పుమన్న విభీషణవచనములకు శ్రీరాముడు ఇట్లు బదులు పలికెను. "భరతుడు అత్యంతసుకుమారహృదయుడు. పదునాల్గువత్సరములు వనవాస కాలాంత్యమును ప్రతీక్షించుచు నారాకకై యెదురుచూచుచుండును.

జటావల్కలధారీ స శబ్దబ్రహ్మసమాహితః
కథం తేన వినా స్నానం అలంకారాదికం మమ ॥

నాకు మిక్కిలి భక్తుడయిన భరతు శబ్దబ్రహ్మమందు అత్యంత విశ్వాసముగలవాడు. అనగా పదునాల్గువత్సరములు పూర్తికాగానే రాముడు తిరిగి అయోధ్యకురాని చో అగ్నిప్రవేశము చేసెదనన్న ప్రతిజ్ఞను అక్షరాలా ఆచరించువాడని భావము. అతడు జటావల్కలధారియై నాకై యెదురుచూచుచుండును. అతనిని చూడకుండా నేను మంగళస్నాన మెట్లాచరించగలను. అతనితో కూడియే స్నానమొనర్చెదను.

అతః సుగ్రీవముఖ్యాం స్త్వం పూజ యాఽఽశు విశేషతః
పూజితేషు కపీంద్రేషు పూజితో ఽహం న సంశయః ॥

నీవు సుగ్రీవాదులను ఈ నా మిత్రుల సందరను సవిశేషముగా పూజించుము. వారు బహూకృతులయిన చో నేను నిస్సంశయముగా బహూకృతుడనే.

ఇత్యుక్తో రాఘవేణాఽశు స్వర్ణరత్నాంబరాణి చ
వవర్ష రాక్షసశ్రేష్ఠో యథాకామం యథాశుచి ॥

శ్రీరామచంద్రుడట్లు పలుకగా విభీషణుడు పుష్పకవిమానమునుండి వివిధసువర్ణములను, రత్నాంబరాదులను వర్షించెను. వాటిని వానరులు తమ తమ అభిరుచుల ననుసరించి స్వీకరించిరి.

తత స్తై పూజితా దృష్ట్వా రామో రక్షై శ్చ యూథపై
అభినంద్య యథాన్యాయం విససర్జ హరీశ్వరా ॥

వానరసేనలన్నియు యథాకామముగా పూజింపబడుటనుచూచి శ్రీరాముడు వారినందరను యథార్హముగా అభినందించి వీడ్కొలు నిచ్చెను.

విభీషణసమానీతం పుష్పకం సూర్యవర్చసం
ఆరురోహ తతో రామ స్తద్విమాన మనుత్తమం ॥

అంతట విభీషణుడు సూర్యునివలె నెలుగొందుచున్న పుష్పక విమానమును తెచ్చి రామునకు సమర్పించెను. రాముడు మహాను భావసంపన్నమయిన ఆ విమానశ్రేష్ఠమును అధిరోహించెను.

అంకే నిధాయ వైదేహీం లజ్జమానాం యశస్వినీం
లక్ష్మణేన సహా భ్రాతా విక్రాంతేన ధనుష్మతా॥

చిరకాలదర్శనమున లజ్జానమ్రురాలయి జానకీదేవిని అకంస్థనొసరించుకొని శ్రీరాముడు ఆ విమానమును అధిష్టించెను. విక్రమశీలియు, ధనుష్మంతుడును అగు లక్ష్మణుడు వారి ప్రక్కనే నిలబడెను.

అబ్రవీ చ్చ విమానస్థః శ్రీరామః సర్వవానరా
సుగ్రీవం హరిరాజం చ అంగదం చ విభీషణం ॥

విమానము నధిష్ఠించిన శ్రీరాముడు వానరరాజయిన సుగ్రీవుని, యువరాజయిన అంగదుని, రాక్షసేశ్వరుడయిన విభీషణుని, సర్వవానర సేనలను అవలోకించి ఇట్లు పలికెను.

మిత్రకార్యం కృతం సర్వం భవద్భిః సహవానరైః
అనుజ్ఞాతా మయా సర్వే యథేష్టం గంతు మర్హథ ॥

మీరందరును మిత్రుడనగు నాకార్యమును సంపన్నమొనర్చిరి. ఈ మహాపరిశ్రమకు నా అభివందనములు. ఇక మీరు నాఅనుజ్ఞ ననుసరించి మీ మీ స్థానములకు సుఖముగా వెడలవచ్చును.

సుగ్రీవ ప్రతియా హ్యేకు కిష్కింధాం సర్వసైనికై
స్వరాజ్యే వస లంకాయాం మమ భక్తో విభీషణ ॥

సుగ్రీవా ! మిత్రకార్యమును సఫలమొనర్చి నీవు ధన్యుడవైతివి. ఇక నీ సేనాచయమునంతను వెంటనిడుకొని నీ రాజధానియైన కిష్కింధానగరమునకు పొమ్ము. విభీషణా ! నీవు నాయెడ అనన్యభక్తి కలిగి నీ లంకారాజ్యమును పరిపాలించుము.

న త్వాం ధర్షయితుం శక్తాః సేంద్రా అపి దివౌకసః
అయోధ్యాం గంతు మిచ్ఛామి రాజధానీం పితు ర్మమ ॥

లంకారాజ్యమున నీ సుస్థికి భంగమురాదు. పూర్వవిరోధమున్నదిగదా అని ఇంద్రసహితులయిన దేవతలును నీ రాజరికమును భగ్నమొనర్పజాలరు. ఇక నేను నాతండ్రిగారి రాజధాని అయిన అయోధ్యానగరమును పో నిచ్చగించుచున్నాను.

ఏవ ముక్త స్తు రామేణ వానరా స్తే మహాబలాః
ఊచుః ప్రాంజలయః సర్వే రాక్షస శ్చ విభీషణః ॥

శ్రీరామచంద్రు డీవిధమున వానరరాక్షసులకును సుగ్రీవవిభీషణులకును వీడ్కోలు నీయుగా మహాబలులగు వానరులును, రాక్షసుడగు విభీషణుడును ప్రాంజలియై ఇట్లు పలికిరి.

అయోధ్యాం గంతు మిచ్ఛామ స్త్వాయ సహా రఘూత్తమ
దృష్ట్వా త్వా మభిషిక్తం తు కౌసల్యా మభివాద్య చ
పశ్చా చ్ఛ్వ్రణీమహే రాజ్య మనుజ్ఞాం దేహి నః ప్రభో ॥

రఘూత్తమా ! మేమును నీతోగలిసి అయోధ్యానగరమునకు రాగోరుచున్నాము. కోసలరాజ్యాభిషిక్తుడవైన నీమూర్తిని దర్శించి మాతృదేవి కౌసల్యకు పాదాభివందన మాచరించెదము. ఆతరువాతనే మా మా రాజ్యములను అనుభవించెదము. కనుక మాకును నీతో వచ్చుట కనుజ్ఞనిమ్ము.

రామ స్తథేతి సుగ్రీవవానరై సవిభీషణః
పుష్పకం సహానుమాం శ్చ శీఘ్రు మారోహ సాంప్రతం ॥

శ్రీరాముడును వారి ప్రార్థన నంగీకరించెను. "సుగ్రీవా నీవు

వానరసేనలతోడను, విభీషణునితోడను, హనుమంతునితోడను పుష్పకమును అతిశీఘ్రముగా అధిరోహింపుము" అని ఆజ్ఞ నిచ్చెను.

తత స్తు పుష్పకం దివ్యం సుగ్రీవ: సహ సేనయా
విభీషణ శ్చ సామాత్య: సర్వే చారుహ దృష్టితం॥

శ్రీరామాజ్ఞ ననుసరించి సుగ్రీవుడు సేనాసహితముగా పుష్పక విమానమును అధిరోహించెను. విభీషణుడును మంత్రియుతుడై అధిరోహించెను. ఇట్లు అందరును పుష్పకమును అధిరోహించిరి.

తే స్మారూఢేషు సర్వేషు కౌబేరం పరమాసనం
రాఘవే ణాభ్యనుజ్ఞాత ముత్పపాత విహాయసా॥

సుగ్రీవవిభీషణాది లందరును ఆరూఢులుకాగా శ్రేష్ఠములగు ఆసనములు గల ఆ కుబేరవిమానము రామునిఆజ్ఞ ననుసరించి ఆకాశమున కెగసెను.

బభౌ తేన విమానేన హంసయుక్తేన భాస్వతా
ప్రహృష్ట శ్చ తదా రామ శ్చతుర్ముఖ ఇవాపర:॥

విమానము నధిరోహించి ఆకాశమున కెగసిన శ్రీరాము డప్పుడు హంసవాహనారూఢుడై ప్రకాశించుచు చతుర్ముఖబ్రహ్మవలె శోభించెను. ఆసమయమున రామునకు అత్యంతానందము కలిగెను.

తత్రో బభౌ భాస్కరబింబతుల్యం
కుబేరభవనం తపసా నులబ్ధం
రామేణ శోభాం నితరాం ప్రపేదే
సీతాసమేతేన సహానుజేన॥

కుబేరుడు చిరకాలము తపస్సుచేయగా తత్ఫలముగా పుష్పక మతనికి లభించినది. అది ఆకాశమున కెగిరి సూర్యబింబము వలె కిరణజాలమును విరజిమ్ముచు ప్రకాశింపజొచ్చినది. అసలే ప్రభావ మహితమయిన ఆ విమానము పత్నీ, సోదరసహితుడయిన రామచంద్రు డధిష్టించుటచే ఇంకను అధికముగా ప్రకాశించినది.

చతుర్దశసర్గ

రావణవధకు నిమిత్తముగా నిర్మించిన మాయాసీతను తిరిగి అగ్ని దేవునికి సమర్పించి ప్రాణప్రియమున జానకిని స్వీకరించి అయోధ్యా గమనోన్ముఖుడయిన రాముని చరిత్రము నెనుక వర్ణింపబడినది. చతుర్దశసర్గయందు పుష్పకవిమానమును అధిరోహించి భరద్వాజాశ్రమమును చేరిన రాముని గ్రంథకర్త వర్ణించుచున్నాడు. మొదట రాముడు అంకస్థయగు సీతకు ఆ యా విశేషస్థలములను పరిచయముచేసిన విధానమును వర్ణించుచున్నాడు.

శ్రీ మహాదేవ ఉవాచ :—

పాతయిత్వా తత శ్చక్షుః సర్వతో రఘునందనః
అబ్రవీ న్మైథిలీంసీతాం రామః శశినిభాననాం ॥

సీతారామలక్ష్మణులను, సుగ్రీవవిభీషణులను, ఇతరవానరులను వహించి పుష్పకము ఆకాశమున కెగసినది. అంత శ్రీరాముడు తన ప్రాణప్రియకు మార్గమందలి ఆ యా విశేషములను ఎరుకపరచువాడై ఆకాశముననుండి భూమిపై నాల్గువైపులకు దృష్టిని సారించెను. అంతట అతడు పూర్ణచంద్రుని పరిహసించు ముఖముగల మైథిలిని ఉద్దేశించి ఇట్లు పలికెను.

ప్రథమమున లంకానగరమును కన్పరచుచున్నాడు—

త్రికూటశిఖరాగ్రస్థాం పశ్య లంకాం మహాప్రభాం
ఏతాం రణభువం పశ్య మాంసకర్దమపంకిలాం
అసురాణాం ప్లవంగానాం అత్ర వైశసనం మహత్ ॥

జానకీ! క్రిందికి చూడుము. అది త్రికూటపర్వతము. దాని ఉన్నతశిఖరమందు వ్యాపించియున్నదే లంకానగరము. స్వర్ణమయమగు భవనరాజిచే ప్రకాశించుచున్నది. ఇటుచూడుము. మాంసమే బురదవలె మారిపోయి అగమ్యమగు యుద్ధభూమి ఇది. ఈస్థలమునసే వానరరాక్షసుల మహాఘోరమగు యుద్ధము జరిగినది.

అత్ర మే నిహతః శేతే రావణో రాక్షసేశ్వరః
కుంభకర్ణేంద్రజిన్ముఖ్యాః సర్వే చాత్ర నిపాతితాః
ఏష సేతు ర్మయా బద్ధః సాగరే సలిలాశయే ॥

ఈ యుద్ధస్థలమున ఈ చోటున నేను రాక్షసచక్రవర్తియగు రావణుని సంహరించితిని. అపగత్ప్రాణుడగు అతడు ఈస్థలమునసే దీర్ఘనిద్ర చెందినాడు. కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు మొదలగు రాక్షస వీరులు ఈ స్థలమునసే నిహతులయినారు.

రాము డిట్లు యుద్ధభూమియందలి విశేషములను పేర్కొనుచుండగా పుష్పకము ముందుకు సాగినది. సముద్రమున వానరసేనలచే నిర్మింపబడిన సేతువు కన్పించినది. రాముడు సీతకు చానినిచూపి జానకీ ఇదిచూడుము. శతయోజనవిస్తీర్ణమగు సముద్రముపై నిర్మింపడిన సేతువు ఇదే అనినాడు.

ఏత చ్చ దృశ్యతే తీర్థం సాగరస్య మహాత్మనః
సేతుబంధ మితి ఖ్యాతం త్రైలోక్యేన చ పూజితం
ఏత త్పవిత్రం పరమం దర్శనా ద్ఘాతకాపహం ॥

ఇది మహాపురుషుడయిన సాగరుని తీరము. ఇక్కడనే సేతువు ప్రారంభమయినది. ఈస్థలము సేతుబంధము అని ప్రసిద్ధిచెందగలదు. పరమపవిత్రమగు ఈ సాగరతీర్థమును త్రిలోకములవారును సేవించ గలరు. ఈ పవిత్రతీర్థము దర్శనమాత్రమునసే సమస్త కల్మషములను నిర్మూలమొనరించగలదు.

అత్ర రామేశ్వరో దేవో మయా శంభుః ప్రతిష్ఠితః
అత్ర మాం శరణం ప్రాప్తో మంత్రిభి శ్చ విభీషణః
ఏషా సుగ్రీవనగరీ కిష్కింధా చిత్రకాననా ॥

ఇది రామేశ్వరతీర్థము. ఇచ్చట నేను సేతుబంధమునకు పూర్వము శంకరలింగమును స్థాపించితిని. ఈ స్థలమునసే ఆర్తుడయిన విభీషణుడు మంత్రిసహితుడై నన్ను శరణుజొచ్చినాడు. ఇదిగో ఇట్లు

చూడుము. ఇది సుగ్రీవుని రాజధాని. కిష్కింధానగరము. దాని చుట్టూ ఉన్నవే– అవి చిత్రసుందరములను ఉద్యానవనములు.

ఇంతవరకు ప్రముఖస్థలములను వర్ణించి సీత తారాది సుగ్రీవావరోధ జనమును కలుసుకొనుటను వర్ణించుచున్నాడు–

తత్ర రామాజ్ఞయా తారాప్రముఖా హరియోషితః
ఆనయామాస సుగ్రీవః సీతాయాః ప్రియకామ్యయా ॥

అంతట సీత తార రుమ మొదలగు వానరపట్టమహిషులను దర్శించవలెనను కోరికను ప్రకటించినది. రాముడు సుగ్రీవుని ఆజ్ఞాపించినాడు. సుగ్రీవుడును సీతాదేవి ఇచ్ఛను పూర్తి ఒనరించువాడై తార రుమ మొదలగు తన అంతఃపురకాంతలను రప్పించినాడు.

తాభిః సహోత్థితం శీఘ్రం విమానం ప్రేక్ష్య రాఘవః
ప్రాహ చాద్రి మృష్యమూకం పశ్య వాల్యత్ర మే హతః ॥

సీతాదేవి కోరిక ననుసరించి తారాదులును పుష్పకమును అధిరోహించి అయోధ్యకు బయలుదేరినాడు. విమానము శీఘ్రముగా ఆకాశమున కెగసినది. అంతట రాముడు సీతకు క్రిందభాగమును కన్పరిచి ఇట్లనినాడు. జానకీ! ఇదిగో ఇది ఋష్యమూకపర్వతము. ఈపర్వతసమీపమున ఈ స్థలమునలనే మహాబలశాలియగు వాలి సంహరింపబడినాడు.

ఏషా పంచవటీ నామ రాక్షసా యత్ర మే హతాః
అగస్త్యస్య సుతీక్ష్ణస్య పశ్యాశ్రమపదే శుభే
ఏతే తే తాపసాః సర్వే దృశ్యంతే వరవర్ణిని ॥

ఇది పంచవటి. ఖరుడు, త్రిశిరుడు, దూషణుడు మొదలగు రాక్షసులను హతమొనరించిన దీ స్థలమునలనే. ఇదిగో ఇలుచూడుము. ఇది అగస్త్యమహర్షియొక్క ఆశ్రమము. ఇది సుతీక్ష్ణమహర్షియొక్క పవిత్రాశ్రమము. వీరే ఆనాడు మనము చూచిన మహర్షులు. వారందరును స్పష్టముగా దర్శనీయులగుచున్నారు.

అసౌ శైలవరో దేవి చిత్రకూటఃప్రకాశతే
అత్ర మాం కైకయీపుత్రఃప్రసాదయితు మాగతః
భరద్వాజాశ్రమం పశ్య దృశ్యతే యమునాతటే ॥

దేవీ ! జానకీ ! ఈ పర్వతరాజమును చూడుము. ఇది చిత్ర కూటపర్వతము. ప్రకృతిసుందరమై శోభించుచున్నది. ఈ పర్వతమున ఉండగనే కైకేయీపుత్రుడగు భరతుడు నన్ను నగరమునకు తిరిగి కొని పోవులకై వచ్చినాడు. ఇదిగో మనము చిత్రకూటమును దాటినాము. ఇది యమునానది. ఈ నదీతీరమునసే భరద్వాజమహర్షియుక్క పవిత్రతమగు ఆశ్రమరాజము.

ఏషా భాగీరథీ గంగా దృశ్యతే లోకపావనీ
ఏషా సా దృశ్యతే సీతే ! సరయూర్యుపమాలినీ
ఏషా సా దృశ్యతే ఽయోధ్యా ప్రణామం కురు భామిని ॥

ఇది లోకములనన్నిటిని పవిత్రమొనరించిన భాగీరథి. ఈ గంగా నదిని దర్శించి నమస్కరించుము. ఈపైన ఇదిగో ! ఇది సరయూనది. దాని ఒడ్డును పరికించితివా ? రఘువంశరాజులొనరించిన అనేక శత సంఖ్యాకములగు అశ్వమేధాదియజ్ఞములకు చిహ్నములుగా యూపస్తంభమాలికలు శోభించుచున్నవి. ఇది మన అయోధ్యానగరము. చిరకాలమునకు మనము దీనిని దర్శించుచున్నాము. ఈ దేవనగర తుల్యమగు అయోధ్యకు ప్రణామమొనరించుము.

ఏవం క్రమేణ సంప్రాప్తో భరద్వాజాశ్రమం హరిః
పూర్ణే చతుర్దశే వర్షే పంచమ్యాం రఘునందనః ॥

పుష్పకారూఢుడయిన శ్రీరాముడిట్లు సర్వనదనదీపర్వతారణ్యములను దాటి పదునాల్గు సంవత్సరములు పూర్తికాగా పంచమీతిథియందు భరద్వాజమహర్షియుక్క ఆశ్రమమును చేరెను.

భరద్వాజం మునిం దృష్ట్వా ననంద సానుజః ప్రభుః
ప్రపచ్ఛ మునిమాసీనం వినయేన రఘూత్తమః॥

సోదరసహితుడగు రాఘవశ్రేష్ఠుడు విమానమునుండి దిగి వినయభావముతో మహర్షి పాదపద్మములకు సాష్టాంగదండప్రమాణము లాచరించెను. అనంతరము మహర్షి .దర్శితమయిన పవిత్రాసనమున ఉపవిష్టుడై ఈవిధమున ప్రశ్నించెను.

శ్రుతోఽపి కచ్చి ద్భరతఃకుశ ల్యాస్తే సహానుజఃసుభిక్షే వర్తతే ఽయోధ్యా జీవంతి మమ మాతరఃll

మహర్షే! నీకు అయోధ్యకుసంబంధించినవార్త లేమయిన తెలియుచున్నవా? అనుజుడగు శత్రుఘ్నునితోనూడ భరతుడు కుశలమేనా? భరతుని పాలనలో అయోధ్య ఈతిబాధలు లేక సుభిక్షముగా వర్ధిల్లుచున్నదా? ప్రాణాధికప్రియుడనగు నన్ను వదలిన నాతల్లులు మరొక దశకు గురికాకుండ జీవించియే యున్నారుగదా!

శ్రుత్వా రామస్య వచనం భరద్వాజఃప్రహృష్టధీఃప్రాహ సర్వే కుశలినో భరత స్తు మహామనాఃll

శ్రీరాముని ప్రశ్నలో భ్రాతృస్నేహము, ప్రజాక్షేమతత్పరత, మాతృభక్తి ప్రస్ఫుటితమగుచున్నవి. ఈకారణమున మహర్షి భరద్వాజుని హృదయము సంతోషతరంగితమయినది. అయోధ్యలో అందరూ క్షేమమే అనువార్త తెలియజేసి మహాత్ముడగు భరతుని తాపస జీవితమును విశేషముగ వర్ణించువాడై ఇట్లు పలికెను.

ఫలమూలకృతాహారో జటావల్కలధారకఃపాదుకే సకలం న్యస్య రాజ్యం త్వాం సుప్రతీక్షతేll

'రామా! నీవు అరణ్యమందుండి తాపసుడవికాగా భరతుడు నగరమందుండియే తాపసియైనాడు. అతడు జటావల్కలములను ధరించి, కందమూలఫలములనే ఆహారముగా గొనుచు రాజ్యమున తాను నిమిత్తమాత్రభారమునంతయు నీ పాదుకలపైనిడి నీవు తిరిగివచ్చు శుభ ముహూర్తమునకై ఎదురుచూచుచున్నాడు.

భరతుని వార్తను తెలియజేసి రామకృతములగు రావణవధాదిక కృత్యమును ప్రశంసించుచున్నాడు.

యద్యత్కృతం త్వయా కర్మ దండకే రఘునందన
రాక్షసానాం వినాశం చ సీతాహరణపూర్వకం
సర్వం జ్ఞాతం మయా రామ తపసా తే ప్రసాదతః॥

రామా ! చిరకాలమునుండి చేయుచున్న తపస్సుకు ఫలముగా నీకటాక్షము నాకు దివ్యదృష్టిప్రసాదితమయినది. ఆకారణమున దండకారణ్యమున నీచే చేసిన ఖరదూషణవధాదికములగు మహత్కర్మల నన్నిటిని గ్రహించినాను. అంతేగాక సీతాపహరణపూర్వకమయిన రావణవధను రాక్షసనాశనమునుకూడ విన్నాను.

శ్రీరాముని మహత్కృత్యములను ప్రశసించి పరబ్రహ్మవగుటచే నీ కార్యములు అసాధారణములు కాదని చెప్పుచున్నాడు.

త్వం బ్రహ్మ పరమం సాక్షా దాదిమధ్యాంతవర్జితః
త్వ మగ్రే సలిలం సృష్ట్వా తత్ర సుప్తో ఒసి భూతకృత్॥

రామా ! నీవు సాధారణ రాజపుత్రుడవు కావు. సాక్షాత్తు ఆదిమధ్యాంతములు లేని పరమపురుషుడవు నీవే. నీవు మొట్టమొదట ఉదకమును సృష్టించి దానియందే యోగనిద్రాముద్రితుడవైతివి.

నారాయణో ఒసి విశ్వాత్మ నరాణా మంతరాత్మకః
త్వన్నాభికమలోత్పన్నో బ్రహ్మ లోకపితామహః॥

నీరములనగా జలములు. ఆజలములను సృజించి దానియందే నివాసము నొనరించుకొన్నవాడగుటచే నీవు నారాయణుడవయితివి. (ఆపో నారా. ఇతి ప్రోక్తా ఆపోవైనర సూనవః అయనం తస్య తాః పూర్వం తేన నారాయణః స్మృతః) నీవు సమస్త విశ్వమునకు ఆత్మస్వరూపుడవు. మానవుల అంతరాత్మయందు చైతన్యస్వరూపమున విలసిల్లువాడవు.

నీ నాభికమలములనుండి జనించిన చతుర్ముఖబ్రహ్మ సృష్టికర్తయై లోకపితామహుడయినాడు.

అతః త్వం జగతా మీశః సర్వలోకనమస్కృతః
త్వం విష్ణు ర్జానకీ లక్ష్మీ ర్నేషో ఒయం లక్ష్మణాభిధః॥

పైజెప్పిన కారణమున నీవు సర్వజగత్ప్రభుడవు. కనుక సర్వ లోకములకు వంద్యుడవు. నీవు సాక్షాత్తు సర్వవ్యాపకుడవగు విష్ణుడవు. ఈ జానకి లక్ష్మీ స్వరూపిణి. ఈ లక్ష్మణుడు నీసేవకుడగు శేషుడు.

ఆత్మనా సృజ సీదం త్వ మాత్మ న్యేవాత్మమాయయా
న సజ్జసే నభోవ త్త్వం చిచ్ఛక్త్యా సర్వసాక్షికః॥

రామా ! నీవు ఈ సర్వజగత్కర్తవు. అయినను ద్వంద్వభావము లేదు. కారణ మేమన, నీలోని మాయనే సాధనముగా జేసికొని నీవే అధికరణమనగా దీనిని సృజించుచున్నావు. అయినను అంతట నిండి యున్న ఆకాశమువలెనే నీవును నిర్లిప్తుడవుగానే ఉందువు. చైతన్య స్వరూపమగు నీశక్తిచే సర్వకర్మలకు సాక్షీభూతుడవుగా నుందువు.

బహి రంత శ్చ భూతానాం త్వ మేవ రఘునందన
పూర్ణో ఒసి మాఘదృష్టీనాం విచ్ఛిన్న ఇవ లక్ష్యసే॥

రఘునందనా ! సర్వభూతముల బాహ్యాభ్యంతరములయందును నీవే వ్యాపించి నిండియున్నావు. నీవు పరిపూర్ణుడవు. కాని మాయా మోహితచిత్తులు మాత్రము నీ ఈస్వరూపమమును గ్రహింపలేరు. వారుమాత్రము నిన్ను అనేకునిగా దర్శింతురు.

జగత్త్వం జగదాధార స్త్వమేవ పరిపాలకః
త్వ మేవ సర్వభూతానాం భోక్తా భోజ్యం జగత్పతే॥

ఈ జగత్తంతయు నీవే. అనగా నీవే జగద్రూపుడవు. జగత్తుకు ఆధారమయినవాడవు నీవే. నీవే జగత్పరిపాలకుడవు. హే జగత్పతీ ! నీవే సర్వమును అనుభవించువాడవు. అనుభవించబడు వస్తువు నీవే.

దృశ్యతే శ్రూయతే యద్య త్స్మర్యతే వా రఘూత్తమ
త్వ మేవ సర్వ మఖిలం త్వద్వి నాన్య న్న కించన॥

నేత్రములకు కన్పించు సర్వజగత్పదార్థములును శ్రవణగోచరము లగు శబ్దాదులును లేదా ఆప్తులగు మహర్షులచే చెప్పబడు సర్వాదిలోక

ములును, మనోమాత్రగోచరములగు భావాదులును కూడ నీస్వరూప ములే. త్వదాధారకములే. నీవు లేనిది లేనేలేదు.

అయితే సృష్టి అంతయు మాయావికారముగదా ! అయినచో నాస్వరూప మెట్లయినది అను ప్రశ్నకు సమాధానించుచున్నాడు.

మాయా సృజతి లోకాంశ్చ స్వగుణైరహ మాదిభిః
త్వచ్ఛక్తిప్రేరితా రామ తస్మా త్వ య్యుపచర్యతే ॥

మాయ సృష్టికార మనుమాట వాస్తవమే. అది తనగుణము లగు సత్త్వరజస్తమస్సుల ప్రకోపమున జనించిన అహంకారాదులచే భూతసృష్టి నొనరించుచున్నదన్న మాటయు వాస్తవమే. కాని అది సృష్టిరూపమున పరిణమించుటకు మూలకారణము నీవే. మాయ అవ్యక్తావస్థయందున్నపుడు నీవు ప్రేరేపించుటచేతనే దానికి వ్యక్తావస్థ కలుగుచున్నది. నీ ప్రేరేపణయే లేనిచో సృష్టియే లేదు. కనుకనే నీవు సృష్టికారణుడవు. సృష్టిస్వరూపుడవు.

యథా చుంబకసాన్నిధ్యా చ్చలం త్యేవాచలాదయః
జడా తథా త్వయా దృష్ట్వా మాయా సృజతి వైజగత్ ॥

ఇనుము మొదలగు లోహములు వాస్తవముగా అచలములు. కాని అయస్కాంతసమీప్యమున అవి చలనకర్మకు వశమగుచున్నవి. అట్లే మాయకూడ తాను జడమయ్యును భవదీయసాన్నిధ్యమాత్ర మున వ్యక్తావస్థకులోనై సృష్టిగా పరిణమించుచున్నది.

దేహద్వయ మదేహస్య తవ విశ్వం రిరక్షుషోః
విరాట్ స్థూలం శరీరం తే సూత్రం సూక్ష్మ ముదాహృతం ॥

నీవు వాస్తవమునకు దేహరహితుడవు. కాని స్వకీయప్రేరణచే సంభవించిన సృష్టిరక్షణకై స్థూలసూక్ష్మరూపములయిన దేహద్వయ మును అంగీకరించుచున్నావు. నీ స్థూలశరీరమే విరాట్ అని పిలువబడు చున్నది. నీ సూక్ష్మశరీరమే సూత్రమనబడుచున్నది. సూత్రము హిరణ్యగర్భుడు. "తతో విరాడజాయత విరాజో ఽధి పురుషః" అని పురుషసూక్తము.

విరాజః సంభవ స్త్వేతే అవతారాః సహస్రశః
కార్యాంతే ప్రవిశం త్యేవ విరాజం రఘునందన॥

రామా! విరాట్పురుషునుండియే మత్స్యకూర్మాదులగు అవతారము లనేకములు ఆ యా కార్యాపేక్షములై కలుగుచుండును. అపేక్షితకార్యములు సమాప్తి నందగనే ఆ అవతారములు తిరిగి విరాట్పురుషునందే లయమగుచుండును.

అవతారకథాం లోకే యే గాయంతి గృణంతి చ
అనన్యమనసో ముక్తి స్తేషా మేవ రఘూత్తమ॥

విరాట్పురుషునినుండి జనించి రామకృష్ణాద్యవతార చరిత్రవిశేషములను భక్తిశ్రద్ధలతో గానముచేసినను, ధ్యానించినను మానవుడు భక్తుడనబడును. అనన్యమనస్కుడై నిన్నే భక్తితో కొలుచువాడు తప్పక తాపత్రయ విముక్తుడై ముక్తు డగుననుటకు సందేహములేదు.

త్వం బ్రహ్మణా పురా భూమే ర్భారహారాయ రాఘవ
ప్రార్థిత స్తపసా తుష్ట స్త్వం జాతో ఽసి రఘూణాం కులే॥

రాఘవా! నీవును విరాట్పురుషుని అనంతావతారములలో ఒకడవు. పూర్వము రావణాదులచే పెరిగిన భూభారమును హరించుమని బ్రహ్మ నిన్ను ప్రార్థించగా నీవు అంగీకరించగా దశరథుని పుత్రుడవుగా జన్మించినావు.

దేవకార్య మశేషేణ కృతం తే రామ దుష్కరం
బహువర్ష సహస్రాణి మానుషం దేహ మాశ్రితః
తుర్వా దుష్కరకర్మాణి లోకద్వయహితాయ చ
పాపహారిణి భువనం యశసా పూరయిష్యతి॥

చతుర్ముఖప్రజాపతి ఏడుద్దేశ్యముతో నిన్ను మానుషరూపుడవు గమ్మని ప్రార్థించినాడో ఆ దేవకార్యమును రావణాదివధరూపమయిన దానిని పూర్తిగా చేసితివి. ఇకముందు ఈ మనుష్యదేహముతోడనే అనేకవేలసంవత్సరములు జీవించి అనన్యదుర్లభములగు అలౌకికకృత్యములనేకములను చేయగలవు. ఆ నీకర్మలు సర్వలోకహితకారకము

లగును. ఈ నీగాథలు ముందుతరములవారి కల్మషములను కడిగివేయు గంగాజలము లగును. నీ స్వచ్ఛకీర్తిచే సర్వభువనములు అపూర్వ మాణములగును.

ప్రార్థయామి జగన్నాథ పవిత్రం కురు మే గృహం
స్థిత్వా ఽద్య భుక్త్వా సబలః శ్వో గమిష్యసి పత్తనం ॥

జగన్నాథా ! భవదీయాగమనముచే నాగృహమును పవిత్ర మొనరింపుము. ఈనాడు సర్వసైనికసమేతుడవై నాయింట అతిథిగా నుండి రేపు అయోధ్యానగరమునకు వెళ్ళి భరతాదులను మాడ వచ్చును.

తథేతి రాఘవో ఽతిష్ఠ తస్మి న్నాశ్రమ ఉత్తమే
ససైన్యః పూజిత స్తేన సీతయా లక్ష్మణేన చ ॥

భరద్వాజుని కోరిక ననుసరించి శ్రీరాము డాదినమున తపఃపరి పూతమగు ఆశ్రమమున ససైన్యుడై అతిథిగా ఉన్నాడు. మహర్షియు సీతాలక్ష్మణ సైన్యసహితుడగు రాముని యథావిధిగా అతిథిపూజల తృప్తిపరచెను.

తతో రామశ్చింతయిత్వా మూహూర్తం ప్రాహ మారుతిం
ఇతో గచ్ఛ హనూమం స్త్వ మయోధ్యాం ప్రతి సత్వరః

అనంతరము శ్రీరాముడు ఒక్క ముహూర్తకాలను ఆలోచించి హనుమంతుని సమీపమునకు పిలిచి ఇట్లు పలికెను. 'మారుతీ ! నీవీ క్షణమునే అయోధ్యానగరమునకు వెళ్ళుము.

జానీహి కుశలీ కచ్చి జ్జనో నృపతిమందిరే
శృంగవేరపురం గత్వా బ్రూహి మిత్రం గుహం మమ
జానకీలక్ష్మణోపేత మాగతం మాం నివేదయ ॥

అయోధ్యయందలి రాజభవనమున నా తల్లులందరు కుశలముగా నున్నవార్తను గ్రహించుము. ఈలోపుగనే మార్గమున శృంగవేరపుర మున నా ప్రాణమిత్రుడగు గుహుని దర్శించి అతనితో సీతాలక్ష్మణ సహితుడనగు నేను వచ్చువార్తను ఎరిగింపుము.

నందిగ్రామం తత్రో గత్వా భ్రాతరం భరతం మమ
దృష్ట్వా బ్రూహి సభార్యస్య సభ్రాతుః కుశలం మమ ॥

అనంతరము నందిగ్రామమునకు వెళ్ళి నాసోదరుడగు భరతుని దర్శించుము. పత్నీ, సోదరసహితుడగు అతనికి నాకుశలవార్త నెరిగింపుము.

సీతాపహరణాదీని రావణస్య వధాదికమ్
బ్రూవా క్రమేణ మే భ్రాతుః సర్వం తత్ర విచేష్టితం ॥

రావణుడు సీతను అపహరించుటయు, నేను రావణాదులను వధించుటయు మొదలుకొని లక్ష్మణ శౌర్యవృత్తాంతమును, ఇతరము లగు పనులను చెప్పుము.

హత్వా శత్రుగణా న్సర్వా న్సభార్యః సహ లక్ష్మణః
ఉపయాతి సమృద్ధార్థః సహ బుక్షహరీ శ్వరైః ॥

రావణ కుంభకర్ణేంద్రజిదాదులగు శత్రువులనందరను వధించి పత్నీ, సోదరసహితుడై సమస్త ప్రయోజనములను నెరవేర్చుకొని రాముడు బుక్షవానరులతో గూడి వచ్చుచున్నాడని చెప్పుము.

ఇత్యుక్త్వా తత్ర వృత్తాంతం భరతస్య విచేష్టితం
సర్వం జ్ఞాత్వా పునశ్శీఘ్రం ఆగచ్ఛ మమ సన్నిధిం ॥

ఈవిధముగా నాచరిత్రనంతయు వివరించి ఆసమయమున భరతుని ముఖకళవళికల ననుసరించియు, మాటలను బట్టియు, ఇతరచేష్టలనుబట్టియు అతని మనోభావములను గ్రహించి శీఘ్రముగా నాసన్నిధికి ఏతెంచుము. (తనకు భరతుడు ఉన్ముఖుడుగానున్నాడో లేక ప్రతిముఖుడుగా నున్నాడో తెలుసుకొనవలయునని రాముని ఉద్దేశ్యము.)

తథేతి హనుమాం స్తత్ర మానుషం వపు రాస్థితః
నందిగ్రామం యయౌ తూర్ణం వాయువేగేన మారుతిః
గమిత్వా నివ వేగేన జిఘృక్షు ర్భుజగోత్తమం ॥

హనుమంతుడును శ్రీరాముని ఆజ్ఞను వినగనే శిరసావహించి బయలుదేరెను. అతడు మానుషరూపమును ధరించి వాయువేగమున

అయోధ్యకు బయలుదేరెను. అకాశమార్గమున నెళ్ళి హనుమంతు డాసమయమున సర్పమును గ్రహించు ఇచ్ఛతో ఎగిరివెళ్ళు గరుత్మం తునివలె శోభించెను.

శృంగవేరపురం ప్రాప్య గుహ మాపాద్య మారుతిః
ఉవాచ మధురం వాక్యం ప్రహృష్టో వాంతరాత్మనా ॥

అతడు మొదటగా శృంగవేరపురమును చేరెను. అచ్చట శ్రీరామమిత్రుడగు గుహుని దర్శించి హృష్టచిత్తముతో మధురములగు వాక్యములను ఇట్లు పలికెను.

రామో దాశరథిః శ్రీమాన్ సఖా తే సహ సీతయా
సలక్ష్మణ స్త్వాం ధర్మాత్మా క్షేమీ కుశల మబ్రవీత్ ॥

విషధాధిపా ! సర్వాయోగిజనహృదయరమ్యుడు, దశరథపుత్రుడు నీమిత్రుడు అగు శ్రీరాముడు సీతా లక్ష్మణసహితుడై తనకుశలమును నీకు తెలియజేసినాడు.

అనుజ్ఞాతో ద్య మునినా భరద్వాజేన రాఘవః
ఆగమిష్యతి తం దేవం ద్రక్ష్యసి త్వం రఘూత్తమం ॥

నేడు భరద్వాజుని ఆతిథ్యమును స్వీకరించి అతనిచే అనుజ్ఞాతుడై శ్రీరాముడు బయలుదేరి రాగలడు. ఆరఘూత్తముని నీవు దర్శింప వచ్చును.

ఏవ ముక్త్వా మహాతేజాః సంప్రహృష్టతనూరుహాః
ఉత్పపాత మహావేగో వాయువేగేన మారుతిః ॥

ఇట్లు గుహునికి శ్రీరాముని ఆగమనవార్తను నివేదించి గుహుని రామభక్తి సందర్శనమున ఆనందముచే పులకాంకురములు కలుగగా మహాతేజోశాలియగు మారుతి వాయువేగమున అయోధ్యకు బయలు దేరెను.

సో పశ్యద్రామతీర్థం చ సరయూం చ మహానదీం
తా మతిక్రమ్య హనుమా న్నందిగ్రామం యయౌ ముదా ॥

ఆకాశచారియగు హనుమంతుడు మార్గమున పరశురామతీర్థమును సరయూనదిని సందర్శించుచు, వాటినిదాటి హృష్టచిత్తుడై నంది గ్రామమును చేరెను.

క్రోశమాత్రే త్వయోధ్యాయా శ్చీరకృష్ణాజినాంబరం
దదర్శ భరతం దీనం కృశ మాశ్రమవాసినం॥

హనుమంతుడు అయోధ్యకు ఒక క్రోశముదూరమున భరతుని సందర్శించెను. ఆసమయమున భరతుని స్థితి ఇట్లున్నది. అతడు నార చీరలను, కృష్ణాజినములనే వస్త్రములుగా ధరించినాడు. ముఖమున దీనభావము స్పష్టముగా గోచరమగుచున్నది. అతని శరీరము సంతత నియమపాలనచే కృశించియున్నది. ఉటజవాశియేయై తపస్వివలె కన్పించుచున్నాడు.

మలపంకవిదిగ్ధాంగం జటిలం వల్కలాంబరం
ఫలమూలకృతాహారం రామచింతాపరాయణం
పాదుకా తౌ పురస్కృత్య శాసయంతం వసుంధరాం॥

అత డీపదునాల్గు వత్సరములను సర్వసుఖములను వర్జించి యుండుటచే శరీరమంతయు ధూళిధూసరితమై మలినమైయున్నది. జటా వల్కములను ధరించి తపస్వివేషుడై యున్నాడు. అతనికి రామవియోగ సమయమున కందమూలఫలాదులే ఆహారములు. నిత్యము రామ నామస్వరూపములే అతని హృద్వీథిలో సంచరించుచున్నవి. అయాచితముగా మహత్తరసామ్రాజ్యము లభించినను పాదుకలనే పాలకులను గా ఎంచి తాను ప్రతినిధిగా రాజ్యపాలన మొనర్చుచున్నాడు.

మంత్రిభిః పౌరముఖ్యైశ్చ కాషాయాంబరధారిభిః
వృతదేహం మూర్తిమంతం సాక్షా ద్ధర్మ మివ స్థితం
ఉవాచ ప్రాంజలి ర్వాక్యం హనూమాన్ మారుతాత్మజః॥

భరతునితో పాటు ఆసభాస్థలమున రాజమంత్రులు, అయోధ్యానగరపౌరశ్రేష్ఠులకూడ విరాజిల్లియున్నారు. వారందరను భరతునివలెనే కాషాయాంబరమును ధరించి తపస్వీజీవితములను గడుపు

చున్నారు. వారిమధ్యలో భరతుడు సాక్షాత్తు మూర్తీభవించిన ధర్మ దేవతవలె తేజరిల్లుచుండెను. అట్టి భరతుని ఎదుట నిలబడి మరుత్పు త్రుడగు హనుమంతు డిట్లు అంజలిపూర్వకముగా విన్నవించెను.

యం త్వం చింతయసే రామం తాపసం దండకే స్థితం
అనుశోచసి కాకుత్స్థ స త్వాం కుశల మబ్రవీత్॥

భరతా! నీవు దండకవనమున తాపసవేషధారివై సంచరించుచు యేరాముసిగూర్చి అనునిత్యము ధ్యానించుచు చింతించుచున్నావో ఆ కకుత్స్థవంశతిలకుడగు శ్రీరాముడే నీకు తన కుశలవార్తను తెలియజేయుమని నన్నంపినాడు.

ప్రియ మఖ్యామి తే దేవ శోకం త్యజ సుదారుణం
అస్మిన్ముహూర్తే భ్రాతా త్వం రామేణ సహ సంగతః॥

దేవసన్ని భా! నీకు అత్యంత ప్రియము, హితము అగు వార్తను విన్నవించెదను. అతి దారుణమగు ఈ శోకమును త్యజించుము. ఆ ప్రియమిది– రాముని తో, నీ సోదరుడగు రాముని తో నీ వీముహూర్తమునందే కలుసుకొన్నావు. అవ్యవహితకాలమున నీకు రామదర్శనము కలుగునని భావము.

సమరే రావణం హత్వా రామః సీతా మవాప్య చ
ఉపయాతి సమృద్ధార్థః ససీతః సహ లక్ష్మణః॥

సీతాపహారకుడగు రావణుని యుద్ధమున బంధుమిత్ర పరివార సహితముగా వధించి పత్నిని సాధించినాడు. అతని మనోభీష్టములను అన్నిటిని సాధించి సీతాలక్ష్మణసహితుడై ఏతెంచుచున్నాడు.

ఏవ ముక్తో మహాతేజా భరతో హర్ష మూర్ఛితః
పపాత భువి చ స్వస్థం కైకేయీ ప్రియనందనః॥

హనుమంతు డిట్లు శ్రీరాముని ఆగమనసందేశమును వినిపింపగా భరతునకి పట్టరాని ఆనందము కలిగినది. ఆనందాతిరేకమున అతని మనస్సు అతని వశము తప్పినది. హఠాత్తుగా విన ప్రియవచనముచే

అతడు మూర్ఛనందినాడు. కైకేయీప్రియనందనుడగు అతడు భూపతి తుడయినాడు. కొంతసేపటికి మూర్ఛదేరినాడు.

ఆలింగ్య భరతః శీఘ్రం మారుతిం ప్రియవాదినం
ఆనందజై రశ్రుజలైః సిషేచ భరతః కపిమ్॥

అంతట భరతుడు లేచి ప్రియవార్తను శ్రవణపుటముల కందించిన మరుత్పుత్రుని గాఢముగా ఆలింగనమొనర్చినాడు. ఆసమయమున అతని నేత్రములనుండి వెలువడు ఆనందాశ్రువులు హనుమంతుని అభిషేకించినవి.

దేవో వా మానుషో వా త్వం అనుక్రోశా దిహాగతః
ప్రియాఖ్యా నస్యతే సౌమ్య దదామి బ్రువతః ప్రియమ్॥

నీవు దేవతవో లేక మానవుడవో నాకు తెలియకుగాని నిక్కముగా నాయందలికృపాభావముచేతనే నీవు ఇచ్చటికి వేంచేసితివి. నాకు మహత్తమమగు ప్రియమును వినిపించిన నీవు ఏదికోరిన దానినే ఇవ్వగలవాడను.

గవాం శతసహస్రం చ గ్రామాణాం చ శతం వరమ్
సర్వాభరణసంపన్నా ముద్వాహ కన్యా స్తు షోడశ॥

నీవు కోరినవెంటనే నూరువేల ధేనువులను, నూరు సమృద్ధ గ్రామములను, సర్వాభరణసంపన్నలగు పదహారుగురు సుందర కన్యకామణులను ఒసగెదను.

ఏవ ముక్త్వా పునః ప్రాహ భరతో మారుతాత్మజం
బహూ నీమాని వర్షాణి గతస్య సుమహద్వనమ్
శృణో మ్యహం ప్రీతికరం మమ నాథస్య కీర్తనమ్॥

భరతు డిట్లుపలికి తిరిగి మరుత్పుత్రునితో తనకు కలిగిన మహానందమునకు కారణమును వివరించుచున్నాడు.

నాకు ప్రాణప్రియుడయిన శ్రీరామచంద్రుడు వనగతుడై సుదీర్ఘములగు పదునాల్గు సంవత్సరములు గతించినవి. తిరిగి ఇంతకాలమునకు మనఃప్రీతికరమయిన ప్రభుగుణ సంకీర్తనమును నీ ముఖతః విన్నాను.

కళ్యాణీ బత గాధేయం లౌకికీ పతిభాతి మే
ఏతిజీవన్త మానందో నరం వర్షశతా దపి॥

శ్రీరామచంద్రునిగూర్చి నీవు వర్ణించిన మంగళమూలమగు ఈ వర్ణనమంతయు యథార్థముగానే నాకు తోచుచున్నది. అనగా ఈరామ కథ యథార్థమగుటచేతనే ఆనందదాయకముగా నున్నది. చిరకాలము నకు నాకీఆనందము లభ్యమయినది. మానవుడు దుఃపూర్ణములయిన నూరు సంవత్సరములు జీవించినను చివరకు ఆనందమును పొందగలడు గదా! సుఖదుఃఖములు పర్యాయక్రమమునవచ్చిన వగుటచే దుఃఖా నంతరమున ఆనందమును పొందియే తీరును. అట్లే నాకీ దుఃఖానంతర మున ఆనందము లభ్యమయినది.

రాఘవస్య హరీణాం చ కథ మాసీ త్సమాగమః
త త్వ మాఖ్యాహి భద్రం తే విశ్వసే యం వచ స్తవ॥

నిజమునకు రామచంద్రునకు వానరజాతివారికి సమాగమ మెట్లు ఒనగూడినది? వాస్తవమును వాక్రుచ్చుము. నీవు చెప్పినదానిని నేను తప్పక విశ్వసించెదను.

ఏవ ముక్తో ధ హనుమా న్భరతేన మహాత్మనా
అవాచష్టే ఽథ రామస్య చరితం కృత్స్నశః క్రమాత్॥

భరతు డిట్లు అడుగగా హనుమంతుడు శ్రీరాముని చరిత్రను సంపూర్ణముగా క్రమబద్ధముగా వినిపించెను.

శ్రుత్వా తు పరమానందం భరతో మారుతాత్మజాత్
ఆజ్ఞాపయ చ్ఛత్రుహనం ముదా యుక్తం ముదాన్వితః॥

మరుత్పుత్రునిచే వర్ణితమయిన రామకథను విని భరతుడు అత్యంతము సంతోషితాంతరంగు డయ్యెను. ఆనందయుక్తుడగు ఆతడు తనతోపాటు రామచరిత్రశ్రవణమున ఆనందించుచున్న శత్రుఘ్నుని కిట్లాజ్ఞాపించెను.

దైవతాని చ యావంతి నగరే రఘునందన
నానోపహారబలిభిః పూజయంతు మహాధియః॥

రఘునందనా ! అయోధ్యానగరమందున దేవస్థలముల నన్నిం టను వివిధములగు బలులనువేసి ఆ యా దేవతలకు తృప్తికలుగునట్లు పూజించుము.

సూతా వైతాలికా శ్చైన వందిన స్తుతిపాఠకాః
వారముఖ్యా శ్చ శతశో నిర్యాన్త్వద్యైవ సంఘశః ॥

సూతకులమందు జన్మించిన రథసారథులు, స్తుతిపాఠకులగు వైతాళికులు, వందులు, వేశ్యాస్త్రీలు మొదలగువారందరును రాము నికి స్వాగతమిచ్చుటకు నగరమునుండి వెలుపలకు వచ్చుదురుగాక !

రాజదారా స్తథామాత్యాః సేనా హాస్త్యశ్వపత్తయః
బ్రాహ్మణా శ్చ తథా పౌరా రాజానో యే సమాగతాః
నిర్యాంతు రాఘవ స్యాద్య ద్రష్టుం శశినిభాననమ్॥

కౌసల్యాదులగు రాజపత్నులు, సుమంత్రాదులగు అమాత్యులు, ఇతరసేనలు, హస్త్యశ్వాదులు, బ్రాహ్మణ క్షత్రియాదులగు పౌరముఖ్యులు–వీరందరును చంద్రసమానముఖకాంతిగల శ్రీరాముని దర్శించుటకు నగరము వెలుపలకు వచ్చెదరుగాక !

భరతస్య వచః శ్రుత్వా శత్రుఘ్నపరిచోదితాః
అలంచక్రు శ్చ నగరీం ముక్తారత్నమయోజ్వలైః ॥

భరతుని ఆజ్ఞ ననుసరించి శత్రుఘ్నుడు సేవకులను ఆజ్ఞాపించగా వారు అయోధ్యానగరమును మహోజ్వలముగా అలంకరించిరి.

తోరణై శ్చ పతాకాభి ర్విచిత్రాభి రనేకధా
అలంకుర్వంతి వేశ్మాని నానాబలివిచక్షణాః
నిర్యాంతి బృందశ స్సర్వే రామదర్శనలాలసాః ॥

మంచిముత్యాల తోరణములతోడను, విచిత్రవర్ణశోభితములగు పతాకలతోడను రాజమార్గములను అలంకరించిరి. ప్రజలును అలంకర దక్షులగుటచే తమతమ గృహములను అలంకరించిరి. నగరవాసులంద రును ఆబాలవృద్ధముగా నగరమునుండి వెలువడిరి.

హయానాం శతసాహస్రం గజానా మయుతం తథా
రథానాం దశసాహస్రం స్వర్ణసూత్రవిభూషితం ॥
పారమేష్ఠి న్యుపాదాయ ద్రవ్యా ణ్యుచ్చావచాని చ
తత స్తు శిబికారూఢా నిర్యయూ రాజయోషితః ॥

నూరువేల అశ్వములను, పదివేల ఏనుగులను, స్వర్ణసూత్రా లంకృతములగు పదివేలరథములను, ఇంకను రాజయోగ్యములగు అనేక మంగళద్రవ్యములను ముందుంచుకొని పల్లకీలనెక్కి కౌసల్య, సుమిత్ర, కైకేయి మొదలగు రాజపత్నులు నగరమునుండి వెలువడిరి.

భరతః పాదుకే న్యస్య శిర స్యేవ కృతాంజలిః
శత్రుఘ్న సహితో రామం పాదచారేణ నిర్యయా ॥

భరతుడు శ్రీరామపాదుకలను తన శిరస్సునందే ధరించి కృతం జలియు, పాదచారియునై రామదర్శనమునకు బయలుదేరెను. శత్రు ఘ్నుడును అతనిని అనుసరించెను.

తత్రైవ దృశ్యతే దూరా ద్విమానం చంద్రసన్నిభం
పుష్పకం సూర్యసంకాశం మనసా బ్రహ్మనిర్మితం ॥

ఇట్లు భరతాదులు రామదర్శనలాలసులై నగరమును వెలువడ గనే వారికి దూరముగా ఆకాశమార్గమున చంద్రసూర్యసన్నిభమును బ్రహ్మమానససృష్టియు అగు విమానము దృష్టిగోచరమయినది.

ఏతస్మి న్భాతరా వీరా వైదేహ్యా రామలక్ష్మణౌ
సుగ్రీవ శ్చ కపిశ్రేష్ఠో మంత్రిభి శ్చ విభీషణః
దృశ్యంతే పశ్యత జనా ఇ త్యాహ పవనాత్మజః ॥

ఇంతలో విమానము ఇంకను సమీపమునకు వచ్చినది. అంతట హనుమంతుడు భరతాదులకు-ఇదుగో వీరు రామలక్ష్మణులు. వైదేహీ సహితులై ఉన్నారు. అదుగో అతడు సుగ్రీవుడు. అతడే వానరచక్ర వర్తి. అతడు విభీషణుడు. అతని సమీపమున నున్నవారే అతని మంత్రులు. వీరందరు జాంబవదాదులు. వేరువేరుగా చూడుడు అని నిరూపించి చెప్పెను.

తతో హర్ష సమూదూ్భతో నిస్వనో దివ మస్పృశత్
స్త్రీబాలయువవృద్ధానాం రామో య మితి కీర్తనాత్ ॥

హనుమంతు డిట్లు పలుకగనే అచ్చట గుమిగూడియున్న స్త్రీలు బాలురు, యువకులు, వృద్ధులు, సర్వులూ–రాముడు ! రాముడు ! అడుగో రాముడు ! అని పలుకనారంభించిరి. వారి ఆకోలాహలము ఆకాశమునంటినది.

రథకుంజరవాజిస్థా అవతీర్య మహీంగతాః
దదృశు స్తే విమానస్థం జనాః సోమ మివాంబరే
ప్రాంజలి ర్భరతో ప్రహృష్టో రాఘవోన్ముఖః ॥

అంతవరకూ రథములనూ, ఏనుగులనూ, అశ్వములనూ అధిష్ఠించినవారందరునూ ఈ వార్తను వినగనే తమతమ వాహనములనుండి క్రిందికి దిగిరి. వారందరు ఆకాశమున విమానమందుండి చంద్రునివలె ప్రకాశించుచున్న శ్రీరామచంద్రుని దర్శించిరి. అంతట భరతుడును ప్రాంజలియై రాముడు వచ్చుచున్న దిక్కు–నకు ఎదురుగా నిలబడెను.

తతో విమానాగ్రగతం భరతో రాఘవం ముదా
వవందే ప్రణతో రామం మేరుస్థం మివ భాస్కరం ॥

విమానమందున్న రాము డాసమయమున మేరుపర్వతమందున్న సూర్యునివలె ప్రకాశించుచుండెను. భరతుడు భక్తిభావమున అతనికి ప్రణతుడయ్యెను.

తతో రామాభ్యనుజ్ఞాతం విమాన మపత ద్భువి
ఆరోపితో విమానం తద్భరతః సానుజ స్తదా
రామ మూపాద్య ముదితః పున రేవాభ్యవాదయత్ ॥

అంతట శ్రీరాము డాజ్ఞాపించగా పుష్పకవిమానము భూమికి దిగివచ్చెను. భరతుడును సోదరసహితుడై విమానము నధిరోహించి రామసమీపమును జేరి అభివందన మాచరించెను.

సముత్థాప్య చిరా ద్దృష్టం భరతం రఘునందనః
భ్రాతరం స్వాంక మారోప్య ముదా తం పరిషస్వ్జే ॥

అంతట రాముడు పాదాభివందన మాచరించిన భరతుని లేవ నెత్తి చిరకాలముకిందట చూచియుండుటచే ప్రేమతో అంకమం దారో పితుని జేసికొని గాఢపరిష్వంగ మొనర్చెను.

తతో లక్ష్మణ మాసాద్య వైదేహీం నామ కీర్తయన్
అభ్యవాదయత ప్రీతో భరతః ప్రేమవిహ్వ్లలః ॥

అనంతరము బంధుప్రేమచే విహ్వ్లలుడయిన భరతుడు లక్ష్మ ణుని సమీపించి సంభావించెను. తరువాత వైదేహిని సమీపించి తన పేరుజెప్పి పాదాభివందన మాచరించెను.

సుగ్రీవం జాంబవంతం చ యువరాజం తథాంగదం
మైందద్వి విదనీలాం శ్చ బుషభం చైవ సస్వ్జే
సుషేణం చ నలం చైవ గవాక్షం గంధమాదనం
శరభం పనసం చైవ భరతః పరిషస్వ్జే ॥

అనంతరం రామునకు సహాయకారులుగానున్న సుగ్రీవ, జాంబ వదాంగద మైందద్వివిదనీల, నలయుషభ, సుషేణ, గవాక్షగంధమాదన శరభపనసాదులగు వానరశ్రేష్ఠులను భరతుడు ఆలింగనపూర్వకముగా సంభావించెను.

సర్వే తే మానుషం రూపం కృత్వా భరత మాద్యతాః
పప్రచ్ఛుః కుశలం సౌమ్యాః ప్రహ్వ్లష్టా శ్చ ప్లవంగమాః ॥

సుగ్రీవాదులగు వానరులందరును కామరూపులగుటచే ఆసమయ మున సౌమ్యములగు మానవరూపమును ధరించియుండిరి. వారంద రును భరతదర్శనమున ప్రహర్షితచిత్తులై అతని కుశలజీవితమును పృచ్ఛ జేసిరి.

తతః సుగ్రీవ మాలింగ్య భరతః ప్రాహ భక్తితః
త్వత్సహాయేన రామస్య జయోఽ భూ ద్రావణో హతః
త్వ మస్మాకం చతుర్ణాం తు భ్రాతా సుగ్రీవపంచమః ॥

భరతుడు ప్రత్యేకముగా సుగ్రీవుని కౌగలించుకొని భక్తిభావ ముతో ఇట్లు పలికెను. "నిజముగా నీ సహాయమునవే రావణుడు నిహతుడై రామునకు విజయము లభించినది. నిజముగా నీవలన మేము నలుగు రన్నదమ్ములము నేడు అయిదుగురమయితిమి. నీవు మానలు వురకు అయిదవనాడవు.

శత్రుఘ్న శ్చ తదా రామం అభివాద్య సలక్ష్మణం
సీతాయా శ్చరణౌ పశ్చాద్ వవందే వినయాన్వితః॥

అంతట శత్రుఘ్నుడు భక్తితో రామలక్ష్మణుల పాదములకు అభివాదన మొనర్చి అనంతరము, వినయభావముతో సీతాదేవి చరణములకు నమస్కరించెను.

రామో మాతర మాసాద్య వివర్ణాం శోకపీహ్వాలాం
జగ్రాహ ప్రణతః పాదౌ మనో మాతుః ప్రసాదయన్
కైకేయీం చ సుమిత్రాం చ ననా మేతరమాతరః॥

అనంతరము రాముడు దుఃఖవిహ్వలయు, వివర్ణయు అయి యున్న తల్లిని సమీపించి ఆమె పాదములపై వ్రాలి నమస్కరించెను. ఈపుత్రనమస్కారమున కౌసల్యాదేవి హృదయము ఆనందపూర్ణమయినది. అనంతరము రాముడు కైకేయీసుమిత్రలకు, ఇతరమాతలకును వేర్వేరుగా పాదాభివందన మాచరించెను.

భరతః పాదుకే తే తు రాఘవస్య సుపూజితే
యోజయామాస రామస్య పాదయో ర్భక్తిసంయుతః॥

అంతట భరతుడు ఇంతకాలము తాను పూజించుచున్న రామ పాదుకలను భక్తిప్రపత్తులతో ప్రభుపాదములకు దొడగెను.

రాజ్య మేత న్న్యాసభూతం మయా నిర్యాతితం తవ
అద్య మే సఫలం జన్మ ఫలిత్రో మే మనోరథః
యత్పశ్యామి సమాయాత మయోధ్యాం త్వా మహం ప్రభో॥

పాదుకలను రామపాదములకు దొడగి భరతు డిట్లుపలికెను. ప్రభూ ! నీవు నాపై న్యాసరూపమున ఉంచిన ఈరాజ్యభారమును తిరిగి నీకు సమర్పించుచున్నాను. ఇంతకాలమునకు కృతకృత్యుడనయిన నాజన్మ ఫలించినది. నామనోరథ మీడేరినది. పునఃఅయోధ్యకు వచ్చిన నిన్ను జూచిధన్యుడనయితిని.

కోష్ఠాగారం బలం కోషం కృతం దశగుణం మయా
త్వత్తేజసా జగన్నాథ ఫలయస్వ పురం స్వకం॥

రాజ్యమేగాక కోష్ఠాగారమును, బలమును, కోశమునుకూడ అర్పించుచున్నాను. ఇవి నాచే ఒకొ్కకటి పదిరెట్లు అభివృద్ధిచేయ బడినవి. అది నా స్వశక్తివల్లగాదు. నీ తేజోప్రభావమే దానికి కారణము. ఇక నీ రాజధానీనగరమును భాగ్యవంతమొనర్చుము.

ఇతి బ్రువాణం భరతం దృష్ట్వా సర్వే కపీశ్వరాః
మునుచు ర్నేత్రజం తోయం ప్రశశంసు ర్ముదాన్వితాః॥

ఇట్లు భక్తిప్రపత్తులతో గామునకు రాజ్యమునర్పించుచున్న భరతుని జూచి అక్కడచేరియున్న సుగ్రీవాదులగు కపీశ్వరులందరును అతని భ్రాతృభక్తికిని, నిర్లేపత్వమునకు ఆనందించి ప్రశసించుటేగాక, మోదాశ్రుపూరితనయనులుగ నయిరి.

తతో రామః ప్రహృష్టాత్మా భరతం స్వాఙ్కగతం ముదా
యయౌ తేన విమానేన భరత స్యాశ్రమం తదా॥

అంతట శ్రీరాముడును ప్రహృష్టహృదయుడై సోదరుని అంకమందు కూర్చుండబెట్టుకొనెను. తరువాత విమానమునైననే భరతు డీ పదునాల్గువత్సరములు గడపిన నందిగ్రామాశ్రమమునకు వెళ్ళెను.

అవరుహ్య తదా రామో విమానాగ్రా న్మహీతలమ్
అబ్రవీ త్సుషకం జేవో గచ్ఛ వైశ్రవణం వహ
అనుగాచ్ఛానుజానామి కుబేరం ధనపాలకం॥

అక్కడ రాముడు పుష్పకవిమానమునుండి భూమికి దిగెను. దిగి పుష్పకమును "నీవు వెళ్ళి ధనపాలకుడు వైశ్రవణుడు అయిన కుబేరుని వహించుము" అని ఆజ్ఞాపించెను.

రామో వశిష్ఠస్య గురోః పదాంబుజం
నత్వా యథా దేవగురోః శతక్రతుః
దత్వా మహాసనము ముత్తమం గురో
రుపావిశేదాధ గురోః సమీపతః॥

పుష్పకావరోహణమొనరించిన అనంతరము శ్రీరామచంద్రుడు గురువులగు విశిష్ఠులను సమీపించి వారి పాదపద్మములకు భక్తితో ప్రణమిల్లెను. ఆ దృశ్యము శతక్రతుస్వరూపుడగు దేవేంద్రుడు దేవగురువగు బృహస్పతికి ప్రణమిల్లినట్లే ఉన్నదట. అనంతరము ఉత్తమాసనమున గురువులను ఉపవిశునొనరించి తాను ఆసమీపమునసే కూర్చొనెను.

పంచదశసర్గ

సకలజగదానందసంధాయకుడయిన శ్రీరామచంద్రప్రభువు అవతార ముఖ్యకర్తవ్యమును నిర్వర్తించి సమస్తమానవజీవనాదర్శకమగు లీలాచరిత్రమును ప్రకటించుచు అయోధ్యాపురి కేతెంచినాడు. గురువులగు వశిష్ఠులకు సర్వమును నివేదించినాడు. అశిష్టజనశిక్షణతోపాటు శిష్టజనరక్షణకునైన రాజధర్మప్రచారముగూడ శ్రీరాముని కర్తవ్యమే. ఈరెండవకర్తవ్యమును నిర్వర్తించుటచే రాముడు పదునొకండువేలేండ్లు రాజ్యపరిపాలనమొనర్చి రామరాజ్యమను ఆదర్శరాజ్యమునకు విధాయకు డయినాడు. ఈభవిష్యత్కర్త నిర్వహణమునకు ప్రారంభము రాజ్యాభిషేకముతోనయినది. ఈ మహత్తమ ఫలప్రదమయిన అభిషేకోత్సవము పంచదశసర్గయందు వర్ణింపబడినది. శంకరుడు ఈవిషయమునే ప్రతిపాదింపదలచి భరతప్రార్థనాగౌరవమున పరమాత్మ రాముడు రాజ్యపాలనమున కంగీకరించినట్లు పార్వతికి వినిపించుచున్నాడు.

శ్రీ మహాదేవ ఉవాచ :—

తత స్తు కేకయీపుత్రో భరతో భక్తి సంయుతః
శిర స్యంజలి మాధాయ జ్యేష్ఠం భ్రాతర మబ్రవేత్॥

అనంతరము కైకేయీపుత్రుడగు భరతుడు భక్తిభావముతో నిండిన హృదయము గలవాడై శిరసా అంజలిఘటించి అన్నగారగు శ్రీరామచంద్రునితో ఇట్లు పలికెను.

మాతా మే ఽసత్కృతా రామం దత్తం రాజ్యం త్వయా మమ
దదామి తత్తే చ పున ర్యథా త్వ మడదా మమ॥

రామా! మాతల్లి చేసిన నింద్యకర్మవలన నీవు ఈనీరాజ్యమును నావద్ద న్యాసముగా నుంచితివి. నీవిదివరకు దీనిని నాకిచ్చినట్లుగనే తిరిగి నీకు సమర్పించుచున్నాను. నీరాజ్యమును నీకిచ్చుచున్నానేగాని

నా ఔదాగ్య మేమియు ఇంపు లేదనియు, నాతల్లి అసత్ప్రవర్తనవలననే ఇంతకాలము నేను రాజ్యభారమును వహింపవలసివచ్చినదేగాని స్వీయానుమతి ఇందు ఏమాత్రము లేదనియు భరతుని భావము.

ఇత్యుక్త్వా పాదయో ర్భక్త్యా సాష్టాంగం ప్రణిపత్య చ
బహుధా ప్రార్థయామాస కైకేయ్యా గురుణా సహ॥

ఇట్లు పలికి భరతుడు శ్రీరామచంద్రుని పాదపద్మములకు భక్తితో ప్రణమిల్లినాడు. రాజ్యభారమును వహించుమని పదేపదే ప్రార్థించినాడు. ఆసమయమున భరతుని తల్లి కైకేయియు, గురువులగు వసిష్ఠులునుగూడ భరతుని విశుద్ధచారిత్ర్యమును వివరించి రాజ్యమును చేకొనుమని రాముని ఆదేశించినారు.

తథేతి ప్రతిజగ్రాహ భరతా ద్రాజ్య మీశ్వరః
మాయా మాశ్రిత్య సకలాం నరచేష్టా ముపాగతః॥

ఇట్లందరి అనుజ్ఞను పొంది భరతుని వాక్యమును మన్నించి ప్రభువు రాజ్యమును గ్రహించినాడు. రాజ్యమును గ్రహించినాడనగా రాముడు రాజ్యభోగానుభవమునకై గ్రహించలేదు. లోకవ్యవహార శిక్షణమునకై మాయ నంగీకరించి నరునివలె ప్రవర్తిల్లినాడేగాని పరమాత్మకు భోగములపై ఈషత్తయిన వాంఛలేదు.

స్వారాజాన్యభవో యస్య సుఖజ్ఞానైకరూపిణః
నిరస్తాతిశయానందరూపిణః పరమాత్మనః
మానుషేణ తు రాజ్యేన కిం తస్య జగదీశితుః॥

పరమాత్మ ఆనందజ్ఞానములే స్వరూపముగా గలవాడు. అతడు స్వీయానందరాజ్యమునే నిత్యమూ అనుభవించుచుండును. మానుషాదులగు సర్వానందములకంటె బ్రహ్మానందము సర్వోత్కృష్టమనియు, దానిని మించినది మరియొకటి లేదనియు ఉపనిషత్తులు ఘోషించుచున్నవి. అట్టి నిరతిశయబ్రహ్మానందస్వరూపుడే ఈ రాముడు. అట్టి జగత్ప్రభునకు ఈమానుషరాజ్యసుఖ మేపాటిది. కాన రాముడు

రాజ్యమును స్వీకరించుటలో లోకసంగ్రహభావమే గాని సుఖానుభవ వాంఛకారణముగాదని శంకరుడు ఈశ్లోకమున వివరించినాడు.

యస్య భ్రూభంగమాత్రేణ త్రిలోకీ నశ్యతి క్షణాత్
యస్యానుగ్రహమాత్రేణ భవ న్త్యాఖండశ్రియఃి
లీలాసృష్టమహాసృష్టేఃి కియ దేత ద్రమాపతేఃి ॥

పరాత్పరుడగు శ్రీరామచంద్రుని ఒక క్రోధవ్యంజిక భ్రూభంగ మునచే త్రిలోకములు విలయము నొందును. అతని అనుగ్రహ ప్రసార ణమున ఇంద్రభోగము లనేకములు సృష్టింపబడును. విలాసమాత్ర ముగా ఈ సమస్త బ్రహ్మాండసృష్టిని రచించిన లక్ష్మీనాథునకు ఈ మానవసామ్రాజ్యము ఏపాటిది. ఇందు రాముని సర్వశక్తిమత్త్వము నిరూపితమయినది.

అయితే ఈ మానవలీల లెందులకు? వీటి ప్రయోజనమేమి? అను ప్రశ్నలకు సమాధానమిచ్చుచున్నాడు.

తథాపి భజతాం నిత్యం కామపూరవిధిత్సయా
మాయా మానుషదేహేన సర్వ మ ప్యనువ ర్తతే ॥

రాముడు పరమాత్మయయ్యు తను భజించు భక్తబృందముల అభిలాషలను నెరవేర్చు ఉద్దేశ్యముతో మాయామానుషదేహమును ధరించి రాజ్యపాలనాదికములగు మానవచరిత్రమును అనుసరించు చున్నాడు.

అభిషేకప్రయత్నములను వివరించుచున్నాడు:

తతఃి శత్రుఘ్నువచనా న్నిపుణాఃి శ్మశ్రుకుంతకాఃి
సంభారా శ్చాభిషేకార్థ మానీతా రాఘవస్య హి ॥

అనంతరము శత్రుఘ్నుడు శ్మశ్రుకుంతకులను రప్పించినాడు. ఇంకను స్నానమునకు కావలసిన ఇతర వస్తుసామగ్రినంతను సమకూర్చి రాముని స్నానముచేయింప సమకట్టెను.

పూర్వంతు భరతే స్నాతే లక్ష్మణే చ మహాత్మని
సుగ్రీవే వానరేంద్రే చ రాక్షసేంద్రే విభీషణే ॥

మొట్టమొదట భరతుడు స్నానమొనర్చినాడు. అనంతరము మహాత్ముడగు లక్ష్మణుడు అభిషేకమొనర్చెను. తరువాత క్రమముగా వానరేంద్రుడగు సుగ్రీవుడును, రాక్షసేంద్రుడగు విభీషణుడును స్నానము లొనర్చిరి.

విశోధితజటఃస్నాత శ్చిత్రమాల్యానులేపనః
మహార్హావసనోపేత స్తస్థౌ తత్ర శ్రియా జ్వలన్ ॥

శ్మశ్రుకుంతకులగు నాపితులు తమ కార్యమును నిర్వర్తించిన అనంతరము జటలను విడిచి శ్రీరాముడు స్నానమొనర్చెను. అప్పుడు అతడు చిత్రమాలాను లేపనములను స్వీకరించి ఉత్తమమగు వస్త్రమును ధరించి శోభాయుతుడై ప్రకాశించెను.

ప్రతికర్మ చ రామస్య లక్ష్మణస్య మహామతిః
కారయామాస భరతఃసీతయా రాజయోషితః
మహార్హావస్త్రాభరణై రలంచక్రుఃసుమధ్యమాం ॥

వివేకియగు భరతుడు రామలక్ష్మణులను, సీతాదేవికిని ఉచితములగు వేషభూషలను సమర్పించి అలంకరింపజేసెను. కౌసల్యాదులగు రాజపత్నులు జానకీదేవిని శ్రేష్ఠతమములగు వస్త్రాభరణాదులచే అలంకరించిరి.

తతో వానరపత్నీనాం సర్వాసా మేవ శోభనామ్
అకారయత్ కౌసల్యా సంతుష్టా పుత్రవత్సలా ॥

కౌసల్య పుత్రవాత్సల్యము అపారమయినది. ఆకారణమునచే ఆమె తనపుత్రునకు సహాయకులయిన సుగ్రీవాది వానరోపత్నుల కంద రకును మంగళస్నానముల నొనరింపజేసి అలంకరింపజేసినది.

తతఃస్యందన మాదాయ శత్రుఘ్నవచనా త్సుధీఃసుమంత్రఃసూర్యసంకాశం యోజయి త్వాగ్రతఃస్థితః ॥

ఇట్లు సర్వులు అలంకృతులయినపిమ్మట సుమంత్రుడు శత్రుఘ్నుని వచనము ననుసరించి సూర్యునివలె తేజరిల్లుచున్న రథమును దివ్యములగు అశ్వములను పూన్చి ఎదుట నిలబెట్టెను.

ఆరురోహ రథం రామః సత్యధర్మపరాయణః
సుగ్రీవో యువరాజ శ్చ హనూమాం శ్చ విభీషణః
స్నాత్వా దివ్యాంబరధరా దివ్యాభరణభూషితాః ॥
రామ మన్వీయు ర్యత్రే చ రథాశ్వగజవాహనాః
సుగ్రీవపత్న్య స్సీతా చ యయు ర్యానైః పురం మహత్ ॥

అంతట శ్రీరాముడు సుమంత్రానీతమగు రథమును అధిష్ఠించి నాడు. సత్యధర్మపరాయణుడగు అతనిని స్నానము చేసి దివ్యాభరణము దివ్యాంబరములను ధరించిన సుగ్రీవాంగద హనూమద్విభీషణాదులు అనుసరించిరి. కొందరు ముందుకూడ నడచిరి. సుగ్రీవుని భార్యలు ఉచితవాహనములలో సీతాదేవిని అనుసరించిరి. ఇట్లు అందరును అయోధ్యానగరమునకు బయలుదేరిరి.

వజ్రపాణి ర్యథా దేవై ర్వారితాశ్వరథే స్థితః
ప్రయయౌ రథ మాస్థాయ తథా రామో మహత్ పురం॥

హరితవర్ణములగు అశ్వములు పూన్చబడిన రథము నధిష్ఠించి దేవతలచే పరివేష్టితుడై ఏగు వజ్రపాణియగు ఇంద్రునివలె శోభించుచు రాముడు రథారూఢుడై మహత్తమమగు అయోధ్యానగరమునకు బయలుదేరెను.

సారథ్యం భరత శ్చక్రే రత్నదండం మహాద్యుతిః
శ్వేతాతపత్రం శత్రుఘ్నో లక్ష్మణో వ్యజనం దధౌ ॥

రామాధిష్ఠితమయిన ఆరథమునకు చోదకుడుగా భరతుడమరి నాడు. రత్నమయదండము గలిగి మహాకాంతిమంతమయిన శ్వేతాత పత్రమును శత్రుఘ్నుడు పట్టినాడు. లక్ష్మణుడు వింజామరను ధరించి నాడు.

చామరం చ సమీపస్థో న్యవీజయ దరిందమః
శశిప్రకాశం త్వపరం జగ్రా హాసురనాశకః ॥

సమీపమునన్నున్న శత్రునాశకుడగు సుగ్రీవుడు చామరమును

పట్టి వీవనారంభించెను. అసురరాజు విభీషణుడు చంద్రుని వెన్నెలలను వెదజల్లు మరియొక చామరమును వీవనారంభించినాడు.

దివిజైః సిద్ధసంఘైశ్చ ఋషిభిర్దివ్యదర్శనైః
స్తూయమానస్య రామస్య శుశ్రువే మధురధ్వనిః ॥

ఇట్లు అయోధ్యకు బయలుదేరిన మంగళమూర్తియగు రాముని ఇంద్రాదిదేవతలు, సిద్ధసంఘములు, క్రాంతదర్శులగు మహర్షులు స్తుతించనారంభించిరి. వారి ప్రార్థనల మధురధ్వని భూమ్యాకాశములలో వ్యాపించి సర్వానందదాయక మయ్యెను.

మానుషం రూప మాస్థాయ వానరా గజవాహనాః
భేరీశంఖనినాదైశ్చ మృదంగపణవానకైః ॥

ఇతర వానరులందరును కామరూపులగుటచే మానవాకారము లను ధరించి గజవాహనారూఢులై రాముని వెంట చనిరి. ఆప్రయాణ సమయము భేరులు, శంఖములు, మృదంగములు, పణవములు, ఆనకములు మొదలగు అనేకములగు మంగళవాద్యములు మ్రోగినవి.

ప్రయయౌ రాఘవశ్రేష్ఠ స్తాం పురీం సమలంకృతాం
దదృశుస్తే సమాయాంతం రాఘవం పురవాసినః ॥

ఇట్లు బంధుమిత్ర పరివారసహితుడై రాఘవశ్రేష్ఠుడగు శ్రీరామ చంద్రమూర్తి సర్వాలంకారశోభితమగు అయోధ్యానగరమును ప్రవేశించెను. చిరకాలమునకు తిరిగి వచ్చుచున్న తమ ప్రభువును పురవాసులందరును ఆనందముతో దర్శించసాగిరి.

దూర్వాదలశ్యామతనుం మహార్హ
కిరీటరత్నాభరణాచితాంగం
ఆరక్తకంజాయతలోచనాంతం
దృష్ట్వా యయుర్మోద మతీవ పుణ్యాః ॥

శ్రీరామచంద్రుని శరీరవర్ణము దూర్వాదళకాంతిని పురుడించుచున్నది. మహోత్తరమగు కిరీటము రత్నఖచితసువర్ణాభరణములును

ఆ శరీరకాంతిలో విచిత్రవిశోభాభాసము నుత్పాదించుచున్నవి. వీనికి తోడు స్వామి నేత్రములు మంగళదాయకములగు ఎరుపుజీరలతోగూడి విశాలపద్మములవలె ఆహ్లాదకారకములగుచున్నవి. అట్టి ప్రభువును దర్శించి జన్మజన్మాంతరసంక్రమిత పుణ్యఫలములుగల అయోధ్యవాసులు ఆనందసాగరమున ఓలలాడిరి.

విచిత్రరత్నాంచితసూత్రనద్ధ
పీతాంబరం పీనభుజాంతరాలం

అనర్ఘ్యముక్తాఫలదివ్యహారై
ర్విశోభమానం రఘునందనం ప్రజాః॥

శ్రీరాము డాసమయమున పీతాంబరధారియై యున్నాడు. ఆ పీతాంబరమును విచిత్రరత్నఖచితస్వర్ణసూత్రముతో నడుముకు బిగించి కట్టినాడు. అతని వక్షస్థలము మాంసలమై సుపుష్టముగా నున్నది. ఆవక్షస్థలముపై కంఠమునధరించిన అమూల్యముక్తాహారములు దివ్య కాంతుల నీనుచున్నవి. అయోధ్యాజనులు అట్టి పవిత్రమూర్తిని కనులార గాంచిరి.

సుగ్రీవముఖ్యైః హరిభిః ప్రశాంతైః
నిషేవ్యమాణం రవితుల్యభాసం
కస్తూరికాచందనలిప్తగాత్రం
నివీతకల్పద్రుమ పుష్పమాలమ్॥

మేఘనిర్ముక్తాకాశమున భాసించు సూర్యునితో సమానముగ ప్రజ్వరిల్లుచున్న శ్రీరామచంద్రుని ప్రశాంతచిత్తులగు సుగ్రీవాదివానరులు సేవించుచుండిరి. కస్తూరికాచందనములచే వాసించు అతని శరీరమున నివీతవిధానమున పారిజాతపుష్పమాల శోభించుచున్నది.

శ్రుత్వా స్త్రియో నామ ముపాగతం ముదా
ప్రహర్షితాస్తత్ర కృతోపసర్పణాః
సమాప్య కార్యం గృహదేవతార్చనం
బభూవురాసాద్య ప్రభావతీ సతీ॥

గృహకార్యములలో నిమగ్నలైయున్న స్త్రీలందరును శ్రీరామ చంద్రుడు నగరములోనికి వచ్చినాడను వార్తను వినినంతనే వారి ముఖ పద్మములు ఆనందాతిరేకముచే ప్రఫుల్లములయినవి. వారు తమ గృహ కార్యముల నన్నిటిని పరిత్యజించి భవనాగ్రములనెక్కి రాముని మార్గ మును పరికించసాగిరి.

దృష్ట్వా హరిం సర్వదృగుత్సవాకృతిం
పుష్పైఃకిరంత్యఃస్మితశోభితాసనాఃి
దృగ్భిఃపున శ్చేత్రమనోరసాయనం
స్వానందమూర్తిం మనసా ఽభిరేభిరే॥

సమస్త ప్రజల నేత్రములకు ఆనందదాయకుడయిన శ్రీరామ చంద్రునిజూచి చిరునవ్వుతో శోభించు ముఖపద్మములుగల నగరస్త్రీలు పుష్పములను చల్లిరి. అంతేగాక నేత్రములకు మనస్సునకుకూడ ఆనంద దాయకుడగు ఆనందమూర్తినిజూచి ఆనందితహృదయలయిరి.

రామఃస్మితస్నిగ్ధదృశా ప్రజాస్తథా
పశ్యన్ ప్రజానాథ ఇవాపరఃభుఃి
శనైర్జగామాథ పితుఃస్వలంకృతం
గృహం మహేంద్రాలయసన్నిభం హరిఃి॥

రాముడును చిరునవ్వు లొలికించుచు దృక్కులతో ప్రజల నంద రను వాత్సల్యపూర్వకముగా పరికించుచు ప్రజాపతివలె ఇంద్రభవనము నధఃకరించుచున్న తండ్రిగారి భవనమును జేరెను.

ప్రవిశ్య వేశ్మాంతరసంస్థితో ముదా
రామో ననందే చరణౌ స్వమాతుఃి
క్రమేణ సర్వాఃపితృమోషితఃప్రభు
ర్ననామ భక్త్యా రఘువంశకేతుఃి॥

రాఘవులందరకు గౌరవశాలియగు రాముడు తండ్రిగారి భవ నాంతఃప్రవిష్టుడై తన తల్లిపాదములకు అభివందనము లాచరించెను.

తరువాత దశరథమహారాజుయొక్క పత్నులందరకును వసిగా నమస్కరించెను.

తతో భరత మాహేదం రామః సత్యపరాక్రమః
సర్వసంపత్సమాయుక్తం మమ మందిరముత్తమం॥
మిత్రాయ వానరేంద్రాయ సుగ్రీవాయ ప్రదీయతాం
సర్వేభ్యః సుఖవాసార్థం మందిరాణి ప్రకల్పయ॥

అంతట సత్యపరాక్రముడగు రాముడు భరతునితో ఇట్లు పలికెను. "సమస్త సంపదలతో శోభించునదియు, ఉత్తమోత్తమమయినట్టి నామందిరమును మిత్రుడగు సుగ్రీవునికి నివాసముగా ఏర్పాటు చేయుము. అంతేగాక అంగదవిభీషణాదులగు ఇతరులకును తగిన నివాసములను ఏర్పాటుచేయుము" అని.

రామే ణైవం సమాదిష్టో భరత శ్చ తథా కరోత్
ఉవాచ చ మహాతేజాః సుగ్రీవం రాఘవానుజః
రాఘవ స్యాభిషేకార్థం చతుఃసింధుజలం మహత్
ఆనేతుం ప్రేషయస్వా ఽఽశు మూతాం స్త్వరితవిక్రమాన్॥

భరతుడు శ్రీరాముని ఆజ్ఞను పూర్తిగ నిర్వర్తించెను. తరువాత అతడు సుగ్రీవునితో "రామాభిషేకమునకై నాల్గుసముద్రముల జలములను త్వరితవిక్రములయిన వానరవీరులను పంపి తెప్పించు" మని చెప్పెను.

ప్రేషయామాస సుగ్రీవో జాంబవంతం మరుత్సుతం
అంగదం చ సుషేణం చ తే గత్వా వాయువేగతః
జలపూర్ణాన్ శాతకుంభకలశాం శ్చ సమానయన్॥

సుగ్రీవుడు భరతుని మాటనుబట్టి జాంబవంతుని, హనుమంతుని, అంగదుని, సుషేణుని చతుస్సముద్రజలానయమునకు పంపెను. వారును వాయువేగగమనమున స్వర్ణకలశములను సముద్రజలములతో నింపి తెచ్చిరి.

ఆనీతం తీర్థసలిలం శత్రుఘ్నో మంత్రిభిః సహా
రాఘవ స్యాభిషేకార్థం వశిష్ఠాయ న్యవేదయత్॥

వానరానీతమగు సముద్రజలమును శత్రుఘ్నుడు మంత్రిసహితుడై అందుకొని రాఘవాభిషేకమునకై వశిష్ఠునికి సమర్పించెను.

తత స్తు ప్రయతో వృద్ధో వశిష్ఠో బ్రాహ్మణై స్సహా
రామం రత్నమయే పీఠే ససీతం సంన్యవేశయత్॥

అంతట వశిష్ఠుడు ఇతర మహర్షులతో ఆలోచించి రాముని అభిషేకించుటకు సమకట్టెను. సీతాసహితుడగు రాముని రత్నవినిర్మిత సింహాసనమున ఆసీనునొనరించెను.

వశిష్ఠో వామదేవ శ్చ జాబాలి ర్గౌతమ స్తథా
వాల్మీకి శ్చ తథా చక్రుః సర్వే రామాభిషేచనం॥

వశిష్ఠుడు, వామదేవుడు, జాబాలి, గౌతముడు, వాల్మీకి మొదలగు మహర్షు లందరును వేదోక్తవిధానమున హోమపురస్సరముగ రాముని రాజ్యమున అభిషిక్తునిగావించిరి.

కుశాగ్రతులసీయుక్త పుణ్యగంధజలై ర్ముదా
అభ్యషించ రఘుశ్రేష్ఠం వాసవం వసనో యథా॥

ధర్భాగ్రములు, తులసీదళములు మొదలగువాటి పవిత్రతములు, సుగంధద్రవ్యపరిమిళితములు అగు నదీసముద్రజలములచే వశిష్ఠాది మహర్షులు వసువులు వాసవుని ఇంద్రాధిపత్యమున అభిషేకించినట్లు అభిషేకించిరి.

ఋత్విగ్భి ర్బ్రాహ్మణైః శ్రేష్ఠైః కన్యాభిః సహ మంత్రిభిః
సర్వౌషధిరసై శ్చైవ దైవతై ర్నభసి స్థితైః
చతుర్భి ర్లోకపాలై శ్చ స్తువద్భిః సగణై స్తథా॥

ఋత్విక్కులగు బ్రాహ్మణులు, షోడశకన్యలు, మంత్రులు మొదలగువారితో గలిసి వశిష్ఠాదులు సమస్తౌషధి రసములచేతను రాముని అభిషేకించిరి. ఆసమయమున ఆకాశమున సర్వదేవతలును,

దేవగణసహితులగు ఇంద్రాదిలోకపాలురును ఆ దృశ్యమును దర్శించి వేనోళ్ళప్రశంసించిరి. శ్రీరామాభిషేకమును దేవతలందరును దర్శించి ప్రశంసించిరని భావము.

ఛత్రం చ తస్య జగ్రాహ శత్రుఘ్నః పాండరం శుభం
సుగ్రీవవిభీషణౌ తౌ దధతుః శ్వేతచామరే
మాలాం చ కాంచనీం వాయు ర్దదౌ వాసవచోదితః॥

అభిషేకసమయమున పాండురవర్ణశోభితమగు ఛత్రమును శత్రుఘ్నుడు పట్టెను. సుగ్రీవవిభీషణులు శ్వేతవర్ణములగు చామరములు వీచిరి. ఇంద్రుని ఆజ్ఞ ననుసరించి వాయుదేవుడు కాంచనమాలను కానుకగా సమర్పించెను.

సర్వరత్నమాయుక్తం మణికాంచనభూషితం
దదౌ హారం నరేంద్రాయ స్వయం శక్ర స్తు భక్తితః॥

దేవేంద్రుడు స్వయముగా సర్వరత్నశోభితమును, నీలమణి కాంతులను నెదజల్లునదియు అగు మహిమాయుక్తమగు హారము నొక దానిని భక్తితో సమర్పించెను.

ప్రజగు ర్దేవగంధర్వా నన్వతు శ్చాప్యరోగణాః
దేవదుందుభయో నేదుః పుష్పవృష్టిః పపాత ఖాత్॥

ఆసమయమున దేవతలు, గంధర్వులు శ్రీరాముని దివ్యగుణములను గానముచేసిరి. రంభాద్యప్సరసలు నృత్యమొనరించిరి. దేవదుందుభులు తమంతట తాము మ్రోగినవి. ఆకాశమున కల్పవృక్షములు తమంతట తాము పుష్పములను వర్షించినవి.

నవదూర్వాదళశ్యామం పద్మపత్రాయతేక్షణం
రవికోటిప్రభాయుక్తకిరీటేన విరాజితమ్॥
కోటికందర్పలావణ్యం పీతాంబరసమావృతమ్
దివ్యాభరణసంపన్నం దివ్యచందనలేపనమ్
అయుతాదిత్యసంకాశం ద్విభుజం రఘునందనం॥

వామభాగే సమాసీనాం సీతాం కాంచనసన్నిభాం
సర్వాభరణసంపన్నాం వామాంకే సముపస్థితాం ॥
రక్తోత్పలకరాంభోజాం వామే నాలింగ్య సంస్థితాం
సర్వాశ్చర్యమనోభాడ్యాం దృష్ట్వా భక్తిసమన్వితః ॥
ఉమయా సహితో దేవం శంకరో రఘునందనం
సర్వదేవగణై ర్యుక్తః స్తోతుం సముపచక్రమే ॥

ఇట్లు వేదవిధానమున శ్రీరాముడు సింహాసనమున విరాజిల్లు చుండ ఉమాసహితుడగు శంకరుడు తన్ను సమస్త దేవగణములు పరివేష్టించియుండ ఇట్లు స్తోత్రమును ప్రారంభించెను. ఆసమయమున శ్రీరాముడు సింహాసనమున ఇట్లు శోభించుచుండెను. అతని శరీరకాంతి నవదూర్వాదళశ్యామవర్ణమును అనుసరించుచున్నది. అతనినేత్రములు ఎఱ్ఱతామరలవలె విశాలముగా నున్నవి. శిరమున కోటిసూర్య ప్రభా రాజిని ధిక్కరించు రత్నకిరీటము విరాజిల్లుచున్నది. అంగప్రత్యంగము లందు ఉచితరీతిని దివ్యములగు ఆభరణములు ప్రకాశించుచున్నవి. శరీరమునం దంతటను దివ్యసుగంధచందనము పూయబడియున్నది. ద్విభుజ నారాయణుడగు అతడు పదివేలసూర్యుల తేజముతో ప్రజ్వరిల్లుచున్నాడు. అతని వామపార్శ్వమున ఆదిశక్తిస్వరూపిణి సీత అంకమునధిష్టించి యున్నది. ఆమె కందనపుబొమ్మవలె వెలుగొందుచున్నది. సమస్తాభరణములు శోభాయమానములై యున్నవి. ఆమె కరపద్మమును ఎఱ్ఱతామర భజించుచున్నది. శ్రీరాముడు తన వామహస్తమును ఆమెపై వైచియున్నాడు. ఆమె దివ్యశోభ సర్వశోభాతిశాయినిగా ఉన్నది.

శ్రీ మహాదేవ ఉవాచ :—

నమోఽస్తు రామాయ సశక్తికాయ
నీలోత్పలశ్యామలకోమలాయ
కిరీటహారాంగదభూషణాయ
సింహాసనస్థాయ మహాప్రభాయ ॥

సీతాసహితుడవై భక్తమనోఫలకములందు విరాజిల్లు శ్రీరామ చంద్రులకు నమస్కారములు. నల్లకలువల కోమలకాంతికిరణసంజన కాయుడగు రామచంద్రులకు వందనములు. కిరీటము, హారము, అంగ దములు, కేయూరములు మొదలగు రాజోచితభూషణములను ధరించి సింహాసనమున సూర్యకాంతినిబుంచి వెలుగొందు స్వామికి వందన శతములు.

సమక్షమున సాక్షాత్కరించిన దివ్యమూర్తికి వందన మాచ రించి వందనార్హతను ప్రతిపాదించుచున్నాడు.

త్వ మాదిమధ్యాంతవిహీన ఏకః
సృజస్య వస్యత్సిచ లోకనాథ
స్వమాయయా తేన న లిప్యసే త్వం
యత్ స్వే సుఖే ఒజస్రరతో ఒనవద్యః ॥

రామా! నీవు ఆదిమధ్యాంతహీనుడవు. ఏకస్వరూపుడవు అనగా ద్వైతస్వభావము లేనివాడవు. నీవే బ్రహ్మ విష్ణు రుద్రస్వరూప మున లోకములను సృజించి, పోషించి లయమునందించుచుందువు. కనుక నీవు సమస్త బ్రహ్మాండప్రభుడవు. ఇంతజేసియు నీవు ఈసృష్టికో దేనిని అంటియుండువాడవుకావు. నిత్యము స్వీయమగు ఆనందరసమున నిమగ్నుడవై యుందువు. లౌకికులగువారికి అప్రాప్యుడవు.

లీలాం విధత్సే గుణసంవృత స్త్వం
ప్రపన్న భక్తానువిధాన వేతోఃి
నానావతారైః సురమానుషాద్యైఃి
ప్రతీయసే జ్ఞానిభి రేవ నిత్యం ॥

అయినను నీవు దుష్టజనుల అత్యాచారములకు లోనై శరణు జొచ్చిన భక్తజనుల ఆర్తిని హరించుటకై సత్వరజస్తమోగుణముల నంగీకరించి, మానవరూపమున అవతరించి వివిధలీలలను ప్రవర్తింప జేయుదువు. ఈ నీ లీలార్థమయిన అవతారరహస్యములను వివేకులగు జ్ఞానులే గ్రహింపగలరు గాని సామాన్యులు గ్రహింపజాలరు.

భగవంతుడు మానవలీలను అంగీకరించుటకు కారణము భక్త జనుల ఆర్తిని హరించుటేకాక లోకములో ఉత్తమాదర్శస్థాపనము కూడా అయియున్నది. శ్రేష్ఠులగువారి ఆచరణలు సామాన్యులకు అనుకరణీయములుగా నుంటవి. వారు వాటిని జీవితములో సదాచారరూపమున అమలులోనికి తెత్తురు. కనుక భగవంతుడు మానవత్వము నంగీకరించిసదాచరమును ప్రవర్తింపజేయును. ఈవిషయము భాగవతము కూడ స్పష్టపరచినది. "యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్తదే వేతరోజనః, స యత్ ప్రమాణం కురుతే లోక స్త దనువర్తతే...మమవ ర్త్మానువర్తంతే మనుష్యాఃపార్థ సర్వశః ఉత్సీదేయు రిమే లోకా న కుర్యాం కర్మ చే దహమ్" అని.

పై శ్లోకమున సురమానుషరూపములను రెంటిని గొందువనియున్నది. (సురమానుషాద్యైః) వామనావతారము సురజాతికి చెందినది. రామ కృష్ణాద్యవతారములు మానవజాతికి చెందినవి. 'ఆది' పదముచే మత్స్య కూర్మాదులు సూచితములు.

స్వాంశేన లోకం సకలం విధాయ తం
బిభర్షి చ త్వం తదధఃఫణీశ్వరః
ఉపర్యధో తా ననిలోడుపౌషధీ
ప్రవర్షరూపో ఒవసి రైకధా జగత్ ॥

రామా ! నీవే సమస్తలోకమునకు మూలకర్తవు. నీవు నీ అంశ మాత్రమునచే సమస్తలోకములను సృష్టింపజేయుటేగాక నాగరాజగు అనంతస్వరూపమున దానిని భరించుచువు కూడాను. ప్రజాపతి పరమాత్మయొక్క అంశ. అతనిచేతనే సమస్తసృష్టిని రచింపజేసి తాను శేషరూపమున దానిని భరించునని భావము. అధోభాగమందుండి భరించుటే గాక పైభాగమందుగూడ వాయు, చంద్ర, ఓషధి, మేఘ స్వరూపుడవై అనేకరూపములతో ఈ జగత్తును సంరక్షించుచున్నావు.

త్వ మిహ దేహభృ ద్గణా శిఖిరూపధృ
పచసి భుక్త మశేష మజస్రం

పవనపంచకరూపసహాయో
జగ దఖండ మనేన బిభర్షి ॥

అంతేగాక నీవు జఠరాగ్నిరూపుడవై శరీరధారులగు జీవులయం దుండి వారు భుజించిన చతుర్విధాన్నమును వాయుపంచకసహాయుడవై పచనము గావించుచువు. ప్రాణాపానవ్యానోదానసమానములు పంచ వాయువులు. ఇవి శరీరమందుండి జఠరాగ్నికి పచనకర్మయందు సహా యకము లగును. రామా ! నీవు ఈవిధమునగూడ జగద్భరణ మొనర్చు చున్నావు. ఈవిషయమే భగవద్గీతయందును చెప్పబడినది- "అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః ప్రాణాపానసమా యుక్తః పచా మ్యన్నం చతుర్విధం."

చంద్రసూర్యశిఖిమధ్యగతం యత్
తేజ ఈశ చిడశేషతనూనాం
ప్రాభవ త్తనుభృతా మిహ ధైర్యం
శౌర్య మాయు రఖిలం తన స్తత్వం ॥

రామా ! జగత్తునకు ప్రకాశమును ప్రసాదించు చంద్ర, సూర్య, అగ్నులయందున్న తేజస్సును, జగత్తున జన్మించిన ప్రతి శరీరధారిలోను ఉండు చైతన్యరూపము తేజస్సును నీశక్త్యంశములే. సమస్తప్రాణుల ఆయువును, వారివారి ధైర్యసాహసాదులును సమస్తమును నీశక్తిలోని చిన్న చిన్న భాగములే. అనగా సర్వజగత్తును భవదీయశక్తిజన్యమేనని భావము. భగవద్గీతయందును ఇట్లు చెప్పబడినది- "యదా దిత్యగతం తేజో జగ ద్భాసయతే ఽఖిలం య చ్చంద్రమసియ చ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకం."

త్వం విరించిశివవిష్ణువిభేదాత్
కాలకర్మ శశిసూర్యవిభాగాత్
వాదినాం పృథగివేశ విభాసి
బ్రహ్మనిశ్చిత మనన్యదైహికమ్ ॥

ప్రభూ ! బ్రహ్మవగు నీ వొక్కడవే సత్యస్వరూపుడవనియు తదన్యము ఏదియు లేదనియు వేదములంసు పూర్తిగ నిర్ణయించబడినది. అద్వైతస్వరూపుడవైనను నీవు ఆయాదృష్టులలో నినుచూచు భక్తులకై బ్రహ్మవిష్ణుమహేశ్వర కాల కర్మ చంద్ర సూర్యరూపుడవై ఆయా ఫల ములనొసగుచున్నావు. నీవు వేసు వేరు రూపములున్నట్లు తోచుచున్నా వేగాని వాస్తవమునకు ఏకస్వరూపుడవే.

మత్స్యాదిరూపేణ యధా త్వ మేకః
శ్రుతౌ పురాణేషు చ లోకసిద్ధిః
తద్ధైవ సర్వం సదసద్విభాగ
స్త్వ మేవ నాన్య ద్భవతో విభాతి॥

నీవు ఒక్కడవే అయినను మత్స్యకూర్మాద్యవతార రూపములు గానే వేదములందును, పురాణమునందును, లోకమునందునుగూడ ప్రసిద్ధినందినవి. అట్లే సదసద్రూపమయిన ఈవస్తుజాలమంతయు నీ స్వరూపమే. త్వదన్యమగు వస్తువు ఒక్కటయినను లేదు.

య ద్య త్సముత్పన్న మనంతసృష్టౌ
ఉత్పత్స్యతే య చ్చ భవ చ్చ య చ్చ
న దృశ్యతే స్థావరజంగమాదౌ
త్వయా వినాతః పరతః పర స్త్వం॥

ఈ అశేషసృష్టిలో ఇంతవరకు ఏదయితే ఉత్పన్నమయినదో, ఏదయితే ముందు ఉత్పన్నముకాగలదో, ప్రస్తుతము ఉత్పన్నమయి యున్నదో అట్టి స్థావరజంగమాత్మకమయిన సృష్టిలో నీవు లేనిది ఒక్కటికూడ కన్పించుటలేదు. అందుచే నీవు పరమయినదానికంటె పరుడు, పరాత్పరుడవు. "పురుష ఏవేదం య ద్భూతం యచ్చ భవ్యమ్" అని ఋగ్వేదము.

తత్త్వం న జానంతి పరాత్మన స్తే
జనాః సమస్తా స్తవ మాయయాతః

త్వద్భక్తి సేవామలమానసానాం
విభాతి తత్వం పర మేక మైశమ్॥

కాని సర్వత్ర నీమాయ వ్యాప్తమై ఉండుటచే ప్రజలు పరాత్పరుడవగు నీతత్వమును గ్రహించజాలరు. నిరంతరము నీయందు భక్తి ప్రపత్తులతోగూడిన చిత్తముగలవారై నిన్నే సేవించి నిర్మలమనస్కులయిన సత్పురుషులుమాత్రము నిన్ను గుర్తించగలుగుదురు. వారికే నీ వాస్తవతత్వము గోచరించగలదు.

బ్రహ్మాదయ స్తే న విదుః స్వరూపం
చిదాత్మతత్వం బహిరర్థభావాః
తతో బుధ స్త్వా మిద మేవ రూపం
భక్త్యా భజ న్ముక్తి ముపై త్యదుఃఖమ్॥

నీఅంశవలన ఉద్భవిల్లినవారైనను బ్రహ్మాదులుకూడ బహిరంగ స్వరూపములగు విషయములందు మాత్రమే ప్రసరించు మనస్సుగలవారగుటచే నీచైతన్యమయిన నిర్గుణఆత్మతత్వమును అవగతమొనర్చుకొనలేరు. ఆకారణము వెడ్డలు నీయీ సగుణరూపమునే సేవించి దుఃఖరహితమయిన ముక్తిని బడయుదురు.

అహం భవన్నామ గృణ న్కృతాంజ్ఞో
వసామి కాశ్యా మనిశం భవన్యా
ముమూర్షుమాణస్య విముక్త యే హం
విశామి మంత్రం తవ రామనామం॥

రామా! నేను నీపరతత్వరహస్యమును గ్రహించజాలక నీపవిత్రనామమునే గ్రహించితిని. పత్నీసంగమును పరిత్యజించకపోయినను నేను ఈ మంత్రజపమున కృతకృత్యుడ నయితిని. నేను భవానీ సహితుడనై నిత్యము కాశీనగరమున సన్నిహితుడవైయుండి మోక్షేచ్ఛగలవారు ఆప్రదేశమున మరణించునపుడు వారికి నీ పవిత్రనామమంత్రమును ఉపదేశింతును. దానితో వారు ముక్తిని పొందుదురు.

ఇట్లు పరాత్పరుడగు రాముని కొనియాడి భవుడు తన స్తోత్ర పఠనపాఠనఫలమును విధించుచున్నాడు.

ఇమం స్తవం నిత్య మనన్యభక్త్యా
శృణ్వంతి గాయంతి లిఖంతి యేవై
తే సర్వసౌఖ్యం పరమం చ లబ్ధ్వా
భవత్పదం యాంతు భవత్ప్రసాదాత్ ॥

రామా ! ఇప్పుడు నేను నిన్ను స్తుతించిన ఈ స్తవమును అనన్య భక్తితో వినువానిని, కీర్తించువానిని, వ్రాయువానిని భవదీయ కృపాప్రసాదమున ఇహమున సౌఖ్యములను, పరమున పరమపదమును పొందుచుగాక.

ఇంద్ర ఉవాచ :—

రక్షోఽధిపేనాఖిలదేవసౌఖ్యం
హృతం చ మే బ్రహ్మవరేణ దేవ
పున శ్చ సర్వం భవతః ప్రసాదాత్
ప్రాప్తం హతో రాక్షసదుష్టశత్రుః ॥

దేవా ! బ్రహ్మవరదృప్తుడయిన రాక్షసాధీశ్వరునిచే సమస్త దేవతల సౌఖ్యముతోబాటు నా రాజ్యమును అపహరించినాడు. నీవు అతనిని సంహరించితివి. ఈ నీఅనుగ్రహమున పోగొట్టుకొనిన రాజ్యము నంతటిని సంపాదింపగలిగితిని.

దేవా ఊచుః :—

హృతా యజ్ఞభాగా ధరాదేవదత్తా
మురారే ఖలే నాదితైత్యేన విష్ణో
హృతా ఽద్య త్వయా నోవితానేషు భాగాః
పురావ ద్భవిష్యంతి యుష్మత్ప్రసాదాత్ ॥

మురారీ ! భూసురులొనరించు యజ్ఞాదికములందలి మా భాగము లన్నియు ఖలుడగు రావణునిచే అపహరించబడినవి. ఇప్పుడు నీవు అత

నిని వధించుటచే రావణునికి పూర్వమువలెనే మా మా యజ్ఞభాగ ములు లభించగలవు.

పితరఁ చుఁ :—

హత్రో ఽద్య త్వయా దుష్టరైత్రో మహాత్మ్న
గయాదౌ నరైర్దత్తపిండాదికాన్నఃి
బలా దత్తి హత్వా గృహీత్వా సమస్తా
నిదానీం పునర్లబ్ధసత్వా భవామఃి ॥

మహాత్మా ! ఈ దుష్టరాక్షసుడు గయాప్రయాగాది పుణ్యతీర్థ ములందు నరులు మమ్ములనుద్దేశించి చేసిన పిండాదికములను మాకు చెందకుండ చేయునాడు. లేదా పిండప్రదానాదికముల నొనరించు నరు లను వధించువాడు. కాని ఇప్పుడు నీవు వానిని వధించుటచే మా మా ఆహారములను పొంది తిరిగి సత్వసంపన్నులము కాగలము.

యక్షఁ చుఁ :—

సదా విష్టికర్మ ణ్యనే నాభియుక్తా
మహామోదశాస్యం బలా ద్దుఃఖయుక్తాఃి
దురాత్మా హత్రో రావణో రాఘువేశ
త్వయా తే వయం దుఃఖజాతా ద్విముక్తాఃి ॥

రామా ! ఈ దురాత్ముడగు రావణుడు మమ్ములను జీతభత్య ములులేని సేవకుల నొనరించినాడు. మేము నిత్యము పల్లక్యాదుల యందు వానిని మోయుచుండవలసి వచ్చుచుండెడిది. ఆసమయమున మాస్థితి అత్యంత దుఃఖభాజనముగా నుండెడిది. వాడు నీచే సంహ రింపబడుటచే మేము దుఃఖసమూహమునుండి విడివడితిమి.

గంధర్వాఁ చుఁ :—

వయం సంగీతనిపుణా గాయంత స్తే కథామృతమ్
ఆనందామృతసందోహయుక్తాఃి పూర్ణాఃి స్థితాఃి పురా ॥

రామా ! మేము గాంధర్వులము. నిత్యము భవదీయచరితా మృతమును గానముచేయుచుండుట మాపని. ఇదివరకు అత్యంతానం దామృత తరంగితహృదయంతో నిన్ను కీర్తించుచు జీవితము గడపు చుండెడివారము.

పశ్చా ద్దురాత్మనా రామ రావణే నాభివద్రుతాః
త మేవ గాయమానా శ్చ తదారాధనతత్పరాః
స్థితా స్తయా పరిత్రాతా హతో ఽయం దుష్టరాక్షసః ॥

అనంతరము దురాత్ముడగు రావణుడు మమ్ములను పరాజితుల నొనర్చి లోబరచుకొనినాడు. దాస్యపుకోజులలో ఆదురాత్మునే కీర్తించుచు, ఆరాధించుచు జీవించితిని. ఇప్పుడు వాడు హతుడగుటచే మేము దాస్యవిముక్తుల మయితిమి.

ఏవం మహోరగాః సిద్ధాః కిన్నరా మరుత స్తథా
వసవో మునయో గావో గుహ్యకా శ్చ పతత్రిణః ॥
సప్రజాపతయ శ్చైతే తథా చాప్సరసాంగణాః
సర్వే రామం సమాసాధ్య దృష్ట్వా నేత్రమహోత్సవం ॥
స్తుత్వా పృథక్ పృథక్ సర్వే రాఘవే ణాభివన్దితాః
యయుః స్వం స్వం పదం సర్వే బ్రహ్మరుద్రాదయ స్తదా ॥

ఆ తదువాత ఉరగులు, సిద్ధులు, కిన్నరులు, మరుత్తులు, అష్ట వసువులు, నారదాదిమునులు, సురభి మొదలగు గోవులు, గుహ్యకులు, గరుడులు మొదలగువారందరును ప్రజాపతులతోగూడి రాముని స్తుతించిరి. అప్సరసలుకూడ అతనిని ఆనందింపజేసిరి. వారందరును రాముని సమీపమునకు వచ్చి అభిషేకసౌందర్య విరాజమానుడగు అతనిని కను లారగాంచిరి. రాముడును బ్రహ్మరుద్రాదులకు అభివందన మాచరించెను. తదుపాత వారందరును అనుమతి గైకొని తమతమ నివాసములకు వెడలిపోయిరి.

ప్రశంసంతో ముదా రామం గాయంత స్తస్య చేష్టితం
ధ్యాయంత స్త్వభిషేకార్ద్రం సీతాలక్ష్మణసంయుతమ్
సింహాసనస్థం రాజేంద్రం యయుః సర్వే హృది స్థితం ॥

వారందరును శ్రీరాముని ఉత్తమగుణగణములను ప్రశంసించుచు, లోకకళ్యాణకరములగు రావణవధాదిచేష్టలను గానముచేయుచు, సీతా లక్ష్మణులచే సేవింపబడుచు సింహాసనము నధిష్టించి అభిషేకార్ద్రితను విరాజితుడయియున్న మూర్తిని హృదయమున ధ్యానించుచు దేవగణములు తమతమ నెలవులకు పోయి చేరిరి.

ఖే వాద్యేషు ధ్వనత్సు ప్రముదితహృదయై ర్దేవవృందైః స్తువద్భి
ర్వర్షద్భిః పుష్పవృష్టిం దివిమునినికరై రీడ్యమానః సమంతాత్
రామః శ్యామః ప్రసన్నః స్మితరుచిరముఖః సూర్యకోటిప్రకాశః
సీతాసౌమిత్రివాతాత్మజమునిహరిభిః సేవ్యమానో విభాతి ॥

పట్టాభిషేకాభిరాముడు రాముడు సీత, లక్ష్మణుడు, హనుమంతుడు, వశిష్ఠాదిమునులు, సుగ్రీవాది వానరులు సేవించుచుండగా స్మితరుచిరముఖుడై కోటిసూర్య ప్రభాభాసితుడై ప్రకాశించుచుండెను. యోగిహృధ్యేయుడగు అతని ఆ మహావైభవమును జూచి హర్షించు దేవబృందములు వివిధమంగళవాద్యములను మ్రోయించిరి. వివిధగుణ కీర్తనపూర్వకముగా స్తుతించుచు పుష్పవృష్టిని వర్షించిరి. నారదాది మునులు వేదోక్తముగా ప్రార్థించిరి.

★



శ్రీ రామ పట్టాభిషేకము

షోడశ సర్గ

శ్రీ మహా దేవ ఉవాచ :—

రామే అభిషిక్తే రాజేంద్రే సర్వలోకసుఖావహే
వసుధాసస్యసంపన్నా ఫలవంతో మహీరుహాః
గంధహీనాని పుష్పాణి గంధవంతి చకాశిరే॥

సమస్త లోకముల ఆర్తిని తీర్చి ఆనందమును కలుగజేయు శ్రీరామచంద్రుడు అయోధ్యాసింహాసనమున అభిషిక్తుడుకాగా సమస్త లోకములు సుఖసమృద్ధము లయినవి. భూమి సమస్త సస్యములతోడను సంపన్నమయినవి. వృక్షము లన్నియు ఫలవంతము లయినవి. గంధరహితములగు పుష్పములుకూడ సుగంధయుక్తము లై శోభించినవి.

సహస్రశత మశ్వానాం ధేనూనాం చ గవాం తథా
దదౌ శతవృషాణాం పూర్వం ద్విజే భ్యో రఘునందనః॥

ఆపుణ్యసమయమున శ్రీరామచంద్రుడు వేదవిదులగు బ్రాహ్మణులకు లక్ష అశ్వములను, లక్ష ఆవులను, లక్ష ఎడ్లను దానముగా నిచ్చెను. అంతేగాక నూరు ఆబోతులనుగూడ వారికి దానముగా నొసగెను. ఇందు ఎడ్లను వ్యవసాయోపయోగమునకును, వృషభములను గోసంపదయొక్క అభివృద్ధికిని ఇచ్చినట్లు భావించవలెను.

శ్రింశత్కోటిసువర్ణస్య బ్రాహ్మణేభ్యో దదౌ పునః
వస్త్రాభరణరత్నాని బ్రాహ్మణేభ్యో ముదా తథా॥

తరువాత ముప్పదికోట్ల నాణెములను, వివిధవస్త్రాభరణములను రాముడు బ్రాహ్మణుల కొసగెను.

సూర్యకాంతిసమప్రఖ్యాం సర్వరత్నమయీం స్రజం
సుగ్రీవాయ దదౌ ప్రీత్యా రాఘవో భక్తవత్సలః
అంగదాయ దదౌ దివ్యే హ్యాంగదా రఘునందనః॥

భక్తవత్సలుడగు శ్రీరాముడు సూర్యునివలె మెరయుచున్న రత్నహారము నొకదానిని సుగ్రీవునకు బహూమతిగా నొసగెను. అంగదునికి రెండు భుజకీర్తులను బహూకరించెను.

అంతట హనుమంతుడు భక్తిభావమున కృతాంజలియై శ్రీరామ చంద్రునకు ఎదుట నిలబడెను. అతని పరమోత్కృష్టమగు భక్తిభావమునకు అత్యంతము పరితుష్టహృదయుడై రాము డిట్లు పలికెను.

హనూమం స్తే ప్రసన్నో ఽస్మి వరం వరయ కాంక్షితం
దాస్యామి దేవై రపి యద్దుర్లభం భువనత్రయే॥

హనుమా ! నీ అచంచల భక్తిభావమునకు నేను పరితుష్టుడ నయితిని. నీ మనోభీష్టమును వ్యక్తపరచుము. దేవతలకు దుర్లభమయి నను సరే నీ కాంక్షితమును తప్పక నెరవేర్చెదను.

హనూమా నపి తం ప్రాహ నత్వా రామం ప్రహృష్టధీః
త్వన్నామస్మరణో రామ న తృప్యతి మనో మమ
అత స్త్వన్నామసతతం స్మరన్ స్థాస్యామి భూతలే.

హనుమంతుడు ఆనందతరంగితానందుడై ఇట్లనెను- రామా ! నిత్యము నీనామస్మరణ నొనరించుచున్న నా మనస్సుకు తృప్తి అన్నది కలుగుటలేదు. కనుక ఏమాత్రము ఎడముకలుగకుండా నామస్మరణ నొనరించుచు భూమియం దుండగోరుచున్నాను.

యావత్ స్థాస్యతి తే నామ లోకే తావత్ కలే వరమ్
మమ తిష్ఠతు రాజేంద్ర వపో యం మే ఽభికాంక్షితమ్॥

రామా ! నేనుకోరు వర మిదియే. ఈ భూమిపై నీ పవిత్ర నామము ఉన్నంతకాలము నా యీ కళేబరముకూడ సజీవమై యుండు గాక, ఇదియే నా మనోమభీష్టము.

రామ స్తథేతి తం ప్రాహ ముక్త స్తిష్ఠ యథాసుఖమ్
కల్పాంతే మమ సాయుజ్యం ప్రాప్యసే నాత్ర సంశయః॥

రాముడును "నీ కోరిక నెరవేసుగాక. ఈ సంసారమందుండియు ముక్తునివలె సుఖముగా జీవించుము. ప్రస్తుతకల్పము అంతమొందు నపుడు నాసాయుజ్యమును పొందగలవు" అనెను.

త మాహ జానకీ ప్రీతా యత్ర క్వాపి మారుతే
స్థితం త్వా మనుయాస్యంతి భోగాః సర్వే మ మాజ్ఞయా॥

తరువాత జానకి ప్రీతమనస్కయై "మారుతీ! నీవు ఎక్కడనున్నను నాఆజ్ఞ ననుసరించి సర్వభోగములు నిన్ను సేవింపగలవు" అనెను.

ఇత్యుక్తో మారుతి స్తాభ్యా మిశ్వరాభ్యాం ప్రహృష్టధీః
ఆనందాశ్రుపరీతాక్షో భూయో భూయః ప్రణమ్య తౌ
కృచ్ఛా ద్యయౌ తప స్తప్తుం హిమవంతం మహామతిః॥

ఇట్లు సీతారాములచే వరములనంది మారుతి ప్రహృష్టహృదయుడై, ఆనందాశ్రువులు జలజలరాల వారికి సాష్టాంగవందనముల నాచరించెను. అనంతరము వారి అనుజ్ఞను తీసికొని వారి ఎడబాటును సహింపలేనివాడయ్యు అతికష్టముపై బయలుదేరి హిమవంతమునుచేరి తపస్సు నొనరించుకొనసాగెను.

తతో గుహం సమాసాద్య రామః ప్రాంజలి మబ్రవీత్
సఖే గచ్ఛ పురం రమ్యం శృంగవేర మనుత్తమం ॥
మా మేవ చింతయ న్నిత్యం భుంక్ష్వ భోగా న్నిజార్జితాన్
అంతే మత్తోవ సారూప్యం ప్రాప్స్యసే త్వం న సంశయః ॥

ఇట్లు హనుమంతుని సంతుష్టు నొనరించినతరువాత ప్రాంజలియై నిలబడియున్న గుహుని సమీపించి రాము డిట్లనెను– "మిత్రమా! నీవు సుందరమగు శృంగవేరపురమున కేగి సతతము నన్నే స్మరించుచు న్యాయమార్గమున స్వార్జితములను సంపదల ననుభవించుము. తరువాత నిస్సంశయముగా నా సాయుజ్యమును పొందగలవు."

ఇత్యుక్త్వా ప్రదదౌ తస్మై దివ్యా న్యాభరణాని చ
రాజ్యం చ విపులం దత్వా విజ్ఞానం చ దదౌ విభుః ॥

ఇట్లు పలికి రాముడు గుహునికి దివ్యములగు ఆభరణములను, రాజ్యమును ఇచ్చుటయేగాక మహర్షులభమయిన విజ్ఞానమునుకూడ ప్రసాదించెను. అనగా అనుభవరూపమగు ఆత్మజ్ఞానము నొసగెను.

రామే ణాఽలింగితో హృష్టో యయౌ స్వభవనం గుహః
యే చాన్యే వానరా శ్రేష్ఠాః అయోధ్యాం సముపాగతాః
అమూల్యభరణై ర్వస్త్రైః పూజయామాస రాఘవః॥

రాముడు గుహునకు విజ్ఞానమును ప్రసాదించి ప్రేమతో ఆలింగనమొనర్చెను. గుహుడును పరమానందభరితుడై తననగరమునకు వెళ్లెను. అనంతరము అయోధ్యకువచ్చిన ఇతర వానరశ్రేష్ఠులందరను రాముడు అమూల్యములగు వస్త్రాభరణములచే సత్కరించెను.

సుగ్రీవప్రముఖా స్సర్వే వానరాః సవిభీషణాః
యథార్హం పూజితా స్తేన రామేణ పరమాత్మనా ॥
ప్రహృష్టమనస స్సర్వే జగ్ము రేవ యథాగతం
సుగ్రీవప్రముఖా స్సర్వే కిష్కింధ్యాం ప్రయయు ర్ముదా॥

ఇట్లు సుగ్రీవప్రముఖులగు సర్వవానరులును విభీషణాదులును పరమాత్మయగు శ్రీరామచంద్రునిచే పూజితులైరి. సహాయమునకు వచ్చిన వానరులందరును తమ తమ నెలవులకు వెడలిపోయిరి. అనంతరము సుగ్రీవాదులు కిష్కింధకు చేరిరి.

విభీషణ స్తు సంప్రాప్య రాజ్యం నిహతకంటకం
రామేణ పూజితః ప్రీత్యా యయౌ లంకా మనిందితః॥

రావణాదులందరును వధింపబడుటచే ఎట్టి శత్రువులును లేని విభీషణుడు రాముచే పూజలనంది నిశ్శంకగా లంకానగరమున కేగెను.

రాఘవో జ్యమఖిలం శశ్వ సాఖిలవత్సలః
అనిచ్ఛ న్నపి రామేణ యౌవరాజ్యే భిషేచితః
లక్ష్మణః పరయా భక్త్యా రామసేవాపరో ఽభవత్ ॥

ఇట్లు మిత్రులనందరను వారి వారి స్థానములకు పంపి అనంతరము రాముడు ప్రజలనందరను పుత్రవాత్సల్యముతో పరిపాలించెను. తదువాత ఇష్టపడనప్పటికిని లక్ష్మణుని యువరాజుగా అభిషేకించెను. లక్ష్మణుడును పరమభక్తితో రామసేవాపరతంత్రుడై యుండెను.

ఇచ్చట లక్ష్మణుని యౌవరాజ్యాభిషేకము వాల్మీకి రామాయణవిరుద్ధము. అందు యౌవరాజ్యస్థుడైన భరతుడు నీవే యువరాజువు గమ్మని కోరినను లక్ష్మణుడు నిరాకరించగా భరతుడే యువరా

జయినట్లు వర్ణింపబడినది. "ఆతిష్ఠ ధర్మజ్ఞ మయా సహేమాం గాం పూర్వారాజాభ్యుషితాం భలేన తుల్యం యథాత్వం పితృభిః పురస్తాత్ హైతే ర్వావరాజ్యే ధుర మద్వహస్వ సర్వాత్మనా పర్యనునీయమానో యదా న సౌమిత్రి రుపైతి యోగమ్ నియుజ్యమానో భువి యూవ రాజ్యే. తతో ఽభ్యషించ ద్భరతం మహాత్మా ॥"

రామ స్తు పరమాత్మా ఽపి కర్మాధ్యక్షో ఽపి నిర్మలః
కర్తృత్వాదివిహీనో ఽపి నిర్వికారో ఽపి సర్వదా॥
స్వానందే నాపితుష్టిః సంలోకానామపదేశకృత్
అశ్వమేధాదియజ్ఞై శ్చ సర్వై ర్విపులదక్షిణైః
అయజత్ పరమానందో మానుషం వపు రాశ్రితః॥

రాముడు తాను పరమాత్మ అయ్యును సమస్త కర్మ నియామకు డయ్యును, నిర్మలుడయ్యును, కర్తృత్వభోక్తృత్వాది విరహితుడయ్యును, నిర్వికారుడై నిత్యము ఆనందనిమగ్నుడైయుండువాడయ్యును లోకశిక్షణ మునకై అశ్వమేధము మొదలగు అనేక యజ్ఞముల నొనరించెను. ఆ యజ్ఞములందు గొప్పగొప్ప దక్షిణలతోడను, అనేక దానములతోడను ప్రజలను సంతుష్టుల నొనరించెను. లోకసంగ్రహబుద్ధితోడనే కర్మల నొనర్చెనుగాని, సక్తుడై కాదని తాత్పర్యము.

శ్రీరాముని పరిపాలనమున రాజ్యమందలి ప్రజలందరును సుఖ మయజీవితమును గడిపి రనువిషయమును వివరింపుచున్నాడు.

న పర్యదేవ న్విధవా న చ వ్యాలకృతం భయం
న వ్యాధిగం భయం చాఽఽసీ ద్రామే రాజ్యం ప్రశాసతి
లోకేద స్మ్య భయం నాసీదనర్థో నాస్తి కశ్చన॥

శ్రీరాముడు రాజ్యపరిపాలన మొనర్చుచుండగా భార్యలకంటె భర్తలు ముందు చనిపోవుటలేదు. కాన విధవలపరివేదనము లేకుం డెను. సర్పభయము లేకుండెను. వ్యాధిభయముకూడ లేకుండెను.

రాజ్యమందు ఏప్రదేశమందును చోరులవలని ఉపద్రవమను మాటయే వినిపించెడిదికాదు.

వృక్షేషు సత్సు బాలానాం నాసీ న్మృత్యుభయం తథా
రామపూజాపరాః సర్వే సర్వే రాఘవచింతకాః॥

తలిదండ్రులు జీవించియుండగా పుత్రుల మరణములు సంభవించెడివికావు. అనగా అకాలమృత్యుభయములేదు. ప్రజలందరును శ్రీరామునే ధ్యానించుచు నిత్యము పూజించుచుండెడివారు.

వవర్షుః జలదా స్తోయం యథాకాలం యథారుచి
ప్రజాః స్వధర్మనిరతా వర్ణాశ్రమగుణాన్వితాః॥

మేఘములు దేశకాలము ననుసరించి తగినట్లు వర్షించెడివి. ప్రజలు స్వకీయధర్మమును తప్పక ఆచరించుచుండెడివారు. వర్ణాశ్రమ ధర్మములను పరిపాలించును ఉత్కృష్టగుణములచే విరాజిల్లుచుండెడివారు.

ఔరసా నివ రామో ఒపి జుగోప పితృవత్ ప్రజాః
సర్వలక్షణసంయుక్తాః సర్వధర్మపరాయణాః
దశవర్ష సహస్రాణి రామో రాజ్య ముపాస్త సః॥

తండ్రి తన సంతానమును వాత్సల్యభావమున శాసించునట్లు రాముడు తన ప్రజల సంరక్షణ మొనర్చెను. ప్రజలును సర్వసంపల్లక్షణములతోగూడి ధర్మమార్గమును తప్పక సంచరించిరి. ఈవిధముగా దాశరథి పదివేలసంవత్సరములు రాజ్యమును పరిపాలించెను.

ఈవిధముగా గ్రంథకర్త అభిషేకాంతము శ్రీరామ చరిత్రమును వర్ణించి ప్రశంసాపూర్వకముగా ఏతద్గ్రంథపఠన శ్రవణమననపూజాపుర స్కారములవలన లభించు పరమార్థమును ప్రతిపాదించుచున్నాడు.

ఇదం రహస్యం ధనధాన్యబుద్ధిమ
ద్దీర్ఘాయురారోగ్యకరం సుపుణ్యదం
పవిత్ర మధ్యాత్మకసంజ్ఞితం పురా
రామాయణం భాషిత మాదిశంభునా॥

ఈ అధ్యాత్మరామాయణము ఆదిశంకరునిచే ఉపన్యసింపబడినది. వేదాంతరహస్యము లిందు ప్రతిపాదింపబడుటచే అనధికారులకు దుర్గాహ్యమయినది. నిత్యపఠనపాఠముల నొనరించువారికి ధనధాన్యసమృద్ధిని సుదీర్ఘములగు ఆయురారోగ్యములను ప్రసాదించునది. అనంతములగు పుణ్యముల నొనరించునది. పవిత్రమయినది.

శృణోతి భక్త్యా మనుజః సమాహితో
భక్త్యా పఠే ద్వా పరితుష్టమానసః
సర్వాం సమాప్నోతి మనోగతాశిషో
విముచ్యతే పాతకకోటిభిః క్షణాత్॥

ఏమానవుడు సమాహితచిత్తుడై ఈ అధ్యాత్మరామాయణమును వినునో, ఎవడు భక్తిపరితుష్టుడై పఠించునో అతడు సమస్తపాతకములనుండియు ఒకక్షణములో విముక్తుడగుటయేగాక మనోరథములన్నిటిని పొందగలడు.

రామాభిషేకం ప్రయతః శృణోతి యో
ధనాభిలాషీ లభతే మహద్ధనమ్
పుత్రాభిలాషీ సుత మార్యసన్నిభమ్
ప్రాప్నోతి రామాయణ మాదితః పఠన్॥

ఎవడయినను శ్రద్ధాన్వితుడై ఈ అధ్యాత్మమందలి రామాభిషేక వృత్తాంతమును వినునో అతడు ధనమునుకోరిన చో మహత్తరమగు ధన సమృద్ధి కలుగును. రామాయణము మొదటినుండి పఠించి సుపుత్రుని కోరినచో ఆర్యగుణగణయుతుడగు పుత్రుని బడయును.

శృణోతి యో ఽధ్యాత్మికరామసంహితాం
ప్రాప్నోతి రాజ్యం భువ మృద్ధసంపదమ్
శత్రూ న్విజి త్యారిభి రప్రధర్షితో
వ్యపేతశోదుఃఖో నిజయా భయే న్నృపః॥

ప్రజాపాలకుడగు క్షత్రియుడు అధ్యాత్మరామసంహితను తప్పకుండా వినినట్లయిన సమస్తసంపత్సమృద్ధులుగల రాజ్యమును సంపాదింపగలడు. పరాజయమనునది ఎరుగక ప్రబలురగు శత్రువుల నందరను జయించి దుఃఖరహితుడై విజయశీలియగును.

స్త్రియో ఽపి శ్రుణ్వ న్నధిరామసంహితాం
భవంతి తా జీవసుతా శ్చ పూజితాం
వంధ్యా ఽపి పుత్రం లభతే సురూపిణం
కథా మిమాం భక్త్యయుతా శృణోతి యా॥

స్త్రీలు ఈ అధ్యాత్మరామాయణమును వినినచో వారు చిరకాలము జీవించుపుత్రులకు తల్లులగుదురు. అంతేగాక గృహమందు పూజనీయులగుదురు. గొడ్రాలు ఈ రామకథను భక్త్యయుక్తురాలై వినినచో సుందరుడగు పుత్రునికి మాతయై విరాజిల్లును.

శ్రద్ధాన్వితో యః శృణుయాత్ పఠే న్నరో
విజిత్య కోపం చ తథా విమత్సరః
దుర్గాణి సర్వాణి విజిత్య నిర్భయో
భవే త్సుఖీ రాఘవభక్తి సంయుతః॥

ఏమానవుడయినను శ్రద్ధాభక్తులతో ఈ రామకథను వినినచో క్రోధమును జయించును. మాత్సర్యరహితుడగును. తోడ్తో దుఃఖస్థానములగు విషయములనన్నిటిని జయించి నిర్భీతుడై సంచరించును. అట్టివాడు శ్రీరామభక్తి పరిపూర్ణితుడై అనంతసుఖమున నోలలాడును.

సురాః సమస్తా అపి యాంతి తుష్టతాం
విష్ణోః సమస్తా అపి యాంతి శ్రుణ్వతాం
అధ్యాత్మరామాయణ మాదితో నృణాం
భవంతి సర్వా అపి సంపదః పరాః॥

అధ్యాత్మరామకథను శ్రద్ధాన్వితులై విన్నవారియెడల దేవతలు నిత్యము సంతుష్టులై యుందురు. వారి జీవితప్రయత్నములు నిర్విఘ్నములగును. ఆద్యంతము వినినవారికి సమస్తసంపదలు చేకూరును.

రజస్వలా వా యది రామతత్పరా
శృణోతి రామాయణ మేత దాదితః
పుత్రం ప్రసూతే బుషభ శ్చిరాయుషం
పతివ్రతా లోకసుపూజితా భవేత్ ॥

రజస్వల అయిన స్త్రీ రామతత్పరహృదయయైై ఈ రామాయణమును ప్రారంభమునుండి వినినచో శ్రేష్ఠుడగు కుమారుని జనియగును. పతివ్రత వినినట్లయిన లోకగౌరవము నందుకొనును. ఇక్కడ రజస్వల అనగా స్నానానంతరము పదునారుదినములలోపల అని భావము.

పూజయిత్వా తు యే భక్త్యా నమస్కుర్వన్తి నిత్యశః
సర్వై ఃపాపై ర్వినిర్ముక్తా విష్ణో ర్యాన్తి పరం పదం ॥

ఎవరైతే నిత్యము ఈగ్రంథమునుచూచి భక్తితో పూజించి నమస్కరింతురో వారు సర్వపాపములనుండి విడివడి విష్ణుదేవుని సాన్నిధ్యమును పొందుదురు.

అధ్యాత్మరామచరితం కృత్స్నం శృణ్వన్తి భక్తితః
పఠంతి వా స్వయం వక్త్రా త్తేషాం రామః ప్రసీదతి ॥

అధ్యాత్మరామకథను ఆసాంతము వినినవారు గాని, స్వముఖతః పఠించినవారుగాని శ్రీరామచంద్రుని కృపామృదమునకు పాత్రులగుదురు.

రామ ఏవ పరబ్రహ్మ తస్మిం స్తుష్టే ఖిలాఽత్మని
ధర్మార్థకామమోక్షాణాం యద్య దిచ్ఛంతి తద్భవేత్ ॥

శ్రీరాముడే పరబ్రహ్మ, సమస్త శరీరవ్యాప్తి అయిన ఆపరాత్పరుడు సంతుష్టుడయినచో ఇక కావలసిన దేమున్నది? ధర్మార్థకామమోక్షములను చతుర్విధపురుషార్థములు సమకూరినట్లే.

శ్రోతవ్యం నియమే నైతద్రామాయణ మఖండితం
ఆయుష్య మారోగ్యకరం కల్పకోట్యఘనాశనం ॥

నియమయుక్తుడై ప్రతినాడు వినదగిన దీరామాయణము. అట్లు వినిన చో ఆయురారోగ్యములు వృద్ధిపొందును. అనేక కోటికల్పముల నుండియు సంచితమయిన పాపరాశులన్నియు వాటంతట అవియే నాశ నమును పొందును.

దేవా శ్చ సర్వే తుష్యంతి గ్రహాః సర్వే మహర్షయః
రామాయణస్య శ్రవణే తుష్యంతి పితర స్తథా ॥

రామాయణ శ్రవణపాఠనముల వలన సర్వదేవతలు సంతుష్టు లగుదురు. గ్రహములు సంతోషించును. మహర్షులుకూడ ప్రసన్న లగుదురు. పితృదేవతలు తృప్తులగుదురు.

అధ్యాత్మరామాయణ మేత దద్భుతం
వైరాగ్యవిజ్ఞానయుతం పురాతనం
పఠంతి శృణ్వంతి లిఖంతి యే నరాః
తేషాం భవే స్మిన్న పునర్భవో భవేత్ ॥

అధ్యాత్మరామాయణమను ఈగ్రంథము మనుష్యతరణమునకై ఏర్పడిన ఇతరగ్రంథము లన్నిటికంటెను విలక్షణ విశిష్టత్వము కలది. కారణ మేమన ఇందు వైరాగ్యప్రధానమయిన ఆత్మవిజ్ఞానమంతయు సులభశైలిలో ప్రతిపాదింపబడియున్నది. కనుక ఈగ్రంథమును పఠించు వారలు, వినువారలేగాక వ్రాయువారుకూడ భవసముద్రమునుండి తరించి నిత్యముక్తు లగుదురు.

ఈ గ్రంథ విలక్షణత్వమును ప్రతిపాదించుచున్నాడు.

ఆలో డ్యాఖిలవేదరాశి మసకృత్ యత్తారకం బ్రహ్మ తద్
రామో విష్ణురహస్యమూ ర్తి రితి యో విజ్ఞాయ భూతేశ్వరః
ఉద్ధృ త్యాఖిలసారసంగ్రహ మిదం సంక్షేపతః ప్రస్ఫుటం
శ్రీరామస్య నిగూఢతత్వ మఖిలం ప్రాహ ప్రియాయై భవః ॥

సమస్త భూతనాథుడగు పశుపతి విజ్ఞానులలో శ్రేష్ఠుడు. ఆకారణమున అతడు సమస్త వేదరాశిని మథించి మథించి సమస్తమానవ తరణసాధనమగు తారకబ్రహ్మను కనుగొనినాడు. తారకబ్రహ్మ పర్యాయవాచకమే రామనామము. రామనామవాచ్యుడే దశరథపుత్రుడగు శ్రీరాముడు. అనగా శ్రీరాముడు సర్వవ్యాపకార్థముగల విష్ణుశబ్ద వాచ్యుడయిన పరమాత్మయొక్క రహస్యమూర్తి. ఈ రహస్యము నంతను సదాశివుడు గ్రహించినాడు. శ్రీరాముని చరితము సమస్తవేద సారస్వరూపమయినది. అది సాధారణులకు రహస్యమయమై గ్రహించ నలవికానిదిగా నుండును. సదాశివుడు అట్టి రామచరితను సంక్షిప్తముగాను, సుబోధకముగాను ఉండునట్లు తన ప్రాణప్రియమైన పార్వతికి సమగ్రముగా నుపదేశించినాడు.

ఉత్తరకాండ

ప్ర థ మ స ర్గ

సర్వజగజ్జననియగు పార్వతి స్వేచ్ఛాచారులు, అల్పసత్త్వులు అగు మానవుల తరణోపాయమునుగోరి పతియగు శ్రీ శంకరుని రామ తత్త్వవివరణమునుగోరి పృచ్ఛించినది. భక్తవశంకరుడగు శంకరుడును శ్రీరామతత్త్వమును సీతారామాంజనేయ సంవాదరూపమయినదానిని ప్రతిపాదించినాడు. శ్రీరామహృదయమును వినిన పార్వతి శ్రీరామ చరిత్రమునుగూడ వినిపింపుమని కోరినది. శంకరుడు లోకానుగ్రహ బుద్ధ్యా ప్రియురాలి కోరికను మన్నించి శ్రీరాముని అవతారకారణ మును, అవతారమును, రామాదుల బాల్యక్రీడలను, తాటకాద్యుద్ధర ణమును, శివధనుర్భంగమును, సీతాకళ్యాణమును, భార్గవరామసంవాద మును, అయోధ్యాప్రవేశమును వర్ణించి బాలకాండమును ముగించి నాడు.

రాజ్యసుఖముల ననుభవించుచున్న రామునివద్దకు దేవర్షి నార దుడు వచ్చి రావణవధరూపమయిన ప్రతిజ్ఞాపాలనమునకు ప్రోత్సహిం చుట మొదలుకొని, శ్రీరామవనగమనము, భరద్వాజ వాల్మీకాదులను దర్శించి చిత్రకూటమున నివాస మేర్పరచుకొనుట, రామ భరతసమా గమము, పాదుకాపట్టాభిషేకము, అత్రిసందర్శనములను వర్ణించి అయో ధ్యాకాండను ప్రతిపాదించినాడు. శ్రీరాముడు విరాధుని వధించుట, శర భంగుని సందర్శించి మునులయెదుట రాక్షససంహారమునకై ప్రతిజ్ఞ నొనర్చుట, సుతీక్ష్ణ సందర్శనము, అగస్త్యసందర్శనము, పంచవటీనివా సము, శూర్పణఖావిరూపణము, మాయామృగదర్శనము, సీతాపహర ణము, జటాయు మోక్షము, శబరీమోక్షము మొదలగు విషయము లను వర్ణించి అరణ్యకాండను ప్రతిపాదించినాడు. పంపాసరోవరసందర్శ నముతో ప్రారంభించి రామసుగ్రీవమైత్రి, వాలివధ, సుగ్రీవాభిషేకము, రామలక్ష్మణుల ప్రవర్షణగిరి నివాసము, లక్ష్మణక్రోధము, సీతాన్వేష ణము, స్వయంప్రభ, సంపాతిదర్శనము, హనుమదుత్సాహము మొద లగు విషయప్రతిపాదనలతో కిష్కింధకాండమును ముగించినాడు. అనం

తరము రాముని విజయయాత్ర, విభీషణశరణాగతి, సముద్రబంధనము, లంకాప్రవేశము, యుద్ధప్రారంభము, సర్వరాక్షససంహారము, కుంభకర్ణవధ, ఇంద్రజిద్వధ, రావణవధ, విభీషణపట్టాభిషేకము, మాయాసీత అనలమున ప్రవేశించుట, దేవతలు రాముని స్తుతించుట, అగ్ని నిజసీతను సమర్పించుట, పుష్పకాధిరోహణము, అయోధ్యాగమనము, శ్రీరామపట్టాభిషేకములతో యుద్ధకాండమును ప్రతిపాదించి శంకరుడు రామావతారప్రయోజనమును ప్రతిపాదించినాడు. కాని పార్వతి రామచరిత్ర శ్రవణమునకు తృప్తి కలుగలేదు. రాజ్యాభిషిక్తుడయిన అనంతరమునాడు రాముడు ఏవిధముగా ప్రవర్తించినాడో వినవలెనను కుతూహలము కల్గి ఆమె తిరిగి భర్తను ప్రశ్నించినది. పార్వతీశివుల ప్రశ్నోత్తరరూపమయిన ఉత్తరకాండమును గ్రంథకర్త ప్రారంభించుచున్నాడు—

శ్రీ పార్వత్యువాచ :—

అథ రామః కిమకరోత్ కౌసల్యానందవర్ధనః
హత్వా మృధే రావణాదీన్ రాక్షసాన్ భీమవిక్రమః ॥

మాతృదేవియగు కౌసల్యాదేవి హృదయానందమును దిసదిన ప్రవర్ధమానమొనరుచు శ్రీరామచంద్రుడు పితృవాక్పరిపాలనాతత్పరుడై పదునాల్గువత్సరములు వనవాస మొనర్చి రావణుడు, కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు మొదలగు దేవభయంకరులగు రాక్షసవరులను యుద్ధమున వధించి శత్రుభయంకరవిక్రముడని పేరుపొంది అయోధ్యలో నివసించు రాముడు చేసిన ఉత్తమకార్యము లెవ్వి?

అభిషిక్తస్త్వయోధ్యాయాం సీతయా సహ రాఘవః
మాయామానుషతాం ప్రాప్య కతివర్షాణి భూతలే
స్థితవాం ల్లీలయా దేవః పరమాత్మా సనాతనః ॥

జగత్సృష్టికి పూర్వమందున్న తాను ఉండి సనాతనుడయిన పరమాత్మ మాయ నాశ్రయించి మనుష్యదేహధారియై భక్తానుగ్ర

హాసుచే వివిధలీలలను బరగించి సీతాసహితుడై ఎన్నివత్సరములు అయోధ్యలో నివసించినాడు ?

అత్యజ న్మానుషం లోకం కథ మంతే రఘూద్వహః
ఏత దాఖ్యాహి భగవ ఁ శ్రద్ధధ్యా మమ ప్రభో ॥

చిరకాలము ఈ మానవలోకమును పరిపాలించి చివరకు శ్రీరామ చంద్రుడు మనుష్యలోకమును త్యజించి వైకుంఠమున కేగినాడు. శంకరా ! నీవు సర్వైశ్వర్యసంపన్నుడవు. నీకు తెలియని రహస్య ముండబోదు. కాన శ్రద్ధాపరిపూర్ణమయిన మనస్సుతో ప్రశ్నించు చున్నాను. కనుక దయయుంచి ఈవిషయములనుకూడ వినరింపుము.

కథాపీయూష మాస్వాద్య తృష్ణా మే తీవ వర్ధతే
రామచంద్రస్య భగవ ఁ బ్రూహి విస్తరశ కథామ్ ॥

శ్రీరామచంద్రుని కథామృతమును పానమొనరించినకొలది నా తృష్ణ పెరుగుచున్నదేగాని ఏతన్మాత్రమును తరుగుటలేదు. కాన మిగిలిన చరిత్రనుకూడ విస్తారపూర్వకముగా వర్ణించునది.

శ్రీ మ హా దే వ ఉ వా చ :—

రాక్షసానాం వధం కృత్వా రాజ్యం రామ ఉపస్థితే
ఆయయు ర్మునయ స్సర్వే శ్రీరామ మభినందితుం ॥

పార్వతీదేవియొక్క శ్రద్ధాపూర్వకమయిన ప్రశ్నలను విని శంకరుడు అనంతరచరిత్రను వర్ణించ ప్రారంభించినాడు.

శ్రీరాముడు సీతాసహితుడై రాజ్యపరిపాలన మొనర్చుచుండగా రావణ కుంభకర్ణేంద్రజిదాదుల వధవృత్తాంతము నాకర్ణించిన మహాత్ములనేకులు అతనిని దర్శించి అభినందించుటకై అయోధ్యకు విచ్చేసిరి.

విశ్వామిత్రో ఽసితః కణ్వో దుర్వాసా భృగు రంగిరాః
శిష్యో వామదేవో ఽత్రి స్తథా సప్తర్షయో ఽమలాః ॥

అ వచ్చిన మహాత్ములు వీరు—విశ్వామిత్రుడు, అసితుడు, కణ్వుడు, దుర్వాసుడు, భృగువు, అంగిరసుడు, కశ్యపుడు, వామదేవుడు, అత్రి.

వీరందరు తపోతేజో ధురంధరులు. వీరేగాక ఇంకను మహర్షు లనేకులు వచ్చిరి.

అగస్త్యశ్చ సహశిష్యైశ్చ మునిభిశ్చ సహితో ఽభ్యగాత్
ద్వార మాసాద్య రామస్య ద్వారపాల మథాబ్రవీత్ ॥

పై మహర్షులతో బాటు దండకారణ్యవాసియగు అగస్త్యుడును శిష్యసంఘములచే పరివృతుడై రాముని అభినందించుట కేతెంచెను. అతడు ద్వారమును సమీపించి ద్వారపాలకునితో ఇట్లు పలికెను.

బ్రూహి రామాయ మునయశ్చ సమాగత్య బహిశ్చ స్థితాశ్చ
అగస్త్యప్రముఖాశ్చ సర్వే ఆశీర్భిరభినందితుమ్ ॥

"ద్వారపాలకా! నీవు వెంటనే శ్రీరామునొద్దకు బోయి అగస్త్యుడు మొదలగు మహర్షులందరును నిన్ను దర్శించి, అభినందించుటకై వచ్చినారని విన్నవింపుము" అని.

ప్రతీహార స్తతో రామ మగస్త్యవచనా ద్ధృతమ్
నమస్కృత్వా బ్రవీ ద్వాక్యం వినయావనతః ప్రభుమ్ ॥

అగస్త్యుని వచనములను వినినవెంటనే ఆ ద్వారపాలకుడు అతి శీఘ్రముగా శ్రీరాముని సందర్శించి, వినయావనతశిరస్కుడై ఇట్లు పలికెను.

కృతాంజలి రువా చేద మగస్త్యో ముసభిః సహా
దేవ త్వద్దర్శనాకాంక్షీ ప్రాప్తో బహి రుపస్థితః ॥

అతడు అంజలిఘటించి ఇట్లు పలికెను. "దేవా! అగస్త్యమహర్షి శిష్యసంఘములతోడను, అన్యమహర్షి సంఘములతోడను నిను దర్శించుటకై వచ్చి ద్వారదేశమున నున్నాడు" అని.

త మువాచ ద్వారపాలం ప్రవేశయ యథాసుఖమ్
పూజితా వివిశు ర్వేశ్మ నానారత్నవిభూషితమ్ ॥

మహర్షులు వచ్చినారన్న వార్తనువిని శ్రీరాముడు వారిని అతి త్వరగా యథావిధిగా సభాభవనమును ప్రవేశపెట్టుమని ఆజ్ఞాపించినాడు.

మహర్షులును అర్ఘ్యపాద్యాదులచే పూజితులై నానా విచిత్రరత్న కాంతి శోభాయుతమయిన సభాభవనాభ్యంతర ప్రదేశమున ప్రవేశించిరి.

దృష్ట్వా రామో మునీ౯ శీఘ్రం ప్రత్యుత్థాయ కృతాంజలిః
పాద్యార్ఘ్యాదిభి రాపూజ్య గాం నివేద్య యథావిధి
తా్వ తేభ్యో దదౌ దివ్యా న్యాసనాని యథార్హ్వతః ॥

సభలోనికి ప్రవేశించుచున్న మహర్షులను చూడగనే శ్రీరామ చంద్రుడు సింహాసనమునుండి లేచి వారికి ఎదురేగి, పాద్యము, అర్ఘ్యము మొదలగు పూజాద్రవ్యములచే సంభావించి, తరువాత మధుపర్కము నలై గోవు నొకదానిని సమర్పించి కృతాంజలియై వారికి తగిన ఆసన ములను చూపి ఉపవిష్టుల నొనర్చినాడు.

ఉపవిష్టాః ప్రహృష్టా శ్చ మునయో రామపూజితాః
సంపృష్టకుశలా స్సర్వే రామం కుశల మబ్రువ౯ ॥

వారందరును తమ తమ ఆసనములపై ఉపవిష్టులై శ్రీరామునిచే యథావిధిగా పూజితులైరి. తరువాత శ్రీరాముడు వారి కుశలవార్త లను వేరువేరుగా నడిగెను. మహర్షులు తమ కుశలమును చెప్పి తాము కూడ శ్రీరాముని కుశలమును పృచ్ఛించిరి.

కుశలం తే మహాబాహో సర్వత్ర రఘునందన
ది ష్ట్యేదానీం ప్రపశ్యామో హతశత్రు మరిందమ ॥

రాఘవవంశవివర్ధనా ! శ్రీరామా ! నీకు సంపూర్ణకుశలమే గదా ! మాభాగ్యవశమున ఇప్పుడు శత్రుసంహారకుడవగు నిన్ను చూచుచున్నాము.

న హి భారః స తే రామ రావణో రాక్షసేశ్వరః
సధను స్త్వం హి లోకాం స్త్రీ౯ విజేతుం శక్త ఏవ చ
దిష్ట్యా త్వయా హతాః సర్వే రాక్షసా రావణాదయః ॥

రామా ! నీవు ఒక్కడవే ధనుష్పాణివై స్వర్గమర్త్యపాతాళ లోకముల మూడిటిని లీలగా జయించగలవు. అట్టి సమర్థుడవగు నీకు

రాక్షసచక్రవర్తి అయిన రావణుడు ఒక బరువ్వకాడు. మాభాగ్యవశమున లోకభయంకరులయిన రావణాదులు నిహతులయినారు.

మహర్షులు పై శ్లోకమున రావణుడు రామునకు భారస్వరూపుడు కాదని భారస్వరూపుడయినవా డవడో చెప్పుచున్నారు.

శక్య మేత న్మహాభాహో రావణస్య నిబర్హణం
అశక్య మేత త్సంప్రాప్తం రావణే ర్య న్నిషూదనం॥

త్రిలోకభయంకరుడయినను రావణుని వధించుట నీశక్తికి అందనివిషయముకాదు. కాని అతనిపుత్రుడయిన మేఘనాదుని వధించుటే నీకశక్యమయిన కార్యము. కాని ఆకార్యమును సఫలమయినది.

అంతకప్రతిమా స్సర్వే కుంభకర్ణాదయో మృధే
అంతకప్రతిమై ర్బాణై ర్వా తా స్తే రఘుసత్తమ॥

పై యిద్దరూ గాక కుంభకర్ణుడు, ప్రహస్తుడు, అతికాయుడు మొదలగు మహావీరులు లోకములకు అంతకులవంటివారు. కాని నీ సునిశితములగు బాణములు వారి పాలిటి అంతకులై నిహతుల నొనరించినవి.

దత్తా చేయం త్వయా ఽస్మాకం పురా హ్యభయదక్షిణా
హతా స్త్వా రక్షోగణా స్సంఖ్యే కృతకృత్యో ఽద్య జీవసి॥

పూర్వము నీవు దండకవనములో రాక్షసుల నందరను వధించి ఋషిసంఘములకు క్షేమమును సమకూర్చెదనని ప్రతిజ్ఞసల్పియున్నావు. నీవు సత్యప్రతిజ్ఞుడవై అసంఖ్యాకములయిన రాక్షసగణములను నిహతమొనర్చి అవతారప్రయోజనమును నెరవేర్చినవాడవైతివి.

శ్రుత్వా తు భాషితం తేషాం మునీనాం భావితాత్మనాం
విస్మయం పరమం గత్వా రామః ప్రాంజలి రబ్రవీత్॥

సచ్చిదానందస్వరూపుడగు పరమాత్మను చిత్రించుటే జీవనపరమార్థముగా ఎంచుకొనిన అగస్త్యాదుల భాషణమును విని శ్రీరామచంద్రుడు అత్యంతవిస్మయగ్రస్తహృదయుడై అంజలిఘటించి వారితో ఇట్లు పలికెను.

రావణాదీ నతిక్రమ్య కుంభకర్ణాదిరాక్షసాన్
త్రిలోకజయినో హిత్వా కిం ప్రశంసథ రావణిమ్॥

మహాస్థలారా ! రావణుడు, కుంభకర్ణుడు మొదలగు రాక్షసులు సర్వాసుర నాయకులు. వారు సర్వదిక్పాలకసహితముగా త్రిలోకమును జయించినవారు. అట్టివారిని కాదని మీరు రావణపుత్రుడయిన మేఘనాదుని ప్రశంసించుటకు కారణమేమి ?

తత స్తద్వచనం శ్రుత్వా రాఘవస్య మహాత్మనః
కుంభయోనిర్మహాతేజా రామం ప్రీత్యా వచోఽబ్రవీత్॥

మహాత్ముడగు శ్రీరామచంద్రుడిట్లు సందేహమును ప్రశ్నరూపకముగా వెలువరించగా ఋషులందరికి ప్రతినిధియై కుంభోద్భవుడయిన అగస్త్యుడు ప్రేమతో ఇట్లు పలికెను.

శృణు రామ యథావృత్తం రావణే రావణస్య చ
జన్మ కర్మ వరాదానం సంక్షేపా ద్దదతో మమ॥

రామా ! నీ సందేహమును తీర్చుటకు కొంతపూర్వవృత్తాంతమును చెప్పెదను. రావణునియొక్కయు, రావణియొక్కయు జన్మవిధానములను, వారు చేసిన పనులను, వరసంపాదనములను సంక్షేపముగా చెప్పి నీ సందేహమును తీర్చెదను.

పురా కృతయుగే రామ పులస్త్యో బ్రహ్మణః సుతః
తప స్తప్తుం గతో విద్వా న్మేరోః పార్శ్వం మహామతిః॥

పూర్వము కృతయుగమందు చతుర్ముఖప్రజాపతి పుత్రుడగు పులస్త్యుడు సుదీర్ఘతపశ్చర్య నొనరించు ఉద్దేశ్యముతో మేరుపర్వతమునకు బోయెను.

తృణబిందో ర్మహర్షే ఽసౌ న్యవస న్మునిపుంగవః
తప స్తేపే మహాతేజాః స్వాధ్యాయనిరతః సదా॥

మేరుపర్వతపార్శ్వమున తృణబిందుడను రాజర్షియొక్క తపోవనమున్నది. పులస్త్యమహర్షి ఆయాశ్రమములోనే ఒకవైపు కుటీరమును

నిర్మించుకొని నిరంతరస్వాధ్యాయతత్పరుడైతపస్సు నొనరించుచు మహా తేజస్కుడై వెల్గొందుచుండెను.

తత్రాఽఽశ్రమే మహారమ్యే దేవగంధర్వకన్యకాః
గాయన్త్యో ననృతుః తత్ర హసన్త్యో వాదయంతి చ
పులస్త్యస్య తపోవిఘ్నం చక్రుః సర్వా అనిందితాః॥

తృణబిందుని ఆయాశ్రమము అత్యంతమనోహరమయినది. ఆ కారణమున దేవగంధర్వాదిజాతులకు చెందిన కన్యకామణులు ప్రహృహృదయములతో పాటలు పాడుకొనుచు, నృత్యము లొనరించుచు, వివిధజంత్రములను ప్రయోగించుచు ఆటలాడుకొను చుండెడివారు. కాని వారి ఆటలు పులస్త్యునికిమాత్రము చికాకుకల్గించి తపస్సును విఘ్న మొనరించెడివి.

తతః క్రుద్ధో మహాతేజా వ్యాజహార వచో ఽర్థవిత్
యా మే దృష్టిపథం గచ్ఛే త్సా గర్భం ధారయిష్యతి॥

భావ్యర్థానర్థములను సమూలముగా నెరిగిన మహాతేజోశాలి యగు పులస్త్యప్రజాపతి తపోవిఘ్నమునకు క్రుద్ధుడై "ఇక ఈనాటినుండి నా దృష్టిపథమును పొందినకన్య ఎవ్వరైనను సరే వెంటనే గర్భమును ధరించగలదు" అని శపించెను.

తాః సర్వాః శాపసంవిగ్నా నతం దేశం ప్రచక్రముః
తృణబిందో స్తు రాజర్షేః కన్యా తన్నాశృణో ద్వచః
విచచార మునే రగ్రే నిర్భయా తం ప్రపశ్యతీ॥

అమోఘవచస్కుడగు మహర్షియొక్క శాపవచనములను విని దేవగంధర్వకన్యలందరును భయకంపితహృదయులై తమ తమ స్థానము లకు పారిపోయిరి. కాని రాజర్షిసత్తముడగు తృణబిందుని పుత్రిక శాప వచనములను వినియుండకపోవుటచే నిర్భయముగా ఋషియెదుట సంచరించెను.

బభూవ పాండురతను ర్వ్యంజితాంతః శరీరజా
దృష్ట్వా సా దేహవైవర్ణ్యం భీతా పితర మన్వగాత్॥

అంతట ఆమె శరీరము పాండురవర్ణముగల దయ్యెను. ఇతరము లగు గర్భచిహ్నము లన్నియు స్పష్టములయినవి. తన దేహమం దుద్భవిల్లిన ఈ మార్పులను జూచి భయపడుచు ఆమె తండ్రి సమీపమునకు వెళ్ళెను.

తృణబిందు శ్చ తాం దృష్ట్వా రాజర్షి ర మితద్యుతిః
ధ్యాత్వా మునికృతం సర్వ మవైద్ విజ్ఞానచక్షుషా॥

తృణబిందుడు తనపుత్రికలో కల్గిన మార్పులను గమనించి, అతడు మహాతేజశ్శాలియును అమితతపోధనుడును అగుటచే నిమీలిత నేత్రుడై ధ్యానయోగము నవలంబించి జ్ఞానచక్షువుచే ఇదంతయు మునీశ్వరుని శాపఫలముగా నెరిగెను.

తాం కన్యాం మునివర్యాయ పులస్త్యాయ దదౌ పితా
తాం ప్రగృ హ్యాబ్రవీ త్కన్యాం బాఢ మిత్యేవ స ద్విజః॥

తండ్రి తనపుత్రికను వెంటబెట్టుకొని పులస్త్యునివద్ద కేగి వృత్తాంత మునంతను నివేదించి తనకన్యను భార్యగా సమర్పించెను. పులస్త్యుడును తృణబిందు పుత్రికను అత్యాదరముతో పరిగ్రహించెను.

శుశ్రూషణపరాం దృష్ట్వా మునిః ప్రీతో ఽబ్రవీ ద్వచః
దాస్యామి పుత్ర మేకం తే ఉభయో ర్వంశవర్ధనం॥

తృణబిందు పుత్రిక పతివ్రతయై పులస్త్యప్రజాపతిని భక్తిశ్రద్ధ లతో సేవించినది. మహర్షి సంతుష్టహృదయుడై ఆమెతో "నీకు ఉభయవంశముల కీర్తిని ఇనుమడింపజేయు వంశకరుడగు పుత్రు నొస గెద" నని పలికెను.

తతః ప్రాసూత సా పుత్రం పులస్త్యా ల్లోకవిశ్రుతమ్
విశ్రవా ఇతి విఖ్యాతః పౌలస్త్యో బ్రహ్మవి న్మునిః॥

అనంతర మామె సర్వలోకప్రసిద్ధుడగు విశ్రవసుడను పుత్రుని కనినది. పౌలస్త్యుడగు అతడు బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడుగా ప్రసిద్ధి కెక్కెను.

తస్య శీలాదికం దృష్ట్వా భరద్వాజో మహామునిః
భార్యార్థం స్వాం మహితరం దదౌ విశ్రవసే ముదా॥

అతని ఉత్తమశీలమును, తపఃప్రాభవమును జూచి భరద్వాజ మహర్షి తన పుత్రికను ధర్మపత్నిగా నిచ్చెను.

తస్యాం తు పుత్రః సంజజ్ఞే పౌలస్త్యో లోకసంమతః
పితృతుల్యో వైశ్రవణో బ్రహ్మణా చానుమోదితః॥

భరద్వాజ పుత్రికయందు పౌలస్త్యుడగు విశ్రవసునకు సర్వలోక గౌరవభాజనుడయిన వైశ్రవణుడను పుత్రుడు జనించెను. అతడు తపో నిరతుడై చతురాననునికూడ మెప్పించెను.

దదౌ తత్తపసా తుష్టో బ్రహ్మా తస్మై వరంశుభమ్
మన్యే ఽభిలషితం తస్య ధనేశత్వ మఖండితమ్॥

చిరకాలము వైశ్రవణు డొనరించిన మహత్తరతపమునకు సంతుష్టుడయిన బ్రహ్మ అనేకవరములనిచ్చి, అతడు కోరినధనేశత్వమును కూడ కల్పాంతము ఒసంగెను. పుష్పకవిమానము నాసమయమునసే ఇచ్చినట్లు వాల్మీకమున చెప్పబడినది. "ఏత చ్చ పుష్పకం దివ్యం విమానం సూర్యసన్నిభం, ప్రతిగృహ్ణీష్వయానార్థే త్రిదశైః సమతాం వ్రజ" అని.

తతో లబ్ధ వరః సో ఽపి పితరం ద్రష్టుమాగతః
పుష్పకేణ ధనాధ్యక్షో బ్రహ్మదత్తేన భాస్వతా॥

ఇట్లు పితామహునివలన పుష్పకవిమానమును, ధనాధ్యక్షపదవిని వరములుగాపొంది సూర్యసన్నిభమయిన విమానము నధిరోహించి తండ్రిని సందర్శించుట కేతెంచెను.

నమస్కృత్వా ధ పితరం నివేద్య తపసఃఫలమ్
ప్రాహామే భగవాఁ బ్రహ్మా దత్వావరమనిందితం॥
నివాసాయ నమే స్థానం దత్త్వాఁ పరమేశ్వరః
బ్రూహి మే నియతంస్థానం హింసా యత్ర న కస్యచిత్॥

అతడు భక్తివినమ్రతలతో తండ్రిని సమీపించి పాదాభివందనము లాచరించి తను ఆచరించిన తపస్సును, దానికి లభించిన ఫలమును నివేదించి ఇట్లు విన్నవించెను. "తండ్రీ! పితామహుడు నా అభిలాషలన్నిటిని గుర్తించి స్వయముగనే వరప్రదానమొనర్చినాడు. కాని ఆ సర్వేస్వకుడు నివాసస్థానమును మాత్రము ఒసగలేదు. కనుక నీవు ఏదైన ఉత్తమస్థానమును నిర్దేశింపుము. ఇతరులకు హింసకలుగని స్థానమును చూపించినచో నే నక్కడ నివసించెదను."

విశ్రవా అపితం ప్రాహ లంకానామపురీ శుభా
రాక్షసానాం నివాసాయ నిర్మితా విశ్వకర్మణా॥

అంతట విశ్రవసుడు నైఋతిన కిట్లు పలికెను. లంక అను సుందరమగు పట్టణమొకటి పూర్వము విశ్వకర్మ రాక్షసులకై నిర్మించినాడు.

త్యక్త్వా విష్ణుభయా ద్దైత్యా వివిశుస్తే రసాతలం
సాపురీ దుష్ప్రధర్షా ఽన్యై ర్మధ్యే సాగరమాస్థితా
తత్ర వాసా య గచ్ఛ త్వం నాన్యో సాధిష్ఠితా పురా॥

ఆనగరమున నివసించు దైత్యులందరును శ్రీమహావిష్ణువుయొక్క భయముచే దానిని త్యజించి రసాతలమునకు పారిపోయినారు. ఆనగరము సాగరమధ్యమున నున్న ద్వీపమం దుండుటచే ఇతరులకు అజేయమయినది. ఇంతవరకు ఆనగరమును ఎవరును స్వాయత్తమొనరించుకొనలేదు. కనుక నీ వానగరమును నివాసముగా చేసికొనుము.

పిత్రా దిష్టస్త్వ సౌ గత్వా తాం పురీం ధనదో ఽవిశత్
స తత్ర సుచిరం కాల మువాస పిత్రసన్మతః॥

తండ్రియగు విశ్రవసు డిట్లు సెలవిచ్చినవెంటనే ధనాధిపతియగు నైఋతియు వెంటనే ఆనగరమున ప్రవేశించి పితృభక్తితత్పరుడై చిరకాలమందు వసించెను.

లంకానగరము రాక్షసనివాసమునకై విశ్వకర్మచే నిర్మింపబడినదను విషయమును విని రాముడు విస్మితుడై పులస్త్యవంశమున జనించిన

రావణాదులకంటె వేరైనరాక్షసులు ఎవ్వరు అని ప్రశ్నించగా అగస్త్యుడు రాక్షసవృత్తాంతమును సుదీర్ఘమయినదానిని వర్ణించినట్లు వాల్మీకమున గలదు. ఆవృత్తాంతమును ఇక్కడ సంక్షేపముగ ఇచ్చెదను.

పూర్వము ప్రజాపతి జలమును సృష్టించి తద్రక్షణకై కొందరను సృష్టించెను. వారు పుట్టినతోడ క్షుత్పిపాసాపీడితులై బ్రహ్మను సమీపించి మాకర్తవ్య మేమిటని ప్రశ్నించిరి. ప్రజాపతి వారితో నీటిని రక్షించుడని పలికెను. వారిలో కొందరు క్షుత్పీడితులై జలములను భక్షించబోయిరి. కొందరు రక్షించెదమని పలికిరి. 'యక్ష' అనునది భక్షణార్థకమయిన ధాతువు. 'రక్ష' అను ధాతువు రక్షణార్థకమయిన ధాతువు. నీటిని జక్షించెదము అన్నవారికి జక్షులు లేక యక్షులు అనియు, రక్షించెద మనువారికి రక్షసు లనియు ప్రజాపతి నామకరణమొనర్చెను.

ఆ రాక్షసులకు హేతి ప్రహేతి అను సోదరులిరువురు అధిపులుగా నుండిరి. వారు మధుకైటభులవలె శత్రుసంహారకులగు వీరులు. వారిలో ప్రహేతి తపోనిష్ఠాగరిష్ఠుడై వానప్రస్థుడయ్యెను. హేతి వివాహ మాడగోరి కన్యకై ప్రయత్నించి కాలుని సోదరి భయ అనుదానిని వివాహమయ్యెను. ఆ దంపతులకు విద్యుత్కేశుడను పుత్రుడు జనించి దినదినప్రవర్ధమానుడై యువకుడుకాగా సంధ్యాదేవి పుత్రిక సాలకటంకట అను సుందరి నిచ్చి తండ్రి వివాహ మొనర్చెను. కొంతకాలమునకు సాలకటంకట విద్యుత్కేశునివలన గర్భమును ధరించి మందరపర్వతమున ఒకపుత్రుని గని వాని నక్కడనే విడిచి కామసుఖములనుభవింపగోరినదై పతిని జేరినది.

తల్లిచే విడువబడిన శిశువు మేఘనిస్వనసమానకంఠస్వరముతో నేడ్చుచుండగా ఆ మార్గమున వృషభవాహనారూఢయై పతితోగూడ బోవుచున్న పార్వతి అతనిని గాంచి కరుణార్ద్రహృదయయైై శంకరుని ప్రార్థించగా అతడు ఆబాలునికి తల్లితోసమానమయిన వయస్సును, మరణధర్మరాహిత్యమును వరములుగా నొసగి ఆకాశసంచారియగు

ఒక పట్టణము నొసగెను. పార్వతీదేవి రాక్షసులకు గర్భధారణమయిన వెంటనే శిశువు జనించి మాతృసమానవయస్కు డగునట్లుగా వరము నొసగెను.

సుకేశు డిట్లు శంకరవరప్రసాదమున ఆకాశసంచారియై వరలు చుండగా గ్రామణి యను గంధర్వుడు దేవవతియను తనపుత్రిక నిచ్చి వివాహమొనర్చెను. దేవవతీ సుకేశులు అత్యంతప్రేమతో దాంపత్య జీవనమును నిరపగా వారికి మాల్యవంతుడు, సుమాలి, మాలి యను మువ్వురువీరులు పుత్రులుగా జనించిరి. ఆపుత్రులు త్రేతాగ్నులవలెను, ఘోరమగు మంత్రత్రయమువలెను దినదిన ప్రవర్ధమానులయిరి. వారు మువ్వురుని వరప్రసాదలబ్ధ ప్రభావుడని యెరిగి తామును వరములను బడయగోరి మేరుపర్వతమునకు బోయి చిరకాలము ఘోరతపమొనర్చిరి. వారి తపమునకు మెచ్చి ప్రజాపతి ప్రసన్నుడై వరముల కోరు కొనుడనెను. వారు తాము శత్రువులకు అజేయులు మగునట్లును, చిరం జీవులగునట్లును లోకప్రభువు లగునట్లును వరముల ప్రసాదింపుమనినారు. బ్రహ్మయు అట్లే అని వెడలిపోయినాడు. అంతట మాల్యవదాదులు దేవశిల్పియగు విశ్వకర్మను తమకొక నివాసమును నిర్మించి యిమ్మని నారు. విశ్వకర్మ దక్షిణసముద్రమధ్యమున త్రికూటాచలశిఖరముపై లంకానగరమును ఇంద్రాజ్ఞచే ఇదివరకు నిర్మించితిననియు, దానిలో మీరు నివసించుడనియు పలికినాడు. వారును తమ రాక్షసభృత్యులతో గలసి లంకలో ప్రవేశించిరి.

ఆకాలమున నర్మదయను గంధర్వస్త్రీ యొకతె యుండెను. ఆమెకు సౌందర్యరాశులగు ముగ్గురు కూతులుండిరి. వారిలో పెద్దది సుందరియనుదానిని మాల్యవంతుడును, కేతుమతియను రెండవదానిని సుమాలియు, మూడవదగు వసుధయనుదానిని మాలియు పెండ్లియాడిరి. సుందరీ మాల్యవంతులకు వజ్రముష్టి, విరూపాక్షుడు, దుర్ముఖుడు, సుప్తఘ్నుడు, యజ్ఞకోపుడు, మత్తుడు, ఉన్మత్తుడు అను పుత్రులును, అనల యను కూతురును కలిగిరి.

కేతుమతీ సుమాలులకు ప్రహస్తుడు, అకంపనుడు, వికటుడు, కాలకార్ముకుడు, ధూమ్రాక్షుడు, దండుడు, సుపార్శ్వుడు, సంహ్రాది, ప్రఘసుడు, భాసకర్ణుడు అను పుత్రులును పుష్పోత్కట, కైకసి, కుంభీనసి అను పుత్రికలును కల్గిరి.

వసుధా మాలులకు అనలుడు, అనిలుడు, హరుడు, సంపాతి అను నలువురుపుత్రులు కల్గిరి. (వీరు విభీషణుని మంత్రులు.) ఇట్లు పుత్రవంతులై మాల్యవదాదులు దేవబ్రాహ్మణ దైత్యదానవాదుల నెల్లరను బాధించుచు లోకకంటకులై యుండిరి.

సుకేశ తనయులచే పీడితులయిన ఇంద్రాదిదేవతలును, మహర్షులును కైలాసమున కేగి శంకరుని ప్రార్థించి వారిని వధించి మమ్ము రక్షించుమని వేడుకొనినారు. పరమేశ్వరుడును సుకేశునందలి వాత్సల్యముచే వారిని చంపనొల్లక దేవతలతో ఇట్లనినాడు. హరి నాకు వధ్యులుగారు. అయినను మీరు విష్ణునివద్దకేగి అతనిని ప్రార్థింపుడు. అతడు రాక్షసులను పరిమార్పగలడు అని. వేల్పులు వైకుంఠమున కేగి తమ కడగండ్లనుగూర్చి మొఱబెట్టుకొనగా అతడు వారి కభయమిచ్చెను.

దేవత లిట్లు తమను వధించుటకై పన్నాగములను బన్నుచున్నారని విని మాల్యవంతుడు తన సోదరులను, ఇతర రాక్షసవీరులను ఆహ్వానించి సభచేసి వారితో ఇట్లనెను—మహావీరులారా! దేవతలు ప్రార్థింపగా శ్రీమహావిష్ణువు మనలను వధింపనిశ్చయించినాడట. విష్ణువు హిరణ్యకశిపుని వధించినవాడు. నముచి, కాలనేమి, సంహ్రాది, రాధేయుడు మొదలగు అనేక మాయావిశారదులయిన అసురవీరులను జయించినవాడు. కనుక మీరందరును ఆలోచించి మనకర్తవ్యమును నిర్ణయింపుడు—అని.

మాల్యవంతుని వాక్యములనువిని అశ్వినీదేవతలకు సాటిరాగల మాలిసుమాలులు అన్న కిట్లనిరి. మన మింతవరకు జీవితములో ఆచరించవలసిన సర్వ దానధర్మములను ఆచరించితిమి. మనకు సాటియగు వీరు డెవ్వడును లేడు. ఇంద్రుడు, విష్ణువు, దిక్పాలురు మనకొక లెక్క—

కాదు. దేవతలెవ్వారును మనయెదుట నిలువజాలరు. కనుక మనము దేవతలపై దండెత్తి వెళ్ళి వారిని సాధింతము. వారి ఆలోచనను మిగిలిన రక్కసులందరును ఆమోదించిరి. అంతట మహాబలశాలురగు దేవవిరోధులనందరను ఒకసైన్యముగా సమకూర్చి, చతురంగముల నాయత మొనరించుకొని మాల్యవదాదులు స్వర్గముపై దండువెడలిరి.

రాక్షసు లిట్లు లంకానగరమునుండి వెలువడగనే నగరదేవతలును వెడలి చనినవి. వాగి ప్రయాణకాలమున పెక్కు దుర్నిమిత్తములు కలిగినవి. అపశకునము లెన్ని కలిగినను బలగర్వితులయిన రాక్షసులు వాటిని లెక్కచేయక స్వర్గమున కేగిరి.

ఇట్లు రాక్షససేనలు స్వర్గము నాక్రమించుటకు వచ్చినవార్తను చారముఖమున విని నారాయణుడు యుద్ధమునకు సన్నద్ధుడై గరుత్మంతు నధిరోహించి వచ్చెను. విష్ణువు యుద్ధభూమిలో ప్రవేశించగనే రాక్షసు లతనిని చుట్టుముట్టి బాణవర్షమును గురిపించి అతనిని కప్పివేసిరి. అంతట నారాయణుడు శార్ఙ్గమును చేధరించి రాక్షసప్రయుక్తములగు ఆయుధజాలముల నన్నిటిని తునాతునియలుగా నొనరించెను. అంతేగాక వేలకొలది తీక్ష్ణబాణములను ప్రయోగించి రాక్షసవీరుల ననేకులను ఖండించివైచెను. తరువాత విజయోత్సాహముతో పాంచజన్యమును పూరించగా ఆ ధ్వనికి రాక్షసుల గుండెలన్నియు భయపూరితము లయినవి. ఇట్లు కొంతసేపు శార్ఙ్గబాణి ధనుర్విలాసమునుచూపగా రాక్షసులు వెరచి పారిపోసాగిరి. అంతట సుమాలి వారిని వెనుకకు మరల్చి తాను విష్ణు నెదురొక్కనెను. అతడు బాణవర్షముచే విష్ణుని కప్పివేయగా మరల రాక్షసులలో ధైర్యము నిలబడినది. అంత విష్ణువు తనపై కలియబడిన సుమాలియొక్క రథచోదకుని తీవ్రాసిధార కెరగా వించగా రథాశ్వములు తత్తరపాటుతో బండిని విష్ణుసమీపమునకు గొని వచ్చినవి.. అంతట మాలి అన్నను రక్షించువాడై తీవ్రబాణములను వెన్నుని శరీరమున నాటుచు ఎదురొక్కనెను. అంతట విష్ణువు ఘోర

యుద్ధ మొనర్చి మాలిని విరథుని గావించెను. అతడును గదతో భూమిపై కురికి దానిని గరుత్మంతునిపై విసరెను. గరుత్మంతు డాతాకు నోర్వలేక తాను పెడమొగము గలవాడై విష్ణునిగూడ పరాఙ్ముఖు నొన రించెను. పెనుదిరిగిన నారాయణుని జూచి రాక్షసులు ఉత్సాహ ధ్వనుల నొనరింపగా అతడు పెనుదిరిగి చక్రాయుధమును ప్రయోగిం చెను. అది కాలచక్రమువలె మాలిపై బడి శిరమును ఖండించెను. మాలి మృతినొందగా మాల్యవత్సుమాలులు అత్యంతము దుఃఖితులై లంకకు సైన్యములతోగూడ తిరిగినచ్చిరి. విష్ణువు దేవతలతోగూడి పరువిడుచున్న రక్కసులను తరిమి తరిమి వెనుకనుండియే వధింపసాగెను.

అంతట మాల్యవంతుడు పెనుదిరిగి యుద్ధపరాఙ్ముఖులై పరువిడు చున్నవారిని చంపరాదని ధర్మము నుపన్యసింపగా విష్ణువు నాప్రతిజ్ఞా పూర్తికై మిమ్ములను తప్పక వధించెదనని పలికెను. అంతట మాల్య వంతుడు శక్త్యాయుధము నొకదానిని విష్ణుని రొమ్మున నాటగా అతడు దానిని పెరికి తిరిగి రాక్షసరాజుపై ప్రయోగించెను. ఇట్లు కొంత కాలము రాక్షసులతో యుద్ధమొనరించిన అనంతరము చుట్టుముట్టిన రక్కసులను గరుత్మంతుడు తన రెక్కలతో విసరగా వారెల్లరు భయ పడి పాతాళమున దాగిరి.

పిత్రాదిష్టః స్త్వ సౌగత్వా తాం పురీం ధనదో ఽవిశత్
స త్రత సు చిరం కాలమువాస పిత్రుసమ్మతః ॥

తండ్రి లంకానగరమున నుండుమని ఆదేశించగనే ధనపతియగు వైశ్రవణుడు వెంటనే ఆనగరమున ప్రవేశమొనరించి చిరకాలము పిత్రు సమ్మతుడై నివసించెను.

కస్య చి త్వథకాలస్య సుమాలీనామరాక్షసః
రసాతలా న్మర్త్యలోకం చచార పిశితాశనః ॥

కొంతకాల మిట్లు గడచిన అనంతరము విష్ణుభయముచే రసా తలమున దాగిన రాక్షసులలో సుమాలి యనువాడు మర్త్యలోకమున సంచరించు కుతూహలముతో వెలికివచ్చెను.

గృహీత్వా తనయాం కన్యాం సాక్షాదేవీ మివశ్రియమ్
అపశ్యద్ధనదం దేవం చ రత్నం పుష్పకేణ సః॥

ఆసమయమున అతనితో అతనిపుత్రి సాక్షాల్లక్ష్మీదేవిని బోలి నదిగ ఉన్నది. అతడు భూలోకమునకు వచ్చినవెంటనే పుష్పకా రూఢుడై ఆకాశమున సంచరించు ధనదుడు కన్పించినాడు.

హి తాయ చింతయా మాస రాక్షసానాం మహామనాః
ఉవాచ తనయాం తత్ర కైకసీం నామ నామతః॥

మహామనస్కుడయిన సుమాలి పుష్పకసంచారియగు ధనదుని చూడగనే తన పూర్వవైభవము స్మృతికి వచ్చినది. రాక్షసుల నివాస మగు లంక వైశ్రవణుని వశమునకు వచ్చినది. రాక్షసులు నిర్వాసిత జీవితమును గడపుచున్నారు. ఏవిధముగానైనను సరే తనకులమువారిని పూర్వపుజానత్యసునకు తేవలెను అను భావము అతనికి కలిగినది. కొంతసేపు ఆలోచించిన అనంతరము అతడు కైకషి (కైకసి) అను పేరుతో విరాజిల్లుచున్న తన పుత్రికతో ఇట్లనెను.

ఏతే వివాహకాలస్తే యౌవనం చాతివర్తతే
ప్రత్యాఖ్యా నాచ్చ భీతేస్త్వం నవైర్గర్హ్యాసి శుభే॥

అమ్మా! నీ విదివరకు అనేక రాక్షసరాజపుత్రులను తిరస్కరిం చుటచే ఎవ్వరును నిన్ను వరించుటకు ముందుకు రాలేకపోవుచున్నారు. ఆకారణమున నీ వివాహయోగ్యమగు వయస్సేగాక యౌవనమును గడచిపోవుచున్నది.

సాత్వం వరయభద్రంతే మునిం బ్రహ్మకులోద్భవం
స్వయమేవ తతఃపుత్రా భవిష్యన్తి మహాబలాః
ఈదృశాః సర్వశోభాఢ్యా ధనదేన సమాఃశుభే॥

ఆ రాక్షసకుమారులను వరించకపోవుటయు మంచిదే అయినది. ఇప్పుడు నీవు సృష్టికర్తయగు చతురాననుని వంశమం దుద్భవించిన ఈ విశ్రవసు మహామునిని వరించుము. అట్లయినచో నీకు ఇప్పుడు మనము

వినూనములో చూచిన వైశ్రవణుని వంటి మహాబలశాలుకు సమస్త శోభాసంపన్నులు అగు పుత్రులు జనించిగలరు.

తథేతి సాశ్రమం గత్వా మునే రగ్రే వ్యవస్థితా
లిఖన్తీ భువమగ్రేణ పాదేనాధో ముఖీ స్థితా॥

తండ్రి ఆజ్ఞకు వశవర్తినియై నైకషి అక్లో అని పౌలస్త్యుని ఆశ్రమమునకు వెళ్ళి లజ్జావనతముఖియై, పాదాంగుష్ఠాగ్రముతో నేలను వ్రాయుచు అతని ఎదుట నిలబడినది.

తామ పృచ్ఛన్మునిః కా త్వం కస్యాసి వరవర్ణిని
సాఽబ్రవీత్ ప్రాంజలి ర్బ్రహ్మ ధ్యానేన జ్ఞాతమర్హసి॥

ఎదుట నిలబడిన రాక్షసరాజపుత్రిని జూచి విశ్రవసుడు నీ వెవ్వరవని ప్రశ్నించెను. ఆమె తన వృత్తాంతమును లజ్జచే చెప్పజాలక "బ్రహ్మ! దివ్యదృష్టితో నా మనోభావము నవగతమొసర్చుకొను" మని విన్నవించెను.

వాల్మీకమున నైకషి తన పేరును, తండ్రిపంపున వచ్చినట్లును విన్నవించి తరువాత దివ్యదృష్టిచే తెలుసుకొనుమని చెప్పినట్లున్నది. "ఏవముక్తా తు సాకన్యా కృతాంజలి రథాబ్రవీత్ రాక్షసీం విద్ధిమాం బ్రహ్మ శాసనాత్ పితురాగతా, నైకసీ మితి నామ్నాహై శేషం త్వం జ్ఞాతు మర్హసి, తపః ప్రభావేణ మునే యదర్థ మహమాగతా" అని.

తతో ధ్యాత్వా మునిః సర్వంజ్ఞాత్వో తాం ప్రత్యభాషత
జ్ఞాతం తవాభిలషితం మత్తః పుత్రా నభీప్ససి॥

అంతట ముని ధ్యానగతుడై ఆమె హృద్గతభావముల నవగాహన మొనర్చుకొని నీ భావము నాకు తెలిసినది. నావలన పుత్రుల నభిలషించుచున్నావు.

దారుణాయాం తు వేలాయ మాగతాసి సు మధ్యమే
అతస్తే దారుణౌ పుత్రౌ రాక్షసౌ సంభవిష్యతః॥

కాని నీవు దారుణమగు సమయమున నన్ను పుత్రుల నిమ్మని అభ్యర్థించితివి. కాన నీకు దారుణచరిత్రులగు పుత్రులిద్దరు రాక్షసగుణ సంపన్నులు ఉద్భవించగలరు.

పౌలస్త్యుడు సంధ్యాకాలమున అగ్నిహోత్ర మొనర్చుకొనుచుండగా నైకషి అతనిని పుత్రార్థినియై అభ్యర్థించినది. కనుకనే దారుణమగు వేళలో వచ్చితివని ఋషి యనినాడు.

సాబ్రవీన్మని శార్దూల త్వత్తో ఽప్యేవం విధౌ సుతౌ
తామాహ పశ్చిమాయస్తే భవిష్యతి మహామతిః
మహాభాగవతః శ్రీమాఀ రామభ క్తైక తత్పరః ॥

"బ్రహ్మర్షీ ! నీనంటి మహానుభావుని వరించినను నాకు ఇట్టి క్రూరులే పుత్రులుగా ఉదయించిరా !" అని నైకషి దీనముగా పలికినది. అంతట ఋషి కరుణించి ఇట్లు పలికెను. "మొదటకలిగిన ఇద్దరు పుత్రులు దారుణాచారసంపన్నులగుదురు. వారి తరువాత జనించిన వాడు మహామతిమంతుడును, భాగవతశిఖామణియును, భక్తిశ్రీసంపన్నుడును, రామభక్తితత్పరుడును కాగలడు.

ఇత్యుక్తా సా తథా కాలే సుషువే దశకంధరం
రావణం వింశతి భుజం దశశీర్షం సు దారుణం ॥

ఇట్లు మహర్షి పలికిన అనంతరము ఆమె దశకంధరుని పుత్రునిగా బడసినది. అతడు దారుణములగు ఇరువది భుజములును, పది శీర్షములును కలిగి లోకవిద్రావణుడుగా పేరొందినాడు.

తద్రక్షో జాతమాత్రేణ చ చాలచ వసుంధరా
బభూవు ర్నాశహేతూని నిమిత్తా న్యఖిలాన్యపి ॥

ఆ రాక్షసుడు జనించిన మాత్రమునచే వసుంధర కంపించినది. అంతేగాక అనేక నాశనసూచకములగు శకునములు సంభవించినవి.

కుంభకర్ణ స్తతో జాతో మహాపర్వత సన్నిభః
తతః శూర్పణఖా నామజాతా రావణ సోదరా॥

రావణుడు జనించిన అనంతరము శాంతహృదయుడు, సౌమ్య దర్శనుడు, నిత్య వేదాధ్యయన తత్పరుడు, యుక్తాహారవిహారనియమమును పాటించువాడు, ధర్మపరాయణుడు అగు విభీషణుడు జనించినాడు.

కుంభకర్ణ స్తు దుష్టాత్మా ద్విజా౯ సంతుష్టచేతసః
భక్షయ న్మృషిసంఘాం శ్చ విచచారాతి దారుణః ॥

వారిలో దుష్టహృదయుడగు కుంభకర్ణుడు బ్రాహ్మణులను, ఋషి సంఘములను భక్షించుచు సంతుష్టహృదయుడై అతిదారుణముగ సంచరింపసాగెను.

రావణోఽపి మహాసత్త్వో లోకానాం భయదాయకః
ప వృధే లోకనాశాయ హ్యోమయో దేహినామివ ॥

మహాశక్తి సంపన్నుడగు రావణుడును సర్వలోకభయంకరుడై శరీరధారులను రోగములు నశింపజేయునట్లు లోకనాశనమునకై ప్రవృద్ధుడయ్యెను.

రామ త్వం సకలాంతరస్థ మభితో జానాసి విజ్ఞానదృక్
సాక్షీ సర్వహృదిస్థితో హి పరమో నిత్యోదితో నిర్మలః
త్వం లీలా మనుజాకృతిః సుమహిమా మాయాగుణైర్నాజ్యసే
లీలార్థం పరిచోదితో ఽద్య భవతావక్ష్యామి రక్షో ద్భవమ్ ॥

రామా ! నీవు అంతటను బాహ్యాభ్యంతరభేదము లేక నిండియున్నవాడవు. విజ్ఞాననేత్రుడవు. సర్వజగత్సాక్షిమాత్రుడవు. సర్వలోకహృదయములందు నివసించువాడవు. పరాత్పరుడవు. నిత్యాభ్యుదయసంపన్నుడవు. నిర్మలుడవు. అట్టి పరాత్పరుడవగు నీవు లోకసంరక్షణార్థమై మానుషరూపమున ఉద్భవించినావు. కనుక నిన్ను మాయాగుణములయిన సత్త్వరజస్తమస్సులు అంటవు. నీకు ఈ రావణాదుల వృత్తాంతము తెలియనిదికాదు. కాని తెలియనివానివలెనన్నావృత్తాంతమును చెప్పుమని ఆదేశించినావు. నీచే ఆదేశించబడి నేను చెప్పుచున్నాను.

జానామి కేవల మనంత మచింత్య శక్తిం
చిన్మాత్ర మక్షరమజం విదితాత్మ తత్వం
త్వాం రామ గూఢ నిజరూప మనుప్రవృత్తో
గూఢోహ్య హం భవదనుగ్రహ త శ్చరామి॥

రామా ! నీవు అంతమనునది లేనివాడవు. ఇంత అని ఊహింప నలవిగాని శక్తిగలవాడవు. చైతన్యస్వరూపుడవు. నాశన రహితుడవు. పుట్టుక అనునది లేనివాడవు. జీవునివలె విస్మృతిలోబడక స్వస్వరూప మును తెలుసుకొన్నవాడవు. ఈ సంసారులకు తెలియకుండా నీస్వరూపమును గూఢముగా ఉంచుకొనినవాడవు. ఈ విషయము లన్నియు నాకు నీ అనుగ్రహవిశేషమున అవగతము లయినవి. నీ అనుగ్రహము ననే జ్ఞానవంతుడుగా భూమిపై సంచరించుచున్నాను.

ఏవం వదంత మినవంశ పవిత్రకీర్తిం
కుంభోద్భవం రఘుపతిం ప్రహసన్ బభాషే
మాయాశ్రితం సకల మేత దనన్య కర్త్వాత్
మత్కీర్తనం జగతి పాపహరం నిబోధ॥

ఇట్లు ప్రశంసించుచున్న కుంభసంభవమహర్షిని జూచి సూర్య వంశమునకు స్థిరమగు యశస్సును సమకూర్చిన శ్రీరామచంద్రు డిట్లు పలికెను– "మాయ నాశ్రయించి నే నొనర్చిన వనవాసాదికృత్యముల నన్నిటిని అనన్యభావముతో కీర్తించినచో అది జగత్కల్మషమును పరిహరించునని అవగత మొనర్చుకొనెను.

✶

ద్వితీయ సర్గ

శ్రీ మహాదేవ ఉవాచ :—

శ్రీరామవచనం శ్రుత్వా పరమానందనిర్భరః
మునిః ప్రోవాచ సదసి సర్వేషాం తత్ర శృణ్వతాం ॥

శ్రీరాముడు తన కథలను కీర్తించుట సర్వపాపహారకారకమగు నని వాక్రుచ్చిన అనంతరము అగస్త్యమహర్షి బ్రహ్మానందసదృశమగు ఆనందము ననుభవించుచు సభాసదులందరును వినుచుండగా రావణాదుల వృత్తాంతమును వర్ణించ నారంభించెను.

అథ విత్తేశ్వరో దేవస్తత్ర కాలేన కేనచిత్
ఆయయౌ పుష్పకారూఢః పితరం ద్రష్టుమంజసా ॥

రావణకుంభకర్ణులు వృద్ధినొందుచు, లోకములను పీడించుచుండగా కొంతకాలము గడచినది. ఒకనాడు ధనాధిపతియగు వైశ్రవణుడు పుష్పకారూఢుడై తేజఃపుంజముచే వెల్గొందుచు తండ్రిని దర్శించుటకు వచ్చెను.

దృష్ట్వా తం నైకషీ తత్ర భ్రాజమానం మహౌజసం
రాక్షసీ పుత్రసామీప్యం గత్వా రావణ మబ్రవీత్ ॥

తండ్రిసమీపమున ఉపవిష్టుడై తపోతేజముచే వెల్గొందుచున్న ధనపతిని జూచి నైకషి పుత్రులవద్దకు నెళ్ళి, వారిలో పెద్దయయిన రావణునితో నిట్లనెను.

పుత్ర పశ్య ధనాధ్యక్షం జ్వలంతం స్వేన తేజసా
త్వ మప్యేవం యథా భూయా స్తథా యత్నం కురు ప్రభో ॥

వత్సా ! నీతండ్రివద్ద స్వీయమగు దివ్యతేజముచే వెల్గొందుచున్న ధనాధిపతిని జూడుము. నీవును అతనితో సమానమయిన తేజోశాలివై వెల్గొందుటకు తగిన ప్రయత్నముల నొనర్పుము.

ఇక్కడ నైకషి తనపుత్రుని తేజశ్శాలిగా నొనరించుటకే గాక రాక్షసకులము నుద్ధరించు నుద్దేశముతో వైశ్రవణునకు ప్రతిద్వందిగా

పుత్రుని ప్రోత్సహించుచున్నట్లే కన్పించుచున్నది. వాల్మీకి రామాయణమున ఆమె రాక్షసబుద్ధి నాశ్రయించియే పుత్రునితో మాట్లాడినట్లు పేర్కొనబడినది. "త్వం దృష్ట్వా నైకసీ తత్ర జ్వలంత మివ తేజసా ఆగమ్య రాక్షసీం బుద్ధిం దశగ్రీవ మువా చహ" అని.

తచ్ఛ్రు త్వా రావణో రోషాత్ ప్రతిజ్ఞా మకరోద్ధృతమ్
ధనదేవ సమో వాఽపి హ్యధికో వాఽచి రేణ తు
భవిష్యామ్యంబ మాం పశ్య సంతాపంత్యజ సువ్రతే॥

మాతృవచనములను వినినవెంటనే రావణుడు అభిమానపూరిత హృదయుడై తల్లియెదుట ఇట్లు ప్రతిజ్ఞ నొనరించెను. నేను అచిరకాలములో ధనదునితో సమానుడనుగాని లేదా అతనికంటె అధికుడనుగాని కాగలను. నీవు సంతాపమును త్యజించుము.

ఇత్యుక్త్వా దుష్కరం కర్తుం తపః స దశకంధరః
ఆగమ త్ఫలసిద్ధ్యర్థం గోకర్ణం తు సహానుజః॥

రావణు డిట్లు తల్లియెదుట ప్రతిజ్ఞనొనరించి దశకంఠుడు అనన్య దుష్కరమగు ఘోరతపము నాచరించు ఉద్దేశ్యముతో సోదరులగు కుంభకర్ణ విభీషణులను వెంటబెట్టుకొని ఫలదాయకము, శివక్షేత్రము అగు గోకర్ణక్షేత్రమును జేరెను.

స్వం స్వం నియమ మాస్థాయ భ్రాతరస్తే తపోమహత్
ఆస్థితా దుష్కరం ఘోరం సర్వలోకైక తాపనం॥

వారు మువ్వురును వారివారి ప్రవృత్తుల ననుసరించి రాజస తామస సాత్త్విక నియమముల నాశ్రయించి మహత్తరమగు తపముల నొనరించిరి. (రజోగుణప్రధానుడగు రావణుడు రాజసనియమములను, తమోగుణప్రధానుడగు కుంభకర్ణుడు తామసప్రధాననియమములను, సత్త్వప్రవృత్తిగల విభీషణుడు సాత్త్వికనియమములను ఆశ్రయించి తపస్సు నొనరించిరని తెలియవలెను.) వారొనరించిన ఈ మహత్తర తపము సర్వలోకములకు తాపకారకమయినదట.

దశవర్ష సహస్రాణి కుంభకర్ణో ఒకకోత్తపః
విభీషణో ఒపి ధర్మాత్మా సత్యధర్మపరాయణః
పంచవర్ష సహస్రాణి పాదే నైకేన తస్థివాన్॥

కుంభకర్ణుడు పదివేలసంవత్సరములు ఘోరమగు తపము నాచరించెను. (అతడు గ్రీష్మకాలమున పంచాగ్ని మధ్యమునను, వర్షాకాలమున వర్ష మధ్యమునను, శీతకాలమున జలమధ్యమునను వీరాసనము నైచుకొని తపస్సు నొనరించెనని వాల్మీకము.) ధర్మస్వభావుడగు విభీషణుడు సత్యధర్మములను విడనాడక ఏకపాదమునై నిలబడి ఐదువేల సంవత్సరములు తపస్సు నొనరించెను. (ఇట్లు అయిదువేలసంవత్సరములు తపస్సు నొనరించి, అనంతరము సూర్యగతి ననుసరించుచు స్వాధ్యాయతత్పరుడై మరి అయిదువేల సంవత్సరములు తపస్సు నొనరించినట్లు వాల్మీకమున వర్ణితమయినది.)

దివ్యం వర్ష సహస్రంతు నిరాహారో దశాననః
పూర్ణే వర్ష సహస్రేతు శీర్ష మగ్నౌ జు హావసః॥
ఏవం వర్ష సహస్రాణి నవతస్యాతి చ క్రమః॥

రావణుడును నిరాహారుడును, నియతేంద్రియుడునునై ఒక్క దివ్యవర్ష సహస్రము తపశ్చర్య నొనరించెడివాడు. అది పూర్తికాగానే ఒకశిరమును ఖండించి అగ్నిలో ప్రవేల్చెడివాడు. ఇట్లు తొమ్మిదివర్ష సహస్రములు తొమ్మిది శిరస్సులను అగ్నిలో హోమమొనర్చెను.

అథ పర్ష సహస్రేతు దశమే దశమం శిరః
ఛేత్తు కామస్య ధర్మాత్మా ప్రాప్త శ్చాథ ప్రజాపతిః॥

తరువాత పదవ దివ్యవర్ష సహస్రమును గడువగా రావణుడు పదవశిరస్సునుకూడ ఛేదించుకొనుటకు ఉద్యుక్తుడు కాగా ప్రజాపతి అతనియెడ ప్రసన్నుడయ్యెను.

వత్స వత్స దశగ్రీవ ప్రీతో ఒస్మి త్యభ్యభాషత
వరం వరయ దాస్యామి యత్తే మనసి కాంక్షితం॥

"వత్సా ! వత్సా ! ఆగుమాగుము. దశగ్రీవ ! నీ తపస్సునకు మెచ్చితిని. నీకు అభీష్టమగు వరమును కోరుకొనుము. నీ మనోభిలాషమును నెరవేర్చెదను." అని బ్రహ్మ రావణుని శిరమును ఖండించుకొనకుండ వారించెను.

దశగ్రీవో ఒపి తచ్ఛ్రుత్వా ప్రహృష్టేనాంతరాత్మనా
అమరత్వం వృణో మిూశ వరదో యది మే భవాన్॥

దశగ్రీవుడు ప్రజాపతి వచనముల నాలించి ప్రహృష్టాంతరంగుడై ఇట్లు పలికెను. "మహాత్మా ! నీవు వరప్రదాతవై వచ్చినాడవు. కాన నేను అమరత్వమును వరించుచున్నాను.

సుపర్ణనాగయక్షాణాం దేవతానాం తథాఽసురైః
అవధ్యత్వం తు మే దేహి తృణభూతా హి మానుషాః॥

గరుడులు, నాగులు, యక్షులు, దేవతలు, అసురులు మొదలగు జాతులవారిచే మరణము లేకుండ నాకు వరము నొసగుము. ఇక మానవులు అల్పజీవులు గాన వారిని ఖాతరు చేయను. వారు నాకు గడ్డిపోచలవంటివారు.

దశగ్రీవుడు మొదట "సర్వప్రాణులకు మృత్యువులనే భయము కలుగును గాన నాకును అమరత్వమును ప్రసాదించు" మని అడిగినట్లును బ్రహ్మ సర్వప్రాణులకు అమరత్వము కలుగదు, మరియొక్క వరమును వరించుమనగా దేవాదులచే అవధ్యత్వమునుకోరి, మానుషాములను సరకుగాసక తృణీకరించినట్లు వాల్మీకిమున వర్ణింపబడినది.

తథా ఒస్త్వితి ప్రజాధ్యక్షః పున రాహ దశాననమ్
అగ్నౌ హుతాని శీర్షాణి యాని తే ఒసురసత్తమ
భవిష్యంతి యథాపూర్వ మక్షరాణి చ సత్తమ!

రావణుడు కోరిన కోరికలకు తథాస్తు అని పలికి ప్రజాపతి "రావణా ! నీ విదివరకు అగ్నిలో హోమమొనరించిన తొమ్మిదిశిరములును తిరిగి యథాపూర్వముగా శోభించగలవు" అని వరము నొసగెను.

ఏవ ముక్త్వా తతో రామ దశగ్రీవం ప్రజాపతిః
విభీషణ మువా చేదం ప్రణతం భక్తవత్సలః॥

రామా ! బ్రహ్మ ఇట్లు దశకంఠునకు వరములను ప్రసాదించి విభీషణుని సమీపించి, అతడు ప్రణతుడుకాగా వాత్సల్యముతో నిట్లు పలికెను.

విభీషణ త్వయా వత్స కృతం ధర్మార్ష ముత్తమమ్
తప స్తతో వరం వత్స వృణీ ష్వాభిమతం స్థితమ్॥

వత్సా ! విభీషణా ! నీవు ధర్మభావముతో ఉత్తమమయిన తపస్సు నొనరించినావు. దానికి ఫలము ననుభవించు సమయము వచ్చినది. నీమనస్సులో ఉన్న అభిలాషను వరముగా కోరుకొనుము.

విభీషణో ఽపి తం నత్వా ప్రాంజలి ర్వాక్య మబ్రవీత్
దేవ మే సర్వదా బుద్ధి ర్ధర్మే తిష్ఠతు శాశ్వతీ
మా రోచయ త్వధర్మే మే బుద్ధి సర్వత్ర సర్వదా॥

పితామహుని వాత్సల్యపూరితవచనములను విని విభీషణుడు ప్రణమిల్లి అంజలి ఘటించి ఇట్లు పలికెను. దేవా ! నాబుద్ధి ఎల్లవేళలందును శాశ్వతమగు ధర్మమునందే లగ్నమయి యుండుగాక ! అధర్మమందు అభిరుచి ఏర్పడకుండుగాక ! ఇదే నాకోరిక.

తతః ప్రజాపతిః ప్రీతో విభీషణ మథా బ్రవీత్
వత్స త్వం ధర్మశీలో ఽసి తథైవ చ భవిష్యసి
అయాచితో ఽపి తే దాస్యే హ్యామరత్వం విభీషణ॥

విభీషణుని ఈధర్మనిష్ఠకు సంతసించి ప్రజాపతి అతని కిట్లనెను. "వత్సా ! నీవు ఇంతవరకు ధార్మికస్వభావము కలిగియున్నావు. ఇక భవిష్యత్తులోగూడ ఇట్లే వర్ధిల్లుదువుగాక ! నీవు కోరకపోయినను అమరత్వమును ప్రసాదించుచున్నాను.

కుంభకర్ణ మథోవాచ వరం వరయ సువ్రత
వాణ్యా వ్యాప్తో ఽథ తం ప్రాహ కుంభకర్ణః పితామహం

స్వప్స్యామి దేవ షణ్మాసాన్ దిన మేకం తు భోజనమ్॥

విభీషణునకు వరములనొసగిన అనంతరము ప్రజాపతి కుంభకర్ణుని సమీపించి సువ్రతా ! అభీష్టవరముల కోరుమని పలికినాడు. ఆసమయమున కుంభకర్ణుని దారుణములగు కోరికలను కప్పిపుచ్చుటకై దేవ ప్రార్థితురాలయిన సరస్వతీదేవి అతని ముఖమున ప్రవేశించినది. తత్ర, భావవ్యాప్తుడయిన అతడు "దేవా ! నాకు ఆరుమాసముల నిద్రను ఒకరోజు భోజనమును ప్రసాదింపు" మని కోరెను.

ఏవ మస్త్వితి తం ప్రాహ బ్రహ్మా దృష్ట్వా దివౌకసః
సరస్వతీ చ తద్వక్త్రా న్నిర్గతా ప్రయయౌ దివమ్॥

బ్రహ్మ వెంటనే అట్లే అగుగాక అని పలికి తనలోకమున కేగెను. దేవతలును ఈవృత్తాంతమును చూచి సంతోషము ననుభవించిరి. సరస్వతికూడ తరువాత కుంభకర్ణవక్త్రమునుండి వెలువడి స్వస్థానమును జేరినది.

కుంభకర్ణ స్తు దుష్టాత్మా చింతయామాస దుఃఖితః
అనభిప్రేత మే వాస్యాత్ కిం నిర్గతమహో విధిః॥

తరువాత కుంభకర్ణునకు తనకు లభించిన వరమునుగూర్చి ఎంతో దుఃఖము కలిగినది. నే ననుకొనకుండగనే విధివశమున ఇట్టి వచనములు నాముఖమునుండి వెలువడినవిగదా అని దుఃఖించెను.

సుమాలీ వరలబ్ధాం స్తా జ్ఞాత్వా పౌత్రా న్నిశాచరాన్
పాతాలా న్నిర్భయాః ప్రాయాత్ ప్రహస్తాదిభి రన్వితః
దశగ్రీవం పరిష్వజ్య వచనంచేద మబ్రవీత్॥

అంతట సుమాలి తన దౌహిత్రులు లబ్ధవరులై పెంపొందియుండుటను విని భయంరహితచిత్తవృత్తిగలవాడై పాతాళమునుండి వెలువడి వచ్చెను. అతని వెంటనే మాల్యవదాదులును, ప్రహస్తాదులునుగూడ వచ్చిరి. సుమాలి మనుమడగు రావణుని పరిష్వంగమొసర్చి ఇట్లు పాక్కుచ్చెను.

దిష్ట్యా తే పుత్రసంవృత్తో వాంఛితో మే మనోరథః
యద్భయా చ్చ వయం లంకాం త్యక్త్వా యాతా రసాతలం
తద్గతం నో మహాబాహో మహా ద్విష్టుకృతం భయం ॥

పుత్రా ! దైవవశమున ఇంతకాలమునకు మా మనోరథ మీడేరినది. ఏ విష్ణువువలని భయముచే మేము లంకానగరమును వదలి రసాతలమున దాగితిమో ఆభయము మా కీనాడు తొలగిపోయినది.

అస్మాభిః పూర్వముషితా లంకేయం ధనదేన తే
భ్రాత్రా క్రాంతా మిదానీం త్వం ప్రత్యానేతు మిహార్హసి
సామ్నా వాథ బలేనాపి రాజ్ఞాం బన్ధుః కుతః సుహృత్ ॥

ఇప్పుడు నీ సోదరుడయిన ధనదుడు ఆక్రమించిన లంకానగరము పూర్వము మనరాక్షసుల నివాసస్థానము. కనుక నీవు దానిని తిరిగి రాక్షసుల అధికారములోనికి తెచ్చుట యుక్తము. వైశ్రవణుడు నీ సోదరుడని సౌహార్దమును కన్పరచెదవేమో ! రాజులకు సోదరులు, మిత్రులు అను పక్షపాతముండదు. కాన సామోపాయముచే నయినను సరే, బలప్రయోగమునన్నైనను సరే లంకను వశపరచుకొనవలయును.

ఇత్యుక్తో రావణః ప్రాహ నార్హా స్యేనం ప్రభాషితుం
విత్తేశో గురు రస్మాక మేవం శ్రుత్వా త మబ్రవీత్
ప్రహస్తః ప్రశ్రితం వాక్యం రావణం దశకంధరం ॥

సుమాలి ఇట్లు లంకానగరమును వశపరచుకొనుమని బోధింపగా రావణుడు "విత్తేశుడు మాకు అన్నగారగుటచే తండ్రివంటివాడు. కాన ఇట్లు మాట్లాడుట తగదు" అనెను. దానికి ప్రహస్తుడు అతని మరి కెక్కువనట్లు ఇట్లు పలికెను.

శృణు రావణ యత్నేన వైవం త్వం వక్తు మర్హసి
నాధీతా రాజధర్మాస్తే నీతిశాస్త్రం తథైవ చ
సుజ్ఞాణం న హీ సౌభ్రాత్రం శృణు మే వదతః ప్రభో ॥

రావణా ! నేను చెప్పు విషయములను సావధానుడవై వినుము. నీవు రాజధర్మములను, రాజనీతిశాస్త్రమును అధ్యయనముచేసినవాడవు

కాన్ను. కనుకనే ధనదునియండలి సౌభ్రాతృత్వము జాగ్రతమగుచున్నది, వాస్తవమునకు దేవతలకును, రాక్షసులకును సౌభ్రాతృత్వమనునది లేదు.

కస్యపస్య సుతా దేవా రాక్షసా శ్చ మహాబలాః
పరస్పర మయుధ్యన్త త్యక్త్వా సౌహృద మాయుధైః
సై వేదానీతనం రాజన్ వైరం దేవై రనుష్ఠితమ ॥

దేవతలు–రాక్షసులు వీరిద్దరును కస్యపమహర్షియొక్క సంతానము. ఇద్దరు మహాబలురే. వారు ఆయుధధారులై పరస్పర భ్రాతృభావమును వదలి ఘోరముగా యుద్ధముల నొనర్చినారు. కాన దేవాసురుల శత్రుత్వము ఈనాటిదిగాదు. చిరకాలమునుండి సాగుచున్నదే.

ప్రహస్తస్య వచః శ్రుత్వా దశగ్రీవో దురాత్మనః
త ధేతి క్రోధతామ్రాక్షః త్రికూటాచల మన్వగాత్ ॥

ప్రహస్తు డిట్లు వైరభావమును బోధించగా వినిన దశకంఠుడు క్రోధారుణితలోచనుడై త్రికూటపర్వతమునకు వెళ్ళెను.

దూతం ప్రహస్తం సంప్రేష్య నిష్క్రాశ్యధనదేశ్వరమ్
లంకా మాక్రమ్య సచివై రాక్షసై సుఖమాస్థితః ॥

ప్రహస్తుని దూతగా ధనదునివద్దకు పంపి, అతనిని లంకనుండి వెడలగొట్టి తాను దాని నాక్రమించి ప్రహస్తాదులను మంత్రులనుగా నియమించుకొని రాక్షససంఘములతోగూడ సుఖముగానుండెను.

ధనదః పిత్రవాక్యేన త్యక్త్వా లంకాం మహాయశాః
గత్వా కైలాసశిఖరం తపసా ఽతోషయ చ్ఛివమ్ ॥

వైశ్రవణుడును లంకానగరమును త్యజించి తండ్రివద్దకువచ్చి విషయమును నివేదించెను. తదుపరి అతని అనుజ్ఞను తీసికొని కైలాస పర్వతమునకు పోయి ఘోరమగు తపస్సుచే శివుని సంతోషపెట్టెను.

తేన సంఖ్య మనుప్రాప్య తేనైవ పరిపాలితః
అలకాం నగరీం తత్ర నిర్మమే విశ్వకర్మణా

దిక్పాలత్వం చకా రాత్ర శివేన పరిపాలితః ॥

తపః సంతుష్టుడయిన శివుడు దర్శనమిచ్చి అతనితో మైత్రినొనరించెను. శివుడు అతనికి సర్వదా రక్షకుడయ్యెను. తరువాత విశ్వకర్మను రావించి అలకయను నగరమును నిర్మించెను. శివసురక్షితుడయిన కుబేరునకు బ్రహ్మాదిక్పాలకత్వమును ప్రసాదించి సంభావించెను.

రావణో రాక్షసైః సార్ధ మభిషిక్తః సహానుజైః
రాజ్యం చకా రాసురాణాం త్రిలోకీం బాధయన్ ఖలః ॥

రావణుడట్లు కుబేరుని లంకానగరమునుండి వెడలనడిచి అనుజులతోడను, ప్రహస్తాది రాక్షసులతోడను నగరప్రవేశ మొనరించి రాక్షసరాజ్యమునకు అభిషిక్తుడయ్యెను. తరువాత వరగర్వితుడై త్రిలోకములను బాధించుచు అధర్మమార్గ సంచారియై రాజ్యమును పరిపాలించసాగెను.

భగినీం కాలకేయాయ దదౌ వికటరూపిణీం
విద్యుజ్జిహ్వాయ నామా ఽఽసౌ మహామాయీ నిశాచరః॥

రాజ్యాభిషిక్తుడయిన అనంతరము రావణుడు వికటమగు రాక్షస రూపముగల సోదరి శూర్పణఖను కాలకేయ దైత్యవర్గమునకు చెందిన విద్యుజ్జిహ్వుడనువాని కిచ్చి వివాహ మొనరించెను. ఆ విద్యుజ్జిహ్వుడు సమస్త రాక్షసమాయలను ఆమూలాగ్ర మెరిగిన నిశాచరుడు.

తతో మయో విశ్వకర్మా రాక్షసానాం దితేః సుతః
సుతాం మందోదరీం నామ్నా దదౌ లోకైకసుందరీం
రావణాయ పునఃశక్తి మమోఘాం ప్రీతమానసః ॥

అనంతరం రాక్షసకులమునకు విశ్వకర్మవంటివాడును, దితియొక్క పుత్రుడును అగు మయుడు లోకైకసుందరియగు మందోదరియను పుత్రికను భార్యగా సమర్పించెను. అంతేగాక అమోఘమగు ఒక శక్త్యాయుధమునుకూడ నిర్మించి యొసగెను.

మందోదరి మయునికి హేమ అను అప్సరసయందు జనించినట్లు వాల్మీకమున వర్ణితము.

సుకోచనస్య దౌహిత్రీం విద్యుజ్జ్వాలేతి విశ్రుతామ్
స్వయం దత్తా ముదావహత్ కుంభకర్ణాయ రావణః ॥

విరోచనపుత్రుడు బలి. అతని మనుమరాలగు విద్యుజ్జ్వాల అను నామెను ఆమెతండ్రి స్వయముగా సమర్పింపగా రావణు డామెను కుంభకర్ణున కిచ్చి వివాహ మొనరించెను.

గంధరాజస్య సుతాం శైలూషస్య మహాత్మనః
విభీషణస్య భార్యార్థే ధర్మజ్ఞాం సముదావహత్
సరమాం నామ సుభగాం సర్వలక్షణసంయుతాం॥

శైలూషుడు అను గంధర్వరాజుయొక్క పుత్రికను సరమ అను దానిని తెచ్చి రావణుడు విభీషణునకు భార్యగా జేసెను. ఆ సరమ సుందరియేగాక ధర్మపరురాలుకూడాను.

తతో మందోదరీ పుత్రం మేఘనాద మజీజనత్
జాతమాత్ర స్తు యో నాదం మేఘవ త్ప్రసుమోచ హ
తతః సర్వో ఽబ్రువ న్మేఘనాదో ఽయ మితి చాసకృత్ ॥

ఇట్లు అన్నదమ్ములందరు వివాహమాడిన కొంతకాలమునకు రావణపత్నియగు మండోదరి ఒకపుత్రుని కనెను. ఆపుత్రుడు పుట్టిన తోడనే మేఘమువలె గర్జించసాగెను. దానిని విని అందరును అతనిని మేఘనాదుడు, మేఘనాదుడు అనిరి. కొంతకాలమున కానామమే స్థిరమయ్యెను.

కుంభకర్ణ స్తతః ప్రాహ నిద్రా మాం బాధతే ప్రభో
తత శ్చ కారయామాస గుహాం దీర్ఘాం సువిస్తరాం
తత్ర సుష్వాప మూఢాత్మా కుంభకర్ణో విఘూర్ణితః॥

అంతట కుంభకర్ణుడు అన్ననుజూచి "ప్రభూ ! నన్ను తీవ్రమగు నిద్ర ఆవహించుచున్నది. ఏదైన స్థలమును పండుకొనుట కేర్పాటు చేయు" మనెను. అంతట రావణుడు అతిదీర్ఘము, విస్తృతము అగు గుహ నొకదానిని నిర్మించి యొసగెను. మూఢస్వభావుడగు కుంభకర్ణుడు ఆభవనమున ఒడలెరుగకుండ నిద్రించసాగెను.

నిద్రితే కుంభకర్ణే తు రావణో లోకరావణః
బ్రాహ్మణా నృషిముఖ్యాం శ్చ దేవదానవకిన్న రాన్
దేవర్షియో మనుష్యాం శ్చ నిజఘ్నే సమహోరగాన్॥

కుంభకర్ణు డిట్లు నిద్రావశు డయిన అనంతరము వరబలదర్పితుడగు రావణుడు బ్రాహ్మణులను, మహర్షి సంఘములను, దేవదానవులను, కిన్నరులను మనుష్యులను, ఉరగులను అత్యధికముగా బాధించసాగెను. అనంతరము దేవతల సంపదల నన్నిటిని అపహరింపసాగెను.

ధనదో ఽపి తతః శ్రుత్వా రావణ స్యాక్రమ ప్రభుః
అధర్మం మా కురు ష్వేతి దూతవాక్యే ర్న్య వేదయత్॥

ఈవిధముగా పెచ్చుపెరిగిపోయిన రావణుని అధర్మకృత్యములను పెక్కింటిని విని సోదరుడగు ధనదుడు దూతనొకనిని పుత్తెంచి ధర్మ మార్గమును వదలి అధర్మము నాచరింపకుమని మందలించెను.

తతః క్రుద్ధో దశగ్రీవో జగామ ధనదాలయం
వినిర్జిత్య ధనాధ్యక్షం జహా రోత్తమపుష్పకం॥

కుబేరుని దూత తన మహారాజు మాటలుగా చెప్పిన వాక్యములను వినగనే రావణుడు క్రుద్ధుడైదూత అవధ్యుడని యైనను విచారించక వానిని వధించెను. వధించుటేగాక వెనువెంటనే విపుల విపులములగు సేనలతోగూడి కుబేరునిపై దాడివెడలి అతనిని జయించి బ్రహ్మదత్త మగు పుష్పకవిమానమును స్వాయత్త మొనర్చుకొనెను.

తతో యమ న్తు వరుణం నిర్జిత్య సమరే ఽసురః
స్వర్గలోక మగా త్తూర్ణం దేవరాజజిఘాంసయా॥

అనంతరము అతడు వరుసగా యమవరుణాది దిక్పాలురను సర్వ లోకాధిపతులను నిర్జించి దేవేంద్రుని జయించు ఉద్దేశ్యముతో స్వర్గ ముపై దాడివెడలెను.

తతో ఽభవ న్మహా మ్యుద్ధ మింద్రేణ సహ సైవ హి
తతో రావణ మభ్యేత్య బబంధ త్రిదశేశ్వరః॥

దేవపీరులతోగూడిన ఇంద్రునకును, రాక్షసవీరులతో గూడిన రావణునకును మహాభయంకరమగు యుద్ధము జరిగినది. అంతట ఇంద్రుడు ఘోరయుద్ధమున రావణుని ఆక్రమించి బంధించెను.

తతశ్చుక్రోశ సహసా ఽఽగత్య మేఘనాదః ప్రతాపవాన్
కృత్వా ఘోరం మహాయుద్ధం జిత్వా త్రిదశపుంగవాన్॥

దేవేంద్రుడు తన తండ్రిని బంధించినాడని విని దూరమున యుద్ధమొనర్చుచున్న మేఘనాదుడు మహోత్తరమగు తన బలము నుపయోగించి ఘోరమగు యుద్ధ మొనరించెను అతడు ఇంద్రాదులగు దేవవీరుల నందరను జయించెను.

ఇంద్రం గృహీత్వా బద్ధ్వా ఽసౌ మేఘనాదో మహాబలః
మోచయిత్వా తు పితరం గృహీత్వేంద్రం యయౌ పురః॥

మహాబలుడగు మేఘనాదుడు తండ్రియగు రావణుని విడిపించుటేగాక ఇంద్రుని తిరిగి బంధించి లంకానగరమునకు గొనిపోయెను.

బ్రహ్మా తు మోచయామాస దేవేంద్రం మేఘనాదతః
దత్వా వరాన్ బహూన్ స్మై బ్రహ్మా స్వభవనం యయౌ॥

మేఘనాదుడు ఇంద్రుని బంధించినాడని విని చతుర్ముఖుడు అతనికి దర్శనమిచ్చి అనేకములగు వరములనొసగి దేవేంద్రుని విడిపించుకొని తీసుకువెళ్ళెను.

రావణో విజయీ లోకాన్ సర్వాన్ జిత్వా క్రమేణ తు
కైలాసం తోలయామాస బాహుభిః పరిఘోపమైః॥

ఇట్లు రావణుడు విజయశాలియై సర్వలోకములను జయించి కైలాసమునకు వెళ్ళి పరిఘాసమానములయిన తన ఇరువదిచేతులతో డను కైలాసపర్వతమును లేవనెత్తెను.

తత్ర నందీశ్వరో నైవం శప్తో ఽయం రావణేశ్వరః
వానరై ర్మానుషైశ్చైవ నాశం గచ్ఛేతి కోపనా॥

ఆసమయమున రావణుడు నందీశ్వరుని జూచి పరిహసించగా అతడు వానరామానుషులచే నిహతుడవు కాగలవని శపించినాడు.

శప్తో ప్యగణయ న్వాక్యం యయా హైహాయపత్తనం
తేన బద్ధో దశగ్రీవ: పులస్త్యేన వి మోచిత:॥

నందీశ్వరు డిట్లు శపించినను లెక్కజేయక అతడు కార్తవీర్యార్జు
నుని రాజధానియగు మాహిష్మతీనగరముపైకి దాడివెడలినాడు. సహా
స్రబాహుడగు హైహాయుడు రావణుని బంధించగా పులస్త్యు డాతనిని
విడిపించినాడు.

తతో ఒపి బల మాసాద్య జిఘాంసు ర్వానరోత్తమం
ధృత స్తేనైవ కక్షేణ బాలినా దశకంధర:॥

అంతటితో ఊరుకొనక తన సామర్థ్యముచే వానరరాజగు
వాలిని జయించు తలంపుతో అతనిని సమీపించినాడు. మహాబలశాలి
యగు వాలి రావణుని కక్షభాగమందు గట్టిగా అదిమి పట్టినాడు.

భ్రామయిత్వా తు చతుర: సముద్రా న్రావణం హరి:
విసర్జయామాస తత స్తేన సఖ్యం చకార స:॥

ఆపై వాలి వేమియు ఎరుగనివానివలె నాల్గుసముద్రములకును
త్రిప్పి వదలివేయగా రావణుడు అతనితో సఖ్యభావమును నెరపెను.

అధ్యాత్మప్రధానమగు ఈగ్రంథమున రావణుని లోకవిజయము
పది పన్నెండుశ్లోకములలో సంక్షిప్తీకరించబడినది. వాల్మీకమున ఈ
విషయమంతయు కుతూహాల ప్రవర్ధకముగా వర్ణించబడినది. రావ
ణాదుల పరాక్రమములను తేలుపు నిజయగాథలను సంక్షేపముగా పాఠ
కులకు పరిచయమొనర్చుటకై ఇచ్చట ప్రయత్నమొనర్పబడుచున్నది.

రావణుడు ప్రహస్తాది రాక్షసమంత్రులతో గలిసి అధర్మమార్గ
మున రతుడై యుండుటను, అతడు దేవతలకు, ఋషులకు భయస్థానుడై
యుండుటను గాంచి వైశ్రవణుడు తమ్మునకు సన్మార్గోపదేశమొనర్చు
టకై ఒకదూతను బంపెను. ఆదూత మొదట విభీషణుని దర్శించి అతని
ద్వారా రావణుని యెదుట ప్రవేశపెట్టబడెను. కుబేరుడు రావణునికి
పంపిన సందేశ మిది.

''నీవు దేవభయంకసుడవైతివని వినియున్నాను. నీవు నా హిత వాక్యములను పెడచెవిని బెట్టితివి. నేనింతకు పూర్వము ధర్మాచరణుడై హిమవత్పర్వతమునకు బోయి చిరకాలము కఠినతపము నాచరించితిని. ఒకనాడు పార్వతీపరమేశ్వరులు ఆప్రదేశమున సంచరించుచుండగా దివ్యస్వరూపిణియగు ఈమె ఎవ్వరా? అని చెడుతలంపేమియు లేకుండ గనే కుడికంటితో ఆమెను చూచితిని. ఆమాత్రమునకే ఆమె దివ్య ప్రభావముచే కుడికన్ను మాడినది. రేనుదూషితమయినట్లు పింగళ వర్ణము నందినది. తరువాత ఒక మహోన్నతపర్వతశిఖరమునుజేరి ఎన్నిదివందలసంవత్సరములు తప మాచరించితిని. దానికి సంతుష్టుడై మహేశ్వరుడు ప్రత్యక్షుడై ఈ చుష్కరమగు వ్రతము నిదివరకు నేను జేసితిని. ఇప్పుడు నీవు జేసితివి. కనుక నీవు నాతో బద్ధసఖ్యుడవైయుండుము. పార్వతీదేవి ప్రభావముచే నేత్రము దగ్ధమయినది గాన ఇకనుంచి నీకు ఏకాక్షిపింగళుడు అను నామము కలుగగలదు అని పలికినాడు. తరువాత నేను స్వస్థలమునకు మరలి వచ్చితిని. వచ్చి కులమునకు చెడ్డపేరుదెచ్చు నీఅధర్మకార్యములనుగూర్చి వినియున్నాను. దేవతలును, మహర్షులును నీవధోపాయమును గోరుచున్నారు. కాన సన్మార్గగామి వగుము.''

వానినోరి అహంభావవశుడయిన రావణుడు చూతను, కుబేరుని నిందించుటేగాక రాజధర్మమును వదలి ఆదూతను వక్షించి రాక్షసులకు భక్షించుటకై యొసగినాడు. తరువాత రాక్షసవీరులను, రాక్షససేన లను వెంటనిడుకొని కైలాసమున కేగెను. యక్షులాతని దండయా త్రను కుబేరునికి నివేదించిరి. ధనదుడును రావణునితో బోరుసల్పుటకు కొందరు యక్షులను బంపగా రాక్షససేనలు వారిని దునుమాడినవి. తరువాత మాణిభద్రుడను యక్షవతంసుని బంపగా అతడు కొంతసేపు మాత్రమే ధైర్యముగా రావణునియెదుట నిలువబడగలిగెను.

మాణిభద్రుని ఓటమిని విని ధనదుడు శుక్రప్రోష్ఠపదులతోడను మూర్ఛవించిన శంఖపద్మాదినిధులతోడను గలసి యుద్ధరంగమున

కే తెంచెను. అతడు అచ్చటను రావణునకు ధర్మము నుపదేశించెను. రావణుడు దానిని చెవినిబెట్టలేదు. తదుపరి జరిగిన ఘోరయుద్ధములో కుబేరుడు శత్రువుయొక్క గదాఘాతముచే మూర్ఛితుడై పడెను. అంతట పద్మాదినిధులు తమరాజును నందనవనమునకు తీసికొనిపోయి సేదదేర్చినవి. విజయుడైన రావణుడు అత్యంతమనోహరము, కామ గమనశీలి అగు పుష్పకమును గైకొని ఆచోటునుండి దిగ్విజయమునకై బయలుదేరెను.

కుబేరుని జయించినపిదప రావణుడు కుమార జననస్థానమగు శరవణమునకు వెళ్ళెను. అచ్చట సుందరప్రదేశములను పరికించుచు ఒక పర్వతముమీదుగా పోవగా పుష్పకవిమానము కదలలేకపోయెను. అది చూచి రావణాదులు విస్మయపడుచుండగా వికృతరూపుడగు నందీశ్వరుడు రావణునిప్రక్కన నిలచి "ఈ పర్వతముపై పార్వతీపరమేశ్వరులు విహరించుచున్నారు. కాన ఇందు ఇతరులు ప్రవేశింపరాదు. తిరిగి పొండు" అనెను. రావణు డంతట పుష్పకమునుండి దిగివచ్చి అపరశంకరునివలెనున్న నందియొక్క వానరముఖమునుజూచి పరిహసించుచు పకపక నవ్వెను. దానితో నందీశ్వరుని కోపము మిన్నుముట్టినది. "నా గోతిమొగమునుజూచి పరిహసించితివి గాన వానరులే నీకుల నాశనమునకు కారణు లయ్యెదరుగాక" అని శపించెను. శపించుటే గాక "రావణా ! నీవింతవరకుజేసిన దుష్కర్మములచే చచ్చిన వానివలెనున్నావు. చచ్చినవానిని చంపుటకు ఇష్టములేక ఊరకుంటిని లేనిచో ఈవరకే నిన్ను వధించియుందును అని పలికెను. రావణుడు నందీశ్వరుని శాపమును సరకుగొనక నా గమనమునాపిన పర్వతమును పెరికి వైచెదనని తన ఇరువదిచేతులతోడను దానిని పైకి ఎత్తివైచెను. ఆ యుదుటను పార్వతీపరమేశ్వరులు ఒండుమరులను కౌగిలించుకొనిరి. మహాదేవుడు రావణచేష్టితము నెరిగి తనకాలి బొటనవ్రేలితో పర్వతమును కొంచెము అదుమగా రావణునిచేతులు పర్వతమ్రక్రిందబడి నలిగిపోయినవి. రావణుడు ఘోషముతో ఒక పెద్దహుంకారము నొనరించగా ఆ రా

వమునకు ముల్లోకములవారు ప్రళయము సమీపించినదని భయపడిరి. చిరకాల మిట్లు రోధించుచున్న రావణుని జూచి అతనిమంత్రులు శివుని వేదమంత్రములతో స్తుతించుమని సలహానిచ్చిరి. రావణుడు వారిమాటలను పాటించి ఒకవేయి సంవత్సరములు సామగానమొనర్చి శివుని తృప్తిపరచెను. దానిచే ప్రీతుడయిన శివుడు దశాననునకు రావణుడను నామకరణ మొనర్చెను. చంద్రహాసమును, పాశుపతమును దీర్ఘజీవత్వమును వరములుగా నొసగెను.

తరువాత మహేశ్వరవరగర్వితుడైన రావణుడు రాజులనందరను జయించుచు భూమిపై సంచరించెను. ఒకనాడు హిమవత్పర్వతమున సంచరించుచు అతడు కృష్ణాజినమును, జటలను ధరించి దేవతవలె ప్రకాశించుచున్న ఒక సుందరీమణిని కాంచెను. ఆమెను చూడగనే మదనాతురుడగు రావణుడు జన్మశీలాదికములను పృచ్ఛించెను. ఆమె బృహస్పతి పుత్రుడగు కుశధ్వజుని కూతురు. తండ్రివొక్క వేదాభ్యాసకాలమున రూపముగైకొన్న వేదమువలె ఆమె జన్మించినది. వేదవతి అని ఆమెపేరు. ఆమెను విష్ణుదేవుని కీయవలెనని కుశధ్వజుని సంకల్పము. వేదవతిని మోహించి నిరాశచెందిన దంభుడను దైత్యుడామెతండ్రిని హత్యజేసెను. అప్పటినుండియు ఆమె విష్ణుదేవుని పతిగా గోరుచు తపమాచరించుచున్నది. వేదవతి రావణునకు అతిథిమర్యాదల నొనర్చి తనచరిత్రమును, ఉద్దేశ్యమును తెలియజెప్పినది. రావణుడామె నిశ్చయమును పరిహసించి మదనాతురుడై శిరోకేశములనంటగా ఆమె తనచేతితో కేశములను ఛేదించెను. అరచేయి ఖడ్గమువలె కేశములను ఛేదించినది. ఆమె అతి రూక్షనేత్రములతో రావణునిజూచి "అధముడా! నన్ను జెరుపదలచిన నీకు మృత్యువునై జనించెదను" అని శపించి అగ్నిలో ప్రవేశించినది.

వేదవతి అగ్నిలో ప్రవేశించిన తరువాత అతడు ఉశీరబీజమును స్థానమును చేరెను. అచ్చట మరుత్త అనురాజు బృహస్పతి సోదరుడగు సంవర్తుడు బ్రహ్మగా యజ్ఞము నొనరించుచుండెను. ఆయజ్ఞ

శాలలో రావణుడు అమంగళరూపముతో ప్రవేశించి మరుత్తును యుద్ధ మున కాహ్వానించెను. అంతకుముందు దిక్పాలురగు దేవతలు హవ్య భోజనమునకై వచ్చిరి. రావణుని చూడగనే వారు భయపడి ఇంద్రుడు నెమలిరూపమును, యముడు వాయసరూపమును, కుబేరుడు తొండ రూపమును, వరుణుడు హంసరూపమును ధరించి దాగుకొనిరి. రావ ణునిజూచి మరుత్తు ఇంద్రధనుస్సువంటి చాపమును ధరించి రావణుని వధించుటకు బయలుదేరెను. అంతలో సంవర్తుడడ్డువచ్చి యజ్ఞకాల మున క్రోధించుట తగదని అతనిని వారించెను. అంతట రావణుడాత డోడినట్లు భావించి ఇంకను రాజులను జయించు నుద్దేశముతో భూమం డలమున పర్యటించసాగెను. రావణుడు వెడలిన తరువాత ఇంద్రాదులు తమ తమ రూపములను ధరించిరి. ఇంద్రుడు నెమలికి దాని బర్హ్మము నందు తన నేత్రములవంటి వేయినేత్రములు శోభించునని వరమిచ్చెను. నేను వర్షించునప్పుడు నీకు ముదముకలుగునని కూడ వరమిచ్చెను. యముడు వాయసమునకు జ్వరాదులచే మరణము కలుగకుండునట్లు వరమిచ్చెను. ఎవరయిన చంపినచో వాయసము చచ్చునుగాని స్వయ ముగా చావదు. వాయసము భుజించినచో తన లోకమునన్న పిత రులు తృప్తినందునట్లును వరమిచ్చెను. వరుణుడు హంసకు తెల్లటి పాల నుగువంటి శరీరము నిచ్చెను. పూర్వము హంసలు తెలుపు నలుపు వర్ణములు గలిగి యుండెడివి. రెక్కల మొదళ్ళు నల్లగాను, మూపులు ఆకుపచ్చగాను ఉండెడివి. కుబేరుడు తొండ తల బంగారువర్ణము కలిగి యుండునట్లు వరమొసగెను.

మరుత్తును జయించిన అనంతరము రావణుడు భూమండలమున సంచరించుచు ప్రతిరాజునొద్దకు వెళ్ళి "చేయగలిగినచో యుద్ధము చేయుడు లేనిచో ఓడితి ననుడు" అని సందేశము నంపువాడు. ఎవడైన రాజు అభిమానముచే ఎదుర్కొనినచో వానిని సకులముగా వధించు వాడు. అతని పరాక్రమునకు భయభీతులై అనేకులు తాము ఓడితి మని పలికిరివారు. దుష్యంతుడు, సురథుడు, గాధి, పురూరవుడు

మొదలగు రాజులందరును నాము ఓడితిమని పలికి ప్రాణములను రక్షించుకొనిరి. ఒకనాడు దశాననుడు అయోధ్యానగరమునకు వెళ్ళి తదధిపతియగు అనరణ్యుని యుద్ధమున కాహ్వానించెను. అనరణ్యుడు ఓటమి నంగీకరింపక ససైన్యుడై నగరమును వెలువడి ఘోరయుద్ధ మొనర్చెను. ప్రహస్తాదులగు మంత్రులు చలించగా రావణుడు తన అరచేత్తో అనరణ్యుని శిరమున గొట్టెను. దానితో అనరణ్యుడు భూపతితుమకాగా మరణాసన్నుడయిన అతనిని పగిహసించుచు రావణుడు "నాతో యుద్ధమొనర్చినందులకు ఫలము ననుభవించితివిగదా! నీవు భోగనిమగ్నుడవై త్రిలోకములను అతిశయించిన నా పరాక్రమమును ఎరుగవుగాబోలు" అనెను. దానికి ఆరాజన్ని హీనస్వరముతో ఇట్లు బదులు పలికెను. "కాలము దురతిక్రమమయినది. కాలమే నన్ను జయించినది. నీవు నిమిత్తమాత్రుడవు. నేను యుద్ధభూమినుండి పారిపోలేదు. అట్టి నన్ను పరిభవవాక్యములతో వేధించినదానికి ఫలము ననుభవింతువు. నేను నిరతాగ్నిహోత్రినే అయిన సత్పరిపాలన నొనర్చితి నేని, సత్యవాక్పరిపాలకుడనేని నావంశీయునిచేతనే నీవు మృతినందగలవు. ఇక్ష్వాకువంశీయుడయిన దశరథుని పుత్రుడు రాముడనువాడు నిన్ను వధించగలడు" అని శపించి అనరణ్యుడు మృతుడయ్యెను.

రావణుడిట్లు భూమండలమందలి రాజులను సంహరించుచుండగా మానవహితము నాలోచించి నారదుడొకనాడు అతనివద్దకు వచ్చెను. మొదట నారదుడు అతనిని ప్రశంసించి ఇట్లనెను- నీవు బ్రహ్మవరములచే దేవతలకే అజేయుడవు. అట్టిచో ఈ అల్పసత్వులు, నిత్యరోగపీడితులు, స్వల్పజీవనులు అగు మానవుల నేల వధించుచున్నావు. వారు రోగాదులచే ఇదివరకే చచ్చియున్నారు. చచ్చినవారి నేల చంపెదవు? వారిని వధించుట నీకే కళంకము అనెను. రావణుడు "అయినచో నాతో యుద్ధమొనర్పగలవా డెవ్వ" డని పృచ్ఛించెను. యము డొక్కడే నీతో పోరగలవాడని ఋషి బదులుపలికెను. అయి

నచో నేడే నేను యమునిపై దాడినెడలెదనని రావణు డనినాడు. నారదు డచ్చటినుండి ప్రేతపురికేగి యముని కీవార్త నెరింగించెను.

పుష్పకాధిరూఢుడగు దశాననుడు ప్రేతపురమందలి తిమిరమును తొలగదోయుచు ఆస్థలమును చేరెను. అక్కడ పుణ్యవంతులను కొం దరు సుఖముల ననుభవించుటను, పాపులు దుఃఖముల ననుభవించుటను జూచి రావణుడు పాపుల నందరను విడిపించెను. అనేక పాపముల నొన రించుటచే కొందరు క్రిములచేతను, సారమేయముల చేతను భక్షింపబడు చుండిరి. కొందరు దుర్గంధపూరితమయిన వైతరిణీ రక్తజలములలో ద్రోయబడుచుండిరి. కొందరు అగ్నివలె మండుచున్న ఇనుకలో దొర్లించబడుచుండిరి. కొందరు అధార్మికులు అసిపత్రవనములో పడువులెత్తు చుండిరి. కారవమను నరకమును మంచినీటినడుగు తృషార్తులకు ప్రాకోదకము ప్రాగుట కొసంగబడుచుండెరు. కొందరి శరీరములు శవసమూ హములయినవి. కొందరు మలపంకలేపితశరీరులై బాధపడుచు హాహాకా లొనరించుచుండిరి.

ఇట్లు ఒకప్రక్క పాపులు దుఃఖమునను భవించుచుండగా కొందరు పుణ్యాత్ములు బహువిధములగు భోగముల ననుభవించుచుండిరి. రావణు డంతట కష్టముల ననుభవించుచున్న పాపుల నందరను విడిపింపుడని తన సేనల కాజ్ఞాపించెను. రావణసేనలు యమభటులను పారదోలి పాపుల నందరను విడిపించినవి. యమభటులు వివిధాయుధములను ప్రయో గించి యెమరొక్కనగా రావణుడు వారి నందరను పాశుపత్రప్రయోగ మున నిర్జించెను. ఆవార్తనువిని యముడు తన సారథిని రథమును సిద్ధపరపుమని ఆజ్ఞాపించెను. సూతుడు మహాభయంకరముగా రథము నాయత్తపరచెను. పాశమును, ముద్గరమును ధరించి త్రిలోకములను ఒక్కసారిగా ఉపసంహరింపజేయజాలు మృత్యువు అతనికి ముందు నడ చినది. పార్శ్వమున కాలదండము మూర్తిమంతమై నిలచినది. అది కరాళమగు అగ్నిశిఖవలె మండుచున్నదట. దానిప్రక్కనే కాలపాశము లనేకములు రూపొందియున్నవి. ఇట్లు సాధనసంపత్తితో క్రుద్ధుడై

వచ్చుచున్న యమధర్మరాజును జూచి త్రిలోకములును భయకంపితము లాయినవి. మృత్యుసమన్వితమగు యముని రథమును జూడగనే ప్రహస్త మారీచాదులగు రావణసహాయు లందరును వెనుదిరిగి పరువిడనారభించిరట. బ్రహ్మవరములచే ఒక్క రావణుడుమాత్రము నిశ్చలుడై నిల బడెను. యముడు రావణుని జూచి అనేకములగు ఘోరాస్త్రములను ప్రయోగించెను. రావణుడును వాటిని మరల్చి బాణములను వర్షముగా కురియించ నారంభించెను. శరవర్షమును వారించి యముడు మహా భయంకరమగు శక్తిని ఒక్కదానిని వదలెను. ఆశక్తికి ప్రతివిధానము తెలియక రావణుడు మిక్కిలి పీడితుడయ్యెను. ఇట్లు ఆవీరు లిరువు రును ఏడు దివారాత్రములు యుద్ధమొనర్చిరి. కాని అందులో ఒకరు జయించుటగాని, ఒకరు ఓడుటగాని సంభవించలేదు. ఆసమయమున వారియుద్ధమును చూచుటకు దేవగంధర్వాదులు విమానారూఢులై ఆకాశమున నిలచిరట. ప్రళయసదృశమగు యుద్ధము జరిగినది. రావ ణుడు తీవ్రములగు బాణములను ప్రయోగించి మృత్యువును వేధించెను. దానితో మృత్యువు క్రోధముచే కాలాగ్నివలె మండినది. అది యము నికి అభివాదనమొనరించి "నన్ను ఆజ్ఞాపించుము. నాదృష్టినిబడి నశిం చనివా డెవ్వడును లేడు. వీనిని మించిన హిరణ్యకశిపుడు, సముచి, శంబరుడు, సంహ్రాది, ధూమకేతుడు, వృత్రుడు మొదలగువా రెల్లరును నాబారినుండి తప్పించుకొనలేకపోయిరి. వీ డెంత ? అంతేగాదు బ్రహ్మ దొనక్క శాసనముచే ఈ సమస్తసృష్టియు నాయధీనమునంచున్నది. ఇది నావిసర్గమగు శక్తియేగాని నరప్రాప్తముగాదు. కనుక నన్ను ప్రయోగించుము. వానిని గూర్పుమా పెదను" అన్నది. యముడు నేనే వానిపనిని చక్కబరచెదనని మృత్యువును వారించి కాలదండమును స్పృశించెను. ఆ కాలదండమునగు ప్రక్కనే కాలపాశము లన్నియు యున్నని. యముడు స్పృశించగనే పావకునివలె మండుచు నిలచినది. దానిని ఎవడయిన చూచినచే భయభీతుడై మృత్యుగ్రస్తుడగును. అట్టిచో అది ఎవనిపైనైనను ప్రయోగింపబడినచో వాడెట్లు జీవింపగలడు.

అది రావణుని తక్షణమే దహించివేయునదివలె నున్నదట. కాలదండ మును హస్తమునధరించి యముని జూచి దేవతలు క్షుభ్నహృయులైరి. యముడు దండమును దశాననిపై ప్రయోగించబోవుచుండగా సృష్టి కర్త వారిద్దరినడుమ నిలబడి యముని వారించుచు ఇట్లు పలికినాడు- వైవస్వతా! రావణుడు నీచే వధింప దగినవాడుకాడు. కాలదండముచే నీవు వధింపబడవని నేను రావణునకు వరమునిచ్చితిని. నాపల్కును అసత్యమొనరించుట తగదు. నాపల్కునే అసత్యమొనరించినచో త్రిజగములు అనృతములగును. నీవు క్రుద్ధుడవై ఈదండమును ప్రయోగించినచో త్రిలోకములను వధింపగలదు. ప్రజలను నశింపజేయుటకు అమోఘముగా ఇది నిర్మింపబడినది. ఇది పడగనే ఎవ్వ డును ముహూర్త కాలముకూడ జీవింపజాలడు. ఒకవేళ దీనిచే ఈతడు మరణింపకుండినచో నావచనము అనృతము కాగలదు. ఎట్లయిను నాకు అనృతత్వము సంభవించగలదు. కాన నీవు దీనిని ఉపసంహరించుము". ప్రజాపతి వచనములను మన్నించి యముడు దండమును ఉపసంహరించి నాడు. తరువాత వరదప్రభుడగు ఈతనిని వధింపరానిచో నేను యుద్ధ భూమిలో ఏమిచేయుదునని అంతర్ధానమునందినాడు. దశగ్రీవుడు తన విజయమును ప్రకటించుకొనుచు సంయమినినుండి బయల్వెడలెను.

రావణు డిట్లు యముని గెలిచి మారీచాది రాక్షసులచే ప్రశం సింపబడుచు రసాతలమునకు ప్రయాణమును కొనసాగించెను. మార్గ మున భోగవతీపురము కన్పడినది. దాని రాజయిన వాసుకిని వశీకరించు కొని మణిమతి అను పురమును జేరెను. ఆపురమును నివాస మొన రించుకొని నివాతకవచులను రాక్షసులు నిర్భయులై యున్నారు. వారు బ్రహ్మవరములచే ఇతరుల కజేయులు. రావణుడు మణిమతీపురమును ముట్టడించగా సుదీర్ఘమగు యుద్ధము జరిగినది. ఒకసంవత్సరము గడచి నను జయము నిశ్చితము కాలేదు. అంత ప్రజాపతినిచ్చి రావణుని- నివాతకవచులను సమాధానపరచి వారికి మైత్రిని సమకూర్చినాడు. వారికి అగ్నిసాక్షికముగా మైత్రిని నెరపినాడు. రావణుడు మణిమతీపుర

మున స్వపురమున నున్నట్లుగనే ఒకసంవత్సరము సుఖజీవితమును గడిపి వారివద్ద తొంబదితొమ్మిదిమాయలను నేర్చుకొని అనంతరము వరుణి జయించుటకై బయలుదేరెను. అంత మార్గములో కాలకేయుల నగర మయిన అశ్మనగరము కన్పించినది. రావణు డానగరమును ముట్టడించి ఘోరయుద్ధ మొనర్చినాడు. ఆయుద్ధములోనే శత్రుపక్షమునను౦డి తనతో యుద్ధమొనరించుచున్న విద్యుజ్జిహ్వుని-అతడు తన చెల్లెలి భర్త యనియైన భావింపక ఖడ్గముతో ఖండించెను.

తరువాత అతనికి వరుణుని నగరము కన్పించినది. ఆ స్థానము ననే కామధేనువు కన్పించగా రాక్షసరాజు దానికి ప్రదక్షిణనమస్కా రము లొనరించినాడు. తరువాత వరుణనగరమును చుట్టుముట్టినాడు. ఆసమయమున వరుణుడు నగరమున లేడు. వరుణపుత్రులు రోషముతో రావణు నెదుర్కొని బహు తెరగుల యుద్ధము నొనరించినారు. ఎంత మహామాన్వితులయినను వారు వరబలప్రభావసంపన్నుడయిన దశగ్రీవుని మీరలేకపోయినారు. వరుణపుత్రులను, సేనలను ఓడించి దశాననుడు వరుణుని యుద్ధమున కాహ్వానించినాడు. ఆప్పుడతనికి ప్రహస్తుడు వరు ణుడు నగరమున లేడనియు, బ్రహ్మలోకమున కేగినాడనియు విన్నవిం చగా తాను వరుణుని గెల్చితినని ఘోషించుచు సముద్రమునుండి వెలు వడి లంకానగరమున కేతెంచినాడు.

రావణు డిట్లు ఉత్తర దక్షిణ పశ్చిమ దిక్పతులను జయించి లంకానగరమునకు తిరిగివచ్చుచు మార్గమున అతనికి కన్పించిన దేవ గంధర్వమానవాధిపుల కన్యలను, సుందరీమణులయినవారిని బందీలుగా గొని పుష్పకమున నుంచినాడు. అతడు ఆ యా స్త్రీలను బందీలుగా గొనునప్పుడు అడ్డువచ్చినవారి బంధుగులనెల్ల వధించెడివాడు. ఇట్లు రావణుచే చెరబట్టబడిన స్త్రీ లెల్లరను అతని బహుభంగుల శపింప సాగిరి. ఇట్లు స్త్రీల రోధనధ్వనులతో గూడిన పుష్పకమునగొని రావ ణుడు లంకానగరమును జేరినాడు. రావణుడు లంకకు చేరగనే అతని చెల్లెలగు శూర్పణఖ ఏతెంచుచు అతని సమీపమున కేతెంచి నాభర్తను

జంపి నాకు వైధవ్యమును తెచ్చిపెట్టితివని నిందించినది. రావణు డామెను ఓదార్చి ఖరదూషణులతో బాటు జనస్థానమున యథేచ్ఛగా సంచరించుమని బంపినాడు. ఇంతలో పుష్పకమంను తమస్థితికి ఏడ్చుచు రావణుని పరిపరివిధముల శపించుచున్న కాంతలనుజూచి విభీషణుని హృదయము ద్రవించినది. అన్నగారి అధర్మప్రవర్తన అతనిని కటకట పరచినది. అతడు తన అన్నను సమీపించి మధువనమైత్యుడు తమ చెల్లెలగు కుంభీనసిని అపహరించినవార్తను తెలియజేసినాడు. దానితో భగ్నమండిపడి మధువును జయించి, అమార్గమునసే ఇంద్రునిగూడ జయించు తలంపుతో కుంభకర్ణుని, మేఘనాదునికూడ వెంటనిడుకొని బయలుదేరినాడు. మేఘనాదుడు తండ్రి దిగ్విజయయాత్రలోనున్న సమయమున శుక్రాచార్యుని ఆధ్వర్యమున నికుంభిలయందు అగ్నిష్టోమము, అశ్వమేధము, బహుసువర్ణము, రాజసూయము, గోమేధము, వైష్ణవము, పాశుపతము అను ఏడుయాగములను సమాప్తమొనరించినాడు. తరువాత మహేశ్వరయాగమొనర్చి ప్రసన్నుడయిన ఈశ్వరునిచే ఆకాశ సంచారియై కోరిన స్థలమునకు పోగలిగిన రథమును, తామసియను మాయను వరములుగా బడసెను. ఆ తామసియుద్ధములో చీకటిని సృష్టించి శత్రువులకు మేఘనాదుని ఉనికి తెలియనీయదు. ఇవియేగాక అనేకవరములను బడసినాడు. రావణుడు తనపుత్రుడుచేసిన యజ్ఞముల పేర్లు విని అయిష్టతను ప్రకటించినాడు. ఈ యజ్ఞములవలన తన శత్రువులను దేవతలు తృప్తులయినారని అతనిబాధ.

రావణుడు రాక్షససైన్యముల నన్నిటిని గదల్చెను. విభీషణుడు మాత్రము నగరరక్షణకై నియమింపబడెను. ప్రహస్త మారీచ, దేవాంతక నరాంతక సుమాల్యాదులగు రాక్షసశ్రేష్ఠులు ఉత్సాహముతో వెంటరా రావణుడు మధువనమును చేరెను. అన్నగారు వచ్చిన వార్తను విని కుంభీనసి ఎదురువచ్చి పాదాభివందన మాచరించినది. రావణుడు "నిన్ను అపహరించుకొని వచ్చిన మధు వెక్కడ"నన్నా డనగా నామె అన్నను శాంతునిజేసి మధువు తనను అపహరించుకొని

వచ్చినను అతడు తన భర్తగాన రక్షింపుమని కోరినది. దానితో రావణుడు శాంతుడై మధుదైత్యునితో సఖ్యమొనర్చుకొని, ఆనాడే స్వర్గముపై దాడివెడలెను.

సూర్యాస్తమయమగుసరికి రావణసైన్యములు కైలాసపర్వతమును చేరినవి. అక్కడనే స్కంధావార మేర్పాటుచేయబడినది. కొంతరాత్రి యగుసరికి చంద్రోదయమయినది. ఆ వెన్నెలరాత్రి కైలాస సానువులలో కోరిక లుప్పతిల్ల సంచరించుచు రావణుడాదారినబోవు సుందరీమణి నొకతెను జూచి కామాతురుడై సమీపించి నీ వెవ్వతెవని ప్రశ్నించినాడు. అంతట నామె "నేను రంభను, నీ సోదరపుత్రుడగు నలకూబరుని పత్నిని. ఈ సమయమున నేనచ్చటకే పోవ్రచున్నాను" అనెను. రావణుడామెకు తన మనోభిలషితమును తెలియజేసినాడు. ఆమె "నేను నీకు కోడలనగుదును. సన్నుకోరుట అధర్మము" అని బోధించినది. రావణుడామెమాటలను లెక్కచేయక బలవంతముగా ఆమె ననుభవించినాడు. అంతట రంభ రావణపరిభుక్తయై రోదించుచు నలకూబరుని చేరనరిగినది. నలకూబరుడు ఆమెకు జరిగిన పరిభవమును విని క్రుద్ధుడై శాపోదకములను చేత్రగహించి "ఈనాటినుండి రావణుడు తనయం దిష్టములేని కాంతను బలిమిని భోగించినచో అతనిశిరము వెంటనే వేయిచెక్కలగుగాక" అని శపించెను. ఆశాపము ఎల్లలోకములకును ఆనందమును సమకూర్చినది. రావణుడును దానిని విని బలిమిని పరకాంతలను బట్టుటను మానెను.

మరునాడు రావణుడు తనసైన్యములతో కైలాసమునుదాటి ఇంద్రలోకమును ముట్టడించెను. రావణుని ఆగమనవార్తను విన్న ఇంద్రుడు సర్వసైన్యములను ఆయత్తమొనరించి వారిని అమరావతిని రక్షించునట్లు ఏర్పాటుచేసి తాను విష్ణుదేవుని దర్శింపనేగెను. అతడు విష్ణుని దర్శించి సురాసురలకు అజేయుడగు రావణుని బారినుండి రక్షించుమని ప్రార్థించగా నారాయణుడిట్లనెను– "నేను బ్రహ్మవరములకు బద్ధుడను. కనుక రావణుని యుద్ధమున వధింపజాలను. విష్ణువు శత్రుని

వధించక యుద్ధభూమినుండి తిరిగిరాడు. కాన ఇప్పటికి నీవోపినకొలది శత్రుని ఎదిరింపుము. భవిష్యత్తులో కొండక నిషచే నేనే అతనిని వధింప గలవాడను-అని.

ఇంద్రుడు విష్ణుదేవునిమాటలను శిరసావహించి అమరావతికి తిరిగివచ్చి రాక్షససేనలతో యుద్ధమొనర్చినాడు. అత్యంతభయంకర మగు యుద్ధము జరిగినది. సావిత్రుడను వసువు సుమాలిని (రావణుని మాతామహుని) వధించినాడు. దానితో రావణ మేఘనాదకుంభకర్ణులు చెలరేగి దేవతలను నశింపజేయసాగిరి. అంతట మేఘనాదుడు అత్యు ద్ధతముగా యుద్ధమొనరించుచుండ జూచి జయంతుడు కల్పితరథుడై అతని నెమర్కొనెను. కొంతకాలము యుద్ధమొనరించి సంకటపరిస్థితిలో పడగా అతని మాతామహుడగు పులోముడు మనుమని అదృశ్యపరచి తనగృహమునకు గొనిపోయెను. తామసే విద్యచే అదృశ్యుడయిన మేఘనాదుసిచే పోరాడు పుత్రుడు అకస్మాత్తుగా కన్పడకపోవుటను గాంచి ఇంద్రుడు మాతలి ప్రయుక్తమయిన రథము నధిరోహించి రాక్ష సుల నెదుర్కొనెను. యుద్ధసన్నద్ధుడగు దేవేంద్రునిజూచి రావణుడు పుత్రుని వెనుకకునెట్టి తాను శత్రువును ఎదుర్కొనెను. ఆసమయము ననే వేల్పుల సైన్యములను అసంఖ్యాకములుగా నశింపజేయుచున్న కుంభకర్ణు నెదుర్కొని ఏకాదశరుద్రులు అతని శరీరమును బాణవర్ష ముచే నింపిరి. అతడు అలియగా ఆసందున దేవతలు రాక్షససైన్య ములను ఒడలు పడనేసిరి.

ఆసమయమున రోషకషాయితహృదయులగు దేవేంద్ర రాక్షసేం ద్రులు యుద్ధమునకు పూనుకొని కొన్నిసంవత్సరములు ఎడతెరిపిలేకుండ ద్వంద్వయుద్ధమొనర్చిరి. ఆ ఘోరరణముచే యుద్ధభూమి అంధకారావృత మయినదట. ఇంద్రుడు, రావణుడు, మేఘనాదుడు- ఈ ముగ్గురుతప్ప తక్కిన సేనలన్నియు మూర్ఛితములయినవి.

ఎంతకాలమయినను ఇంద్రుడు విజితుడు కాకపోవుటచే రావ ణుడు విసిగి మహాసాహసముతో శత్రుసైన్యమున ప్రవేశించి నాశన

మొనర్పసాగెను. రావణునితలంపు నెరిగిన ఇంద్రుడు ఒక ఉపాయము పన్నినాడు. బ్రహ్మవరకారణమున రావణుడు అవధ్యుడు. కాన ప్రాణములతో పట్టువలెనని అతని సంకల్పము. అతడు రావణుని వదలి మరొక దిక్కున రాక్షసులతో యుద్ధము చేయసాగెను. ఇట రావణుడు తీవ్రముగ బాణములను వర్షించుచు శత్రుసైన్యములో ప్రవేశించెను. అంతట ఇంద్రుడు తత్తర పాటేమియు పొందక తనసైన్యముల రావణునిచుట్టి రాక్షససైన్యములనుండి అతనిని వేరుచేసెను. అది చూడగనే రాక్షసులు హాహాకారముల నొనరింపసాగిరి. తండ్రి శత్రుసైన్యమధ్యమున నున్న వార్తనువిని మేఘనాదుడు తండ్రిని విడిపించుటకు బయలుదేరినాడు. తామసీవిద్యచే అదృశ్యుడైవచ్చి మేఘనాదుని చూడక ఇంద్రుడు రావణుని సమీపించి రథాశ్వములను, సారథిని వధించి అతనిని బంధించి తనలోకమునకు గొనిపోయెను. ఆసమయమున రాక్షసుల ఆర్తనాదములను విని మేఘనాదుడు శీఘ్రముగా ఇంద్రుడున్న స్థలమునకు పోయెను. తామసీనిద్యచే అదృశ్యుడై మాతలిని, రథమును గొట్టి దేవేంద్రుని అనేకబాణములచే వేధించెను. చివరకు ఇంద్రుడు అలసిపోగా అతనిని బంధించి తండ్రిని విడిపించెను. తమప్రభువు యుద్ధమున శత్రుని చేజిక్కగా దేవసైన్యము మహాక్రోధముతో రాక్షసులను చెండాడజొచ్చెను. కాని అప్పటికి అత్యంతము అలసియున్న రావణుడు వసురుద్రాదిత్యులతో పోరు సల్పలేకపోయెను. అంతట మేఘనాదుడు యుద్ధమువాని పురమునకేగుట మంచిదని తండ్రికి సలహానిచ్చెను.

రావణుడు తనపుత్రునికి ఇంద్రుని లంకకు గొనిపొమ్మని ఆజ్ఞాపించి తాను వెనుకవచ్చెద ననినాడు. రావణి తండ్రియాజ్ఞను శిరసావహించినాడు.

దేవేంద్రు డిట్లు శత్రునగరమునకు బందీగా పోగా దేవతలందరును ప్రజాపతినిచేరి ప్రార్థించి విషయమును తెలియజేసినారు. బ్రహ్మ లంకానగరమునకువచ్చి మేఘనాదునితో నీవుకోరిన వరములిచ్చెదను ఇంద్రుని విడువుమనినాడు. మేఘనాదుడు తనకు చావులేకుండ వరము

నిమ్మనినాడు. ప్రజాపతి పుట్టిన ప్రతిజీవియు ఏనాడో ఒకనాడు చావ వలసినదే. కాన అట్టివరము నడుగకుము అనినాడు. అయినచో "నేను మంత్రపూర్వకముగా అగ్నిలో హోమమొనర్చి యుద్ధమునకు పోవు నప్పుడు ఒక దివ్యాశ్వయుక్తమయిన రథము సిద్ధముకావలెను. నేను దాని నధిష్టించి యుండునప్పుడు శత్రులకు అజేయుడ నగుదునుగాక" అనెను. బ్రహ్మ తథాస్తనెను. ఇట్లు ఇతరులందరు తపస్సుచే ప్రభావమును సంపాదింపగా మేఘనాదుడు పరాక్రమముచే సంపాదించినాడు. బ్రహ్మ మేఘనాదునకు ఇంద్రజిత్తు అనుబిరుదు నొసగెను. మేఘనాదునిచే విడువబడి తేజోహీనుడై ఖిన్నుడైయున్న దేవేంద్రునిజూచి బ్రహ్మ "నీవుచేసిన అహల్యాసంగమకారణమున నీకీ పరాభవము సిద్ధించినది. నీవు వైష్ణవయాగ మొనరించి విగతకల్మషుడవగు"మని సలహా నిచ్చినాడు. ఇంద్రుడును వైష్ణవయాగమొనర్చి తిరిగి యథాస్థానము నలంకరించినాడు.

అగస్త్యుడిట్లు రావణునియొక్కయు, ఇంద్రజిత్తుయొక్కయు శక్తి కారతమ్యమును తెల్పగా రాముడు ఆశ్చర్యములో మునిగినాడు. విభీషణుడు నా అన్నగారికథ అంతయు కళ్ళకు గట్టినట్లున్నదనినాడు. అంతట రాముడు అగస్త్యునితో "సర్వలోకములను అడ్డి జయించగల వాడే లోకములో లేకపోయిరా ?" అని ప్రశ్నించగా దానికి అగస్త్యుడిట్లు పలికినాడు.

ఒకప్పుడు రావణుడు భూమండలమున సంచరించుచు కార్తవీర్యార్జునునితో యుద్ధమునుగోరి మాహిష్మతీనగరమున కేగెను. అర్జునుడాసమయమున అవరోధకాంతలతోగూడి నర్మదానదిలో జలక్రీడ లొనరించుటకు వెళ్ళియుండెను. మంత్రులచే ఆవార్తనువిని రావణుడు నర్మదానదీతీరమునకే అర్జునుని కలియుదునుగాక ! అని నదివద్దకు వెళ్ళెను. నిర్మలమగు నర్మదానదిని చూడగనే రావణుని హృదయము చల్లబడినది. శివభక్తితత్పరుడగు అతనికి ఆ నిర్మలవాతావరణములో శివపూజ నొనర్పవలెనను సంకల్పము కలిగినది.

అతడు మంత్రుల నందరును స్నానము చేయుడని ఆజ్ఞాపించి స్నానమొనర్చెను. నర్మదాసైకతమున పసిడి లింగమును స్థాపించి మంత్రులుతోసి తెచ్చిన పూలతో శివుని పూజించి అభిషేకవిధానమున అర్చించెను. అనంతరము వేదగానమొనర్చు శివునియెదుట నృత్యము గూడ చేసెనట. శివభక్తాగ్రేసరుడగు రావణు డిట్లు నర్మదా సైకత మున శివపూజలనొనర్చు సమయమున హైహయరాజగు కార్తవీర్యార్జునుడు నదికి దిగువభాగమున పత్నులతోగూడి జలక్రీడల నొనర్చు చుండెను. కరేణమధ్యస్థమగు ఐరావతమును పురిడించు అర్జునుడు తన సహస్రబాహువులను నర్మదాప్రవాహమునకు అడ్డుగా చాచెను. అతని బాహువుల ప్రసారముచే నదీప్రవాహమంతయు అరికట్టబడి వెనుకకు ప్రవహించసాగెను. ఆవెల్లువ అతివేగముగా ఉప్పొంగుచు రావణుడు పూజనొనర్చుచున్న శివలింగమునుగూడ ముంచివేయసాగెను. రావణుడు ఈవిపరీత ప్రవాహమునకు కారణము తెలియక శుకసారణులను చారులను విషయమును గ్రహించి రమ్మని ఆనతిచ్చెను. వారును కార్తవీర్యుని వృత్తాంతమును గ్రహించి వచ్చి విన్నవించిరి. వెంటనే రావణుడు అతనిపైకిబోయెను. పోవునప్పు డనేకదుర్నిత్తములు కలిగినవిగాని అతడు వాటిని లెక్కచేయలేదు. అతడు కార్తవీర్యునున్న స్థలమును జేరి అతని మంత్రులతో రావణుడు యుద్ధార్థియై వచ్చినాడని మీరాజుతో చెప్పుడనియెను. అర్జునమంత్రులు "రావణా! ఇది యుద్ధమునకు సమయముకాదు. మారాజు స్త్రీలమధ్యయం దున్నాడనిరి. రావణుడు వారిమాటలను సరకుచేయలేదు. అతని మంత్రులు హైహయమంత్రులను ఓడించిరి. వారి సైన్యములలో కల్లోలము వ్యాపించినది.

అర్జును డీవార్తను విని గదాదండమును చేత ధరించి తన నెమరించు ప్రహస్తాదులను దూలించుచు రావణుని ఎదుటకు వచ్చెను. ప్రహస్తాదులు పరాజితులుకాగా రావణుడే కార్తవీర్య నెదిరించెను. అర్జునరావణులు రెండు సింహములవలె, రెండు పులులవలె రెండు

వృషభములవలె, బలి ఇంద్రులవలె పోరాడిరి. ఎంతసేపు పోరాడినను వారిలో ఒకరును అలయుట సంభవించలేదు. చివరకు కార్తవీర్యుడు వరప్రసాదలబ్ధమయిన గదాదండమును తన బలమునంతను ఉపయోగించి రావణునిపై విసరెను. ఆ గదాదండము రావణుని వక్షమును దాకి రెండు తునియలయినది. కాని ఆతడుచే రావణుడు అలసి పోయినాడు. ఆవిషయమును పసిగట్టి హైహయార్జునుడు దశకంఠుని బంధించి దేవతలు పుష్పవృష్టిని కురియించుచుండగా నగరమున ప్రవేశించినాడు. తరువాత తన మనుమడు పట్టుబడిన వృత్తాంతమును విని పులస్త్యమహర్షి కార్తవీర్యునితో జెప్పి విడిపించెను.

తరువాత కొంతకాలమునకు రావణుడు కిష్కింధానగరమునకు బోయి వాలిని యుద్ధమున కాహ్వానించెను. కాని ఆసమయమున వాలి నగరమున లేడు. ప్రాతఃసంధ్యోపాసనకై దక్షిణసముద్రతీరమునకు పోయెను. తారుడను వానరునివలన ఈవార్తను విని రావణుడు వాలిని వెంటనే నిర్జించవలెనను తమకముతో దక్షిణసముద్రమునకు పోయెను. వాలి సంధ్యోపాసనమొనర్చుచుండగా అతనిని వంచనగా పట్టు తలంపుతో రావణుడు వెనుకనుండియే పొంచిపొంచి అతనిని సమీపించెను. వాలి ఎప్పుడో ఈ వృత్తాంతమును గ్రహించి వంచకునికి వంచనయే యుక్తమని మిన్నకుండెను. రావణుడు మెల్లగా వాలిని సమీపించి తనచేతులను అతని బాహువులలోనుండి పోనిచ్చి పట్టబోయెను. ఇంతలో వాలి మేమియు యెరుగనివానివలె అతని రెండుచేతులను తనబాహు మూలములలో అదిమెను. దానితో రావణుడు నిస్సత్త్వుడై మాట్లాడ నేలేకపోయెను. వాలి రావణునకు తన పరాక్రమమును తెలియజేయు వాడై అతని నట్లే చంకలో ఇరికించుకొని ఆకాశమున కెగిరెను. అది జూచి ప్రహస్తాదిమంత్రులతనిని ఎదుర్కొనిరి. కాని వాలి హారినంద రను దూలించి పూర్వపశ్చిమోత్తరసముద్రములకుపోయి క్రుంకులిడి ఏమియు ఎరుగనివానివలె కిష్కింధకు విచ్చేసి పురబాహ్యోద్యానమున నేలపై బడవేసెను. అట్లు వదలి రావణుని జూచి "రావణా! ఏమి

ఇప్పుడువచ్చితివి ? ఎచ్చటనుండి వచ్చితివి" అని ప్రశ్నించెను. అంతట రావణుడు వాలియొక్క పరాక్రమమునకు ఆశ్చర్యపడుచు అతనిశౌర్యమును ప్రశంసించి నీతో అగ్నిసాక్షికమగు మిత్రత్వమును కోరుచున్నానని చెప్పెను. తరువాత వారు సోదరులవలె ఆలింగనమొనర్చుకొనిరి.

అగస్త్యుడిట్లు రావణుని వృత్తాంతమును వివరించి హనుమంతుని జన్మప్రకారమునుకూడ వర్ణించినట్లు వాల్మీకమున వర్ణితమయినది.

రాముడు హనుమంతుడు తనకుచేసిన ఉపకారములను, అతని పరాక్రమములను అగ్గించి అగస్త్యునితో ఇట్లనెను– మహర్షీ! వాస్తవము నకు హనుమంతుని శక్తిసామర్థ్యములు రావణునకుగాని, వాలికిగాని ఉన్నట్లు తోచదు. అట్టిచో వాలి సుగ్రీవుని రాజ్యమునుండి వెడలనడచు నప్పుడు మిత్రుని కష్టములను జూచియు హనుమంతు డెట్లు ఊరకొని నాడు ? అని. దానికి అగస్త్యుడిట్లు పలికెను.

హనుమంతుడు కేసరి భార్యయయిన అంజనకు వాయుదేవునివలన బుట్టినవాడు. అతడు పుట్టినతరువాత తల్లి ఫలములను తెచ్చుటకు వన మునకుపోగా ఆకలిదీడితుడయిన బాలుడు అప్పుడే ఉదయించుచున్న సూర్యుని ఫలముగా భావించి అతనిని పట్టుకొనుటకై ఆకాశమున కెగసి నాడు. వాయుదేవుడు పుత్రునికి పీడకలుగకుండుటకై చల్లనిపిచికలతో అతనిని వెంబడించినాడు. సూర్యుడును అతనిని బాలుడని ఎంచి తీక్ష్ణ తను కన్నారక ఆదరముతో తనరథమున కూర్చొనబెట్టుకొనినాడు. అదేసమయమున రాహువు సూర్యునిబట్టుటకు రాగా హనుమంతుడు దరిజేరనీయలేదు. రాహువు ఇంద్రునివద్దకుపోయి మొరపెట్టుకొనగా అతడు చతుర్దంతములుగల ఐరావతమునెక్కి ఆస్థలమునకు వచ్చినాడు. ఇంద్రునికంటె ముందుగా రాహువు సూర్యునివద్దకురాగా హనుమం తుడు శిరఃస్వరూపుడయిన అతనిని ఫలముగా భావించి పట్టబోయెను. రాహువు వేడుకొనగా ఇంద్రుడు వజ్రివడిగా ఏతెంచెను. హనుమం తుడు తెల్లని ఐరావతమును ఫలముగా భావించి దానిని పట్టనేగెను. అంతట ఇంద్రుడు వజ్రాయుధమును విసరగా అది అతని హనువునకు

తగిలి అతడు గతప్రాణుడయ్యెను. అంతట వాయువు మృతుడగు పుత్రుని ఒకగుహాలోనికి తీసుకొనిపోయి దుఃఖించసాగెను. దానితో ప్రపంచమందలి వాయువు స్తంభించి సర్వకార్యములు నిలచిపోయినవి. అంతట ప్రజాపతి ఇంద్రాదులను వెంటనిడుకొని వాయువును సమీపించి ఆంజనేయుని చేతితో నిమురగా అతడు పునర్జీవితుడయ్యెను. ముదితుడయిన వాయువు పునః తనవ్యాపారమును తాను కొనసాగించెను. అంతట బ్రహ్మ భవిష్యత్తు నూహించి హనుమంతునకు చిరంజీవిత్వమును బ్రహ్మాస్త్రమువలనగాని, బ్రహ్మదండమువలనగాని భయము లేకుండునట్లును వరముల నిచ్చెను. ఇంద్రుడు వజ్రముచే మృత్యువు లేనట్లు వరమిచ్చెను.

యముడును, వరుణుడును, కుబేరుడును తమతమ అయుధములచే మృత్యువు లేనట్లు వరముల నిచ్చిరి. సూర్యుడు తనతేజస్సులో నూరవ భాగమును శాస్త్రవిద్యలను ప్రసాదించెను. ఇట్లు వరములబడసి విదిత సత్త్వుడై హనుమంతుడు మహర్షుల ఆశ్రమములందు ప్రవేశించి వారిని వానరచేష్టలచే బాధించుచుండగా మహర్షులందరును కొద్దికోపముతో నీశక్తిని నీవు మరచిపోవుదువుగాక. ఎవరయిన గుర్తుకు తెచ్చినప్పుడే స్వశక్తి నెరిగెదవుగాక అని శపించిరి. ఆకారణమున విస్మృతశక్తిసంపన్నుడై వాలి సుగ్రీవుని రాజ్యమునుండి తరిమినప్పుడు బదులుపలుకక ఊరుకొనినాడు. సముద్రతీరమున జాంబవంతుడు అతని శక్తిని జ్ఞప్తికి తెచ్చుటచే సాహసకృత్యముల నాచరించినాడు.

రావణః పరమప్రీత ఏవం లోకా మహాబలః
చకార స్వవశే రామ బభుజే స్వయ మేవ హి ॥

ఇట్లు రావణుడు తన అత్యమితబలపరాక్రమముల నుపయోగించి సర్వలోకములను వశపరచుకొని అత్యంతప్రీతితో సమస్తభోగభాగ్యములను అనుభవించెను.

ఏవం ప్రభావో రాజేంద్ర దశగ్రీవః సదేవాం ద్రజిత్
త్వయా వినిహతః సంఖ్యే రావణో లోకరావణః ॥

దశగ్రీవుని పరాక్రమ ప్రభావములు ఇంచువంటివి. సర్వలోకములను స్వీయ తేజముచే ఆక్రమించిన అతడు నీచే యుద్ధమున నిహతుడయినాడు. అతని పుత్రుడగు ఇంద్రజిత్తుయొక్క పరాక్రమముకూడ తెలిసినదిగదా !

మేఘనాద శ్చ నిహతో లక్ష్మణేన మహాత్మనః
కుంభకర్ణ శ్చ నిహతః త్వయా పర్వతసన్నిభః ॥

ఇంద్రజిద్బిరుదధారియగు మేఘనాదుని మహోత్సుడగు లక్ష్మణుడు వధించినాడు. పర్వతసన్నిభగాత్రుడగు కుంభకర్ణుడు నీచే నిహతుడయినాడు.

భవాన్నారాయణః పూర్వా జగతా మాదికృ ద్విభుః
త్వత్స్వరూప మిదం సర్వం జగత్ స్థావరజంగమం ॥

నీవు వారిని వధించుట అనగా అంత కష్టమయినపనిగాదు. సర్వ జగత్తులకు ఆదిభూతుడగు నీవు. జ్ఞానస్వరూపుడవు. ఈ స్థావరజంగమ రూపమయిన జగత్తంతయు నీ స్వరూపమే.

త్వన్నాభికమలోత్పన్నో బ్రహ్మా లోకపితామహాః
అగ్నిస్తే ముఖతో జాతో వాచా సహ రఘూత్తమ ॥

సమస్తలోకములకు సృష్టికర్తయై పితామహుడని పేరొందిన బ్రహ్మ నీ నాభిజనిత కమలమునుండి ఉత్పన్నమయినవాడు. సర్వదేవతలకు యజ్ఞాన్నముల నిడు అగ్ని నీవాక్కులయిన వేదములతో గలిసి భవన్ముఖతః వెలువడినవాడు.

బాహుభ్యాం లోకపాలాశ్చ శ్యక్షుభ్యాం చంద్రభాస్కరౌ
దిశ శ్చ విది శ్చైవ కర్ణాభ్యాం తే సముత్థితాః ॥

నీ బాహుద్వయమునుండి దిక్పాలు పుదయించినారు. నేత్రద్వయము చంద్రసూర్యద్వయమునకు జనకమయినది. ప్రధాన దిశలు, అప్రధాన దిశలు కూడ నీ కర్ణములనుండి ఉత్పన్నము లయినవి.

ఘ్రాణా త్ప్రాణాః సముత్పన్న శ్చాశ్వినౌ దేవసత్తమౌ
జంఘాజానూరుజఘనా ద్భువర్లోకాదయో ఽభవన్॥

నీ ఘ్రాణేంద్రియమునుండి ప్రాణము ఉద్భవిల్లినది. అశ్వినీదేవతలును నీ ఘ్రాణేంద్రియమునుండియే జనించిరి. నీ జఘనులు (పిక్కలు) జానువులు (మోకాళ్ళు) ఊరువులు (తొడలు) జఘనము– వీటినుండి భువర్లోక సువర్లోకాదులు ఉద్భవించినవి.

కుక్షి దేశా త్సముత్పన్నా శ్చత్వారః సాగరాస్తథా
స్తనాభ్యా మింద్రవరుణౌ బాలఖిల్యా శ్చ రేతసః॥

కుక్షిప్రదేశమునుండి చతుఃసాగరములు జనించినవి. నీ స్తనములను ఇంద్రవరుణులు, రేతస్సునుండి వాలఖిల్యాది మహర్షులు ఉద్భవిల్లినారు.

మేఢ్రా ద్వామో గుదా న్మృత్యు ర్మనో ర్ముద స్త్రిలోచనః
అస్థిభ్యః పర్వతా జాతాః కేశేభ్యో మేఘసంహతిః
ఓషధ్య స్త్వఙ్లోమభ్యో నఖేభ్య శ్చ ఖగాదయః॥

మేఢ్రావయవమునుండి యముడును, గుదమునుండి మృత్యువును జన్మించిరి. నీ కోపమే త్రిలోచనుడగు రుద్రుడుగా రూపొందినది. నీ అస్థులు పర్వతములయినవి. కేశములు మేఘపటలము లయినవి. నీ రోమములనుండి ఓషధులు జనించినవి. నఖములనుండి గాడిదలు మొదలగు జంతువులు ఉద్భవిల్లినవి.

త్వం విశ్వరూపః పురుషో మాయాశక్తిసమన్వితః
నానారూప ఇవాఽఽభాసి గుణవ్యతికరే సతి॥

ఇది నీ విరాట్స్వరూపము. అనగా నీవు విశ్వస్వరూపుడవు. నీవు వాస్తవమునకు నిర్గుణుడవు, నిర్లిప్తుడవు, నిరాకారుడవు అయియుండియు మాయాశక్తితో గూడియుండి దానియందలి సత్వరజస్తమములలో వ్యతిరేకము కలుగగా అనేకరూపములు కలవానివలె భాసించుచున్నావు.

త్వా మాశ్ర త్యేవ విబుధాః పిబ న్త్యమృత మధ్వరే
త్వయా సృష్ట మిదం సర్వం విశ్వం స్థావరజంగమం ॥

దేవతలు నీబలము నాశ్రయించుకొనియే యజ్ఞములందు హవిస్సులను భుజించుచున్నారు. అనగా సర్వదేవతలకుగూడ ఆశ్రయభూతుడవని భావము. చరాచరరూపమయిన ఈ సమస్త బ్రహ్మాండసృష్టియును నీచే ఒనరింపబడినదే.

త్వా మాశ్రి త్యైవ జీవంతి సర్వే స్థావరజంగమాః
త్వదృ్యక్త మఖిలం వస్తు వ్యవహారో ఽపి రాఘవ ॥

ఈ స్థావరజంగమాత్మకములయిన వస్తువులన్నియు నిన్నాశ్రయించుకొనియే జీవించుచున్నవి. పరమాత్మ చైతన్యస్వరూపుడై అన్నిటియందు వ్యాపించియుండుటచే అతనిని ఆశ్రయించుకొనని జీవము లేదని భావము. ఈ జగద్వస్తువు లన్నియు నీ దివ్యశక్తిప్రభావితములే. అంతేగాక జగద్వ్యవహారమంతయునుగూడ నీవలననే జరుగుచున్నది.

క్షీరమధ్య గతం సర్పి ర్యథా వ్యాప్యాఖిలం పయః
త్వద్భాసా భాస్యతే ఽఖండి ర్నత్వం తే నాభిభాస్యసే ॥

పాలలోని నేయి అంతటను వ్యాపించియుండునట్లుగనే చైతన్యస్వరూపుడవగు నీవు జగత్తునందంతటను వ్యాపించియున్నావు. "ఏకో దేవః సర్వభూతేషు గూఢః" అను శ్రుతిగూడ దీనినే ప్రతిపాదించుచున్నది. లోకమునకు ప్రకాశమునొసగు సూర్యుడు, అగ్ని మొదలగునవన్నియునుకూడ నీ చిన్మాత్రచేతనే ప్రకాశవంతములగుచున్నవి. "న తత్ర సూర్యో భాతి న చచంద్ర తారకా నేమా విద్యుతో భాంతి కుతో ఽయ మగ్నిః, తమేవ భాంతమనుభాతి సర్వం తస్య భాసా సర్వమిదం విభాతి." అను కఠశ్రుతి భావమిదియే.

సర్వగం నిత్య మేకం త్వాం జ్ఞానచక్షు ర్విలోకయేత్
నాజ్ఞానచక్షు స్త్వాం పశ్యే దన్ధదృగ్ భాస్కరం యథా ॥

సర్వవస్తుగతుడవు, నిత్యుడవు అగు నిన్ను నిరంతర మనననిధి ధ్యాసాప్రాప్తమయిన జ్ఞానసేత్రముగలవాడు దర్శింపగలడు. గ్రుడ్డివాడు సూర్యునికళ్ళతో చూడలేనట్లుగా అజ్ఞానసేత్రుడు నిన్ను దర్శించ జాలడు.

యోగిన స్త్వాం విచిన్వంతి స్వదేహే పరమేశ్వరమ్
అతన్నిరసనముఖై ర్వేదశీర్షై రహర్నిశమ్ ॥

యోగీశ్వరులు పరమేశ్వరుడవగు నిన్ను తమదేహాములయందే వెదుకుదురు. వారు ఉపనిషద్వాక్యములను నిత్యము మనన మొనర్చి కొనుచు జడమగు వస్తుజగత్తును 'నేతి నేతి' అను వాక్యములతో నిరసించుచు చివరకు సర్వప్రకాశకుడవగు నీ స్వరూపమును గ్రహింపగలుగుదురు.

దేహమం దభిమానమున్నంతవరకు నీవు శరీరములోనుండియు ప్రకాశమునకు రావు. ఉపనిషత్తుల మననముచే దేహాదులయందలి అభిమానము నశించగా నిర్మలాకాశమందు సూర్యునివలె నీవు బుద్ధియందు ప్రకాశించుదువు అని భావము.

త్వత్పాదభక్తిలేశేన గృహీతా యది యోగినః
విచిన్వన్తో హి పశ్యన్తి చిన్మాత్రం త్వాం న చాన్యథా ॥

అయితే ఆయోగులును ఏమాత్రమయిన నీయందు భక్తితత్పరులై యుండినచో వారి మననము సార్థకమై చైతన్యప్రకాశమును గ్రహించగలదు. లేనిచో వారికిని ఆత్మస్వరూపసందర్శనము అయథార్థమే కాగలదు.

ఇట్లు అగస్త్యుడు శ్రీరాముని విరాట్స్వరూపమును, సర్వమయత్వమును ప్రస్తుతించి తన అహంభావరాహిత్యమును ప్రకటించుకొనుచున్నాడు.

మయా ప్రలపితం కించిత్ సర్వజ్ఞస్య తవాగ్రతః
క్షంతు మర్హసి దేవేశ తవానుగ్రహభాగహమ్ ॥

రామా ! నీవు సర్వజ్ఞుడవు. అట్టి నీయెదుట నేను ఏదో తెలిసినవానివలె ప్రలాపముల బలికితిని. నేను నీ అనుగ్రహమునకు పాత్రుడను కాదగినవాడను. కాన నా యీ చాపల్యమును క్షమించగలవు.

దిగ్దేహకాలపరిహీన మనన్య మేకం
చిన్మాత్ర మక్షర మజం చలనాదిహీనం
సర్వజ్ఞ మీశ్వర మనంతగుణవ్యుదస్త
మాయం భజే రఘుపతిం భజతా మభిన్నమ్ ॥

శ్రీరాముడు దిక్కులు, దేహము, కాలము మొదలగువాటిచే పరిచ్ఛిన్నుడుగాక స్వతంత్రుడు. సజాతీయ విజాతీయ స్వగతభేద శూన్యుడు అయినవాడు. చైతన్యస్వరూపుడై సర్వమును ప్రకాశింప జేయువాడు. క్షయరహితుడు. పుట్టుక లేనివాడు. చలనాదిక్రియారహితుడు. సర్వము తెలిసినవాడు. సర్వమునకు ప్రభువైనవాడు. అనంత గుణగణ్రాజమానుడు. మాయను పూర్తిగ నిరాకరించినవాడు. అట్టి శ్రీరాముని భజించెదను.

తృతీయసర్గ

శ్రీరాముడు అగస్త్యముఖమున రావణేంద్రజిత్తుల చరిత్రమును విని వానరాధిపులగు వాలిసుగ్రీవుల జన్మచరితమును వినగోరువాడై ప్రశ్నించుచున్నాడు.

శ్రీ రా మ ఉ వా చ :—

వాలిసుగ్రీవయో ర్జన్మ శ్రోతు మిచ్ఛామి తత్వతః
రవీంద్రౌ వానరాకారౌ జజ్ఞాతే ఇతి న శ్రుతం ॥

మహర్షీ ! సూర్యుడు దేవేంద్రుడు వీరిద్దరును కపిస్వరూపులగు సుగ్రీవ వాలులను కనిరి అని వింటిమి. దేవతలగువారు ఎట్లు వానర రూపులకు తండ్రు లయిరి ? వాలిసుగ్రీవుల జన్మప్రకార మెట్టిదియో వినగోరుచున్నాను.

అ గ స్త్య ఉ వా చ,:—

మేరోశ్శ్వర్ణమయ స్యాద్రే ర్మధ్యశృంగే మణిప్రభే
తస్మిన్ సభా స్తే విస్తీర్ణా బ్రహ్మణః శతయోజనా ॥

స్వర్ణమయమగు మేరుపర్వతము సర్వదేవతలకు నివాసస్థానము. ఆ పర్వతశిఖరములలో మధ్యశిఖరము మణికాంతులతో అత్యంతసుందర మయినది. ఆ శిఖరమునందు బ్రహ్మదేవుని శతయోజనవిస్తారమయిన సభాభవన మున్నది.

తస్యాం చతుర్ముఖః సాక్షాత్ కదాచిత్ యోగమాస్థితః
నేత్రాభ్యాం పతితం పతితం దివ్య మానందసలిలం బహు ॥

ఒకప్పుడు సర్వసృష్టికర్తయగు చతుర్ముఖుడు ఆ సభాభవనమున ధ్యానయోగము నాశ్రయించి కమలాసనమును అధిష్ఠించియుండెను. అసమయమున అతని బ్రహ్మానందానుభవము కలిగినది. ఆయనుభవ విశేషమున సాత్వికభావ ముప్పతిల్లి ఆనందాశ్రువులు రాలినవి.

తద్గృహీత్వా కరే బ్రహ్మా ధ్యాత్వా కించి త్తదా ఽసృజత్
భూమౌ పతితమాత్రేణ తస్మా జ్జాతో మహాకపిః ॥

బ్రహ్మ ఆయాసపులను క్రిందపడకుండా హస్తమునబట్టి తను వాత యేదో ఆలోచించి భూమిపై విడచెను. ఆకన్నీరు భూమిని స్పృశించిన మాత్రమునచే ఒక మహానుభావ స్వరూపుడగు వానరుడు జనించెను.

త మాహ బ్రహ్మణో వత్స కించిత్కాలం వసాత్ర మే
సమీపే సర్వసోభాఢ్యే తతః శ్రేయో భవిష్యతి
ఇ త్యుక్తో న్యవస త్తత్ర బ్రహ్మణా వానరోత్తమః ॥

ఆకపి జనించి తనయెదుట నిలువగనే బ్రహ్మ "వత్సా! నీవు కొంతకాలము ఈప్రాంతమునచే ప్రవర్తిల్లుము. దానివలన నీకు శుభములు సమకూరును." అని ఆజ్ఞాపించెను. బ్రహ్మ ఇట్లు పలికించగనే వానరోత్తము డామాటల ననుసరించి అక్కడనే నివసించసాగెను.

ఏవం బహుతిథే కాలే గతే బుక్షాధిపః సుధీః
కదా చి త్పర్యట న్నద్రౌ ఫలమూలార్థ ముద్యతః
అపశ్య ద్దివ్యసలిలాం వాపీం మణిశిలాన్వితామ్॥

అనేకసంవత్సరములు ఆ వానరోత్తముడు బ్రహ్మసన్నిధమున నివసించినాడు. ఒకనాడు ఫలములను భక్షించుకోరికతో మేరుపర్వత స్థలములగు వనములలో పర్యటించుచు ఉత్తరముగా పోయి అక్కడి శిఖరమున దివ్యములగు మణిశిలలచే శోభించుచున్న సలిలాశయము నొక దానిని దర్శించెను.

వానీయం పాతు మాగచ్ఛ త్తత్ర చ్ఛాయామయం కపిమ్
దృష్ట్వా ప్రతి కపిం మత్వా నిపపాత జలాంతరే॥

ఆకపి ఫలమూలములను భక్షించి దాహమును తీర్చుకొనుటకై ఆసరోవరమునకు వచ్చి నీరుత్రాగుటకు వంగిచూచి అద్దమువలెనున్న నీటిలో తన ప్రతిబింబమును జూచెను. చూచి అది మరియొక వానర మని భ్రమించి వానిని పట్టుకొనుటకై నీటిలో దుమికెను.

త త్రాదృష్ట్వా హరిం శీఘ్రం పున రుత్పత్య వానరః
అపశ్య త్సుందరీ కామాం మాత్మానం విస్మయం గతః॥

కాని నీటిలో అతనికి వానరము కన్పించకపోవుసరికి శీఘ్రముగా జలమునుండి పైకివచ్చెను. కాని ఇంతలో ఒక విచిత్రము జరిగినది. అతడు తన శరీరమును పరిశీలించుసరికి మనోహరమగు నారీమణిగా మారియున్నాడు. తన ఈస్వరూపమును చూచుకొనుసరికి అతనికి అత్యంతవిస్మయము కలిగినది.

ఆసుందరి శరీరము లావణ్యాలలితమై విస్తీర్ణ జఘనము, వంపులు దిరిగిన కనుబొమలు, అలినీలకుంతలములు, ముగ్ధసస్మిక వక్త్రము, పీన స్తనతటములు కలిగి తిన్నని యష్టిగల లతవలె శోభించుచున్నదని వాల్మీకి వర్ణించినాడు.

తతః సురేశో దేవేశం పూజయిత్వా చతుర్ముఖం
గచ్ఛ న్మధ్యాహ్నసమయే దృష్ట్వా నారీం మనోరమాం
కందర్పశరవిద్ధాంగ స్త్యక్త్వా వీర్య ముత్తమం ॥

అంతట దేవేంద్రుడు పితామహుని పూజించి అమరావతికి పోవుచు ఆసలిలాశయమార్గమునకు వచ్చినాడు. అది మధ్యాహ్నసమయము. సలిలాశయతీరమున త్రిలోకసుందరియగు స్త్రీ కన్పించుసరికి మన్మథబాణము లతని హృదయమును వేధించినవి. కామోద్రేకమున వీర్యము స్ఖలించినది.

త మ్రపా పైవ త ద్బీజం బాలదేశే ఒపత ద్భువి
వాలీ సమభవ త్తత్ర శక్రతుల్యపరాక్రమః
తస్య గత్వా సురేశానః స్వర్ణమాలాం దివం గతః॥

ఇంద్రు డాస్త్రీతో సంగమింపకనే విడిచిన ఆవీర్యము ఆమె యొక్క శిరోకేశములపైబడి జారి భూమిపైబడెను. అంతట ఆవీర్యము నుండి వాలి జనించెను. దేవేంద్రుడును ఆ తనపుత్రునకు ఒక సువర్ణ మాలికను దివ్యప్రభావముగలదాని నిచ్చి అమరావతికి వెడలిపోయెను.

భానురప్యాగత స్తత్ర తదానీ మేవ భామినీమ్
దృష్ట్వా కామవశో భూత్వా గ్రీవాదేశే ఒసృజ న్మహాత్

బీజం తస్యా స్తతః సద్యో మహాకాయో ఽభవ ద్భరిః
తస్య దత్వా హనూమంతం సహాయార్థం గతో రవిః॥

ఇంతలో ఆసుందరియున్న ప్రదేశమునకు సూర్యుడును వచ్చెను. అతనికిని ఆమెను చూడగనే వీర్యస్ఖలనము జరిగినది. అది ఆమెయొక్క కంఠదేశమున పడి క్రిందపడినది. దానినుండి ఒక మహాకాయుడగు వానర పుంగవుడు జనించెను, అతడే సుగ్రీవుడు. సూర్యుడు ఆ తనపుత్రునకు తోడుగా తన శిష్యుడగు హనుమంతుని ఇచ్చి తనదారిని పోయెను.

పుత్రద్వయం సమాదాయ గత్వా సా నిర్ఋతా క్వచిత్
ప్రభాతే ఽపశ్య దాత్మానం పూర్వవ ద్వానరాకృతిమ్॥

తరువాత ఆసుందరి తనపుత్రుల నిరువురను వెంటనిడుకొని స్వస్థానమునకు బోవుచు మార్గమధ్యమున రాత్రివేళ సంప్రాప్తింపగా ఒక చోట నిద్రించినడ. తెల్లవారగనే లేచి తన శరీరమును చూచుకొనునప్పటికి ఆశ్చర్యముగా స్త్రీరూపముపోయి ఎప్పటి వానరాకృతి ప్రాప్తించుటను జూచుకొనెను.

ఫలమూలాదిభి స్సాస్థం పుత్రాభ్యాం సహితః కపిః
నత్వా చతుర్ముఖ స్యాగ్రే బుక్షరాజః స్థితః సుధీః॥

అంతట ఫలమూలాదులను గ్రహించి పుత్రులతోగూడ ఆవానరోత్తముడు చతుర్ముఖుని సమీపించి నమస్కరించి నిలబడెను.

తతో ఽబ్రవీ త్యమాశ్వాస్య బహుశః కపికుంజరమ్
తత్రైకం దేవతాదూత మాహూ యామరసన్నిభమ్ ॥

అంతట చతుర్ముఖుడు అనేకములగు వచనములను బలికి ఆకపిశ్రేష్ఠునకు ధైర్యమును చెప్పెను. తరువాత దేవతాసన్నిభుడగు దూతనొకనిని పిలిచి ఇట్లు పలికెను.

గచ్ఛ దూత మాయా ఽదిష్టో గృహీత్వా వానరోత్తమమ్
కిష్కింధ్యాం దివ్యనగరీం నిర్మితాం విశ్వకర్మణా
సర్వసౌభాగ్యవలితాం దేవై రపి మహాసదాం॥

దూతా! నీవు నాఆజ్ఞానుసారము విశ్వకర్మచే నిర్మితమయిన దివ్యనగరమునకు ఈవానరశ్రేష్ఠుని పుత్రులతోగూడ కొనిపొమ్ము. ఆ నగరము సర్వదివ్యసౌఖ్యములకును ఆటపట్టయినది. దేవతలుగూడ తేరి జూడజాలనిది.

తస్యాం సింహాసనే వీరం రాజాన మభిషేచయ
సప్తద్వీపగతా యే యే వానరాః సన్తి దుర్జయాః
సర్వే తే ఋక్షరాజస్య భవిష్యన్తి వశేఽనుగాః॥

ఆనగరమున దివ్యసింహాసనమున ఈతనిని సర్వవానరచక్రవర్తిగా అభిషేకించుము. సప్తద్వీపపరీతమయిన భూమండలమందున్న అరిదుర్జయులగు వానరు లెల్లరును ఈతని అధీనమున సంచరించునట్లుగా నా శాసనమును ప్రకటించుము.

యదా నారాయణః సాక్షా ద్రామో భూత్వా సనాతనః
భూభారసురనాశాయ సంభవిష్యతి భూతలే
తదా సర్వే సహాయార్థే తస్య గచ్ఛన్తు వానరాః॥

భవిష్యత్తు సనాతనుడగు నారాయణుడు దుష్టశిక్షణమునకై దశరథరామరూపమున అవతరించగలడు. ఆసమయమున కిష్కింధాధిపతి పాలనక్రిందనున్న ఈ వానరు లందరును అతనికి సహాయభూతులు కాగలరు.

ఇత్యుక్తో బ్రాహ్మణా దూతో దేవానాం స మహామతిః
యథాజ్ఞప్తః తథా చక్రే బ్రహ్మణా తం హరీశ్వరమ్॥

ప్రజాపతి ఇట్లు ఆజ్ఞాపించగనే మతిమంతుడగు ఆ దేవదూత ఆవానర శ్రేష్ఠుని కిష్కింధకు కొనిపోయి సర్వవానర సామ్రాజ్యాధిపతిగా అభిషేకించెను.

దేవదూత స్తతో గత్వా బ్రహ్మణే తన్న్యవేదయత్
తదాది వానరాణాం సా కిష్కిం ధ్యాఽభూ న్నృపాశ్రయః॥

అంతట దేవదూత తిరిగి చతుర్ముఖుని కీవార్తను నివేదించెను. అప్పటినుండి కిష్కింధానగరము వానరచక్రవర్తులకు రాజధాని అయినది.

సర్వేశ్వర స్త్వ మేవాఽసీ రిదానీం బ్రహ్మణాఽర్థితః
భూమే ర్భారో హృతః కృత్స్న స్త్వయా లీలా నృదేహినా॥

ఆతరువాత బ్రహ్మచే ప్రార్థితుడవై సర్వేశ్వరుడవగు నీవు భూభారహరణార్థమై జనించి లీలామానుషవిగ్రహుడవై అవతరించి అవతారప్రయోజనమును నిర్వర్తించితివి.

సర్వభూతాంతరస్థస్య నిత్యముక్తచిదాత్మనః
అఖండానందరూపస్య క్రియా నేష పరాక్రమః॥

నీవు సామాన్యమానవుడవుగావు. ఈ సమస్తబ్రహ్మాండము లందును వసించు స్థావరజంగమరూపమయిన వస్తువులలోను నివసించు వాడవు. నిత్యము ముక్తావస్థలోనుండి బంధనము లేవియు లేనివాడవు. సర్వప్రకాశకుడవు. అఖండసచ్చిదానందస్వరూపుడవు అట్టి నీకు ఈ రావణాదులను వధించుట ఏమంత కష్టమగు విషయము.

తథాఽపి వర్ణ్యతే సద్భి ర్లీలామానుషరూపిణః
యశ స్తే సర్వలోకానాం పాపహ్యై సుఖాయ చ॥

అయినను సత్పురుషులు సర్వపాపములను హరించుచున దనుభావముచే నీ నిర్మల యశశ్చంద్రికలను వర్ణించెదరు. లీలామానుషవిగ్రహుడవగు నీ యశస్సు వాస్తవమునకు సర్వజగత్కల్మషములను హరించునది.

య ఇదం కీర్తయే న్నిత్యం వాలిసుగ్రీవయో ర్మహత్
జన్మ త్వదాశ్రయత్వాత్ సముచ్యతే సర్వపాతకైః॥

వాలిసుగ్రీవుల జన్మకు సంబంధించిన ఈ వృత్తాంతమును పఠించు మానవుడు సర్వపాతకవిముక్తుడు కాగలడు. వాలి సుగ్రీవులజీవితము నిన్నాశ్రయించుకొనియున్నదగుటచేతనే దానికా మహత్త్వము సంప్రాప్తించినది.

శ్రీరామచరితమునకు సంబంధించిన ఇతివృత్తము పావనమయిన దగుటచే ప్రశ్నించకపోయినను మరొకవిషయమును చెప్పెద ననుచున్నాడు–

అథాన్యాం సంప్రవక్ష్యామి కథాం రామ తదాశ్రయామ్
సీతాహృతా యదర్థం సా రావణేన దురాత్మనా ॥

రామా ! అందరును రావణుడు సీతను కామమోహితుడై అప హరించినాడని భావించుచున్నారు. కాని ఆ రావణకృత్యమునకు ఒక కారణమున్నది. దురాత్ముడే అయినను అతడు జానకిని ఎందులకు అప హరించెనో స్పష్టముగా తెలియుటకు ఒక ఇతివృత్తమున్నది.

పురాకృతయుగే రామ ప్రజాపతి సుతం విభుం
సనత్కుమార మేకాంతే సమాసీనం దశాననః
వినయావనతో భూత్వా హ్యభివా ద్యేద మబ్రవీత్ ॥

రామా ! పూర్వము కృతయుగమున దశాననుడు సృష్టికర్త యొక్క మానసపుత్రుడును, అఖండజ్ఞానస్వరూపుడును అగు సనత్కు మారుని ఏకాంతమున సమీపించి వినయవినమితోత్తమాంగుడై ప్రణ మిల్లి ఇట్లు పలికెను.

కో న్వస్మిన్ ప్రవరో లోకే దేవానాం బలవత్తరః
దేవా శ్చ యం సమాశ్రిత్య యుద్ధే శత్రుం జయంతి హి ॥

దేవా ! ఈ చరాచరమగు సమస్తజగత్తులోను దేవతలకంటె బలవత్తరమగు ఈశ్వరు డెవడు. ఇంద్రాదిదేవతలు ఏమహాశక్తిమంతుని ఆశ్రయించి యుద్ధమున శత్రువులను జయించగలుగుచున్నారు.

కం యజంతి ద్విజా నిత్యం కంధ్యాయంతి చ యోగినః
ఏత న్మేశంస భగవన్ ప్రశ్నం ప్రశ్నవిదాం వర ॥

నీవు జిజ్ఞాసులగు సర్వప్రశ్నలకును సమర్థముగా ఉత్తరము లిచ్చువారిలో శ్రేష్ఠుడవు. ఈ బ్రాహ్మణులు యజ్ఞవిధానమున ఎవనిని గూర్చి యజింతురు. యోగులు ఏ పరతత్త్వమునుగూర్చి ధ్యానించు దురు ? నా యీ సందేహములను నీవు తీర్చగలవని నమ్ముచున్నాను.

జ్ఞాత్వా తస్య హృది స్థం యత్ త దశేషేణ యోగదృక్
దశానన ముఖా చ్ఛేదం శృణు వక్ష్యామి పుత్రక ॥

యోగజ్ఞులలో శ్రేష్ఠుడగు సనత్కుమారుడు దివ్యదృష్టిచే రావణుని హృదయమందలి జిజ్ఞాసాప్రవృత్తిని తెలిసికొని "పుత్రా ! వినుమని ఇట్లు చెప్పదొడగెను.

భర్తా యో జగతాం నిత్యం యస్య జన్మాదికం న హి
సురాసురైర్ముతో నిత్యం హరిర్నారాయణో ఽవ్యయం ॥

సర్వజగత్సాపహారకుడగు నారాయణుడే నీ ప్రశ్నలకు సమాధాన మయినవాడు. అతడు సర్వజగత్తులకు పరిపాలకుడు. జన్మమరణాదులగు జీవధర్మములు లేనివాడు. సురలు, అసురలుకూడ అతనిని నిత్యము నుతించుచుందురు. అతడే నిత్యుడు.

యన్నాభిపంకజా జ్జాతో బ్రహ్మా విశ్వసృజాం పతిః
సృష్టం యేనైవ సకలం జగత్ స్థావరజంగమమ్ ॥

జగత్తునందలి జీవజాలమును సృష్టించిన నవప్రజాపతులకుకూడ ప్రభువైన బ్రహ్మ ఈ సకలసృష్టికిని కర్త. స్థావరజంగమరూపములయిన ప్రాణికోటులు అతని నిర్మాణమే. అట్టి చతుర్ముఖబ్రహ్మయు ఆనారాయణుని నాభికమలమునుండి ఉద్భవిల్లినాడు.

తం సమాశ్రిత్య విబుధా జయన్తి సమరే రిపూన్
యోగినో ధ్యానయోగేన త మే వానుజపన్తి హి ॥

సర్వజగత్కర్తయగు ఆనారాయణుని ఆశ్రయించియే దేవతలు యుద్ధరంగమున శత్రువులను జయింతురు. యోగీశ్వరులను ధ్యానయోగపరాయణులై అతనిని జపింతురు.

మహర్షే ర్వచనం శ్రుత్వా ప్రత్యువాచ దశాననః
దైత్యదానవరక్షాంసి విష్ణునా నిహతాని చ
తాం వా గతిం ప్రపద్యన్తే ప్రేత్యతే మునిపుంగవ ॥

సనత్కుమారుని వాక్యములనువిని దశాననుడు తిరిగి ఈవిధముగ ప్రశ్నించెను. "మహర్షీ ! విష్ణుసిహతులగు దైత్య దానవరాక్షసాదులు పొందుగతి యెట్టిది" అని.

త మువాచ మునిశ్రేష్ఠో రావణం రాక్షసాధిపమ్
దైవతై ర్నిహతా నిత్యం గత్వా స్వర్గ మనుత్తమం
భోగక్షయే పున స్తస్మాద్ భ్రష్టా భూమౌ భవంతి హి ॥

రాక్షసాధిపుడగు రావణునకు మునిశ్రేష్ఠుడగు సనత్కుమారుడు ఇట్లు బదులుపలికెను. నిత్యము ఇంద్రాదిదేవతలచే వధింపబడిన దైత్య దానవాదులు ఉత్తమమగు స్వర్గమును పొంది కొంతకాలము భోగముల ననుభవించి, భోగక్షయము కలుగగా భ్రష్టులై భూలోకమున జనించుచుందురు.

పూర్వార్జితైః పుణ్యపాపై ర్నియంతే చోద్భవంతి చ
విష్ణునా యే హతా స్తేతు ప్రాప్నువంతి హరే ర్గతిం ॥

వారును పూర్వజన్మల పుణ్యపాపఫలచోదితులై జన్మమరణముల ననుభవించుచుందురు. కాని సాక్షాన్నారాయణునిచే వధింపబడినవారు మాత్రము అట్లుగాదు. వారు అక్షయమగు హరిపదవినే పొందుదురు.

శ్రుత్వా మునిముఖా త్సర్వం రావణో హృష్టమానసః
యోత్స్యే ఽహం హరిణా సార్థ మితి చింతాపరో ఽభవత్ ॥

సనత్కుమారు డిట్లు విష్ణువుచే నిహతులగువారుపొందు గతిని గూర్చి వర్ణింపగా రావణుడు తనమనస్సులో "నేనును విష్ణువుతోడనే యుద్ధమొనరించెదను" అని భావించెను.

మనశ్చింతం పరిజ్ఞాత్వా రావణస్య మహామునిః
ఉవాచ వత్స తే ఽభీష్టం భవిష్యతి న సంశయః ॥

రావణుడు తన మనస్సులో భావించిన భావనను అవగతమొనరుచుకొని మహర్షి ఇట్లు పలికెను. వత్సా! నీ అభీష్టము నిస్సంశయముగా నెరవేరగలదు.

కం చి త్కాలం ప్రతీక్షస్వ సుఖీ భవ దశాననా
ఏవ ముక్త్వా మహాబాహో ర్మునిః పున రువాచ తం ॥

కొలదికాలముమాత్రము ఆరోజుకై ప్రతీక్షించుము. అంతవరకు సుఖముగా జీవితమును గడుపుము. రామా ! సనత్కుమారు డిట్లు చెప్పి ఇంకను అనియెను.

తస్య స్వరూపం వక్ష్యామి హ్యరూప స్యాపి మాయినః
స్థావరేషు చ సర్వేషు నదేషు చ నదీషు చ ॥

వాస్తవమునకు నారాయణుడు నామరూపాదిరహితుడు. అయి నను వ్యవహారమునకై మాయనంగీకరించి స్థావరములగు వృక్షలతా గుల్మాదులయందును, పర్వతములందును, నదీనదములందును వ్యాపించి యున్నాడు.

ఓంకార శ్చైవ సత్యం చ సావిత్రీ పృథివీ చ సః
సమస్తజగదాధారః శేషరూపధరో హి సః ॥

సర్వవేదమూలకారణమగు ఓంకారమును, సత్యస్వరూపమగు వాక్యమున్ను, సావిత్రి లేక గాయత్రియను మంత్రమున్ను, సర్వాధార మగు పృథివియున్ను, ఈ జగద్భారవాహకుడగు శేషుడున్ను అతడే. ఈ కారణముచేతనే ద్విజులు అతనిని నిత్యము జపింతురని భావము.

సర్వే దేవాః సముద్రా శ్చ కాలః సూర్య శ్చ చంద్రమాః
సూర్యో దేవో దివారాత్రి ర్యమ శ్చైవ తథా ఽనిలః ॥

సమస్తదేవతలు, సప్తసముద్రములును, కాలమున్ను జగచ్చ క్షువులయిన సూర్యచంద్రులున్ను, రాత్రిందివములున్ను, యముడును, అనిలుడున్ను – ఆ నారాయణుని స్వరూపములే.

అగ్ని రింద్ర స్తథా మృత్యుః పర్జన్యో వసవ స్తథా
బ్రహ్మ రుద్రాదయ శ్చైవ యే చాన్యే దేవదానవాః॥

అగ్ని, ఇంద్రుడు, మృత్యువు, పర్జన్యుడు, అష్టవసువులు, బ్రహ్మ, రుద్రుడు మొదలగువారును ఇంకను ఇతరులగు దేవదానవులును ఆ నారాయణునిస్వరూపులే.

విద్యోతతి జ్వాల త్యేష పాతి చా త్తితి విశ్వకృత్
క్రీడం కరో త్యవ్యయాత్మా సోయం విష్ణుః సనాతనః ॥

సనాతనుడగు ఈ విష్ణువే సూర్యచంద్రాదులను ప్రకాశవంతములనొనర్చును. అగ్నిముఖమున మండుచుండును. సర్వమును సంపాదించువాడును, సర్వమును భక్షించువాడును, విశ్వనిర్మాణ మొనరించువాడును అతడే. అతడే నాశనరహితుడగు ఆత్మస్వరూపుడు. "ఓంకారశ్చైన సత్యం చ" అను శ్లోకముతో ప్రారంభించి ఈ శ్లోకము వరకును పరాత్పరుని విరాట్స్వరూపము అభివర్ణితమయినది. అయితే ఈస్వరూపములు, ఈ కృత్యములు అతనికి క్రీడాసదృశములు.

తేన సర్వమిదం వ్యాప్తం త్రైలోక్యం స చరాచరమ్
నీలోత్పలదలశ్యామో విద్యుద్వర్ణాంబరావృతః॥

స్థావరజంగమాత్మకమయిన ఈ జగత్తంతయు ఆ విష్ణుదేవునిచే పరివ్యాప్తమయియున్నది. అతడు నీలోత్పలదళసదృశ శరీరకాంతియుతుడు. విద్యుద్వర్ణముగల వస్త్రమును ధరించినవాడు.

శుద్ధజాంబూనదప్రఖ్యాం శ్రియం వామాంకసంస్థితాం
సదాఽనపాయినీం దేవీం పశ్యన్నాలింగ్య తిష్ఠతి॥

పదారువన్నెల బంగారుమేనిఛాయతో నేత్రానందకరమయిన శ్రీదేవిని వామాంకమున నిత్యము కూర్చుండబెట్టుకొని తదాలింగన సుఖము ననుభవించుచుండును.

ద్రష్టుం న శక్యతే క్వాపి దేవదానవపన్నగైః
యస్య ప్రసాదం కురుతే స చైనం ద్రష్టు మర్హతి॥

శ్రీదేవీసహితుడగు విష్ణుదేవుని దేవదానవపన్నగాదులలో ఏ ఒక్కడు దర్శించ సమర్థుడుగాడు. ఎవనిపైనైనను ఆ మహాత్ముని కృపాకటాక్షము ప్రసరించినచో అతడు ఆ దివ్యమంగళవిగ్రహదర్శనానందము ననుభవింపగలడు.

న చ యజ్ఞైస్తపోభి ర్వా న దానాధ్యయనాదిభిః
శక్యతే భగవాన్ ద్రష్టు ముపాయైరితరైరపి॥

వేదోక్తములగు యజ్ఞాదుల నాచరించుటవలనగాని నిరంతర దానాధ్యయనాదులవలనగాని లేక ఇంకను ఇతరములగు ఏ యుపాయము

ములచేతనుగాని భగవంతునిచూచుట అసంభవము.

తద్భక్తై స్తద్గతప్రాణై స్తచ్చిత్తై ర్ధూతకల్మషైః
శక్యతే భగవా న్విష్ణు ర్వేదాంతామలచక్షుషిభిః॥

అయితే ఆపరాత్పరుని దర్శించుటకు కొన్నిమార్గము లున్నవి. ఎవరయినను అన్యములగు వస్తువులపై మోహమును విడచి ఆపరాత్పరునే ప్రాణములుగా నమ్మి చిత్తములో అతనిరూపమునే స్మరించుచుండినచో వారు భక్తులనబడుదురు. ఆ భక్తుల చిత్తములు పరిమార్జితకల్మషములుగా నుండును. అట్టివారు శ్రీయఃపతిని దర్శించగలరు. అంతేగాక వేదాంతములందు చెప్పబడినరీతిని తత్త్వాన్వేషణతత్పరులయినచో వారును అతని దర్శించగలరు.

యథా వా దృష్టు మిచ్ఛా తే శృణు త్వం పరమేశ్వరం
శ్రేతాముఖే స దేవేశో భవితా నృపవిగ్రహః॥

నీచిత్తమునందు ఆపరాత్పరుని దర్శించుకోరికయున్నదేని దాని కొక అవకాశము నీకు కలుగగలదు. వినుము. శ్రేతాముఖమున ఆ నారాయణుడు మానవరాజరూపమున అవతరించగలడు.

హితార్థం దేవమర్త్యా నాం ఇక్ష్వాకూణాం కులే హరిః
రామో దాశరథి ర్భూత్వా మహాసత్వపరాక్రమః॥

ఆతడు దేవతలయొక్కయు, మానవులయొక్కయు హితమునుద్దేశించి యిక్ష్వాకుకులమున దశరథమహారాజుయొక్క పుత్రుడుగా జనించి రాముడను పేరున సత్యపరాక్రముడై ప్రసిద్ధిసందును.

పితు ర్నియోగా త్తద్భ్రాతా భార్యయా దండకావనే
విచరిష్యతి ధర్మాత్మా జగన్మాత్రా స్వమాయయా॥

అతడు తండ్రియొక్క అనుజ్ఞ ననుసరించి సోదరుడగు లక్ష్మణుని తోడను, భార్యయగు జానకితోడను దండకవనమున సంచరించగలడు. ఆ జానకి నారాయణుని మాయయగు జగన్మాతయే.

ఏవం తే సర్వ మాఖ్యాతం మయా రావణ విస్తరాత్
భజస్వ భక్తిభావేన తదా రామం శ్రియా యుతం॥

శ్రీరాముని జన్మాదులనుగూర్చియు, విష్ణుదేవుని స్వరూపమును గూర్చియు నీకు విస్తారముగా చెప్పియున్నాను. కనుక వనవాసకాల మున లక్ష్మీయుతుడగు రాముని సేవించి తరించుము.

ఏవం శ్రుత్వా ఽసురాధ్యక్షో ధ్యాత్వా కించి ద్విచార్య చ
త్వయా సహ విరోధేపు ర్మముదే రావణో మహాన్॥

అసురచక్రవర్తి రావణుడు సనత్కుమారుని వచనములను విని కొలదిక్షణములు ఏదో విచారించినాడు. అతడు నీతో విరోధించి ముక్తిపొందునుగాక అని నిర్ణయమునకువచ్చి ఆనందనిమగ్నుడయ్యెను.

యుద్ధార్థీ సర్వతో లోకాన్ పర్యటన్ సమవస్థితః
ఏత దర్థం మహారాజ రావణో ఽతీవ బుద్ధిమాన్
హృతవా జ్ఞానకీం దేవీం త్వయా త్మవధకాంక్షయా॥

ఆ తరువాత సనత్కుమారుని వీడ్కొని రావణుడు యుద్ధార్థియై సమస్తలోకములందును సంచరించినాడు. లోకములను బాధించుటలోని ముఖ్యోద్దేశము విష్ణునిలో శత్రుత్వమును కొనితెచ్చుకొనుటకే అని భావము. మహారాజ! రావణుడు అసామాన్యమగు బుద్ధివైభవము గలవాడు. నీతో వైరమును కొనితెచ్చుకొని ముక్తినందుటకే జానకిని అపహరించినాడు.

ఇమాం కథాం యః శృణుయాత్ పఠే ద్వా
సంశ్రావయే ద్వా శ్రవణార్థిత స్సదా
ఆయుష్య మారోగ్య మనంతసౌఖ్యం
ప్రాప్నోతి లాభం ధన మక్షయం చ॥

రావణసనత్కుమార సంవాదరూపమయిన ఈ వృత్తాంతము నెవడైనను విన్నగాని, పఠించినగాని, వినగోరువానికి చదివివినిపించిన గాని ఆయురారోగ్యములను, అనంతసౌఖ్యములను పొందుదురు. అక్షయమగు ధనలాభము కలుగును.

★

చతుర్థ సర్గ

శ్రీ మహాదేవ ఉవాచ :—

ఏకదా బ్రహ్మణో లోకాదాయాంతం నారదం మునిం
పర్యటన్ రావణో లోకాన్ దృష్ట్వా న త్వా2బ్రవీద్వచః॥

రావణుడు ఇంద్రాదిదిక్పాలురను, కాలకేయాదిదైత్యదానవులను, అనరణ్యాది మానవమహీపతులను, జయించి తనను ఎదిరించగలవారిని గానక పర్యటించుచుండగా, అతనికి ఒకనాడు బ్రహ్మలోకము నుండి వచ్చుచున్న దేవర్షి నారదుడు కన్పించెను. మహర్షిని చూడగనే రావణుడు వినయవినమితోత్తమాంగుడై అభివందనము లాచరించి ఇట్లు పలికెను.

భగవన్ బ్రూహి మే యోద్ధుం కుత్రసంతి మహాబలాః
యోద్ధు మిచ్ఛామి బలిభిస్త్వం జానాసి జగత్త్రయం॥

భగవంతుడా! నేను చిరకాలమునుండి బలశాలురతో యుద్ధ మొనరించుటకై లోకములలో పర్యటించుచుంటిని. కాని నాకు బలశాలురగు యోధులు కన్పించుటలేదు. నీవు త్రిలోకములందును నిర్భయముగా నిరంతరము సంచరించుచుందువాడవు. ఎచ్చటనయినను నాతో యుద్ధముచేయగల వీరులున్న చో వచింపుము.

మునిర్ధ్యా త్వా ఽఽహ సుచిరం శ్వేతద్వీపనివాసినః
మహాబలా మహాకాయా స్త్రయస్తత్ర మహామతే॥

రావణుని వాక్యములను విని నారదుడు చాలసేపు ఆలోచించినాడు. తరువాత అతడు రావణునకు ఇట్లనినాడు– రావణా! క్షీరసముద్రమున శ్వేతద్వీపమను ఒక దీవి యున్నది. ఆ ద్వీపమునందు నివసించువారలు మహాబలులు. ఆ బలమునకు తగ్గ శరీరప్రమాణముగలవారు.

విష్ణుపూజా రతా యే వై విష్ణునా నిహతాశ్చయే
త యేవ తత్ర సంజాతా అజేయాశ్చ సురాసురైః॥

పుట్టినది మొదలు చనిపోవువరకును విష్ణుపూజా నిరతులయిన వారును, జీవితకాలమునం దంతటను విష్ణుని ద్వేషించి చివరకు అతనిచే వధింపబడిన దైత్యదానవాదివీరులును క్షీరసముద్రమునందున్న ఆ శ్వేత ద్వీపములో జన్మించినారు. ఆ ద్వీపవాసులందరును సురలకు అసురల కునుకూడ జయింప శక్యముకానివారలు.

శ్రుత్వా తద్రావణో వేగా న్మంత్రిభిః పుష్పకేణతా
యోద్ధుకామః సమాగత్య శ్వేతద్వీప సమీపత॥

రావణుడు నారదుని వాక్యములను వినిన తక్షణమే మంత్రులతో గూడి పుష్పకము నధిరోహించి శ్వేతద్వీపవాసులతో యుద్ధమొనరించు తలంపుతో ఆ ద్వీపమునకు చేరెను.

తత్ప్రభా హత తేజస్కం పుష్పకం నా చలత్తతః
త్యక్త్వా విమానం ప్రయయా మంత్రిణశ్చ దశాననః॥

కాని ఆద్వీపము దివ్యప్రభావసంపన్నమయినది. ఆ కారణమున పుష్పకవిమానము గత మహత్త్వకమై నిలిచిపోయినది. ఆ విషయ మును గ్రహించిన దశాననుడు మంత్రులతోగూడ విమానము నవ రోహించి పాదచారియై ద్వీపములో ప్రవేశించెను.

ప్రవిశన్నేవ తద్ద్వీపం ధృతో హస్తేన యోషితా
పృష్ట శ్చ త్వం కుతః కోఽసి ప్రేషితః కేనవావద॥

రావణుడు ఆద్వీపములో ప్రవేశించగనే ఒక స్త్రీ అతని చేతితో పట్టుకొని "నీవు ఎవడవు? ఎక్కడ నుండివాడవు? ఎవడు నిన్నిక్క డకు పంపినాడు" అను ప్రశ్నలను వైచినది.

ఇత్యుక్తో లీలయా స్త్రీభిః హసంతీభిః పునః పునః
కృచ్ఛా ద్ధృత్తో ద్వినిర్ముక్త స్తాసాం స్త్రీణాం దశాననః
ఆశ్చర్య మతులం లబ్ధ్వా చింతయామాస దుర్మతిః॥

ఇట్లు ప్రశ్నించుచుండగనే ఆస్థలమునకు అనేకులగు స్త్రీలు చేరి నారు. వారు రావణునిజూచి పరిహరించుచు ప్రశ్నించసాగిరి. ఎట్ట

కేలకు అతికష్టమువీాదగాని ఆస్త్రీలు రావణుని వదలలేదు. చివరకు పిడివడినాడు. అంతట అతడు ఆస్త్రీల అసమాన శక్తి సామర్థ్యములకు చకితుడై ఇట్లు చింతించెను.

విష్ణునా నిహతో భూమి వైకుంఠ మితి నిశ్చితం
మయి విష్ణుర్యథాకుప్యా న్నథా కార్యంకరోమ్యహం
ఇతని నిశ్చిత్య వైదేహీం జహార విపినే ఒసురః॥

నేనుకూడ విష్ణువుచే వధింపబడి ఆతని స్థానమయిన వైకుంఠమును పొందుదునుగాక ! ఈ ప్రయోజనమును సాధించుటకై విష్ణువు కోప గించు కార్యముల నొనర్పవలెను. ఇట్లు నిశ్చయించుకొని దశాననుడు అరణ్యమునన్న వైదేహిని రహస్యముగా అపహరించినాడు.

జాన న్నేవ పరాత్మానం సజహారావనీ సుతామ్
మాతృవత్పాలియామాస త్వాత్తః కాంక్ష వధం స్వతః॥

అతడు నిన్ను సర్వజగదాధారుడవగు పరమాత్మగా భావించియే నీచే మృత్యువును కోరినవాడై సీతను హరించి ఆమెను మనస్సులో తల్లి వలె భావించి అశోకవనమున నుంచినాడు.

రామ త్వం పరమేశ్వరో ఒసి సకలం జానాసి విజ్ఞానదృగ్
భూతం భవ్య మిదం త్రికాలకలనాసాక్షీ వికల్పోజ్ఝితః
భక్తానా మనువర్తనాయ సకలాం కుర్వన్ క్రియాసంహతిం
ఆ శృణ్వ న్మనుజాకృతి ర్మునివరో బా సీహ లోకార్చితః॥

అగస్త్యమహర్షి శ్రీరామచంద్రునకు రావణాసుల జన్మకర్మ వృత్తాంతములను సంగ్రహముగా వివరించి తిరిగి మునిసంఘసహితుడై తన ఆశ్రమమునకు పోవువాడై అహంభావశూన్యతను సూచించుచు ప్రార్థన నీశ్లోకమున జేసినాడు. రామా ! నీవు విజ్ఞాన నేత్రుడవు. ఈ జగత్తులో నీకు తెలియని విషయముండదు. ఈ రావణుని వృత్తాంత మును నీవు ఎరుగనివాడవుగావు. భూతభవిష్యద్వర్తమాన కాలములలో త్రికాలసాక్షివగు నీకు తెలియని విషయముండదు. నీవు సర్వజగదధి నాథుడవయ్యును, భేదరహితుడవయ్యును భక్తుల ఆదర్శమునకై క్రియా

కలాపముల నాచరించుచుండెదవు. మునీశ్వరుల వాక్యముల నాదరించి వారిని ఉద్ధరించుటకై లోకపూజితుడవై ఈ రూపమునవరిల్లుచున్నావు. లోకములో ఒక మహాపురుషుని ఆచరణను ఆదర్శముగాగొని సామాన్యులు తమ జీవితపథమును ఏర్పరచుకొనుటను మనము స్వయముగా చూచుచున్నాము. రాముడు వాస్తవమునకు ఏవిధమగు కర్మలను ఆచరించువాడు కాకపోయిన లోకానువర్తనమునకై అవతారకాలము లందు కర్మల నాచరించుచుండునని ఈ శ్లోకమున స్పష్టపరుపబడినది. భగవద్గీతలోగూడ కృష్ణభగవాను డీవిషయమును స్పష్టపరచియున్నాడు. "యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్త దేవే తరోజనః సయత్ ప్రమాణం కురుతే లోకాస్త దనువర్తతే నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషులోకేషు కించన, నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవచ కర్మణి. యదిహ్యా హం న వర్తేఽయం జాతు కర్మణ్య తంద్రితః, మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థసర్వశః ఉత్సీదే యురిమేలోకా న కుర్యాం కర్మ చే దహం, సంక రస్య చకర్తాస్యా ముసహాన్యా మిమాః ప్రజాః" అని.

స్తు త్వైవం రాఘవం తేన పూజితః కుంభసంభవః
స్వాశ్రమం మునిభిః సార్థం ప్రయయా హ్లాష్టమానసః॥

కుంభసంభవమహర్షి ఇట్లు శ్రీరాముని స్తుతించి అతనిచే విధి విధానమున పూజింపబడి సహచారులగు మునులతోగూడ సంతుష్ట హృదయుడై తన ఆశ్రమమునకు వెళ్ళెను.

రామ స్తు సీతయా సార్థం భ్రాతృభి స్సహ మన్త్రిభిః
సంపా రీవ రమానాథో రమామానో ఽవ సన్నృపా॥

మునిగణగమనానంతరము శ్రీరాముడు సీతతోడను, మంత్రుల తోడను, సోదరులతోడను గలసి సామాన్యసంసారివలె సాంసారికము లగు కర్మల నాచరించుచు జీవితమును గడపజొచ్చెను.

అనాసక్తో ఽపి విషయా బుభుజే ప్రియయా సహ
హనూమత్ప్రముఖై స్సద్భిః వానరైశ్చ పరివేష్టితః॥

పరమాత్మ స్వరూపుడగుటచే శ్రీరాముడు విషయసుఖములం దెంతమాత్రమును ఆసక్తిలేనివాడు. అయినను హనుమదాది భక్త వాసరులచే పరివేష్టితుడై రాజకార్యములందు నిమగ్నుడయ్యెను. ప్రియురాలయిన సీతతోగూడి విలాససుఖముల ననుభవించెను.

పుష్పకం చాగమ ద్రామ మే తదా పూర్వవ త్ప్రభుమ్
ప్రాహ దేవ కుబేరేణ ప్రేషిత స్త్వా మహం తతః ॥

శ్రీరాము డొకనాడు సభాభవనమున సింహాసనము నధిష్ఠించి యుండగా కుబేరునిచే పంపబడిన పుష్పకమువచ్చి ఆకాశమున నిలచి నది. వచ్చి కుబేరుడు నన్ను నీవద్దకు పంపినాడని పలికినది.

జితం త్వం రావణే నాఽదౌ పశ్చా ద్రామేణ నిర్జితం
అత స్త్వం రాఘవం నిత్యం వహ యావద్వ్యశే ద్భువి
యదా గచ్ఛే ద్రఘుశ్రేష్ఠో వైకుంఠం యా హి మాం తదా ॥

కుబేరు డింకను ఇట్లు పల్కినాడు–పుష్పకమా ! నిన్ను రావ ణుడు నానుండి జయించినాడు. తరువాత రాముడు అతనిని జయించు టచే నీ వతనిసొమ్మ్ని అయితివి. కాన శ్రీరామచంద్రుడు ఈ భూమిపై ఎంతకాలముండునో అంతకాలమును అతనిని వహించుము. అతడు వైకుంఠమున ప్రవేశించగనే నావద్దకు రమ్ము” అని పుష్పకము కుబేరుని వచనములను చెప్పినది.

త చ్ఛ్రుత్వా రాఘవః ప్రాహ పుష్పకం సూర్యసన్నిభం
యదా స్మరామి భద్రం తే తదా గచ్ఛ మ మాంతికం
తిష్ఠాంతర్ధాయ సర్వత్ర గ చ్ఛేచ్ఛానీం మమాఽఽజ్ఞయాం ॥

పుష్పకము చెప్పినమాటలను విని రాము డిట్లు ఆజ్ఞాపించెను. నీవు అంతటను వ్యాపించియుండము. నేను పనిగలిగినపుడు నిన్ను స్మరిం చెదను. స్మరించగనే ప్రత్యక్షముగమ్ము. ప్రస్తుతముమాత్రము వెడలి పొమ్ము.

ఇ త్యుక్త్వా రామచంద్రో ఽపి పౌరకార్యాణి సర్వశః
భ్రాతృభి ర్మంత్రిభిః సార్ధం యథా న్యాయం చకార సః ॥

ఇట్లు అజ్ఞాపించగనే పుష్పకము అంతర్ధానమునందినది. అనంతరము శ్రీరాముడు మాతృులతోడను, సోదరులతోడను ఆలోచించి పౌరులకు అభ్యుదయకరములగు పనుల నన్నిటిని న్యాయపథమును తప్పకుండా నెరవేర్చెను. రాఘవుడు ప్రజాభ్యుదయమే ముఖ్యకర్తవ్యముగా న్యాయమార్గమున పరిపాలన మొనర్చెనని భావము.

రాఘవే శాసతి భువం లోకనాథే రమాపతౌ
వసుధా సస్యసంపన్నా ఫలవంత శ్చ భూరుహాః ॥

శ్రీరామచంద్రుడు సర్వలోకనియామకుడును, సాక్షాల్లక్ష్మీనాథుడును అగుటచే అతనిపరిపాలనమున ప్రజలకు సుఖసంపదలకు లోటులేకపోయెను. భూమి వివిధసస్యసంపన్నమై అలరారినది. వృక్షములు ఋతుధర్మముననుసరించి ఫలవంతము లయినవి.

జనా ధర్మపరాః సర్వే పతిభక్తపరాః స్త్రియః
నాపశ్య త్పుత్రమరణం కశ్చి ద్రాజని రాఘవే ॥

శ్రీరామచంద్రుని రాజ్యమున ధర్మదేవత స్వస్వరూపముతో సర్వత్ర ప్రవర్తిల్లినది. ఆకారణము ప్రజలచిత్తము లెల్లప్పుడును ధర్మమునందే లగ్నములయి యుండెను. స్త్రీలు పతిభక్తి పరాయణులై పతివ్రతాధర్మమును పరిపాలించిరి. అకాలమరణములనునవి లేవు. పుత్రుని మరణమును తండ్రి ఎప్పుడును చూడనే లేదట.

సమారుహ్య విమానాగ్ర్యం రాఘవః సీతయా సహ
వానరై ర్రాక్షసై స్సార్థం సంచచా రావనిం ప్రభుః
అమానుషాణి కార్యాణి చకార బహులో భువి ॥

శ్రీరాముడు. పుష్పకవిమానమున సీతతోడను, సోదరులతోడను, హనుమదాది వానరులతోడను అధిష్టించి రాజ్యమునందంతటను సంచరించుచు ప్రజల కష్టనిష్ఠూరములను గ్రహించుచుండెనివాడు. అంతేగాక ప్రాకృతమానవులు ఆచరించజాలని అనేక అలౌకికకృత్యముల నాచరించి ప్రజల మన్ననలకు పాత్రుడయ్యెను.

బ్రాహ్మణస్య సుతం దృష్ట్వా బాలం మృత మకాలతః
శోచంతం బ్రాహ్మణం చాపి జ్ఞాత్వా రామో మహామతిః ॥

ఇట్లు పుష్పకమున సంచరించుచుండిన శ్రీరామునకు ఒక చోట ఒక బ్రాహ్మణకుమారుని శవము కన్పించినది. అంతేగాక అకాల మృత్యువు వాతబడిన కుమారునికై శోకించు వృద్ధబ్రాహ్మణుడు కన్పడినాడు.

తపస్వంతం వనే శూద్రం హత్వా బ్రాహ్మణబాలకం
జీవయామాస శూద్రస్య దదౌ స్వర్గ మనుత్తమం ॥

అధర్మమును ఆచరించినచో ప్రజలు బాధాగ్రస్తులగుదురు. ప్రజలు వర్ణాశ్రమాచారవిధానమును అతిక్రమించినచో అకాలమృత్యువు మొదలగు భయములు సమాజమును ఆవరించును. శ్రీరాముడు మృతుడయిన బ్రాహ్మణబాలకునిజూచి దానికి కారణమును వితర్కించగా అతని జ్ఞానదృష్టికి తపస్సునొనరించు శంభూకుడను శూద్రుడు కన్పించినాడు. రాముడు వెంటనే అతనిని వధించగా బ్రాహ్మణబాలకుడు పునర్జీవితుడయినాడు. రామునిచే వధింపబడిన శూద్రుడు వెంటనే వైకుంఠమును పొందినాడు.

లోకానా ముపదేశార్థం పరమాత్మా రఘూత్తమః
కోటిశః స్థాపయామాస శివలింగాని సర్వతః ॥

ఈవిధముగ అనేకములగు అలౌకికకార్యముల నాచరించుచు శ్రీరాముడు భూమిని పరిపాలించెను. అంతేగాక ప్రజలకు ఆదర్శముగ నుండుటకై కోట్లకొలది శివలింగములను స్థాపించెను.

బ్రహ్మవంశోద్భవుడయిన బాలుని సంహరించుటచే తత్పాప ప్రశమనమునకై శివలింగస్థాపన మొనర్చెనని భావము. ఎవడయిన అవసరము ననుసరించి బ్రహ్మహత్యాదిపాతకముల నాచరించినచో తత్పాపప్రశమనమునకై శివలింగ ప్రతిష్ఠాదికములయిన ప్రాయశ్చిత్తముల నొనర్చుకొనవలయు ననునది లోకాదర్శము.

సీతాం చ రమయామాస సర్వభోగై రమానుపైః
శశాస రామో ధర్మేణ రాజ్యం పరమధర్మవిత్
తథాం సంస్థాపయామాస సర్వలోకమలాపహాం ॥

ఇట్లు రాజ్యపరిపాలనమును ఆదర్శకరముగా ఆచరించుచు సీతతో సర్వసౌఖ్యములను అనుభవించెను. ధర్మయుక్తముగా రాజ్యపరిపాలనమాచరించెను. సర్వలోకముల కల్మషమును కడిగివేయుజాలు స్వీయచరిత్రను వెలయించెను.

దశవర్షసహస్రాణి మాయామానుషవిగ్రహః
చకార రాజ్యం విధివల్లోకవంద్యపదాంబుజః ॥

లోకవిడంబనార్థమై మాయనంగీకరించి మానుషదేహమును ధరించిన పరమాత్మ పదివేలసంవత్సరములు మను, గౌతమి, యాజ్ఞవల్క్యాదుల నియమముల ననుసరించి పాలించి వేదధర్మమును స్థాపించెను. ఆకారణమున అతని పదపద్మములు సర్వులకు వందనీయములయినవి. అతని రాజ్యపాలనము తరువాతివారికి ఆదర్శమయినదని భావము.

ఏకపత్నీవ్రతో రామో రాజర్షిః సర్వదా శుచిః
గృహమేధీయ మఖిల మాచరన్ శిక్షయ జ్జనాన్ ॥

రాజర్షి జీవితమును గడపు శ్రీరాముడు ఏకపత్నీవ్రతమును పరిపాలించుచు సత్యవ్రతపాలనము నొనరించుచు నిత్యశుచియై గృహమేధియొక్క పవిత్రజీవితమును గడపుచుండెను. గృహస్థధర్మముల నాచరించు అతడు సర్వజనులకు అనుసరణీ గార్హస్థ్యధర్మపరుడై యుండెను.

సీతా ప్రేమా ఽనువృత్యా చ ప్రశ్రయేణ దమేన చ
భర్తృమనోహరా సాధ్వీ భావజ్ఞా సా హ్రియా భియా ॥

సీతాదేవియు శ్రీరామునియందుండు ప్రేమాతిశయముచేతను, భర్తృచిత్తానుసరణముచేత, గాఢవిశ్వాసముచేతను, దమ స్వభావముచేతను భర్తనే అనుసరించెను. ఆమె నిత్యము భర్తకు మనోహరయై

అతని మనోభావమును చెప్పకనే అనుసరించుచు భయభక్తులతో సేవించెను. ఈ శ్లోకమున స్త్రీ భర్తను అనుసరించవలసిన విధానమంతయును వర్ణించబడినది.

ఏకదా క్రీడవిపినే సర్వభోగసమన్వితే
ఏకాంతే దివ్యభవనే సుఖాసీనం రఘూత్తమం ॥

ఇట్లు సీతారాముల గృహస్థజీవితము చాలకాలము గడచిన తరువాత ఒకనాడు శ్రీరామచంద్రుడు సమస్త విలాసానుభవయోగ్య వస్తుసంభరితమగు ఉద్యానవనమునందున్న దివ్యభవనమున ఒక్కడూ కూర్చొనియుండెను.

నీలమాణిక్యసంకాశం దివ్యాభరణభూషితం
ప్రసన్నవదనం శాంతం విద్యుత్పుంజనిభాంబరమ్ ॥

ఆసమయమున అతని శరీరలావణ్యము నీలమాణిక్యకాంతుల వలె ప్రచరించుచున్నది. అతని శరీరముపై దివ్యములగు ఆభరణములు ఉచితరీతిని అలంకరింపబడియున్నవి. శాంతచిత్తుడయియుండుటచే అతని ముఖము ప్రసన్నముగా నున్నది. అతడు ధరించిన వస్త్రము నీలమేఘముపై మెఱుపుకాంతుల నీనుచున్నది.

సీతా కమలపత్రాక్షీ సర్వాభరణభూషితా
రామ మాహ కరాభ్యాం సా లాలయంతీ పదాంబుజే ॥

ఆసమయమున కమలపత్రములవంటి నేత్రములుగల జానకి సర్వాభరణములను ధరించి అతనిని సమీపించినది. ఆమె మృదుస్మిత మునొనరించుచు పాణిపద్మములచే పతియొక్క పాదపద్మములను మృదువుగా నొత్తుచు ఇట్లు పలికెను.

దేవదేవ జగన్నాథ పరమాత్మన్సనాతన
చిదానందా ఽఽదిమధ్యాంతరహితా ఽఽశేషకారణ ॥

రామా ! నీవు ఇంద్రాదిదేవతలకుకూడ స్వామివి. సర్వబ్రహ్మాండ పరిపాలకుడవు. ప్రకృతికంటె పరమైన ఆత్మస్వరూపుడవు. అత్యంత

ప్రాచీనుడవు. చైతన్యస్వరూపుడవు. ఆనందమయుడవు. ఆదిమధ్యాంత రహితుడవు. పిపీలికాది బ్రహ్మపర్యంతమయిన సృష్టికంతటికి అధికారణుడవు.

దేవదేవాః సమాసాద్య మా మేకాంతే ఽబ్రువ న్వచః
బహుశోఽర్థయమానా స్తే వైకుంఠగమనం ప్రతి ॥

దేవా ! ఈనాడు ఇంద్రాదిదేవతలు ఏకాంతమునన్నున్న నావద్దకు వచ్చి "భూమిపై అవతరించి చాలాకాలమయినది. కనుక త్వరగా నీవు వైకుంఠమునకు వేంచేయు" మని అనేకవిధముల నన్ను ప్రార్థించినారు.

త్వయా సమేత శ్చిచ్ఛక్త్యా రామ స్తిష్ఠతి భూతలే
విసృ జ్యాస్మా కం స్వకం ధామ వైకుంఠం చ సనాతనమ్ ॥

వారు నాతో ఇట్లు పలికిరి. తల్లీ ! శ్రీరాముడు నిత్యసన్నిహితుల మగు మమ్మును, సనాతనమగు వైకుంఠమును వదలి చిచ్ఛక్తివైన నీతో గూడి చిరకాలమునుండి భూమిపై నివసించుచున్నాడు.

ఆస్తే త్వయా జగద్ధామ్ని రామః కమలలోచనః
అగ్రతో యాహి వైకుంఠం త్వం తథా చే ద్రఘూత్తమః
ఆగమిష్యతి వైకుంఠం సనాథా న్నః కరిష్యతి ॥

కమలాక్షుడగు శ్రీరాముడు నీతోగూడ చిరకాలమునుండి ధరణిపై నివసించుచున్నాడు. వైకుంఠము శూన్యముగా నున్నది. కనుక నీవు ముందుగా వైకుంఠమున కేతెంచి దానిని అలంకరింపుము. ఆతరువాత శ్రీరాముడును వైకుంఠమున కేతెంచి మమ్ములను నాథవంతుల నొనర్పగలడు.

ఇతి విజ్ఞాపి తాహం వై ర్మయా విజ్ఞాపితో భవాన్
యస్యోక్తం తత్కురు ష్వాద్య నాహ మాజ్ఞాపయే ప్రభో ॥

దేవతలు వైవిధముగా నాకు విన్నపమొనరించుకొన్నారు. ఈ విషయమును నేను మీకు విన్నవించుకొనుచున్నాను. నేను ఇట్లు చేయుమని నిన్ను ఆజ్ఞాపించుచానినిగాను. కాన ప్రభూ ! దేవతల ఈ ప్రార్థనపై నీ కెట్లుచేయుట అభిమత మో అట్లు చర్య తీసికొనుము.

సీతాయా స్తద్వచశ్శ్రుత్వా రామో ధ్యాత్వా అబవీ త్క్షణం
దేవి జానామి సకలం త్రోపాయం వదామి తే ॥

సీతాదేవియొక్క వాక్కులనువిని శ్రీరాముడు ఒక్కక్షణకాలము ఆలోచించి ఇట్లు పలికెను. దేవీ ! నే నీసమయమున చేయవలసిన కార్యక్రమము నంతను ఎరుగుదును. మనము వైకుంఠమును చేరవలసి యున్నది. దానికై ఒక ఉపాయమును ఆలోచించితిని వినుము.

కల్పయిత్వా మిషం దేవి లోకవాదం త్వదాశ్రయమ్
త్యజామి త్వాం వనే లోకవాదా ద్భీత ఇవాపరః
భవిష్యతః కుమారౌ ద్వౌ వాల్మీకే శ్చాశ్రమాంతికే ॥

దేవీ ! నీవిషయమై ఒక లోకప్రవాదమును మిషగా కల్పించి దానిచే భయపడినవానివలె నేను నిన్ను పరిత్యజించెదను. అప్పుడు నీకు వనమున వాల్మీకి మహర్షియొక్క ఆశ్రమమున ఇద్దరు కుమారులు కలుగగలరు.

ఇదానీం దృశ్యతే గర్భః పున రాగచ్ఛ మే ఽంతికం
లోకానాం ప్రత్యయార్థం త్వం కృత్వా శపథ మాదరాత్ ॥
భూమే ర్వివరమార్తేణ వైకుంఠం యాస్యసి ధ్రువమే
పశ్చా దహం గమిష్యామి ఏష ఏవ సునిశ్చయః ॥

ఇప్పుడు నీవు గర్భవతిగా కన్పించుచున్నావు. కనుక వాల్మీకాశ్రమమున పుత్రులు ఉద్భవించగలరు. కొంతకాలము గడచినపిమ్మట నీవు తిరిగి నాసమీపమునకు రాగలవు. అప్పుడు ప్రజానీకమునకు నీ పవిత్రతపై విశ్వాసము కలుగునట్లు శపథమొనరించి భూవివరమున ప్రవేశించి వైకుంఠమునకు బొమ్ము. నీవు వెళ్ళిన అనంతరము కొలచికాలము నకే నేనును వచ్చెదను. ఇదే మనము వైకుంఠమునకు వెళ్ళుటకు చేసికొనిన నిశ్చయము. ఇందులో మార్పురాదు.

ఇత్యుక్త్వా తాం విసృ జ్యాథ రామో జ్ఞానైకలక్షణః
మంత్రిభి ర్మంత్రతంత్రజ్ఞై ర్బలముఖ్యై శ్చ సంవృతః ॥

శ్రీరాము డిట్లు జానకితోపలికి ఆచోటునుండి కదలి రాజసభా భవనమున కేతెంచెను. అచ్చట జ్ఞానలక్షణుడగు అతడు మంత్రాలో చనావిచక్షణులగు మంత్రులతోగూడి వినోదముల దగిలెను.

తత్రోపవిష్టం శ్రీరామం సుహృదః పర్యుపాసత
హాస్యప్రౌఢకథాసుజ్ఞా హాసయంతః స్థితా హరిమ్ ॥

సింహాసనాసీనుడయిన శ్రీరాముని పరివేష్టించి హాస్యకథాకుశలు రగు మిత్రులు అతనిని వినోదనిమగ్ను నొనరించసాగిరి.

కథాప్రసంగాత్ పప్రచ్ఛ రామో విజయనామకం
పౌరా జానపదా మే కిం వదం తీహ శుభాశుభమ్ ॥

మంత్రులతోడను, మిత్రులతోడను వివిధప్రసంగముల నొనరిం చుచు శ్రీరాముడు ప్రసంగవశమున వారిలో విజయుడను గూఢచారి నొకనిని జూచి "పౌరులు, జానపదులు నన్నుగూర్చి చెప్పుకొను మంచి చెడ్డలను పేర్కొనుము." అని ప్రశ్నించెను.

సీతాం వా మాతరం వామే భ్రాతవా న్వా కైకయీ మధ
న భేతవ్యం త్వయా బ్రూహి శాపితో ఒసి మమోపరి ॥

సీతనుగాని, మా మాతృదేవిని, నా సోదరులనుగాని, కైకేయిని గాని ప్రజలు ఏమయిన నిందించుచున్నఎడల స్పష్టముగా చెప్పుము. నీవు భయపడరాదు. ఏమయిన దాచినచో నామీద ఒట్టు పెట్టుకొను చున్నాను.

ఇ త్యుక్తః ప్రాహ విజయో దేవ సర్వే వదంతి తే
కృతం సుదుష్కరం సర్వం రామేణ విదితాత్మనా॥

శ్రీరాము డిట్లు గ్రుచ్చి గ్రుచ్చి అడుగగా విజయు డిట్లు పలి కెను. "దేవా ! అందరూ మహాజ్ఞానియగు శ్రీరాముడు అనన్యసుల్ల భములగు కార్యముల నొనరించినాడని ప్రశంసించుచున్నారు.

కిం తు హత్వా దశగ్రీవం సీతా మాహృత్య రాఘవః
అమర్షం పృష్ఠతః కృత్వా స్వవేశ్మ ప్రత్యపాదయత్ ॥

ఇన్ని మహత్కృత్యముల నొనరించియు ఒక చేయరాని కార్యమును చేసినాడు. అతడు రావణుని వధించి సీతను తిరిగి తెచ్చినాడు. అభిమానమును వదలి రావణాపహృతయగు జానకిని స్వగృహమందుంచుకొని అనుభవించుచున్నాడు.

కీదృశం హృదయే తస్య సీతాసంభోగజం సుఖం
యా హృతావిజనే ఽరణ్యే రావణేన దురాత్మనా॥

దురాత్ముడగు రావణుడు జనరహితమయిన అరణ్యములో ఏకాంతమునననున్న కాంతను దొంగిలించినాడు. ఆమె రావణగృహమున కొంతకాలము ఉన్నదిగదా! ఆమె ననుభవించు నప్పుడు రాముని హృదయము సంభోగసుఖము నెట్లుపొందుచున్నది.

అకస్మా దపి దుష్కర్మ యోషితా మర్పణం భవేత్
యాదృ గ్భవతి వై రాజా తాదృశ్యో నియతం ప్రజాః॥

లోకములో స్త్రీలవిషయమై ఇట్టి దుష్కృత్యములు సంభవించినచో జనులకు విశ్వాసయోగ్యములగు కారణములను కన్నరచకుండా తిరిగి గృహమునకు తెచ్చుట దోషము కాకపోవచ్చును. కారణమేమన 'రాజానుసారీ లోకః' అని గదా నియమము. రాజు ఎట్టి ఆచరణ గలవాడయినచో ప్రజలును అట్టి ఆచరణగలవారే అగుదురు గదా! దశగ్రీవుడు తన గృహమున వుంచిన సీతను రాముడు ప్రజలకు ఆమె పవిత్రతను బుజువుపర్చకుండగనే తిరిగి అనుభవించుచున్నాడని భావము.

శ్రుత్వా తద్వచనం రామః స్వజనా న్పర్యపృచ్ఛత
తేఽపి నత్వా ఽబ్రువ న్రామ మేవ మేత న్న సంశయః॥

విజయుని ముఖమున ప్రజ లనుకొనుమాటలను విని రాముడు మంత్రులను, సుహృజ్జనులనుకూడ ఈవిషయమై ప్రశ్నించగా వారు నమస్కరించి ఇందులో సందేహము లేదని పల్కిరి. అనగా సీతను తిరిగి తెచ్చునప్పుడు ప్రజలకు విశ్వాసము కలిగించబడలేదని రని

భావము. లేదా సీతాదేవి పవిత్రతను బుజువుపరచకపోవుటచే వారు పైవిధమున భావించుచున్నారని చెప్పవచ్చును.

తతో విసృజ్య సచివాన్ విజయం సుహృద స్తథా
ఆహూయ లక్ష్మణం రామో వచనం చేద మబ్రవీత్
లోకాపవాద స్తు మహాన్ సీతా మాశ్రిత్య మే ఽభవత్॥

వారి మాటలను విని శ్రీరాముడు విజయుని, సుహృజ్జనులను వదలి స్వభవనమున కేతెంచి లక్ష్మణుని రావించి అతని కిట్లాజ్ఞాపించెను. "లక్ష్మణా! సీతావిషయమై నాకు మహత్తరమగు లోకాపవాదము సంభవించినది.

సీతాం ప్రాతఃసమానీయ వాల్మీకే రాశ్రమాంతికే
త్యక్త్వా శీఘ్రం రథేన త్వం పున రాయాహి లక్ష్మణ
వక్ష్యసే యది వా కించి త్తదా మాం హతవా నసి॥

కనుక నీవు రేపటి ఉదయమునసే సీతను రథముపై వాల్మీకి మహర్షియొక్క ఆశ్రమసమీపమున వదలి శీఘ్రముగ తిరిగి రమ్ము. ఇది నా యాజ్ఞ. నీవు ఒక్కమాటకూడ బదులు పలుకకుము. ఏమయిన బదులుపలికినచో నాపై అన నిడుచున్నాను. నన్ను వధించిన వాడవు కాగలవు.

ఇత్యుక్తో లక్ష్మణో భీత్యా ప్రాత రుత్థాయ జానకీం
సుమంత్రస్య రథే కృత్వా జగాదు సహసా వనమ్॥

రాము డిట్లు దారుణముగా శాసించగా లక్ష్మణుడు మారు పలుకజాలక ప్రాతఃకాలమునసే లేచి సుమంత్రుని రథముపై జానకి నెక్కించి శీఘ్రముగా అరణ్యమునకు ప్రయాణమై వెళ్ళెను.

వాల్మీకే రాశ్రమ స్యాంతే త్యక్త్వా సీతా మువాచ సః
లోకాపవాదభీత్యా త్వాం త్యక్తవాన్ రాఘవో వనే
దోషో న కశ్చి న్మే మాత ర్గచ్ఛాఽఽశ్రమపదం మునేః॥

అచ్చట వాల్మీకిమహర్షియొక్క ఆశ్రమసమీపమున జానకీదేవిని రథము దించి లక్ష్మణు డిట్లు పలికెను. "తల్లీ శ్రీరామచంద్రుడు లోకాపవాదమునకు వెరచి నిను అరణ్యమున వదలి రమ్మని ఆజ్ఞాపించినాడు. తదాజ్ఞానుబద్ధుడనై నిన్నిచ్చట విడుచుచున్నాను. ఇచ్చటకు సమీపమునసే వాల్మీకిమహర్షియొక్క ఆశ్రమ మున్నది, నీ వాముసీశ్వరుని జేరి జీవితమును గడుపుము."

ఇ త్యుక్త్వా లక్ష్మణ శ్శీఘ్రం గతవాఁ రామసన్నిధిమ్
సీతా ఽపి దుఃఖసంతప్తా విలలా పాతిముగ్ధవత్ ॥

ఇట్లు పలికి లక్ష్మణుడు ఆమె నచ్చట వదలి అతి శీఘ్రముగా రామసన్నిధి చేరుకొనినాడు. అనంతరము సీతాదేవియు ఏమియు ఎరుగనిదానివలె అత్యంతదుఃఖసంతప్తహృదయయై బిగ్గరగారోదించెను.

శిష్యైఃశ్రుత్వా తు వాల్మీకిఃసీతాం జ్ఞాత్వా సదివ్యదృక్
అర్ఘ్యాదిభిఃపూజయిత్వా సమాశ్వాస్య చ జానకీమ్
జ్ఞాత్వా భవిష్యం సకల మార్షయ న్మునియోషితాం॥

సీతాదేవియొక్క రోదనధ్వనిని విని వాల్మీకియొక్క శిష్యులు ఎవరో సాధ్వి అరణ్యమున ఏడ్చుచున్నదని చెప్పగా వాల్మీకి దివ్యదృష్టిచే ఆమెను సీతాదేవిగా ఎరిగి భవిష్యత్తునుకూడ ఊహించి తాను ఆమె సమీపమునకు వచ్చెను. దుఃఖపరవశయైన జానకిని ఓదార్చి మహర్షి ఆమెను యథావిధిగ అర్ఘ్యాదులచే పూజించి తాపసస్త్రీలకు సమర్పించెను.

తా స్తాఃసంపూజయన్తి స్మ సీతాం భక్త్యా దినేదినే
జ్ఞాత్వా పరాత్మనో లక్ష్మ్యం మునివాక్యే న మోషితః
సేవాం చక్రు స్సదా తస్యా వినయాదిభి రాదరాత్ ॥

వాల్మీకి సీతాదేవిని పరిచయముచేయగనే ఆశ్రమమందలి తాపసస్త్రీలందరును జానకి సాక్షా లక్ష్మీదేవియే యని గ్రహించి ప్రతి

దినము భక్తిప్రపత్తులతో పూజించిరి. వినయాది గుణములను ప్రకటించుచు నిత్యము ఆమెను సేవించిరి.

రామో ఽపి సీతారహితః పరాత్మా
విజ్ఞానదృక్కేవల ఆదిదేవః
సంత్యజ్య భోగా నఖిలాన్ విరక్తో
మునివ్రతో భూన్మునిసేవితాంఘ్రిః॥

పరాత్పరుడును, విజ్ఞాననేత్రుడును అగు శ్రీరామచంద్రుడును సీతను పరిత్యజించి . వికలమనస్కుడయ్యెను. సర్వసృష్టికిని ప్రారంభమునందు ప్రభువయ్యును లోకసంగ్రహమునకే దుఃఖమును ప్రకటించుచుండెను. సీతావియోగభారమున సమస్తభోగములను పరిత్యజించి సమస్త మహర్షి సేవితపాదపద్ముడగు అతడు మునిజీవితమునే ప్రారంభించినాడు. మునిసేవ్యుడగు తానే మునియైనాడని భావము.

★

పంచమసర్గ

రామగీత:

శ్రీమహాభారతాంతర్గతమయిన శ్రీమద్భగవద్గీత జగత్ప్రసిద్ధమయిన గ్రంథము. భారతీతత్త్వశాస్త్రమున దానికున్న స్థానము మహోన్నతమయినది. ప్రస్థానత్రయమం దదియొక్కటి అనుటచే భారతీయుల ఆధ్యాత్మికజీవితమున భగవద్గీతయొక్క ప్రభావము అతి ముఖ్యమయినది. అంతేగాక భగవద్గీత ఆదర్శముగా భారతీయ పురాణగ్రంథములందును ప్రత్యేకముగానుకూడ ఇతరములగు గీత లనేకములు కల్పించుచున్నవి. శివగీత, అష్టావక్రగీత, గణేశగీత మొదలగు అనేకములగు గీతలున్నవి. అయితే ఈగీతలలో దేనికిని భగవద్గీతకున్న ప్రాధాన్యత కలుగలేదు. కాని వివిధ పురాణములం దున్నటువంటియు, స్వతంత్రరచనలయినటువంటియు ఆ గీత లన్నిటికిని తలమానికము ఈ అధ్యాత్మరామాయణాంతర్గతమగు రామగీత. వాల్మీకికృత రామాయణము తరువాత అధ్యాత్మప్రధానమగు ఈగ్రంథము ఉత్తమమయినదని చెప్పబడునట్లుగనే భారతాంతర్గతమగు భగవద్గీత తరువాత ఈ గ్రంథమందున్న రామగీతయే సర్వోత్తమమని విజ్ఞులచే భావింపబడుచున్నది. భగవద్గీత భగవానునిచే గానము చేయబడినది.

అట్లే ఈ రామగీత పరాత్పరుడగు రామునిచే గానముచేయబడినది. ఈకారణమున ఈరెండు గ్రంథములందు ప్రతిపాదింపబడిన తత్త్వము ఒక్కటే అని తేలుచున్నది. శ్రీకృష్ణుడు అర్జునునకు తత్త్వమునుపదేశింపుచు దీనిని నేను పూర్వము వివస్వతున కుపదేశించితి ననియు అది ఇక్ష్వాకాదులకు వంశపరంపర ననుసరించి సంప్రాప్తించినదనియు చెప్పినాడు. ఆతత్త్వమునే నీకును ఉపదేశించితి ననినాడు. కనుక వివస్వంతునుండి సంప్రాప్తించిన తత్త్వజ్ఞానమునే రాముడు రామగీతలో లక్ష్మణున కుపదేశించెననుట సంగతముగానూడ నున్నది. రామగీత-భగవద్గీతల తత్త్వైక్యతనుగూర్చి ప్రత్యేకముగా నొకగ్రంథము వ్రాయ

వలసిన విషయము. ప్రస్తుతము గ్రంథసందర్భము ననుసరించి రామ గీతకు స్వల్పవివరణము నిచ్చుచున్నాము,

మ హా దే వ ఉ వా చ :—

తతో జగన్మంగళమంగళాత్మనో
విధాయ రామాయణకీర్తి ముత్తమాం
చచార పూర్వాచరితం రఘూత్త మో
రాజర్షి వర్యై రపి సేవితం యథా॥

శ్రీరాముని దివ్యస్వరూపము సర్వజగత్తులకు కళ్యాణకారక మయినది. అట్టి మంగళస్వరూపముతో వనగమనము, రావణాదివధ మొదలగు అనన్యదుర్లభములగు కృత్యముల నాచరించెను. ఆకృత్య ములు వివిధమహర్షులకు స్తుత్యము లయినవి. వాల్మీకి మొదలగువారు శ్రీరాముని చరిత్రను రామాయణాది గ్రంథరూపమున గానమొనర్చి నారు. అతని యశస్సు దిగంత విశ్రాంతమయినది. తరువాత పట్టాభి షిక్తుడై రాజ్యమును పాలించుచు ప్రజల ఉద్దేశ్యమును గ్రహించి ప్రాణ ప్రియయైన జానకిని అరణ్యమున వదలినాడు. ఆ తరువాతకూడ లోక ములకును ముఖ్యముగా ఇతర ప్రజాపాలకులకును ఆదర్శముగా నుండు నట్లు ఇక్ష్వాకువు మొదలుకొని ప్రజాపాలన నొనరించినవారి యోగ్య పరిపాలనాపద్ధతుల ననుసరించి శాసన మొనరించినాడు. అంతేగాక భూమండలమును పాలించిన ఇతర రాజర్షివర్యుల పాలనలలోని ఉత్తమ విషయములనుకూడ తన పరిపాలనా విధానమున చొప్పించినాడు. అనగా రామునకు ముందున్న యోగ్యశాసన పద్ధతు లన్నియు అతని పాలనలో నున్నవని భావము. కనుకనే రామరాజ్యమను పదము స్థిరమయినది.

సౌమిత్రిణా పృష్ఠ ఉదారబుద్ధినా
రామః కథాః ప్రాహ పురాతనీః శుభాః
రాజ్ఞః ప్రమత్తస్య నృగస్య శాపతో
ద్విజస్య తిర్యక్త్వ మథాఽఽహ రాఘవః॥

ఉదారగుణసంపత్తిగల సౌమిత్రి శ్రీరాముడు ఏకాంతముననుండు నప్పుడు సమీపమునకుజేరి వివిధవృత్తాంతములను ఉపన్యసింపుమని ప్రార్థించెడివాడు. శ్రీరాముడూ పూర్వమహాపురుషుల పవిత్రచరిత్ర లనే కములను అతనికి తెలియజేసినాడు. ఆ కథలలో ప్రమత్తుడయిన నృగ మహారాజుయొక్క కథ ఒకటి. నృగమహారాజు ప్రమత్తుడై బ్రాహ్మ ణుని గోవు నొకదానిని పొరపాటున ఇంకొకనికి దానమీయగా ఆ బ్రాహ్మణుడు కోపించి శాపమీయగా తిర్యగ్జంతు స్వరూపము నంది నాడు. ఈకథను శ్రీరాముడు లక్ష్మణునకు ఉపదేశించినాడు.

ఇక్కడ లక్ష్మణుడు శిష్యుడై (జిజ్ఞాసువై) శ్రీరాముని వివిధ విషయములను పృచ్ఛించినాడు. లక్ష్మణునికి వాడబడిన 'ఉదారబుద్ధి నా' అను విశేషము శిష్యలక్షణమును నిరూపించునదిగా నున్నది. గురుదేవునియందు అచంచల విశ్వాసముగల బుద్ధిగలవాడని దాని భావము. లేదా త్యాగశీలియని యైనను చెప్పవచ్చును. అట్టివానిచే ప్రశ్నింపబడి రాముడు ధర్మాధర్మ నిరూపకములగు వృత్తాంతముల ననే కములను చెప్పినాడని భావము. నృగమహారాజు కథను చెప్పి బ్రహ్మ స్వర్గమందు వైముఖ్యమును కలిగియుండవలెనని బోధించినాడు.

నృగుడను మహారాజు ధర్మప్రియుడు. అతడు ఒకతీర్థమున బహు యాగకర్తయగు బ్రాహ్మణునకు వేయిగోవులను దానమిచ్చెను. అం తకు పూర్వమే అతడు మరొకబ్రాహ్మణునకిచ్చిన గోవు అలవాటు చొప్పున ఆమందతో కలిసిరాగా తెలియక దానినికూడ దానమిచ్చెను. ఆ గోవుయొక్క యజమాని దానికై బహువత్సరములు వెదకి చివరకు పట్టుకొని తనతో తోలుకు పోసాగెను. రెండవసారి దానముపట్టిన బ్రాహ్మణు డతనిని అడ్డగించెను. వారిద్దరు వాదులాడుకొని నృగుని యొద్దకుపోయి విన్నవించుకొనిరి. కాని రాజు ఎంతకాలము గడచి నను తీర్పు చెప్పలేదు. దానికి అలిగి వారతనిని ఉపరవెల్లివి గమ్మని శపించిరి. కలియుగ ప్రారంభమున శ్రీకృష్ణుడు నిన్నుస్మరించునని శాప విమోక్షమునుకూడ తెలియజేసిరి.

ఈకథను శ్రీరాముడు సీతను అరణ్యములో విడచివచ్చిన తరువాత లక్ష్మణునకు జెప్పినాడు. రాముడు సీతను విడచి దుఃఖించుచుండగా లక్ష్మణుడు కర్తవ్యమును బోధించినాడు. లక్ష్మణుని మాటలచే తెలివినొంది రాముడు- నేను నాల్గురోజులనుండి ప్రజలకార్యము లను చక్కబరుచుటలేదు. ఇట్టి ప్రమత్తత రాజునకు తగదు. రాజ కార్యప్రమత్తు డయిన నృగునకు ఈ నుర్దశ సంభవించినది అని లక్ష్మణునితో అనును. అంతేగాక రాముడు నిద్రావశుడై వశిష్ఠునికి దర్శనమీయని నిమిని బుసిశపించుటయు నినిమొక్క ప్రతిశాపమును వర్ణించి వశిష్ఠవిదేహుల జననవృత్తాంతమును తెలియజేసినాడు. రాజులకు క్షమాగుణము అవసరమని యీయీ వృత్తివృత్తాంతమునుకూడ తెలియజేసినట్లు వర్ణింపబడినది.

నిమి ఇక్ష్వాకుని పుత్రుడు. అత డొకసారి సత్రయాగమును తలపెట్టి వశిష్ఠుని బ్రహ్మగా యాచించినాడు. వశిష్ఠుడు నే నింతకు మునుపే ఇంద్రునిచే వరింపబడినాను. ఇంద్రుని యజ్ఞము సమాప్తినందినతరువాత వచ్చెదనని వెడలినాడు. నిమి ఆలస్యము నోర్వలేక గౌతముని ఆధ్వర్యమున యజ్ఞమును ప్రారంభించినాడు. ఇంద్ర యజ్ఞమును పూర్తిచేసి వశిష్ఠుడు తిరిగివచ్చి గౌతముని వరించుటను విని క్రోధపూర్ణహృదయుడయినాడు. అతడు రాజదర్శనమునకై ద్వారమున వేచియుండెను. నిమి నిద్రావశుడై అతనికి దర్శనమిచ్చుటలో ఆలస్యమొనరించెను. దానికి కోపగించి వశిష్ఠుడు నిమిని విదేహుడవు గమ్మని శపించెను. అది విని నిమియు అట్లే ప్రతిశాపమిచ్చెను. దానితో రాజబ్రాహ్మణు లిరువురును విదేహులై వాయురూపము నొందిరి. వశిష్ఠుడు బ్రహ్మశాసనమున మిత్రావరుణుల తేజములో ప్రవేశించెను. మిత్రావరుణులు ఊర్వశీమోహితులై తమ వీర్యములను ఒక స్వర్ణకుంభమునందు విడువగా వరుణుని వీర్యమున అగస్త్యుడును, మిత్రుని వీర్యమున వశిష్ఠుడును జనించిరి. మహాతేజశ్శాలియు వశిష్ఠుని ఇక్ష్వాకుడు తిరిగి తన పురోహితునిగా వరించెను.

నిమికూడ విదేహుడుకాగా మహర్షులు అతిప్రయత్నముతో అతని శరీరమును రక్షించిరి. సంతుష్టులయిన దేవతలు అతని చేత మును వరము కోరుకొనుమనగా సర్వప్రాణుల నేత్రాగ్రములందును నివసించునట్లు అది వర మడిగినది. దేవతల వరము ననుసరించి నిమి యొక్క చేతమే నిమేషరూపమున నేత్రాగ్రములందున్నది. తరువాత మహర్షులు చేతోహీనమయిన రాజశరీరమునందు అరణినుంచి మంత్ర హోమపూర్వకముగ మథించిరి. దానితో అశరీరమునుండి ఒక పురు షుడు పుట్టెను. అతనినే మిథి లేక విదేహు డనిరి.

ఈకథ విని లక్ష్మణుడు 'నిమి క్షత్రియుడు, శూరుడు, యజ్ఞ పరుడు అయియుండియు ఓర్పు వహింపలేకపోయినాడేల' నని ప్రశ్నిం పగా రాముడు ఇట్లు చెప్పెను. ఓర్పు ప్రతివారికి ఉండదు. క్షత్రియు డయియుండియు యయాతి విప్రశాపము నోర్చుకొని ఇంద్రపదవినికూడ పొందినాడు. నిమికి ఓర్పు లేకపోయినది.

యయాతికి శర్మిష్ఠ, దేవయాని అని ఇద్దరు భార్యలు. వారిలో శర్మిష్ఠ అధిక గుణవతి, సౌందర్యవతి. పూరువు శర్మిష్ఠయొక్క కొడుకు. యదువు దేవయాని పుత్రుడు. తండ్రికి గుణవంతుడగు పూరునియెడ బహుమానము. అది ఓర్వలేక యదువు తల్లితో ఈ అవమానము కన్న మరణము శ్రేష్ఠమనినాడు. అంతట దేవయాని శుక్రునితో భర్త యొక్క పక్షపాతమును తెల్పినది. దానికి కోపించి శుక్రుడు యయా తిని వృద్ధుడవుకమ్మని శపించినాడు. తరువాత రాజు యదువును పిలచి నాకు భోగాసక్తి తీరలేదు. నా ముదిమిని గ్రహించుమనగా అతడు తండ్రిపై మండిపడినాడు. అంతట పూరుని అడుగగా అతడు వినయ ముతో అంగీకరించినాడు. తండ్రి ముసలితనమును తాను గ్రహించి తన తారుణ్యము నతని కిచ్చినాడు. కొంతకాలము భోగముల ననుభ వించి అతడు పూరునకు తారుణ్యముతో బాటు రాజ్యమునుకూడ ఇచ్చి నాడు. యదువును అనార్యవర్తనుడవుకమ్మని శపించినాడు. తరువాత యయాతి తపస్సు నొనరించి ఇంద్రపదవినికూడ పొందినాడు. ఇది

అతని ఓర్పువలెనే సంభవించినది. నిమికి యయాతిలోని ఓర్పు లేక పోయినది అని రాముడు లక్ష్మణునితో పలికినాడు.

రాము డిట్లు పలికి రాజకార్యములందు నిమగ్నుడయినట్లు వాల్మీకము.

కదాచి దేకాంత ఉపస్థితం ప్రభుం
రామం రమాలాలితపాదపంకజం
సౌమిత్రి రాసాదితశుద్ధభావనః
ప్రణమ్య భక్త్యా వినయాన్వితో బ్రవీత్ ॥

ఒకప్పుడు పరమాత్మస్వరూపుడును, సర్వేశ్వరుడును అగు శ్రీరామచంద్రుడు ఏకాంతమును ఆత్మరతుడై ఉండగా, సాక్షాల్లక్ష్మీ సంవాహిత పాదపద్మములుగల అతనిని లక్ష్మణుడు శిష్యభావముతో సమీపించెను. ఆసమయమున లక్ష్మణుని మనస్సు సంసారవిషయము లందు విరక్తినంది తత్త్వజ్ఞానప్రాప్తికి అనువుగా నుండెను. అట్టి సౌమిత్రి భక్తిప్రపత్తులతో శ్రీరాముని పాదములకు నమస్కరించి వినయభావ ముట్టిపడ ఇట్లు పలికెను.

త్వం శుద్ధబోధో ఽసి హి సర్వదేహినా
మాత్మా స్యధీశో ఽసి నిరాకృతిః స్వయమ్
ప్రతీయసే జ్ఞానదృశా మథాపి తే
పాదాబ్జభృంగాహితసంగసంగినామే ॥

రామా ! నీవు ప్రాకృతమానవుడవుగావు. ఉపాధిరహితమయిన జ్ఞానస్వరూపుడవు. లేదా అనవచ్ఛిన్నమగు చైతన్యస్వరూపుడవు. అయి నను ఉపాధిశబ్దవాచ్యములగు సర్వదేహులయందును అంతర్యామిరూప మున నుండువాడవు. అనంతకోటి బ్రహ్మాండములకును, ఆ బ్రహ్మాం డములందు నివసించు జీవులకును అధీశుడవు. అట్లని నీకు ఆకృతిలేదు. రూపరహితుడవు. ఈ దృశ్యుడవగు నిన్ను దర్శించుటకు సామాన్య మానవులు సమర్థులుగారు. భవదీయ దివ్యపాదపద్మములందు నిరంతరా సక్తికలిగి మధుపానమొనర్చు భక్తమధుపములకును వారి నాశ్రయించు

కొను సత్పురుషులకును, నిరంతర మననవిధిధ్యానపూర్వకముగా సంపాదిత విజ్ఞానులకును నీ సచ్చిదానందమయస్వరూపము అనుభవ రూపమున గోచరము కాగలదు. పరమాత్మ భేదరహితుడగుటచే సర్వాత్మస్వరూపుడును ఉపాధిభేదము ననుసరించి నియామకుడును అగుచున్నాడు. ఆకృతిరహితు డనగా స్వాభావికమయిన కర్మఫలమునకు బద్ధుడై, కర్మఫలానుభవమునకు శరీరధారణచేయనివాడని భావము. వేదాంతవాక్యములను మననమొనర్చుటవలన జ్ఞానము కలుగును. అట్టి జ్ఞానముకలవారికే ఆత్మసందర్శనము కలుగును.

అహం ప్రపద్యే ఒస్మి పదాంబుజం ప్రభో
భవాపవర్గం తవ యోగిభావితమ్
యథాఒజ్ఞసా జ్ఞాన మపారవారిధిం
సుఖం తరిష్యామి తథాఒనుశాధి మాం ॥

ప్రభూ! నేను సంసారబంధనములవలన పీడితుడనై ఆర్తుడనయితిని. ఆకారణమున భవదీయపాదాబ్జములను శరణుజొచ్చితిని. నీపాదాబ్జములు సంసారదుఃఖజాలమును ఛేదించి అపవర్గమును ప్రసాదించునని యోగీశ్వరులు వాక్రుచ్చియున్నారు. ఈ అజ్ఞానరూపమయిన అపార సముద్రమునుండి తరించుమార్గమును కన్పింపజేయుము.

శ్రుత్వా ఒథ సౌమిత్రివచో ఒఖిలం తథా
ప్రాహ ప్రపన్నార్తిహరః ప్రపన్నధీః
విజ్ఞాన మజ్ఞానతమోపశాంతయే
శ్రుతిప్రపన్నం క్షితిపాలభూషణం ॥

శ్రీరాముడు ఆపన్నులయి శరణుగోరువారి దుఃఖజాలమును హరించు పరమేశ్వరుడు. నిత్యప్రసన్నమగు బుద్ధివైభవముగలవాడు. అతడు శిష్యభావముతో జిజ్ఞాసువై వచ్చిన సౌమిత్రియొక్క వచనముల నన్నిటిని అవహితబుద్ధితో వినినాడు. శిష్యరూపుడయిన లక్ష్మణుని ఆవరించియున్న అజ్ఞానాంధకారమును పటాపంచలు చేయవలెనను భావము అతనికి కలిగినది. ఆకారణమున ప్రజాపరిపాలనమొనర్చు

ప్రతి క్షత్రియుడును నేర్వదగినట్టియు, నేర్చినవారిని సర్వగుణసంపన్నుల నొనర్చునట్టియు, వేదప్రతిపాదితమయినట్టియు ఆత్మవిజ్ఞానమునకు సంబంధించిన విషయమును ఉపన్యసించువాడై ఇట్లు పలికెను.

అజ్ఞానతమోపశాంతికారకమగు విజ్ఞానమును గ్రహించుటకు వలయు బహిరంగాంతరంగసాధనాక్రమమును ప్రతిపాదించుచున్నాడు.

ఆదౌ స్వవర్ణాశ్రమవర్ణితాః క్రియాః
కృత్వా సమాసాదితశుద్ధమానసః
సమాప్య తత్పూర్వ ముపాత్తసాధనః
సమాశ్రయేత్ సద్గురు మాత్మలబ్ధయే ॥

విజ్ఞానోపలబ్ధినిగోరు మానవుడు ప్రారంభమును తన వర్ణాశ్రమములకు విహితమయిన సత్కర్మల నన్నిటిని ఆచరించవలెను. అట్లాచరించిన చో పరిశుద్ధ మనస్కత ఏర్పడును. చిత్తశుద్ధి కలిగిన అనంతరము వైరాగ్య సూచకమగు సన్యాసమును స్వీకరించి ఆత్మజ్ఞాన ప్రాప్తికై సద్గురువు నాశ్రయింపవలెను.

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్ణములు నాలుగు. బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థసన్యాసములు నాలుగు ఆశ్రమములు. ఆ యా వర్ణములకును, ఆ యా ఆశ్రమములకును ధర్మశాస్త్రములందు ప్రత్యేకముగా కర్మలు నియమితములయియున్నవి. వాటినన్నిటిని క్రమముగా ఆచరించుచుండినచో శమదమాది షట్గుణసంపత్తి కలుగును. శాస్త్రవిహితకర్మలు చిత్తశుద్ధికి బహిరంగసాధనలు. శమదమాదులు అంతరంగసాధనలు. ఈ రెంటివలనను చిత్తశుద్ధి కలుగును. చిత్తశుద్ధి అనగా సాంసారికవిషయములందు విరక్తిభావము. అనగా మానవుడు వైరాగ్యప్రాప్తిపర్యంతము కర్మల నాచరించుచు శుద్ధాచరణకలిగి యుండవలెనని దీనివలన తేలుచున్నది. వైరాగ్యము కలిగినతరువాత కర్మలను త్యజించి సన్యసించవలెను. అనంతరము వేదాంతవాక్యార్థ విచారణకై శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అగు సద్గురువును సమిత్పా

ణిమై సమీపించి ఆశ్రయించవలెను. ఈ వాక్యములలో గాముని ఉప నిషద్వాక్యముల తత్త్వవిచారణ గురుసహాయమున చేయవలసినదేగాని, స్వయముగా గ్రంథములను చదివిన చో తత్త్వజ్ఞానము కలుగదని సూచించినాడు. స్వయముగా చదివిన చో బేధితద్భట్యా విచారణ చేయ గలడేగాని అనుభవజ్ఞానసంపాదన మొనర్పలేడని భావము.

నిత్యానిత్యవస్తువివేకము, ఇహాముత్రార్థ ఫలభోగవిరాగము, శమాది షట్క–సంపత్తి ముముక్షుత్వము–అనునవి సంసారబంధన మోక్ష సాధనము. బ్రహ్మ పదార్థమే నిత్యమయినది, తదన్యమయినదంతయు అనుజ్ఞానము కలిగియుండుట నిత్యానిత్యవస్తువివేకమనబడును. ఇహ లోకమునకు సంబంధించి ప్రక్కందన వనితాదివిషయభోగములందును, పుణ్య కర్మ జన్యములయిన స్వర్గాది పరలోకవిషయభోగములందును విరాగము కలిగియుండుట ఇహాముత్రార్థఫలభోగ విరాగమనబడును. శమము, దమము, ఉపరతి, తితీక్ష, సమాధానము, శ్రద్ధ అనునవి ఆరును శమాదిషట్క మనబడును. బంధనకారకములై సాంసారిక సుఖ దుఃఖాదులకు సంబంధించిన శ్రవణాదీంద్రియ వ్యాపారములనుండి మరల్చి మనస్సును నిగ్రహించుట శమమనబడును. బాహ్యేంద్రియము లను సాంసారికవిషయములనుండి మరల్చుట దమమనబడును. ఇట్లు వ్యతిరేకకర్మలనుండి ఇంద్రియములను, మనస్సును మరల్చిన అనంత రము తిరిగి ఆవిషయములలో ప్రవేశించకుండుట ఉపరతి లేక ఉపరమ ణము లేక కర్మపరిత్యాగము ఉపరణమనియు చెప్పవచ్చును. శీతోష్ణా దులను, సుఖదుఃఖములను సమానమగు దృష్టితో చూచి సహించుట తితీక్ష, మనస్సును, ఇంద్రియములను నిగ్రహించి తదనుగుణమయిన విషయమందు వాటిని కేంద్రీకరించుట సమాధానము. గురువునం దును, వేదాంతవాక్యములందును విశ్వాసము కలిగియుండుట శ్రద్ధ. మోక్షమందు ఇచ్ఛకలిగియుండుట ముముక్షుత్వము. ముముక్షువు కర్మనొనరించిన ఫలప్రాప్త్యాశారహితముగనే నొనరించవలెనేగాని ఫలా శతో చేయరాదు. ఫలాకాంక్షఉన్న చో చిత్తశుద్ధి కల్గినట్లు కాదు,

అట్లు ఉన్నచో అనర్థమే సంభవించునని శ్రీరాముడు ప్రతిపాదించు చుచున్నాడు.

క్రియా శరీరోద్భవహేతు రాదృతా
ప్రియా ప్రియా తౌ భజతో సురాగిణః
ధర్మేతరా తత్ర పునః శరీరకం
పునః క్రియాచక్రవవీర్య తేభవః॥

ఆదరపూర్వకముగా పూర్వజన్మమం దొనర్పబడిన కర్మయే ఈ శరీరమునకు కారణమయినది. తిరిగి జీవుడు సంసారవిషయములందు అనురాగము గలవాడై ధర్మాధర్మములను ఆచరించును. అట్లు ఆచరించినందువలన సుఖదుఃఖములు సంభవించును. అభిలాషతో కర్మాచరణ మొనర్చినపుడు తత్కర్మఫలానుభవమునకై జన్మను పొందవలసి యుండును. ఆజన్మయందు తిరిగి కర్మలను అభిలాషయుక్తముగా నొనరించుట తిరిగి జన్మించుట అనునవి ఒకదాని తరువాత మరియొకటి సంభవించుచునే యుండును. ఇట్లు జీవుడు జన్మమరణరూపమయిన చక్రముగా పరిభ్రమించుచుండును. సంసారమం దనురక్తియే పరిభ్రమణమునకు ముఖ్యకారణము. విరక్తికలుగనిదే ఈ సంసారచక్రమునుండి తప్పించుకొనజాలడని ఫలితార్థము.

అజ్ఞాన మే వాస్య హి మూలకారణం
తజ్ఞానమే వాత్ర విధౌ విధీయతే
విద్యైవ తన్నాశవిధౌ పటీయసీ
న కర్మ తజ్ఞైః స్వవిరోధ మీరితం॥

కర్మయందు ఆదరబుద్ధియు, సంసారమందు అనురాగమును, కలిగియుండుటకు మూలకారణము అజ్ఞానమే, అయితే ఆ అజ్ఞానమను భవసముద్రమును ఈది ఆవలిఒడ్డు చేరుటకు కర్మస్వరూపమునుగూర్చియు మూలతత్త్వమును గూర్చియు జ్ఞానమును కలిగియుండుటే ముఖ్యసాధనముగా జ్ఞానులచే చెప్పబడినది. ఒకవేళ ఎవరయినా కర్మయే అజ్ఞా

నమును నశింపజేయగలదసినచో అది అసంభవము. అజ్ఞాననాశనము ఒక్క విద్యకే (జ్ఞానమునకే) సాధ్యము. జ్ఞానులు కర్మను జ్ఞానమునకు విరోధిగా పేర్కొనినారు. అసలు కర్మ ఆత్మస్వరూపమును గ్రహించక దేహాదులయందు అభిమానము కలిగియుండుటవలన ఉత్పన్నమగు చున్నది. అజ్ఞానమునుండి ఉత్పన్నమయిన కర్మ అజ్ఞానమును నశింప జేయజాలదని భావము.

కర్మ అజ్ఞానమును నశింపజేయుగలదను విషయము నటుంచి అనర్థకారకమని ప్రతిపాదించుచున్నాడు.

నాజ్ఞానహీనం న చ రాగసంక్షయో
భవేత్తతః కర్మ సదోష ముద్భవేత్
తతః పునః సంసృతి ర ప్య కారితా
తస్మా ద్బుధో జ్ఞానవిచారవాన్ భవేత్॥

కర్మ అజ్ఞానరహితమయినదికాదు. ఆకారణము కర్మాచరణము వలన సాంసారిక విషయానురాగము నశించదు. లేదా రాగద్వేషాదులు నశించవు. పైగా ఈఫలమునకు బదులు దోషయుక్తమగు మరియొకకర్మ సంభవించును. ఈకర్మపరంపర జీవునిసంసృతికే హేతువగును. అనగా దోషయుక్తమగు కర్మఫలము ననుభవించుటకు జనన మరణరూపమగు సంసారబంధములలో చిక్కుకొనవలసివచ్చును. ఈవిధముగా కర్మ సంసారహేతువని తెలిసినవ్యక్తి తత్త్వమస్యాది వేదాంత వాక్యవిచారపూర్వకమయిన జ్ఞానమార్గమును అవలంబించును.

జ్ఞానమే మోక్ష హేతువు. అన్యము కాదు. ఇది రామగీత యందలి అంతిమసిద్ధాంతము. తన సిద్ధాంతమును ప్రతివాదించుటకు పూర్వము కొందరి మతమయిన జ్ఞానకర్మసముచ్చయవాదమును రాముడు ప్రతిపాదించుచున్నాడు.

నను క్రియా వేదముఖేన నోదితా
తథైన విద్యా పురుషార్థసాధనమ్

కర్తవ్యతా ప్రాణభృతః ప్రసాదితా
విద్యా సహాయత్వ ముపైతి సా పునఃll

లక్ష్మణా ! కొంతమంది ఈవిధముగా చెప్పుదురు. వేదము ఏవిధముగా కర్మాచరణనుగూర్చి చెప్పినదో ఆదేవిధముగా నాల్గవపురుషార్థమగు మోక్షమును సాధించు విద్యనుగూడ ఉపదేశించినది. కనుక జీవుడు కర్మనాచరించవలెను. ఆ సత్కర్మ జ్ఞానవిద్యకు సహాయభూతమై మోక్షకారకము కాగలదు.

"పరహ వా ఏష దేవానాం యోఽగ్ని ముద్వా సయతే యావ జ్జీవ మగ్నిహోత్రం జుహోతి" ఇత్యాదులగు శ్రుతివాక్యములు కర్మాచరణనుగూర్చి ప్రబోధించుచున్నవి. అంతేగాక కర్మలను ఆచరించని వానికి దోషము కలుగునసికూడ చెప్పుచున్నవి. అట్లే "బ్రహ్మ విదాప్నోతి పరమ్" ఇత్యాది శ్రుతివాక్యములు బ్రహ్మజ్ఞానమునుగూర్చి ప్రబోధించుచున్నవి. కర్మ జ్ఞానములు రెండును వేదప్రచోదితము లగుటచే అవి అవిరోధములు. ఆరెండును పురుషార్థసాధనములే. కనుక అవశ్యాచరణీయములు.

ఉభాభ్యా మేవ పక్షాభ్యాం యథా ఖే పక్షిణాంగతిః
తథైవ జ్ఞానకర్మాభ్యాం ప్రాప్యతే బ్రహ్మ సాధనంll
(యోగవాశిః)

"ఆకాశమున పక్షులు తమ రెండురెక్కల సహాయముచే ఎగురునట్లు బ్రహ్మకూడ జ్ఞానకర్మల సహాయమున సాధింపబడు" నని శ్లోక తాత్పర్యము. ఘటమను వస్తువును ఉత్పత్తి చేయుటకు దండము, సారె మొదలగునవి ఎట్టిసాధనములో అట్లే బ్రహ్మప్రాప్తికి కర్మజ్ఞానసముచ్చయము ఆవశ్యకములని సముచ్చయవాదుల మతము.

కర్మా కృతౌ దోష మపి శ్రుతి ర్జగౌ
తస్మా త్సదా కార్య మిదం ముముక్షుణా
నను స్వతంత్రా ధ్రువకార్యకారిణీ
విద్యా న కిం చి న్మనసా ఒప్యపేక్షతేll

కర్మను ఆచరించకపోయినచో ప్రత్యవాయ దోషము కలుగు ననియు వేదముచెప్పినది. కనుకముముక్షువైనవాడు సర్వదా కర్మల నాచరించవలెను. అని కర్మజ్ఞానసముచ్చయవాదులు చెప్పుదురు.

ఈ శ్లోకములోని మొదట రెండుపంక్తులలోను కర్మజ్ఞానసముచ్చయవాదుల మతమును చెప్పి మిగిలిన రెండుపంక్తులలోను "జ్ఞానవిద్యా వైదికకర్మలకంటె విశిష్టమయినది, సహాయనిరపేక్షమయినది, అది స్వతంత్రముగానే ముక్తికి సాధనము" అనువారి మతమును ప్రతిపాదించు చున్నాడు. "న చ పునరావర్తతే – మొదలగు ఉపనిషద్వాక్యముల ననుసరించి జ్ఞానవిద్య ధ్రువమగు మోక్షమును ప్రసాదించుచున్నది. అది సర్వస్వతంత్రమయి కించిన్మాత్రమయినను సహాయమును అపేక్షించనిది" అని వారిమతము. ప్రకాశము సహజముగనే చీకటిని నశింపజేయు సామర్థ్యము గలది. ఆకారణమున అది ఇతరసహాయమును అపేక్షింపదు. అట్లే విద్యయు బ్రహ్మఫలజనకత్వమున నిరపేక్షమయిన దని అనుమానప్రమాణము సూచితమయినది.

కర్మసముచ్చయవాదిపై జ్ఞానవాది మతమును ఖండించు విధాన మును రాముడు ప్రతిపాదించుచున్నాడు.

న సత్యకార్యే ఽపి హి యద్వదధ్వరాః
ప్రకాశతే ఽన్యా నపి కారకాదికా
తథైవ విద్యావిధిరాత్మనః ప్రకాశితే
ర్విశిష్యతే కర్మభి రేవ ముక్తయే॥

జ్ఞానవాది చెప్పినది సరికాదు. జ్ఞానము స్థిరకార్యమే అయినను అదికూడ యజ్ఞమువలెనే తక్షణప్రయోజనకారకములగు ప్రయాజాద్యంగములను, దేశకాలములను అపేక్షించును. "అక్షహ్యం హ్నై చాతుర్మాస్య యాజినఃసుకృతంభవతి" ఇత్యాది వేదవాక్యములు యజ్ఞమును స్థిరకార్యముగా ప్రతిపాదించుచున్నవి. స్థిరకార్యమగు యజ్ఞము కర్తోకారయితె, దేశము, కాలము మొదలగువాటిని అపేక్షించియుండును. అట్లే విద్య అనగా జ్ఞానముకూడ "అగ్నిహోత్రం జుహోతి"

మొదలగు విధివాక్యములచే ప్రతిపాదింపబడిన కర్మలతోగూడియే విశిష్ట మయినదగును గాని ఇతరవిధమున గాదు. జ్ఞానవిద్య ధ్రువకార్యకారిణి. అధ్వరమూ ధ్రువకార్యకారిణియే. అధ్వరము కర్మసహితమయినది. కనుక జ్ఞానవిద్యయు కర్మాంగ విశిష్టమయినది అని భావము.

తిరిగి సముచ్చయవాదిని జ్ఞానవాది ఖండించు విధానమును ప్రతిపాదించుచున్నాడు—

కే చి ద్వదంతీతి వితర్కవాదిన
స్తద ప్యసద్ దృష్టవిరోధకారణాత్
దేహాభిమానా దభివర్ధతే క్రియా
విద్యా గతాహం కృతితః ప్రసిధ్యతి ॥

'కే చి ద్వదంతి' అని మీరు చెప్పిన కర్మజ్ఞానసముచ్చయము అసంభవమగును. అది వితర్కముమాత్రమే. అసలు కర్మ,జ్ఞానముల పుట్టుకలోనే భేదమున్నది. ఆ భేదకారణమును సముచ్చయము సంభవించదు. కర్మ దేహాభిమానము కారణముగా జనించును.. అభిమానమన అహంకారము. జ్ఞానము అహంకారవినివృత్తివలన కలుగును. కాన ఈ రెంటికి మూలములోనే భేదమున్నది. అట్టిచో ఇవి పరస్పరసహాయకము లెట్లు కాగలవు? కాన కర్మ ఎప్పుడును మోక్షసాధనము కాజాలదు.

పూర్వపక్షి యొక్క అనుమానమును దూషితమొనర్చు విద్యాస్వరూపమును జ్ఞానవాదిమతముగా ప్రతిపాదించుచున్నాడు—

విశుద్ధ విజ్ఞాన విలోచనాం చితా
విద్యాత్మవృత్తి శ్చర మేతి భణ్యతే
ఉదేతి కర్మాఖిలకారకాదితో
నిహంతి విద్యా ఽఖిల కారకాదికమ్ ॥

బ్రహ్మవిద్య పరిశుద్ధమయిన విజ్ఞానపర్యాలోచనతోగూడిన అంతఃకరణ పరిణామమనియు, అదియే చరమాంతఃకరణ వృత్తియనియు విద్వాంసులు వాక్రుచ్చెదరు. ఇక కర్మ అన్నచో అది అనేకవిధములగు అంగోపాంగములతో సంపన్నమయియుండి ఫలోన్ముఖమగును.

బ్రహ్మవిద్య వివిధకర్మాంగములను నశింపజేయును. అనగా కర్మలో కర్త కారకుడు సాధనములు మొదలగు వివిధభేదములుండును. కాని బ్రహ్మవిద్యలో అట్టి భేదమేమియు లేక అభేదజ్ఞానము కలుగును. "సచక్షు రచక్షు రివ, సకర్ణో ఽకర్ణ ఇవ" ఇత్యాది శ్రుతివాక్యములు బ్రహ్మయొక్క కారకాదిభేదరాహిత్యమునే ప్రతిపాదించుచున్నవి. కనుక కర్మజ్ఞానసముచ్చయము అసంభవము.

తస్మా త్యజే త్కార్య మశేషతః సుధీ
ర్విద్యావిరోధా న్న సముచ్చయో భవేత్
ఆత్మానుసంధానపరాయణః సదా
నివృత్త సర్వేంద్రియ వృత్తిగోచరః ॥

కారకాదిసహితమగు కర్మ బ్రహ్మవిద్యకు సర్వథా విరుద్ధమయినది. ఆకారణమున కర్మసముచ్చయము అసంభవమగును. కనుక ఆత్మానుసంధానపరాయణుడు, నివృత్తి సర్వేంద్రియవృత్తిగోచరుడు అగు జ్ఞాని యజ్ఞాదులగు కర్మల నన్నిటిని పరిత్యజించవలెను. సచ్చిదానందమయమగు పరమాత్మను అనుభవపూర్వకముగా గ్రహించుటే ముఖ్యకార్యముగాగలవాడు ఆత్మానుసంధానపరాయణు డనబడును. శ్రవణాదికములగు ఇంద్రియ వ్యాపారములు నన్నిటిని బాహ్యవిషయములనుండి మరల్చి ఆత్మవిషయక మొనర్చినవాడు నివృత్త సర్వేంద్రియవృత్తిగోచరు డనబడును. అట్టివాడే ఆత్మగ్రహణ మొనర్పగలడు. "ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః" అను బృహదారణ్యకోపనిషత్తు. "తస్మా త్యజే త్కార్య మశేషతః సుధీః" అనుటచే కర్మత్యాగము ముముక్షువే చేయవలెను గాని ప్రతివాడు చేయరాదని భావము. "కామ్యకర్మలను ఏ పరిస్థితులలోను ఆచరించరాదు. నిత్యనైమిత్తికకర్మలను చిత్తశుద్ధిపర్యంతము చేయవలెను. చిత్తశుద్ధి కలిగినతరువాతకూడ చిత్తస్థైర్యపర్యంతము కర్మాచరణమొనర్పవలెను. ఆతరువాత అనగా ఆత్మానుసంధాన మొనర్చినప్పుడు కర్మ

దానికి ప్రతిబంధకమగును. అంతేగాక అప్పుడు కర్మవలని ప్రయోజనమును ఉండదు." అని వ్యాఖ్యాత రామవర్మ అభిప్రాయపడినాడు. "కామ్యంతు సర్వథా త్యాజ్యమేవ, నిత్యనైమిత్తికమపి యావచ్చిత్తశుద్ధి కర్తవ్యమేవ, తతోఽపి బ్రహ్మణి చిత్తస్థైర్యపర్యంతం కర్తవ్యమేవ, తతస్తదనుసంధానం ప్రతిబన్ధకత్వాత్ ప్రయోజనాభావాచ్చ తదపిత్యాజ్యమేవ." అని.

"యావజ్జీవమగ్నిహోత్రం జుహుయాత్" ఇత్యాదులగు శ్రుతివాక్యములు కర్మను నుద్దేశించినవేగాని జ్ఞానివిషయకమైనవిగాదని తెలియవలెను. ఇట్లీశ్లోకమున కర్మ సముచ్చయవాదము పూర్ణనుగా ఖండింపబడినది.

నిత్యనైమిత్తికములగు కర్మలను ఎంతవరకు ఆచరించవలెనో, ఎప్పుడు పరిత్యజించవలెనో చెప్పుచున్నాడు–

యావ చ్ఛరీరాదిషు మాయ యాత్మధీ
స్తావ ద్విధేయో విధి రేవ కర్మణాం
నే తీతివాక్యై రఖిలం నిషిధ్య తత్
జ్ఞాత్వా పరాత్మాన మథ త్యజేత్ క్రియాః ॥

మానవుడు ఎంతవరకు మాయకు వశుడై, ఈ శరీరమే నేను ఇంద్రియములే నేను అనుభావమునకు వశుడైవుండునో అంతవరకు విధి విహితములగు కర్మలను ఆచరించుచునే ఉండవలెను. ఆత్మకాని శరీరాదులను ఆత్మగా అభిమానించి కర్తృత్వాదిబుద్ధి కలిగియున్నంతవరకు కర్మాచరణ మొనర్పవలెనని భావము. "ఏక మే వాద్వితీయం" "అతోఽన్య దార్తం నేహ నానా ఽస్తి కించన" "అథాత ఆదేశో నేతి నేతి" మొదలగు శ్రుతివాక్యములను మననమొనర్చి ఈ దేహాదులగు జడజగత్తును నిషేధించగా పరమాత్మజ్ఞానము కలుగును. అనగా జగత్తు మిథ్యయనియు, ఆత్మ నిత్యమనియు భావము కలుగును. తాదృశజ్ఞానసంపాదన మొనర్చినపిమ్మట కర్మసన్యాస మొనర్పవలెను. రాగద్వేషాదులున్నంతవరకే కర్మ, ఆపైన లేదని భావము.

'మాయ సంసారమునకు మూలకారణము. అది ఏ పరిస్థితుల లోను నశించదు' అను వాదమును ఖండించుచున్నాడు.

యదా పరాత్మాత్మవిభేదభేదకం
విజ్ఞాన మాత్మ న్యవభాతి భాస్వరమ్
తదైవ మాయా ప్రవిలీయతే ఽంజనా
సకారణాకారణ మాత్మసంస్కృతిః ॥

ప్రకృతివికారమయిన దేహమునందు ప్రతిబింబితుడయిన పరమాత్మయే జీవుడనబడును. మాయ ఆవరణరూపమున జీవుని ఆవరించుకొని యుండును. ఈ మాయా ఽఽవరణ తొలగిపోయినచో పరమాత్మకు జీవునకు కన్పడు భేదము నశించి ఏకత్వము స్థాపితమగును. ప్రకాశశీలమయిన పరమాత్మవిజ్ఞానము లభించగనే ఆవరణరూపమయిన మాయ తొలగిపోగలదు. అది పూర్తిగా తొలగిపోగానే జీవుని సంసార బంధములకు కారణమయిన కర్మజాలమును తొలగిపోగలదు. అఖండానందరూపమయిన బ్రహ్మజ్ఞానము లభ్యము కానంతవరకే మాయకు జీవుడు అధీనుడై యుండునుగాని, బ్రహ్మజ్ఞానము కలిగినవెంటనే జీవుని బంధించియుంచు మాయ కర్మఫలముతోబాటు నశించునని శ్లోకతాత్పర్యము. కనుక మాయ అనంతము, అది నశించదు అనువాదము సరియైనదికాదు.

పైశ్లోకభావమునే తిరిగి దృఢీకరించుచున్నాడు.

శ్రుతిప్రమాణాఽభివినాశితా చ సా
కథం భవిష్యత్యపి కార్యకారిణీ
విజ్ఞానమాత్రా దమలా ద్వితీయత
స్తస్మా దవిద్యా న పున ర్భవిష్యతి॥

'తత్వ మసి' 'అహం బ్రహ్మాస్మి' 'సర్వం ఖ లిద్వం బ్రహ్మ' 'విజ్ఞానం బ్రహ్మ' మొదలగు ఔపనిషద్మహావాక్యముల నిరంతరమునను నిధిధ్యాసలచే కర్మ వినాశితమయినది. వినాశనమునందిన వస్తువు తిరిగి మోక్షకార్యసాధక మెట్లగును. అది అసంభవము కాదా ? నిరం

తర నిధిధ్యాసాధీనము విజ్ఞానము. విజ్ఞానమనగా పరిశిద్ధము, అద్వితీయమగు పరమాత్మను అనుభవపూర్వకముగాగ్రహించుట. ఆయవస్థలో ఆవరణరూపమునన్న అజ్ఞానము తొలగిపోవును. తొలగిపోయిన మాయ తిరిగి ఆవరించుట అనునది జరుగదు. కాన కర్మ అజ్ఞానసంభవమగుటచే బంధనకారకమేగాని, మోక్షకారకము ఎట్టిపరిస్థితుల లోను కాజాలదు.

లోకములో రజ్జువును చూచి సర్పమను భ్రాంతి కలిగినప్పుడు భ్రాంతి తొలగిపోవునంతవరకే భయపడుదుము. దీపసందర్శనానంతరము యధార్థవస్తుజ్ఞానము తెలియగనే తిరిగి భ్రాంతి కలుగుట యుండదు. అట్లే విజ్ఞానప్రాప్త్యనంతరము తిరిగి కర్మపై బుద్ధి కలుగదని తాత్పర్యము.

అనన్యనిరపేక్షమయిన విజ్ఞానవిద్యయే మోక్షకారణమని పైన చెప్పినదానినే తిరిగి సయుక్తికముగా దృఢపరచుచున్నాను.

యది స్మ నష్టా న పునః ప్రసూయతే
కర్త్రాహ మస్యేతి మతిః కథం భవేత్
తస్మాత్ స్వతంత్రా న కి మప్యపేక్షతే
విద్యా విమోక్షాయ విభాతి కేవలా॥

విజ్ఞానము కలుగగనే కర్తృత్వబుద్ధి నశించును. కర్తృత్వబుద్ధి లేనప్పుడు కర్మయే లేదు. కర్మయే లేనిచో నేను కర్తను అనుభావము ఎట్లు పుట్టును? పుట్టుట కవకాశములేదు. కనుక బ్రహ్మవిద్య స్వతంత్రమయిన విద్య అది యే యితరసహాయమును అపేక్షింపకయే భవబంధములనుండి జీవుని విముక్తు నొనరించుటకు సమర్థమగుచున్నది.

ఈవిషయమున శ్రుతి ప్రమాణమును కన్పరచుచున్నాడు.

సా హైతి రీయశ్రుతి రాహ సాదరం
న్యాసం సమస్తాఖిలకర్మణాం స్ఫుటం
ఏతావ దిత్యాహ చ వాజినాం శ్రుతి
జ్ఞానం విమోక్షాయ న కర్మసాధనం॥

లోకప్రసిద్ధమయిన తైత్తిరీయోపనిషత్తునందలి "న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః" అను శ్రుతి సర్వ కర్మపరిత్యాగమే జ్ఞానసాధనమని ప్రతిపాదించినది. యజ్ఞయాగాది కర్మలుగాని సంతానము గాని, ధనముగాని ముక్తికి హేతువులుగావు. ఒక్క సర్వసంగపరిత్యాగమే అమృతత్త్వమును పొందగలదు అని పై తైత్తిరీయశ్రుతికి అర్థము. "అసుర్యా నామ తే లోకా అంధేన తమసా వృతాః తాం స్తే ప్రేత్యాభిగచ్ఛన్తి యే కే చాత్మహనో జనాః" అనియు 'యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవానుపశ్యతి సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే యస్తు సర్వాణి భూతాని ఆత్మైవాభూ ద్విజానతః తత్ర కో మోహః కః శోక ఏవత్వ మనుపశ్యతః" అనియు వాజసనేయశ్రుతి. జ్ఞానప్రాప్తికి కర్మ సాధనము కాదనియు, కర్మ సన్యాసమే కారణమనియు, ఆత్మజ్ఞానికి సుఖదుఃఖాదులుండవనియు ప్రతిపాదించు చున్నది.

ఆత్మహను లయిన జనులు అంధతమసముతోగూడిన అసురీ లోకములను పొందుదు రనియు తనలోనే సర్వభూతములును, సర్వము లోనే తనను అనుభవపూర్వకముగా దర్శించువాడు పునర్జన్మ నందడు. మోహము, శోకము మొదలగునవికూడ నుండవు అనియు పై శ్రుతి వాక్యముల భావార్థము. ఇట్లు తైత్తిరీయ, వాజసనేయ శ్రుతులుకూడ కర్మసన్యాసమునే ప్రతిపాదించుచున్నవని రామానుడు ప్రతిపాదించినాడు.

అహంకారమూలకమయిన కర్మకును, త్యాగరూపకమయిన జ్ఞానమునకును ఉన్న వైషమ్యమును ప్రతిపాదించి ఫలవిషయకమయిన విభేదమును ప్రతిపాదించుచున్నాడు.

విద్యా సమత్వేన తు దర్శితా స్త్యాగా
క్రతు ర్నదృష్టాంత ఉదాహృతః సమః
ఫలే పృథక్త్వా ద్బహుకారకైః క్రతుః
సంసాధ్యతే జ్ఞానమతో విపర్యయమ్॥

వేదము ఎక్కడను బ్రహ్మవిద్యతో యజ్ఞాదికర్మలు సమానమని చెప్పలేదు. రెండూ సమానమను మంత్ర మేమియు ఉదాహరింపబడ లేదు. అంతేగాక యజ్ఞాదికర్మలు అనేకములు. వాటి ఫలములును అనేకములే. కాని జ్ఞానము ఒక్కటి. మరియు ఏవస్తువిషయికమయి నది. ఆకారణమున వీటివలన లభించు ఫలములుగూడ విభిన్నమయి నవే అగును. అగ్నిహోమాదియజ్ఞములలో జీవుడు అహంకారయుక్తు డగును. "దర్శ పౌర్ణమాసాభ్యా మహం యక్ష్యే" "సద్యఃి పూర్ణ మాసేష్ట్యా ఒహం యక్ష్యే" "తత్ర భూపతే భువనపతే మహతో భూతస్య పతే బ్రహ్మణం త్వాం వృణీమహే" "అహం భూపతి రహం భువనపతి రహం మహతో భూతస్యపతిఃి" ఇత్యాదులగు వాక్యములలో యజమానుడు బ్రహ్మ, ఋత్విక్కుడు, పత్ని, అగ్నీధ్రుడు, అధ్వర్యుడు మొదలగు అనేకభేదములు ప్రతీతమగుచున్నవి. కాని ఆత్మజ్ఞానములో ఏకత్వము ప్రతీతమగును దానికి ప్రమాణములు- "తదే వాగ్ని స్తదా దిత్యస్తద్వాయుస్తదు చన్ద్రిమాఃి తదేవ శుక్రం తద్బ్రహ్మతా ఆపఃి సప్రజాపతిఃి" "సర్వం ఖ ల్విదం బ్రహ్మ నేహ నానాస్తి కించన" ఇత్యా దులగు శ్రుతు లనేకములు బ్రహ్మలో ఏకత్వమును ప్రతిపాదించు చున్నవి. కర్మలు అనేకఫలవంతములుకాగా జ్ఞానము ఏకత్వజ్ఞానరూప మయిన ఫలము నిచ్చునది.

కర్మచేయనిచో ప్రత్యవాయము కలుగును. కనుక కర్మ తప్పక చేయవలెను అనుదానికి సమాధానము నిచ్చుచున్నాడు.

సప్రత్యవాయో హ్యహ మి త్యనాత్మధీ
ర్యస్య ప్రసిద్ధా న తు తత్త్వదర్శినఃి
తస్మా దబుద్ధై స్త్యాజ్య మవిక్రియాత్మభి
ర్విధానతఃి కర్మవిధిప్రకాశితమ్॥

కర్మాచరణ మొనరింపనిచో ప్రత్యవాయము లేక అనర్థము కలుగు ననుభావము అహంకారముగల అజ్ఞానికి సంబంధించినది. బ్రహ్మ తత్త్వమును అవగతమొనర్చుకొనినవానికి అట్టి బుద్ధి యుండదు. తత్త్వ

దర్శి అహంభావశూన్యుడు కనుక అతనికి కర్మ ప్రత్యవాయము సంభవించదు. సుఖదుఃఖములు హర్ష శోకములు లేని మనస్సుగల పండితుడు కర్మను త్యజించవలెను. వాస్తవముగా కర్మను క్రియాఫలాసక్తచిత్తులైనవారికై విధివాక్యములద్వారా వేదమువిధించినది. అట్టివారు కర్మల నాచరించుచు నుండెదరు.

ఇట్లు కర్మసన్యాస మొనర్చిన ముముక్షువు తరువాత చేయు కార్యమును ఉపదేశింపుచున్నాడు.

శ్రద్ధాన్విత స్తత్వ మసీతి వాక్యతో
గురోః ప్రసాదా దపి శుద్ధమానసః
విజ్ఞాయ చైకాత్మ్య మథాత్మజీవయోః
సుఖీ భవే న్మేరు రి వాప్రకంపనః॥

"సమాశ్రయే త్సద్గురు మాత్మలబ్ధయే" అనినాడు. సద్గురువు నాశ్రయించిన వెనుక ముముక్షువు అత్యంతశ్రద్ధాసక్తులతో 'తత్త్వ మసి' 'అహం బ్రహ్మాస్మి' మొదలగు ఉపనిషన్మహావాక్యములను మననము చేయవలెను. ఆ మనన కారణమునను సద్గురు కటాక్షమువలనను పరిశుద్ధమనస్కుడగు శిష్యుడు పరమాత్మ-జీవాత్మలు ఒక్కటే నను వాస్తవ జ్ఞానము కలిగి అఖండానందరసనిమగ్నుడగును. అట్టి పరమసుఖమున పొందినవాడు మేరువువలె అచలుడగును. అనగా పునరావృత్తిరహితుడై ఆత్మైక్యమును పొందును.

జీవాత్మ-పరమాత్మల ఐక్యజ్ఞానము కలుగు క్రమపరిపాటిని ప్రదర్శించుచున్నాడు–

ఆదౌ పదార్థావగతి ర్హి కారణం
వాక్యార్థవిజ్ఞానవిధౌ విధానతః
తత్వ మృదాద్యో పరమాత్మజీవకా
వసీతి చైకాత్మ్య మథానయో ర్భవేత్ ॥

'తత్వమసి' మొదలగు వాక్యముల లక్ష్యార్థమును తెలుసుకొనుటకు ముందు ఆ వాక్యమందలి వేరువేరు పదముల అర్థమును తెలిసికొన

వలెను. ఆ వాక్యార్థవిధానము ఇది– తత్వమసి అను వాక్యములో మూడు పదములున్నవి. 'తత్-త్వం-అసి' అని. ఇందు తత్ అను పదమునకు పరమాత్మ యని అర్థము. త్వం అనగా జీవుడు అని అర్థము. 'అసి' అనగా అయితివి అని అర్థము. ఈ మూడుపదములుకూడి అది నీవు అయితివి అను నర్థము నిచ్చుచున్నవి. అనగా సంసారబంధనముక్తుడవగు నీవు ఆ పరమాత్మస్వరూపుడవయితివి అని శిష్యునిగూర్చి గురువు యొక్క వాక్యమిది. శిష్యుడు గురుముఖతః ఈ వాక్యముయొక్క అర్థమును గ్రహించవలెనని భావము.

వాక్యార్థమును గ్రహించిన అనంతరము ముముక్షువు జీవపరమాత్మల ఏకత్వమును తెలుసుకొనవలెనని బోధించుచున్నాడు–

ప్రత్యక్పరోక్షాదివిరోధ మాత్మనో
ర్వ్యపోహ్య సంగృహ్యా తథో చ్చిదాత్మతాం
సంశోధితాం లక్షణయా చ లక్షితాం
జ్ఞాత్వా స్వ మాత్మాన మథాద్వయో భవేత్ ॥

అహంకారవేద్యుడగుటచే ప్రత్యక్షత్వము జీవధర్మము. ఇంద్రియగోచరము అహంకారముచే తెలియబడనిది అగుటచే పరోక్షత్వము పరమాత్మధర్మము. ఈవిధముగా ప్రత్యక్షపరోక్షత్వములు జీవాత్మ పరమాత్మలకు విరోధలక్షణములుగా కన్పట్టుచున్నవి. అంతేగాక కించిజ్ఞత్వము జీవలక్షణము కాగా ఆత్మలక్షణము సర్వజ్ఞత్వమని చెప్పబడుచున్నది. కనుక ముముక్షువు గురుసహాయమున ఈ రెంటి విరోధమును పరిగణించక రెంటిలోను సమానముగానుండు చిన్మయత్వమునే అవగతమొనర్చుకొనవలెను. యుక్తిప్రయుక్తులచే సాధించబడినదియు, లక్షణార్థముచే లక్షించబడినదియు అగు స్వకీయజీవాత్మను పరమాత్మగా గ్రహించగలిగినప్పుడు భేదరాహిత్యము కలుగును. అనగా అద్వైత భావము సిద్ధించునని భావము.

జీవాత్మ-పరమాత్మలవిషయమై లక్షణార్థముచే లక్షింపబడిన తరువాతనే ఐక్యతకలుగునని చెప్పబడినది. లక్షణయా ఆత్మస్వరూప

మును తెలిసికొను విధానమిది. 'తత్త్వమసి' అను వాక్యమందు 'తత్' త్వం' అను శబ్దములకు వాచ్యార్థము, లక్ష్యార్థము– రెండూ ఉన్నవి. మాయ ఉపాధిగాగలిగి సర్వజ్ఞత్వాదులు లక్షణములుగల పరమాత్మ యని తత్పదమునకు వాచ్యార్థము. కించిజ్ఞత్వాది విశిష్టత్వము త్వం పదమునకు వాచ్యార్థము. ఈ వాచ్యార్థను ననుసరించి పరమాత్మ-జీవాత్మలకు విరోధము సిద్ధించుచున్నది. ఆకారణమున ఐక్యత సంభవింపనేరదు. కనుక ఈరెంటి ఐక్యతను సాధించుటకు లక్షణయావిశేషణాంశములను త్యజించవలెను. అనగా పరమాత్మయొక్క మాయోపాధికత్వ సర్వజ్ఞత్వములను, జీవుని కించిజ్ఞత్వ మాయాకార్య త్వాజ్ఞానావృతత్వాదులను వదలి వాటి చిన్మయస్వరూపములనే స్వీకరింపవలెను. అప్పుడు వాచ్యార్థమున గ్రహించిన విరోధము ఈ లక్షణార్థమున సంభవింపదు.

లక్షణ అనగా ఈవిధముగా నిర్వచింపబడినది–ముఖ్యార్థబాధే తద్యోగేరూఢితోఽర్థప్రయోజనాత్. అన్యోఽన్యో లక్ష్యతే యత్సా లక్షణారోపితా క్రియా–అని. అనగా ఏస్థలములో శబ్దముయొక్క ముఖ్యార్థము బోధకమగునో అచ్చట ప్రసిద్ధి ననుసరించిగాని, ప్రయోజనము ననుసరించిగాని మరియొక సముచితార్థము ప్రతీతమయినచో అట్టి శబ్దశక్తికి లక్షణ యని పేరు. 'యష్టయఃి ప్రవిశంతి' అని వాక్యమున్నది. 'కర్రలు ప్రవేశించుచున్నవి' అని వాచ్యార్థము. కర్రలు తమంతటతాము ప్రవేశించుట అసంభవముగదా ! ఆకారణమున ఆశబ్దముల ముఖ్యార్థమును గ్రహింపక దండధారులగు పురుషులు ప్రవేశించుచున్నారు అని సముచితార్థము చెప్పుకొనవలెను. ఈ అర్థమును ప్రతీతమొనరించు శబ్దశక్తినే లక్షణాశక్తి అందురు. అట్లే వాచ్యార్థముచే జీవాత్మ పరమాత్మలకు విరోధము కన్పట్టుచుండగా లక్ష్యార్థముద్వారా జీవాత్మపరమాత్మల చిన్మయత్వమును మాత్రమే గ్రహింపవలెను. అప్పుడే ఐక్యము కుదురును.

పై శ్లోకమున చెప్పిన లక్షణాస్వరూపమును వివరించుచున్నాడు-

ఏకత్మకత్వా జ్జడతా న సంభవేత్
తథా జహల్లక్షణయా విరోధతః
సోయం పదార్థా వివ భాగలక్షణా
యుజ్యేత తత్త్వం పదయో రదోషతః ॥

జీవాత్మ పరమాత్మల ఐక్యజ్ఞానము కలిగినప్పుడు అజ్ఞానలక్షణ మగు జడత్వము కించిన్మాత్రమయినను ఉండదు. అయితే ఇక్కడ తత్-త్వం అను పదములకు లక్షణార్థము చెప్పుటలోను విరోధము కన్పించుచున్నది. కనుక 'సో ఽయం' అను పదములకు లక్షణార్థము చెప్పినట్లు అర్థము చెప్పవలెను. అనగా 'తత్-త్వం' అను పదములకు భాగలక్షణ ననుసరించి అర్థము చెప్పినచో ఎట్టి విరోధమును కలుగదు.

విభిన్నదృష్టుల ననుసరించి వాక్యమందలి ఏదైన శబ్దమునకుగాని వాక్యాంశమునకుగాని లక్ష్యార్థమును గ్రహింపవలసి వచ్చినపుడు లక్షణలో రెండు ముఖ్యభేదములు కలుగును. రూఢాలక్షణా, ప్రయోజనవతీలక్షణా అని వాటిపేర్లు. శబ్దముయొక్క నియతార్థమును పరిత్యజించి పూర్వమునుండి రూఢమయిన భిన్నార్థమును గ్రహించినచో అది రూఢలక్షణ అనబడును. నియతార్థమును వదలి ఏదయిన ప్రయోజనము నాశించి లక్ష్యార్థమును గ్రహించినపుడు అది ప్రయోజనవతీ లక్షణ అనబడును. రెండవదగు ప్రయోజనవతీలక్షణలో రెండుభేదము లున్నవి-గౌణీలక్షణ, శుద్ధాలక్షణ. సాదృశ్యముచ్వారా లక్ష్యార్థము తెలియబడినచో గౌణీలక్షణ సాదృశ్యాతిరిక్తమయిన అన్యసంబంధముచే లక్ష్యార్థజ్ఞానము కలిగినచే శుద్ధాలక్షణ యగును. పురుషసింహుడు అను వాక్యములో సింహమందలి పరాక్రమాదిగుణసాదృశ్యము పురుషునియం దున్నదన్నమాట. శుద్ధాలక్షణలలో ఇట్టి సాదృశ్యముండదు. 'నీటిలో ఇల్లున్నది' అన్న వాక్యములో నీటికి ఇంటికి ఎట్టి సాదృశ్యమును లేదు. ఆ రెంటి వికటత్వముమాత్రమే లక్ష్యార్థముచే బోధపడును. కనుక ఇది శుద్ధాలక్షణ.

శుద్ధాలక్షణలో లక్షణ లక్షణ యనియు, ఉపాదానలక్షణ యనియు రెండు భేదములున్నవి. లక్ష్యార్థమును గ్రహించినపుడు వాచ్యార్థమును ఎంతమాత్రము గ్రహింపకుండినచో అది లక్షణ లక్షణ అనబడును. దీనినే 'జహత్ స్వార్థాలక్షణ' అనగా తన అర్థమును వదలు లక్షణ యని అర్థము. 'గంగాయాం ఘోషః' అనునప్పుడు గంగాప్రవాహములో ఘోషముండుట అసంభవము కనుక దాని అర్థమును వదలి గంగాతీరమందున్న ఘోషమని అర్థము చెప్పవలెను. కనుక ఇది లక్షణ లక్షణ లేక జహత్ స్వార్థాలక్షణ లక్ష్యార్థముతో పాటు కొంత వాచ్యార్థమునుగూడ గ్రహించినచో ఉపాదానలక్షణ యగును. వీనిని అజహత్ స్వార్థాలక్షణ యందురు. తనయొక్క అర్థమును వదలిపెట్టనిది అని దీని అర్థము. "కాకేభ్యో దధిరక్ష్యంతాం" అనునప్పుడు పెరుగును. తినివేయు కాకులనుండియేగాక, దానిని పాడు చేయు కుక్క మొదలగు అన్యజంతువులనుండికూడ దానిని కాపాడుమని లక్ష్యార్థము. ఇక్కడ వాచ్యార్థమగు కాకులు, లక్ష్యార్థమగు కుక్క మొదలయినవికూడ గ్రహించబడినవి. కనుక ఇది ఉపాదాన లక్షణ లేక అజహత్ స్వార్థాలక్షణ.

తత్-త్వం అను పదములకు ఈ రెండు లక్షణల ననుసరించియు చెప్పరాదు. కనుక వేదాంతులు భాగలక్షణలేక భాగత్యాగ లక్షణ అను మూడవలక్షణను అంగీకరించినారు. దీనినే జహదజహల్లక్షణ యందురు. శబ్దముయొక్క ముఖ్యార్థములో కొంతభాగమును విడలి కొంతభాగమును గ్రహించినచో ఈలక్షణార్థము వచ్చును. ఈ లక్షణ ననుసరించి 'తత్-త్వం' లకు "సోయం దేవదత్తః" అనుదానికి అర్థము చెప్పినట్లు చెప్పవలెను. దేవదత్తుడనువాడు రాముడనువానికి చెన్న పట్టణములో కన్పించినాడు. అతడే కొంతకాలము తరువాత విజయవాడలో కన్పించినాడు. అప్పుడు రాముడు దేవదత్తునిగూర్చి ఆ చెన్న పట్టణములో కన్పించిన దేవదత్తుడే ఇతడు అనినాడు. ఇదివరకు చెన్న నగరములోను, ఇప్పుడు విజయవాడలోను ఉన్న దేవదత్తుడు ఒక్కడే.

కాని అతడు ఇచివరకు చెన్ననగరములో ఉండెడివాడు. కాని ఇప్పుడు కార్యాంతరమున విజయవాడ వచ్చియున్నాడు. అంతేగాని చెన్న నగరవాసి యగు అతనిని విజయవాడవాసిగా చెప్పలేము. అట్లే తత్ పదార్థమయిన బ్రహ్మ, త్వం పదార్థమయిన జీవుడు ఒక్కడే. ఆ బ్రహ్మ యే శరీరమం దుండుటచే జీవు డనబడినాడు. శరీరసంసర్గమున ఆత్మ యగు జీవునకు కించి జ్ఞత్వాది లక్షణములు సంభవించినని. అంతేగాని వాస్తవమునకు అట్టి లక్షణములు కలవాడుగాడు. చెన్ననగరము విజయ వాడ అనుస్థానములను తీసివైచినచో దేవదత్తు డనువాడు ఒక్కడే ఎట్లి గుచున్నాడో అట్లే జీవునిలోని కించి జ్ఞత్వాది లక్షణములను పర మాత్మలోని పరమత్వమును తొలగించి మిగిలినదానిని గ్రహించినచో రెంటిలోను 'ఆత్మ' మిగులును. ఆ యాత్మయే ఏకపదార్థము. ఇక్కడ తత్త్వంపదార్థమయిన పరమాత్మలోనుండి పరమత్వమును జీవాత్మలోని జీవ త్వమును (కించిజ్ఞత్వాదులను) విడిచిపుచ్చి రెంటిని ఏకముచేసినచో 'ఆత్మ' అను వస్తువు మిగులుచున్నది. ఇదే భాగత్యాగలక్షణ లేక జహదజహల్లక్షణ. ఈఅర్థమును చెప్పుకొనినచో జీవాత్మ పరమాత్మల అభేదత్వము సిద్ధనుగుచున్నది.

ఉపాధిభేదమున వేరుగానున్న జీవుని పరమాత్మలో క్రమముగా కలుపుటకు ప్రయత్నించువాడై మొదట ఉపాధిని ప్రదర్శించుచున్నాడు.

రసాదిపంచీకృతభూతసంభవం
భోగాలయం దుఃఖసుఖాదికర్మణాం
శరీర మాద్యంత్వ దాదికర్మజం
మాయామయం స్థూల ముపాధి మాత్మనః॥

పంచీకృతములగు పృథివ్యాదులో వాయురాకాశములను పంచ భూతములవలనను శరీరము లేక ఉపాధి జనించుచున్నది. ఇది సుఖ దుఃఖరూపములగు కర్మఫలములను అనుభవించుటకు ఆలయము లేక గృహమువంటిది. ఆత్మకు ఉపాధి యగు ఈ శరీరము స్థూలమయినది.

మాయామయ మయినది. ఆద్యంతములు కలది. ప్రాక్తన కర్మలవలన జనించినది.

భూతపంచీకరణవిధాన మిది– మొదట పంచభూతములను ఒక్కొక్కదానిని రెండేసి భాగములుగా విభజించవలెను. అనగా పది భాగములగును. ప్రతిభూతముయొక్క మొదటిభాగములను ఒక్కొక్కదానిని నాల్గేసి భాగములుగా విభజించవలెను. తన అర్ధభాగమును విడలి మిగిలినభూతముల అర్ధభాగముతో ఈ నాల్గుభాగములను కలుపవలెను. ఇట్లు అయిదుభాగములను కలిపినచో పంచీకరణమగును. ఉదాహరణ– పృథివ్యప్తేజోవాయురాకాశములు పంచభూతములు. ఒక్కొక్కదానిని రెండుభాగములు చేయగా మొత్తము పదిభాగము లగును. పృథివీ భూతముయొక్క రెండుభాగములలోను ఒకభాగమును గ్రహించి దానిని తిరిగి నాల్గుభాగములు చేయవలెను. ఆ నాల్గుభాగములను పృథివీ సంబంధమున అర్ధభాగమును పరిత్యజించి తక్కిన నాల్గుభూతముల ద్వితీయార్ధభాగములలో కలుపవలెను. ఇట్లే తక్కిన నాల్గుభూతముల విషయముకూడను. ఈ పంచీకృతభూతములే శరీరమనబడును. ఉదాహరణకు మానవశరీరమును తీసికొందము. పంచీకరణవిధానము ననుసరించి మానవశరీరములో పృథివీభూతములో అర్ధభాగమును, ఇతర నాల్గుభూతములలో ప్రతిఒక్కదాని ఎనిమిదవభాగమును ఉన్నదన్న మాట. ఇది స్థూలశరీరసంభవప్రకారము. ఈ స్థూలశరీరమే ఆత్మకు ఉపాధి యనబడును.

స్థూలశరీరసంభవమును ప్రతిపాదించి సూక్ష్మశరీరమును ప్రతిపాదించుచున్నాడు.

సూక్ష్మం మనోబుద్ధి రహంక్రి యేంద్రియైః
ప్రాణై రపంచీకృతభూతసంభవమ్
భోక్తుః సుఖాదే రనుసాధనం భవే
చ్ఛరీర మన్య ద్వి దు రాత్మనో బుధాః॥

సంకల్పవికల్పాత్మకమయిన మనస్సు బుద్ధి, అహంకారము, పంచజ్ఞానేంద్రియములు. పంచకర్మేంద్రియములు, పంచప్రాణములు అపంచీకృతమయిన భూతపంచకముతో కలిసి భోక్త అయిన జీవాత్మయొక్క సూక్ష్మశరీరమునకు కారణమగుచున్నవి. ఈ సూక్ష్మశరీరము జీవుని సుఖదుఃఖాద్యనుభవమున కసాధనమని వేత్తలు చెప్పుదురు. ఇది పంచీకృతభూతసంభవమయిన స్థూలశరీరముకంటె భిన్నమయినది.

పై శ్లోకమునందు చెప్పబడిన పంచజ్ఞానేంద్రియములు చక్షువులు, శ్రోత్రములు, జిహ్వ, త్వక్, నాసికలు. పంచకర్మేంద్రియములు-వాక్కు, పాణి, పాదములు, వాయువు, ఉపస్థలు. పంచప్రాణములు-ప్రాణ, అపాన, వాన, ఉదానసమానములు.

సాంఖ్యతత్త్వకౌముదిలో ఈశరీరము మూడు భేదములుకలదిగా చెప్పబడినది-"సూక్ష్మా మాతా పిత్రజా సహ్రసభూతై స్త్రిధా విశేషాస్యుః. సూక్ష్మాస్తేషాం నియతా మాతా పిత్రజానివర్తంతే" అని. సూక్ష్మము, మాతాపిత్రజము, పంచభూతసంబంధి- అని శరీరములు మూడు. వీటిలో సూక్ష్మశరీరము ఎల్లప్పుడు ఉండును. మాతాపిత్రజము, పంచభూతోత్పన్నములగు శరీరములు నశించును. సూక్ష్మశరీరమే లింగశరీరమనియు చెప్పబడును. లింగశరీరము లేనిచో స్థూలశరీరము కాగితము లేకుండా చిత్రము, వృక్షములేకుండా నీడ ఉండనట్లే ఉండదు.

ప్రాణాది పంచవాయువులు శరీరమున వ్యాపించియుండును. నాసిక, హృదయము, నాభి, పాదాంగుష్ఠములందు వ్యాపించియుండు వాయువు ప్రాణవాయువు. కంఠమునకు పైనుకభాగమున పృష్ఠమున, పాదములందు, గుదప్రదేశమునందు, లింగమునందు, పార్శ్వములందు వ్యాపించియుండు వాయువు అపానమనబడును. హృదయమధ్యమున, నాభిమధ్యమున, సర్వసంధులలోను వ్యాపించియుండు వాయువు సమాన మనబడును. హృత్కంఠములందును, తాలువు మస్తకము, భ్రూమధ్య

మున ఉండు వాయువు ఉదానమనబడును. శరీరమందంతటను ప్రవహించునది వ్యానమనబడును.

జీవునకు ఉపాధులయిన స్థూలసూక్ష్మశరీరములను వివరించి క్షణభంగురమగు దేహము నశించినవెంటనే జీవుడు ముక్తుడగునుకదా! అట్టిచో అతడు మోక్షమునకై ఎందుకు ప్రయత్నించవలెనను ప్రశ్నకు సమాధానమిచ్చుచున్నాడు–

అనా ద్యనిర్వాచ్య మపీహ కారణం
మాయాప్రధాన స్తు పరం శరీరకం
ఉపాధిభేదా త్తు యతః పృథక్స్థితం
స్వాత్మాన మాత్మ న్యవధారయే త్ప్ర-మాత్ ॥

వాస్తవమునకు పరమాత్మ అనాది, అనిర్వాచ్యము అయినది. అనగా ఆత్మకు జన్మ అనునది లేదు. సత్తు అసత్తు అని చెప్పుటకు సాధ్యముగాదని భావము. అయినప్పటికిని అది మాయాప్రధానమయిన కారణోపాధిని అవలంబించియుండును. ఈ మాయోపాధి ఆత్మయొక్క ముఖ్యోపాధి. ఇది స్థూలసూక్ష్మోపాధులకుకూడ కారణము. సర్వసృష్టికర్త అయిన ఈశ్వరుడు ఈ మాయోపాధియుక్తుడయిన ఆత్మయే. ఈవిధమున ఉపాధిభేదమున వేరుగానున్న పరమాత్మయొక్క ఉపాధులను నిరాకరించి శ్రవణమనననిధిధ్యాసలద్వారా బ్రహ్మకు జీవునకుసంబంధించిన భేదబుద్ధిని పరిత్యజించి అభేదత్వమును సాధించవలెను. అనగా శ్రవణ మనననిధిధ్యాసలద్వారా స్థూలసూక్ష్మకారణోపాధులను నిరాకరింపవలెను. అప్పుడే జీవాత్మైక్యత సిద్ధించునని భావము. శ్రవణాదులచే అద్వైతసిద్ధి కలుగుననుటకు శ్రుతిప్రమాణము– "ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిధిధ్యాసితవ్యో" అని బృహదారణ్యకము. శ్రుతివాక్యములచే వినబడుచుండుటచే పరమాత్మ శ్రోతవ్యుడు. ఉపపత్తుల ననుసరించి మనన మొనరింపబడువాడగుటచే మన్తవ్యుడు. ఉపపత్తులచే నిశ్చితుడయినవానిని ధ్యానించి అనుభవమొనరించుకొన

దగినవాడగుటచే నిధిధ్యాసితవ్యుడు--శ్రోతవ్యః శ్రుతివాక్యేభ్యో మంత వ్యశ్చోపపత్తిభిః, మత్వా చ సతతం ధ్యేయ ఏతే దర్శనహేతవః" అని.

అన్నమయ ప్రాణమయాది కోశభేదస్థితుడయిన పరమాత్మ అనే కుటుకాగా నీవు ఏకత్వము నెట్లు చెప్పుచున్నావను శంకకు సమాధాన మిచ్చుచున్నాడు—

కోశేషు పంచ స్వపి తత్తదాకృతి
ర్విభాతి సంగాత్ స్ఫటికోపలో యథా
అసంగరూపో ఽయ మజో యతో ఽద్వయో
విజ్ఞాయతే ఽస్మిన్ పరితో విచారితే ॥

వాస్తవమునకు ఆత్మ ఏవిధమగు బాహ్యావస్తుసంసర్గము లేనిది. జన్మాదివికారములు లేనిది. తనకంటే భిన్నమగు వస్తువులేనిది. అయినను అది అన్నమయ ప్రాణమయాది పంచకోశములందు విభక్తమై ఆ యా కోశాకృతుల నందుచున్నది. కోశసంసర్గమున విభిన్నరూపములు కలదయినను సంసర్గకల్పమాత్రము ఆత్మకు సంభవించదు. ఉదాహరణకు స్ఫటికమణిని తీసికొందము. స్ఫటికమణి వాస్తవమగు రంగు స్వచ్ఛమగు తెలుపు. అయినను అది వేరువేరు రంగులుగల వస్తువులతో గూడి ఆ యా వర్ణములు గలదివలె అగుచున్నది. అనగా సామీప్యవశమున ఆ యా వస్తువుల రంగులు స్ఫటికమణిలో ప్రతిబింబించుచున్నవే గాని దానిలో ఆ రంగులు లేవు. అట్లే ఆత్మయు అన్నమయాది కోశభేదమున వేరుగ తోచునేగాని దానిలో భేదము లేదు. ఆత్మయొక్క ఈవాస్తవస్వరూపమును గ్రహించవలెనన్న తత్త్వమస్యాది మహావాక్యవిచారరూపమయిన సాధన అవసరమగును. అనంతరమే పంచకోశములందున్న ఆత్మ ఒక్కటే అను విజ్ఞానము కలుగును.

అన్నమయకోశము, ప్రాణమయకోశము, మనోమయకోశము, విజ్ఞానమయకోశము, ఆనందమయకోశము— అనునవి పంచకోశములు. స్థూలదేహమును అన్నమయకోశమనియు, మనస్సు పంచకర్మేంద్రియములను మనోమయకోశమనియు, బుద్ధి, పంచజ్ఞానేంద్రియములను విజ్ఞా

నమయకోశమనియు, పంచప్రాణములను ప్రాణమయకోశమనియు, సత్త్వప్రధానమై ప్రేమ మోదప్రమోదములతో గూడుకొనియున్న కారణశరీరము ఆనందమయకోశమనియు చెప్పబడుచున్నవి. ఒకే ఆత్మ భిన్నభిన్నకోశములలో ప్రతిబింబించుననుటకు ప్రమాణములు–"కుసుమ వచ్చమణేః" (మణిలో కుసుమములవలె) "తమే వానువదతి తస్మిం శ్చి ద్దర్పణే స్వాచ్ఛే సమస్తావస్తుదృష్టయః, ఇవా స్వాః ప్రతిబింబంతి సరసీవ తటద్రుమాః." సరోవరములో ఒడ్డుననున్న వృక్షములు ప్రతిబింబించిన అవిమాత్రను నీటిలో తమవవ్వు. అట్లే చైతన్యమను దర్పణమున ఈ జగత్తంతయు కన్పించును. అట్లు కన్పించుట మాయయే గాని యథార్థముగాదు. వాస్తవమునకు చైతన్యము శుద్ధమయినది. ఆకారణమున అది అసంగము, అజము అయినది అని చెప్పబడుచున్నది. దానిని తెలుసుకొనినచో ఆనందప్రాప్తికలుగుననుటకు కొన్ని శ్రుతులు– "అణోరణీయా న్మహతో మహీయా నాత్మా ఽస్యజన్తోర్నిహితో గుహాయాం, తమక్రతుఃపశ్యతివీతశోకో ధాతుః ప్రసాదా న్మహిమానమాత్మనః. (యజు–కఠో) "అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం తథా ఽరసన్నిత్య మగంధవ చ్చ యత్ అనా ద్యనంతం మహతః పరం ధ్రువం నిచాయ్య తన్మృత్యుముఖా త్ప్రముచ్యతే," (కఠోపనిషత్) అణువుకంటె అణువు మహత్తమమయినదానికంటె మహత్తమము అగు ఆపరమాత్మ ప్రతి జంతువుయొక్క హృదయకుహరమున వసించి యున్నది. దానిని దర్శించినజ్ఞాని వీతశోకుడగును– శబ్దస్పర్శరూపగంధ రహితము, అనాది, అనంతము మహత్తుకంటె పరమయినది, ధ్రువము అగు ఆ యాత్మస్వరూపమును గ్రహించినవాడు మృత్యుముఖమునుండి విడువబడినవా డగును–అని ఫ్రైశ్రుతుల భావార్థము.

అన్నమయాది పంచకోశములందును ఒకేపరమాత్మ అసంగుడై వ్యాపించియుండునని నిరూపించి జాగ్రదాద్యవస్థాత్రయము ఆత్మధర్మము కాదని ప్రతిపాదించుచున్నాడు.

బుద్ధే స్త్రిధా వృత్తిరపీహ దృశ్యతే
స్వప్నాది భేదేన గుణత్రయాత్మనః
అన్యోన్యతో ఽస్మిన్ వ్యభిచారతోమృషా
నిత్యేపరే బ్రహ్మణి కేవలే శివే॥

జాగ్రత్ స్వప్నసుషుప్తులు అవస్థాత్రయ మనబడును. సత్వరజస్తమస్సులను మూడు బుద్ధియొక్క గుణములు. అవస్థాత్రయము ఈగుణత్రయమునుండి జనించినవి. కాన అవి బుద్ధిధర్మములేకాని ఆత్మధర్మములు కావు. ఈఅవస్థలను పరమాత్మయొక్క ధర్మముగా భావించుట అనగా మిథ్యాజ్ఞానమం దున్నారన్నమాట. నిత్యుడు ప్రకృతికంటె పరుడు, కేవలుడు, మంగళస్వరూపుడు అగు పరమాత్మయందు అనిత్యములు, ప్రకృతిజన్యములు అనేకములు అమంగళకరములు (సంసారకారకములు) అగు జాగ్రత్ స్వప్నసుషుప్త్యవస్థలను చూచుట కేవల మృషాజ్ఞానమాత్రమే అగును. జాగ్రదవస్థలో స్వప్నసుషుప్తులు, స్వప్నములో జాగ్రత్ సుషుప్తులు, సుషుప్తిలో జాగ్రత్ స్వప్నములు నశించును. కాని ఈ మూడుఅవస్థలయందును పరమాత్మ సాక్షీభూతుడయియుండును. "జాగ్రత్ స్వప్నం సుషుప్తే చ గుణతో బుద్ధివృత్తయః తాసాం విలక్షణో జీవః సాక్షిత్వేన వ్యవస్థితః" అని ప్రమాణము. సత్వరజస్తమస్సులు ప్రకృతి లేక మాయయొక్క గుణములను విషయము ప్రసిద్ధమే. "సత్త్వం రజస్తమ ఇతిప్రాకృతంతు గుణత్రయం ఏతన్మయీ చ ప్రకృతి ర్మాయా యా వైష్ణవీశ్రుతా.

దేహేంద్రియ ప్రాణ మన శ్చిదాత్మనాం
సంఘాదజస్రం పరివర్తతే ధియః
వృత్తిస్తమోమూల తయాఽజ్ఞ లక్షణా
యావద్బవేత్తావదసౌ భవోద్భవః॥

దేహము, ఇంద్రియములు, ప్రాణము, మనస్సు, చిదాత్మ అనువాటితో కలసియున్నందువలన బుద్ధి నిత్యము పరివర్తనచెందుచుండును.

అజ్ఞానమూలకమయిన బుద్ధి పరివర్తనజరుగుచున్నంతకాలము సంసారము వదలక యుండును.

నేతి ప్రమాణేన నిరాకృతాఖిలో
హృదాస మాస్వాదిత చిద్ఘనామృతః
త్యజేదశేషం జగదాత్త సద్రసం
పీత్వాయథాంభః ప్రజహాతితత్ఫలం ॥

"అథాత ఆదేశో నేతి నేతి న హ్యేతస్మాదితి నేత్యన్యత్ పర మస్తి స ఏష ఆత్మా నేతి నేతి" ఇత్యాదులగు ఉపనిషన్వాక్యములచే దృశ్యమగు అఖిలజగత్తు మిథ్యగా ప్రతిపాదింపబడి నిరాకరింపబడినది. కనుక ఆత్మజ్ఞానియైనవాడు దీనిని వదలివేయుట అనసరము. జ్ఞాని తన హృదయమందు చైతన్యఘనమై అమృతసరూపమగు ఆత్మరసమును ఆస్వాదించి అసారరూపమయిన జగత్తును వదలివేయవలెను. దానినే దృష్టాంతముచే దృఢపరచుచున్నాడు–లోకములో దప్పికగొనినవాడు రసవంతమగు ఆమ్రాదిఫలములయందలి మధురాదిరసములను గ్రోలి మిగిలిన పిప్పిని పారవేయునుగదా !

అస్థిస్నూణాస్నాయు మాంసశోణితయుక్తమై చర్మముచే గప్పబడి మూత్రపురీషముల దుర్గంధముచే దూషితమయిన దీ శరీరము. ఇది జరాశోకములచే కూడినది. రోగములకు స్థానమయినది. రజోయుక్తము, భూతస్థానము అగు ఈ శరీరమును ప్రవాహతీరమందుండు వృక్షము తీరమును, వృక్షమును పక్షి ఎట్లుపరిత్యజించునో అట్లే త్యజించి సంసారమను మొసలినుండి విడివడును– అని పెద్దల వాక్యము. ("అస్థి స్నూణం స్నాయు యుతం మాంసశోణిత లేపనం, చర్మావనద్ధం దుర్గంధి పూర్ణం మూత్రపురీష యోః జరాశోక సమావిష్టం రోగాయన మనాతురం, రజస్వలమసన్నిష్టం భూతావాస మిమం త్యజేత్. నదీకూలం యథా వృక్షోవృక్షం వా శకునిర్యథా తథా త్యజన్నిమం దేహం కృచ్ఛ్రాద్ధాహ్యిముచ్యతే.") సారవస్తువు ఆత్మ. జగత్తు సారహీనమయిన పిప్పివంటిది. కనుక చిద్ఘనానందరూపుడయిన ఆత్మను అను

భవపూర్వకముగా గ్రహించి మిగిలిన జగత్తును పరిత్యజించవలెను. ఇది మహావాక్యవిచారణచే కలుగు ఫలితము, ఆత్మపదార్థము శాశ్వతమని నిరూపించుచున్నాడు–

కదాచిదాత్మానమృతో నజాయతే
నక్షీయతే నాపి వివర్ధతే ఽన వః
నిరస్త సర్వాతిశయః సుఖాత్మకః
స్వయంప్రభః సర్వగతోఽయ మద్వయః ॥

జాయతే (పుట్టును) అస్తి (ఉండును) విపరిణమతే (మార్పుచెందును) వర్ధతే (వృద్ధిపొందును) అపక్షీయతే (క్షీణించును) నశ్యతి (నశించును) అనునవి షడ్వికారములు. ఈ వికారములు సమస్తవస్తుజాలమునకు ఉండును. కాని జగత్సారరూపుడయిన పరమాత్మకుమాత్రము ఈషడ్వికారములు ఉండవు. ఆత్మవస్తువు ఎన్నడును మరణించదు. జన్మించదు. క్షీణించదు. వృద్ధినందదు. అది నవత్వరహితము. క్రొత్తగా జన్మయనునది లేకపోవ్రటచే క్రొత్తదనములేనిది, జీర్ణించనిది, నిత్యము ఒకేవిధముగా నుండునది అని భావము. ప్రపంచమందలి లౌకికసుఖముల నన్నిటిని నిరసించి సర్వాతిశాయియగు సుఖస్వరూపముగలది. అది స్వయంప్రకాశము గలది. సర్వత్ర వ్యాపించియుండునది. ద్వంద్వభావములేనిది. "యస్యభాసా సర్వమిదం విభాతి" అన్న శ్రుతివాక్యముచే పరమాత్మ స్వయంప్రభుడన్న విషయమును "నజాయతే మ్రియతేవా విపశ్చిన్నాయం కుతశ్చి న్నబభూవకశ్చిత్, అజోనిత్యః శాశ్వతోఽయం పురాణోన హన్యతే హన్యమానే శరీరే–హంతా చేన్మన్యతే హంతుం హతశ్చేన్మన్యతేహతం, ఉభేతేన విజానీతే నాయం హంతి నహన్యతే" అను వాక్యములచే అతని జన్మమరణాదిరాహిత్యములు సమర్థితములగుచున్నవి.

అజ్ఞానమే పరమాత్మయందు సాంసారిక సుఖదుఃఖములను చూచుటకు కారణమని స్పష్టపరచుచున్నాడు.

ఏవం విధే జ్ఞానమయే సుఖాత్మకే
కథం భవో దుఃఖమయః ప్రతీయతే
అజ్ఞానతాధ్యాసవ శాత్ప్రకాశతే
జ్ఞానే విలీయేత విరోధతః క్షణాత్ ॥

పరమాత్మ వికారరహితుడు, జ్ఞానస్వరూపుడు, నిరతిశయానంద స్వభావుడు అను విషయము స్పష్టమయినది. కనుక అతనిలో జన్మ మరణరూపములయిన ప్రాపంచిక దుఃఖములకు తావులేదు. అతనిలో సుఖదుఃఖములను చూచుటకు భ్రమాత్మకబుద్ధియే కారణము. అజ్ఞాని యొక్క అంతఃకరణ మొదట అహంకారమమకారములకు వశీభూతమై భ్రమకు లోనవుతుంది. పరమాత్మలో సుఖదుఃఖములు కల్పనామాత్ర ములేగాని వాస్తవములు గావు. కనుక అజ్ఞానవిరోధియైన జ్ఞానము కలుగగానే అజ్ఞానము నశిస్తుంది. సంసారకారణమయిన అజ్ఞానము నశించగనే భ్రమాత్మకబుద్ధ్యాదులుకూడ నశించి సంసారదుఃఖాదు లున్ను నశించును. దీపమువలన రజ్జుసర్పభ్రాంతి నశించి యథార్థ రజ్జు జ్ఞానము కల్గునట్లుగనే జ్ఞానమువలన యథార్థవస్తుజ్ఞానము కలుగును.

"అవ్యక్తా ద్యవిశేషాంతే వికారే ఒస్మింశ్చ వర్ణితే
చేతనాచేతనాన్య త్వజ్ఞానేన జ్ఞానముచ్యతే"

అవ్యక్తము మొదలుకొని విశేషపర్యంతము ఉన్న చేతనాచేతన ముల అభేదత్వమును అనుభవపూర్వకముగా గ్రహించుటే జ్ఞానమని భావము. పరమాత్మ అట్టి అభేదస్వరూపుడు గనుక అతడు జ్ఞానమయు డని చెప్పబడుచున్నాడు. పరమాత్మ కర్త-అకర్త అనికూడ చెప్పబడు చున్నాడు. అది ఇట్లు: "నిరిచ్ఛే సంస్థితే రత్నే యథాలోహాః ప్రవ ర్తతే సత్తామాత్రేణ దేవేన తథా చాయంజగజ్జనః. అతని ఆత్మని కర్తృత్వ మకర్తృత్వం చ సంస్థితం. నిరిచ్ఛ తాత్వాదకర్తా సాకర్తా సన్నిధి మాత్రతః." చెకుముకిరాయి ఏవిధమయిన ఇచ్ఛలేకుండ ఉన్నను రాయి దానిని తాకి అగ్నిని పుట్టించుచున్నది. చెకుముకిరాయిలోని శక్తియే

అగ్నికి కారణము. కనుక కర్త అయినది. కాని ఇచ్ఛలేకుండుటచే అకర్తయైనది. అట్లే జగత్తుకూడ పరమాత్మయందు సత్తామాత్రముగా నున్నది. సమీపవర్తి యగుటచే పరమాత్మ కర్తయగుచున్నాడు. ఇచ్ఛారహితు డగుటచే అకర్తయగుచున్నాడు.

అధ్యాసలక్షణమును చెప్పుచున్నాడు :

యదన్య దన్యత్ర విభావ్యతే భ్రమా
దధ్యాసమిత్యాహురముం విపశ్చితః
అసర్పభూతే ఒహి విభావనం యథా
రజ్వాదికే తద్వదపీశ్వరే జగత్ ॥

భ్రమవశమున ఒకవస్తువునందు మరియొక వస్తుజ్ఞానము కలుగుటను అధ్యాసయందురు. అనగా త్రాడును చూచి పాము అని భ్రమించుట మొదలగునవి. అట్లే సాధారణమానవులు సర్వశక్తిసంపన్నుడయిన ఈశ్వరునియందు జగత్తు నారోపించి భ్రమాత్మకజ్ఞానము కలవారగుచున్నారు.

అధ్యాసయొక్క లక్షణమును చెప్పి అనంతరము ఈ శ్లోకమున అధ్యాసప్రకారమును తెల్పుచున్నాడు.

వికల్పమాయారహితే చిదాత్మకే
హంకార ఏష ప్రథమః ప్రకల్పితః
అధ్యాస ఏవాఒత్మని సర్వకారణే
నిరామయే బ్రహ్మణి కేవలే పరే ॥

పరమాత్మ భేదరహితుడు, మాయాశూన్యుడు, ప్రకాశస్వరూపుడు, సర్వసృష్టివిధాత, దుఃఖోపద్రవము లేనివాడు, సర్వవ్యాపకుడు, ధర్మరహితుడు, మూలకారణుడు. కాని అట్టి ఆత్మయందు మొదట అహంకారము కల్పింపబడినది. తరువాత అహంకారధర్మములగు వికల్పాదులు కల్పింపబడినవి. అదే అధ్యాస. ఈ అధ్యాసయే సర్వసంసారకారణమయినది.

పికల్పములు ఇవి. "అష్టవికల్పో దేవైస్తిర్య గ్యోనిశ్చ పంచధా భవతి మనుష్యశ్చైక విధః సమాసతో భౌతికః సర్గః" భౌతిక సృష్టి మూడువిధములు. దేవతిర్యఙ్మనుష్యులని అందుగో దేవసృష్టి బ్రాహ్మ, ప్రాజాపత్య, ఐంద్ర, పైత్య, గాంధర్వ, యక్ష, రాక్షస, పైశాచికము లని ఎనిమిదివిధములు. పశు, మృగ, పక్షి, సర్పస్థావరములైదు తిర్యక్ సృష్టి క్రిందికి వచ్చును. మనుష్య సృష్టి ఒక్కటే.

నేను సుఖముగా నున్నాను. నేను సుఖదుఃఖముగానున్నాను అను ప్రాపంచిక భావము ఆత్మకుగాక అంతఃకరణకు సంబంధించిన దని తెలియజేయుచున్నాడు.

ఇచ్ఛాది రాగాని సుఖాది ధర్మకాః
సదోధియః సంసృతి హేతవః పరే
యస్మా త్సుషుప్తౌ తదభావతః పరః
సుఖస్వరూపేణ విభావ్యతే హీనః॥

ఇచ్ఛాద్వేషములు, రాగద్వేషములు, సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వము లన్నియు బుద్ధిధర్మములే. ఈబుద్ధిధర్మములే పరుడయిన ఆత్మకుసంసారమును అంటగట్టుచున్నవి. అంతేగాని అతడు వాస్తవము నకు సంసారికాడు. సుషుప్త్యవస్థలో బుద్ధి లేకపోవుటచే ఆత్మ సుఖ రూపమున ప్రతీతమగును. నిద్రనుంచి లేచినతరువాత సుఖముగా నిద్ర పోయినాను అను భావము కలుగును. ఆ సుఖనిద్రయే ఆత్మతుల్యమయి నది. ఈ దృష్టాంతముచే సంసారము బుద్ధిధర్మమేగాని ఆత్మధర్మముగా దని తెలియుచున్నది.

జీవస్వరూపమును ప్రతిపాదించుచున్నాడు.

అనాద్య విద్యో ద్భవబుద్ధిబింబితో
జీవః ప్రకాశోయమి తీర్యతే చితః
ఆత్మాధియః సాక్షితయా పృథక్ స్థితో
బుద్ధ్యా ఽపరిచ్ఛిన్న పరః స ఏవహి॥

అనాదియగు అవిద్యనుండి జనించిన బుద్ధియందు చైతన్యప్రకాశము ప్రతిబింబించును. ఆ ప్రతిబింబమే జీవుడు అని చెప్పబడుచున్నది. ఆత్మవస్తువు బుద్ధికి వేఱుగా సాక్షి స్వరూపమున ఉండును. అది బుద్ధిచే పరిచ్ఛిన్నముగాక ఈ మాయా సర్వస్వముకంటె వేఱుగా ఉండును. లేదా "బుద్ధ్యా పరిచ్ఛిన్నపరః" అని ఏకసమాసము చేసినచో బుద్ధిచే ఆవరించబడియుండియు దాని నంటక వేఱుగనే ఉండునని భావము. అద్దము ప్రతిబింబమునకు ఆధారము. ఆ ఆధారము నశించగనే ప్రతిబింబము నశించి అసలువస్తువు మాత్రమే మిగులును. అట్లే పరమాత్మ అసలు వస్తువు. అవిద్య, అబద్ధము దానిలో పరమాత్మ ప్రతిబింబించుచున్నాడు. ఆప్రతిబింబమే జీవుడు. "నేను జీవుడను" అను భావము అంతఃకరణధర్మము. అద్దమువలెనున్న మాయ నశించగనే ప్రతిబింబరూపమయిన జీవుడు ఉండడు. అసలు వస్తువగు పరమాత్మమాత్రమే మిగులును.

అయితే జడముకాని ఆత్మ జడత్వమును, జడమగు అంతఃకరణ అజడత్వమును ఎట్లు పొందుచున్నవి? అను ప్రశ్నకు సమాధాన మిచ్చుచున్నాడు.

చిద్బింబసాక్ష్యా త్మధియాం ప్రసంగత
స్త్వేకత్ర వాసాదనలాక లోహవత్॥
అన్యోన్య మధ్యా సవశాత్ప్రతీయ తే
జడా జడత్వం చ చిదాత్మ చేతసోఃll

చిద్బింబ మనగా అవిద్యయందు ప్రతిబింబించిన చైతన్యము, జీవుడు 'సాక్షి' అనగా ద్రష్టయగు పరమాత్మ 'ఆత్మ' శరీరము 'ధీఃl అంతఃకరణ లేక బుద్ధి. చిద్బింబమగు జీవుడు, సాక్షియగు పరమాత్మ ఈ రెంటిలో మొదటిది చైతన్యస్వరూపమయితే రెండవది చైతన్యాభాసము. శరీరము బుద్ధి అను ఈ రెండును అపిచ్యానికారములు. కాని ఈనాలుగును నిరంతరము పరస్పరసంసర్గము కలిగియుండుటవలన ఒక దాని ధర్మములు మరియొకదానియందు ఆరోపితములయినవి. అనగా

అవిద్యావికారములగు దేహబుద్ధులయొక్క జడత్వము చిత్ చిదాభాసల యందును, చిత్ చిదాభాసల అజడత్వము శరీరబుద్ధులయందును కన్పడు చున్నవి. అనగా ఇని పరస్పరాధ్యాపితములేగాని సత్యముగాదని భావము. "చిద్బింబసాక్ష్యాత్మ ధియాం" అన్న సమాసమును చిద్బింబ, సాక్ష్యా త్మ, ధియాం అని విడదీసి "సాక్ష్యాత్మ" అనగా సేంద్రియమగు శరీ రము అనియు అర్థము చెప్పవచ్చును. అక్షములనగా ఇంద్రియములు. ఇంద్రియసహితమయినది సాక్షి") ఈ ఆరోపము ఆధ్యాసవశమున చేయబడుచున్నది. లోకములో లోహపిండమును అగ్నిలో వైచి కాల్చగా ఒకదాని గుణములు మరియొకదానికి సంక్రమించుటను మనము చూచుచునే ఉన్నాము. ఇనపగుండ సహజముగా దాహశక్తి కలది గాదు. కాని అగ్నితప్తమయినప్పుడు దాని కాశక్తి లభించు చున్నది. అట్లే ఇనపగుండలయొక్క వస్తులత్వము అగ్నికిని వచ్చుచున్నది. ఈగుణములు పరస్పరసంసర్గమువలన కలిగినవేగాని వాస్తవములుగావు. అట్లే అవిద్యాధర్మములు చైతన్యమందునను, చైతన్యధర్మములు అవిద్య యందునను పరస్పరసంసర్గమున భాసించుచున్నవి.

ఈ తత్వమును గ్రహించుటకు మార్గమును తెల్పుచున్నాడు.

గురోశ్చ సకాశాదపి వేదవాక్యతః
సంజాత విద్యానుభవో నిరీక్ష్యతం
స్వాత్మానమాత్మస్థ ముపాధివర్జితం
త్యజేద శేషం జడమాత్మ గోచరం॥

ఆత్మజ్ఞానార్థియగు జిజ్ఞాసువు ఆత్మతత్త్వజ్ఞానియగు గురువును ఆశ్రయించి తన్ముఖతః తత్వమును గ్రహించవలెను. అనంతరము వేద వాక్య శ్రవణమనన నిధిధ్యాసల నాచరింపవలెను. ఇట్లు జ్ఞానరూప మయిన ఆత్మను అనుభవపూర్వకముగా గ్రహించవలెను. అనగా జ్ఞానానందస్వరూపుడు, నామరూపరహితుడు, తనలోనే వ్యాపించి యున్నవాడు అగు ఆత్మను దర్శించవలయును. అప్పుడు జడమయిన

దృశ్యజగత్తును త్యజింపవలెను. అనగా ఆత్మకు భిన్నమయిన మరియొక వస్తువు లేదని తెలిసికొనవలెను.

తనను ఎట్టివానినిగా అనుభవపూర్వకముగా గ్రహించవలయునో రెండు శ్లోకములలో ప్రతిపాదించుచున్నాడు.

ప్రకాశరూపో ఽహమజో ఽహమద్వయో ఽ
సకృద్వి భాతో ఽహ మతీవ నిర్మలః
విశుద్ధ విజ్ఞానమయో నిరామయః
సంపూర్ణ ఆనందమయో హ్యవిక్రియః॥
సదైవ ముక్తో ఽహ మచింత్య శక్తిమా
నతీంద్రి యజ్ఞాన మవిక్రియాత్మకః
అనంత పారో ఽహమహార్నిశం బుధైః
విభావితో ఽహం హృదివేదవాదిభిః॥

నేను ప్రకాశరూపుడను, జన్మాదిరహితుడను, సజాతీయ విజాతీయస్వగత భేదత్రయరహితుడను, ఎంతమాత్రము పరప్రకాశాపేక్ష లేని అఖండప్రకాశస్వరూపుడను "న తత్ర సూర్యో భాతి న చంద్రతారకం" అని "న తద్భాసయతే సూర్యం" అని శ్రుతిస్మృతులు. మాయాకృతము లగు ఆవరణ ఏమాత్రమును లేక నిర్మలముగా నుండువాడను, విశుద్ధ చైతన్యస్వరూపుడను, కర్తృత్వాభిమానరహితుడను, సంపూర్ణుడను, అనగా దేశకాలాదులచే బంధింపబడనివాడను, ఆనందస్వరూపుడను, పరిణామరహితుడను అనగా - దేహేంద్రియ వికారహితుడను, నేను నిత్యము అనగా భూతభవిష్యద్వర్తమానములను మూడుకాలములం దును సర్వధర్మరహితుడను, ఊహించనలవికాని శక్తిమంతుడను, సాధా రణేంద్రియాతిరిక్తమగు జ్ఞానస్వరూపుడను "యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసాసహ" అని శ్రుతి. నేను పరిణామరహితుడనును, దేశ కాల పరిచ్ఛేదరహితుడను. వేదజ్ఞులగు ఆత్మజ్ఞానులచే భావించబడిన పరమాత్మయే నేను.

ఏవం సదాత్మాన మఖండితాత్మనా
విచార్య మాణస్య విశుద్ధభావనా
హన్యా ద విద్యా మ చిరేణ కారకై
రసాయనం యద్వ దుపాసితం దుజః ॥

ఇట్లు హర్ష శోకాదిరహితమగు విశుద్ధభావమున సత్స్వరూపమగు ఆత్మనుగూర్చి మననముచేయగా చేయగా అది దేహాంతరాగములగు కర్మలతో గలసిన ఔషధిసేవనము రోగములను నశింపజేయునట్లుగా– అవిద్యను నశింపజేయును.

ముముక్షువు ఏస్థితిలోనుండి పై మననము చేయవలెనో వివరించుచున్నాడు.

వివిక్త ఆసీన ఉపారతేంద్రియో
వినిర్జితాత్మా విమలాంతరాశయః
విభావయేదేక మనన్య సాధనో
విజ్ఞాన దృక్కేవల ఆత్మసంస్థితః ॥

మోక్షేచ్ఛగలవ్యక్తి ఏకాంతస్థలమున సమస్త ఇంద్రియములను వశీకృత మొనరించుకొని, మనోవ్యాపారమును అరికట్టి, రాగాదిదోష రహితమగు అంతఃకరణ గలవాడై, ఇతరసాధనముల నన్నిటిని పరిత్యజించి, కేవలము విజ్ఞానదృష్టిగలవాడై అనగా చూచువాడు, చూడబడువాడు అను భావములేక, విషయాంతరసంచారవర్జితుడై ఆత్మనిష్ఠుడై ఒకేబక ఆత్మవస్తువును ధ్యానము చేయవలెను. ఈ శ్లోకమున సవికల్ప సమాధి చెప్పబడినది. నిర్వికల్ప మాధిని చెప్పుచున్నాడు.

విశ్వం యదేతత్ పరమాత్మదర్శనం
విలోపయే దాత్మని సర్వకారణే
పూర్ణశ్చిదానంద మయో ఒవతిష్ఠతే
న వేదబాహ్యం నచకించిదాంతరం ॥

ఈ దృశ్యప్రపంచమంతయు పరమాత్మయందు ఉద్భవించుచున్నది అని గ్రహించి దానిని సర్వకారణమగు పరమాత్మయందే

విలీన మొనరింపవలెను. అనగా ఉత్పత్తి క్రమమున జగత్తు దేనినుండి ప్రకటితమగునో తిరిగి దానియందే విలీనము చేయవలెను. ఇట్లు జగత్తు విలీనమైపోగా మిగులునది పూర్ణము, చిన్మయము ఆనందమయము ఆగు ఆత్మమాత్రమే మిగులును అప్పుడు సాధకునికి ఆత్మకు వెలుపల గాని, లోపలగాని మరియొకవస్తువును చూడడు. అనగా ఆత్మవ్యతిరిక్త మయిన మరియొకవస్తువు ఉండదు.

పై రెండుశ్లోకములలో మొదటిదానియందు సవికల్పసమాధి చెప్పబడినది. రెండవదగు నిర్వికల్పసమాధి రెండవశ్లోకమందు చెప్పబడినది. సవికల్పసమాధియందు తెలుసుకొనువాడు (జ్ఞాత) తెలుసుకొనుట (జ్ఞానము) తెలుసుకొనబడునది (జ్ఞేయము) అను భేదముండును. ఈ భేదము ననుసరించి అద్వితీయమగు బ్రహ్మపదార్థమును ఆకూపము నసే భావించు చిత్తవృత్తిని కలిగియుండవలెను. అనగా ప్రపంచములో మనము పశుపక్ష్యాదులగు అనేక మృణ్మయవస్తువులను చూచుచుండి నను వాటిని మృత్తుగానే చూచెదము. అనగా మట్టివస్తువులను వేరుగా చూచుచుండియు వాటిని మట్టిగానే భావించెదము. అట్లే ద్వైతజ్ఞాన మున్నను అద్వైతము ననుభవించుట సవికల్పసమాధి.

జ్ఞాతృజ్ఞానజ్ఞేయభేద మెంతమాత్రము లేక అద్వితీయబ్రహ్మ వస్తువునందు చిత్తవృత్తి సంపూర్ణముగా ఏకీకృతమొనరించుట నిర్వికల్ప సమాధి. నీటియందు పుట్టిన తరంగములు నీటిలో కలిసి తమప్రత్యేక తను ఏమాత్రమున్న మిగుల్చుకొననట్లు నిర్వికల్పసమాధియందు ఆత్మైక్యతనందిన చిత్తవృత్తికూడ పృథక్త్వమును కించిన్మాత్రమును మిగుల్చుకొనదు. అద్వితీయవస్తుమాత్రమే ఉండును.

సవికల్పసమాధికి నిత్యానిత్యవస్తువివేకము, ఇహాముత్రఫలభోగ విరాగము, శమదమాది షట్కసంపత్తి, ముముక్షుత్వము—అనునవి సాధ నములు. ఇవి ఈ సర్గయందలి "క్రియా శరీరోద్భవ హేతురాదృతా" అను శ్లోకావతారికయందు వ్యాఖ్యానింపబడినవి. యమనియమాసన ప్రాణాయామప్రత్యాహార ధారణాధ్యానసమాధులు నిర్వికల్పసమాధి

నిర్వికల్పసమాధికి సాధనములు. అహింస, సత్యము, అస్తేయము (చౌర్యము చేయకుండుట) బ్రహ్మచర్యము, అపరిగ్రహము (ఇతరుల నుండి దేనిని గ్రహించకుండుట) అనునవి యమము లనబడును. శుచిగా నుండుట, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము అనునవి నియమములు. కరచరణాదులను విశేషప్రకారముగా ఉంచుట ఆసనము లనబడును (పద్మాసనము, స్వస్తికాసనము మొదలయినవి.) రేచక, కుంభకలక్షణములుగల ప్రాణనిగ్రహోపాయములు ప్రాణాయామములు. ఇంద్రియములను వాటివాటి సహజవ్యవహారములనుండి మళ్ళించుట ప్రత్యాహారము. ఈ అంతరింద్రియములను అద్వితీయవస్తువునందే నిల్పుట ధారణ అనబడును. అంతరింద్రియప్రవృత్తిని అద్వితీయవస్తువునైపునకు ప్రవహింపజేయుట ధ్యానము. జ్ఞాతృజ్ఞానజ్ఞేయ భేదము లేక అద్వితీయవస్తువులో ఏకాకారమైపోవుట సమాధి.

సమాధిసిద్ధికి పూర్వమైన కర్తవ్యమును నిరూపించుచున్నాడు.

పూర్వం సమాధే రఖిలం వి చింతయే
దోంకారమాత్రం స చరాచరం జగత్
తదేవ వాచ్యం ప్రణవోపీ వాచకో
విభావ్యతే జ్ఞానవశాన్న బోధతః ॥

సమస్త విషయవ్యాసంగములు నివృత్తియై బ్రహ్మస్వరూపుడగుటకు పూర్వము సాధకుడు సచరాచరమగు జగత్తునంతను ఓంకార ప్రమాణముగా భావించవలెను. దీనికి ఓంకారము వాచకము, ఈశ్వరుడు, వాచ్యుడు అను విషయముకూడ జ్ఞానమునకు పూర్వమే కలుగగలదు.

ఇక్కడ సమాధికి ముందు జగత్తును ఓంకారమాత్రముగా భావించవలెననియు, ఓంకారము వాచకమనియు, బ్రహ్మ వాచ్యుడనియు చెప్పబడినది. అనగా ఓంకారమునుండి సర్వజగత్తు ప్రకటితమయినది. అది ఇక్కడ ప్రదర్శింపబడుచున్నది. ఓంకారములో 'అ' 'ఉ' 'మ్'

అను మూడక్షరములున్నవి. ఆముడును వరుసగా సత్వరజోగుణప్రతీకములు. వాటినుండి వరుసగా సత్వప్రధానుడయిన విష్ణువు, రజోగుణ ప్రధానుడయిన బ్రహ్మ, తమోగుణ ప్రధానుడయిన శివుడు జనించారు. సత్త్వరజస్తమస్సుల సమానావస్థను ప్రకృతి లేక మాయఅంటారు. ఆప్రకృతినుండి మహత్తు మహత్తునుండి అహంకారము, అహంకారము నుండి పంచతన్మాత్రలు ఉద్భవించినని, శబ్దస్పర్శరూపరసగంధములు పంచతన్మాత్రలు. వీటినుండి పంచజ్ఞానేంద్రియ, పంచకర్మేంద్రియములు, పంచభూతములు జనించినవి. (శబ్దతన్మాత్రనుండి ఆకాశము, శబ్దస్పర్శతన్మాత్రలనుండి వాయువు, శబ్దస్పర్శరూపతన్మాత్రలనుండి అగ్ని, శబ్దస్పర్శరూపరసతన్మాత్రలనుండి జలము. శబ్దస్పర్శరూపరసగంధ తన్మాత్రలనుండి పృథివి జనించినవి.) ఈ పంచతన్మాత్రలనుండియే ఉభయాత్మకమయిన మనస్సు కార్యకారణవిలంబియై ఆత్మకూడ జనించినవి. ఈ పై వివరణవలన సమాధిలో ఓంకారజపము, దానిజ్ఞానము అవసరములని తేలినది. కనుకనే యోగశాస్త్రముకూడ "తస్యవాచకః ప్రణవః, తజ్జపస్తదర్థభావనం" అని చెప్పినది. ఛాందోగ్యోపనిషత్తు "ఓంకారపూర్వం హియోగోపాసనం– యాని నిత్యాని కర్మాణి" అని దాని ప్రాధాన్యతను ప్రతిపాదించినది.

ఓంకారమును వివరించుచున్నాడు.

అకార సంజ్ఞః పురుషోహి విశ్వకో
హ్యు కారతైజ ఈర్యతే క్రమాత్
ప్రాజ్ఞో మకారః పరిపశ్యతే ఽఖిలైః
సమాధిపూర్వం నతు తత్త్వతో భవేత్ ॥

ఓంకారమందలి మూడక్షరములందును మొదటిదగు 'అ' కారము సమస్త దేహేంద్రియములందును జీవరూపమున నుండు పురుషుని తెలియజేయును. ఈ విరాట్స్వరూపుడగు జీవునకే విశ్వుడని పేరు. ఈతడు జాగ్రదవస్థలో సాక్షిగా నుండును. రెండవఅక్షరమగు 'ఉ' కారము తేజోమయమగు అంతఃకరణయందుండు తైజసుని తెలియజేయును.

ఈతడు లింగదేహాభిమానియై స్వప్నావస్థకు సాక్షిగా నుండును. ఈత నినే హిరణ్యగర్భుడని అందురు. మూడవఅక్షరమగు 'మ' కారముచే 'ప్రాజ్ఞ' నామధేయుడగు పురుషుడు చెప్పబడును. ఈతడు కారణ దేహాభిమానియై స్వప్నావస్థకు సాక్షిగా నుండును. సాధకుడు ఈభావ మును సమాధికి పూర్వమే భావించవలెను. తత్త్వజ్ఞానము సంభవిం చిన అనంతరము సర్వము బ్రహ్మస్వరూపమున లయమగును. విశ్వ తైజప్రాజ్ఞులు జాగ్రత్ స్వప్నసుషుప్త్యవస్థలకు సాక్షులనుట ఇట్లు చెప్ప బడినది– సత్యా జాగరణం విద్యా ద్రజసా స్వప్నమాదిశేత్ ప్రస్వా పనంతు తమసా తురీయం త్రిషు సంతతమ్" అని. సిద్ధాంతబిందువనెడి గ్రంథములో ఈవిషయ మిట్లు స్పష్టముచేయబడినది– 'జీవో ఒపి త్రివి ధః సోపా ధ్యవాంతరభేదేన విశ్వతైజసప్రాజ్ఞ భేదాత్, తత్రా ప్య విద్యాంతఃకరణ స్థూలసంసారావచ్ఛిన్నో జాగ్రదవస్థాభిమానీ విశ్వః. ఏవం స్థూలశరీరాభిమానరహిత ఉపాధి ద్వయోపహితః స్వప్నావస్థాభి మానీ తైజసః శరీరాంతఃకరణోపాధి ద్వయో పరహితో ఒన్తఃకరణ సంసారావచ్ఛిన్నో ఒవిద్యా మాత్రోపహితః సుషుప్త్యవస్థాభిమానీ ప్రాజ్ఞః' అని ఉపాధిభేదముచే జీవుడు మూడువిధములు. విశ్వుడు తైజసుడు, ప్రాజ్ఞుడు అని వానిసంజ్ఞలు. అవిద్య అంతఃకరణస్థూలసంసా రములచే ఆవృతుడై జాగ్రదవస్థను అభిమానించువాడు జీవుడు విశ్వుడు. స్థూలశరీరాభిమానము లేక అవిద్యాంతకరణము లను ఉపాధి ద్వయ ముచే ఆవరింపబడి స్వప్నావస్థకు సాక్షిగానుండువాడు తైజసుడనబడును. ఉపాధి ద్వయరహితుడై కేవలము అవిద్య (మాయ) చే ఆవరింపబడి ఉండి స్వప్నసుషుప్త్యవస్థకు సాక్షియగువాడు ప్రాజ్ఞుడనబడును.

విశ్వతైజసప్రాజ్ఞ జీవభేదములను బ్రహ్మయందు లయమొనర్చు రీతిని ప్రతిపాదించుచున్నాడు.

విశ్వం త్వకారం పురుషం విలాపయే,
దుకార మధ్యే బహుధా వ్యవస్థితం

తతో మకారే ప్రవిలాప్య తైజసం
ద్వితీయవర్ణం ప్రణవస్య చాంతిమే॥
మకార మప్యా త్మని చిద్ఘ నే పరే
విలాపయేత్ ప్రాజ్ఞమపీహ కారణం
సోఽహం పరం బ్రహ్మ సదా విముక్తవత్
విజ్ఞాన చక్షుర్ముక్త ఉపాధితో ఽమలః॥

దేహేంద్రియములయందు సర్వత్ర వ్యాపించియున్న విశ్వపురుషునికి ప్రతీకమయిన 'అ' కారమును లింగశరీరాభిమానియగు తైజస పురుషునికి ప్రతీకమగు 'ఉ' కారమందు లయమొనరింపవలయును. అనగా మొదట శరీరాభిమానమును పరిత్యజించి లింగశరీరమును గ్రహించవలెను. తరువాత తైజసప్రతీకమగు ఉకారమును కేవల మాయావృతుడగు ప్రాజ్ఞునికి ప్రతీకమగు 'మ' కారమందు లయమొనరింపవలెను. అనగా లింగశరీరమునుకూడ పరిత్యజించవలెను. తరువాత కేవల మాయావృతుడగు ప్రాజ్ఞుని చిత్స్వరూపుడగు పరబ్రహ్మయందు లయమొనరింపవలెను. ఇట్లు త్రివిధదేహాభిమానములను పరిత్యజించగా చైతన్యమయుడగు పరమాత్మయొక్కడే ఉండును. అనగా నిర్వికల్ప సమాధి కలుగును. ఆ అవస్థలో "సోఽహం బ్రహ్మ" (నేను బ్రహ్మను) అను అద్వైతభావము కలుగును. సదా విముక్తునకువలె జ్ఞానచక్షువు లభించును. సర్వోపాధివిముక్తుడగుటచే నిర్మలుడగును. అనగా రాగద్వేషాదులన్నియు నశించగా బ్రహ్మానందానుభవమునకు యోగ్యుడగును.

ఏవం పరిజ్ఞాత పరాత్మభావనః
స్వానంద తుష్టః పరివిస్మృతాఖిలః
తిష్ఠేత్ స నిత్యాత్మ సుఖప్రకాశకః
సాక్షా ద్విముక్తో ఽచల వారిసింధువత్॥

పైన వివరించినట్లు దేహము, ఇంద్రియములు, పుత్రుడు, భార్య అను భేదభావము లన్నిటిని మరచి పరమాత్మయం దద్వైతభావము గల

వాడు సర్వదుఃఖరహితుడై బ్రహ్మానందమందుండై సంతృప్తుడగును. ఔపాధికములగు నామరూపభేదరహితమయిన అఖండానందస్వరూపుడై జీవన్ముక్తుడగును. అప్పు డతనిస్థితి చలనరహితమగు జలము కలిగిన సముద్రమువలె నుండును. వేదాంతులు తరంగసహితమగు సముద్ర మును సంసారముతో పోల్చినారు. సముద్రమందలి తరంగములు నామ రూపాత్మకములైన భేదములకు ప్రతీకములు. తరంగములు శాంతించిన సముద్రము బ్రహ్మానందానుభవమునందినవానితోపోల్చి ఉపమానముగా చెప్పబడినది. అనగా బ్రహ్మానందానుభవపరుడు సర్వభేదములు నశించి శాంతిస్వరూపుడుగా నుండునని భావము.

ఏవం సదాభ్యస్త సమాధియోగినో
నివృత్త సర్వేంద్రియగోచరస్యహి
వినిర్జితాశేష రిపోరహం సదా
దృశ్యోభవేయం జితషడ్గుణాత్మనః॥

ఇంద్రియగోచరణమగు శబ్దస్పర్శరూపరసగంధాదులగు విషయ జాతమునుండి నివృత్తుడై కామక్రోధాదులగు అంతఃశత్రువులను జయిం చిన సదాభ్యాసియగు యోగికిసమాధియగు యోగికి సర్వజ్ఞత్వ నిత్య తృప్తత్వ, బోధస్వరూపత్వ, నిత్యత్వ, అలిప్తత్వ అనంతరూపత్వము లనెడు షడ్గుణములు గల నేను విజితుడనై నిత్యము దర్శనీయుడ నగు చున్నాను.

ధ్యాత్వైవ మాత్మాన మహర్నిశం మని
స్తిష్ఠే త్సదా ముక్త సమస్త బంధనః
ప్రారబ్ధమశ్నన్నభిమాన వర్జితో
మయ్యేవ సాక్షా త్ప్రవిలీయతే తతః॥

ఈవిధముగ నిత్యము ఆత్మధ్యానరతుడైన యోగి అభిమాన జన్యములయిన దారాపుత్రాది సమస్తబంధములను త్రెంచుకొని ప్రారబ్ధము ననుభవించుచు ఆత్మైక్యత నందును. జీవన్ముక్తుడైనవాడు

కూడ ప్రాక్తనకర్మల ననుభవించిన అనంతరమే ఆత్మయందు లీనుడగు నుగాని కర్మానుభవము పూర్తికాకుండ లీనుడు కాలేడు. అయితే జీవన్ముక్తుడు అభిమానరహితుడై ప్రారబ్ధము ననుభవించును. కర్మానుభవ మయినంతనే కర్మ నశించును.

ఆదౌ చ మధ్యే చ తథైవచాంతయో
భవం విదిత్వా భయశోకకారణం
హిత్వా సమస్తం విధివాదచోదితం
భజేత్ స్వమాత్మాన మథాఖిలాత్మనాం॥

భవమనగా సాంసారికమయిన విషయజాలము. అది ఆది మధ్యాంతములగు మూడు అవస్థలయందును భయశోకములకు కారణ మగుచున్నది. ధనకామన ఒక సాంసారికకారణము. దానిని సంపా దించుటకు చేయుప్రయత్నములు దుఃఖకారణములగును. సంపాదించిన దానిని రక్షించుటకుకూడ అనేక దుఃఖముల ననుభవించవలసి వచ్చును. శౌర్యాదులచే ధననాశనము కలిగినతరువాతకూడ దుఃఖమే కలుగును. ఆస్థి అన్నివిషయములును. కనుక విధివాక్యచోదితములగు కర్మలను సన్యసించి అఖిలశరీరములందును జీవస్వరూపమున వ్యాపించి యుండు బ్రహ్మవస్తువునే భజించవలయును. ఇదే సర్వోత్తమమయిన ధర్మము.

ఆత్మన్య భేదేన విభారయన్నిదం
జానాతి భేదేన మయాత్మన స్తదా
యథాజలం వారినిధౌ యథా పయః
క్షీరే వియద్వ్యోమ్న్యనిలే యథాఽనిలః॥
ఏక ఏవహి భూతాత్మా భూతబూతే వ్యవస్థితః
ఏకధా బహుధా చైవ దృశ్యతే జలచద్రవత్ నిత్యః
సర్వగతో హ్యాత్మా కూటస్థో దోషవర్జితః ఏకః
స భిద్యతే శక్త్యా మాయయాన స్వభావతః॥

(ఏకవస్తువయిన పరమాత్మ సమస్త భూతములందును వ్యవస్థిత మయియున్నది. జలమందు ప్రతిబింబించు చంద్రునివలె ఒకేవిధము గాను, అనేకవిధములుగాను కన్పించును. ఆత్మనిత్యుడు, సర్వగతుడు, కూటస్థుడు, దోషవర్జితుడు, ఏకుడు అయినను మాయచే అనేకముగా భాసించును. కాని సహజముగా భేదస్వరూపుడుకాడు.) అను బ్రహ్మ సాక్షాత్కారస్వరూపమును చెప్పుచున్నాడు. సాధకుడు– బ్రహ్మజ్ఞాని ఈ సమస్తవిశ్వమును ఆత్మాభిన్నముగా భావించి భేదమున తనను నాతోకూడ ఉన్నట్లు భావించును. ఈవిషయమునే దృష్టాంతములతో సమర్థించుచున్నాడు. నదీజలము సముద్రములో కలిసి సముద్రజలమే అగుచున్నది. వేరువేరు ఆవులపాలు కలిసి పాలు అగుచున్నవి. ఘటా ద్యావరణసహితమయిన ఆకాశము ఆవరణభంగము కాగానే మహదా కాశమగుచున్నది. తోలుతిత్తి మొదలయినవాటియందున్న వాయువు మహావాయువులో కలిసి మహావాయువే అగుచున్నది. ఇట్లే జీవబ్రహ్మ లును అనగా జ్ఞానియొక్క శరీర మున్నంతవరకు జీవబ్రహ్మల భేదముం డును. శరీరనాశనము కాగానే అభేదము.

ఇత్థం యదీక్షేతహి లోకసంస్థితో
జగన్మృషైవేతి విభావయన్మనిః
విసాకృతత్వా చ్ఛ్రుతియుక్తిమానాద్
యశ్చేందు భేదో దిశిదిగ్భ్రమాదయః ॥

ఇట్లు జీవన్ముక్తావస్థనుపొందిన ఆత్మజ్ఞాని వ్యవహారార్థమై లోక ధర్మమును ఆచరించుచు శ్రుతివాక్యప్రమాణము ననుసరించి ఈ జగత్తు మిథ్య, బ్రహ్మసత్యము అన్న దృష్టితో వ్యవహరించినట్లయిన జగత్సత్య భావము నశించి బ్రహ్మభావము మాత్రమే మిగులు. భ్రమవలన ఒకడే అయిన చంద్రుని అనేకముగ భావించుట, ఒక దిక్కుయందు అన్య దిగ్భ్రమ కలిగియుండుట, రజ్జువునందు సర్పమను భ్రమనందుట అజ్ఞాన దశయందుండును. వాస్తవవస్తుజ్ఞానము కలుగగనే భ్రమతొలగి ఏకత్వ జ్ఞానము కలుగును. అట్లే జగన్మిథ్యా బ్రహ్మసత్యభావము,

యావన్నపశ్యే దఖిలం మదాత్మకం
తావన్మదారాధన తత్పరో భవేత్
శ్రద్ధాలురత్యర్జిత భక్తిలక్షణో
యస్తస్య దృశ్యోహమహర్నిశం హృది ॥

పైన జెప్పబడినట్లు అఖిలజగత్తును నా స్వరూపముగా భావించు స్థితి రానంతవరకు నా సగుణస్వరూపమును ఉపాసించుచుండవలయును. అత్యంతశ్రద్ధాయుక్తుడై నిత్యప్రవర్ధమానమగు భక్తిభావమున భజించి నచో నిత్యము అతని హృదయమున నేను వసించెదను. "యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహం" అన్న గీతావాక్యము స్మరణీయము.

ఇంతవరకు తానిచ్చిన తత్త్వోపదేశము శ్రుతిసమ్మతమయిన దని దీని ప్రతిపాదించుచున్నాడు :

రహస్య మేతత్ శ్రుతిసారసంగ్రహం
మయా వినిశ్చిత్య తవోదితం ప్రియాత్
యస్త్వే తదాలోచనయతీహ బుద్ధిమాన్
సముచ్యతే పాతకరాశిభి క్షణాత్ ॥

లక్ష్మణా ! ఈ నీకుపదేశించిన తత్త్వము సకలశ్రుతిసారసంగ్రహ రూపమయినది. అనధికారులకు గోపనీయమయినది. నీవు అన్నివిధ ముల యోగ్యుడవు నాకత్యంత ప్రియుడవును కాన నీకిచ్చితిని. ఈ తత్త్వము మననమొనరించు సాధకుడు సమస్త భవరాశులనుండి విముక్తు డగును.

ధృఢీకరణకై తిరిగి ఐక్యభావము నుపదేశించుచున్నాడు.

భ్రాతర్య దీదం పరిదృశ్యతే జగత్
మాయైవ సర్వం పరిహృత్య చేతసా
మదాభవనా భావిత శుద్ధమానసః
సుఖీ చ ఆనందమయో నిరామయః॥

తమ్ముడా ! ఈదృశ్యమానప్రపంచమంతయు మాయయే. కనుక

దీనిని మనసా పరిత్యజించి సత్యస్వరూడనగు నన్నే భావించుచు శుద్ధ మనస్కుడవై సర్వభావార్తిరహితుడవై ఆనందస్వరూపుడవై సుఖించుచుము.

యఃసేవతే మామ గుణం గుణాత్ పరం
హృదా కదావా యదివా గుణాత్మకం
సోఽహం స్వపాదాంచిత రేణుభిఃస్పృశన్
పునాతి లోకత్రితయం యథా రవిఃll

నన్ను గుణరహితుడుగాగాని, సర్వగుణములకు పరుడననిగాని, లేదా సర్వమంగళకరగుణస్వరూపుడననిగాని భావించి పరిశుద్ధాంతఃకరణుడై సేవించుచుండువాడు తన పాదధూళిచే స్పృశించి మూడు లోకములను సూర్యునివలె పవిత్రమొనరించువాడగును. ఇక్కడ గుణ రహితుడనగా ప్రాకృతికములగు సత్త్వరజస్తమోగుణరహితుడు అని అర్థము. గుణాతీతుడనగా మాయాతీతుడని అర్థము. గుణాత్మకుడనగా సర్వజ్ఞత్వాది లోకోత్తరలావణ్యాదిగుణసహితమగు ఆత్మస్వరూపుడని అర్థము. సూర్యుడు తన కిరణములచే జగత్తుయొక్క చీకటిని పారద్రోలు నట్లు విశుద్ధజ్ఞాని అజ్ఞానాంధతమస్సును చెదరగొట్టును.

శ్రీరాముడు ఇంతవరకు తాను తెల్పి తత్త్వగీతాఫలశ్రుతిని చెప్పుచున్నాడు.

విజ్ఞాన మేత దఖిలం శ్రుతిసార మేకం
వేదాంత్యవేద్య చరణేన మయైవగీతం
యఃశ్రద్ధయా పరిపఠే ద్ధరు భక్తియుక్తో
మద్రూపమేతి యది మద్వచనేషు భక్తిఃll

వేదాంతమభాగములగు ఉపనిషదర్థాలోచనముచే తెలియబడ గల నేను సమస్తశ్రుతిసారరూపమగు తత్త్వమును గాన మొనర్చితిని. ఈతత్త్వమును ఆలోచన మొనరింపలేని సామాన్యమానవుడు నావచనములందు శ్రద్ధాభక్తులనుంచి, గురుభక్తియుక్తుడై ఈ రామగీతలను పఠించినచో తప్పక నన్ను చేరగలడు.

పష్ఠ సర్గ

శ్రీ మహా దేవఉవాచ :—

ఏకదా మునయఃసర్వే యమునాతీర వాసినః
ఆ జగ్ము ర్రాఘవం ద్రష్టుం భయాల్లవణరాక్షసః ॥

శ్రీరాముడు సీతాపరిత్యాగ మొనరించి రాజర్షివలె తమ్ములతో పవిత్రచరిత్రములను వర్ణించుచు, తత్వచింతన మొనర్చుచు కాలము గడుపుచుండగా యమునాతీరమందు నివసించుచున్న చ్యవనుడు మొదలగు మహర్షులు లవణుడను రాక్షసునిచే పీడితులై శ్రీరాముని వేడుకొనుటకు అయోధ్యకు వచ్చిరి.

కృత్వా ఽగ్రేతు మునిశ్రేష్ఠం భార్గవం చ్యవనం ద్విజాః
అసంఖ్యాతాః సమాయాతాః రామాదభయకాంక్షిణః ॥

యమునాతీరమున నివసించు ఆమహర్షులకు భార్గవవంశసంజాతుడయిన చ్యవనుడు కులపతి. వేలకొలది సంఖ్యలోనున్న మహర్షులు తమ కులపతిని ముందునిడుకొని శ్రీరాముని అభయమును కాంక్షించుచు సభాప్రవేశమును యథావిధిగ నొనరించిరి.

తాన్ పూజయిత్వా పరయాభక్త్యా రఘుకులోత్తమః
ఉవాచ మధురం వాక్యం హర్షయన్మునిమండలమ్ ॥

రఘుకులతిలకుడగు రాముడును భార్గవాదిమహర్షులను విధివిధానమున పరమభక్తితో పూజించి వారి హృదయసముద్రములను హర్ష తరంగములచే కల్లోలితమొనర్చుచు గంభీరముగా ఇట్లు పలికెను.

తరవాణి మునిశ్రేష్ఠా యదర్థమహ మాగతాః
ధన్యోఽస్మి యది యూయంమాం ప్రీత్యా ద్రష్టుమిహాగతాః ॥

మునిశ్రేష్ఠులారా ! తమరు అందరును నావద్దకువచ్చిన కారణమును తెలియజేయుడు. తమరాకచే నా జీవితము ధన్యతనందినది. మీరు మీకార్యమును తెలియజేసినచో అది ఎట్టిదయినను తప్పక నెరవేర్చెదను.

దుష్కరంచాపి యత్కార్యం భవతాంతత్కరోమ్యహం
ఆజ్ఞాపయంతుమాం భృత్యం బ్రాహ్మణాద్దైవతం హిమే ॥

మహాత్ములారా ! మీకు నావలన కాదగు కార్యము ఎంతటి దుష్కరమయినదయినను సరే తప్పక నెరవేర్చెదను. బ్రాహ్మణులు మాకు దేవతసమానులు. నేను మీకు భృత్యతుల్యుడను. మీరు ఆజ్ఞాపించి నాసేవల నందుకొనుడు.

తచ్ఛ్రుత్వా సహసా హృష్ట శ్చ్యవనో వాక్య మబ్రవీత్
మధునా మమహాదైత్యః పురాకృతయుగే ప్రభో
ఆసీద తీవ ధర్మాత్మా దేవబ్రాహ్మణ పూజకః॥

శ్రీరాముని వినయపూరిత వాక్యములను వినగనే మహర్షుల హృదయకమలములు వికసించినవి. చ్యవనుడు శ్రీరాముని ఆశీర్వదించి ఇట్లు పలికెను- పూర్వము కృతయుగమున మధువను దైత్యశ్రేష్ఠుడొకడు యమునాతీరమున నివసించువాడు. అతడు దైత్యకులోద్భవుడే అయినను అత్యంతధర్మమార్గపరాయణుడు. దేవబ్రాహ్మణులను నిత్యము పూజించుచుండెడివాడు. (రావణుని సోదరియగు కుంభీనసిని అపహరించుకొనిపోయి వివాహమాడిన మధువు ఈతడే.)

తస్య తుష్టో మహాదేవో దదౌ శూల మనుత్తమః
ప్రహ చానేన యం హంసి సతు భస్మీభవిష్యతి॥

అతని ధర్మపరాయణతకు సంతోషించి మహాదేవుడతనికి ఒక దివ్యప్రభావసంపన్నమగు శూలమును కానుకగా నొసగెను. ఇచ్చినప్పుడు శంకరుడు ఆశూలమును నీవు ఎవనిపై ప్రయోగించెదవో అతడు వెంటనే భస్మమగునని వాక్కుచ్చెను.

రావణస్యానుజా భార్యా తస్య కుంభీనసీ శ్రుతా
తస్యాం తు లవణో నామ రాక్షసో భీమ విక్రమః॥

ఆ దైత్యుని భార్య కుంభీనసి యనునది రావణుని సోదరి. ఆ దంపతులకు లవణుడను మహాపరాక్రమశాలియగు పుత్రుడు జనించెను.

ఆసీద్దుష్టాత్మా దుర్ధర్షో దేవబ్రాహ్మణ హింసకః
పీడితాస్తేన రాజేంద్ర వయం త్వాం శరణం గతాః॥

ఆ లవణుడు తండ్రివంటివాడు కాడు. అతడు దుష్టప్రభావ పూరితహృదయుడు. సామాన్యులకు అజేయుడు, దేవబ్రాహ్మణుని హింసించు స్వభావము గలవాడు. అతనిచే పీడితులమై మేము నిన్ను శరణుజొచ్చితిమి.

తచ్ఛ్రుత్వా రాఘవో ఽప్యాహ మా భిర్వో మునిపుంగవాః
లవణం నాశయిష్యామి గచ్ఛస్తు విగతజ్వరాః॥

మునీశ్వరుల ప్రార్థనావాక్యములను విని శ్రీరాముడు ఇట్లనెను- మహాత్ములారా ! మీరు భయమును త్యజించుడు. నేను లవణుని అతి త్వరలో సంహరించెదను. మీరు స్వస్థహృదయులై స్వస్థానములకు చేరుడు.

ఇత్యుక్త్వా ప్రాహ రామో ఽపి బ్రాతూర్ణోవా హనిష్యతి
లవణం రాక్షసం పదాత్ బ్రాహ్మణేభ్యో ఽభయం మహత్॥

శ్రీరాముడు మునుల కభయమీయగా వారు వెడలిపోయిరి. అనంతరము అతడు సోదరులనుజూచి "మీలో ఈలవణరాక్షసుని వధించి బ్రాహ్మణపుంగవులను భయరహితులనుగా నొనరించగల సమర్థు డెవ్వడు ?" అని ప్రశ్నించెను.

తచ్ఛ్రుత్వా ప్రాంజలిః ప్రాహ భరతో రాఘవాయవై
అహమేవ హనిష్యామి దేవీ ఽఽజ్ఞాపయ మాంప్రభో॥

శ్రీరాము డిట్లు పలుకగా భరతుడు ప్రాంజలియై దేవా ! నీవు నన్ను ఆజ్ఞాపింపుము. నేనే ఆరాక్షసుని వధించివచ్చెదను. అని విన్న వించెను.

తతో రామం సమనక్రుత్య శత్రుఘ్నో వాక్య మబ్రవీత్
లక్ష్మణేన మహత్కార్యం కృతం రాఘవ సంయుగే॥

భరతుడు లవణవధకై తాను వెళ్ళెదననగా శత్రుఘ్నుడులేచి ఇట్లు విన్నవించెను--ప్రభూ ! నా అన్నయగు లక్ష్మణుడు నీతోపాటు

అరణ్యమునకువచ్చి రాక్షసులయుద్ధములో నీకు అత్యధికముగా సహాయ పడినాడు.

నందిగ్రామే మహాబుద్ధి ర్భరతో దుఃఖ మన్వభూత్
అహ మేవ గమిష్యామి లవణస్య వధాయ చ
త్వ త్ప్రసాదాద్రఘుశ్రేష్ఠ హన్యాంతం రాక్షసంయుధి ॥

అంతేగాక భరతుడును నీవనవాసకాలమున సర్వసౌఖ్యములను పరిత్యజించి నందిగ్రామమున దుఃఖమయజీవితమును గడిపి మహర్షివలె ఖ్యాతి నందినాడు. నేను ఒక్కడనే ఏవిధమగుకార్యమును చేయక యున్నాను. కనుక నీవు ఆశీర్వదించి పంపిన చో భవదీయానుగ్రహ బల ముచే లవణరాక్షసుని యుద్ధమున వధించెదను.

తచ్ఛ్రుత్వా స్వాంకమారోప్య శత్రుఘ్నం శత్రుసూదనః
ప్రహృష్యేవాభిషేక్ష్యామి మధురారాజ్య కారణాత్ ॥

శత్రుఘ్నుని ప్రార్థనను వినగనే శ్రీరాముడు సంతుష్టహృదయు డయినాడు. శత్రునాశకుడగు అతడు చిన్నతమ్ముడగు శత్రుఘ్నుని తొడపై కూర్చుండబెట్టుకొని "నీవు లవణుని వధించి మధురానగరమును నిర్మించి ఆప్రాంతమునంతను పరిపాలింపుము. నిన్ను ఇప్పుడే ఈక్రొత్త రాజ్యమునకు ప్రభువుగా అభిషేకించెదను" అని బుజ్జగించుచు పలికెను.

అనాయ్య చ సుసం భారాం ల్లక్ష్మణేనాభిషేచనే
అనిచ్ఛన్త మపి స్నేహా దభిషేక మకారయత్ ॥

శ్రీరాముని వాక్యములను విని శత్రుఘ్నుడు "అన్నా ! నేను నిన్ను విడిచి చిరకాల ముండజాలను. కాన లవణుని వధించి వెంటనే తిరిగి వచ్చెను" అని రాజ్యపాలనమునందు ఇచ్ఛారాహిత్యమును ప్రక టించెను. కాని రాము డతని ప్రార్థన నంగీకరింపక లక్ష్మణునిచే అభి షేకసంభారములను దెప్పించి ఎంతో ప్రీతిగ్రో భవిష్యత్ మధురా రాజ్యమునకు పరిపాలకునిగా అభిషేకించెను.

దత్వా తస్మై శరం దివ్యం రామః శత్రుఘ్న మబ్రవీత్
అనేన జహి బాణేన లవణం లోకకంటకం॥

తదువాత శ్రీరాముడు దివ్యమగు నారాయణాస్త్రమును ప్రయోగోపసంహారపూర్వకముగా శత్రుఘ్నున కొసగి ఈశరణమును ప్రయోగించి లోకకంటకుడయిన లవణుని వధింపుమని ఆదేశించెను.

ఈ నారాయణాస్త్రమును శ్రీమహావిష్ణువు మధుకైటభసంహారమునకై సృష్టించినాడు. లోకకంటకులగువారలను సమూలముగ నాశనమొనర్చుటకు ఉద్దేశించబడినది. మధుకైటభులను వధించిన బాణమిది. వాల్మీకమున ఈవిషయము స్పష్టమొనర్పబడినది. "అమోఘో ఽయం శరోపేరదివ్యః పరపురం జయ అనేన లవణం వీరనూన్తాసి జయతాం వర సృష్టః శరోయం శత్రుఘ్న జగత్యే కార్ణవేపురా స్వయంభువాదేవ దేవేనా జితేన మహాత్మనా అధృష్యః సర్వభూతానాం తేనాయం శర ఉత్తమః సృష్టః క్రోధాభి భూతేన వినాశాయ దురాత్మనోః మధుకైట భయోర్వీర విఘాతే వర్తమానయోః సృష్టు కామేన లోకాం స్త్రీక్తా తౌ బాణేన హతౌ యుధి" అని.

శ్రీరాముడు శత్రుఘ్నునకు లవణుని వధించువిధానమును ఆదేశించుచున్నాడు.

సతు సంపూజ్య తచ్ఛూలం గేహేగచ్ఛతి కాననం
భక్షణార్థం తు జంతూనాం నానాప్రాణి వధాయచ॥

ఆ లవణరాక్షసుడు శత్రుభయములేక మహాదేవ ప్రాప్తమయిన శూలమును ఇంటనే విడచి వివిధజంతువులను భక్షించుటకును అనేక ప్రాణులను హింసించుటకును అరణ్యమునకు వెళ్ళగలడు.

సతునా ఽయాతి సదనం యావద్వానచరో భవేత్
తావ దేవ పురద్వారి తిష్ఠ త్వం ధృతకార్ముకః
యోత్స్యతే సత్వయా క్రుద్ధ స్తదా వధ్యో భవిష్యతి॥

అతడు వనమునుండి నగరమునకు తిరిగి రాకమునుపే నీవు అచ్చటకు చేరుము. నగరద్వారమునకు అడ్డుగా నీవు డుండుము. ధృతకార్ముకుడవై నీవచ్చట నిలబడియుండగా రాక్షసుడు వనమునుండి తిరిగి

వచ్చును. నిన్ను అచ్చటచూచి క్రుద్ధుడై యుద్ధమొనరించును. శూల రహితుడగు అతనిని నీ వాసమయమున సులువుగా వధింపగలవు.

తం హత్వా లవణం క్రూరం తద్వనం మధుసంజ్ఞితం
నివేశ్య నగరం తత్ర తిష్ఠత్వం మే ఽను శాసనాత్ ॥

ఇట్లు క్రూరకర్ముడగు లవణుని వధించి మధువనమేగుగల ఆవన మును ప్రవేశించి, అచ్చట ఒక నూతననగరమును నిర్మించుము. ఇది నాశాసనము. నీవు దానికి శాసకుడవు.

అశ్వానాం పంచసాహస్రం రథానాం చ తదర్ధకం
గజానాం షట్శతానీహ పత్తీనామయుతత్రయమ్
ఆ గమిష్యతి పశ్చాత్త్వ మగ్రే సాధయ రాక్షసమ్ ॥

శత్రుఘ్నా! నీవు ముందువెళ్ళి లవణుని సంహరించుము. నీవెను కనే ఐదువేల అశ్వములను, రెండున్నర వేలరథములను, ఆరువందల ఏను గులను పంపెదను. అవిగాక ముప్పదివేల కాల్బలమునుకూడ పంపెదను.

ఇత్యుక్త్వా మూర్ధ్న్యవఘ్రాయ ప్రేషయామాస రాఘవః
శత్రుఘ్నం మునిభిః సార్ధమాశీర్భి రభినంద్య చ ॥

ఇట్లు శత్రుఘ్ను నితో పలికి ప్రేమతో మూర్ధాఘ్రాణమొనర్చి అనేకములగు శుభాశీర్వాదములు నొనర్చి మునులతోగూడ పంపెను.

శత్రుఘ్నోఽపి తథా చక్రే యథారామేణ చోదితః
హత్వా మధుసుతం యుద్ధే మధురామకరోత్పురీమ్
స్ఫీతాంజనపదం చక్రే మధురాం దానమానతః ॥

శత్రుఘ్నుడును అన్నగారి ఆశీర్వాదములనుపొంది మునులవెంట మధురానగరమును సమీపించి ఆసమయమున లవణుడు శూలరహితుడై అరణ్యమునకు పోగా తాను పురద్వారమున నిలబడెను. ఇంతలో లవణుడును తిరిగివచ్చెను. శత్రుఘ్నుడతనిని నగరమందు ప్రవేశించనీయక అచ్చటనే యుద్ధమును గొనసాగించెను. గొంతసేపు ఘోరయుద్ధమునుచేసి అనంతరము నారాయణాస్త్రప్రయోగమున రాక్షసుని వధిం

చెను. తరువాత సౌమిత్రి నగరమున ప్రవేశించి ఆక్రమించి ప్రజలకు అనేకదానముల నొసగియు, పౌరముఖ్యులను గౌరవించియు నాగరికుల అభిమానమును చూరగొనెను.

సీతా ఽపి సుషువే పుత్రౌ ద్వౌ వాల్మీకే రథాశ్రమే
మునిస్తయో ర్నామ చక్రే కుశోజ్యే ష్ఠోనుజోలవః॥

ఇచ్చట వాల్మీకిమహర్షి యొక్క ఆశ్రమమునందున్న సీతాదేవియు ఇద్దరు పుత్రులను కనెను. మహర్షి ఆకవలలలో పెద్దవానికి కుశుడనియు, చిన్నవానికి లవుడనియు నామకరణమును ఒనరించెను.

లవుని వధించుటకు బయలుదేరిన శత్రుఘ్నుడొకనాటి రాత్రి వాల్మీకియొక్క ఆశ్రమమున గడపెననియు, ఆరాత్రియే కుశలవులు జనించిరనియు. వాల్మీకి రామాయణము. "యా మేవ రాత్రిం శత్రుఘ్నఃపర్ణ శాలా ముపావిశత్ తా మేవ రాత్రం సీతా ఽపి ప్రసూతా దారకద్వయమ్" అని.

క్రమేణ విద్యాసంపన్నౌ సీతాపుత్రౌ బభూవతుః
ఉపనీతౌ చ మునినా వేదాధ్యయన తత్పరౌ॥

ఆబాలకులు వయస్సంపన్నులు కాగానే మహర్షి వారికి వ్యాకరణాది శాస్త్రజ్ఞానమును కలిగించెను. అనంతరము ఉపనయనసంస్కార మొనరించి వేదాధ్యయనసంపన్నుల నొనర్చెను.

కృత్స్నం రామాయణం ప్రాహ కావ్యం బాలకయోర్మునిః
శంకరేణ పురాప్రోక్తం పార్వత్యై పురహారిణా
వేదోప బృంహణార్థాయ తావగ్రాహ యత ప్రభుః॥

లవకుశులు శాస్త్రాధ్యయనసంపన్నులును, వేదాధ్యయన సంపన్నులును అయిన అనంతరము వాల్మీకిమహర్షి వారిచే అనన్యదుర్లభమగు రామాయణకావ్యమును అధ్యయనము చేయించెను. ఆరామాయణము పూర్వము పురహరుడగు శంకరునిచే పార్వతికి చెప్పబడినది. మునిప్రభుడగు వాల్మీకి వేదార్థోపబృంహణమునకై ఆబాలకులకు పఠనీయమొనర్చెను. వారును దానిని భక్తిశ్రద్ధలతో గ్రహించిరి.

కువారౌ స్వరసంపన్నౌ సుందరౌ వశ్వినౌ వివ
తంత్రీతాల సమాయుక్తౌ గాయంతౌ చేరతుర్వనే ॥

కుశలవులు కుమారావస్థలో నున్నారు. వారు సహజముగా మధురమగు కంఠము కలిగియున్నారు. అశ్వినీదేవతలవలె సుందరవిగ్ర హులు. అంతేగాక హస్తపద్మములందు వీణలను తాళములను పటిరాగ యుక్తముగా వాయించుచున్నారు. వారు అన్నివిధముల రామాయణ గానమునకు తగియున్నారు. అట్టి బాలకు లిరువురును రామచరిత్రమును గానమొనర్చుచు ఋషివాటనముల నన్నిటిని పర్యటించిరి.

తత్ర తత్ర మునీనాం తౌ సమాజే సురరూపిణౌ
గాయంతౌ వభితౌ దృష్ట్వా విస్మితా మునయోబ్రువన్ ॥

అశ్వినీదేవతలవలె సుందరరూపములుగల ఆ బాలకులు అచ్చ టచ్చట మునులు సమావేశమయియున్న స్థలములందు రామాయణ గాన మొనర్చిరి. మధుర రాగాలాపన మొనర్చుచున్న వారినిజూచి మహర్షులు తమలో తా మిట్లు అనుకొనిరి.

గంధర్వే ష్వహ కిం నరేషు భువి దేవేషు వా దేవాలయే
పాతాలే ష్వధవా చతుర్ముఖగృహేలోకేషు సర్వేషు చ
అస్మాభి శ్చిర జీపిభి శ్చిరతరం దృష్ట్వా దిశః సర్వతో
నాజ్ఞా యిాదృశ గీతవాద్యగరిమా నాదర్శి నాశ్రావి చ ॥

గంధర్వులలోగాని, కిన్నెరగణములలోగాని, భూలోకమందు మరెక్కడగాని, ఇంద్రుని దేవలోకమందుగాని, పాతాళలోకమందు గాని, చతుర్ముఖుని నివాసమగు సత్యలోకమందుగాని, మరి యేఇతర లోకములందుగాని చిరకాలమునుండి జీవించియున్న మనము ఇట్టి గీత వాద్య గరిమాసుందరులగువారలని గాచియుండలేదు. అంతేగాక మనకు ముందు ఉన్నట్లును వినియుండలేదు. చిరకాలమునుండి జీవించి యుండి సర్వలోకసంచారులగువారు చూడనులేదు. వారికి పూర్వము ఉన్నట్లు వినియుండనులేదని భావము.

ఏవం స్తువద్భి ర్ఋషిభి ర్మునిభిః ప్రతివాసరం
ఆ సాతే సుఖ మేకాంతే వాల్మీకే రాశ్రమే చిరమ్॥

ఇట్లు రామాయణగాన మొనరించుచు మునిస్తవనీయులై ఆ బాలురు ప్రతిదినము సాయంకాలమునకు వాల్మీకియొక్క ఆశ్రమమును చేరెడివారు. అక్కడ ఏకాంతవాస మొనర్చుచు సుఖముగా నుండెడివారు.

అథ రామో ఽశ్వమేధాధీం శ్చకార బహుదక్షిణాన్
యజ్ఞాన్ స్వర్ణమయీం సీతాం విధాయ విపులద్యుతిః॥

అంతట అయోధ్యలో శ్రీరాముడును అత్యధికదక్షిణాసంపన్నములగు అశ్వమేధాది బహుయాగముల నొనర్చెను. యజ్ఞయాగాదులను భార్య దగ్గరలేకుండ ఆచరించడాము గాన బంగారుసీతను నిర్మించి తత్సహాయమున రాముడు కర్మాచరణమొనర్చెను.


తస్మి న్వి తానే బుషయః సర్వే రాజర్ష యస్తథా
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః సమాజగ్ము ర్దిదృక్షవః॥

శ్రీరాముడు యజ్ఞము నొనరించుకాలమున దేశమునందలి సర్వ బుషిసంఘములును, రాజర్షివర్యులును, బ్రాహ్మణోత్తములును, క్షత్రియులును, వైశ్యులును యజ్ఞదర్శనోత్సుకులై ఏతెంచెడివారు. వారు తీరుబడిసమయములందు సభామంటపమున కూర్చొని రాముని తో వివిధ విషయములనుగూర్చి సంభాషించెడివారు.

వాల్మీకి రపి సం గృహ్య గాయంతౌ తౌకుశీలవౌ
జగామ బుషివాటస్య సమీపం మునిపుంగవః॥

అంతట వాల్మీకిమహర్షియు మధురస్వరమున రామాయణగాన మొనర్చెడి కుశలవులను పెంటనిడుకొని యజ్ఞశాలలో మహర్షులు నివసించు భాగమునకు ఏతెంచెను.

తత్రై కాంతేస్థితం శాంతం సమాధివిరమే మునిమ్
కుశః పప్రచ్ఛ వాల్మీకిం జ్ఞానశాస్త్రం కథాంతరే॥



కుశలవులధనుర్విద్యాభ్యాసము

అంతట ఒకనాడు ఆ ఋషివాటమున వాల్మీకిమహర్షి ధ్యానము నుండి విరమించి శాంతస్వభావుడై ఏకాంతమున కూర్చొనియుండగా కుశుడు ఆయనను సమీపించి కొన్నివిషయములను పృచ్ఛించి సంభాషణవశమున జ్ఞానశాస్త్రమునుగూర్చి పృచ్ఛించెను.

భగవన్ శ్రోతు మిచ్ఛామి సంక్షేపా ద్భవతో ఽఖిలమ్
దేహినః సంసృతే ర్బంధః కథముత్పద్యతే దృఢః॥

భగవంతుడా! నాకు కొన్నిసందేహము లున్నవి. ఆ సందేహములకు సమాధానమును భవన్ముఖతః వినగోరుచున్నాను. నా సందేహము లివి– దేహము. నాశ్రయించుకొనియున్న జీవునకు దృఢమగు సంసారబంధ మెట్లు సంభవించును?

కథం విముచ్యతే దేహీ దృఢబంధాత్ భవాభిధాత్
వక్తు మర్హసి సర్వజ్ఞ మహ్యం శిష్యాయతే మునే॥

ఆదృఢమగు సంసారబంధనమునుండి దేహీ (జీవుడు) ఎట్లు విముక్తుడగును? ఈ నాప్రశ్నలకు నీవే సమాధానము చెప్పగలవు. శిష్యుడగు నాపై దయయుంచి వాక్రుచ్చుము.

వాల్మీకిరువాచ:—

శృణువత్స ప్రవక్ష్యామి సంక్షేపాద్బంధ మోక్షయోః
స్వరూపం సాధనం చాపి మత్తః శ్రుత్వా యథోదితం
తథైవాచర భద్రంతే జీవన్ముక్తో భవిష్యసి॥

వత్సా! వినుము. దేహము నాశ్రయించుకొనియున్న జీవుడు సంసృతిబంధమున తగులుకొనియుండుటకు కారణమును, తద్బంధస్వరూపమును వివరించెదను. తరువాత బంధమోక్షవిధానమును తెలియజేసెదను. నేను చెప్పినదానిని విని యథాతథముగ ఆచరించినచో జీవన్ముక్తుడవు కాగలవు.

దేహ ఏవ మహాగేహ మదేహస్య చిదాత్మనః
అస్యాహంకార ఏవాస్మిన్ మంత్రీ తేనైవ కల్పితః॥

సృష్టియందలి సర్వవస్తువులను ప్రకాశవంతముల నొనర్చు చిదాత్మ దేహరహితమయినది. అయినను అది త్రిగుణాత్మకప్రకృతి

వికారమగు స్థూలదేహమున ప్రతిబింబించి జీవసంజ్ఞచే బరగుచున్నది. అట్టి చిదాత్మకు ఈ దేహము నివాసార్థమయిన మహాగృహముగా నున్నది. ఈ గృహమునకు జీవాత్మ రాజువంటి సర్వాధికారి. ఆ రాజునకు అహంకారమనునది మంత్రిగా కల్పించుకొనబడినది. జీవు డొనర్చు కర్మలన్నియు అహంకారనిర్దేశప్రకారమునసే జరుగుచుండునని భావము.

దేహ గేహాభిమానం స్వం సమారోప్య చిదాత్మని
తేన తాదాత్మ్య మాపన్నః స్వచేష్టిత మశేషతః
విదధాతి చిదానందే తద్భాసిత గ్బపుః స్వయమ్॥

ఈ శరీరమను గృహమందు అహంకారమునకు అభిమాన ముండును. అది తన అభిమానమును చైతన్యస్వరూపు డయిన జీవునియందు ఆరోపించును. వాస్తవమునకు అహంకారము జడవికారము. అయినను అది చిదాత్మసంపర్కముచే ప్రకాశవంతమగును. అయి తానును జీవు నిలో తాదాత్మ్యతను బొందును. బొంది తనభావమును అనగా దేహాభిమానమును జీవునికి సంక్రమింపజేయును. పై శ్లోకమున అహంకారము జీవునికి మంత్రిగా జెప్పబడినది. మంత్రి రాజునకు దేహమందు అభిమానమును కలిగించునని తాత్పర్యము.

తేన సంకల్పితో దేహీ సంకల్ప నిగతావృతః
పుత్రదార గృహాదీం శ్చ సంకల్పయతి చానిశం
సంకల్పయన్ స్వయం దేహీ పరిశోచతి సర్వదా॥

ఇట్లు అహంకారవశుడై దేహాభిమానము కలిగిన జీవుడు దేహమునే సర్వస్వముగా భావించి దానికై వివిధసంకల్పములకు గురియగు పుత్రదారధనాదులయందు ఇచ్ఛ జనించును. అత డట్టి సంకల్పములకు వశుడై, తద్బంధనములచే బంధితుడై నిత్యము చింతాపరవశుడగును. "ప్రకృతేః క్రియ మాణాని గుణైః కర్మాణి సర్వశః, అహంకార విమూఢాత్మా కర్తా ఒహమితిమన్యతే" అని భగవద్గీత.

త్రయ స్త స్యాహ మో దేహా అధమో త్తమ మధ్యమాః
తమః సత్త్వరజస్సంజ్ఞా జగతః కారణం స్థితేః॥

ఆ అహంకారమునకు సత్త్వరజస్తమోగుణముల ననుసరించి మూడు శరీరములున్నవి. ఆ మూడిటిలోను సత్త్వగుణప్రధానమయిన శరీరము ఉత్తమమయినది. రజోగుణ ప్రధానమయిన శరీరము మధ్యమమయినది. తమోగుణప్రధానమయిన శరీరము అధమమయినది. ఈ మూడు శరీరములే జగత్థ్సితికి కారణములు. అనగా అహంకారవశుడయిన జీవుడు త్రిగుణముల ననుసరించి సత్త్వరజస్తమోగుణప్రధానమయిన శరీరములలో దేనినో ఒకదానిని పొందుచుండును అని భావము.

తమో రూపార్థి సంకల్పాన్నిత్యం తామస చేష్టయా
అత్యంతం తమసోభూత్వా కృమికీటత్వ మాప్నుయాత్ ॥

జీవుడు అహంకారవశుడై తమోగుణప్రధానమయిన సంకల్పములను సంకల్పించుచు తామసకృత్యములను ఒనరించుచు ఉన్నట్లయిన తానును తమోమయుడే అయి తత్ఫలముగా క్రిమికీటకాది జన్మల నందుచుండును.

సత్వరూపో హి సంకల్పో ధర్మజ్ఞానపరాయణః
అదూర మోక్ష సామ్రాజ్యః సుఖరూపో హి తిష్ఠతి ॥

సత్వగుణప్రధానమయిన సంకల్పములనే సంకల్పించుచు ధర్మజ్ఞానపరాయణుడై ఉన్నచో, అట్టిజీవులు మోక్షసామ్రాజ్యమునకు సమీపమున నివసించుచు సుఖముల ననుభవించుచు సత్వగుణప్రధానుడై ధర్మాత్ముడగువాడు ఉత్తరజన్మమున దేవాదిశరీరములను సంపాదించి సుఖించుననని భావము.

రజోరూపో హి సంకల్పో లోకసంవ్యవహారవాన్
పరితిష్ఠతి సంసారే పుత్ర దారాను రంజితః ॥

రజోగుణప్రధానసంకల్పపరుడయినవాడు ఇహలోకమందలి వ్యవహారములలో నిమగ్నుడై, పుత్రుడు, భార్య, ధనము మొదలగువాటియందు తత్పరుడై యుండును. ఉత్తరజన్మమందును ఇహలోకమందు మానవుడుగానే జన్మించునని తాత్పర్యము.

త్రి విధం తు పరిత్యజ్య రూపమేతన్మహామతే
సంకల్పః పరమాప్నోతి పరమాత్మ పరిక్షయే ॥

ఈ పైనచెప్పినవిధముగా త్రిగుణములును బంధనకారకములే. సత్వగుణమును బంధనకారకమే. కాన ఎవడైతే ఈ త్రినిధములగు గుణజాలమును పరిత్యజించి ప్రకృతికి పరమయిన సంకల్పమును సంకల్పించునో అతడు దేహనాశానంతరము సంసారబంధనములను తొలంపుకొని ఆత్మయందు సంలీనుడగును. ప్రకృతికి పరమయిన సంకల్పమనగా పరమాత్మవిషయకమగు బుద్ధి లేక మననము.

దృష్టీః సర్వాః పరిత్యజ్య నియమ్య మనసా మనః
సబాహ్యం భ్యంరార్థస్య సంకల్పస్య క్షయం కురు॥

కుశునకు కర్తవ్యమును బోధించుచున్నాడు- పైన జెప్పిన దానిని బట్టి సంకల్పమే సంసారబంధమునకు కారణమని తేలినది. కాన నీవు బాహ్యములను సర్వదృష్టులను పరిహరించుము. (బాహ్యపదార్థములను ఇచ్ఛలో చూచుట మానుము.) దానితో మనస్సు నియమబద్ధము కాగలదు. అపైన బహిరందములు ఆంతరికములు అగు సంకల్పముల నన్నిటిని నశింపజేయుము.

యది వర్ష సహస్రాణి తపశ్చరసి దారుణమ్
పాతాలస్థస్య భూస్థస్య స్వర్గస్థస్యాపి తేనఘ
నాన్యః కశ్చి దుపాయోఽస్తి సంకల్పోపశమాదృతే॥

స్వర్గమర్త్యపాతాళములందు ఎక్కడ నివసించువాడయినను మహా చారుణముగా వేయిసంవత్సరములు తపస్సు నొనరించినను సంకల్ప విరమణజరుగనంతవరకు మోక్షము సంప్రాప్తించుట అనునది అసంభవము.

అనాబాదే ఽవికారే స్వే సుఖే పరమపావనే
సంకల్పోపశమే యత్నం పౌరుషేణ పరంకురు॥

సంకల్పములు నశించుటచే సర్వబాధలు నశించును. సర్వవికారములు తొలగిపోవును. అత్యంతము మహోన్నతములగు సుఖములు

చేయూరును. అది అతిపవిత్రమయిన అవస్థ కనుక కుశా ! నీవు అట్టి సంకల్పోపశాంతికై నీశక్తి నంతను వినియోగించి సాధించుము.

సంకల్పతస్తా నిఖిలాభావాః ప్రోతాః కిలానఘ
భిన్నేతస్తా న జానీతే క్వయాంతి విభవాః పరాః ॥

అనఘా ! సంకల్ప మను దారముచే సర్వసాంసారిక భావములను గ్రుచ్చబడియున్నవి. ఆ సంకల్పతంతువు తెగినవెంటనే ఈ సాంసారికప్రయోజనము లన్నియు ఎచ్చట మటుమాయమగునో తెలియదు. సంకల్పమే సంసారకార్యములం దాపట్టి యుంచుచున్నది. తద్విచ్ఛిత్యనంతరము ఒక బంధనమును ఉండదని భావము.

నిస్సంకల్పో యథా ప్రాప్త వ్యవహారపరోభవ
ఋ యే, సంకల్ప జాలస్య జీవో బ్రహ్మత్వమాప్నుయాత్ ॥

నీవు సంకల్పరహితుడవై ప్రాప్తించినదానితో తృప్తినందువాడవు గమ్ము. సంకల్పజాలము నశించినవాడు సాంసారిక బంధమోక్షమునందును బంధము నందినవాడే బ్రహ్మయగును. పరమాత్మస్వరూపుడనిభావము.

అధి గత పరమార్థ తా ముపేత్య
ప్రసభమపాస్య వికల్పజాల ముచ్చైః
అధిగమయ పదంత ద ద్వితీయం
వితత సుఖాయ సుషప్త చిత్తవృత్తిః ॥

కుశా ! నీవు ప్రయత్నపరుడవైనచో మానవుని సంసారమునందు గాఢముగా బంధించియుంచు సంకల్పజాలమును త్రెంచినచో పరమతత్వప్రాప్తి నందగలవు. అనగా బ్రహ్మీభూతుడవు కాగలవు. అద్వితీయమగు బ్రహ్మపదవి నందుకొనగనే బాహ్యప్రాపంచికకర్మ లయ విషయమై నిద్రించు చిత్తవృత్తిగలవాడవగుదువు. బ్రహ్మానందానుభవశాలికి బాహ్యప్రవృత్తియుండదని భావార్థము, నిశ్చితార్థము కూడాను.

సప్తమసర్గ

వాల్మీకినా బోధితో ఽసౌ కుశః సద్యోగత భ్రమః
అంతర్ముక్తో బహిస్సర్వ మనుకుర్వ శ్చకార సః ॥

వాల్మీకిచే ఉపదేశించబడిన తత్త్వజ్ఞానముచే కుశుని హృదయ మందున్న భ్రమాత్మకధారణలన్నియు తొలగిపోయినవి. అతడు సంసా రవిషయములందు ఆసక్తిలేని హృదయముతో ప్రవర్తిల్ల నారంభించి నాడు. అతడు నిస్సంగమనస్కుడయి బాహ్యజీవితములో కర్తవ్యనిమ గ్నుడై సంచరించినాడు.

వాల్మీకి రపి తౌ ప్రాహ సీతాపుత్రౌ మహాధియా
తత్ర తత్ర చ గాయంతౌ పురే వీధిషు సర్వతః॥
రామస్యాగ్రే ప్రగాయేతాం శ్రుత్వాషుర్యది రాఘవః
న గ్రాహ్యం వైయవాభ్యాం తద్యది కించి త్ప్రవాస్యతి॥

వాల్మీకిమహర్షి సీతాపుత్రులగు ఆ కుశలవులను జూచి ఇట్లు ఆజ్ఞాపించెను. "మీరు ఇంతవరకు నేర్చిన రామాయణ కావ్య మును అయోధ్యాపురవీధులందు గానము గావించి క్రమనుగా శ్రీరా ముని సన్నిధినిగూడ వినిపించవలసినది. మీ కావ్యగానమును విని సంతుష్టుడై రాఘవుడు ఏదయిన బహుమాన మొసంగబోయెనేని దానిని గ్రహింపకుడు" అని.

ఇదితౌ చోదితౌ తత్ర గాయమానౌ విచేరతుః
యథోక్త మృషిణా పూర్వం తత్ర తత్రాభ్యగాయతాం॥

ఇట్లు వాల్మీకి మహర్షి ప్రేరితులగు అన్నదమ్ములిద్దరును మహర్షి వారి కిదివరకునేర్పిన మహాకావ్యమును అయోధ్యానగరమం దచ్చట చ్చట గాన మొనర్చుచు సంచరించిరి.

తాం సం శ్రుత్యావకాకుత్స్థః పూర్వచర్యాంత తస్తతః
అపూర్వపాఠవృత్తాదిగేయేన సమభిప్లుతాం
బాలయో రాఘవః శ్రుత్వా తూహాల కాముపేయివాన్॥

"అయోధ్యానగరవీధులందు ఇద్దరు బాలకులు శ్రీరామచంద్రుని పూర్వజీవితమును మధురకంఠములతో గానముచేయుచున్నారనియు, ఆకావ్యము అపూర్వముగా పఠింపబడు ఛందోవృత్తములలో నిబద్ధమయి యున్నదనియు వార్తాక్రమముగా శ్రీరామచంద్రుని చెవులలోబడినది. ఈవార్త వినగనే అతని మనస్సు తత్కావ్యశ్రవణ కుతూహలవశమయినది. ఈశ్లోకమందలి పూర్వచర్య అను పదమునకు పూర్వులగు ఇక్ష్వాకు వంశీకుల రాజ్యపాలనాది వృత్తాంతమనియు అర్థము చెప్పవచ్చును.

అథ కర్మాంతరే రాజా సమాహూయ మహామునీ౯
రాజ్ఞశ్చైవనరవ్యాఘ్రః పండితాంశ్చైవ నైగమా౯ ॥

అనంతరము రాజకార్యములను నిర్వర్తించి శ్రీరాముడు వశిష్ఠాది మహాములను, జనకాది రాజర్షులను, శాస్త్రపండితులను వేదవేత్తలను రావించెను.

పౌరాణికా౯ ఛందవిదో యే చ వృద్ధా ద్విజాతయః
ఏతా౯ సర్వాన్ సమాహూయగాయకా౯ సంప్రవేశయత్ ॥

సర్వపురాణవిశేషవేత్తలును, ఛందశ్శాస్త్రజ్ఞులగు ఉత్తమబ్రాహ్మణులను కంకా ఇతరప్రముఖులను రావించి సభగావించి అనంతరము గాయకులను ప్రవేశపెట్టెను.

తే సర్వే హృష్టమనసో రాజానో బ్రాహ్మణాదయః
రామం తౌ బారకాదృష్ట్వా విస్మితాహ్యనిమేషణాః
అవోచ౯ సర్వ ఏవైతే పరస్పర మధాగతాః ॥

ఆసభకు విచ్చేసిన మహారాజులు, బ్రాహ్మణులు, మహర్షులు మొదలగువారందరును ఆబాలకులను చూడగనే హృష్టమనస్కులగుటయే గాక రాముని వారిని పర్యాయముగా చూచుచు రూపసాదృశ్యమునకు విస్మితహృదయులయిరి. అనిమేష దృక్కులతో కుశలవుల నట్లే చూడ నారంభించిరి. కొంతసేపటికి ప్రకృతిస్థులై వారు పరస్పరము ఇట్లు భాషింపనొడగిరి.

ఇవకా రామస్య సదృశౌ బింబాద్బింబమివోదితౌ
జటిలౌ యది నస్యాతాం న చ వల్కలధారిణౌ
విశేషం నాదిగచ్ఛామో రాఘవ స్యానయోస్త్వ్ధా॥

"ఈ బాలకులు రామునివలెనే ఉన్నారు. వీరిని చూచి రాముని ప్రతిబింబములా అనిపించుచున్నది. ఒక్క జటలే వేరుపరచుచున్నవి గాని లేనిచో రామునికి వీరికి భేదమే కానరాదు" అని.

ఏవం సంవదతాం తేషాం విస్మితానాం పరస్పరం
ఉపచక్రమ తుర్గ్రాతుం తా వుభౌ మునిదారకౌ॥

సభాసదులందరు ఈవిధిగా పరస్పరము విస్మయపూర్వకసంభాషణల నొనరించుకొనుచుండగా ఆ మునిబాలకు లిద్దరు రామాయణ గానమును ప్రారంభించిరి.

తతః ప్రవృత్తం మధురం గాంధర్వమతిమానుషం
శ్రుత్వాతన్మధురం గీతమపరాహ్ణే రఘూత్తమః
ఉవాచ భరతం చా ఒభ్యాం దీయతామయుతం వసు॥

సభాసదులిట్లు గుసగుసలు పోవుచుండగనే ఆబాలకులు మధురాతిమధురము, సామాన్యమానవదుర్లభము అగు గాంధర్వమున రామాయణగానమున కుపక్రమించిరి. వారి మధురకావ్యగానమును విని అపరాహ్ణకాలమున రాముడు భరతునితో "వీరికి పదివేల బంగారు నాణెములను బహుమానమొసగు" మని చెప్పెను.

దీయమానం సువర్ణం తు న తజ్జగృహతుస్తదా
కి మనేన సువర్ణేన రాజన్నా వన్యభోజినౌ
ఇతి సంత్యజ్య సందత్తం జగ్మతుర్మునిసన్నిధిమ్॥

కాని ఆ బాలకు లాసువర్ణములను గ్రహించలేదు. వారు "రాజా! మేము ఆశ్రమములందుండి వనమందు లభించు కందమూలఫలములను భక్షించి జీవించువారలము. అట్టి మా కీసువర్ణము లెందులకు?" అని చెప్పి వాటిని పరిత్యజించి వాల్మీకిమహర్షి సన్నిధికిచేరిరి.

ఏవం శ్రుత్వా తు చరితం రామస్యైవ విస్మితః
జ్ఞాత్వా సీతాకుమారౌ తౌ శత్రుఘ్నంచేద మబ్రవీత్
హనూమంతం సుషేణం చ విభీషణ మథాంగదం ॥

కుశలవుల ముఖతః తనచరిత్రమునే కావ్యనిబద్ధమయినదానిని విని శ్రీరాముడు విస్మితహృదయుడయ్యెను. అంతట అతడు శత్రుఘ్నుని, హనుమంతుని, సుషేణుని, విభీషణుని, అంగదునిచూచి ఇట్లాజ్ఞాపించెను.

భగవంతం మహాత్మానం వాల్మీకిం మునిసత్తమం
ఆనయధ్వం మునివరం ససీతం దేవసమ్మితం ॥

తపఃసంపన్నుడును, మహాత్ముడును, మునిశ్రేష్ఠుడును అగు వాల్మీకి మహర్షిని సీతాసమేతముగా ఈ సభాభవనమునకు దోడ్కొనిరండు.

అస్యా ఒస్తు పర్షదో మధ్యే ప్రత్యయం జనకాత్మజా
కరోతు శపథం సర్వే జానంతు గతకల్మషాం ॥

జనకపుత్రియగు సీత ఈ మహాపరిషన్మధ్యమున పౌరజానపదులకు విశ్వాసముకలుగుటకై పునఃశపథ మొనర్చుగాక. ప్రజలందరు నిర్దోషత్వమును గ్రహించి దుర్భావరహితులగుదురుగాక.

సీతా తద్వచనం శ్రుత్వా గతాః సర్వే ఒతివిస్మితాః
ఊచుర్వ్యధోక్తం రామేణ వాల్మీకిం రామపార్షదాః ॥

సీతాదేవినిగూర్చి శ్రీరాముడుపల్కిన ఈ వాక్యములను విని సభాసదు లందరును విస్మయమును పొందిరి. శత్రుఘ్నాదులగు రామపారిషదులు వాల్మీకిమహర్షి నివాసమును జేరి రాముని వాగ్యములను నివేదించిరి.

రామస్య హృద్గతం సర్వం జ్ఞాత్వా వాల్మీకి రబ్రవీత్
శ్వః కరిష్యతిసై సీతా శపథం జనసంసది
మోషితాం పరమం దైవం పతిదేవన సంశయః॥

వాల్మీకి మహర్షి శ్రీరాముని హృద్గతభావమును గ్రహించినాడు. అతడు శత్రుఘ్నాదులతో ఇట్లనినాడు- స్త్రీలకు భర్తయే పరమదైవము అనుటలో సందియములేదు. జానకి పతివ్రతాశిరోమణి. ఆమె భర్త యొక్క ఆజ్ఞను ఉల్లంఘించదు. రేపు మహాపరిషత్తులో సమస్తప్రజల యెదుట ఆమె శపథమొనర్పగలదు. వాల్మీకి త్రికాలవేది యగుటచే సీతాదేవి అవతారోపసంహారరూపమయిన రహస్యమును గ్రహించి నాడని 'రామస్య హృద్గతం జ్ఞాత్వా' అన్న మానివలన స్ఫుటమగుచున్నది.

తచ్ఛ్రుత్వా సహసా గత్వా సర్వే ప్రోచు ర్మునే ర్వచః
రాఘవస్యాపి రామోఽపి శ్రుత్వా మునివర స్తథా
రాజానో మునయః సర్వే శృణుధ్వ మితి చా బ్రవీత్॥

శత్రుఘ్నాదులు వెంటనే వాల్మీకియొక్క సమాధానమును సభలోనున్న రామునికి నివేదించిరి. అంతట రాముడు "ఓ మహారాజు లారా! మునీశ్వరులారా! తపోధనశ్రేష్ఠులారా! నేను చెప్పబోవునది సావధానులై వినుడు.

సీతాయాశ్చ శపథం లోకా విజానంతు శుభాశుభం
ఇత్యుక్త్వా రాఘవేణాథ లోకాశ్చ సర్వే దివృక్షవః॥

సీతాదేవి తనపై మోపబడిన నిందను పరిహరించుకొనుటకై రేపు ఈ మహాసభలో శపథమొనర్పబోవుచున్నది. మీరందరును దానిని తిలకించి ధర్మాధర్మనిర్ణయము నొనరింపుడు అనెను. రాముని వాక్యములు నగరమం దంతటను ప్రాకినవి. తోడనే నగరవాసులు పౌరజానపదులు మొదలగువారందరును సీతాదేవి శపథదృశ్యమునుచూడ కుతూహలయుక్తులయిరి.

బ్రాహ్మణాశ్చ క్షత్రియా వైశ్యాశ్చ శూద్రా శ్చైవ మహర్షయః
వానరా శ్చ సమాజగ్ముః కౌతూహలసమన్వితాః॥

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాదులగు సమస్తవర్ణముల వారును, తపోధనులగు మహర్షులను, ఇంకను వానరులును ఆ శపథదృశ్య దర్శనకుతూహలులై విచ్చేసిరి.

తతో మునివర స్తూర్ణం ససీతః సముపాగమత్
అగ్రతస్త మృషిం కృత్వా యాంతీ కించిదవాఙ్ముఖీ
కృతాంజలి ర్బాష్పకంఠీ సీతా యజ్ఞం వివేశతం॥

అంతట ఆ మహాపరిషత్తులోనికి వాల్మీకిమహర్షి సీతను వెంట నిడుకొని ప్రవేశించెను. సీతాదేవియు మహర్షిని అనుసరించి కించిత్ వినమ్రముఖియై, అంజలిఘటించి, బాష్పరుద్ధకంఠియై ఆ యజ్ఞవాటమును ప్రవేశించినది.

దృష్ట్వా లక్ష్మీ మివాఽఽయాంతీ బ్రహ్మణ మనుయాయినీం
వాల్మీకేః పృష్ఠతః సీతాం సాధువాదో మహా నభూత్ ॥

వాల్మీకిమహర్షి ననుసరించివచ్చుచున్న సీత బ్రహ్మనుసరించి వచ్చుచున్న సాక్షాల్లక్ష్మివలె శోభించినది. ఆమెను చూడగనే మహా జనతాపరిషత్తు ఒకమారు జయజయధ్వనులతో ప్రతిధ్వనించినది.

తదా మధ్యే జనౌఘస్య ప్రవిశ్య మునిపుంగవః
సీతాసహాయో వాల్మీకి రితి ప్రాహ చ రాఘవం ॥

అట్లు సీతాసహాయుడయిన వాల్మీకి మహర్షి ఆ జనసమూహ మధ్యమున ప్రవేశించి రాఘవునితో ఇట్లుపలికెను.

ఇయం దాశరథే సీతా సువ్రతా ధర్మచారిణీ
అపాపా తే పురా త్యక్తా మయా ఽఽశ్రమసమీపతః
లోకాపవాద భీతేన త్వయా రామ మహావనే ॥

దాశరథీ! ఈసీత పవిత్రమయిన ఆచరణకలది. నిత్యము ధర్మమును అతిక్రమించక చరించునది. నిర్దోషురాలు. అయినను లోకాపవాదభీతుడవయిన నీవు ఈమెను మహారణ్యములో నా ఆశ్రమసమీపమున ఒంటరిగా వదలివేసితివి.

ప్రత్యయం దాస్యతే సీతా తదనుజ్ఞా తు మర్షసి
ఇమౌ తు సీతా తనయౌ విమౌ యమలజాతకౌ
సుతౌ తు తవ దుర్ధర్షే తథ్య మేతత్ బ్రవీమి తే ॥

ఇప్పు డీమె ఈ మహాసంసత్తులో తన నిర్దోషత్వమును బుజువు పర్చుకొనుటకై శపథము చేయగలదు. నీపు అనుజ్ఞనిమ్ము. ఈ బాలు రిద్దరు సీతాపుత్రులు. వీరు కవలలు. నీ పుత్రులగు వీరు శత్రుదుర్ధర్షు లగు వీరులు. ఈ నా వాక్యములలో అసత్యమెంతమాత్రమునులేదు.

తన వంశగౌరవమును పేర్కొని తనమాటల సత్యత్వమును బల పరచుకొనుచున్నాడు :

ప్రచేతసో ఽహం దశమః పుత్రో రఘుకులోద్వహ
అనృతం న స్మరా మ్యుక్తం యథేహా తవ పుత్రకౌ ॥

రామా ! నావాక్యములు సత్యములు. నేను ప్రచేతసుని పదవ పుత్రుడను. ఈనాటివరకు నేను అబద్ధమాడినదిలేదు. నా సూనృత వ్రతము ఎంతసత్యమో ఈ కవలలు నీ పుత్రకులగుటకూడ అంతసత్యము. ఇందసత్య మావంతయయినను లేదని భావము.

బహూ న్వర్షగణాం సమ్యక్ తపశ్చర్యా మయా కృతా
నోపాశ్నీయాం ఫలం తస్యా దుష్టేయం తవ మైథిలీ ॥

అనేకములగు సంవత్సరశతముల నేను ఎడతెగని తపస్సు నాచరించితిని. ఈ నీపత్నియగు మైథిలి దుష్టచరిత్రయే అయినచో నే నా తపోఫలమును పొందకుందునుగాక !

వాల్మీకి నైవ ముక్త స్తు రాఘవః ప్రత్యభాషత
ఏవ మేత న్మహాప్రాజ్ఞ యథా వదసి సువ్రత ॥

ఇట్లు వాల్మీకి సీతాదేవి సత్సీలమునుగూర్చి ప్రతిజ్ఞ నొనర్పగా విని రాముడు బదులుపలికెను. మహామతీ ! నీ వన్యదుర్లభమయిన తపో వ్రతముచే విరాజిల్లుచున్నవాడవు. నీవాక్యములు అక్షరశః సత్యములు. సందేహము లేదు.

ప్రత్యయో జనితో మహ్యం తవ వాక్యై రకిల్బిషై
లంకాయా మపి దగ్ధో మే వైదేహ్యా ప్రత్యయో మహాన్
దేవానాం పురత స్తేన మందిరే సంప్రవేశితా ॥

పవిత్రములగు నీవాక్యములతోడనే సీత సౌశీల్యముపిషయమై నాకు విశ్వాసము కుదిరినది. అంతేకాదు జానకి ఇదివరకు రావణవధానంతరముకూడ తన సౌశీల్యమును దేవతలయెదుట అగ్నిప్రవేశరూపమున స్పష్టముచేసినది. ఆతరువాతనే నేనామెను రాజమందిరమునకు దోడ్కొనివచ్చితిని.

సేయం లోకభయాద్ బ్రహ్మన్ అపాపాపి సతీ పురా
సీతా మయా పరిత్యక్తా భవాం స్తత్ క్షంతు మర్హతి॥

సీత పాపవృతలంపైన లేని మహాసతి యని ఇదివరకే తెలిసి యుండియు లోకభయమునకే నామెను పరిత్యజించితినే గాని మరొక తలపునగాదు. నా యీకృత్యమును నీవు క్షమించుటకు అక్కడవు.

మమైవ జాతే జానామి పుత్రా వేతౌ కుశీలవౌ
శుద్ధాయాం జగతీ మధ్యే సీతయాం ప్రీతిరస్తు మే॥

అంతేగాదు. ఈ కుశలవు రిరువురును నాపుత్రకులే అను విషయమును ఎరుగుదును. అయినను ప్రజలకందరకు తెలుయునట్లు ఈ సభా సమక్షమున సమస్త లోకములకు తెలిసిన తన సౌశీల్యమును వెల్లడిచేసి అనగా మరియొక మారు శపథమునుచేసి నా ప్రేమను చూరగొనుగాక!

దేవాః సర్వేపరిజ్ఞాయ రామాభిప్రాయ ముత్సుకాః
బ్రహ్మాణమగ్రతః కృత్వా సమాజగ్ముః సహర్షభిః॥

ఇంద్రాది దేవత లందరును శ్రీరాముని మనోవాంఛితమను (సీత ముందు వైకుంఠమును ప్రవేశించిన అనంతరము నేను ప్రవేశింతునుగాక అనునది) గ్రహించి బ్రహ్మను మున్నిడుకొని గుంపులు గుంపులుగా వచ్చి ఆకాశమున నిలచిరి.

ప్రజాః సమాగమ్య హృష్టాః సీతాకాశేయవాసినీ
ఉదఙ్ముఖీ హ్యధోదృష్టిః ప్రాంజలి ర్వాక్యమబ్రవీత్॥

కోసలరాజ్యమందలి ప్రజ లందరును ఆదృశ్యమును దర్శింప

వచ్చిరి. పట్టుచీరలను ధరించియున్న జానకి ఉదబ్ముఖియును అధో దృష్టియునై అంజలి జోడించి ఇట్లు పలికినది.

రామాదన్యం యథా ఽహం వైమనసాఽపి న చింతయే
తథా మే ధరణీదేవీ వివరం దాతు మర్హతి॥

రాముని వినా మరొక పురుషుని మనస్సులో ఊహించి యుండ నేని ధరణీదేవి తనలోనికి మార్గము నిచ్చుగాక!

తథా శపంత్యాః సీతాయాః ప్రాదురాసే న్మహాద్భుతం
భూతలా ద్దివ్యమత్యర్థం సింహాసన మనుత్తమం
నాగేంద్రైర్ధ్రియమాణం చ దివ్యదేహై రవిప్రభమ్॥

సీతాదేవి ఇట్లు శపథమొనర్చుచుండగనే ఒక సర్వలోకాద్భుత మగు ఆశ్చర్యము జరిగినది. భూమిని ఛేదించుకొని దివ్యశరీరములుగల గజరాజులచే వహింపబడుచు సూర్యునివలె ప్రకాశించుచున్న దివ్య సింహాసన మొక్కటి పైకి వెలువడినది.

భూదేవీ జానకీం దోర్భ్యాం గృహీత్వా స్నేహసంయుతా
స్వాగతం తా మువాచైనాం ఆసనే సన్న్యవేశయత్॥

సింహాసనముతోబాటు భూదేవి పైకి వెడలినది. దివ్యరూపిణి యగు ఆమె జానకిని పుత్రికావాత్సల్యమున హస్తములతో గ్రహించి "అమ్మా! స్వాగత" మని పలుకుచు సింహాసనమున నునిచెను.

సింహాసనస్థాం వైదేహీం ప్రవిశన్తీం రసాతలమ్
నిరంతరా పుష్పవృష్టి ర్దివ్యా సీతా మహాకిరత్॥
సాధువాద శ్చ సుమహా న్దేవానాం పరమాద్భుతః
ఊచు శ్చ బహుధా వాచో హ్యంతరిక్షగతాః సురాః॥

ఇట్లు భూదేవి స్వాగతము ననుసరించి దివ్యసింహాసనస్థయై రసాతలమును ప్రవేశించుచున్న సీతాదేవిపై దేవసమూహములు నిరంతరపుష్పవృష్టిని వర్షించిరి. లోకాశ్చర్యకరముగా దేవతలు "సాధు

సాధు సీతే" అని కీర్తించిరి. అంతరిక్షగతులగు లోకపాలాదులు ఆమె ఆత్మశక్తిని వేనోళ్ళ ప్రశంసించిరి.

అంతరిక్షే చ భూమా చ సర్వే స్థావరజంగమాః
వానరా శ్చ మహాకాయాః సీతా శపథ కారణాత్॥
కేచి చ్చింతా పరాస్తస్యాః కేచిద్ధ్యాన పరాయణాః
కేచిద్రామం నిరీక్షంతః కేచిత్ సీతా మచేతసః॥
ముహూర్త మాత్రం తత్ సర్వం తూష్ణీం భూత మచేతనం
సీతా ప్రవేశనం దృష్ట్వా సర్వం సమ్మోహితం జగత్॥

అటు ఆకాశమునను, ఇటు భూమియందునను స్థావరజంగమాత్మకములగు ఎన్ని ప్రాణులు గలవో అవి యన్నియును, సభాసదులతో పాటు ఈదృశ్యమును నిరీక్షించుచున్న మహాకాయులు, ధైర్యశాలురు అగు వానరులును సీతాశపథకారణమున సమ్మోహితులయిరి. జానకీదేవి రసాతలమును ప్రవేశించుచుండగా సమస్త జగత్తు ఒక్క ముహూర్తకాలము అచేతనావస్థను పొందినట్లయినది. దేవాదులలో కొందరు చింతాపరులయిరి. కొందరు ఇష్టదైవధ్యానమున నిమగ్నులయిరి. లేదా సీతారామస్వరూప ధ్యానపరాయణు లయిరి. కొందరు రాముని, కొందరు సీతను అట్లే చూచుచు నిశ్చేష్టులై నిలబడిపోయిరి. అంతట నిశ్శబ్దత ఆవరించినది.

రామస్తు సర్వం జ్ఞాత్వైవ భవిష్యత్కార్య గౌరవమ్
అజానన్నివ దుఃఖేన శుశోచ జనకాత్మజామ్॥

ఆసమయమున అందరితోబాటు శ్రీరామచంద్రుడును దుఃఖనిమగ్నుడయ్యెను. కాని అతని సమ్మోహమును మాత్రము తెలియజేయదు. భవిష్యత్కార్యమంతయు ఎరిగినవాడగుటవలన నిర్లిప్తుడుగానే ఉండెను. వాని ప్రపంచము ననుకరించుచు దుఃఖనిమగ్నునివలె నటించెనని భావము.

బ్రహ్మణా ఋషిభిః సార్ధం బోధితో రఘునందనః
ప్రతిబుద్ధ ఇవ స్వప్నా చ్చకారానంతరాః క్రియాః॥

దుఃఖనిమగ్ననివలె నున్న శ్రీరామచంద్రుని ఋషిసంఘముల తోకూడియున్న ప్రజాపతి ప్రబోధించెను. వాని ప్రబోధచే స్వప్నము నుండి మేలొక్కన్న వానివలె ప్రకృతిస్థుడై రాముడు తరువాత్రిక్రియలను సమాప్తి నందించెను.

విససర్జ ఋషీ సర్వాఁ ఋత్విజోయే సమాగతాఃఁ
తా న్సర్వాఁ ధనరత్నాద్యైఃఁ తోషయామాస భూరిశఃఁ॥

యజ్ఞార్థమై వచ్చిన మహర్షులను, ఋత్విక్కులను, ఇంకను ఇతరులను ధనరత్నాది దక్షిణలచే సంతుష్టులగావించి వారివారి నివాసములకు పంపెను.

ఉపాదాయ కుమారౌ తా వయోధ్యా మగమత్ ప్రభుఃఁ
తదాది నిస్పృహో రామఃఁ సర్వభోగేషు సర్వదా
ఆత్మచింతాపరో నిత్య మేకాంతే సముపస్థితఃఁ॥

అనంతర మతడు పుత్రుల నిద్దరిని వెంటనిడుకొని అయోధ్యా నగరమున కేతెంచెను. కాని అప్పటినుండి సీతావిరహితుడగుటచే నిస్పృహుడై సర్వభోగములను త్యజించి జేతయాపన మొనరింపసాగెను. ఆత్మవస్తు మనన మొనరించుచు ఏకాంతవాస మొనరించసాగెను.

ఏకాంతే ధ్యాననిరతే ఏకదా రాఘవే సతిఁ
జ్ఞాత్వా నారాయణం సాక్షాత్ కౌసల్యాప్రియవాదినీ
భక్త్యా ఽగత్య ప్రసన్నం తం ప్రణత ప్రాహ హృష్టధీఃఁ॥

ఈ శ్లోకమున శ్రీరాముని తల్లి కౌసల్యాదేవి ఆత్మజ్ఞానార్థినియై పుత్రుని సమీపమునకు యేతెంచుటను గ్రంథకర్త ప్రతిపాదించు చున్నాడు. ఒకనాడు శ్రీరామచంద్రుడు యేకాంతస్థలమున ఆత్మధ్యాన రతుడై యుండగా ప్రియభాషిణియగు కౌసల్య అతనిని సమీపించినది. ఆమె రాముని సాక్షాన్నారాయణునిగా గుర్తించియుండుటచే భైవ బుధ్యా భక్తిప్రపత్తులతో నమస్కరించి యిట్లు ప్రశ్నించెను.

రామ! త్వం జగతా మాది రాదిమధ్యాంతవర్జితఃఁ
పరమాత్మా పరానందఃఁ పూర్ణఃఁ పురుష ఈశ్వరఃఁ॥

రామా ! నీవు సాధారణమనుష్యుడవుకావు. ప్రకృతికంటె పరమైన ఆత్మస్వరూపుడవు. సమస్తసృష్టికి అధీశ్వరుడవు. సమస్త శరీరధారులయొక్క శరీరములందును వ్యాపించియుండు పురుషుడవు, వృద్ధిక్షయ పరిణామాదులు లేనివాడవగుటచే పరిపూర్ణుడవు. సమస్తజగత్తులకు ఆదివైనవాడవు. ఐనను ఆదిమధ్యాంతరహితుడవు. నిరంతరానందనిమగ్నుడవు. ఈ శ్లోకమున "యత్ వా ఇమాని భూతాని జాయంతే యేన జాతాని జీవంతి" "తస్మాద్వాయే తస్వాదాత్మన ఆకాశ్నః సంభూతః" ఇత్యాది శ్రుత్యుక్తస్వరూపుడగు పరమాత్మగా రాముడు ప్రతిపాదింపబడినాడు.

జాతో ఽసి మే గర్భగృహే మమ పుణ్యాతిరేకతః
అవసానే మమాభ్యేత్య సమయో ఽభూద్రఘూత్తమ
నాద్యాప్రబోధజః కృత్స్నో భవబంధో నివర్తతే ॥

రామా ! సమస్తజగత్ప్రభుడవైన నీవు నా పూర్వపుణ్యపరిపాక కారణమున నా గర్భమునుండి జన్మించితివి. ఇప్పుడు నా అవసాన కాలము సమీపించినది. ఐనను నన్ను పూర్తిగా ఆవరించుకొనియున్న, అజ్ఞానజన్యమగు సంసారబంధము వదలుటలేదు.

ఇదానీ మపి మే జ్ఞానం భవబంధనివర్తకం
యథా సంక్షేపతో భూయాత్తథా బోధయ మాం విభో ॥

ప్రభూ ! అజ్ఞానబంధమున బంధితురాలనైయున్న నాకు యీ అవసానసమయమునందైనను సంసారనివర్తకమగు జ్ఞానబోధను సంక్షేపముగా ప్రసాదించి తరింపజేయుము.

నిర్వేదవాదినీ మేవం మాతరం మాతృవత్సలః
దయాలుః ప్రాహ ధర్మాత్మా జరాజర్జరితాం శుభాం ॥

శ్రీరామచంద్రుడు మాతృదేవియెడ అచంచలమగు భక్తికలవాడు. అవసానకాలము సమీపింపగా విరక్తురాలై బంధవిముక్తిని కోరుచున్న తల్లియెడ దయార్ద్రహృదయుడైనాడు. ముసలితనముచే

జర్జరిత శరీరకాలయ్యున్నా మంగళప్రదురాలగు కౌసల్యకు ధర్మాత్ముడగు నాత డిట్లనెను.

పూర్వా స్త్రయో మయా ప్రోక్తాం పురా మోక్షాది సాధకాః
క్రియా యోగో జ్ఞాన యోగో భక్తియోగ శ్చ శాశ్వతః

తల్లీ ! ఇదివరకు నేను మహర్షులకు మోక్షప్రాప్తిని చేకూర్చునట్టి మూడుమార్గములను ఉపదేశించితిని. అవి యివి–కర్మయోగము, జ్ఞాన యోగము, భక్తియోగము.

తేషాం తు సులభో మార్గో భక్తియోగః సుపూజితః
భక్తి ర్విభిద్యతే మాతః త్రివిధా గుణభేదతః
స్వభావో యస్య యద్భేన తస్య భక్తి ర్విభిద్యతే ॥

ఈ మూడుమార్గములలోను భక్తియోగము అత్యంతసులభ మైనది. పెద్దలచే గౌరవింపబడినది. అట్టి భక్తి సత్వరజస్తమోగుణ ముల ననుసరించి మూడువిధములుగా విభజింపబడుతున్నది. ఏగుణము ప్రధానముగాగలభక్తి ఆ గుణనామముచే పేర్కొనబడుచున్నది.

యస్తు హింసాం సముద్దిశ్య దంభం మాత్సర్య మేవవా
భేదదృష్టి శ్చ సంరంభీ భక్తో మే తామసః స్మృతః ॥

ఎవడు హింసాత్మకమైన బుద్ధి [illegible]ఖండనాదులై, మాత్సర్యముగల వాడై, భేదదృష్టికలవాడై, ప్రదర్శనాభిలాషియై భక్తినాచరించునో అతడు తామసభక్తు డనబడును. ఇక్కడ హింస అనగా పరులకు బాధ కలుగ జేయవలెనను తలంపు. నేను ఐశ్వర్యవంతుడను, నా ఐశ్వర్యమునకు తగి నట్లు భగవంతుని పూజించెదను, లేదా నేను భక్తుడను, నాభక్తిని అందరు ప్రశంసించెదరు అనుభావము దంభము. ఇతరుల శుభమును చూచి ఓర్వలేనితనము మాత్సర్యము. జీవపరమాత్మల ఐక్యతను పాటిం చకపోవుట భేదదృష్టి. ఆడంబరము కలిగియుండుట సారంభము. ఇవ న్నియుగాని, లేక యిందులో యే ఒక్కగుణముగాని కూడియున్నచో అది తామసభక్తి యగును.

ఫలాభిసంధి రోభగార్థీ ధనకామో యశస్థా
అర్చాదే భేదబుధ్యా మాం పూజయేత్ స తురాజసః ॥

ఏదైన ఫలమును కోరుచు లేదా ఏనైనభోగములను కాంక్షించుచు ఆచరించు భక్తి రాజసభక్తి యనబడును. ధనకామము, యశఃకామము మొదలగునవి యీ రాజభక్తిలక్షణములే. అంతేకాక రాజసభక్తికలవాడు పూజావులయందు భేదబుద్ధికలవాడుగా నుండును.

పరస్మి న్నర్పితం యస్తు కర్మ నిష్ఫరణాయ వా
కర్తవ్య మితి వా కుర్యాత్ భేదబుద్ధ్యా సాసాత్వికః ॥

మానవుడు తనుచేసిన పాపకర్మలను పోగొట్టుకొనుటకుగాని నేను మానవుడను, భగవదర్పకి మానవకర్తవ్యము అను బుద్ధితోగాని తనుచేయు నిత్యనైమిత్యకాది కర్మల నన్నిటిని నాకు అర్పించువాడు సాత్వికభక్తు డనబడును. ఈ సాత్వికభక్తిలోను భేదబుద్ధియున్నది కావున అట్టివాడు పూర్ణభక్తుడు కానేరడు.

మద్గుణాశ్రయణా దేవ మ య్యనంతగుణాలయే
అవిచ్ఛిన్నా మనోవృత్తి ర్యథా గంగాంబునా ఒమ్బుధౌ॥
తదేవ భక్తియోగ శ్చ లక్షణం నిర్గుణస్య హి
అహైతుక్యవ్యవహితా యా భక్తిమయిజాయతే॥

నేను అనంతములగు గుణములకు నిధిని. గంగానదీ జలము సముద్రజలములలో కలిసి దానియందే లీనమైనట్లు భక్తునియొక్క మనోవృత్తి నా అనంతగుణములనే ఆశ్రయించి అవిచ్ఛిన్నమై యుండినచో దానిని నిర్గుణభక్తి యందురు. అట్టి భక్తికి హేతువేమియును యుండదు. అనగా తామసరాజససాత్వికభక్తులయందుండు ఫలాభిలాషి వంటిది. కించిన్మాత్రమును నిర్గుణభక్తునియం దుండదు. ఇది అవ్యాజముగా భక్తునిహృదయములో కలుగు ఈశ్వరప్రేమ.

నిర్గుణభక్తియొక్క విశిష్టతను వివరించుచున్నారు.

సా మే సాలోక్య సామీప్య సార్ష్టి సాయుజ్య మేవ వా
దదా త్యపి న గృహ్ణంతి భక్తా మత్సేసేవనం వినా ॥

నిర్గుణభక్తులు యేతన్మాత్రమైనను ఫలాకాంక్ష లేనివారు, సాలోక్యము, సామీప్యము, సారూప్యము, సాయుజ్యము అను నాల్గు రకము లగు మోక్షములను ప్రసాదించెదనన్నను వారు నన్ను సేవించుట తప్ప మరివేనినీ కోరరు. భగవద్భక్తిని మించిన ఉత్కృష్టవస్తువు మరియొకటి లేదని భక్తులభావమని సూచింపబడినది.

స యేవా ఽఽత్యంతి కో యోగో భక్తిమార్గస్య భామిని
మద్భావం ప్రాప్నుయా త్తేన అతిక్రమ్య గుణత్రయం॥

తల్లీ ! యీచివరచెప్పినదే అవ్యభిచారియగు భక్తిరూపమగు ఉపాయము. అనగా అనన్యభక్తి యని భావము. ఇట్టి భక్తుడు సంసారకారణమగు గుణత్రయమును అతిక్రమించి నాభావమునే పొందును. అనగా బ్రహ్మత్వమును బొందునని భావము.

మహతా కామహీనేన స్వధర్మాచరణేన చ
కర్మయోగేన శీస్తేన వర్జితేన విహింసనం ॥

ఈ శ్లోకము మొదలుకొని సగుణభక్తికి సాధనములను తెలియ చేయుచున్నాడు. భక్తుడైనవాడు ఏవిధమగు ప్రతిఫలమును కోరక తన వర్ణాశ్రమ విహితధర్మమును ఆచరించవలెను. ప్రశస్తమగు కర్మయోగమునందు నిమగ్నుడు కావలెను. ఆ కర్మయోగము హింసావిరహితమై సత్వగుణప్రధానము కలదిగా నుండవలెను.

మద్దర్శన స్తుతి మహాపూజాభిః స్మృతి వందనైః
భూతేషు మద్భావనయాఽసంగే నాసత్య వర్జనైః ॥

భక్తుడైనవాడు నిత్యము నా మూర్తి దర్శనము స్తుతి మహోత్సవమగు పూజ మొదలగువాటియందు నిమగ్నుడైయుండవలెను. నిత్యము నన్నే స్మరించుచు వినీతుడై యుండవలయును. సర్వభూతములను నా రూపములుగానే యెంచి అనాసక్తుడై, అసత్యవిరహితుడై మెలగవలయును.

బహుమానేన మహతాం దుఃఖినా మనుకంపయా
స్వసమానేషు మైత్ర్యాచశమాదీనాం నిషేవ్మయా ॥

తనకంటె మహిమాన్వితులగువారిని అత్యంతము గౌరవించు చుండవలయును. దారిద్ర్యాది దుఃఖములచే బాధపడువారియెడ జాలి గల హృదయముతో నుండవలయును. తనతో సమానులగువారియెడ మైత్రీభావమును వహించి శమదమాది షడ్గుణసంభరితుడై జీవితమును గడపవలయును.

వేదాంతవాక్య శ్రవణా న్మమ నామానుకీర్తనాత్
సత్సంగే నా ఽఽర్జవేనైవ వ్యసూయాయాః పరివర్జనాత్ ॥

"ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిధిధ్యాస తవ్యః" అను శ్రుతి ననుసరించి తత్త్వమస్యాది మహావాక్యశ్రవణమననాదులను భక్తుడైనవాడు ఆచరింపవలయును. అతడు నిత్యమూ నా నామ సంకీర్తనమునే చేయవలయును. నిత్యము సత్పురుషసాంగత్యమునే ఒన ర్చును, నిష్కపటియై, అహంకార పరివర్జితుడై నన్ను సేవించుచుండును.

కాంక్షయా ఽమలధర్మస్య పరిశుద్ధాంతరో జనః
మద్గుణశ్రవణాదేవ యాతి సూ మంజసా జనః ॥

భక్తుడు నిష్కామమగు భాగవతధర్మమునెడ అభిలాషతో పరి శుద్ధమగు అంతఃకరణ కలవాడై నిత్యము నా అనంతగుణములను వినుచు అనాయాసముగా నన్ను పొందగలడు.

యథా వాయువశాద్ గంధః స్వాశ్రయాత్ ఘ్రాణమావిసేత్
యోగాభ్యాస రతం చిత్త మేవ మాత్మాన మావిసేత్ ॥

సగుణభక్తియోగమును ఆశ్రయించిన వానికి కలుగు ఫలమును చెప్పి దృష్టాంతముతో సమర్థించుచున్నాడు. ప్రపంచములో పుష్పా దులయందుండు సుగంధము వాయువుతో మిళితమై తనకు ఆశ్రయమగు ఘ్రాణేంద్రియమును చేరుచున్నది. అట్లే నిర్మలయోగాభ్యాసరతుడైన వాని నిశ్చలచిత్తము బరమాత్మయందు ప్రవేశింపగలదు.

సర్వేషు ప్రాణిజా తేషు హ్యహ మాత్మా వ్యవస్థితః
త మజ్ఞానవిమూఢాత్మా కురుతే కేవలం బహిః ॥

తల్లీ ! ఆత్మస్వరూపుడనగు నేను సృష్టియందలి సమస్తప్రాణి కోట్లయందు వ్యాపించియున్నాను. కాని తమోరూపమైన అజ్ఞానముచే యితికర్తవ్యతావిమూఢాత్ముడు ఆప్రాణికోట్లయందు నన్ను చూడక ఎక్కడో వెలుపలనున్నట్లు భావించును. ఈవిషయమే శ్రీమద్భాగవత మునం దిట్లు చెప్పబడినది. ''అహం సర్వేషు భూతేషు భూతాత్మా అవస్థిత స్తధా తమవజ్ఞాయమాం మర్త్యాః కురుతేఽర్చావిడంబనమ్'' అని.

క్రియోత్పన్నై ర్నైకభేదైః ద్రవ్యై ర్నానాంబతోషణం
భూతావమానినో ఽర్చాయా మర్చితో ఽహం సపూజితః॥

సృష్టియందలి యితరభూతములను అవమానించుచు అనేకము లగు విశిష్టసాధనములతో ఆడంబరముగా నన్ను పూజించినవాని పూజ లచే నేను తృప్తిపొందను. అట్టిపూజలను నేను పూజగానే భావించను. నిరహంకారియై సర్వభూత సమభావముకలిగి పూజించువాని పూజలకే భగవంతుడు తృప్తినొందునని భావము.

తావ న్నమూమర్చయే ద్దేవం ప్రతిమాదౌ స్వకర్మభిః
యావత్ సర్వేషు భూతేషు స్థితం చాఽఽత్మని సంస్మరేత్॥

అయితే ప్రతిమాదిపూజనము వ్యర్థముకాదు. మానవుడు ఎంతవరకు సర్వభూతములయందును వాటితోబాటు తనయందునుకూడ వ్యాపించియున్న నన్ను మనసా గుర్తించలేడో అంతవరకును తనవర్ణా శ్రమవిహితమైన విధానమున అర్చించుచూ యుండవలసినదే.

భేదదృష్టి కలవానికి పునర్జన్మ పునర్మరణమూలకమైన సంసార భయము తొలగదని చెప్పుచున్నాడు.

యస్తు భేదం ప్రకురుతే ఆత్మనశ్చ పరస్య చ
భిన్నదృష్టి ర్భయం మృత్యోత్తస్య కుర్యా న్నసంశయః॥

జీవాత్మ పరమాత్మల ఏకత్వము నంగీకరింపక అవి రెండును వేరను భావము కలిగిన భిన్నదృష్టియగువాడు మృత్యుభయమును నిశ్చ యముగా అనుభవించుచూ ఉండగలడు. ''మృత్యో స్సమృత్యు మాప్నోతి య ఇహ నానేన పశ్యతి'' అని బృహదారణ్యకోపనిషత్తు

చెప్పుచున్నది. అట్లే భాగవతముకూడ "ఆత్మనశ్చ పరస్యాపి యః కరోత్యంతరోదరం తస్య భిన్నదృశో మృత్యుర్విదధే భయ ముల్బణం" అని చెప్పుచున్నది.

మామతః సర్వభూతేషు పరిచ్ఛిన్నేషు సంస్థితం
ఏకం జ్ఞానేన మానేన మైత్ర్యావాఽర్చేద నన్యధీఃll

అందుచే దేహారూపమున భిన్నముగా కన్పించు సర్వభూతము లందును వ్యాపించియున్న ఏకాకారుడయిన నన్ను అనన్యబుద్ధిగల మానవుడు జ్ఞానయోగముచేగాని, గౌరవభావముతోగాని మైత్రీభావముతోగాని ఉపాసించవలెను.

చేతసైవానిశం సర్వభూతాని ప్రణమేత్ సుధీఃl
జ్ఞాత్వామాం చిద్ఘనం శుద్ధం జీవరూపేణ సంస్థితంll

నేను సర్వభూతములందును జీవరూపమున వ్యాపించియున్నాను. కనుక ఈశ్వరజీవులకు ఎట్టిభేదమును లేదు. కనుక జ్ఞానియైనవాడు మనస్సులోనే నిత్యము భూతము లన్నిటికి వందన మాచరించుచుండవలెను.

జీవాత్మ పరమాత్మలలోను భక్తియోగ జ్ఞానయోగములలోను భేదముకూడదని బోధించుచున్నాడు.

తస్మా త్కదాచిన్నే కేతభేద మీశ్వరజీవయోఃl
భక్తియోగో జ్ఞానయోగో మయా మాతకుదీరితఃll

సర్వభూతములందు నేను వ్యాపించియుండుటచే ఈశ్వరజీవులలో భేదబుద్ధి కూడదు. ఉపాసనాప్రధానమయిన భక్తియోగము జ్ఞానప్రధానమయిన జ్ఞానయోగము ఈరెండూ నేను చెప్పినవే.

ఆలం బ్యైకతరం వాఽపి పురుషఃశమ మృచ్ఛతి
తస్మా న్మాం భక్తియోగేన మాతఃసర్వాత్మదిస్థితం
పుత్రరూపేణ వా నిత్యం స్మృత్వా శాంతి మవాప్స్యసిll

భక్తి-జ్ఞానయోగములు రెండును నాచే ప్రతిపాదింపబడినవే అగుటచే ఈరెంటిలో ఏదో ఒకదానిని ఆధారముగా గాని మానవుడు

సంసారతాపమునుండి శాంతిని పొందవచ్చును. కనుక తల్లీ ! నీవు సర్వహృదంతరాళమున వ్యాపించియున్న నాచైతన్యమూర్తినిగాని, లేదా పుత్రరూపమునన్న ఈ సగుణమూర్తినిగాని నిత్యము స్మరించుచు దుఃఖవిముక్తిని పొందగలవు.

శ్రుత్వా రామస్య వచనం కౌసల్యా ఽఽనందసంయుతా
రామం సదా హృదిధ్యాత్వా భిత్వా సంసారబంధనం
అతిక్రమ్య గతిస్తి ఽప్యనాప పరమాం గతిం॥

రాముని ఈవచనములను విని కౌసల్య ఆనందసంభృత హృదయ అయినది. ఆమె భక్తియోగము నాశ్రయించి పుత్రరూపుడయిన శ్రీరాముని నిత్యము స్మరించి సంసారబంధనములను ఛేదించుకొన్నది. తరువాత సాత్వికరాజస తామసరూపములగు గత్రితయమును అతిక్రమించి పరమగతిని పొందినది. అర్చిరాదిలోకములను పొందుట సాత్వికగతి. ధూమాదిలోకములను పొందుట రాజసగతి. జన్మమరణరూపమయినది తామసగతి. లేదా జాగ్రత్ స్వప్నసుషుప్తులను అతిక్రమించి పరమగతిని పొందినదని భావము.

కైకేయీ చాఽపియోగం రఘుపతి గదితం పూర్వమేవాధిగమ్య
శ్రద్ధాభక్తి ప్రశాంతాహ్యది రఘుతిలకం భావయంతీ గతాసుః
గత్వాస్వర్గం స్ఫురంతీ దశరథసహితామోద మానాఽవతస్థా
మాతా శ్రీలక్ష్మణస్యాప్యతి విమలమతిః ప్రాపభర్తుః సమీపం॥

"గచ్ఛ స్వహృదిమాం నిత్యం భావయంతీ దివానిశం సర్వత్ర విగత స్నేహా మద్భక్త్యా మోక్ష్యసే ఽచిరాత్" అని రాము డిదివరకు చెప్పినట్లు కైకేయి శ్రద్ధాభక్తి ప్రపూర్ణప్రశాంతమనస్కయై నిత్యము శ్రీరామచంద్రుని దివ్యమంగళవిగ్రహమునే ధ్యానించుచు మరణించినది. మరణించి ఆమె స్వర్గగతురాలైన దశరథుని ఉజ్వలప్రకాశమానయై చేరినది. లక్ష్మణుని మాతృదేవియైన సుమిత్రకూడ స్వచ్ఛమనస్కయై మరణించి భర్తను జేరినది.

అష్టమసర్గ

శ్రీమహాదేవఉవాచ:—

పదాశివుడు చెప్పుచున్నాడు.

అథకాలే గతే కస్మిన్ భరతో భీమవిక్రమః
యుధాజితామాతులే నహ్యాహూతో ఽగాత్ససైనికః॥
రామాజ్ఞ యాగతస్తత్ర హత్వా గంధర్వనాయకాన్
త్రిసృణోటే పురే ద్వేతు నివేశ్య రఘునందనః॥

దేవీ! ఇట్లు కొంతకాలము గతించినపిమ్మట ఉగ్రమైన పరాక్రమముగల భరతుడు మేనమామచుగు యుధాజిత్తుచే పిలువబడి భగవానుడగు రాముని అనుజ్ఞనుపొంది సర్వసైన్యసమేతముగ మేనమామనుచేరి అక్కడ మూడుకోట్ల గంధర్వులను జయించి రెండునగరములను స్వాధీనపరచుకొనెను.

పుష్కరం పుష్కరావత్యాం తక్షం తక్షశిలాహ్వయే
అభిషిచ్య సుతౌతత్ర ధనధాన్య సుహృద్వృతౌ॥
పునరాగత్య భరతో రామసేవాఽపరోభవత్
తతః ప్రీతో రఘుశ్రేష్ఠో లక్ష్మణం ప్రాహసాదరమ్॥

ఆనగరములలో పుష్కరావతియను నగరమునకు పుష్కరుని, తక్షశిలానగరమునకు తక్షుని అధిపతులుగ జేసి ధన, ధాన్య, బంధు, మిత్రాదులచే సంపన్నములుగ నుండునట్లొనర్చి భరతుడు తిరిగి అయోధ్యకు వచ్చి శ్రీరామసేవాపరాయణుడై యుండెను. శ్రీరాముడు ప్రసన్నచిత్తముతో లక్ష్మణుని పిలచి ఓ లక్ష్మణా! నీవు నీకుమారు లిరువురను తీసుకుని పశ్చిమదిశకు బొమ్ము.

తక్షు, పుష్కరు లిద్దరును భరతుని కుమారుల్.

ఉభౌ కుమారౌ సౌమిత్రే గృహీత్వా పశ్చిమాం దిశమ్
తత్రభిల్లాస్త్వ నిర్జిత్య దుష్టాక స్మర్వాపకారిణః॥

అంగద శ్చిత్రకేతు శ్చ మహాసత్వపరాక్రమౌ
ద్వయోర్ద్వో నగరే కృత్వా గజా శ్చ ధనరత్నైః॥
అభిషిచ్య సుతౌ తత్ర శీఘ్రమాగచ్ఛమాం పునః
రామస్యా జ్ఞాం పురస్కృత్య గజాశ్వబలవాహనః॥
గత్వా హత్వా రిపూ౯ సర్వా౯ స్థాపయిత్వా కుమారకౌ
సౌమిత్రిః పున రాగత్య రామసేవాపరో౽భవత్॥

అక్కడ సర్వజనులకును అపకారమునే జేయుచు లోకకంటకుడై చరించుచు భిల్లులు వసించుచున్నాడు. ఆ భిల్లులను జయించి నీకుమారుల నాదేశములకు పట్టాభిషిక్తుల నొనర్పుము. ధన, ధాన్య, గజాశ్వ రథపదాతులతోకూడిన రాజ్యములు వారి అధీనమొనర్చి తిరిగి శీఘ్రముగ రమ్మని పలికెను. ఆపలుకు లాలించి లక్ష్మణుడు చతురంగబలో పేతుడై పశ్చిమదిశకు ప్రయాణమై వెళ్ళి ఆ క్రూరకర్ములగు భిల్లులను జయించి అంగద, చిత్రకేతులను తనకుమారు లిరువురను పట్టాభిషిక్తుల నొనర్చి తిరిగివచ్చి శ్రీరామసేవాపరాయణుడై యుండెను.

తతస్తు కాలే మహతి ప్రయాతే
రామం సదా ధర్మపథేస్థితం హరిమ్
ద్రష్టుం సమాగా ద్ఋషివేషధారీ
కాలస్తతో లక్ష్మణ మిత్యువాచ॥

ఇట్లు చిరకాలము గతించినపిమ్మట నొకనాడు సర్వదా ధర్మాచరణపరాయణుడగు శ్రీరాముని దర్శింప నుత్సుకుడై ఋషివేషధారియై కాలుడు అయోధ్యకువచ్చి లక్ష్మణునితో నిట్లుపలికెను.

నివేదయస్వాతి బలస్యదూతం
మాంద్రష్టు కామం పురుషోత్తమాయ
రామాయ విజ్ఞాపన మస్తితస్య
మహర్షి ముఖ్యస్య చిరాయుధీమత॥

ఓ బుద్ధిశాలీ! లక్ష్మణా! నీవు పురుషోత్తముడగు శ్రీరామునితో నామాటలుగ నిట్లు చెప్పుము.

ఓ రామా ! అతిబలుడను మహర్షియొక్క దూత నీదర్శనము నకై వచ్చియున్నాడు అతిబలుని సందేశము వినిపించును గాన నీవ కాశముగ నీతో సంభాషించుటకై నీదర్శనమును వాంఛించుచున్నాడు అని.

తస్య తద్వచనం శ్రుత్వా సౌమిత్రి స్త్వరయాన్వితః
ఆచ చక్షేఽథ రామాయస సమ్ప్రాప్తం తపోధనమ్॥

ఋషివేషధారియగు కాలునివాక్యములు విని లక్ష్మణుడు శీఘ్రముగ శ్రీరామచంద్రునిజేరి "అన్నా! నీదర్శనమునకై యాఋషి ద్వారమున వేచియున్నా" డని పలికెను.

ఏవం బ్రువన్తం ప్రోవాచ లక్ష్మణం రాఘవోనచః
శీఘ్రప్రవేశ్యతాం తాత మునిః సత్కారపూరకమ్॥

లక్ష్మణుని వాక్యములు విని శ్రీరాముడు పలుకుచున్నాడు.

ఓ లక్ష్మణా ! నీవు శీఘ్రముగ ఆఋషిని సత్కారపూర్వకముగ నిటకు గొనిరమ్ము.

లక్ష్మణస్తుత థేత్యుక్త్వా ప్రావేశయత తాపసమ్
స్వతేజ సాజ్వలంతంతం ఘృతసిక్త ం యథానలమ్॥

శ్రీరాముని ఆదేశమునకు లక్ష్మణుడు అలాగే అగుగాక యని పలికి ఆజ్యాహుతులచే జ్వలించు అగ్నితోసమానమైన ప్రకాశముగల యామహర్షిని శ్రీరామునిసన్నిధిని ప్రవేశపెట్టెను.

సోఽభిగమ్య రఘుశ్రేష్ఠం దీప్యమానః స్వతేజసా
మున ర్మధురవాక్యేన వర్ధస్వేత్యాహ రాఘవమ్॥

తనతేజముచే నలుదిక్కులను ప్రకాశింపజేయుచున్న యాఋషి శ్రీరాముని సమీపించి మృదుమధురమగు వాక్యసరళతో నీ కభ్యుదయము కలుగుగాక యని ఆశీర్వదించెను.

తస్మైసమునయే రామః పూజాం కృత్వా యథావిధి
పృష్ట్వానామ యమవ్యగ్రో రామః పృష్టోఽథ తేనసః॥

అప్పుడు శ్రీరామచంద్రమూర్తి ఆ మహర్షిని విధివిహితముగ పూజించి ఉత్తమాసనమిచ్చి కుశలప్రశ్న చేసెను. మహర్షికూడ రాముని కుశల మడిగెను.

దివ్యాసనే సమాసీనో రామః ప్రోవాచ తాపసం
యదర్థమాగతోఽసి త్వ మిహతత్ర్పాపయస్వమే॥

అనంతరం శ్రీరామచంద్రుడు సుఖాసనాసీనుడైన మహర్షికి నమస్కరించి తమరాకయందుకల సందేశమును వివరింపుడని అడిగెను.

వాక్యేన చోదితస్తేన రామే నాహ మునిర్వచః
ద్వంద్వ మేవ ప్రయోక్తవ్య మనాలక్ష్యం తు తద్వచః॥

శ్రీరామచంద్రుని వాక్యములచే ప్రేరితుడైన మహర్షి రాముని చూచి యిట్లుపలికెను. ఓ రామా ! మనమిరువురము సంభాషించునపుడు యిక్కడ యెవరును వుండరాదు. మనమిరువురమే సంభాషింపవలెను.

నాన్యేన కైతచ్ఛ్రోతవ్యం నాఖ్యాతవ్యం చ కస్యచిత్
శృణు యూదా వా నిరీక్షేద్వా యమహాస వధ్యస్త్వయాప్రభో॥

మనయిరువురి సంభాషణ యితరులు యెవరు వినుటకాని యితరులతో చెప్పుటగాని జరుగరాదు. మనము సంభాషించునపుడు చూచినను విన్నను మరణదండన విధింపవలెను.

తథేతి చ ప్రతిజ్ఞాయ రామో లక్ష్మణ మబ్రవీత్
తిష్ఠత్వం ద్వారి సౌమిత్రేనా యాత్వత్ర జనోరహా॥

శ్రీరాముడు మహర్షి ఆదేశమును గ్రహించి లక్ష్మణుని బిలచి లక్ష్మణా ! నీవు ద్వారమందుండి లోనికి యెవరిని రానీయకుము అని ఆదేశించెను.

యద్వా గచ్ఛతి కోవాపి సవద్యోమే న సంశయః
తతః ప్రాహ మునిం రామో యేనవా త్వం విసర్జితః॥
యత్తే మనీషితం వాక్యం తద్వదస్వమమాగ్రతః।

లక్ష్మణా ! ఒకవేళ ప్రమాదవశముచేనైనను యెవరైననుసరే లోన ప్రవేశించినవానికి నాచేతిలో మరణము తప్పదు. అనిచెప్పి లక్ష్మణుని ద్వారమంచుంచి తాను మహర్షివద్ద యేకాంతప్రదేశమున కూర్చుండి ఓ బుషిపుంగవా ? తమ్ము యెవరు పంపిరి ? తాము నాతో చెప్పవలసిన అంశమెట్టిది ? వివరింపుడని పలికెను.

తతః ప్రాహ ముని ర్వాక్యం శృణు రామ యథాతథం।
బ్రహ్మణా ప్రేషితో ఒస్మిన కార్యార్థే తేఒన్తికం ప్రభో
అహం హి పూర్వజో దేవ తవపుత్రః పరంతప ॥

అప్పు డాముని రాముని చూచి పలికెను. ఓ రామచంద్రా ! ఓ యీశా ! నేను సత్యమును చెప్పుచున్నాను విను. నేను ఒక దేవ కార్యమును సాధించుటకై చతుర్ముఖునిచే పంపబడి వచ్చితిని. నేను నీ జ్యేష్ఠపుత్రుడను.

మాయాసంగ మబ్రోవీర కాలహాసర్వహారః స్మృతః।
బ్రహ్మ త్వా మాహ భగవాన్ సర్వదేవర్షి పూజితః
రక్షితుం స్వర్గలోకస్య సమయ స్తే మహామతే।
పురా త్వ మేక ఏవాసి లోకాన్ సంహృత్య మాయయా ॥

ఓ మహావీర ! నీకు మాయతోకూడ సంగమము కలిగినప్పుడు నేనుజన్మించితిని నాపేరు కాలుడందురు నేను సమస్తమును నశింపజేయు వాడను. దేవర్షి పూజితుడగు బ్రహ్మ నన్ను పంపినాడు. ఓ మహామతి ! యిప్పుడు నీవు స్వర్గలోకమును రక్షింప సమయము ఆసన్నమయినది. పూర్వకాలమున సమస్తలోకములను సంహరించి నీవొక్కడవే యుంటివి.

భార్యయా సహి తస్త్వం మా మాదౌ పుత్ర మజీజనః
తధా భోగవతం నాగ మనంత ముదకేశయం ॥

తిరిగి నీవు నీభార్యయగు మాయతోకూడుటవల్ల తొలుదొల్త నేను, తరువాత జలమందు శయనించు అనంతనామకుడు, ఫణదారి యగు శేషుడున్నా ఆవిర్భవించితిమి.

మాయయా జనయిత్వా త్వం దైత్యౌ సతౌ మహాబలౌ
మధుకైటభకౌ దైత్యౌ హత్వా మేదో ఽస్థిసంచయం
ఇమాం పర్వతసంబద్ధాం మేదినీం పురుషర్షభ
పద్మే చి వ్యూరక్సంకాశే నాభ్యా ముత్పాద్య మా మపి
మాం విధాయ ప్రజాధ్యక్షం మయి సర్వన్యవేదయత్
సో ఽహం సయుక్తసంభార స్త్వా మనోచం జగత్పతే ॥

యిట్లు మాయచే మమ్ములనావిర్భవింపజేసి శూరులు, వీరులు, మహాబలులు నగు మధుకైటభులను మర్దించి వారిమేదస్సు అస్థులు మొదలగువానిచే భూమిని సృజించితివి. తిరిగి నీ సూర్యసంకాశమైన నాభికమలమునుండి ననున్ను సృజించి ప్రజాపతి నొనర్చితివి. సృష్టిసంబంధమగు భారమంతయును నాయందే ఉంచితివి. ఓ జగన్నాథ! నేనా భారమును గ్రహించిననాడే నీతో పలికియుంటిని.

రక్షాం విధత్స్వ భూతేభ్యో యే మే వీర్యాపహారిణః ।
తత స్త్వం కశ్యపా జ్జాతో విష్ణు ర్వామనరూపధృక్ ॥

ఏ ప్రాణులు నావీర్యమును హరింతురో (ప్రజానాశనము, ధర్మనాశనముచేయుదురో) వారినుండి రక్షింపుమని. అట్లేయగుగాక యని నీవు కాలాంతరమున కశ్యపునియందు వామనుడవై యవతరించితివి.

హృతవా నసి భూభారం వధా ద్రక్షోగణస్య చ ।
సర్వా సూత్సార్యమాణాసు ప్రజాసు ధరణీధర ! ॥
రావణస్య వధాకాంక్షీ మర్త్యలోక ముపాగతః ।
దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ ॥
కృత్వా వాసస్య సమయం త్రిదశే ష్వాత్మనః పురా
సతే మనోరథః పూర్ణః పూర్ణేచాయుషి తే నృషు॥

అట్లవతరించిన రాక్షసులను సంహరించి భూభారమును హరించితివి. ఓ ధరణీధరా! యిప్పుడుకూడా నీవిట్లు మాయామానుషవేషమున అవతరించి రామనామాంకితుడవై రావణాది సమస్త రాక్షసులను

సంహరించి భూభారమును హరించితివి. నీవు భూమియందు అవతరించుటకు పూర్వము దేవతలకు వరమునుప్రసాదించుకాలమున పదహొండువేల సంవత్సరములుమాత్రమే భూమండలమం దుండెదనని వరము ప్రసాదించియున్నావు. అట్టిగడువు పూర్తియయినది. నామనోరథముకూడా పూర్తియయినది.

కాలస్థాపనరూపేణ త్వత్సమీప ముపాగమత్
తతో భూయశ్చ తే బుద్ధి ర్యది రాజ్య ముపాశితుం
తత్తథా భవ భద్రం తే ఏవ మహా పితామహాః॥
యది తే గమనే బుద్ధి ర్దేవలోకం జితేంద్రియ
సనాథా విష్ణునా దేవ భవంతు విగతజ్వరాః॥
చతుర్ముఖస్య తద్వాక్యం శ్రుత్వా కాలేన భాషితం
సహస రామ స్తదా వాక్యం కృత్స్న స్యాంతక మబవీత్॥
శ్రుతం తవ వచో మే ఽద్య మయా పీష్టతరం తు తత్॥

ఇప్పుడు తపోవేషముతో కాలుడు నీవద్దకు వచ్చియున్నాడు. నీకింకను కొంతకాలము రాజ్యముచేయువలెనను యిచ్ఛ యున్నచో నీకు శుభమగుగాక యట్లే చేయుము. ఇట్లు బ్రహ్మ నీతో చెప్పమనినాడు. ఓ జితేంద్రియ! రామచంద్ర! నీకు దేవలోకమున కీక్షణమందే రావలెనను యభిప్రాయము కలిగినచో దేవగణము విష్ణుపుతోకూడి నిశ్చింతగ నుండగలదు. అనగా నీవు అవతారసమాప్తిచేసి చతుర్భుజరూపుడవై వైకుంఠమును పొందినచాడు దేవతలు బ్రహ్మానందము నందగలరు. అని కాలుడు చెప్పినతోడనే శ్రీరాము డాపలుకులు విని చిరునవ్వు నవ్వి సమస్తభూతములను అంతమొందించు కాలుని చూచి యిట్లు పలికెను. ఓకాల! నీవాక్యములన్నయును వినియున్నాను. బ్రహ్మయొక్క అభిమతమే నా అభిమతము.

సంతోషి పరమో ష్మేన్యి త్వదాగమనకారణాత్
త్రయాణా మపి లోకానాం కార్యార్థం మమ సంభవః॥

నీరాక నాకు మిక్కిలి సంతోషము కలిగించినది. నా అవతారము త్రిలోకములయొక్క కార్యసాధనకై ఉపకరించునది.

భద్రం తే ప్వాగమిష్యామి యత ఏవాహ మాగతః
మనోరథస్తు సంప్రాప్తో నమే ఽత్రాస్తి విచారణా !

నీకు కళ్యాణ మగుగాక ! నేను యెడ్కడనుండి వచ్చితినో అక్కడకే చేరుదును. ఇప్పుడు నామనోరథము పూర్ణమైనది ఇందు నాకిసుమంతయు విచారములేదు.

మత్సేవకామాం దేవానాం సర్వకార్యేషు వై మయా
స్థాతవ్యం మాయయీ పుత్ర యధా చాహ ప్రజాపతిః॥

ఓ పుత్ర ! దేవగణములు నాసేవకులు బ్రహ్మయొక్క అభిప్రాయము నసుసరించి మాయచేత వారియొక్క కార్యములయందు తత్పరత యునునది ఆవస్యకమైయున్నది

ఏవం తయోక్తి కథయత్తో దుర్వాసాముని రభ్యగాత్
రాజద్వారం రాఘవస్య దర్శనాపేక్షయా ద్రుతమ్॥

ఈరీతిని కాలునితో శ్రీరాముడు సంభాషించుచుండ మునిప్రవరుడగు దూర్వాసుడు శీఘ్రముగవచ్చి శ్రీరాముని దర్శించుటకై ద్వారమున ప్రవేశించెను.

ముని ర్లక్ష్మణ మాసాద్య దూర్వాసా వాక్య మబ్రవీత్
శీఘ్రం దర్శయ రామం మే కార్య మే ఽత్యన్త మాహితమ్॥

దూర్వాసమహర్షి ద్వారమందున్న లక్ష్మణుని చూచి ఓ లక్ష్మణా! నాకు రామునితో తొందరపని యున్నది గాన శ్రీరాముని శీఘ్రముగ జూపుమని పలికెను.

త చ్ఛ్రుత్వా ప్రాహ సౌమిత్రి ర్మునిం జ్వలన తేజసమ్
రామేణ కార్యం కిం తే ఽద్య కిం తే ఽభీష్టం కరో మ్యహమ్॥

ఋషివాక్యములను విని లక్ష్మణుడు జ్వలించు అగ్నివలె ప్రకాశించు నా దూర్వాసుని జూచి ఇట్లు పలికెను.

ఓ ఋషిపుంగవ! రామునితో తమకుగల కార్యమెద్దియో తెలిపినచో నేను ఆకార్యమును నెరవేర్చెదను.

రాజా కార్యాన్తరే వ్యగ్రో ముహూర్తం సమ్ప్రతీక్ష్యతామ్
త చ్ఛ్రుత్వా క్రోధసంతప్తో మునిః సౌమిత్రి మబ్రవీత్ ॥

ఈసమయమున రామచంద్రప్రభువు కార్యాంతరమందు నిమగ్నుడై యున్నాడు. ఒకముహూర్త మాగుడని పలికెను. లక్ష్మణుని పలుకులకు దూర్వాసుడు కోపించి లక్ష్మణునితో నిట్లు పలికెను.

అస్మిన్ క్షణే తు సౌమిత్రే న దర్శయసి చే ద్విభుమ్
రామం సవిషయం వంశం భస్మీకుర్యా న్న సంశయః॥

ఓ సౌమిత్రి! ఈక్షణమందే నాకు శ్రీరాముని చూపనిచో యీ దేశముతోకూడ మీవంశమునంతను భస్మమొనరించెదను.

శ్రుత్వా తద్వచనం ఘోరమృషే ర్దుర్వాససో భృశమ్
స్వరూపం తస్య వాక్యస్య చిన్తయిత్వా స లక్ష్మణః॥
సర్వనాశో ద్భవం మే ఽద్య నాశోవ్యేకస్య కారణాత్
నిశ్చి త్యైవం తతో గత్వా రామాయ ప్రాహ లక్ష్మణః॥

దూర్వాసునియొక్క భయంకరవాక్యములను స్వరూపమునుచూచి లక్ష్మణుడు చక్కగా ఆలోచించి యిట్లు నిశ్చయించుకొనెను. సర్వనాశనమైనపిమ్మట నేనొక్కడను జీవించి ప్రయోజనములేదు. నేనొక్కడను దేహత్యాగ మొనర్చినచో దేశము, రఘువంశముకూడ రక్షింపబడును. అని రాముని సమీపమునకువెళ్ళి దూర్వాసుని వృత్తాంతమంతయును వినిపించెను.

సౌమిత్రే ర్వచనం శ్రుత్వా రామః కాలం వ్యసర్జయత్
శీఘ్రం నిర్గమ్య రామో ఽపి దదర్శాత్రేః సుతం మునిమ్॥

లక్ష్మణునివాక్యములు విని శ్రీరామచంద్రమూర్తి కాలుని పంపివేసి అత్రిసుతుడగు దూర్వాసుని చేరెను.

రామో ఽభివాద్య సంప్రీతో మునిం పప్రచ్ఛ సాదరమ్
కిం కార్యం తే కరోమీతి మునిం తమాహ రఘూత్తమః॥

శ్రీరామచంద్రమూర్తి మహర్షికి సాష్టాంగనమస్కార మొనర్చి పలికెను. ఓ ఋషిపుంగవా ! నేను తమకు చేయదగిన పనిని గూపించినచో నెరవేర్తును.

తచ్ఛ్రుత్వా రామవచనం దుర్వాసా రామమబ్రవీత్
అద్య వర్ష సహస్రాణా ముపవాససమాపనమ్॥

రాముని వాక్యములను విని ఋషి పలుకుచున్నాడు-
ఓ రామా ! నేను సహస్రవర్షోపవాసదీక్ష నేటితో సమాప్తి చేసితిని.

అత్రో భోజన మిచ్ఛామి సిద్ధం యత్తే రఘూత్తమ
రామో మునివచః శ్రుత్వా సంతోషేణ సమన్వితః ॥

గనుక నేడు భోజనమొనర్పవలెను సిద్ధపరపించుము. దుర్వాసుని పలుకులాలించి రాముడు బ్రహ్మానందభరితు డాయెను.

స సిద్ధమన్నం మునయే యథావత్సముపాహరత్
ముని ర్భుక్త్వాన్న మమృతం సంతుష్టః పున రభ్యగాత్ ॥

శ్రీరామచంద్రుడు షడ్రసోపేతమగు భోజనమును సిద్ధపరచిన తోడనే ఋషి ఆతిథ్యమును స్వీకరించి యథేచ్ఛం జనియెను.

స్వ మాశ్రమం గతే తస్మిన్ రామః సస్మార భాషితమ్
కాలేన శోకదుఃఖార్తో విమనా శ్చాతి విహ్వలః ॥

దుర్వాసుడు తన ఆశ్రమమునకు బోయినవెంటనే రాఘవుడు తాను కాలునితో పలికిన పలుకులను స్మృతికి దెచ్చుకొని దుఃఖితుడై వ్యాకులతతో ఉదాసీనుడై యుండెను.

అవాఙ్ముఖో దీనమనా న శశా కాభిభాషితుమ్
మనసా లక్ష్మణం జ్ఞాత్వా హతప్రాయం రఘూద్వహః ॥

శ్రీరాముడు తనలో తాను లక్ష్మణుని హతప్రాయునుగ భావించి దైన్యమైన చిత్తముతో ఏమియును పలుకక కూర్చుండిపోయుండెను.

అవాఙ్ముఖో బభూ వాథ తూష్ణీమే వాఖిలేశ్వరః
తతో రామం విలో క్యాహ సౌమిత్రి ర్దుఃఖసంప్లుతమ ॥

తూష్ణీభూతం చింతయంతం గర్హాంతం స్నేహబంధనమ్
మత్కృతే త్యజ సంతాపం జహి మాం రఘునందన ॥

సర్వేశ్వరుడగు శ్రీరాముడు తలవాల్చి కూర్చుండెను. అది గాంచి లక్ష్మణుడు అన్నగారు తనయందుకల స్నేహబంధముచే కట్టువడి దుఃఖించుచున్నాడని గ్రహించి అన్ననుచేరి పలుకుచున్నాడు. ఓ రఘు కులతిలకా ! నాకొరకు విచారింపకుము. శీఘ్రముగ నన్ను నరికివేయుము.

గతిఃకాలస్య కలితా పూర్వ మేవీ దృశీ ప్రభో
త్వయి హీనప్రతిజ్ఞే తు నరణో మే ధ్రువం భవేత్ ॥

ప్రభూ ! కాలగతి ఇట్లున్నదని నేను తొలుత గ్రహించియే యుంటిని. నేను మరణమునందు దృఢనిశ్చయుడనై యుండియే లోన ప్రవేశించితిని. నీవు ప్రతిజ్ఞాభంగ మొనర్చినచో నాకు నరకప్రాప్తి కలుగును.

మయి ప్రీతి ర్యది భవే ద్యద్యనుగ్రాహ్యతా తవ
త్యక్త్వా శంకాం జహి ప్రాజ్ఞ మామా ధర్మం త్యజ ప్రభో ॥

ఓ రామా ! నీకు నాయందు సత్యమగు ప్రీతియేయున్నచో ! నాయం దనుగ్రహము కలవాడవగుచో నెంటనే నన్ను నరికివేయును. ధర్మమునుమాత్రము విడువవలదు.

సౌమిత్రిణోక్తం తచ్ఛ్రుత్వా రామ శ్చలితమానసః
ఆహూయ మంత్రిణఃసర్వా వసిష్ఠం చేద మబ్రవీత్ ॥

సౌమిత్రి వాక్యములు వినిన రామచంద్రమూర్తి హృదయము చలించెను. వెంటనే మంత్రులను రప్పించి జరిగిన వృత్తాంతమంతయు వసిష్ఠునకు నివేదించెను.

మునే రాగమనం యత్తు కాలస్యాపి హి భాషితమ్
ప్రతిజ్ఞా మాత్మన శ్చైవ సర్వ మావేదయ త్ప్రభుః ॥

ప్రభువగు రాముడు కాలునియొక్క సంభాషణ దూర్వాసుని రాక తన ప్రతిజ్ఞకూడ వసిష్ఠునకు జెప్పెను.

శ్రుత్వా రామస్యవచనం మంత్రిణః సపురోహితాః
ఊచుః ప్రాంజలయః సర్వే రామ మక్లిష్టకారిణమ్ ॥

రాముని వాక్యములనువిని వసిష్ఠునితో గూడిన మంత్రిగణము అంజలిబద్ధులై అనాయాసముగ సర్వకార్యములను సాధించగల రాముని జూచి పలుకుచున్నారు.

పూర్వ మేవహి నిర్దిష్టం తవ భూభారహారిణా
లక్ష్మణేన వియోగస్తే జ్ఞాతో విజ్ఞానచక్షుషా ॥

ఓ రామా ! భూభారహరణార్థ మవతరించిన నీకు లక్ష్మణునితో వియోగము తొలుతనే కలుగవలసియున్నదను విషయమును మేము దివ్యదృష్టిచే గ్రహించితిమి.

త్యజాశు లక్ష్మణం రామ మాప్రతిజ్ఞాంత్యజ ప్రభో
ప్రతిజ్ఞాతే పరిత్యక్తే ధర్మోభవతి నిష్ఫలః॥

కనుక నోరామా ! లక్ష్మణుని పరిత్యజింపుము. ప్రతిజ్ఞాభంగము కలుగనీయకుము. ప్రతిజ్ఞాభంగము కలిగినచో నీవాచరించిన ధర్మ మంతయును నిష్ఫలమగును.

ధర్మే నష్టే ఒఖిలే రామ త్రైలోక్యం నశ్యతి ధ్రువమ్
త్వం తు సర్వస్య లోకస్య పాలకో ఒసి రఘూత్తమ॥

ధర్మము నశించినచో త్రిలోకములు నశించును. ఓ రాఘవా ! నీవు సమస్తలోకములను పరిపాలించు రాజరాజేశ్వరుడవు గాన అధర్మమున కవకాశ మీయకుము.

త్యక్త్వా లక్ష్మణమే వైకం త్రైలోక్యం త్రాతు మర్హసి
రామా ధర్మార్థసహితం వాక్యంతేపా మనిన్దితమ్॥
సభామధ్యే సమాశ్రుత్య ప్రాహ సౌమిత్రి మంజసా
యధేష్టం గచ్ఛ సౌమిత్రేమా భూద్ధర్మస్య సంశయః॥

గనుక నీవు లక్ష్మణు నొకనిని పరిత్యజించి త్రిలోకములను రక్షింపవలెను. అని వసిష్ఠునితోకూడ మంత్రులు పలికిన వాక్యములు

ధర్మార్థసహితమై యుండుట శ్రీరాముడు వెంటనే లక్ష్మణుని బిలచి లక్ష్మణా ! ధర్మభంగము కలుగకుండుటకై నీ యిచ్చవచ్చిన చోటికి బొమ్ము నిన్ను బహిష్కరించితి నని ఆజ్ఞాపించెను.

పరిత్యాగో వధోవాపి సతామేతో భయం సమం
ఏవ ముక్తే రఘుశ్రేష్ఠే దుఃఖవ్యాకులితే క్షణాత్॥

సత్పురుషులకు త్యజించుట, వధించుట యను రెంటినుకూడ సమానమే యని శిక్షాస్మృతి నిబంధించుచున్నదని రామునినోట పలు వడిన ఈవాక్యములు విని లక్ష్మణుని నేత్రములు జలపూరితములై వ్యాకులతనందెను.

రామం ప్రణమ్య సౌమిత్రిః శీఘ్రం గృహ మగాత్స్వకం
తతోఽగా త్సరయూతీర మాచమ్య సకృతాంజలిః
నవద్వారాణి సంయమ్య మూర్ధ్ని ప్రాణ మధారయత్।
యదక్షరం పరంబ్రహ్మ వాసుదేవాఖ్య మవ్యయమ్॥
పదం తత్పర మంధామచేత సాసోఽభ్యచింతయత్
వాయుర్యోధేన సంయుక్తం సర్వే దేవాః సహర్షయః॥
సాగ్న యోల్లక్ష్మణం పుష్పైస్తుష్టువుశ్చ సమాకిరన్
అదృశ్యం విబుధైః కైశ్చిత్సశరీరం సవాసవః॥
గృహీత్వా లక్ష్మణం శక్రః స్వర్గలోక మధాగమత్
తతో విష్ణోః చతుర్భాగం తం దేవం సురసత్తమాః॥
సర్వే దేవర్షయో దృష్ట్వా లక్ష్మణం సమపూజయన్॥

తోడనే లక్ష్మణుడు రామునకు నమస్కరించి గృహమునకువచ్చి సుమిత్రాదులకుకూడ నమస్కరించి, అక్కడనుండి, సరయూతటమును జేరి ఆచమనము నొనర్చెను. తర్వాత చేతులు జోడించి నవరంధ్రములను బంధించి, ప్రాణములను బ్రహ్మరంధ్రమందు స్థిరమొనర్చెను. అంతేగాక, అవినాశనము, అవ్యయమునగు వాసుదేవ పరబ్రహ్మమును

చిత్తమందు నిలిపెను. ఇట్లు ప్రాణనిరోధమొనర్చిన లక్ష్మణునిపై ఋషులు అగ్నితోకూడిన దేవతలు పుష్పవర్షము గురిపించి స్తుతించిరి. ఈసమయమున ఇంద్రాదిదేవతలు ఎవరికి గ్రహింపశక్యముకాని దివ్యశరీరమును ధరించి స్వర్గలోకమును చేరెను. నారాయణుని చతుర్థాంశరూపుడగు లక్ష్మణదేవుని చూచి దేవతలు, దేవఋషులు పూజించిరి.

లక్ష్మణే హి దివమాగతే హరౌ
సిద్ధలోకగత యోగినస్తదా
బ్రహ్మణా సహ సమాగమన్ముదా
ద్రష్టుమాహిత మహాహిరూపకమ్॥

భగవంతుడగు లక్ష్మణుడు స్వర్గమునుచేరిన పిమ్మట బ్రహ్మతోకూడ సిద్ధలోకనివాసులగు యోగులు శేషరూపుడగు లక్ష్మణుని దర్శింపవచ్చిరి.

★

నవమ సర్గ

శ్రీ మ హా దే వ ఉ వా చ :—

లక్ష్మణం తు పరిత్యజ్య రా మో దుఃఖసమన్వితః
మంత్రిణో ఽనేగమాం శ్చైవ వశిష్ఠం చేద మబ్రవీత్ ॥

దేవీ ! లక్ష్మణుని త్యజించిన పిమ్మట రామచంద్రమూర్తి దుఃఖాతురుడై మంత్రులను, వేదవేత్తలను, వశిష్ఠునిపిలచి యిట్లుచెప్పెను.

అభిషేచ్యామి భరత మభిరాజ్యే మహామతిం
అద్య చాహం గమిష్యామి లక్ష్మణస్య పదానుగః॥

నేడు మహామతియగు భరతునకు రాజ్యాభిషేక మొనర్చి నేను కూడ లక్ష్మణునియొక్క మార్గము ననుసరించెదను.

ఏవ ముక్తే రఘుశ్రేష్ఠే పౌరజానపదా స్తదా
ద్రుమా ఇవ చ్ఛిన్నమూలా దుఃఖార్తాః పతితా భువి॥

శ్రీరామచంద్రమూర్తి యిట్లు చెప్పినతోడనే నగరవాసులు దేశవాసులు అగు వారందరూ దుఃఖాతురులై మొదలునరికిన చెట్టువలె నేలపై బడిరి.

మూర్ఛితో భరతో వాపి శ్రుత్వా రామాభిభాషితం
గర్హయామాస రాజ్యం స ప్రాహేదం రామసన్నిధౌ॥

రాముని వాక్యములకు భరతుడుకూడ మూర్ఛనంది తెలిపి తెచ్చుకొని రాముని ఎదుట రాజ్యమును నిందించుచూ యిట్లు చెప్పుచున్నాడు.

సత్యేన చ శపే ఽహం త్వాం వినా దివి వా భువి
కాంక్షే రాజ్యం రఘుశ్రేష్ఠ శపే త్వత్పాదయోరహం ప్రభో॥

ఓ రఘుశ్రేష్ఠ ! నేను శపథమొనర్చి చెప్పుచున్నాను. హే ! ప్రభో రామచంద్ర! నాకు నీపాదసేవ వినా స్వర్గముగాని, రాజ్యముగాని యితర మేలోకభోగములుగాని అక్కరలేదని నీపాదములు పట్టి ప్రమాణమొనర్చుచున్నాను.

ఇహా కుశలవౌ రాజ న్నభిషించస్వ రాఘవ
కోశవేషు కుశం వీర ముత్తరేషు లవం తథా॥

ఓమహారాజ ! రామచంద్రప్రభో ! యీ కుశలవులకు రాజ్యాభిషేక మొనర్పుడు. అయోధ్యకు కుశుని ఉత్తరకోసలమునకు లవుని పట్టాభిషిక్తుల గావింపుడు.

గచ్ఛన్తు మాతా స్త్వరితం శత్రుఘ్నానయనాయ హి
అస్మాక మేత ద్గమనం స్వర్గాసాయ శ్రుణోతు సः॥

తొందరగ శత్రుఘ్నునకుగూడ దూతను పంపవలెను. శత్రుఘ్నుడుకూడ మన స్వర్గగమనవార్త వినవలెను.

భరతే నోదితం శ్రుత్వా పతితా స్తే సమీక్ష్యతమ్
ప్రజా శ్చ భయసంవిగ్నా రామవిశ్లేషకాతరాः॥

భరతుని వాక్యములనువిసిన ప్రజాసముదాయము వానిముఖమును వీక్షించుచు రామవియోగమును భరించలేక దుఃఖితులై భూమి మీద పడిరి.

వసిష్ఠో భగవాఁ రామ మువాచ స దయం వచః
పశ్య తాతాదరా త్సర్వాः పతితా భూతలే ప్రజాः॥

అంతట వసిష్ఠమహర్షి రామునితో కరుణాయుతముగ నిట్లు పలికెను. తాత ! సమస్తప్రజలు భూమియందు పడియున్నారు. నీవు వారిపై కరుణాదృష్టిని ప్రసరింపజేయుము.

తాసాం భావానుగం రామప్రసాదం కర్తు మర్హసి
శ్రుత్వా వసిష్ఠవచనం తాः సముద్ధాప్య పూజ్యచ॥

ఓ రామ ! వీరి ప్రేమభావముల ననుసరించి నీవు వీరిని అనుగ్రహింపుము. వసిష్ఠుని యీపలుకు లాలించి రామచంద్రుడు వారిని లేవనెత్తి సత్కరించి-

సస్నేహో రఘునాథ స్తాः కింకరో మది చాబ్రవీత్
తతः ప్రాంజలయः ప్రోచుः ప్రజా భక్త్యా రఘూద్వహమ్॥

ప్రేమపూర్వకముగ వారితో నిట్లు పలికెను. ఓ మహాజను లార ! నేను మనోవాంఛను నెరవేర్ప సంసిద్ధుడను గాన చెప్పుడు. రాము డిట్లుపలికినతోడనే ప్రజలు చేతులు జోడించి భక్తిపూర్వకముగా నిట్లుచెప్పిరి.

గన్తు మిచ్ఛసి యత్ర త్వ మనుగచ్ఛామహే వయమ్
అస్మాక మేషా పరమా ప్రీతి ర్ధర్మ్యా ఽయ మక్షయః॥

ఓ ప్రభూ ! నీవిప్పు డెక్కడకుబోవ నిశ్చయించితివో ! మేము గూడ అక్కడకే వచ్చెదము. ఇదే మా పవిత్రమైన వాంఛ. అక్షయ మగు ధర్మము.

తవానుగమనే రామ హృద్గతా నో దృఢా మతిః
పుత్రదారాదిభిః సార్ధ మనుయాస్యామో ఽద్య సర్వథా॥
తపోవనం వా స్వర్గం వా పురం వా రఘునందన
జ్ఞాత్వా తేషాం మనోదార్ఢ్యం కాలస్య వచనం తథా॥
భక్తం పౌరజనం చైవ భాష మిత్యాహ రాఘవః
కృత్వైవం నిశ్చయం రామ స్తస్మి న్నే వాహని ప్రభుః॥
ప్రస్థాపయామాస చ తౌ రామభద్రః కుశే లవౌ
అష్టౌ రథసహస్రాణి సహస్రం చైవ దన్తినామ్॥
షష్టిం చాశ్వసహస్రాణా మేకై కస్మై దదౌ బలమ్
బహురత్నే బహుధనౌ హృష్టపుష్టజనావృతౌ॥

ఓ రామా ! మాహృదయములందు నిన్న సరింపవలెనను దృఢ మైన సంకల్పము కలదు. గాన ఓ రాఘవా ! నీవు తపోవనమునకు బోయినా, లేక నగరమందున్నను, స్వర్గమును చేరినను, లేక యెక్క డకుబోయిన అక్కడకే నేము దార, పుత్రాదులతో సర్వదా నిన్నే అనుసరింతుము. అప్పుడు పురవాసుల దృఢసంకల్పము, కాలుని వచన మును విచారించి ఆస్థిరవాసులగు భక్తులతో అట్లే చేయుడని చెప్పెను. ఇట్లు నిశ్చయించి ఆరోజుననే కుశునకు అయోధ్యాసామ్రాజ్యము, లవునకు ఉత్తరకోసలము ఇచ్చి పంపివేసెను. వారికి ప్రత్యేకము ఒక్కొ

కర్కరికి యెనిమిదివేల రథములు, వేయి గజములు, ఆరువేలు గుఱ్ఱములు యిచ్చెను. ఇంకను అధికమైన ధనరత్నాదులు సైనికదళమునుకూడ ఇచ్చెను.

అభివాద్య గతౌ రామం కృచ్ఛ్రేణ తు కుశీలవౌ
శత్రుఘ్నానయనే దూతాన్ ప్రేషయామాస రాఘవః॥

కుశలవులు రామచంద్రునకు నమస్కరించి అతికష్టముపై వారి వారి స్థానములకు పోయిరి. ఇదేసమయమున శత్రుఘ్నుని కొరకు దూతలను బంపెను.

తే దూతా స్త్వరితం గత్వా శత్రుఘ్నాయ న్యవేదయన్
కుశాల స్యాగమనం పశ్చా దత్పుత్రస్య చేష్టితం
లక్ష్మణస్య చ నిర్వాణం ప్రతిజ్ఞాం రాఘవస్య చ
పుత్రాభిషేచనం చైవ సర్వం రామచికీర్షితమ్॥

ఆదూతలు శీఘ్రముగ శత్రుఘ్నునిచేరి కాలునికాక, దూర్వాసునిచేత లక్ష్మణుని నిర్వాణము, రాఘవుని ప్రతిజ్ఞ, కుశలవుల పట్టాభిషేకము, రాముడు చేయదలచిన పని మొదలగునవన్నియును నివేదించెను.

శ్రుత్వా తద్దూతవచనం శత్రుఘ్నః కులనాశనమ్
వ్యథితోఽపి ధృతిం లబ్ధ్వా పుత్రౌ వాహ్వాయ సత్వరః॥
అభిషిచ్య సుబాహుం వై మధురాయాం మహాబలః
యూపకేతుం చ విదిశానగరే శత్రుసూదనః
అయోధ్యాం త్వరితం ప్రాగా త్స్వయం రామదిదృక్షయా॥

ఈవిధముగ వివరించిన దూతలుచెప్పిన కులనాశనరూపమైన సమాచారమును విని శత్రుఘ్నుడు విచారించి తిరిగి ధైర్యము నవలంబించి కుమారులను పిలచి వారిలో మహాబలుడగు సుబాహుని మధురానగరమునకు యూపకేతువును విదిశానగరమునకు పట్టాభిషిక్తుల నొనర్చి శత్రుఘ్నుడు రాముని దర్శించుటకై అయోధ్యకు వచ్చెను.

దదర్శ చ మహాత్మానం తేజసా జ్వలనప్రభం
దుకూలయుగసంవీతం ఋషిభిశ్చాప్తకృద్వ్రతమ్॥

శత్రుఘ్నుడు వచ్చినపిమ్మట తన తేజముచే అగ్నితో సమాన ముగ ప్రకాశించువాడు, పీతాంబరధారి, చిరంజీవులగు ఋషులచే పరివేష్టితుడగు శ్రీరాముని గాంచెను.

అభివాద్య రమానాథం శత్రుఘ్నో రఘుపుంగవమ్
ప్రాంజలిర్ధర్మసహితం వాక్యం ప్రాహ మహామతిః॥

గొప్ప బుద్ధిగల శత్రుఘ్నుడు లక్ష్మీనాయకుడగు శ్రీరామునకు నమస్కరించి చేతులు జోడించి ధర్మబద్ధమైన వాక్యములను పలుకు చున్నాడు.

అభిషిచ్య సుతౌ తత్ర రాజ్యే రాజీవలోచన
తవానుగమనే రాజన్ విద్ధి మాం కృతనిశ్చయమ్॥

ఓ కమలలోచనా! రామ! నేను నారాజ్యమందు కుమారు లిరువురను వినియోగించియే వచ్చితిని. ఓ రాజరాజేశ్వరా! ఇప్పుడు నేనుకూడ నిన్ననుసరించుటకే నిశ్చయించినవానినిగా గ్రహింపుము.

త్యక్తుం నార్హసి మాం వీర భక్తం తవ విశేషతః
శత్రుఘ్నస్య దృఢాం బుద్ధిం విజ్ఞాయ రఘునందనః॥
సజ్జీభవతు మధ్యాహ్నే భవా నిత్యబ్రవీద్వచః
అథ క్షణాత్సముత్పేతు ర్వానరాః కామరూపిణః॥
ఋక్షాశ్చ రాక్షసాశ్చైవ గోపుచ్ఛాశ్చ సహస్రశః
ఋషీణాం దేవతానాం చ పుత్రా రామస్య నిర్గమమ్॥
శ్రుత్వా ప్రోచూ రఘుశ్రేష్ఠం సర్వే వానరరాక్షసాః
తవానుగమనే విద్ధి నిశ్చితార్థా హి నః ప్రభో॥

ఓ మహావీర! నేను నీకు భక్తుడను గనుక నిన్ను విడచి యుండ లేనను శత్రుఘ్నుని మనోనిశ్చయమును గ్రహించి శ్రీరాముడు పలుకు చున్నాడు. శత్రుఘ్నా! నీవు రెండవజామునకు సంసిద్ధుడవు కమ్ము.

యిదేసమయమునకు కామరూపముల వానరులు, భల్లూకములు, రాక్ష సులు, గోపుచ్ఛవానరులు, వేలకొలదిగా వచ్చి చేరిరి. అట్లే ఋక్షుల యొక్క దేవతలయొక్క పుత్రరూపులైన సమస్తవానరులు, రాక్షస గణములుకూడ రాఘవుని అవతారసమాప్తిని విని శ్రీరామునితో పలుక నారంభించిరి.

ఓ ప్రభూ! మేముకూడ నీతోవచ్చుటకై నడుములు బంధించి సంసిద్ధులమై యుంటిమి.

ఏతస్మి న్నంతరే రామం సుగ్రీవో ఒపి మహాబలః
యుథావ దభివాద్యాహ రాఘవం భక్తవత్సలమ్॥

ఇంతలో మహాబలియగు సుగ్రీవుడుకూడ భక్తవత్సలుడగు రామునితో నిట్లనుచున్నాడు.

అభిషి చ్యాంగదం రాజ్యే ఆగతో ఒస్మి మహాబలమ్
తవానుగమనే రామ విద్ధి మాం కృతనిశ్చయమ్॥

ఓ రామ! మహాబలశాలియగు అంగదుని కిష్కింధా రాజ్యము నకు పట్టాభిషిక్తు నొనర్చి వచ్చితిని. నేనుకూడ నిన్ననుసరించుటకే కృతనిశ్చయుడనైతి నని గ్రహింపుము.

శ్రుత్వా తేషాం దృఢం వాక్యం ఋక్షవానర రక్షసామ్
విభీషణ మువా చేదం వచనం మృదు సాదరమ్॥

అప్పుడు సుగ్రీవాది వానరులు, జాంబవదాది ఋక్ష (భల్లూక) గణము, విభీషణాది రాక్షసగణముకూడ తన్ననుసరించి వచ్చుటకై దృఢమైన నిశ్చయము కలవారై పలికిన వాక్యములు విని శ్రీరాముడు ఆదరపూర్వకముగ మృదువుగ విభీషణునితో నిట్లు చెప్పుచున్నాడు.

ధారయిష్యతి ధరా యావ త్ప్రజా స్తావ త్ప్రశాధి మే
వచనా ద్రాక్షసం రాజ్యం శాపతో ఒపి మమోపరి॥

విభీషణా! నేను నీచేత శపథను చేయించుకున్నాను. ఈభూమి యెంతవరకు ప్రజాసముదాయమును ధరించియుండునో అంతకాలము నీవీ లంకాధిపత్యమును వహించి రాక్షసరాజ్యమును పాలింతువుగాక.

న కించి దుత్తరం వాచ్యం త్వయా మత్క-ృతకారణాత్
ఏవం విభీషణం తూక్త్వా హనూమన్త మధాబ్రవీత్॥

విభీషణ! నాచే ఆజ్ఞాపింపబడినవాడవగుటచే యిక నీవు ప్రత్యుత్తరము చెప్పక నాఆజ్ఞాబద్ధుడవై చరింతువుగాక యని విభీషణునకు జెప్పి శ్రీరాముడు హనుమంతునితో చెప్పుచున్నాడు.

మారుతే త్వం చిరం జీవ మమాజ్ఞాం మా మృషాకృథాః
జాంబవంత మథ ప్రాహ తిష్ఠ త్వం ద్వాపరాంతరే॥

ఓ మారుతి! నాఆజ్ఞ నసత్యమొనర్పక చిరంజీనివై యుండుమని హనుమంతున కాదేశమిచ్చి జాంబవంతుని జూచి జాంబవంత నీవు ద్వాపరాంతమువరకు నుండుము.

మయా సార్ధం భవే ద్యస్తం యత్కించి త్కారణాంతరే
తత స్తాన్ రాఘవః ప్రాహ ఋక్ష రాక్షసవానరాన్॥
సర్వా నేవ మయా సార్ధం ప్రయాతే తిదయాన్వితః॥

భల్లూకరాజా! కారణాంతముచే ద్వాపరాంతమున నీవు నాతో యుద్ధమొనర్పవలసియున్నది గాన అంతవరకు నిట్లే యుండుమని జాంబవంతున కుపదేశించి మిగిలినవారిని జూచి ఋక్ష, వానర, రాక్షసులార! మీరందరును నాతోవత్తురుగాక యని ఆదరముతో చెప్పెను.

శ్రీరామసేవయొనర్చిన వానరాదులలో జాంబవంతుడు, అంగదుడు, హనుమంతుడు యీమువ్వురునుగాక మిగిలినవారందరిని ప్రభువగు శ్రీరాముడు తనతో వచ్చుట కనుజ్ఞనిచ్చెను. విశేషించి రామచంద్రుని సేవించిన యీ జాంబవదాదుల కేల తనతో పరమపదమును చేరుట కనుజ్ఞ నీయలే దనువిషయము విచారించి చూచినచో హనుమంతుడు విశ్వరూపమును ధరించినవాడు సత్యలోకమున పద్మాసనాసీనుడై మార్కండేయాది సర్వబ్రహ్మర్షి సేవితుడై వాణీసమేతముగ ఆనందమున నోలలాడుట గాంచెను. అంతేగాక సకలచరాచర ప్రపంచరచయితయై యుండియు బాధ్యతారహితుడై దుఃఖమిశ్రమముగాని ఆనందమును కూడ అనుభవించు హిరణ్యగర్భుని జూచి నిష్కామకుడైన హనుమంతు

నకు ఒక్కసారిగ బ్రహ్మలోకమున సృష్టికర్తృత్వాధికారము పొందవలె ననువాంఛ దృఢముగ జనించెను. అట్టి సంకల్పబలముచే నాఅధికారము పొందువరకును జన్మరాహిత్యము కలుగ నవకాశము లేమిచే ఈబ్రహ్మ యొక్క అసంతరమువరకునుండి ఆ అధికారమునుపొంది భవిష్యచ్చతు రాననుడైగాని పూర్ణత్వమును పొంద నవకాశము గలుగదు గనుకనే శ్రీరామచంద్రుడు హనుమంతుని చిరంజీవివై యుండుమని ఆజ్ఞాపించెను.

జాంబవంతుడు రామరావణసంగ్రామకాలంలో శ్రీరాముడు రుద్రునకు రుద్రుడై కాలునకు కాలుడై ప్రళయానళమువలె విజృంభించి రావణసంహారమొనర్చు సమయమున ఇట్టి వీరునితో యుద్ధముచేయని జన్మ జన్మేకాదని భావించుటేగాక తనదృఢమైన సంకల్పమునుకూడ రామునియెదుట వివరించినాడు. రామావతారకాలమున అతనితో యుద్ధమునకు దలపడి జీవించుట దుర్ఘటమగుటచే కృతఘ్నత్వదోషము నకు వెరచి శ్రీరాముడు ద్వాపరాంతమున కృష్ణావతారకాలమంచు నీవు నాతో యుద్ధముచేయుదువుగాక యని వరమిచ్చియున్నాడు. అందువలననే ఆసంకల్పబల మతనిని ఒకయుగ మంతయు తరింప నవకా శము లేని స్థితికి దెచ్చినది.

శ్రీరాముడు వాలిని సంహరించినాడు. ఈవార్త అంగదుడువిని తనతండ్రిని చంపినవానికి ప్రతీకారమొనర్తునని గదాపాణియై రణరంగ మునకు వచ్చుసరికి వాలి ప్రాణావసానసమయమందుండి శ్రీరాముని గుర్తించి ఓ రామ! నిన్ను దెలసికొంటిని. నీవు సాక్షాన్నారాయణు డవు. మూర్తీభవించిన ధర్మస్వరూపుడవు. అజ్ఞానవశముచే తెలియక ఏదో మాట్లాడితిని. నా అజ్ఞానమును మన్నింతువుగాక. నాకు నీసేవ చేయు భాగ్యము లేకపోయినను అదిగో నాకుమారు డంగదుడు వాని సేవనంది నావంశమును తరింపజేయుమని ప్రార్థించుచుండెను. ఈ వాక్యములు వినిన అంగదుడు పితాజ్ఞాపరిపాలకుడై శ్రీరాముని సేవిం చెను. గాని అతని మనమునందు మాత్రము శల్యమువలె తండ్రిని చంపినవానికి ప్రతీకారము చేయలేకపోతినను సంకల్పముమాత్రం చిర

కాలమువరకు నుండెఁడిది. గనుకనే ఆగతానాగతములు తెలిసిన సుగ్రీవుడు కిష్కింధారాజ్యమునకు అంగదుని రాజుగా జేసివచ్చెను.

అంగదుడు చిరకాలము రాజ్యమొసర్చి కృష్ణావతారకాలమున నిషాదుడై జన్మించి తుదకు కృష్ణుని బాణముచే వేధించి శ్రీకృష్ణసందర్శనమున జన్మాంతరస్మృతితోబాటు జ్ఞానముకూడ కలిగి ముక్తుడాయెను. పైవిషయములు చూడ సంకల్పబల మెట్టిదో మోక్షమునకు ఎంతభంగకరమో గోచరించుచున్నది. గనుకనే మానవుడు సాధ్యమైనంతపరకు సంకల్పములు చేయరాదు.

తతః ప్రభాతే రఘువంశనాథో
విశాలవక్షాః సితకంజనేత్రః
పురోధసం ప్రాహ వసిష్ఠ మార్యం
యాం త్వగ్నిహోత్రాణి పురో గురో మే॥

మరునాడు ప్రాతఃకాలమున విశాలహృదయుడు, కమలనేత్రుడు, భగవంతుడగు రామచంద్రమూర్తి కులగురువగు వసిష్ఠునితో యిట్లు చెప్పెను. "హే పరమగురో! నాకు ముందు ఆహవనీయాది త్రేతాగ్నులు నడువవలెను.

తత్రో వసిష్ఠో ఽపి చకార సర్వం
ప్రాస్థానికం కర్మ మహా ద్విధానాత్
క్షౌమాంబరో దర్భపవిత్రపాణి
ర్మహాప్రయాణాయ గృహీతబుద్ధిః॥
నిష్క్రమ్య రామో నగరాత్సితాభ్రా
చ్ఛశీవ యాతః శశికోటికాంతిః
రామస్య సవ్యే సితపద్మహస్తా
పద్మా గతా పద్మవిశాలనేత్రా॥

అంతట వసిష్ఠమహర్షి మహాప్రస్థానమునకు యోగ్యములగు కర్మలను విధి విహితముగా పరిసమాప్తినొందించి, కోట్లకోలది చంద్రు

లతో సమానమైన ప్రకాశముగల శ్రీరామచంద్రమూర్తి పట్టువస్త్రము లను పవిత్రమును ధరించి మహాప్రస్థానమందు మనస్సును లగ్నమొనర్చి తెల్లమేఘములనుండి చంద్రుడు బయలువెడలునట్లు నగరమునుండి బయలువెడలెను. శ్రీరాముని ఎడమపార్శ్వమందు శ్వేతకమలమును ధరించిన కమలనేత్రయగు లక్ష్మీకూడా నడచుచుండెను.

పార్శ్వే ఽధ దక్షే ఽరుణకంజహస్తా
శ్యామా యయా భూ రసి దీప్యమానా
శాస్త్రాణి శస్త్రాణి ధను శ్చ బాణా
జగ్ముఃపురస్తా ద్ధృత విగ్రహాస్తే॥

దక్షణపార్శ్వమందు మహాతేజశ్శాలినీ శ్యామవర్ణయగు భూదేవి అరుణవర్ణమయిన కమలమును ధరించి నడచుచుండెను. స్మృతి, పురాణ, యితిహాసాదులు, ఛందోవ్యాకరణ, శిక్షా, నిరుక్తాదులు నగు సర్వ శాస్త్రములునూ, శస్త్రాస్త్రములు, ధనుర్బాణములు మూర్తిమంత ములై ముందు నడచుచుండెను.

వేదా శ్చ సర్వే ధృతవిగ్రహా శ్చ
యయు శ్చ సర్వే మానయ శ్చ దివ్యాఃమాతా శ్రుతీనాం ప్రణవేన సాధ్వీ
యయా హరిం వ్యాహృతిభిఃసమేతా॥

సమస్త వేదములు, దేవఋషులు, వ్యాహృతులు, ప్రణవముతో గూడిన వేదమాతయగు గాయత్రిరూపములు ధరించి శ్రీరామచంద్ర మూర్తితోకూడ నడచుచుండెను.

గచ్ఛన్త మేవానుగతా జనా స్తే
సపుత్రదారాఃసబాంధువర్గాఃఅనావృతద్వార మివాపవర్గం
ధామం వ్రజన్తం యయు రాప్తకామాఃll

ఇట్లు రామచంద్రమూర్తి మహాప్రయాణమునకు నెడలినతోడనే బంధువులతోడను, పుత్ర, దారాదులతోడను నగరవాసులు అంతఃపుర కాంతలు భరతశత్రుఘ్నులు మొదలగువారందరును తెరువబడిన మోక్ష ద్వారమునకు బోవుచున్నట్లు బ్రహ్మానందముతో రాముని వెన్నంటి నడచుచుండిరి.

గచ్ఛన్త మాలోక్య రమాసమేతం
శ్రీరాఘవం పౌరజనాః సమస్తాః
సబాలవృద్ధా శ్చ యయు ర్ద్విజాగ్ర్యాః
సామాత్యవర్గా శ్చ సమన్త్రిణో యయుః॥

లక్ష్మ్యతోకూడ నడచుతున్న శ్రీరాముని జూచి పురజనులు బాలవృద్ధులు మంత్రులు వెంటరా బ్రాహ్మణసమూహమంతయును రాఘవు ననుసరించిరి.

సర్వే గతాః క్షత్రముఖాః ప్రహృష్టా
వైశ్యా శ్చ శూద్రా శ్చ తథా పరే చ
సుగ్రీవముఖ్యా హరిపుంగవా శ్చ
స్నాత్వా విశుద్ధాః శుభశబ్దయుక్తాః॥

తరువాత క్షత్రియ, వైశ్య, శూద్రులు ఇంకను అన్యజాతులవారు ఆనందముతో రాముని వెన్నంటి నడచుచుండిరి. సుగ్రీవాది వానరులు స్నానమొనర్చి పరిశుద్ధులై శ్రీరామునకు జై యని జయనినాదపూర్వకమైన మంగళశబ్దముతో బయలుదేరిరి.

న కంచి దాసీ దృవదుఃఖయుక్తో
దీనో ఽధవా బాహ్యసుఖేషు సక్తః
ఆనందరూపానుగతా విరక్తా
బభూవు శ్చ రామం పశుభృత్యవర్గైః॥

ఇందులో నేయొకడును సంసారదుఃఖముకలవాడుగాని బాహ్య విషయములం దాసక్తి కలవాడు కాని లేడు. వారందరును విరక్తులై

సర్వసంపత్తులతో డను రామునియం దైక్యమునందవలెనను వాంఛతో పరమానందరూపుడగు శ్రీరాముని అనుసరించిరి.

భూతా న్యదృశ్యాని చ యాని తత్ర
యే ప్రాణినః స్థావరజంగమా శ్చ
సాక్షాత్పరమాత్మాన మనంతశక్తిం
జగ్ము ర్విరక్తాః పర మేక మీశమ్॥

ఏప్రాణి యెవరికిన్నీ దృగ్గోచరముకాదో యెన్ని స్థావరజంగమాత్మకమైన జీవులు కలవో అవన్నియు సంసారమందు విరక్తినంది ఏకైకసుఖస్వరూపుడు అనంతశక్తిగలవాడు పరమాత్మయగు రాము నితోకూడ నడచెను.

నాసీ దయోధ్యానగరే తు జంతుః
కశ్చి త్తదా రామమనా న యాతః
శూన్యం బభూ వాఖిల మేవ తత్ర
పురం గతే రాజని రామచంద్రే॥

శ్రీరామునియందు చిత్తము లగ్నముకాకయు రామచంద్రుని అనుసరించకయును ఉన్నజీవి యొకఁటియు అయోధ్యానగరమున లేక పోయెను. రాము డయోధ్యను విడచినతోడనే అయోధ్య శూన్యమాయెను. అనగా అయోధ్యావాసులందరు అన్నిజీవులు రామపదము నందెదని భావము.

తతో ఽతిదూరం నగరా త్స గత్వా
దృష్ట్వా నదీం తాం సరిన్నేత్రజాతామ్
వవన్ద రామః స్మృతపావనోఽతో
దదర్శ చాశేష మిదం హృది స్థమ్॥

నగరమును విడచి దూరముగ నడచి శ్రీహరి నేత్రసంజాతయు పరమపవిత్రము నగు సరయూనదిని చూచెను. స్మరణమాత్రాన పరమ

పవిత్రమునొనర్చి రామచంద్రమూర్తి దానిని చూచి ప్రసన్నుడై సమస్తప్రపంచమును తనహృదయమున చూచెను.

అథాగత స్తత్ర పితామహో మహా
దేవా శ్చ సర్వే ఋషయ శ్చ సిద్ధా
విమానకోటీభి రపారపారం
సమావృతం ఖం సురసేనికాభిః॥
రవిప్రకాశాభి రభిస్ఫురత్భిం
జ్యోతిర్మయం తత్ర నభో బభూవ
స్వయంప్రకాశై ర్మహితాం మహద్భిః
సమావృతం పుణ్యకృతాం వరిష్ఠైః॥

ఈసమయమున ఆకర్మడకు బ్రహ్మ, సమస్త దేవతలు, ఋషులు, సిద్ధులు, విమానచారులై వచ్చిరి. కోట్లకొలది సూర్యులతో సమాన మైన ప్రకాశముతో నొప్పు పుణ్యపురుషులచే నాకాశమంతయును వ్యాప్తమయ్యెను.

వవృ శ్చ వాతా శ్చ సుగంధవన్తో
వవర్ష వృష్టిః కుసుమావలీనామ్
ఉపస్థితే దేవమృదంగనాదే
గాయత్సు విద్యాధరకిన్న రేషు॥
రామ స్తు పద్భ్యాం సరయూజలం సకృ
త్పస్పర్శ పరిక్రామ దనంతశక్తిః
బ్రహ్మ తదా ప్రాహ కృతాంజలి స్తం
రామం పరాత్మా పరమేశ్వరస్త్వమ్॥
విష్ణుః సదానందమయో ఽసి పూర్ణో
జానాసి త్వాం నిజ మైశ మేకం
తథా పి దాసస్య మమాఖిలేశ
కృతం వచో భక్తపరో ఽసి విద్వా॥

ఆసమయమున వాయువు సుగంధముతో వీచుచుండెను. పువ్వ వృష్టి కురియుచుండెను. దేవదుందుభులు మ్రోగెను. విద్యాధరులు, కిన్నరులును పాడుచుండిరి. అచ్చరలు నృత్యముచేయసాగిరి. అనంత శక్తియుతుడు భగవంతుడు నగు శ్రీరాముడు సరయూజలమును స్పృసించి ఆచమనమొనర్చి పాదములతో దానిని పరిక్రమించెను. అప్పుడు బ్రహ్మ చేతులుజోడించి భగవంతుడగు శ్రీరామచంద్రునితో నిట్లు పలికెను. ఓ పరమాత్మా! నీవు సకలచరాచరప్రపంచమునకు ప్రభుడగు నిత్యానందమయుడవు. పరిపూర్ణుడవు. సాక్షాద్విష్ణు భగవానుడవు. నీ ఏకమైన ఈశ్వరీయతత్వమును నీవొక్కడవే యెరుగుదువు. ఐనను ఓ అఖిలేశ్వర! నీవు నీదాసుడనగు నాకోర్కెను పూర్ణమొనర్చితివి. అందు విశేషములేదు. ఏమన నీవు భక్తవత్సలుడవు.

త్వం భ్రాతృభి ర్వైష్ణవ మేవ మాద్యం
ప్రవిశ్య దేహం పరిపాహి దేవాత్
యద్వా పరో వా యది రోచతే తం
ప్రవిశ్య దేహం పరిపాహి నస్త్వమ్॥

ఓ ప్రభో! నీవు సోదరులతోకూడ నీ ఆదిరూపమగు విష్ణురూపమును ధరించి దేవతలను రక్షింపుము. లేక నీయిచ్ఛ ననుసరించి యేశరీరమందైనను ప్రవేశించి మమ్ములనందరను పరిపాలించుము.

త్వ మేవ దేవాధిపతి శ్చ విష్ణు
ర్జానంతి న త్వాం పురుషా వినా మామ్
సహస్రకృత్వ స్తు నమో నమ స్తే
ప్రసీద దేవేశ పున ర్నమ స్తే॥

నీవే దేవాధిపతివగు విష్ణుభగవానుడవు. యీవిషయము నేను వినా యితరు లెవరును యెరుంగరు. ఓ దేవేశ! నీకు వేలకొలది నమస్కారములు. నీవు ప్రసన్నుడవుకమ్ము. నీకు మాటిమాటికి నమస్కారము.

పితామహార్థనయా స రామః
పశ్యత్సు దేవేషు మహాప్రకాశః
ముష్ణం శ్చ చక్షూంషి దివౌకసాం తదా
బభూవ చక్రాదియుత శ్చతుర్భుజః॥

పితామహుని ప్రార్థన నంగీకరించి మహా తేజశ్శాలియగు శ్రీరామ చంద్రభగవానుడు సమస్త దేవతలును చూస్తూండగనే వారిని మోహ పరవశులనొనర్చి శంఖ, చక్ర, గదా, పద్మధారియై చతుర్భుజరూప మును ధరించెను.

శేషో బభూ వేశ్వరతల్పభూతః
సౌమిత్రి రత్యద్భుతభోగధారీ
బిభూవతు శ్చక్రదరా చ దివ్యౌ
కైకేయిసూను ర్లవణాంతక శ్చ॥

లక్ష్మణుడు అద్భుతమైన సహస్రఫణములు ధరించి నారాయణ శయ్యారూపమైన ఆదిశేషు డాయెను. అట్లే భరతశత్రుఘ్నులు చక్ర, శంఖ రూపములు ధరించిరి.

సీతా చ లక్ష్మీ రభవ త్పురేవ
రామో హి విష్ణుః పురుషః పురాణః
సహానుజః పూర్వశరీరకేణ
బభూవ తేజోమయదివ్యమూర్తిః॥

సీత పూర్వమందే లక్ష్మీరూపమును ధరించియుండెను. భగవంతుడగు శ్రీరాముడు పురాణపురుషుడగు భగవానుడే. అట్టి రాముడు సోదరులతోకూడ తనతేజముచే పూర్వరూపమునందెను.

విష్ణుః సమాసాద్య సురేంద్రముఖ్యా
దేవా శ్చ సిద్ధా మునయ శ్చ యక్షాః
పితామహాద్యాః పరితః పరేశం
స్తువై ర్గృణంతః పరిపూజయంతః॥

ఆనందసంప్లావితపూర్ణచిత్తా
బభూవిరే ప్రాప్తమనోరథా స్తే
తదాహ విష్ణు ర్బ్రహ్మిణం మహాత్మా
ఏతే హి భక్తా మయి చానురక్తాఃll

ఇంద్రాదిదేవతలు, సిద్ధులు, మునులు, యక్షులు, బ్రహ్మతో కూడిన ప్రజాపతిగణముకూడ నారాయణుని నలువైపులకువచ్చి చేరి "విష్ణో ర్లలాటమసి" "సహస్రశీర్షా పురుషః" "సహస్రశీర్షం దేవం" మొదలగు వేదోక్తమంత్రములద్వారా స్తుతించుచు పూజించిరి. మఱియు తమ మనోరథము పూర్ణమగుటచే దేవతలు వారి మనములందు బ్రహ్మానందమును పొందిరి. అప్పుడు విష్ణువు బ్రహ్మనుగూర్చి యిట్లు పలికెను. మీరందరును నాకు భక్తులు నాయందు ప్రీతికలవారునై యున్నారు.

యాన్తం దివం మా మనుయాన్తి సర్వే
తిర్యక్శరీరా అపి పుణ్యయుక్తాఃl
వైకుంఠసామ్యం పరమం ప్రయాన్తు
సమావిశ స్వాశు సమాజ్ఞయా త్వంll

నాతోకూడ అందరును స్వర్గమునకు రావలెనని నిశ్చయించుకొన్నాను. వీరిలో తిర్యక్శరీరులను వానరులు, ఋక్షసైన్యమూకూడ కలదు. వీరెట్టి శరీరములను ధరించినను పుణ్యజీవులు గాన నీవు వీరందరికి వైకుంఠముతో సమానమైన పుణ్యలోకము నిమ్మని బ్రహ్మను ఆజ్ఞాపించెను.

శ్రుత్వా హరే ర్వాక్య మథాబ్రవీ త్తఃl
స్థానాని కాన్యాం తు విచిత్రభోగాఁ
లోకాఁ మదీయో పరిదీప్యమానాం
స్త్వదాభవయుక్తాఃl కృతపుణ్యపుంజాఃll

శ్రీహరి వాక్యములు విని బ్రహ్మ పలుకుచున్నాడు. ఓ నారాయణా! నీయందుకల భక్తినే యుక్తులైన యీమహాపురుషు లందరును

నాలోకమునకుగూడ పైభాగమందు సమస్త చిత్రవిచిత్రమైన భోగాను భవయోగ్యమైనటి సాంతానికలోకమును పొందెదరుగాక.

యే చాపి తే రామపవిత్రనామ
గృణంతి మర్త్యాలయకాల ఏవ
అజ్ఞానతో వాపి భజంతు లోకామ్
స్తానే వయోరూపై రపి చాధిగమ్యాన్॥

ఓ రామ! ఏజీవులు మరణకాలమందు "రామ" యను నీ నామ ముచ్చరింతురో! లేక మరపుచేతనైనను భజింతురో! వారందరు కూడ యోగులుపొందు పుణ్యలోకములనే పొందుచున్నారు.

తతో ఽతిహృష్టా హరిరాక్షసాద్యాః
స్పృష్ట్వా జలం త్యక్తకళేబరా స్తే
ప్రపేదిరే ప్రాక్తన మేవ రూపం
యదంశజాబుక్ష హరీశ్వరా స్తే॥

హరి, బ్రహ్మల సంవాదము విని వానర, రాక్షసాదులు పర మానందభరితులై జలమును ముట్టి శరీరములు వదలిరి. భల్లూకములు, వానరులు, ఏయే అంశలచేత జన్మించినారో ఆయా పూర్వ రూపముల నందిరి. దేవతలే యిట్లు వానరాదిరూపముల నందుటచే తిరిగి దేవతా రూపముల నందిరని భావము,

ప్రభాకరం ప్రాప హరిప్రవీరః
సుగ్రీవ ఆదిత్యజవీర్యవత్త్వాత్
తతో విమగ్నాః సరయూజలేషు
నరాః పరిత్యజ్య మనుష్యదేహామ్॥
ఆరుహ్య దివ్యాభరణా విమానం
ప్రాపు శ్చ తే సాంతనికాఖ్యలోకాన్
తిర్యక్ప్రజా తా అపి రామదృష్టా
జలం ప్రవిష్టా దివ మేవ యాతాః॥

వానరరాజు సుగ్రీవుడు ఆదిత్యునివలన జన్మించెను గాన ఆతడు సూర్యునియం దైక్యమునందెను. తరువాత అయోధ్యానగరవాసులు సరయూనదియందు మునిగి మానవదేహములను విడచి దివ్యభూషణ భూషితులై విమానముల నధిరోహించి సాంతనికనామకములైన లోక ములను పొందిరి. తిర్యక్ జన్మలందున్న (శ్వాస, కుక్కుట, మార్జాల, శూకరాదులు) జంతువులుకూడ శ్రీరామచంద్రుని దృష్టిప్రసారమా త్రాన సరయూజలమున దేహములు త్యాగముచేసి స్వర్గలోకమును చెందెను.

దిదృక్షవో జానపదా శ్చ లోకా:
రామం సమాలోక్య విముక్తసంగాః
స్నాత్వా హరిం లోకగురుం పరేశం
స్పృష్ట్వా జలం స్వర్గ మవాపు రఞ్జసా॥

దేశవాసులలో నెవరు యీదృశ్యమును జూడవచ్చిరో! వారందరుసుకూడ శ్రీరాముని దర్శించి విరాగులై సర్వసంగపరిత్యాగులై జగద్గురువు, పరమేశ్వరుడు నగు విష్ణుభగవానుని స్మరించుచు సరయూ జలస్పర్శనమున అనాయాసముగ దేహములను త్యజించి స్వర్గమునకు బోయిరి.

ఏతావ దేవోత్తర మాహ శంభుః
శ్రీరామచంద్రస్య కథావశేషం
యః పాద మప్యత్ర పఠే త్స పాపా
ద్విముచ్యతే జన్మసహస్రజాతాత్॥

సదాశివుడు రాజరాజేశ్వరికి శ్రీరామచరిత్ర నుపదేశించుచు పరి శిష్టరూపమైన ఉత్తరకాండ నిట్లు వినిపించెను. ఏమానవుడు యీ కాండయందలి శ్లోకమును లేక ఒక పాదమునుగాని పఠించునో! అట్టి వాడు జన్మసహస్రములలో చేసిన పాపములనుండి విముక్తుడగును.

దినే దినే పాపచయం ప్రకుర్వా
పఠే స్నరః శ్లోక మపీహ భక్త్యా
విముక్త సర్వాఘచయః ప్రయాతి
రామస్య సాలోక్య మనన్యలభ్యం॥

నిత్యము అనేక పాపములనొనర్చు మానవుడు భక్తిపూర్వకముగ నిందలి యొకశ్లోకమునైనను పఠించుచుండిన చో సర్వపాపవిముక్తుడై అన్యదుర్లభమైన స్వర్గమును పొందగలడు.

ఆఖ్యాన మేత ద్రఘునాయకస్య
కృతం పురా రాఘవచోదితేన
మహేశ్వరే ణాప్త భవిష్యదర్థం
శ్రుత్వా తు రామః పరితోష మేత్రి॥

శ్రీ రాఘవుని ప్రేరణచే సదాశివునిచే రచింపబడిన యీ ఉత్తర రామచరిత్ర తొలుత రాఘవుడే విని ఆనందించెను.

రామాయణం కావ్య మనంతపుణ్యం
శ్రీశంకరే ణాభిహితం భవాన్యై
భక్త్యా పఠే ద్యః శ్రుణుయా త్స పాపైః
విముచ్యతే జన్మశతోద్భవై శ్చ॥

సదాశివునిచే నాదియందు పార్వతి కుపదేశింపబడిన రామాయణము నేమానవుడు భక్తితో పఠించునో, లేక వినునో, వాడు నూర్ల కొలది జన్మలయం దొనర్చిన పాపసమూహమునుండి ముక్తి నందు చున్నాడు.

అధ్యాత్మరామం పఠత శ్చ నిత్యం
శ్రోతు శ్చ భక్తా లిఖితు శ్చ రామః
అతిప్రసన్న శ్చ సదా సమీపే
సీతాసమేతః శ్రియ మాతనోతి॥

ఈ అధ్యాత్మరామాయణమును నిత్యము పఠించుట, వినుట, వ్రాయుట అనువానిలో నేదియొకదాని నాశ్రయించినను అట్టి మానవుని సమీపమున శ్రీ సీతాసమేతుడగు శ్రీరామచంద్రమూర్తి యుండి వానికి శ్రేయస్సిద్ధి కలిగించును. ఇహపరసౌఖ్యము లిచ్చి రక్షించునని భావము.

రామాయణం జనమనోహర మాదికావ్యం
బ్రహ్మాదిభిః సురవరై రభిసంస్తుతం చ
శ్రద్ధాన్వితః పఠతి యః శ్రుణుయాత్ చ నిత్యం
విష్ణోః ప్రయాతి సదనం స జితశుద్ధదేహాః॥

బ్రహ్మాదులచే స్తుతింపబడునది, మానవులకు మనోహరమైనది, ఆదికావ్యము నగు నీరామాయణము నేమానవుడు శ్రద్ధతో పఠించునో లేక వినునో ఆమానవుడు పరిశుద్ధమైన దివ్యశరీరమును ధరించి విష్ణుసదనమును (వైకుంఠమును) పొందుచున్నాడు.



శ్రీపతిముద్రణాలయము, కాకినాడ—౧౯౫౭.

నారద

పరమేశ్వరుడు లీలాగృహీతశరీరుడై భూమియం దవతరించుచు, ఎట్లు అవతారములను చాలించుచుండునో అట్లే మహామహులయిన పురాణపురుషులును లోకకళ్యాణసంధాయకములైన కృత్యములను నిర్వర్తించుటకై భూమికి వచ్చుచు, కాలము తీరినంత దేహములను వీడుచుందురు.

ఈ మహాపురుషులు పరమేశ్వరుని లీలలకు అనుగైన స్థితిలో భూగోళమునందలి మానవులను చరింపజేయుచు, ఆ పురుషోత్తముని లీలలకు అవశ్యమయిన ఉపకరణాదులను సమకూర్చుచు, సహకరించు దురు.

అట్టి మహాపురుషులు ముక్తులయ్యును ఈ జగత్తునందలి సమస్త జీవులతోడను కలసి, మెలసి తిరుగుచు జగత్కళ్యాణమునకు కృషి చేయించుచుందురు.

అవిద్య, అహంకారము, మమకారము, విషయాసక్తి ఆదిగాగల వేవియు వీరిని జేరవు. అట్టి పురాణపురుషులలో నారదు డగ్రగణ్యుడు. నారదుడు దేవర్షి. పాపం సర్వతోముఖంగా విహరించే కలియుగంలో సైతం నారదుని దర్శనం కలుగుతుందని ప్రమాణాలున్నాయి. చతుర్దశ భువనాల్లోనూ నారదుని ప్రవేశానికి అభ్యంతరం చెప్పేవాడు లేడు. యోగశక్తిసంపన్నుడయిన నారదుడు ఒకలోకంనుండి వేరొక లోకానికి రెప్పపాటుకాలంలో ప్రయాణంచేసి రాగలడు.

శ్రుతి, స్మృతి, పురాణేతిహాస, సంహితాదులలోనేగాక జ్యోతిష, సంగీతాది సర్వశాస్త్రాలలోనూ నారదుని ప్రసక్తి ఉన్నది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులేగాక ఘోరపాతకాలుచేసే రాక్షసులుసైతం నారదుని పూజించి, అతనియందు భక్తివిశ్వాసాలను ప్రదర్శించిన సన్నివేశాలు భారతీయవాఙ్మయంలో లభిస్తాయి.

హిరణ్యకశ్యపుని భార్య అయిన కయాధూ నారదుని ఆశ్రమంలో ప్రవాసంచేసింది ; ఇంద్రుడు కయాధూని సురక్షితంగా అక్కడ ఉంచాడు. వాల్మీకి, వ్యాస, శ్రీ శుకులకు భగవత్తత్వాన్ని ఉపదేశించినవాడు నారదుడు.

నారదుడు కలహప్రియుడని సామాన్యులే కాదు సర్వజ్ఞుల మనుకొనేవారుకూడా భావిస్తారు. కాని నారదుడు తలపెట్టిన దేదిఅయినా జగత్కళ్యాణమునకు తలపెట్టబడింది. ఋషులకు భగవత్తత్వోపదేశం చేసినా, ప్రహ్లాదునకు నారాయణతత్వాన్ని-గర్భంలోనే-ఉపదేశించినా, దేవ-దానవసంగ్రామాలకు బీజాలు చల్లినా-వేదిచేసినా భువనభవనంలో శాంతిని ప్రతిష్ఠచేయడమే నారదుని లక్ష్యం.

నిశితంగా పరిశీలించి చూస్తే పరమేశ్వరుని మనస్సు నారదుని ఆకృతిలో పనిచేస్తున్నదేమో అనిపిస్తుంది. పరిపూర్ణమయిన జీవితాన్ని సాగించి, పరమేశ్వరుణ్ణి అర్థంచేసికోగలవారు తప్ప అన్యులెవరూ నారదుని యథార్థస్వరూపాన్ని అవగాహన చేసికోలేరు.

నారదుడు కల్పాంతరాలలో, యుగాంతరాలలో భిన్నరూపాలతో విభిన్నకర్తవ్యాలను వివిధవిధానాలను సాధించినట్లు గోచరిస్తుంది.

ఆదికల్పంలో గంధర్వలోకంలో ఉపబర్హ్మాణుడనే గంధర్వుడుగా జన్మించి గాంధర్వవిద్యలో అసమానపాండిత్యం గడించి 'మాలావతి' అనే గంధర్వకన్యను పెండ్లియాడి, అనేక భోగభాగ్యాలతో జీవయాత్ర సాగిస్తున్నాడు.

శృంగారలోలుడై విలాసంగా సంచరించే ఆ దినాలలో బ్రహ్మ లోకంనుండి ఆహ్వానం వచ్చింది. ఉపబర్హ్మాణుడు మాలావతీ ద్వితీ యుడై బ్రహ్మలోకానికి విజయం చేసాడు. దేవతలు, బ్రహ్మర్షులు పరి వేష్టించియున్న ఆ పరిషత్తులో (నారదుని) గాంధర్వవిద్యాప్రదర్శనం చేయుమని బ్రహ్మ ఆదేశించాడు.

ప్రజాపతి ఆదేశానుసారం ఉపబర్హ్మాణుడు కార్యక్రమం ప్రారం భించాడు. సర్వకళాపారగుడయిన ఉపబర్హ్మాణుడు, సర్వవిధముల అర్ధాంగి అనదగిన మాలావతితో గాంధర్వం ప్రదర్శిస్తున్నాడు. పరిషత్తు ప్రమోదచేతస్కం అయినది. సభ్యులు రసానుభూతిని పొందుతున్నారు. శాస్త్రోక్తంగా సాగే గాంధర్వంలో ఉపబర్హ్మాణుడు స్త్రీ లాలసత్వాన్ని నిగ్రహించుకోలేక మాలావతిని వీడలేక రసాభాస చేసాడు.

బ్రహ్మలోకంలో సర్వర్షులు పరివేష్టించియున్న పరిషత్తులో, చతుర్ముఖప్రజాపతి ఆధిపత్యంలో సాగే గాంధర్వం రసాభాసస్థితికి రావ టం బ్రహ్మకు ఆగ్రహాన్ని కలిగించింది. తక్షణం సింహాసనం దిగి నిలబడి, క్రోధారుణలోచనాలతో !

"ఉపబర్హ్మాణగంధర్వా ! మహాపురుషులతో నిండిన సభలో రస భంగంచేసి, కాముకత్వాన్ని ప్రదర్శించుకున్నావు కనక నీకు నేటినుండి దేవత్వం పోయింది. భూలోకంలో దాసీపుత్రుడవై జన్మించు" అని శపించాడు.

అప్రతిహతమయిన బ్రహ్మవాక్కు వెలువడటం తడవుగా ఉప బర్హ్మాణుడు నేలమీద కూలిపోయాడు. ప్రాణసమంగా చూచుకుంటూ, సర్వకాల సర్వావస్థలలోనూ తనయందే చరించే ఉపబర్హ్మాణుడు దేహ త్యాగం చేయటంతో మాలావతికి విషాదంతోపాటు విపరీతమయిన ఆగ్రహం కలిగింది. చిరకాలంనుంచి ఏకాత్మభావంతో దాంపత్య

సౌఖ్యాన్ని అనుభవిస్తూన్న తమకు విపత్తును చేకూర్చినవా రందరినీ శపించడానికి సన్నద్ధురాలయింది.

గజగజలాడిపోయి దేవతలు శ్రీహరిని స్తుతించారు. శ్రీహరి వైద్యునిరూపంలో అవతరించి, మందస్మితంచేస్తూ :

'మహాసాధ్వీ ! పాతివ్రత్యానికి పర్యాయపదంగా దాంపత్యజీవి తాన్ని గడిపే మాలావతీ, క్షమకు మూలకందమయిన నీ ముఖంలో అగ్నిశిఖ లేమిటమ్మా ? కన్నులలో ఎర్రజీర లేమిటీ ? ఈ మృతకళేబరం ఎవరిదీ ? ఏమిటీ వైపరీత్యం ?" అన్నాడు.

మాలావతికి ఈ వైద్యుని చూసేసరికి ఆశ జనించింది. తన భర్తను తనకు ప్రసాదిస్తాడనే విశ్వాసం కలిగింది. ఉగ్రరూపాన్ని త్యజించి దీనవదనంతో సవిస్తరంగా జరిగిన వృత్తాంతం నివేదించింది.

శ్రీహరి యథాపూర్వం చిరునవ్వులు చిందిస్తూ

'అమ్మాయీ !

నీభర్తను జీవింపచేస్తాను. 'దేవతలను శపించకు. నేను వైద్యుడను. అకాలమరణము జరిగినచో ఏడురోజులలోపల తెలిసినచో ఆవ్యక్తిని పునర్జీవితుని జేయు సాధనములు వైద్యశాస్త్రమున కలవు. ఆయుర్వేద తంత్రానుసారము నీభర్తను బ్రతికింతును'

అని ఆమె నొడంబరిచి ఉపబర్హ్మాణునికి ప్రాణదానము చేసెను.

మాలావతీ-ఉపబర్హ్మాణులు వైద్యునివేషమునన్న శ్రీహరికి నమస్కృతు లర్పించి గంధర్వలోకమునకు బోయిరి. మాలావతితో భోగా లనుభవిస్తుండగా బ్రహ్మశాపం స్మృతికివచ్చి, మాలావతికి తత్త్వో పదేశంచేసి ఉపబర్హ్మాణుడు విరాగియై ఒకమహర్షియంసు ప్రవేశించాడు. కొంతకాలం గడిచేసరికి ఒకనాడు అరణ్యంలో ఉన్న ఆ మహర్షి సమీపానికి ఒక స్త్రీ వచ్చి అంజలిఘటించింది.

ఋషి ఆమెను అవలోకించి ఆమె అభీష్టాన్ని అడిగాడు. ఆమె తలవాల్చి :

'మహాత్మా !

నేను దాస్త్రీని. పవిత్రులయిన బ్రాహ్మణుల గృహంలో సేవా వృత్తితో జీవిస్తున్నాను. స్త్రీకి సహజంగా మాతృత్వాంచ ఉంటుంది. ఇంతవరకూ నాకు అటువంటి దేమీ కలగలేదు. కాని అదే ప్రస్తుతం నన్ను వేధిస్తున్నది. జనపదాలలో మాతృత్వాన్ని నాకు ప్రసాదించే పురుషులు లేకకాదు. కాని వారు కామతృప్తికోసం నన్ను పొందుతారు. వారితో యెడతెగనిబంధం యేర్పరచుకోవలసి వస్తుంది. అందుచేత ఈ అరణ్యాలలో ఉండే తమవంటి మహాపురుషు లెవరేనా నాకు తల్లినయ్యే భాగ్యాన్ని దయచేస్తారని యిలా వచ్చాను. సర్వభూతముల యందు సమదృష్టికల తాము నన్ను అనుగ్రహించుతారు.'

అన్నది.

మహర్షి ఒక్కక్షణం ఆలోచించాడు. ఈ స్త్రీ కోరికలో యేదో లోకకళ్యాణం ఉండిఉంటుంది. లేకపోతే దాసీవృత్తిలో జీవించే ఈమె జనపదాలు వీడి మాతృత్వప్రాప్తికై అరణ్యాలు పట్టదు. ఇంత సౌందర్యంకల ఈమెను నగరాలలోని ఏపురుషుడయినా స్వేచ్ఛగా వరించ గలడు. అయినా ఈమె కామవాంఛ లేనిదీ, పవిత్రసంకల్పం కలదీ కావునసే వచ్చి నన్ను అర్థిస్తున్నది, అని నిశ్చయించుకుని ఆమెను రమించాడు.

సంయోగసమయంలో ఆమె తనకు కలగబోయే కుమారుడు ఈశ్వరభక్తుడు కావాలనీ, వైరాగ్యదృష్టిసంపత్తి కలవాడుగా ఉండాలనీ భావించుకొనేది. ఋషి వీర్యంనుండి నారదుడు ఆమెగర్భంలో ప్రవేశించాడు. ఆమె సద్యోగర్భిణి అయి కుమారుని ప్రసవించి, సంతృప్త హృదయంతో మహర్షికి నమస్కరించి తిరిగి జనపదానికి వచ్చింది.

మామూలుగా ఆ బ్రాహ్మణకుటుంబంలోనే జీవయాత్ర సాగిస్తున్నది. గర్భవాసాన్ని పోషించుకుంటూ, ఇంటివారిసేవచేస్తూండగా ఒకనాడు దేవతారాధనకోసం గోళ్ళీరాలు తెచ్చి ఒక చోటపెట్టి పిల్లవాణ్ణి చూస్తూండమని చెప్పింది. ప్రమాదవశాత్తూ ఒక శునకం ఆ వాల చెంబును తాకింది, కొద్దిగా బ్రాగిందికూడా.

బ్రాగుతూండగా చూసింది. ఆమె గుండె గగ్గోలెత్తింది. కుక్క ముట్టినపాలు దేవతారాధనకు పనికిరావని, మళ్ళీ గోశాలకువెళ్ళి పాలు పితకబోతుండగా పాము కరిచి మరణించింది. విషయం తెలిసికొన్న యజమానులు పిల్లవాడికి ఈ వార్త తెలియజేసి యథావిధిగా అంత్యక్రియలు జరిపించారు. తల్లి అంత్యక్రియలు పూర్తిచేసి ఆ బాలుడు వారి సెలవు తీసికొని అరణ్యంలోకి పోయి విష్ణువు నాశ్రయించి నారాయణాష్టాక్షరీ మంత్రోపదేశం పొందాడు.

శీతవాతాతపాలను లెక్కించకుండా తీవ్రనిష్ఠతో తపస్సు చేయసాగాడు. అతని నిష్ఠకు తృప్తుడైన మహావిష్ణువు మనోవీథిని చతుర్భుజ రూపంతో దర్శనమిచ్చాడు.

పరమేశ్వరుని దర్శనంతో ఆనందబాష్పాలు జాలినవి, శరీరం పులకలెత్తింది, కంఠం రుద్ధమయింది.

ఓం నమో నారాయణాయ

ఓం నమో నారాయణాయ

ఓం నమో నారాయణాయ

అని సాష్టాంగపడుతూండగా ఆ రూపం అంతర్ధానమయింది. అతనికి అపారమయిన విచారం కలిగింది.

మహావిష్ణువు దర్శనం యేవిధంగా నయినా సాధించాలని దీక్షతో తపస్సు సాగించాడు. అనుదినం ఆ పురుషోత్తముని ఆగమనం కోసం నిరీక్షిస్తుండగా ఒకనాడు అశరీరవాణి యిలా వినిపించింది.

'వత్సా! నీ భక్తి, తాత్పర్యాలకు నేను సంతోషించాను. నీయందు నాకు పరిపూర్ణవాత్సల్యం ఉన్నది. కనుకనే నీకు అదృశ్య రూపంలో దర్శనం యిచ్చాను. ఈజన్మలో నీకింక నాదర్శనం దుర్లభం. కాలపరిణామంలో జన్మాంతరప్రాప్తి కలుగుతుంది. అప్పుడు నీకు నా దర్శనం లభిస్తుంది. నా పరిపూర్ణానుగ్రహం కలుగుతుంది.'

మేఘగంభీరస్వనంతో వినిపించిన ఆ సందేశాన్ని ఆలకించి ఆనందతరంగితహృదయంతో మహావిష్ణువును ఆరాధిస్తూ కొంతకాలానికి ఈ శరీరాన్ని విడిచి వైకుంఠంలో విష్ణుపారిషదులలో ఒకడుగా అయ్యాడు.

కల్పాంతమందు సర్వజగత్తునూ తనయందు విలీనం చేసికొని యోగనిద్రపోతున్న బ్రహ్మదేవుని ఉచ్ఛ్వాసముద్వారా అతనిలో ప్రవేశించాడు. సహస్రయుగాలు గతించాక బ్రహ్మ యోగనిద్రవీడి పునఃసృష్టి ప్రారంభించే సమయంలో, బ్రహ్మహృదయసపుత్రులగు మరీచ్యాదులతో జన్మించాడు.

జన్మప్రభృతి బ్రహ్మచర్యనియమంతో నారాయణనామస్మరణ చేసికొంటూ, పరమేశ్వరుని అనుగ్రహవిశేషంవల్ల మహతి అనే వీణను పొంది త్రిలోకసంచారియై సర్వదా శ్రీహరిని ధ్యానించుకుంటూ నడుస్తున్నాడు.

* * *

సృష్టిక్రమంలో దక్షప్రజాపతి ప్రభృతులు దశసహస్రసంఖ్యలో మానవసృష్టి చేసారు. పుట్టిన పదివేలమందికి నివృత్తిమార్గం ఉపదేశించి విరాగులను చేసాడు. తిరిగి దక్షప్రజాపతి మరొక పదివేలమందిని సృష్టిస్తే వారినీ విరాగమార్గవర్తులనే చేసాడు.

మూడవమారు కూడా యిదే విధానం అవలంబించేసరికి దక్షునికి ఆగ్రహం కలిగి :

'త్రిలోకసంచారంతో కలహభోజనుడవు కమ్ము' అని శపించాడు. దక్షుని శాపాన్ని చిరునవ్వుతో స్వీకరించాడు. నారమని శాంత స్వభావానికి ముగ్ధుడై బ్రహ్మ :

'కుమారా !

నీ సంచారం, కలహభోజనత్వం జగత్కళ్యాణదాయకాలవు తాయి'

అని వరం ప్రసాదించాడు.

నారదుడు సమస్తవేదముల తత్త్వమెరిగినవాడు. శిక్షా, జ్యోతిష, కల్ప, నిరుక్తాది శాస్త్రములు లోతులెరిగినవాడు. గానవిశారదుడు. మీ మాంసా పరిజ్ఞాత.

నారదుడే వాల్మీకికి రామాయణగాథ నుపదేశించినవాడు. నారదునివలననే వ్యాసభగవానుల వారధ్యాత్మమును గ్రహించిరి. రామాయణ, భారత, భాగవతాది కావ్యేతిహాసపురాణములను భూలోకమున విరివిగా ప్రచారమొనర్చినవాడు దేవర్షి నారదుడే !

* * *

వాల్మీకి

శ్రీమద్రామాయణ మహాకావ్యాన్ని ఉదాత్త సౌందర్యసుషమా సమన్వితంగా విరచించి విశాలవిశ్వానికి విశిష్టకృతిగా అందజేసి సర్వ ప్రపంచాన్ని విభ్రమచకితంచేసిన వాల్మీకిమహర్షి చరిత్ర అనేకులకు అజ్ఞాతంగానే ఉండిపోయింది.

భారతీయులు కవిజీవితాలను లిఖించుకోకపోవటం ఒక లోపంగా అధునాతనులు పేర్కొంటారు. అయితే భారతీయ సాంప్రదాయం వ్యక్తిజీవితవిశేషాలకు ప్రాధాన్యమీయదు. వ్యక్తి ప్రతిభ సమాజానికి యెంతవరకూ సహకరించింది; ఆ వ్యక్తి భారతీయసంఘాన్ని ధార్మిక వ్యవస్థపై నడిపించటానికి జరిపిన కృషి యేమిటి? మోక్షసాధనకు కృషి చేసుకున్నాడా? లేదా? అంతే. ఈ ప్రశ్నపరంపరలుకూడా ఈనాడు మనం చూసుకోవలసినవే కాని నాటివారు ఆలోచించలేదు. వాస్తవానికి ప్రపంచసాహిత్యానికే శ్రీకారంచుట్టిన ఆదిపురుషుడు వాల్మీకి. ఆది కవి అయినంతలో వాల్మీకి మహావ్యక్తిగా పూజాస్థానుకాలేదు.

'కావ్యాలాపంశ్చ వర్జయేత్" అని ఘోషించిన శాస్త్రవేత్తలు సైతం శ్రీమద్రామాయణాన్ని ఆప్తవేయంగానే స్వీకరించి అంజలి ఘటించారు. కవికులతిలకుడైన కాళిదాసునిసైతం లక్ష్యంచేయకుండా అలంకారికసూత్రాలతో చెండాడిన సంస్కృతలాక్షణికులు వాల్మీకికి కైమోడ్పు ఘటించి ముందుకు సాగారు.

ఏమహోదయంలో, మరే మహోదాత్త సంకల్పంతో వాల్మీకి శ్రీమద్రామాయణాన్ని సంస్కృతవాణిలో గానంచేసాడో నాటినుంచి నేటివరకూ అని శ్రుతిసమ్మతంగా ప్రతిధ్వనిస్తూనే ఉంది. ప్రపంచభాష లన్నిటిలోకీ అనూచితమయినది. ప్రపంచంలో ఏకావ్యానికీ లేని గౌరవ స్థానాన్ని శ్రీమద్రామాయణం అందుకొన్నది. మానవజీవితానికి అను బంధించిన సర్వభావానుభూతులను శ్రీమద్రామాయణంలో వాల్మీకి నిక్షేపించినందువలనే అది త్రికాలాబాధితమయిన వేదవాఙ్మయంతో సమానస్థాయిని సాధించుకొన్నది.

దేశ, కాల, పాత్రావధుల నధఃకరించి జీవత్సనంతిలా ప్రవ హిస్తూ, మానవజీవితాన్ని పరిపూతంచేస్తూ విజ్ఞానభిక్షాప్రదానం చేస్తూన్న శ్రీమద్రామాయణాన్ని విరచించిన వాల్మీకి మహర్షి జీవి తానికి సంబంధించిన పౌరాణికవిశేషాలను ఊటంకించి చూపుతాను.

క్షీరసాగరసికతాతలాలమీద విశ్వకర్మ నిర్మించిన నాటకశాల వైపు యక్ష, కిన్నర, సిద్ధ, సాధ్య, దేవతాబృందం సంతోషతరంగిత స్వాంతంతో తరలివస్తున్నది. దేవతలకు అమరత్వాన్ని ప్రసాదించిన అమృతోత్పాదనం ప్రాతిపదికగా 'జగన్మోహిని' అనే పేరుగల రూప కాన్ని దుర్వాసమహర్షి రచించాడు; ఆ 'జగన్మోహినీ' రూపకాన్ని విష్ణుమూర్తిస్వామి ప్రదర్శింపజేస్తున్నాడు.

గణాధిపతి, భారతి సంగీతదర్శకులుగా నారద, తుంబురులు వాద్యప్రవీణులుగా ఊర్వశి నాయికగా రూపకప్రదర్శనం వీక్షిస్తూ నట్లు వార్తలు పంపారు. చతుర్ముఖుడు ఉన్నతాసనాన్ని అధిష్ఠించి ఉన్నాడు. ప్రముఖులందరూ ఆయన పార్శ్వభాగాన పరివేష్టితులయి నారు.

వసంత, మన్మథులు తమశక్తినంతా ధారవోసి రంగాలంకరణం పూర్తిచేసారు. యవని కాభ్యంతరసూత్రధారి నాందీవందనం ముగిం

చాడు. పూర్వరంగప్రవర్తకుని మంగళాచరణంతో ప్రస్తావనకుడా ముగిసింది.

అప్సరలలో కాశ్చర్యకరసౌందర్యంతో ఊర్వశి జగన్మోహినీరూపంలో రంగస్థలంమీద పదక్షేపం చేసింది.

ఒక్కసారిగా గీత, వాద్యాలు ప్రేక్షకుల కర్ణమూలాలలోంచి హృదయాలను స్పృశించి పులకింపజేసినవి; జగన్మోహినీరూపం అమర గణాలకు గిలిగింతలు పెట్టింది. సర్వాంగవికసితయౌవనశోభావిరాజిత అయిన జగన్మోహిని చకితదృక్కులతో పారిషదులకు ఉన్మాదమే కలిగించింది. వనమయూరంలా మెడ నాడిస్తూ, భీతహరిణంలా కన్నులు కదలిస్తూ, కన్బొమలను వేరువేరుగా కదల్చిస్తూ, నాసాగ్రానదృష్టి నిలుపుతూ, చలనం తెలియనీయని గతిలో పాదాలు చలింపజేసే ఊర్వశి సర్వాంగాలనూ ఏకకాలంలో తిలకించే అదృష్టం దేవేంద్రునికే లభ్యమయినది. ప్రజాపతికూడా కొంతవరకూ ఆ అదృష్టానికి నోచుకోకపోలేదు.

దేవసేనాని కుమారస్వామిపార్శ్వాన నిలబడిన నందీశ్వరుడు అప్రమత్తుడై నిలబడ్డాడు. దర్శకత్వంలో ఈషన్మాత్రం లోపంరాకుండా ఉండేటట్లు చూసుకుంటున్నాడు, నంది మూపుపై చెయ్యానిన దేవసేనాని.

నారద, తుంబురులు గీత, వాద్యాలను సమ్యగ్గతిలో సాగిస్తున్నారు. గణాధిపతి, భారతి దృష్టులను ఊర్వశి నృత్యంమీదనే కేంద్రీకరించారు.

పార్వతీదేవి విభ్రమవిలోలలోచనాలతో ఆలోకిస్తున్నది. పరమశివుడు ధ్యానసమాధితో దర్శిస్తున్నాడు.

పారిషదుల కన్నులలో ప్రతిఫలించే ఊర్వశీరూపం హృదయాలకు గిలిగింతలు పెడుతూ, శేషించిన ఇంద్రియాలకు చైతన్యంలేకుండా చేసింది.

త్రింశత్కోటి దేవతాగణాలనూ తన అక్షిచలనంతో, భ్రూభంగంతో, హస్తన్యాసంతో, పదనిక్షేపంతో, ఉరోజచాలనంతో గిలగిల లాడిస్తున్నగర్వం ఊర్వశిని మరింత ఉత్సాహపరచింది.

తమ తమ కర్తవ్యాల గతివేగాన్ని ఊర్వశీనృత్యంతో సమానంగా నడిపిస్తున్నదీ లేనిదీ భారతి పరిశీలిస్తున్నది. నారద, తుంబురులు భారతి ఆదేశాలను అక్షిచలనాలతో స్వీకరిస్తున్నారు. కుమారసేనాని ఆనంద తరంగితహృదయంతో రంగస్థలాన్నీ, ప్రేక్షకాగారాన్ని ఏకకాలంలో చూచే యత్నంలో ఉన్నాడు.

ఆదిలో కొంతసేపు ప్రశంసావాక్యాలను వర్షిస్తూ ఒకరిభుజా లొకరు తట్టుకుంటూ ఊర్వశీనృత్యాన్ని తిలకించిన పారిషదులు నెమ్మది, నెమ్మదిగా అచేతనస్థితికి వచ్చేసారు. స్థాయిభావాన్నిపొందేస్థితిలో సద్యఃపరనిర్వృతి వారిలో యేర్పడిపోయింది.

కుమారసేనానీ, సగర్వంగా నందీ భుజాస్ఫాలనం చేసారు. కని పెట్టిన భారతి కనుబొమ ఎగుర వేసింది. నారదతుంబురులు చిరునవ్వు విసిరారు.

ఆసమయంలో ఒకానొక అపరిచితవ్యక్తి కంఠం మందుభి ధ్వానంతో పరిషత్తును తనవైపు ఆకర్షించుకొన్నది.

ప్రజాపతీ !

సృష్టికర్తవయిన నువ్వే యింతటి అఘోరతిపాలుకావటం శోచనీయం. ఎపుడుగా జగన్మోహనీరూపంలో ఉన్నది ఊర్వశి అని నువ్వెరుగుదువు. ఆ అప్సరఃస్త్రీ నాట్యాన్ని ఆలోకిస్తూంటే నీకు రేతస్ఖలనం కావటం ఎంత హాస్యాస్పదం మహానుభావా ?

అయినదాన్ని సభ్యజనత చూస్తే హేళనపాలవుతానే భీతిలో పాదాంగుళితో నొక్కిపట్టావు. అందులో సగభాగం చిన్నపాటి అరనై వేలమంది ఆవిర్భవించి వాలఖిల్యాదులుగా తరలిపోయారు. మిగిలిన అంశనుండి ఆవిర్భవించిన నన్ను గురించి ఏమీ ఆలోచించకుండా...!

అని గంభీరంగా పలుకుతుంటే ప్రజాపతికి ఆవేశం కలిగింది. రస భంగం చేయటంతో సరిపడక, బ్రహ్మాంతవాణ్ణి అవిధంగా అవమానిం చటం అసహ్యంగా గణించి :

"యక్ష, కిన్నర, సిద్ధ, సాధ్య, దేవగణాలు పరివేష్టించియున్న మహాసభలో అసభ్యప్రవర్తనతో అసహ్యకర ప్రసంగం చేసిన హేతు వుగా నువ్వు కిరాతుడవైపోతావు.'

అని శపించాడు.

ఆపురుషుడు భీతచిత్తుడై ప్రజాపతి పాదాలపై పడి పరిపరివిధాల ప్రార్థించాడు. అయన ఆవేశం సడలి, అంతరంగంలో ఆర్ద్రతయేర్ప డింది. ప్రశాంతవదనంతో ప్రజాపతి :

'అమోఘమయినది నావాక్కు. శాపాన్ని అనుభవించక తీరదు. అయితే నువ్వు కిరాతుడవుగా చరిస్తూన్న సమయంలో సప్తర్షులు నీకు ఎదుటై రామనామాన్ని ఉపదేశిస్తారు. దాన్ని ఉపాసించి, లోక కళ్యాణకారకమయిన శ్రీహరి చరిత్రను శ్రీమద్రామాయణంగా విరచించి ఆదికవి పేరుతో జన్మను సార్థకం చేసుకుంటావు'

అని శిరస్సుపై చేయి ఉంచాడు.

* * *

శోకలనగరంలో శంభుడు అనేపేరుతో ఒకానొక ద్విజకుటుం బంలో జన్మించాడా పురుషుడు. వేదధర్మానుసారం శంభుడికి ఉపనయన సంస్కారం అయింది. బ్రహ్మచర్యదీక్షతో వేదవేదాంగాలను అధ్య యనంచేసాడు. గురువుల ఆజ్ఞానుసారం వారివద్ద సెలవు తీసికొని, స్వగృహంచేరి కులోచితమయిన కన్యను పరిణయమాడి గార్హస్థ్య జీవి తం ఆరంభించాడు. కొంతకాలం గృహస్థాశ్రమాన్ని సక్రమంగా నిర్వహించాడు.

అక్కడనుంచి కొద్ది కొద్దిగా స్త్రీ లాలసత్వం ఆరంభమయింది. నెమ్మది నెమ్మదిగా స్థాయి పెరిగింది. నగరంలోని వేశ్యాజనంతో పరిచయం ప్రవృద్ధమయింది. చివరకు ఒక వేశ్యాంగనను తెచ్చి స్వగృహంలోనే ఉంచాడు. పతివ్రతాశిరోమణి అయిన శంభునిభార్య భర్తకూ, వేశ్యకూ పరిచర్యచేస్తూ జీవించసాగింది. శంభుని హింసా కాండ మితిమీరినకొద్దీ ఆమె సహనశక్తి ప్రవృద్ధం కాసాగింది. ఎప్పటికయినా భర్తకు తనపై అనుగ్రహం కల్గదా? అనే ఆశ ఆమెలోంచి సన్నగిల్లటంలేదు. భర్తృసేవయే పరమావధిగా జీవిస్తున్నది. శంభుడి భోగాలకు యిల్లు గుల్లయిపోయింది. ఇంట్లో తిండికిలేనిపరిస్థితి యేర్పడ బోతుండగా శంభుని వేశ్య వేరొకనితో కదిలిపోయింది.

అకాలభోజనంతో, అభక్ష్యభక్షణం శంభుని ఆరోగ్యాన్ని హరించింది. అతని అవినీతికరప్రవర్తనలవలన యేర్పడిన వ్యాధిసము దాయం భగంధరవ్యాధిగా పరిణమించింది.

భగంధరవ్యాధిపీడితునినుండి వెలువడే దుర్గంధాన్ని సైతం భరిస్తూ శంభుని ధర్మపత్ని సేవచేస్తూనే ఉంది. ఆ మహాసాధ్వి సేవాసక్తులు శంభునిలో పశ్చాత్తాపాన్ని రేకెత్తించాయి. పశ్చాత్తప్తహృదయంతో శంభుడు సతిని క్షమాభిక్ష నర్థించాడు. ఆమె కన్నీరు ఒత్తుకుంటూ:

'నాథా! నా పురాకృతకర్మఫలాన్ని . నే ననుభవించాను. ఇందులో మీదోషం ఏమీలేదు. నా కర్మను నే ననుభవించకతీరదు. మీ ఆరోగ్యం బాగుపడితే నా సుకృతం ఫలించినట్లే'

అని అనేకవిధాల అతని హృదయతాపాన్ని ఉపశమింపజేసి, తన సాధువర్తనతో ఆస్పత్రల యిళ్ళనుండి ఆహారపదార్థాలు తెచ్చి భర్తను రక్షించుకుంటూ, జీవయాత్ర సాగిస్తున్నది.

* * *

భర్తృపదసేవాసక్తయై ఉన్నక్షణంలో, వీధిగడపలోంచి:

'భిక్షాందేహి !'

అనే ధ్వని వినిపించగానే, భర్తముఖంకేసి చూసి గడపలోకి వచ్చింది. ఎట్టయెదురుగా మూర్తీభవించిన బ్రహ్మతేజంతో 'దేవల' నామాంకితుడయిన ఋషి కనిపించాడు. ఆ మహర్షికి నమస్కరించి, సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే తనభక్తికి సంతసించి ఈవిధంగా తన నుద్ధరించటానికి వచ్చాడని భావించి, గబగబ లోపలకువచ్చి :

'స్వామీ, మన అదృష్టంవల్ల మహావైద్యుడొకడు మనయింటికి అతిధిగా వచ్చారు. వారికి ఆతిధ్యం యిచ్చి మనబాధ నివారించుకుందాం'

అన్నది.

శంభుడికి ఆశ కలిగింది. తక్షణం తీసికోనిరమ్మని ఆజ్ఞాపించాడు. ఆమె వినయంగా దేవలునికి అర్ఘ్యపాద్యాలర్పించి ఆసనం చూపించింది.

దేవలుడు ఆమె జరిపే మర్యాదలకు పరితృప్తుడైనాడు. దేవలుని దృష్టి రోగిపై ప్రసరించినది. ఆవ్యక్తికి యింక ఆయుర్దాయం ఉన్నట్టు నమ్మకం కలగలేదు. అయినా ఆమెకు సంతృప్తికలగటంకోసం ముఖంలో ఏ భావాన్నీ వ్యక్తంకానీయక కూర్చున్నాడు.

ఆమె ముఖంలోని దైన్యం దేవలుని హృదయాన్ని కలచివేసింది. కానీ దేవలుడి శక్తికిమించినపని అతనికి ప్రాణదానంచేయటం. చూస్తూం డగానే శంభుడు ప్రాణాలు కోల్పోయేట్లు కనిపించాడు. దగ్గరున్న మూలిక ఒకటితీసి రసంతీసి యిమ్మన్నాడు. మందు ఆమెకు యిస్తూనే దేవలుడు బరువుగా నిట్టూర్చి వెళ్ళిపోయాడు.

అంతలో శ్లేష్మం ప్రకోపించి శంభుడు ఉక్కిరిబిక్కిరయాడు. ఆ సాధ్వి ఓషధీరసాన్నివ్వబోతుండగానే అతని ప్రాణవాయువులు హరించిపోయాయి. ఆమె తనచేతి కంకణాలు విక్రయించి చందన

కాష్ఠాలు తెప్పించి దహనక్రియసాగిస్తూనే సహగమనం చేసింది. ఆమె పాతివ్రత్యఫలంగా గౌరీలోకాన్ని పొందింది.

తరువాయి జన్మలో వాడే కిరాతుడై పుట్టాడు. మరణసమయంలో వేశ్యను మనస్సులో ఉంచుకొన్న కారణంగా ఆవేశ్య కిరాత స్త్రీగా పుట్టి వానినే పెండ్లాడింది.

ఆమెతో కలిసి సంసారనిర్వహణంచేస్తూ, ఉదరపోషణార్థం అనేక ఘోరకృత్యా లారంభించాడు. దారులుకాసి దోపిడీలు, హత్యలు గావిస్తూ తన ప్రియురాలిని లాలించుకుంటున్నాడు.

ఒకనాడు-

శంఖుడనే బ్రహ్మచారి విద్యాపరిపూర్తిచేసికొని, బ్రహ్మక్షేత్రాన్ని సాధించి గోదావరీ, భీమరథి ఆదిగాగల నదులను తరించి, ఈ అరణ్యమార్గంగుండా ప్రయాణం సాగిస్తున్నాడు. నడిచిపోతూన్న బ్రహ్మక్షాని శంఖుని యెదుట భీకరాకారంతో, వికృతవేషంతో, ఖడ్గహస్తుడై నిలబడ్డ డీకిరాతుడు. బ్రహ్మక్షాని శంఖుడు ప్రతిఘటించకుండా వవ్వుతూ నిలబడిపోయాడు. శంఖుని కుండలాలనూ, వస్త్రాలను, ఛత్రాన్నీ, పాదుకులనూ లాక్కుని పొమ్మన్నాడు.

ఆ మండువేసవిలో బ్రహ్మచారి శంఖుడు పాదరక్షలు లేకుండా, ఛత్రరహితుడై నడచిపోసాగాడు. బ్రహ్మతేజం మూర్తీభవించిన శంఖుని చూచేసరికి కిరాతుని హృదయంలో ఏమూలనో దాగిన దయ కరగింది. గబగబ నడచి ఆతనిని సమీపించి పాదుక లిచ్చేసాడు.

అంత శంఖుడు :

'ఓ కిరాతా, మండువేసవిలో పాదుకలు దానంచేసావు. నువ్వు ఎంతటి మహాపాపివయినా ఈసుఖాన్ని నాకు కలుగజేయటం నా పూర్వజన్మ సుకృతం'

అన్నాడు.

కిరాతుని మొదడు కొద్దిగా పనిచేయసాగింది.

'ఓ బ్రాహ్మణుడా, ఏమిటి పూర్వజన్మ, ఆజన్మలో చేసిన సుకృతం అంటావేమిటి ?'

అన్నాడు.

'నాయనా, దాహంతో నాగొంతు తడి ఆరిపోతోంది. కొద్దిగా మంచినీరు త్రాగి ఏచెట్టునీడనయినా విశ్రమించి వివరంగా చెప్తా' నన్నాడు.

కిరాతుడు శంఖుని వెంటబెట్టుకొని సమీపంలోవున్న సరోవరానికి నడిచి, దొన్నెతో నీరు తెచ్చియిచ్చి, పరిసరంలో ఉన్న వెలగ చెట్టుకిక్రా పళ్ళుకోసి ఫలహారంగా యిచ్చి విశ్రమింపజేసాడు.

శంఖుడు కొంత విశ్రాంతి తీసికొని, కిరాతునివైపు తిరిగి ఆతని పూర్వజన్మవృత్తాంతాన్ని వివరిస్తూ 'ఓ కిరాతా, నీవు పూర్వజన్మలో స్తంభనామాంకితుడవు. అయినా సాధ్వీఅయిన నీభార్య దేవలుడనే ఋషికి ఆతిథ్యం యిస్తానంటే అంగీకరించావు. ఆ సుకృతమే ఈజన్మలో నాకు నీచేత పాదుకల నిప్పించింది.

మరణకాలంలో ఔషధంయిస్తూన్న నీభార్య చేత్రివేలు కొరికే సావు. ఆ మాంసఖండం నీ నోటిలోనే ఉండిపోవడం, మంచంమీదనే నీవు మరణించడం కారణాలుగా ఈజన్మలో కిరాతజన్మ, భూశయనం కలిగాయి.

*　　*　　*

ముందుజన్మలో–

కృణుమహర్షి అమోఘుతపోదీక్షలో ఉండగా ఆయన నేత్రాల నుండి రేతస్సు స్ఖలన మవ్వతుంది. దాన్ని ఒకసర్పం త్రింగి మగశిశువును ప్రసవిస్తుంది. అప్పుడే జన్మించిన ఆ శిశువును దగ్గరలో ఉన్న కిరాతుడు తీసికొనిపోయి పెంచుతాడు.

ఋషివీర్యసంభవుడయినా కిరాతసంపర్కకారణంగా వానిలో ఆ లక్షణాలే ప్రవేశిస్తాయి. దోపిడీలు, హత్యలు సాగిస్తూండగా ఒక సమయాన సప్తఋషులు ఎదురుపడతారు. వారిపై కూడా కిరాతుడు తన దండప్రయోగం చేయబోతాడు. అప్పుడు సప్తర్షులు వానిని పిలిచి-

'ఓ కిరాతా దారాసుతపోషణార్థం కదా నువ్వీలా వ్యవహరిస్తున్నావు. నీ పాపంలో వారు భాగం పంచుకుంటారేమో కనుక్కో' రమ్మంటారు.

కిరాతుడు ముఖం వేలవేసుకొనివచ్చి జీవనతరణోపాయం ప్రబోధించమని అర్థిస్తాడు. అప్పుడు వారు తారకమంత్రమయిన 'రామ' నామాన్ని తలక్రిందులుచేసి 'మరా' అని ఉపదేశిస్తారు.

మహాదీక్షతో ఉపాసన సాగించాడు. అచంచలంగా ఉన్న వానిపై పుట్టలు మొలిచాయి. దీక్షాపరిసమాప్తి వేళకు ఋషులు పిచ్చేసి వరుణుని ప్రార్థించి, పుట్టలు కరిగింపజేస్తారు.

ఆ వల్మీకములనుండి వెలువడినవాడే వాల్మీకినామంతో నారద, బ్రహ్మల సహకారంతో శ్రీమద్రామాయణాన్ని ఆదికావ్యంగా అందజేసాడు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

★

వసిష్ఠ

ప్రప్రథమున బ్రహ్మ మానసపుత్రుడుగ ఆవిర్భవించిన వసిష్ఠుడు కాలక్రమపరిణామమున మైత్రావరుణులకు జనించాడు. సూర్యవంశమున జన్మించిన నిమి యాగముచేయ సంకల్పించాడు. యాగమును నిర్వహించవలసిందిగా వసిష్ఠుని ఆహ్వానించాడు. సకాలానికి వసిష్ఠుడు రాలేకపోయాడు. నిమి వేరొకనిని అధ్వర్యునిగా చేసికొని యజ్ఞం ప్రారంభించాడు. నిర్విఘ్నంగా పరిసమాప్తికాబోతున్న సమయానికి వసిష్ఠుడు విచ్చేసాడు. వసిష్ఠునికి ఆగ్రహం కలిగింది. నిమి తనను ఆహ్వానించి ఈవిధంగా చేయటం తిరస్కారసూచకంగా కనపడింది. వసిష్ఠుడు గంభీరస్వరంతో-

"నిమీ ! నీవు సూర్యవంశజుడవు. నేను సూర్యవంశానికి కుల గురువును. సర్వసమర్థుడనైన నన్ను కాదని యజ్ఞం పూర్తిచేసావు. కనక విదేహుడవు కమ్ము"

అని శపించాడు.

ఆహ్వానాన్ని స్వీకరించి సకాలంలో రాకపోగా, అపరాధం తనపై ఉంచి శపించటాన్ని నిమి సహించలేకపోయాడు. నిర్దోషిత్వానికి శిక్షను అనుభవించడానికి నిమి మనస్సు అంగీకరించలేదు. క్షత్రియోచితమైన క్రోధం అతని నావహించింది.

"బ్రహ్మర్షీ ! నిరపరాధినయిన నన్ను శపించి నాకు ఆగ్రహాన్ని కలిగించినందుకు ఫలితంగా మీరుకూడా దేహత్యాగం చేస్తారు"

అని ప్రతిశాపమిచ్చాడు, నిమి.

నిమి శాపం కారణంగా వసిష్ఠమహర్షి ఆదేహాన్ని వదలి ఆగ్నేయ పుత్రుడుగా జన్మించాడు.

బ్రహ్మజ్ఞానియైన వసిష్ఠుడుసైతం సృష్టిచక్రభ్రమణంలో కాలాంతరాల రూపాంతరాలలో అవతరించక తప్పలేదు.

బ్రహ్మ మానసపుత్రుడుగా ప్రథమంలో జన్మించినందువల్ల ఎన్ని జన్మలెత్తినా, అతడు బ్రహ్మర్షులలో అగ్రేసరుడుగానే ఉండగలిగాడు. అతని శక్తి ఎంతమాత్రం క్షీణించలేదు.

* * *

దైవసృష్టిలోనే బ్రహ్మసంకల్పంనుండి సంధ్యాదేవి అవతరించింది. అతిలోకసౌందర్యంతో అవతరించిన సంధ్యాదేవిని చూచినంతలో బ్రహ్మకు, దక్షప్రజాపతికి, వాని సహోదరులకు వ్యామోహం కలిగించటానికి యత్నించాడు మన్మథుడు. మనస్సు చలించినా సర్వజ్ఞుడయిన బ్రహ్మ శ్రుతి విరుద్ధమయిన ఈ మనోచాంచల్యాన్ని గ్రహించి కారణాన్ని అన్వేషించాడు. మదనుని చిలిపితనం గోచరించింది.

"ఆదినారాయణుని కుమారుడవు, సర్వధర్మజ్ఞుడవు అయికూడా వావివరసలు గణింపకుండా నీతిబాహ్యంగా అప్పుడే జన్మించిన స్త్రీపై తండ్రికి, సోదరులకు వ్యామోహం కలిగించావు కనక రుద్రకోపాగ్నిలో భస్మమవుదువుగాక'

అని శపించాడు బ్రహ్మ. అంతతో ఆగక-

"ఇది మొదలుగా జరిగే సృష్టిలో పన్నెండు సంవత్సరాలు దాకా వరకు స్త్రీ కామోపభోగ్యతకు అర్హురాలు కాదు"

అని శాసించాడు. (దక్షాధ్వరధ్వంసానంతరం జరిగిన తపోదీక్షలో శివుని క్రోధానలజ్వాలలకు మన్మథుడు భస్మమగుట కిదియే హేతువు.)

పరిస్థితి ప్రశాంతమయినది. సంధ్యాదేవి సిగ్గుచే తలవాల్చి కొన్నది. తన శరీరసౌందర్యసుషమయే ఈ అనర్థములకు హేతువని క్రుంగిపోయినది.

అపవిత్రభావాలను ప్రకోపింపచేసిన ఈ దేహాన్ని పవిత్రం చేసికొని, త్యజించాలనే సంకల్పంతో బయలుదేరింది. తిరిగి, తిరిగి చంద్రభాగపర్వతాన్ని చేరి తపోధనాన్ని ఉపదేశించే గురువుకోసం అన్వేషణ నారంభించింది.

సంధ్య మానసికభావాలను గుర్తించిన బ్రహ్మ తక్షణం వసిష్ఠుని పిలిచి-

"చంద్రభాగపర్వతంమీద బృహల్లోహితసరోవరతీరంలో తపోదీక్షను అనుగ్రహించే గురువుకోసం పరితపిస్తూన్న సంధ్యకు తపోమార్గం ప్రసాదించు"

అన్నాడు.

ఉత్తరక్షణంలో వసిష్ఠుడు సంధ్య సంచరించే ప్రదేశానికి చేరి నిలిచాడు. సంధ్యాదేవి వసిష్ఠుని వదనంలో బ్రహ్మ తేజస్సును చూస్తూనే సాష్టాంగనమస్కారంచేసి తపోదీక్షను అనుగ్రహించమని వేడింది.

బ్రహ్మాజ్ఞ వసిష్ఠుడు విధివిధానంగా సంధ్యకు నారాయణాష్టాక్షరీ మంత్రోపదేశం చేసాడు.

నిద్రాహారాలు లేకుండా తీవ్రంగా తపస్సు చేయసాగింది సంధ్య. కాలచక్రం పరిభ్రమిస్తూంది. సంధ్య తపస్సు తీవ్రతమ మవుతున్నది. లోకాలన్నీ ఆశ్చర్యచకితము లవుతున్నవి.

ఆ మంత్రానికి అధిష్టానదేవత అయిన శ్రీమన్నారాయణుడు ప్రసన్నుడై-

"సంధ్యా ! నీ తపశ్చర్యకు సంతోషించాను. కావలసిన వరం కోరుకో !

అన్నాడు.

ఇంద్రియగోచరు డయిన శ్రీహరిని సంధ్య ప్రస్తుతించి-

"జగన్నాథా !

నీదర్శనమాత్రం చేత నా పాపాలన్నీ నాశనమయిపోయాయి. నాకు జ్ఞానోదయమయింది. నా కేవాంఛలూ లేవు. అయినా ఒక్క కోరిక ఉంది. అడుగుతాను"

అని జోడించినచేతులపై ఫాలం ఉంచి-

"ప్రభూ, ఈ సృష్టిలో స్త్రీ జన్మించిన దాదిగా కామవాంఛా సమాకృష్టురాలు గాకుండా ఉండే టట్లు చెయ్యి. ఇదే నా వాంఛ."

అన్నది.

మహావిష్ణువు మందస్మితంతో సంధ్యతలపై చేయి ఉంచి-

"సంధ్యా !

జగత్కళ్యాణదాయకమయిన వాంఛను నువ్వు వ్యక్తీకరించావు. విశ్వానికి శాంతి సౌఖ్యాలను ప్రసాదించే మహత్తరమయిన భావం వరంగా యాచించిన నీ కోరిక నెరవేరుగాక. అంతేకాదు జీవితాన్ని నాలుగు భాగాలుగా విభజించి అందులో మధ్య రెండు భాగాలే కామ యోగ్యంగా ఉండేటట్లు చేస్తున్నాను. లోకకళ్యాణదృష్టితో నువ్వు కోరిన కోరిక గాక మరో వరం అడుగు"

అన్నాడు.

సంధ్య హృదయం పులకించింది. ఆమె మనస్సు ఆనందసాగరంలో ఈదులాడుతున్నది. ఆమె నవ్వుతూ-

"మహాశక్తిపురుషా ! నమస్సు. నీదర్శనంకంటె ప్రాణికోటికి ఏంకావాలి ? అయినా నీ ఆజ్ఞానుసారం కోరుకుంటాను."

''సౌందర్య సంభరితమయిన నా యీ శరీరం, కన్నతండ్రికీ, సోదరులకూకూడా కామవాంఛను రేకెత్తించి అపవిత్రమయింది. ఈ దేహాన్ని వదలి మరొక దేహాన్ని ధరించే వరం ప్రసాదించు. నాకు నూతనంగా లభించే జన్మలోకూడా నిత్యయౌవనం, అమితశోభాసౌందర్యం అనుగ్రహించు. నవయౌవన సుందరాంగినయిన నాకు బ్రహ్మవరిష్ఠుని భర్తగా అనుగ్రహిస్తూ, పాతివ్రత్యదీక్షను ప్రసాదించు''

అని తలవాల్చింది.

మహావిష్ణువు మహదానందంతో సంధ్యాదేవి అభీష్టం నెరవేరేటట్లు అనుగ్రహించి వైకుంఠానికి కదిలినాడు.

సంధ్యాదేవి మనసా శ్రీహరికి ప్రణామాలు అర్పించి, శరీరము త్యాగముచేయుటకు సర్వసమర్థురాలైంది. దేహత్యాగానికి అనువైన స్థలముకోసము చూడగా సమీపములో మహాఋషులు లోకకళ్యాణార్థము చేస్తూన్న యాగంలో అగ్నికుండం గోచరించింది. తక్షణం సంధ్యాదేవి పురోడాశ రూపంతో అగ్నిలో ప్రవేశించింది.

మహావిష్ణువు ఆజ్ఞానుసారము అగ్నిహోత్రుడు పురోడాశరూపముతో తనయందు ప్రవేశించెను. సంధ్యాదేవి శరీరాన్ని రెండుభాగములుగా చేసి, సూర్యమండలమునకు చేర్చాడు. ప్రాతస్సాయంసంధ్యలుగా ఆ రెండుభాగాలు ఈనాడు లోకానికి గోచరిస్తున్నవి. సంధ్యా శరీరాన్ని విహావిష్ణువు పురోడాశంగా మార్చడంలో ఒక రహస్యం ఉంది. ఏమంటే అగ్ని మాంసభక్షకుండుకాడు. పురోడాశరూపంలో మాత్రమే స్వీకరిస్తాడు. దాన్ని ఆరగించిన అగ్ని పరమపవిత్రుడు.

ఈవిధంగా దేహత్యాగంచేసిన సంధ్య వేరొకరూపాన్ని ధరించే సరికి ఎదురుగా వసిష్ఠుడు గోచరించాడు. ప్రప్రథమంగా చూచిన వసిష్ఠుడు బ్రహ్మవరిష్ఠుడు కూడావడం సంధ్యకు ఆనందాన్ని కలిగించింది. ఆ

బ్రహ్మర్షినే వరించటానికి సంకల్పించింది. సంధ్య వసిష్ఠుని సమీపిస్తున్న సమయంలో అశరీరవాణి ఇలా పల్కింది.

"బ్రహ్మర్షీ ! సంధ్య మహాసాధ్వి, సృష్ట్యాదియందు ఈమె సర్వ విధాల స్వధర్మనిర్వహణం చేస్తూ, లోకానికి సతీధర్మాన్ని ఆదర్శప్రాయంగా స్థాపించింది. అంతేగాక ధర్మాన్ని నిరోధించలేదు కనుక ఈమె అరుంధతి అనే సార్థకనామంతో పిలువబడుతోంది. సంధ్యాపాణిగ్రహణం నీకు సర్వవిధశ్రేయోదాయకమేకాని, బంధనహేతువు కాదు. ఆదర్శదాంపత్యానికి మిమ్మల్ని ఉదాహరణగా లోకం స్వీకరిస్తుంది."

దివ్యవాణిని ఆకర్ణించిన వసిష్ఠుడు అరుంధతిని పెండ్లియాడి విధి విధానంగా గార్హస్థ్యజీవితాన్ని గడపసాగాడు.

* * *

వసిష్ఠునికి ఇక్ష్వాకువంశ పౌరోహిత్యం పునఃఅనివార్యమయింది. ఆదిలో వసిష్ఠు డీకృత్యానికి అంగీకరించలేదు, పరిపరివిధముల నచ్చ జెప్పి చివరకు బ్రహ్మ యిలా అన్నాడు :

కుమారా !

మర్యాదాపురుషోత్తముడగు భగవానుడు ఇక్ష్వాకువంశమున జన్మిస్తాడు. శ్రీరామచంద్రుడనే పేరుతో జన్మించే ఆ లోకారాధ్యునకు ఆచార్యుడవై అనంతమయిన కీర్తినీ, అలౌకికమయిన ఆనందాన్ని పొందుతావు.'

బ్రహ్మ పలికిన ఈ వాక్కులతో వసిష్ఠుడు సంతృప్తిజెంది ఇక్ష్వాకువంశానికి పౌరోహిత్యపీఠం అలంకరించాడు. నిమితో వ్యతిరేకాభిప్రాయం కలిగిన కారణంగా ఆ వంశంలోని ఒక శాఖతో, వసిష్ఠుడు ఏ సంబంధాన్నీ ఉంచుకోలేదు.

* * *

ఇక్ష్వాకువంశానికి కులగురువై శ్రీరామచంద్రుని జననంకోసం నిరీక్షిస్తూ, అరుంధతీసహితుడై గార్హస్థ్యజీవితాన్ని గడుపుతూన్న వసిష్ఠుని ఆశ్రమప్రాంతానికి ఒకానొకనాడు గాధిసూతుడయిన విశ్వామిత్ర మహారాజు అగణితసైన్యంతో వేటకు వచ్చాడు. వేటలో అలసి వసిష్ఠుని ఆశ్రమాన్ని చేరాడు. సైన్యసమేతుడై విచ్చేసిన విశ్వామిత్రునికి వసిష్ఠుడు రాజోచితంగా మర్యాదలు జరిపి వింపు చేసాడు. తెల్లబోయాడు విశ్వామిత్రుడు. అరణ్యంలో పర్ణశాలలో తపస్సుచేసుకొనే వసిష్ఠుడు రాజోపభోగాలలో ఆతిథ్యం ఎలా ఇవ్వగలిగాడు. విశ్వామిత్రునికి పరిష్కారమార్గం దొరకలేదు.

వసిష్ఠునే ప్రశ్నించాడు. వసిష్ఠుడు మందహాసంచేసి ;

'ఇదంతా నందినీధేనువుయొక్క అనుగ్రహం' అని, సర్వదేవతాకము, ధర్మస్వరూపము అగు నందినీ ధేనువును చూపాడు.

నందినీధేనువు ప్రభావం విన్న విశ్వామిత్రునికి దానివిూద ఆశ జనించింది. కోరవిూసం పై కెగదువ్వుతూ

"వసిష్ఠ మహర్షీ !

నీకు లక్షగోవు లిస్తాను. ఈ నందినీధేనువుని నాకు తోలిపెట్టు. ఇంకా కావలిస్తే నవరత్నాలూ, కాంచనాంబరాలూ యిస్తాను. నీకు కావలసినవి కోరిన తక్షణం యిస్తాను. నందినీధేనువు వదిలెయ్యి అన్నాడు.

వసిష్ఠుడు ఏవిూ చలించకుండా ఉండిపోయాడు. ఒకక్షణం అలా ఉండి 'నందినీధేనువు నా ఆశ్రమం వదలదు' అన్నాడు.

ఈ సమాధానానికి విశ్వామిత్రుని రాజసం ప్రకోపించింది. నందినీధేనువుని రాజ్యానికి తోలుకు నడవమని సైన్యానికి ఆజ్ఞయిచ్చాడు.

మరుక్షణంలో నందినీధేనువువైపు నడిచింది సైన్యం. నందినీ

ధేనువును సైన్యం సమీపించబోయేసరికే దానినుండి అసంఖ్యాక సైన్యం ఆవిర్భవించి, విశ్వామిత్రునిసైన్యాన్ని ఛీకొని చిత్తుచేసింది.

పరాజితుడయిన విశ్వామిత్రుడు పట్టుదలతో పరమశివుని ఉద్దేశించి ఘోరతపంచేసి శస్త్రాస్త్రాలతో వసిష్ఠునిపై దాడివచ్చాడు.

వసిష్ఠుడు భ్రుకుటి బిగించి బ్రహ్మదండాన్ని అభిమంత్రించి ఆశ్రమప్రాంగణంలో ఉంచాడు. విశ్వామిత్రుడు వదిలే శస్త్రాస్త్రాలన్నీ బ్రహ్మదండంలో పరహతాలయిపోతున్నవి.

పరిస్థితిని పరికించిన విశ్వామిత్రునికి బ్రహ్మతేజం అన్నిటికంటె ఘనమయినదనే విశ్వాసం కలిగింది. క్షాత్రతేజాన్ని మించినశక్తిలేదని యింతకాలం తను భ్రమపడుతున్నందుకు చింతించి, విశ్వామిత్రుడు బ్రహ్మతేజాన్ని సాధించటానికి అరణ్యాలవైపు పోయి తపస్సు ఆరంభించాడు.

కొంతకాలం తీవ్రమయిన తపస్సు సాగించి, బ్రహ్మతేజోధురం ధరత్వం సిద్ధించిందనే నమ్మకంతో వసిష్ఠుని ఆశ్రమాన్ని సమీపించాడు.

చండవేగంతోవచ్చే విశ్వామిత్రుని యింగితాన్ని గుర్తించిన వసిష్ఠుడు ఎదుకేగి :

'రాజర్షి ! కుశలమా ?'

అని ప్రశ్నించాడు.

ఈ ప్రశ్న విశ్వామిత్రునికి కశాఘాతంలా సోకింది. తీవ్రసంకల్పంతో, తీవ్రతమదీక్షతో, అనేకకష్టాలకోర్చి తపస్సుచేసివస్తే 'రాజర్షి' అని సంబోధిస్తాడా—వసిష్ఠుడు !

ఉగ్రుడై, ఖడ్గంధరించి వసిష్ఠుని నూరుగురుబిడ్డలను ఊచకోతగా కోసేసి, తన బ్రహ్మర్షిత్వాన్ని ఇప్పటికయినా అంగీకరించమన్నాడు.

చలించలేదు వసిష్ఠుడు.

విశ్వామిత్రుని ప్రవేశవేళ ఏగంభీరత వసిష్ఠుని వదనంలో ఉన్నదో, ఏ చిరునవ్వు ఆ బ్రహ్మర్షి మోమున్పై వెలుగుచున్నదో అది చెన్నుదరగలేము, పన్నె మాంయలేదు.

విశ్వామిత్రుని క్రోధాగ్నికి ఆజ్యధారఅయినది వసిష్ఠుని ప్రవర్తన. ఎలా అయినా వసిష్ఠుని హతమార్చాలని ఆరాత్రి ఆశ్రమ ప్రాంతంలో ఆగిపోయాడు.

ఆకాశంలో నక్షత్రాలన్నీ విశ్వామిత్రుని ఆగ్రహానికి చలించి పోతూన్నట్లు మినుకు, మినుకు మంటున్నాయి. చందమామ మబ్బుల మాటుకు పోతున్నాడు. ప్రశాంతంగాఉన్న వాతావరణంలో విశ్వామిత్రుని ఉచ్ఛ్వాస-నిశ్వాసలు బరిమీదఉన్న కోడెత్రాచు బుసబుస్లా ఉన్నాయి.

ఆసమయంలో పర్ణశాలలో ఏదో అలికిడి వినిపించింది. విశ్వామిత్రుడు చెవి యొగ్గాడు.

'సతీ! పాపం రాజభోగాలనుభవించాల్సిన విశ్వామిత్రుడు ఈ శరద్రాత్రులలో హంసతూలికాతల్పంపై రాణులతో సుఖనిద్రను వీడి పరమశివునిగూర్చి తపస్సు చేస్తున్నాడు. ఆయన ఎంత భాగ్యశాలి'

అని అరుంధతికి వసిష్ఠుడు చెప్తున్నమాటలు విశ్వామిత్రుని చెవులలో పడి, అతనికి అవమానాన్ని కలిగించినది. ఎంతో ద్వేషంతోఉన్న తనను వసిష్ఠు డీవిధంగా అభినందించడంతో అతనిశరీరం కుంచించుకు పోయింది.

ఆ క్షణంలోనే వెళ్ళి వసిష్ఠుని పాదాలపై పడి క్షమాభిక్ష నర్థించాడు.

వసిష్ఠుడు విశ్వామిత్రుని రెండుచేతులతో లేవనెత్తుతూ :

'బ్రహ్మర్షి'

అని, వెన్ను నిమిరాడు.

విశ్వామిత్రుడు వసిష్ఠుని గాఢాలింగనము జేసికొని సంతోష చిత్తముతో కదలిపోయినాడు.

* * *

ఈరీతిగా బ్రహ్మర్షి వసిష్ఠుడు కాలం గడుపుతూండగా ఇక్ష్వాకు వంశంలో పరమేశ్వరుడు శ్రీరాముడుగా అవతరించాడు. ఏ మహాదవ కాశంకోసం నిరీక్షిస్తున్నాడో అది సిద్ధించటంతో మూర్తీభవించిన జ్ఞానరూపమగు జ్ఞానవాసిష్ఠాన్ని శ్రీరామచంద్రున కుపదేశించాడు. వసిష్ఠ సంహితద్వారా కర్మమార్గాచరణలోకంలో సుప్రతిష్ఠం చేసాడు.

లౌకిక, పారలౌకికధర్మాలను సమగ్రంగా గ్రహించి, ఆచరించి లోకానికి మార్గదర్శకుడయినవాడు వసిష్ఠుడు. వైవస్వతమన్వంతరంలో ఆయనకు సప్తర్షిమండలంలో ఆయనకు అచంచలస్థానం ఉన్నది. (మన్వంతరాలలో సప్తర్షిమండలంలో వ్యక్తులు మారటం ఈ వివరణలో వేరొకచోట యిచ్చాం.) స్వేచ్ఛామయుడగు వసిష్ఠుడు ఒకకాలమున వ్యాసుడయినాడు, వేరొకకాలమున పురోహితుడుగ నున్నాడు. ఈ మన్వంతరమున సప్తర్షులలో నొకడు.

పరమశక్తిమంతమయినది వసిష్ఠునిజీవితము.

★

భరద్వాజ

పరమపవిత్రమూ, పరమోదాత్తమూ అయిన భారతీయధార్మిక వ్యవస్థను సుస్థిరంగా సమీక్షించినవారిలో అగ్రశ్రేణికి చెందిన మహర్షి కోటిలో నివాడు భరద్వాజ ఋషి.

అంగీరసగణంలో జన్మించుటయే కాక, ఆగణంలో గోత్రప్రవర్తకులలో ప్రముఖుడుగా కూడ పరిగణనకు వచ్చినవాడు భరద్వాజమహర్షి.

భరద్వాజ మహర్షి, దేవగురుడయిన బృహస్పతికి ఔరసపుత్రుడు; ఇతడు మంత్రద్రష్టలశ్రేణిలో నివాడు. ఈ మహర్షి యొక్క విద్యాసక్తి అసదృశమయినది. వేదములలో భరద్వాజమహర్షిని గూర్చిన ప్రస్తావ యిలా ఉన్నది:

మహావిశ్వంలో జ్ఞానఖని అయిన వేదవిజ్ఞానాన్ని సంపూర్ణంగా అవగాహన చేసికోవాలనే సంకల్పం భరద్వాజునిలో స్థిరపడిపోయింది. ఆ విజ్ఞానాన్ని ఆర్జించే దృఢచిత్తంతో దీక్షగా తపస్సు ప్రారంభించాడు. ఆతని తపోదీక్షకు ప్రకృతి పులకించినది; ఆతని చిత్తశుద్ధికి ప్రజాపతి సంతుష్టచిత్తుడై, భరద్వాజుని యెదుట సాక్షాత్కరించినాడు.

సాక్షాత్కరించిన చతుర్ముఖునికి సాష్టాంగదండప్రణామము లాచరించి, పవిత్రమంత్రములతో స్తుతించి-

"మహాదేవా!

నా అభిమతం నీకు తెలీనిదికాదు- అయినా భిక్షార్థిని కనుక అడగటం నా విధి. నా జీవితప్రమాణం నేటినుండి నూరు దివ్యవర్షాలుండేటట్లు అనుగ్రహించు. ఇది వినా నీనుండి నే నాశించే దేమీలేదు."

అని చేతులు జోడించి, తలవాల్చినాడు.

ప్రజాపతి చిరునవ్వుతో తన అనుగ్రహాన్ని ప్రసాదించి అంతర్ధానుడయినాడు.

అది మొదలు భరద్వాజుడు వేదసంచయాన్ని అధ్యయనం చేయనారభించాడు. అహోరాత్రభేదరహితంగా శ్రుతినే అభ్యసిస్తూ గడపసాగాడు. నెమ్మదిగా దివ్యవర్షశతం పరిసమాప్తి నొందేకాలం సమీపిస్తుండగా, తిరిగి ప్రజాపతినిగూర్చి తపస్సుచేసి, పూర్వమువలెనే మరొక నూరు దివ్యసంవత్సరాలు ఆయుర్దాయం వరంగా గ్రహించాడు.

ఈ పర్యాయంకూడా వేదాధ్యయనానికే ఆయన జీవితాన్ని అంకితం చేసాడు.

మూడోమారుకూడా భరద్వాజుడు నూరు దివ్యవత్సరాలు ఆయుర్దాయాన్ని సముపార్జించుకొని వేదాధ్యయనం చేసాడు; అయినా భరద్వాజమహర్షికి తనివితీరలేదు ; ఆయన విజ్ఞానతృష్ణ చల్లారలేదు; జ్ఞానాన్వేషణలో ఆయన మనస్సు ముందుకే ఉరకలువేస్తున్నది.

పునఃప్రజాపతి నుద్దేశించి తపస్సు చేసాడు. ఈమాడు ప్రజాపతి సాక్షాత్కరించి, భరద్వాజుని మహాదీక్షను తెలిసినవాడయినప్పటికీ, అతనినోటనే అతని వాంఛను ఆకర్ణించాలనే సంకల్పంతో-

"వత్సా!

భరద్వాజ, ఇప్పటికి మూడుపర్యాయాలు దివ్యవర్షశతాన్ని వరంగా తీసికొన్నావు. ఇప్పుడూ నీమనస్సులో అదే కోరిక ఉన్నది. ఈవిధంగా ఆయుఃప్రమాణాన్ని ప్రవృద్ధంచేసికోవటంలో నీ ఆశయం ఏమిటి నాయనా?

అన్నాడు.

భరద్వాజుడు ప్రజాపతి ప్రశ్నకు ప్రహర్ష చిత్తుడై పరిపరివిధముల ఆ మహాదేవుని స్తుతించి.

'జగదారాధ్యా !

నీసృష్టిలోని జీవుల సంకల్పాలు నీ వెరుగనివికావు. అయినా నీకు వినాలనే కుతూహలం కలదు కనుక నా కీ అవకాశాన్ని అనుగ్రహించావు. అందుకు కృతజ్ఞుణ్ణి.

'మహాదేవా !

జీవితపరమార్థాన్నీ, సృష్టిరహస్యాన్నీ సుబోధకంచేసి ; మనో వికాసాన్నీ, యథార్థజ్ఞానాన్నీ కలిగే వేదరాశిని సంపూర్ణంగా అధ్యయనం చేయాలనే సంకల్పంతోనే నీవిధంగా కృషిచేస్తున్నాను. నా ఆశయాన్ని సఫలీకృతం చేయటానికి నీకన్న సమర్థు లెవరు దేవా'

అని వినయవినమితోత్తమాంగుడయినాడు, భరద్వాజమహర్షి.

ప్రజాపతి, భరద్వాజుని పలుకులను ఆసక్తితో ఆకర్ణించి, చిరునవ్వు మోమున రాజిల్ల :

'వత్సా'

నీ సంకల్పం ఉదాత్తమయినదేకాదు, పరమపవిత్రమయినది కూడా. ఈ భువనభవననిర్మాణరహస్యంతో, దాని యథార్థరూపాన్ని అవగాహన చేసికోవడానికి వేదమే ఆధారం. సృష్టికార్యాన్ని నాకు ప్రబోధించి, కర్తవ్యం నిర్దేశించినది వేదమే.

అయితే, నాయనా—అనంతమయినది వేదం. ఇదిగో యిలా చూడు. మహాపర్వతసదృశంగాఉన్న వేదరాశిలో నువ్వు ఈ దివ్యవర్ష శతత్రయంలో సాధించినది మూడు పిడికెళ్ళ మాత్రమే. ఈ ప్రకారంగా నువ్వు దివ్యవర్ష సహస్రాల ఆయుర్దాయాన్ని సాధించుకున్నా వేదాన్ని సమగ్రంగా అభ్యసించలేవు...!

అని ఒక్కక్షణం ఆగి, భరద్వాజుని కనులలోకి చూచినాడు.

ప్రజాపతి వాక్కుల నాలకించిన భరద్వాజుని వదనము తెల్లబోయినది; ఆయన కనులలో నిరాశా, నిస్పృహాలు గోచరించినవి. తలవాల్చినాడు.

భరద్వాజుని హృదయ మాందోళన నందసాగినది. జన్మమే వ్యర్థమనిపించినది.

ప్రజాపతికి భరద్వాజుని స్థితితోపాటు, మనస్సంక్షోభమును సమగ్రముగ అవగతమయినది. ఆమహర్షి రక్తనాళాలలో మసలుచున్న జిజ్ఞాసేచ్ఛ ప్రజాపతినే కదలించినది. ప్రజాపతి రెండు మూడుక్షణము లాస్తే నిలబడి:

'భరద్వాజా!

నీ మనస్సంక్షోభము నా కవగతమయినది. అయివను అనంతమయిన వేదవిజ్ఞానమును సమగ్రముగ ఏ జీవియు గ్రహించు సావకాశము లేదు. లేకపోయినను వేదసారమును, యే తత్పరమార్థమును గ్రహించుటకు తగిన మార్గమును నీ కుపదేశించెదనని చతుర్ముఖప్రజాపతి బ్రహ్మవిద్యోపదేశముచేసి అంతర్ధాతు డయినాడు.

భరద్వాజుడు బ్రహ్మవిద్య నుపాసించి సర్వజ్ఞు డయినాడు.

ఇది భరద్వాజమహర్షిని గూర్చిన వేదకథ.

* * *

ఈవిధంగా భరద్వాజమహర్షి తన జీవితపరమార్థసాధనార్థమై కొంతకాలం కృషిచేసినా, జీవితాన్ని ఆత్మశ్రేయస్సుకేగాక లోకకళ్యాణార్థం కూడా వినియోగించిన ఘట్టాలనేకాలున్నవి. మహాయుగాలను అధఃకరించి, కాలమహాస్రవంతికి యెదురీది ప్రపంచానికి ఆదర్శప్రాయమూ, సామాన్యులకేగాక అసామాన్యులకున్నూ ప్రాతఃస్మరణీయం

అయిన మహాపురుష జీవితధ్యేయం లోకకళ్యాణమే అవుతుంది. లోక కళ్యాణం జీవితపరమార్థంగా సాగినవారే అనుదిన స్మరణీయులవుతారు.

బ్రహ్మజ్ఞానియైన భరద్వాజమహర్షికూడా తనజీవితాన్ని లోక కళ్యాణానికి ఏవిధంగా అంకితం చేశాడో ఈ క్రింది వృత్తాంతాలు వివరిస్తాయి.

* * *

ఒకానొకనాడు భూమండలం సమర్థుడయిన చక్రవర్తి లేక అశాంతికి లోనుకావలసివచ్చింది. అరాజకచ్ఛాయలు అక్కడక్కడ అంకురిస్తున్నవి. దుర్భిక్షం తలయెత్తే సూచనలు గోచరిస్తున్నవి. ప్రపంచం ఉల్లోలకల్లోలమయేస్థితి యేర్పడుతున్నది. అటువంటి సందర్భంలో సమస్తదేవతల అభ్యర్థనానుసారం ప్రజాపతి భరద్వాజుని ఆహ్వానించి:

'ఓ మహర్షి !

లోకం అశాంతికి నిలయమైపోతూన్నది. మానవులలో దానవత్వం ప్రకోపిస్తూన్నది. సర్వ జీవరాశిలో ఉత్కృష్టమయిన స్థానంకల మానవుడు భ్రష్టుడయిపోతున్నాడు. దీనికంతటికీ సమర్థుడయిన పరిపాలకుడు లేకపోవటమే ప్రధానహేతువు. బ్రహ్మజ్ఞానివయిన నీవు ఈ సమయంలో మానవజాతిని ఉద్ధరించవలసి ఉంది. ఈ విషాద సన్నివేశంలో, ఈ విపత్కరవేళ నీవు మానవజాతిని సన్మార్గనిర్దేశం చేసి వారిని పతనస్థితినుండి పరమోత్కృష్టపథానికి మరలించాలి. నీవొకడవే దానికి సమర్థుడవు. సర్వజ్ఞుడవయిన నీకు అనంతరకర్తవ్యం అవగాహన అయి ఉంటుంది'

అని పలికాడు.

భరద్వాజమహర్షి ప్రజాపతి పలుకులను శ్రద్ధాసక్తులతో ఆకర్ణించి, తక్షణం కర్తవ్యాన్ముఖుడయినాడు.

మానవజాతిని ఉద్ధరించే మహాసంకల్పం ఆక్షణంలోనే భరద్వాజుని మనస్సులో నెలకొన్నది. ఆయన అద్వితీయప్రతిభతో భూమండలానికి ఆధిపత్యంవహించి; సస్యశ్యామలంచేసి మానవజాతిలో సౌభాగ్యాన్ని నెలకొల్పి, శాంతిమయం చేసినాడు.

* * *

ఒకానొకప్పుడు వ్యాసపదవి నలంకరించినవాడు భరద్వాజ మహర్షి –

వైవస్వత మన్వంతరంలో సప్తర్షిమండలంలో స్థానం కలవాడు భరద్వాజమహర్షి –

భరద్వాజమహర్షియొక్క అద్వితీయసంయమనశక్తికి లభించిన అధికారపీఠాలివి.

* * *

భూమండలంలో అనారోగ్యం ప్రబలి, రోగాలు ప్రకోపిస్తూన్న సమయంలో, కనులారచూచిన ఆ మర్భరస్థితి ఆయన హృదయంలో వేదన రేకెత్తించింది. ప్రపంచాన్ని రోగవిముక్తంచేసి ప్రాణికోటికి ఆరోగ్యాన్ని ప్రసాదించే దృఢసంకల్పంతో స్వర్గలోకానికి వెళ్ళినాడు. స్వర్గంలో కర్మపథాభ్యాససమేతంగా అష్టాంగయుతమయిన ఆయుర్వేదాన్ని అభ్యసించి వచ్చి, ప్రయోగాత్మకంగా అతి ఆదిగాగల మహర్షులకు బోధించి భువనభవనానికి ఆరోగ్యమూలకమయిన ఆనందాన్ని సమకూర్చే ఆయుర్వేదాన్ని అందజేసి, నిత్యజీవితాన్ని సంతోషమయం చేసిన ఘనవైద్యుడు భరద్వాజమహర్షి.

* * *

ఈవిధంగా ప్రజాజీవితానికి శాంతి సౌఖ్యాలను ప్రసాదించిన భరద్వాజమహర్షి మానవజీవితాన్ని సుఖప్రదంచేసే సంకల్పంతో ధార్మికవ్యవస్థను పరివర్తించే కర్మకాండను ప్రవర్తింపజేసాడు; దీనినే విజ్ఞులు భారద్వాజసూత్రాలు అనే పేరుతో వ్యవహరిస్తున్నారు. ఇంతే

కాక శిక్షా, వ్యాకరణ, జ్యోతిషాది శాస్త్రాలలోకూడా భరద్వాజ మహర్షి కొన్నిగ్రంథాలను ప్రాసినట్లు కనబడుతుంది.

విశేషించి అర్థశాస్త్రాన్ని ప్రముఖంగా వివేచన సలిపి, ఒకానొక బృహద్గ్రంథాన్ని ప్రాసినవా డీబుషి ; అర్థశాస్త్రాన్నే కాక రాజ్యాన్ని రక్షించడాని కత్యవసరమయిన ధనుర్వేదాన్ని సులభంగా బోధపడే రీతిలో వివరించాడు. రాజ్య సంరక్షణకూ, శాంతి స్థాపనకూ ధనుర్వేదాన్నీ, రాజ్యాంగం సక్రమంగా నిర్వహింపబడటానికి అర్థశాస్త్రాన్నీ ప్రాసిన భరద్వాజమహర్షి వేదమధనఫలితంగా లభించిన విజ్ఞానసర్వస్వాన్ని నిక్షేపిస్తూ యంత్రసర్వస్వము అనే గ్రంథాన్ని విరచించి అందజేసాడు.

* * *

ఈయంత్రసర్వస్వాన్ని బోధానంతవృత్తితో బరోడాలో ప్రకటించాడు. యంత్రసర్వస్వం సంపూర్ణంగా లభ్యపడనందున కాబోలు అందులోని "విమానప్రకరణం" బోధానంతవృత్తితో ప్రచురింపబడింది. ఆగ్రంథంనుండి జిజ్ఞాసువుల తృప్తికోసం కొన్నిశ్లోకాలు ఉదహరిస్తున్నాం.

నిర్మథ్య తద్వేదాంబుధిం భారద్వాజో మహామునిః
నవనీతం సముద్ధృత్య యంత్రసర్వస్వరూపకమ్॥
ప్రాయచ్ఛత్ సర్వలోకానా మిాప్సితార్థ ఫలప్రదమ్
తస్మిన్ చత్వారింశతికాధికారే సంప్రదర్శితం॥
నానా విమాన వైచిత్ర్య రచనా క్రమబోధకమ్
అష్టాధ్యాయైర్విభడితం శతాధి కరణైర్యుతమ్॥
సూత్రైశ్చ పంచశతైరుక్తం
వ్యోమయాన ప్రధానకమ్
వైమానికాధికరణ ముక్తం
భగవతా స్వయమ్॥

వేదములనెడి క్షీరసాగరమును మథించి భరద్వాజమహర్షి నవనీతరూపమయిన యంత్రసర్వస్వమును సాధించాడు.

ఆ యంత్రసర్వస్వమున నలుబదవ అధికరణములో విమానప్రకరణమును నిబంధించినాడు.

ఈప్రకరణమున యెనిమిది అధ్యాయములు కలవు. నూరు అధికరణములతో ఆకాశయానసంబంధమయిన సర్వవిషయములను ఇందు నిక్షేపించినా డామహర్షి.

ఏవం విధాయ విధివ న్మంగళాచరణం మునిః
పూర్వాచార్యాం శ్చతద్గ్రంథా న్ద్వితీయశ్లోకతోఽబ్రవీత్॥
విశ్వనాథోక్త నామాని
తేషాం వక్ష్యా యథాక్రమమ్
నారాయణః శౌనకశ్చ
గర్గో వాచస్పతి స్తథా॥
చాంక్రాయణీ ర్గుండినాథశ్చేతి శాస్త్రకృత స్స్వాయమ్
విమానచంద్రికా వ్యోమయాన తంత్రస్తథైవ చ॥
యంత్రకల్పో యానబిందుః ఖేటయాన ప్రదీపికా
తథైవ వ్యోమయానార్క ప్రకాశశ్చేతి షట్ర్కమాత్॥
నారాయణాది మునిభిః ప్రోక్తాని జ్ఞానవిత్తమైః

భరద్వాజమహర్షి గ్రంథారంభమున మంగళాచరణముచేసి, (భారతీయసాంప్రదాయానుసారము గ్రంథరచనకే కాదు ఏ కృషికయినను ప్రారంభమున మంగళాచరణ మవశ్యము. ఏతత్కార్యము నిర్విఘ్నముగ పరిసమాప్తినందుటకే యీ మంగళాచరణ సంప్రదాయము ప్రవేశపెట్టబడినదని ఆర్షమతము.) తన గ్రంథమునకు పూర్వమందు వెలసిన విమానయాన, నిర్మాణములనుగూర్చి ప్రాసిన ఆచార్యులను, వారి గ్రంథములను పేర్కొనుచున్నాడు.

నారాయణుడు

శౌనకుడు

గర్గుడు

వాచస్పతి

చాంక్రాయణి

దుండినాథుడు

ఈ ఆచార్యులను విమానశాస్త్రములను భరద్వాజునికి పూర్వము వ్రాసినవారు. వారిగ్రంథముల నామములనుకూడ భరద్వాజుడే యిట్లు పొందుపరచినాడు.

విమానచంద్రిక

వ్యోమయానతంత్రము

యంత్రకల్పము

యానబిందు

ఖేటయానప్రదీపిక

వ్యోమయానప్రకాశిక

ఈవిధముగా తాను వ్రాయ సంకల్పించిన విషయానికి సంబంధించిన పూర్వగ్రంథాలను పరిశీలించిన భరద్వాజ మహర్షి విమాన పరిభాషను ఇలా వివరిస్తున్నాడు.

పృథివ్యా ప్స్వంతరిక్షేషు
ఖగవద్వేగతస్స్వయం
యస్మాన్మర్త్యాఽ భవేద్గంతుం
సవిమాన ఇతి స్మృతః॥

భూమి, ఆకాశము, జలము- ఈ మూడింటియందున పక్షివలె వేగముగ చరించు శక్తిగలదానికి విమాన మందురు.

'రహస్యాఽ జ్ఞోధికారీ'

అని భారద్వాజ సూత్రము.

అనగా విమానసంబంధమయిన సర్వరహస్యములను తెలిసిన వాడే విమానమును నడుపుటకు అధికారి అయి ఉండును. ప్రస్తుతకాల మున "పైలట్" అని వ్యవహరించుచున్న దీతనినే.

వైమానిక రహస్యాని యానిప్రోక్తాని శాస్త్రతః
ద్వాత్రింశదితి తాన్యేవ యూన యంతృత్వ కర్మణి॥
యేతేన యానయంతృత్వే రహస్య జ్ఞానమంతరా
సూత్రాధికార సంసిద్ధి ర్నేతి సూత్రేణ వర్ణితమ్॥
విమానరచనే వ్యోమాకోహణే చాలనే తథా
స్తంభనే గమనే చిత్రగతి వేగాది నిర్ణయే॥
వైమానిక రహస్యాన్న జ్ఞానసాధన మన్తరా.
యంత్రోధికార సంసిద్ధి ర్నేతి సమ్యగ్వినిర్ణితమ్॥

విమానగతవిషయ సర్వస్వము నెరిగినవాడే విమానచోదనాధి కారి యని పేర్కొన్న యనంతరము విమానవిశేషములను వివరించు చున్నాడు. విమానశాస్త్రములందు ముప్పదిరెండు రహస్యములు వివ రింపబడినవి. ఈ ముప్పదిరెండింటిని విమానచోదకుడు ఎరిగి తీరవల యును.

ప్రప్రథమమున విమానమును నిర్మించుట.
సుష్ఠుగా రూపొందిన విమానమును ఆకాశములోనికి నడపుట.
ఆకాశమున నున్నదానిని నడుపుట.
నడచుచున్న విమానమును అదేస్థలమున కదలకుండ స్థంభింప జేయుట.
మరల పుంగమింపజేయుట.
గమనములో చిత్ర విచిత్రగతుల నెరపుట.
మందగమనము, వేగగమనము ఆదిగాగల గమనభేదములు

విమానచోదకునకు తెలిసియే తీరవలయును.

(ఈ గమనవిశేషము లే కాక విమానరచనయందును భేదము లున్నవని స్పష్టపరచుచున్నాడు. ఆధునిక వైజ్ఞానకుని మెధను అధికరించురీతినే భారతీయ యార్ష విజ్ఞాన పరిశోధన మెట్టియంతస్థులకు పోయినదీ దీనిమూలమున తెలియగలదు.)

కృతక రహస్యానామ-విశ్వకర్మ ఛాయాపురుషమను మయాది శాస్త్రానుష్ఠానద్వారా తత్త చ్ఛక్త్యనుసంధానపూర్వకం తాత్కాలిక సంకల్పానుసారేణ విమానరచనాక్రమ రహస్యమ్!

ముప్పదిరెండు విమానరహస్యములలో మూడవది కృతకరహస్యము. విశ్వకర్మ ఛాయాపురుషమను మయాదిశాస్త్రానుష్ఠానముల ద్వారా ఆయా ధాతుక్రియలయందు సమర్థుడగుచున్నాడు. అట్టి అనుభవమును పొందినపిమ్మట నూతనము లయిన విమానములను నిర్మించవచ్చును.

గూఢ రహస్యానామ వాయుతత్వప్రకరణోక్తరీత్యా వాతస్తంభాష్టమపరిధి రేఖాపతస్య యాసా, వియాసా, ప్రయాసాది వాతశక్తిభిః సూర్యకిరణాంతర్గత తమశ్శక్తి మాకృష్య తత్సంయోజన ద్వారా విమానాశ్చోదన రహస్యం.

అయిదవది గూఢనామకమయిన రహస్యము. వాయుతత్వ ప్రకరణమునందు చెప్పబడినరీతి ననుసరించి వాతస్తంభనముయొక్క యెనిమిదవ పరిధిరేఖలో, అచ్చటి యాసా, వియాసా, ప్రయాసాది వాయుశక్తులద్వారా సూర్యకిరణములయం దంతర్భూతమై యుండు అంధకారశక్తుల (తమశ్శక్తి) నాకర్షించి విమానమునకు నిబంధించినచో ఆవిమానము ఇతరు లెవ్వరికిని గోచరముకాదు.

* * *

అపరోక్ష రహస్యానామ శక్తి తంత్రోక్త
రోహిణీ విమ్యత్ప్రసారణేన విమానాభి

ముఖస్థ వస్తూనాం ప్రత్యక్ష నిదర్శనక్రియారహస్యమ్ ॥

తొమ్మిదవది అపరోక్ష రహస్యము–

శక్తితంత్రమున చెప్పబడిన విధి ననుసరించి సూర్యకిరణములం దలి రోహిణీ విద్యుత్ప్రసారణమున విమానమునకు ఎదుటనుండు ప్రతి వస్తువును ప్రత్యక్షమున దర్శించవచ్చును.

* * *

"సార్వగమన రహస్యానామ–

దండ, వక్రాది సప్తవిధప్రాతరిశ్వార్క కిరణశక్తీ
వాకృష్య, యానముఖస్థ వక్రప్రసారణ కేంద్రముఖే
ని యోజ్య పశ్చాత్తదా హృత్య శక్త్యుద్గమనానాళే
ప్రవేశయేత్ తతః తత్కీలీ చాలనాద్వి మానస్య
సర్వవద్గమనక్రియా రహస్యం"

సార్వగమనమనునది యిరువదిరెండవ రహస్యము.

దీని ననుసరించి దండ, వక్రాది సప్తవిధములగు వాయువులనూ, సూర్యకిరణములయొక్క శక్తులనూ ఆకర్షించి విమానముఖమునందు వక్రముగ భ్రమించు కేంద్రమున ప్రవేశపెట్టినచో, అది తిరిగి ఉద్గమన నాళములోనికి పోయి అవసరానుసారము 'కీల'ను చలింపజేసినచో ఆ విమానము సర్వమువలె నడచును.

పరశబ్దగ్రాహక రహస్యానామ:

సౌదామినీకలోక్త ప్రకారేణ విమానస్థ శబ్దగ్రాహకయంత్రం ద్వారా పరవిమానస్థ జనసంభాషణాది సర్వశబ్దాకర్షణ రహస్యమ్–

ఇరువది అయిదవది–పరశబ్దగ్రాహక రహస్యము–

సౌదామినీకళయందు నిర్దేశింపబడినప్రకారము, విమానములం దుండు శబ్దగ్రాహకయంత్రము మూలమున ఇతరవిమానములలోని

జనులు గావించుకొను సంభాషణలను స్పష్టముగా ఆకర్షించి గ్రహించ వచ్చును.

శబ్దాకర్షణరహస్యమునుమాత్రమే కాక ఈ గ్రంథము రూపా కర్షణరహస్యమునుగూడ వివరించినది.

రూపాకర్షణ రహస్యానామ-

విమానస్థ రూపాకర్షణయంత్రంద్వారా పరవిమానస్థిత వస్తు రూపాకర్షణ రహస్యమ్-

ఇరువది ఆరవప్రకరణమున చెప్పబడినట్లు రూపాకర్షణ యంత్ర మును విమానమునందుంచుకొన్న యెడల ఎదుటి విమానములోని వస్తు వులనన్నిటిని చూడవచ్చును.

ఇరువది ఎనిమిదవప్రకరణములో దిక్ప్రదర్శనరహస్యమును వివ రించుచు ఇట్లనినాడు:

దిక్ప్రదర్శన రహస్యానామ:

విమానముఖకేంద్ర కీలీ చాలనేన దిఙ్నాంపతి యంత్ర

వాలపత్ర ద్వారా పరయానా గమన దిక్ప్రదర్శన రహస్యమ్-

ఈ రహస్యానుసారము విమానముఖమునగల కీలిని చలింప జేసినచో, దిఙ్నాంపతియను యంత్రమందలి ముల్లు ఇతరవిమాన మేదిక్కునుండి వచ్చుచున్నదీ సూచించగలదు.

ఇందలి చమత్కార మేమన యిది అయస్కాంతమువలె దిక్కు లను సూచించునదిగాక పగిసరములనుండివచ్చు విమానముల గమన మును సూచించునది. కొందరు దీనిని తెలియక 'దిక్సూచి' (Magnet) యని భ్రమపడినారు.

స్తబ్ధక రహస్యానామ:

విమానోత్తర పార్శ్వస్థ సంధిముఖనాలా

దపస్మార ధూమం సంగ్రాహ్య స్తంభన యుక్త

ద్వారా తద్ధూమ ప్రసారణాత్ పరవిమానస్థ
సర్వజనానాం స్తబ్ధీకరణ రహస్యమ్-

ముప్పదియొకటవ రహస్యము స్తబ్ధకమును వివరించుచున్నది.

ఈ రహస్యానుసారము విమానమునందలి యుత్తరపార్శ్వమున నున్న సంధిముఖమను పేరుగల నాళముగుండా అపస్మారకమను పేరుగల ధూమము నాకర్షించి, స్తంభనయంత్రముద్వారా యితరుల విమానముపై విడిచిన చో ఆ విమానములోనివారందరూ స్మృతిని కోల్పోవుదురు. (ఇది ఒకవిధమగు భాష్పవాయువుగా మనము గ్రహించవచ్చును.)

కర్షణ రహస్యానామ :

స్వ విమాన సంహారార్థం పరవిమాన
పరం పరాగమనే విమానాభిముఖస్థ
వైశ్వానరనాళాంతర్గత జ్వాలినీ ప్రజ్వాలస్థ
కృత్వా సప్తశీతలింగ ప్రమాణోష్టం యథా
భవేత్ తథా చక్రద్వయ కేలీచాలనాత్
శత్రువిమానో పరి వక్తులాకారేణ తచ్ఛక్తి
ప్రసారణద్వారా శత్రువిమాన నాశనక్రియా
రహస్యమ్-

కర్షణ మనునది ముప్పదిరెండవ రహస్యము :

ఈ రహస్యములో - తనవిమానమును ధ్వంసముచేయుటకై శత్రువిమానము వచ్చునపుడు తన విమానముఖమునకల వైశ్వానర మను పేరుగల నాళముననుండు జ్వాలినిని (ఒకవాయువు) ప్రజ్వలింప జేసి యెనుబదియేడు లింగముల ప్రమాణముగల (ఈ లింగశబ్దము ఉష్ణ పరిమితిని తెలియజేయు పారిభాషికవాచకముగా తోచును. 'డిగ్రీ' అను శబ్దము దీనిని బోలినదేమో !) ఉష్ణమును రెండువైపులనుండు చక్ర ద్వయములందుండు కీలలను చలింపజేయుచు, ఈ ఉష్ణమును గోళాకార

ముగ వదలినచో అది శత్రువిమానములను, ఎట్టివానినయినను-ధ్వంసముచేయును.

(భరద్వాజమహర్షి ప్రణీతమయిన యంత్రాసర్వస్వమందలి విమానప్రకరణంలోని ఈ అంశాలను పరిశీలించిన వైజ్ఞానికులకే విస్మయముకలిగి తీరును. విమానగమనభేదములను, రక్షణవిధానములను అత్యద్భుతముగ నిది నిరూపించినది. దీనిని స్థూలముగ చూచినవారికయినను ఆధునికవైజ్ఞానికుని పరిశోధన ఆర్ష బుద్ధియెమట తల వాల్చవలసినదేయని తోచకమానదు.) ఇట్టి శాస్త్రము లింకను ఎన్నియో బయల్పడవలసియున్నది. వానిని భారతీయులు సక్రమముగ నవగాహనమొనర్చుకొని ఆర్ష వాణి ఔన్నత్యమునకు ముగ్ధులగు శుభసమయము కొరకు ప్రాజ్ఞలోకము నిరీక్షించుచున్నది.

భరద్వాజ మహర్షి ప్రస్తావన వాల్మీకమున ప్రప్రథమమునగ గోచరించుచున్నది. విశ్వసాహితీప్రపంచంలోని సారస్వతోపాసకులకు 'ఓం'కారప్రణవముగా లభించిన 'మా నిషాద ప్రతిష్ఠాం త్వం' అను శ్లోకము వాల్మీకి మహర్షి నోటినుండి వెలువడు క్షణాన ఆలకించినవాడు భరద్వాజ మహర్షి. ఆప్రకరణమున భరద్వాజుడు వాల్మీకి శిష్యులలో ప్రముఖుడుగ గోచరించును. మహాకావ్యమయిన శ్రీమద్రామాయణము నామూలచూడముగ వాల్మీకినోట ఆలకించు భాగ్య మీమహర్షికే లభించినది.

ఇంతమాత్రమే గాక రామాయణమందలి ఋషిప్రపంచమున గూడ ఈతనికి విశిష్టస్థానము కలదు.

"భ ర ద్వా జ వి ం ద"

శ్రీమద్రామాయణమున నిదియొక ప్రత్యేకఘట్టము. అయోధ్యాకాండమందలి ఈ వింతనుగూర్చి విజ్ఞులు విశేషముగ ముచ్చటింతురు. ఇది భరద్వాజుని ఉచితజ్ఞతనే గాక భారతీయార్ష సంప్రదాయ

మును చక్కగ ప్రదర్శించును. ద్వంద్వబద్ధమయిన మానవజీవితమును సమగ్రముగ నిక్షేపించిన మహాకావ్యముగ దేశదేశముల అంజలు లందు కొన్న రామాయణ కావ్యములోని ఈఘట్టమునూడ అట్టి దానికే ప్రోద్బలముగ గోచరించును.

పట్టాభిషేకమునకు జరిగిన ప్రయత్నము లన్నియు వ్యర్థము లయ్యేను. వసిష్ఠునంతటివాడు పట్టాభిషేకమునకు నిర్ణయించిన లగ్నము రామునకు వనవాసమును కల్పించినది. దుష్టశిక్షణ, శిష్టరక్షణ పదాశయముగ అవతరించిన రాముడు నిర్విచారముగ సింహాసనము నధిష్ఠించు యువరాజువలెనే అరణ్యానునకు పయనమయినాడు; రాము నితో సీత, లక్ష్మణుడు బయలుదేరిరి.

అయోధ్యను వీడి ప్రయాణము చేసి చేసి వారు ప్రప్రథమమున భరద్వాజుని యాశ్రమమును ప్రవేశించిరి. భరద్వాజు డంతకు ముందే వారికి ఆతిథ్యసంభారములను సమకూర్చుకొనినాడు. ఆ సంభారము లందు రాజమర్యాదను సూచించున వేవియును లేవు. అరణ్యవాసము చేయు ఋషులకు, మునులకు జరుగు స్వాగతమర్యాదలే సీతారామ లక్ష్మణులకు జరిపినాడు. వారికివలెనే శయ్యాసౌఖ్యమును సమకూర్చి నాడు. అంతేకాని అయోధ్యాధీశుడయిన చక్రవర్తికి మర్యాదలేమియు జరుపలేదు.

ఈ ఘట్టమాత్రమే వాల్మీకమున నున్నచో వాల్మీకికి కవి ప్రపంచమున విశేషప్రాముఖ్య ముండకపోయెడిది. "భరద్వాజ విందు" ప్రత్యేకఘట్ట మయ్యేడిదికాదు. అయోధ్యాకాండమందే వాల్మీకి ద్వితీయసన్నివేశమునుకూడ చేకూర్చినాడు; అదియే భరద్వాజ మహర్షి యొక్క లోకమర్యాదానుశీలనము ప్రస్ఫుటముగ కనపరచినది.

* * *

రాము డరణ్యమున కేగినాడు- దశరథుడు పుత్రశోకమున (ఋషి శాపవశమున) అసువులు వీడినాడు. తక్షణమే భరతునికి కబురు నడిచినది. మేనమామల యింటనున్న భరతుడు హుటాహుటి అయో ధ్యకు తరలివచ్చినాడు. విషయసర్వస్వమెరింగి, తండ్రికి అంత్యక్రియలు నెరవేర్చినాడు.

అనంతరము అయోధ్యాపురీ ప్రజాసమూహముతో రాముని రాజుగా తీసికొనివచ్చుటకు బయలుదేరినాడు.

సైన్యముతో, అంతఃపుర పరివారముతో బయలుదేరిన భరతు నికి అల్లంతదూరమున భరద్వాజుని ఆశ్రమము గోచరించినది. ఆమహర్షి కీర్తి కాంత అప్పటికే దేశమెల్లెడల విహరించియుండుటవలన భరతుడు ఆ మహర్షి దర్శనము తనకు శోభావహమని తలపోసి సైన్యమును అచ్చ టనే విడి వసిష్ఠులతో భరద్వాజుని సమీపించినాడు. భరద్వాజుడు పరమానందభరితహృదయుడై చక్రవర్తికి మహర్షి జరుపవలసిన గౌరవ మర్యాదలను జరిపి, చిరునవ్వుతో:-

'భరతా,

ఈ భరద్వాజు డాశ్రమవాసియనియు, నీకునూ నీ పరివారమునకునూ ఆతిథ్యము నీయలేడని తలపోసితివా? నాయనా, మహర్షి చక్రవర్తికి ఉచితమర్యాదలు జరుపలేనివాడుకాడు. తక్షణమే నీసైన్య మును, పరివారమును కొనిరమ్ము'

అని ఆజ్ఞాపూర్వకముగ ఆదరరీతిని పలికినాడు.

మహర్షి వాక్యమున కెదురుచెప్పుశక్తి మహారాజుకు లేదు. దేశ క్షేమమే కాక లోకక్షేమమును కోరి తపోదీక్షసాగించు మహర్షి వాక్యము మహారాజుకు శిరోధార్యమే.

భరతుడు తలవాల్చి కదలినాడు.

భరద్వాజుడు అగ్నిహోత్రుని ఆహ్వానించి, అగ్నికార్యము గావించి అగ్నిని తృప్తిజేసి సర్వదేవతలను ఆహ్వానించినాడు.

భరతుడు సపరివారుడై వచ్చుసరికి భరద్వాజుని ఆశ్రమపరిసర మంతయు రాజధానీనగర మయిపోయినది. సచివ, సామంత, మంత్రి, పురోహిత, సైనికులకు అర్హానుసారముగ వసతు లేర్పడినవి. అంతి పురివారికి ప్రత్యేక 'నగరి' యేర్పడినది. షడ్రసోపేతముగ విందు జరిగినది. గంధర్వాప్సరోగణము కళావిన్యాసముతో భరద్వాజుని అతిథి మండలమునకు నయన, శ్రవణతర్పణము జరిగినది.

* * *

ఈ రెండుఘట్టములను అనుశీలించినవారికి ఈఘట్టములలోని వైశిష్ట్యము ద్యోతకమగును. అరణ్యవాసమునకు వచ్చిన రామునికి జరుగవలసినట్లే జరిపినాడు మహర్షి. రాజ్యాధిపతి అయిన భరతునికి జరుగవలసినట్లే జరిపినాడు భరద్వాజమహర్షి.

ఈ మహర్షి మరల యుద్ధకాండాంతమున దర్శనమిచ్చును. ఎల్లరు సుఖముగా అయోధ్యకు వచ్చినపు డిచట ఈ మహర్షిని సందర్శింతురు—

ద్రోణాచార్యులు

భారతీయ మహాకావ్యమయిన శ్రీమద్రామాయణమున విశిష్ట స్థానముగల ఈ భరద్వాజ మహర్షి కుమారుడే భారతీయేతిహాసమయిన భారతము నందలి ద్రోణాచార్యుడు.

లోకైకవీరుడయిన పరశురాముని శిష్యుడయిన భీష్మాచార్యుని మన్ననలంది కురు-పాండవులకు ధనురాచార్యుడైనవాడు ద్రోణుడు. ఈతడును పరశురాముని అంతేవాసిగణములోనివాడే. పరశురాముని కి ద్రోణుడు శిష్యుడయిన విధానము భారతమున రమణీయముగ నున్నది. ఈ ద్రోణాచార్యుడు తండ్రి అయిన భరద్వాజునివలెనే ధనుర్విద్యలో విశిష్ట సాంప్రదాయములను నెలకొల్పి ధనుర్విద్యాపారగులకు ప్రాతఃస్మరణీయు డయినాడు. ఈ ఆచార్యుని పుత్రుడయిన అశ్వత్థామ చిరంజీవి అను విషయము భారతమును పఠించినవారికి తోచును.

వేదములతో ఆవిర్భవించిన ఆంగీరసగణ మింతటి విశిష్టస్థానమును సముపార్జించుకొన్నది. బృహస్పతి, భరద్వాజుడు, ద్రోణుడు, ఈగణములోనివాడే. (ఈ వ్యాఖ్యాతయు భారద్వాజ సగోత్రీకుడే అయినందుకు గర్వించుచున్నాడు.)

స్వాయంభువమనువు

క్షీరసాగరంలో శేషతల్పంపై యోగనిద్రలో ఉన్న శ్రీమన్నారాయణుని నాభినుండి ఆవిర్భవించిన కమలగర్భమందు ప్రభవించినవాడు ప్రజాపతి. ప్రజాపతి కర్తవ్యం సృష్టి. ప్రప్రథమంగా సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులను సృష్టించాడు. వీరు నలువురూ వేదాంతమార్గగాములు కావటంతో మరీచ్యాది మహర్షులను సృష్టించాడు. వీరుకూడా నివృత్తిమార్గాన్నే అనుసరించారు.

అప్పుడు బ్రహ్మ స్వాయంభువుని సృష్టించి అతనికి శతరూప అనే పేరుగల కన్యతో పరిణయంచేసి సృష్టి సాగించమన్నాడు. బ్రహ్మ సృష్టికర్తగనక. మానసికసృష్టి చేయగలిగాడు. కాని అది అందరికీ సాధ్యంకాదు. అందుచేత స్త్రీ-పురుషులను వేరువేరుగా సృష్టించాడు.

స్వాయంభువుడు శతరూపంతో సాంసారికజీవితాన్ని సాగిస్తూ సృష్టిజరపటానికి భూమండలం కావాలని బ్రహ్మను అర్థించాడు.

బ్రహ్మ శ్రీమన్నారాయణుని ప్రార్థించాడు. శ్రీహరి వరాహ రూపంలో ప్రభవించి మహార్ణవంనుండి భూఖండాన్ని పైకితీసాడు.

స్వాయంభువునికి సర్వాధికారాలూ యిచ్చి భూమండలానికి అధిపతినిచేసి శతరూపతో సృష్టికార్యం సాగించుమని బ్రహ్మ ఆదేశించాడు.

నదీ, నద, పర్వతారణ్యాలతో ఉన్న భూమండలాన్ని పర్యటించి మేరుపర్వతశిఖరం చేరి మహాతపోదీక్ష వహించాడు.

స్వాయంభువుని తపస్సునకు తృప్తి చెంది పరమేశ్వరుడు సాక్షాత్కరించాడు. సాక్షాత్కరించిన ఈశ్వరునకు చేతులు జోడించి-

"జగన్నాథా!

నాలో సత్త్వగుణమే వృద్ధిపొందేటట్లు చెయ్యి. నిరంతరం నా మనస్సు నీయందే లగ్నంకావాలి. నాకు లభించిన అధికారం దుర్వినియోగం కాకుండా చూడు. నాచే సృజింపబడేది సత్వగుణసంపన్నమయినదే కావాలి"

అని యాచించాడు.

పరమేశ్వరుడు అనుగ్రహించాడు.

* * *

శతరూపతో స్వాయంభువుడు సాంసారికవ్యాపారం ఆరంభించాడు. సర్వసౌఖ్యాలతో దాంపత్యజీవితాన్ని ఆనందంగా గడుపుతూన్న ఆదంపతులకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడుఅనే కుమారులూ, ఆకూతి, దేవహూతి, ప్రసూతి అనే కుమార్తెలూ జన్మించారు.

ప్రియవ్రత, ఉత్తానపాదులు భూమండలాధిపత్యం వహించికూడా సత్వగుణప్రధానులై, భగవంతునియందు బుద్ధిని నిలిపి జన్మను సార్థకం చేసుకున్నారు.

అందును ప్రియవ్రతుడు రాజ్యకాంక్ష లేకపోయినా బ్రహ్మ ఆదేశానుసారం రాజ్యాధిపత్యం వహించి ధర్మపూర్వకాన పరిపాలిస్తూండగా, రాత్రి, పగలు అనే భేదం లేకుండా చెయ్యాలని కోరిక కలిగింది.

సూర్యునితో సమానమయిన తేజస్సు కలవాడయిన ప్రియవ్రతుడు రథాధిరోహణంచేసి భూభాగంలో చీకటిప్రాంతాల పయనిస్తూ

ఏడుకోజులు భూగోళానికి చీకటిలేకుండా చేసాడు. ఈవార్త తెలిసిన బ్రహ్మ వచ్చి ప్రియవ్రతుని ఆ ఉద్యమంనుండి విరమింపజేసాడు. ఈ ఏడుకోజులలోనే ప్రియవ్రతుడు భూమండలాన్ని ఏడుఖండాలుగా విభజించాడు.

స్వాయంభువుని రెండవకుమారుడయిన ఉత్తానపాదుని కుమారుడే మహాభక్తుడు ధ్రువుడు.

స్వాయంభువుడు ఆకూతిని రుచియను మహర్షికి వివాహం చేసాడు. ఆమెయందే భగవంతుడు యజ్ఞరూపంలో ఆవిర్భవించాడు.

కర్దమప్రజాపతిని పెండ్లియాడిన దేవహూతి కపిలుని కన్నది. కపిలుడు సాంఖ్యశాస్త్రప్రవర్తకుడు.

ప్రసూతిని దక్షునికిచ్చి పరిణయంచేసాడు. ఈ ప్రసూతి సంతానంవల్లనే జగత్తులో సృష్టి ప్రవృద్ధమయింది.

ఈరీతిగా స్వాయంభువమనుపుమూలమున వృద్ధిచెందిన జీవరాసి అంతా మనువుయొక్క సంతానమేకావడంవల్ల సర్వభూతసోదరత్వం అనాడే ఏర్పడింది.

తన సంతానం సర్వకాలాలయందు ధర్మపరమయినదిగా ఉండాలనేసంకల్పంతో స్వాయంభువమనుపు శ్రుత్యర్థములను మననం చేసికొంటూ స్మృతిని నిబంధించాడు. మానవకళ్యాణాన్ని ప్రబోధించే ఈగ్రంథానికి మనుస్మృతి అనిపేరు. నేటికీ అది మానవునకు సన్మార్గాన్ని నిర్దేశిస్తూనే ఉన్నది.

డెబ్భైయొక్క మహాయుగాలు భూమండలాధిపత్యం పహించి, అనన్యసౌందర్యవతి అయిన శతరూపతో సర్వభోగాలూ అనుభవించినా తృప్తి అనేది లేకపోవటం స్వాయంభువునికి ఆశ్చర్యంతో విచారం కూడా కలిగించింది. ఆ విచారణలో ఐహికవాంఛలూ, భోగలాలసత్వం

జీవితానికి ధ్యేయాలు కాదనీ, అవి సుఖాభాసలేననీ నిశ్చయించు శాశ్వతానందాన్ని కలిగించే మోక్షమార్గాన్వేషణార్థియై అష్టాక్షరీమంత్రానుష్ఠానం ఆరంభించాడు.

సర్వవిధముల అర్ధాంగి యనదగిన శతరూప పతినే అనుసరించింది. ఆ దంపతుల తీవ్రతపోదీక్షకు మెచ్చి శ్రీమన్నారాయణుడు దర్శనమిచ్చాడు. ఆ పురాణపురుషుని పలువిధముల స్తుతించి–

"పురుషోత్తమా !

నీదర్శనంకంటె గోరదగినది లేదు. కానీ నీవంటి కుమారుణ్ణి కనాలని కోరికగా ఉంది"

అన్నారాదంపతులు.

అందుకు శ్రీహరి చిరునవ్వుతో "వైవస్వతమన్వంతరంలో మీరు దంపతులే కౌసల్యా-దశరథులుగా జన్మించినప్పుడు నేను మీ గర్భాన అవిర్భవిస్తాను" అని అదృశ్యుడయ్యాడు. ఆ దంపతులు ఆనందమనస్కులై తరలినారు. ఇది సృష్ట్యాది స్వాయంభువమనుచరిత్ర.

స్వారోచిష

తెలుగు సాహిత్యంలో భారత, భాగవతాల అనంతరం అంతటి కీర్తిప్రతిష్ఠల నార్జించుకొన్నది ఈ మనువుయొక్క చరిత్రమే. తెలుగు పంచకావ్యములలో ఈ స్వారోచిషమనుసంభవము ప్రథమస్థాన మలంకరించినది. ఈతని కింత ప్రాముఖ్యం లభించుటకు కారణము ఈ మనువు చరిత్రలోని ప్రత్యేకతయే కారణము.

ఈ మను (వు). చరిత్రను వ్రాసి సాహితీవిహాయసమున ధ్రువ తారగ నిల్చిన మహాకవి అల్లసాని పెద్దనామాత్యుడు. రసవత్తరముగ, ఉదాత్తకావ్యముగ యేమనువు చరిత్రయు వ్రాసినట్లు కనబడదు; ఒక్క స్వారోచిషునకే ఆగౌరవము దక్కినది. సాహిత్యపీఠము నలంకరించిన ఈ మనుచరిత్ర ఆంధ్రులకు అవశ్యపఠనీయము. ఆంధ్రప్రబంధములకే ఈ మనుచరిత్ర ఆదర్శమయినది. శబ్దసౌకుమార్యంలో, భావగాంభీర్యాన్ని సంతరించుకొన్న మనుచరిత్రమీద విమర్శకు లెన్నియేని ప్రశంసలు వ్రాసినారు, వ్రాయుచున్నారు. ఎన్నిమారులు చదివినను ఎపో ఒక నూతనత్వము దివ్యసౌందర్యముతో మనలను పులకింపజేయును దీ మనుచరిత్ర.

ఈ మనుచరిత్రము ప్రప్రథమమున మార్కండేయ మహర్షి అమృతవాణినుండి వెలువడినది; అదియే మార్కండేయ పురాణమున అక్షరబద్ధమై ఆచంద్రతారార్కమయిన కీర్తి నార్జించుకొన్నది. ఆ మనువు చరిత్రను సంక్షిప్తముగా పరిస్తున్నాను. (రసోపాసకులు ఆంధ్రప్రబంధమునే చవిచూతురుగాక.)

మనువ్రులలో ప్రథముడే గాక ప్రముఖుడయిన స్వాయంభువుని గాథను తెలుపుచున్న అనంతరం స్వారోచిషమనువు చరిత్రను ఆకర్షించ

టానికి కుతూహలపడుతూన్న మునులను చూచి మార్కండేయుడు కంఠం సవరించి యిలా ప్రారంభించాడు.

. వినిర్మలోదకాలతో ప్రవహించే వరుణానది యొడ్డున అరుణాస్పదమనే గ్రామం ఉండేది. ఆగ్రామంలో పుకరాంక, శశాంక, జయంత, వసంతులను గూర్చి లేఖలలో ఓడించుటకు సమర్థమయిన శరీరసౌందర్యము గల బ్రహ్మనిష్ఠాగరిష్ఠుడయిన ఒకానొక బ్రాహ్మణుడు నివసించేవాడు. ఆ మహాపురుషుని పేరు ప్రవరుడు; ఈ ప్రవరనామము అన్వర్థము. ఋగ్యజుస్సామాథర్వణ వేదములు, శిక్షా, జ్యోతిష, కల్ప, నిరుక్త, వ్యాకరణ, ఛందశ్శాస్త్రములు, మీమాంసాదులు అతనికి కరతలామలకము. అట్టి బ్రాహ్మీమయమూర్తికి అనుకూలవతి అయిన అర్ధాంగి దొరకుటయే ఆయనకు మహాభాగ్యము. సదా భర్తకనుసన్నలలో మెలగుచు, ఆయన ఇంగితమును గుర్తించి ప్రవర్తించుటలో ప్రవరగృహిణికి సాటిలేరు. ఆ గృహాలక్ష్మి ప్రవరుని శిష్యులను కన్నబిడ్డలవలె చూచెడిది; ఇంటికివచ్చు అతిథి అభ్యాగతులకు భోజనభాజనాదులను సమకూర్చుటలో ఆమె వేడినిట్టూర్పునయిన విడిచి ఎరుగదు. అర్ధరాత్రి అతిథులు వచ్చినను పరమానందముతో లేచి వారికి భోజనసదుపాయములను సమకూర్చినది. భారతీయార్షధర్మములను యథాక్షరముగ జరుపుటలో ప్రవరునకు ధర్మపత్నియే అయినది ఆ "అన్నపూర్ణ".

ప్రవరుడును నప్రతిగ్రహీతగా జీవితమును సాగించుచున్నాడు. "ఏభూపాలు డీవచ్చినఁ సాలగ్రామము" కూడ స్వీకరించియెరుగడు. ఈ మహాబ్రాహ్మణునికి దేశాటనకౌతూహలము మాత్రము అప్పుడప్పుడు మనసులో ఏమూలనో కదలుచుండెడిది. తన గృహమునకు పిచ్చేసియు విద్వాంసులయిన అతిథులు దేశమునందలి విచిత్రములను అతిశయోక్తులతో వివరింపుచుండగా ప్రవరుని మనస్సు ఆప్రదేశములను దర్శింప ఉవ్విళ్ళూరెడిది.

పవిత్రతీర్థములందు స్నానమాడవలెనను సంకల్పము, దివ్య క్షేత్రములను దర్శింపవలెనను కోరిక, పరమేశ్వరుని సృష్టివైచిత్రి నవలోకింపవలెనను కుతూహలము ప్రవరుని మనసులోనే జడలుగా అల్లుకొన్నవి.

ఇట్లుండ నొకశుభదినమున ఒకానొక సిద్ధుడు ప్రవరుని గృహమునకు అతిథిగా విచ్చేసినాడు. విధ్యుక్తముగా ఆ సిద్ధునికి మర్యాదలు జరిపి భోజనానంతరమున ఇష్టాగోష్ఠి సలుపుచుండగా సిద్ధుడు తాను దర్శించిన క్షేత్రములు వాని మాహాత్మ్యమును వర్ణింపసాగినాడు. ప్రవరుని మనసులో బీజప్రాయముగ నున్న యూహా కొందరితోడి సంభాషణలతో అంకురించి, పల్లవించినది. ఈ సిద్ధుని ప్రసంగ మా పల్లవముల నడుమ కోరకములను వెలయించినది.

అనుకూలవతి అర్ధాంగి అనురాగము, పార్వతీ-పరమేశ్వరులవంటి మాతా-పితరులసేవ ప్రవరుని ఇల్లు కదలనిచ్చుటలేదు. కాని నేటి ఈ సంభాషణము ప్రవరుని నిలువనీయలేదు.

మహాభాగా! తాము వయసున చిన్నలయ్యు ఇన్ని దేశముల నెట్లు తిలకించిరో చెప్పుడు. అంతుల కేదేని ఉపాయమున్న నాకు వివరింపుడని ప్రార్థించినాడు ప్రవరుడు.

సిద్ధుని మోమునపై స్మితశ్రీ రేఖలు ప్రవరుని హృదయములోని కోరకములకు దోహదములై వికాసోన్ముఖము చేసినవి.

"ఓ బ్రాహ్మణకుమారా!

నీ హృద్గతవాంఛ నాకవగతమయినది. నీ కర్మానుష్ఠానము, నీ అతిథిసపర్యాదరము నన్ను తృప్తుని చేసినవి. నాకు నీయందు కరుణ కలదు. కావున యిదిగో, ఈ సిద్ధౌషధము నిచ్చుచున్నాను. ఈ లేపనమును పాదములకు పూసికొని, కన్నులు మూసి ఎటకు పోవలెనన్న నచటికి మరుక్షణమున పోవచ్చును. మనోవేగముతో నీ లేపనము పనిచేయును. దీనిని నీ కిచ్చుచున్నాను. నీకోరిక తీర్చుకొనుము"

అనినంత, ప్రవరుడా లేపనమును శ్రద్ధతో స్వీకరించి, ఆక్షణమే పాదములకు పూసికొని, హిమాలయములను చూడవలె ననుకొన్నాడు.

అనుకొన్నాడో లేదో అంతలోనే ఆ భూమిసురుడు "అంబర చుంబిశిరస్సనర్ఘ్యశిఖరీపటలముహుర్ముహుర్ముక్తరదభంగ మృదంగ తరంగనిస్వన స్ఫుటనటనానుకూల పరిఫుల్ల కలాపకలాపిజాలముక్త కటకచరత్కరేణు కరకంపితసాలము శీతశైలముక్త" చూచినాడని పెద్దనగారు వర్ణించినారు.

ప్రపంచమందలి పర్వతశ్రేణికే తలవంపులు కలిగించిన ఉన్నత శిఖరములతో నొప్పారు హిమాలయమునందలి సౌందర్యమును, ఆ చరియలలో ప్రవహించు సెలయేళ్ళను, సెలయేళ్ళ పొంతనున్న వివిధ తరులతానికుంజములను, నికుంజములందు క్రీడలుసలుపు మృగసంతతులను, మృగసంతతులపై నెక్కి విలాసములాడు పక్షిసంతతులను, పక్షిసంతతికి గీతములనునేర్పు కిన్నరకాంతలను, కిన్నరకాంతల శరీరలావణ్యమును ప్రతిబింబించు మంచుకొండను తనివిదీరక చూచుచున్నాడు ప్రవరుడు.

చూచుచున్న ప్రవరుని పాదములకు పూయబడిన లేపనము క్రింది మంచులో కలిసిపోయినది. సాంధ్యకాంతులు పడమటి కొండ మీద అలముకొంటూండగా ప్రవరుడు ఇంటికి పోవాలనుకున్నాడు. మనస్సులో సంకల్పం కలగగానే అతను ఇంటికి చేరుకోవాలి, కానీ పాదలేపము లేదని ప్రవరునికి తెలీదు. తడివిచూసుకున్నాడు, లేదు. పాపం! ఆ ప్రాంతాలలో ఎవరయినా జనం కనిపిస్తే వరుణానదీతీరాన ఉన్న అరుణాస్పదపురానికి దారి తెలుసుకుందామని తిరుగుతూండగా ఓ చల్లని గాలి అతనిమీదుగా కదిలిపోయింది. ఆగాలివాసనలో కస్తూరి వాసనను అగ్గిరించే కర్పూరపువాసన సోకగా ఆ పరిసరంలో తాంబూలచర్వణం చేసే స్త్రీ ఉన్నదని గ్రహించాడు. ఆ సుగంధం వచ్చే మార్గాన్ని అనుసరించి యెదురునడిచాడు. కొన్ని అడుగులు వేసేసరికి అల్లంతదూరంలో ఒక పోకచెట్టుక్రింద పీణవాయించుకుంటూ కూర్చున్న

స్త్రీమూర్తి గోచరించింది. మరికొన్ని అడుగులు వేసాడు. దివ్యసౌందర్యవతి అయిన ఆస్త్రీ చటుక్కున వేదికదిగి పోకచెట్టునాటున నిలబడి, తొంగి తొంగి చూడసాగింది. ప్రవసుడు యౌవనప్రకోపం ఏయీ లేకుండా ఆమెను సమీపించాడు. ఇరవైవసంతాల యౌవనంతో వికసించిన ఆమె శరీరాంగాలేవీ ప్రవసుని కన్నులను కదలించలేదు. రెండు, మూడు క్షణాలు వరూధిని ప్రవసుని కవ్వింపజూచింది. ప్రయోజనం లేకపోయింది. లేకపోగా ప్రవసుడామెనుద్దేశించి-

"ఓ యువతీ, నువ్వెవ్వరవు? ఒంటరిగా ఈ మంచుకొండమీద ఎలా ఉంటావు? దీనినిండా భయంకరమయిన మృగాలుకూడా సంచరిస్తున్నాయే? నీకిక్కడ తోడుకూడా ఎవరూ లేనట్టున్నారు"

అని మానవసహజమయిన దయార్ద్రహృదయంతో ప్రశ్నించాడు.

వరూధిని జారేపైటను సరిజేస్తూ-

"ఓ బ్రాహ్మణోత్తమా,

నాపేరు వరూధిని. ఊర్వశి, మేనక, తిలోత్తమ, ఘృతాచి, రంభ నా చెలికత్తెలు. నేను అప్సరస్త్రీని. ఈప్రాంతం మాకు విహారభూమి. విలాసార్థం ఇక్కడకు వచ్చిపోతూ ఉంటాం. రాళ్ళు కరిగేటట్టు పాడగల సంగీతము మాకు కులవిద్య. అమరావతిలో కొలువు"

అని వంకర ఓరచూపులు సాగించింది.

ప్రవసుడు నిశ్చలంగా నిలబడి-

"సంతోషం. నీకు శుభమగుగాక. గ్రహస్థితి సరిగా లేక నేనీ హిమాలయాన్ని చూడవచ్చాను. ఇప్పుడు చూస్తే ప్రొద్దు వాలుతూన్నది. సూర్యుడు అస్తమించకుండా నేను మాఊరు చేరుకొని అగ్నిదేవుణ్ణి ఆరాధించుకోవాలి. దయతో మా నగరానికి దారిచెప్పు"

అన్నాడు.

వరూధిని చెట్టుచాటునుండి ఈవలకు వచ్చి ప్రవరుని కెదురుగా నిలబడి, చిరునవ్వు నవ్వుతూ, శృంగారచేష్టలతో అతనిని తిలకిస్తూ-

"ఓ భూసురవర్యా,

చెంపకు చేరెడేసి కనులవాడవు. దారి కనిపించుటలేదటయ్యా. పైగా వచ్చిన దారికదా. ఏదో ఒంటిగా ఉన్న ఆడదాన్నికదా అని ఏదో చులకనగా మాట్లాడా లనుకుంటున్నట్టుంది మీవరస"

అని విలాసంగా కనుబొమలు తిప్పుతూ, ముక్కు-మీదకు చూపుడువేలు నడిపింది.

ప్రవరుడు కొద్దిగా చకితుడయ్యాడు. తెల్లబోయి చూస్తూ, యజ్ఞోపవీతాన్ని సరిజేసుకున్నాడు.

ఒక క్షణం అలానే చూచి వరూధిని-

"ఓ బ్రాహ్మణా !

ఇంతటి సౌందర్యం కలవాడవు ; అంతకు తగిన ప్రతిభ నీవదనం మీద శోభిస్తున్నది. బ్రహ్మతేజస్సు మూర్తీభవించిన నీ శరీరసర్వస్వం నన్ను ఆకర్షిస్తున్నది స్వామీ. ఇక్కడ ఈ గంగాలహరీ ప్రాంతంలో, ఎంతో చక్కగా పెరిగిన లవంగలనలీ నికుంజాలలో యెలప్రాయంతో ఉన్న నావంటిదాన్ని విడిచి, ఏమిటో మీపల్లెలో పటకూటీనానికి వెడతానంటావేమిటయ్యా"

అన్నది.

దానికి ప్రవరుడు మౌనమే సమాధానంగా యిచ్చాడు. వరూధిని కొద్దిగా కించపడ్డది. కన్ను లప్పగించి-

"ఓ విప్రవరా !

అడ్డదారులు దేనికి ? నువ్వుచేసే కర్మకూ, యజ్ఞానికీ స్వర్గంలో లభించే ఫలాన్ని ఇక్కడే యిస్తాను రమ్మంటుంటే అలా చేతులడ్డంపెడ తావేమయ్యా. ఎందుకయ్యా సుకుమారమయిన శరీరాన్ని కర్మకాం

డతో హింసింపచేస్తావు. ఇక్కడ కస్తూరి, కర్పూరం, చందనం, గొజ్జంగి నీకు ఎప్పటికప్పుడు కొంగ్రొత్తవి లభిస్తవయ్యా. నిత్యయౌవనంతో ఉండే వధూధిని నీకు సేవచేయాలని కతూహలపడుతున్నది.'

అని యెన్నో సుఖాశలు కల్పించింది.

చలించలేదు ప్రవరుడు.

ప్రవరుడు చలించకపోవటమేకాదు, ఆమె ప్రసంగానికి అసహ్యాన్ని సూచిస్తూ తల ప్రక్కకు తిప్పుకున్నాడు.

ఒక్కసారి వధూధికి తన సౌందర్యంమీద అసహ్యంకలిగింది. అప్సరోభామినీజనంలో అత్యంత సౌందర్యవతినన్నే అహంకారంతో చరించే ఆమెకు ప్రవరుని ప్రవర్తన యెంతో బాధను కలిగించింది. సౌందర్యసంజనితమయిన అహంకారం గట్టిదెబ్బ తిన్నది. అయినా తొలుకొని, కొంత సంబాళించుకొన్నది. ఈలోపునే ప్రవరుడు–

'ఓ దేవకాంతా, నువ్వు చెప్పే తుచ్ఛసుఖాలు మీసాలమీద తేనెలాంటివి. నేను శాశ్వతమయిన బ్రహ్మానందంకోసం జీవితాన్ని సాగిస్తున్నాను. వృధాగా నన్ను వేధించి నువ్వు శ్రమపడకు. నీకు పుణ్యముంటుంది, నాకు దారిచెప్పు!'

అన్నాడు.

శతవిధాల యత్నించింది. సహస్రవిధాల వధూధినిని మార్చ యత్నించాడు. మాటలతో ప్రయోజనం లేదనుకొన్న వధూధిని ప్రవసుని కౌగిలించుకొని పెదవులు పైకెత్తి ఆశగా అతనిముఖంలోకి మెసపు చూపులు పోనిచ్చింది.

ప్రవరుడు విప్రవరుడే అయినాడు. రెండుచేతులతో ఆమె బాహుద్వయాన్ని గట్టిగా నెట్టేసి, తల ప్రక్కకు తిప్పుకున్నాడు. వధూధిని నేల మీదకు జారిపోయి, కన్నులు నీరుంచుకుని, ఒళ్ళు దులుపుకుంటూలేచి, జాలిగా అతన్ని చేరి దీనంగా ఏమో అనబోయింది.

అప్పటికే ప్రవరుడు అగ్నిని ధ్యానించటంలో బుద్ధిని కేంద్రీకరించాడు. తనమనస్సు నిర్మలమయినదీ, సత్సంకల్పయుతమయినదీ అయితే, తనబుద్ధి యెన్నడూ విధిని అతిక్రమించనిదయితే, వైదికకర్మలయందు తనకు నిజమయిన విశ్వాసంఉంటే సూర్యాస్తమయం కాకుండా యింటికి చేరుకుని కర్మకాండను ముగించుకోగలననుకుంటూ అగ్నిహోత్రుణ్ణి ప్రార్థించాడు. మరుక్షణంలో ప్రవరుడు గృహం చేరుకున్నాడు. (అంతే! ఈప్రవరుని కింక ఈ పునుసంభవంలో నిమిత్తం ఉండదు.) అక్కడనుంచి వరూధినీ విరహం ఆరంభమవుతుంది. చెలికత్తెలు పరిపరి విధాల ఊరడిల్లచేస్తారు. ఆమె మనస్సులో ముద్రితమైఉన్న ప్రవరుని రూపురేఖలు ఆమెకు ఆశ్వాసన కలుగనీయకపోగా ఆవేదనను అధికం చేస్తున్నవి.

ఇతఃపూర్వమే వరూధినిని ప్రేమించి విఫలమనోరథుడయిన 'కలి' అనే పేరుగల గంధర్వుడు జరిగినకథను పూర్తిగా తిలకించి, తన కోరిక ఫలించే సావకాశం యేర్పడిందనుకున్నాడు. తక్షణం ప్రవరుని వేషం ధరించాడు. మరునాడుదయం వరూధిని ప్రవరునివీడిన ప్రాంతానికి వచ్చేసరికి ఆమె కల్లంతదూరంలో ప్రత్యక్షమయ్యాడు. ఒక్కసారిగా వరూధిని మనస్సుప్పొంగిపోయింది.

చరచర ప్రవర్ణి (మాయాప్రవర్ణి) సమీపించింది. ఆమె చూపులలోని బలమయిన కోరికనుగన్న గంధర్వప్రవరుని గుండె గుబ గుబలాడినది. అయినా కొంత నిగ్రహించుకుని ఆమెవైపు తిరిగి:

'ఓ దేవవనితా! నిన్నా, నీస్థితినీచూస్తే నాకు జాలికలుగుతోంది. అందుచేత నిన్ను బాధపెట్టి వెళ్ళటానికి నామనస్సు అంగీకరించలేదు. పరులను హింసించినందువలన వచ్చే పాపం నన్ను కదలనివ్వలేదు. అయితే ఇక్కడ ఒక నియమంవిధించబడుతుంది. మా దేశాచారానుసారం సంభోగసమయంలో స్త్రీ కన్నులు మూసుకొని ఉండాలి.

ఆవిధిని నువ్వు అంగీకరిస్తే నీతో నేను సుఖంగా కాలం గడపగలను'

అన్నాడు.

ఏవిధంగా అయినా ప్రవరుని పొందునుకోరే ఆమె ఈ గంధర్వ ప్రవరుని కోరికను నిస్సంకోచంగా అంగీకరించింది. (కామరూపు లయిన వారలకు సంభోగాదిసమయాలలో స్వస్వరూపం రావటమే గంధర్వ ప్రవరుని నియమానికి కారణం) ఆ ప్రకారం వానితో సంసారంసాగించి కొంతకాలానికి వరూధిని గర్భవతి అయింది.

వరూధినికి నెలలునిండువేళ గంధర్వప్రవరుడు సాకులుచెప్పి ఆమెను వీడి పోయెను. వరూధిని కుమారుని కన్నది. ఈవార్త విన్న మునులు వచ్చి ఆబాలునిచూచి దివ్యకాంతులతో నొప్పుచున్న ఆతనికి స్వారోచి యని నామకరణము చేసిరి.

స్వారోచి శుక్లపక్షచంద్రునివలె దినదినప్రవర్ధమానుడై చరించు చుండ వరూధిని మాతృహృదయము మొంతమో పొంగిపోయినది. అంత నాతనికి విధివిధానమున ఉపనయనము గావించి దివ్యమంత్రసంబంధము లగు అస్త్రములు నేర్పబడెను. వేదములను, శాస్త్రములను అభ్యసించి మహాప్రతిభావంతు డాయెను. ధనుర్వేద మాతనికి కరతలామలక మయినది.

ఈ స్వారోచియే విశ్వకర్మచే నిర్మింపబడిన మందరాద్రి సమీప నగరమున కిరాతజనులు కొలుచుచుండ రాజ్యపాలన మారంభించెను. ఒకనా డొక శబరుడు వచ్చి ఆప్రాంతములలో ఘాతుకమృగముల బాధ విపరీతమగుచున్నదని తెలుప స్వారోచి విల్లమ్ములు తీసికొని వేటకు బయలుదేరెను. వేటతో చాలసేపు గడచినది. ఎంతోదూరమట్లు పోయిన స్వారోచికి ఒకానొక స్త్రీ ఆర్తరవము వినబడి ఆగిపోయినాడు. అంత అతిసుందరవతిఅయిన ఒక నారీమణి ఆతనిని సమీపించి దీన వాక్కులతో రక్షింపుమని వేడ స్వారోచి ఆమెవృత్తాంత మడిగెను.

అంత నామె తన నొకదాక్షసుడు వెన్నాడి తిరుగుచున్నాడని తెల్పి, తాను ఇందీవరాక్ష డను గంధర్వుని కుమార్తెనని యు, తనపేరు మనోరమ అనియు, కళావతి-విభావతి అను పేర్లుగల చెలికత్తెలతో విహరించుచు ఒకనాడొక పొదలో అస్వగతు డయిన మునిని చూచి ఆతనిని తాకినంత ఆమునిష్ఠ చెడి కోపముతో తనను కొట్టెనని యు, అప్పుడు చెలికత్తెలు ఆమునిని ఉద్దేశించి చాలపరుషముగా పలుక వారిని క్షయ రోగగ్రస్తులను కమ్మని శపించినాడు. అప్పుడే నాకు రాక్షసుని బాధయు తగిలినది. అతడు నన్ను వెంటాడుచున్నాడు. నీకు నేను అస్తహృదయ మనువిద్యను ప్రసాదించెదను. ఇది శివునివలన మావంశమునకు ప్రాప్తించినది. నీవు సంకోచింపక ఈవిద్యను స్వీకరించి శత్రునాశన మొనర్పుము, అని పలుకుచునే ఆతని అంగీకారమును గ్రహించి దాని నుపదేశించి భయముతో నిలబడినది. ఆసమయమునకే భీకరాట్టహాసముతో రాక్షసుడు ప్రవేశింప వానితో ఘోరయుద్ధముచేసి, యింతలో వచ్చిన తనసేననుగూడ వానిపై కురికించెను. కొంతయుద్ధము జరిగినంత స్వారోచి ఆగ్నేయాస్త్రముం బ్రయోగింప అంతలో రాక్షసుని దేహము మారిపోయి వానికి దేవతారూపము వచ్చెను. ఆతడు స్వారోచిని సమీపించి నేనే ఇందీవరాక్షుడను గంధర్వుడను. ఈమె నాకూతురు మనోరమ. నే నొకనాడు భూలోకమున చరించుచు ఆయుర్వేదవిద్యానిధి యయిన బ్రహ్మమిత్రుడు శిష్యులకు విద్య నుపదేశించుచుండ దాని గ్రహింపగోరి ఆయనను ప్రార్థింప ఆయన తృణీకరించి నిరాకరించినాడు. నేను మారువేషమున నచటనేయుండి-కాయ, బాల, గ్రహ, ఊర్ధ్వాంగ, శల్య, దంష్ట్ర, జర, వృష అను భాగములతో నున్న అష్టాంగలక్షణమును ఎనిమిదిమాసములలో గ్రహించాను. ఆ గర్వంతో మునియెమటకు స్వస్వరూపంతో వెళ్ళి జరిగిన కథ చెప్ప, ఆమున కుపితుడై నీవు శాంబరీవిద్యతో మోసంచేసావు కనక రాక్షసుడవై రక్త, మాంసాహారంతో

బ్రతుకు అని శపింప నేను భయపడి విముక్తి గోరగా నీవలన ఈప్రకార మున విముక్తిని ప్రసాదించాడు.

అని ఇందీవరాక్షుడు తనకథ ముగించి, నేను నేర్చిన ఆయుర్వే దమును నామాత్రతో నీకిచ్చుచున్నా నని మనోరమా-స్వరోచులకు పాణిగ్రహణము గావించెను. ఇందీవరాక్షునివెంట గంధర్వనగరమున కేగిన మనోరమా-స్వరోచులకు విభావసీ-కళావతులు స్వాగతమిాయ రాగా మనోరమ వారి దీనస్థితిని తలచి విచారింప, స్వరోచి తనవైద్య శాస్త్రప్రభావమున వారిని రోగవిముక్తుల గావించెను.

అంపు మందారుడను పేరుగల గంధర్వుని కుమార్తె విభావసి తనకు తెలిసిన మృగ, పక్షిజాతుల భాషలను స్వరోచికిచ్చి పెండ్లియాడ వేడెను.

అనంతరము కళావతి తనకథను సవిస్తరముగ చెప్పి, పార్వతీ దేవి అనుగ్రహమున తనకు లభించిన 'పద్మిని' అను విద్యను స్వరోచి కొసంగి పాణిగ్రహణము చేసెను.

మువ్వురుభార్యలతో స్వరోచి విలాసవిహారము జరుపుచు ఒక సరోవరసమీపమునవుండ అందున్న ఒక హంస దగ్గరలోనున్న చక్ర వాకముతో వాని అనురాగమును అభినందించుచు ప్రసంగింప, ఆభాష నెరిగిన స్వరోచి కొంత సంతసించి యిల్లుచేరినాడు.

మరికొంతకాలము జరిగినది. ఒకనాడు స్వరోచి భార్యలతో విహారము చేయుచు ఎదురుగానున్న లేళ్ళను జూప, నామగలేడి తన భాషలో 'నేను చిరకాలము స్త్రీలతో నుండుటకు స్వరోచిని కాను. పొండు' అని పలుక స్వరోచి యీక్షణములలో కొంత అసహ్యపడియు, భార్యాలయం దనురాగము వీడలేకపోయినాడు.

ఒకనాడు అడవిలో వేటను తిరుగుచుండగా అడవిపంది ఎదురయి

నది. దానిని చంప బాణ మెక్కు-పెట్టిన వానిని జూచి ఒక లేడి మనుజ భాషణములతో-

ఓ రాజా !

నీ కేఅపకారమును చేయని సూరకమును జంపుటకంటె నన్ను చంపరాదా ? అనగా విని, ఆశ్చర్యముతో స్వారోచి తెల్లబోయిచూడ;

ఓ రాజా,

నామనము నీయందు లగ్నమయి యున్నది. నన్ను నువ్వు పొందగోరిన దో నేను జీవించెదను. అనగా విన్న స్వారోచి అట్లైను సంభవము ? అనగా ఆలేడి, నీవు నన్ను ప్రేమతో కాగలించుకొనిన చాలునన స్వారోచి అట్లే చేసెను. ఆ కాగిలిలోననే ఆ ఆడులేడి మానవ స్త్రీరూపము ధరించి, రాజా ! నే నీవన దేవతను. దేవతల యాజ్ఞాను సారము నేను నీవలన నొక కుమారుని గనవలయును. ఆతడు మనువు కాగలడు. అట్టి పుత్రుని నావలన బడసి పుణ్యలోకములు పొందు మన స్వారోచి ఆవన దేవతతో కొంతకాలము గడుప నామె గర్భవతియై సౌందర్య, ప్రతాప, పరాక్రమమూర్తి అయిన ఒక కుమారుని శుభలగ్న మున కన్నది. ఆతడే స్వారోచిషుడు. ఈతడు వేదవేదాంగ విద్యా వంతుడై, సకలసద్గుణశోభితుడయినాడు. అంత కొంతకాలమునకు మహాపిష్ణువు స్వారోచిషుని జేరి ఆతనికి పట్టముగట్టి మనువును చేసినాడు. ఈతడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ నియమముగా పరిపాలన సాగించినాడు.

మూడవమనువు

ఉత్తానపాదుడనే మహారాజుకి సురుచి అనే పేరుగల భార్య వలన జనించినాడు ఉత్తముడనే కుమారుడు. ఉత్తముని పరాక్రమ, బలాదులను గూర్చి యెంత ఘనంగా గానం చేసేవారో అతని దయా శీలాన్ని, బుద్ధిశక్తినీకూడా అంత ఘనంగానూ చెప్పుకొనేవారు. ధర్మజ్ఞుడయిన ఉత్తముడు సుష్టశిక్షణలో యముధర్మరాజుతో సమాన మయిన ఖ్యాతిని సాధించాడు.

బభ్రుకుమారి అయిన బహుళ ఉత్తముని ధర్మపత్ని అయినది. అది మొదలు ఉత్తముని సర్వకార్యములేగాక, అతని ఆలోచనలన్నియు బహుళకు సంతోషమును కలిగించుటయందే మగ్నము కాసాగినవి. కలలలోగూడ అతనికి బహుళను సంతృప్తపరచుకార్యములే సడచెడివి. జీవితమే ఉత్తమునికి బహుళ అయినది. సౌందర్యవతిఅయిన బహుళకు చక్రవర్తిపై ఆదరానురాగములు లేకపోలేదు కాని ఆమెకు మహారాజు నాజ్ఞాపించవలెనను కోరిక ప్రథమమునుండియు కలదు. ఉత్తము డాది నుండియు రాణికి సంతోషమును కలిగించుటకు జేయు యత్నములో ఒకవిధముగు లోకువ ఆమెలో అంకురించినది. ప్రారంభమున అంకుర రూపమునన్న ఆ అలసభావము నెమ్మదిగ పల్లవించినది. కాలము గడచుసరికి బహుళ వాక్యము రాజాజ్ఞగా మారినది. ఉత్తముడు కొలువుదీర్చి మంత్రి, సామంత, పురోహిత, సచివ సమేతుడైనపుడు

గూడ మహారాణి బహుళ చక్రవర్తిపై తన అధికారమును చెలాయింప యత్నించినది.

ఉత్తముని సహనము నాటితో హద్దులు దాటిపోయినది. బహుళపై విపరీతమైన ఆగ్రహము కలిగినది. తక్షణమే ప్రతీహారిని పిలచి బహుళను అరణ్యమధ్యమున విడిచి రమ్మని ఆజ్ఞాపించాడు. ప్రతీహారి రాజాజ్ఞను యథాక్షరముగ పాలించినాడు.

సౌందర్యసంజనితమయిన గర్వము అహంకారమై బహుళను అరణ్యముల పాలుజేసినది.

* * *

అసదృశలావణ్యవతి అయిన బహుళను ఒకానొక దుష్టఘడియలో వీడినాడే కాని ఉత్తముని హృదయము మాత్రము ఆమెయిందనే ఉన్నది. ఏకాంతసమయములందు బహుళతో తాను నెరపిన సర్వాశ్లేంగారక్రీడలు స్మృతిసీమలో మసలి, ఆతని హృదయమును మెలిదిప్పసాగినవి. కొన్ని క్షణము లట్లు బాధపడినను ఉత్తము డధికముగ ఆమెనుగూర్చి విచారించలేదు. బహుళకు జరుగవలసిన ప్రాయశ్చిత్త మదియే నిశ్చయించుకొని నెన్నుదిగ నా బాధనుండి విముక్తినంద సాగినాడు.

ఇట్లుండ నొకనాడు ఉత్తముని ఆస్థానమున కొక బ్రాహ్మణుడు విచ్చేసి, ఆతని కెదురుగా దీనవదనుడై నిలబడినాడు. ఉత్తము డావిప్రవరుని చూచి దయార్ద్రహృదయముతో-నీ దీనత్వమునకు కారణమేమి? అని ప్రశ్నించినాడు. అంత నావిప్రుడు, అంజలిఘటించి, తలవాల్చి, కన్నుల నీరు రాల:

'మహారాజా!

నాస్థితి నేమని చెప్పను. అగ్నిసాక్షిగా పరిణయమాడిన నా భార్యను నిన్నరాత్రి యెవడో అపహరించినాడు. ఆమె లేక నేను జీవింపలేను. నాకర్మకాండ అంతము ఆమెపై ఆధారపడి యున్నది.

గార్హస్థ్యమును స్వీకరించిన దాది అగ్నికార్యముగూడా భార్య లేకుండ జరుగదు కదా ! అట్టియెడ ఆమె లేనిదే నే నేమి చేయగలను. ఈ పృథివీస్థలిని కర్మభ్రష్టుడనై నే నేమి చేయగలను. కర్మభ్రష్టుడయిన బ్రాహ్మణుడు చండాలునికన్న అధముడు. కావున రాజ్యపాలకుడవయిన నీవు నాపత్నిని దుష్టులబారినుండి విడిపించి నా కనుగ్రహింప ప్రార్థన. ధర్మప్రభువయిన నీకన్న మాకు దిక్కెవరు ?

అంతేగాక శాస్త్రానుసారము ప్రజల భాగ్యములో ఆరవభాగము ప్రభువుది, ప్రజల ధర్మాచారణలో ఆగవపాలు ప్రభువుకే ప్రాప్తించును. ఐహిక, పారలౌకికములందు ప్రజాభాగమును పంచుకొను చక్రవర్తి ప్రజారక్షణ చేసియేతీరవలయును.

మహారాజున్నాడని మేము నిర్భయముగ గుండెలపై చేతులుంచుకొని సుఖనిద్ర నందగలము. అట్టి సమయమున నిట్టి అకృత్యము జరిగినది.

మహారాజా !

సత్వరముగ మీరు నా కష్టమును నివారింపుడు.

అని తలయెత్తినాడు.

బ్రాహ్మణుని వాక్యములను సావధానచిత్తుడయి ఆలకించిన చక్రవర్తి బయటకు నిట్టూర్పు వదలి–

"ఓ ద్విజశ్రేష్ఠ !

నీభార్యను తిరిగి నీవద్దకు చేర్చుటకు నే నే స్వయముగ బయలు దేరగలను. కాని నాదొక ప్రశ్న– నీభార్యయొక్క గుణ, రూప, శీలములనుగూర్చి నే నేమియు ఎరుగనుకదా. ఆ వివరములనిచ్చినచో నేను నీకుపకారము చేయగలను"–

అని చక్రవర్తి కుతూహలమనస్కుడయినాడు.

బ్రాహ్మణుడు, గొంతు సవరించి–

"మహారాజా !

నా ధర్మపత్ని సౌందర్యరాశి కాను, కనీసము గూపవతియు కాను, ఆమెను గూచినవా రెవ్వరూ ఆమెవైపు మరల చూడ నిచ్చ గింపను. ఒకవిధముగ కురూపియే అనవలయును.

గుణమందురా ?

ఆమెది కోపస్వభావము. నిరంతరము రుసరుస లాడుచుండును. ఎల్లప్పుడు నామాటకు వ్యతిరేకమే పల్కుచుండును. ఎంతకాలమునుండి ప్రయత్నించుచున్నను ఆమెను మార్చలేకపోతున్నాను. గూపవతి అయినా, కురూపి అయినా ఏమయినా అగ్ని సాక్షిగా పెండ్లియాడిన భార్య భార్యకాకపోతుండా, మహారాజా ! ఏమయినా రాజ్యపాలకు డివిగా నీవు నా భార్యను.....

అని యింకా బ్రాహ్మణుడు పలకబోతుండగా, మహారాజు ఇటా అన్నాడు.

"ఓ బ్రాహ్మణోత్తమా ! సౌందర్యంగోపాలు, మంచి స్వభావం కూడా లేని ఆ భార్యతో నువ్వేం సుఖపడతావు. గూపవతి, గుణవతి అయిన మరొక అమ్మాయిని నీకు వివాహంచేస్తాను. హాయిగా ఆమెతో సంసారం చేస్తూ, నీకర్మకాండ నిర్విఘ్నంగా సాగించుకో."

మహారాజు పలికిన అనునయవాక్యాలు విన్నాడు.

'మహారాజా !

అది అధర్మం, శ్రుతివిరుద్ధం. భార్యయొక్క అందచందాలను పురస్కరించుకొని ఆమెను విడిచేసే అధికారం మానవుడికిలేదు. అగ్ని దేవునియెదుట చేసిన ప్రమాణానుసారం, ధర్మబద్ధముగ స్వీకరించిన భారతోనే జీవితమును సాగింపవలయును. ఆమె మెడలో మాంగళ్యము నుంచునాడే ఆమె ధర్మపత్ని అయినది. సర్వధర్మకర్మలూ ఆమెతోనే ఆచరింపవలయును. ఈ విధిని ఉల్లంఘించు సావకాశము రాజశాసన

మీయలేదు. ఇచ్చినను నేను స్వీకరింపను. నీవు ధర్మప్రభువువే అయిన నాభార్యను నాకు తెచ్చిఇమ్ము'

అనినాడు బ్రాహ్మణుడు.

మహారాజు తన అంగీకారమును సూచించుచు తలత్రిప్పి, సభా స్థలివీడి, రథమును సిద్ధముచేసికొని, అంచు సర్వసంభారము లుంచు కొని బ్రాహ్మణపత్నిని అన్వేషించుటకై బయలుదేరినాడు.

మహారాజు ఉత్తముడు బహుదూరము ప్రయాణము చేసి చేసి, అరణ్యమున ఒక మునిశ్రమమును చూచి. సంతోషతరంగితహృద యుడై, రథమును దిగి, ఆ ముసిచంద్రుని సమీపించి, సాష్టాంగనమ స్కార మొనర్చి, ప్రత్యాలీఢపాదుడై, దోయిలించినాడు. ముని మహారాజును చిరునవ్వుతో చూచి, ఆసనమునుచూపి, శిష్యుని పిలచి చక్రవర్తికి అర్ఘ్య మిమ్మనినాడు.

మునిశిష్యుడు క్షణమాత్రే నిలబడి, 'గురుపూజ్య! ఈతనికి అర్ఘ్య మీయవచ్చునేమో ఆలోచింపు' డనినంత, ముని దివ్యదృష్టితో చూచి ఊరకుండినాడు. చక్రవర్తి విభ్రాంతుడైనాడు.

మునీశ్వరు డొకక్షణమూగి, చక్రవర్తిని చూచుచూ:

'మహారాజా, నీడాకకు కారణమేమి?' అని ప్రశ్నించినాడు.

చక్రవర్తి వినయవినమితోత్తమాంగుడై,

'మునిచంద్రా, త్రికాలజ్ఞులయిన తమకు తెలియనిదేమి. అయి నను అర్థిని గావున నివేదించుకొనెదను. నా రాజ్యమునందలి ఒకానొక బ్రాహ్మణుని భార్యను చోరుడెవడో అపహరించుకొనిపోయినాడు. ప్రజల భాగ్యములత్తోపాటు, వారి ధార్మికఫలమునందుగూడ ఆరవ భాగము ననుభవించు చక్రవర్తి వానికి జరుగు అక్రమములను నివా రించవలెనుగదా! అందువలన ఆ బ్రాహ్మణుని భార్యను వెదకుటకై

బయలుదేరితిని. తమరెరిగినచో ఆ వినరమును తెలుపు'డని తల వాల్చినాడు.

ముని చిరునవ్వు నవ్వి:

'మహారాజా, చాలసంతోషము. ప్రస్తుత మా బ్రాహ్మణుని భార్య ఒకానొక రాక్షసుని అధీనములో నున్నది.'

అని ఆ రాక్షసుడుండు స్థలమును నిర్దేశించినాడు.

మహారాజు వెడలబోవుచు,

'మునిచంద్రమా !

నేను మీ ఆశ్రమమును ప్రవేశించు వేళ నాకు అర్ఘ్యము నిచ్చుటకు మీశిష్యుని కాదేశమిచ్చిరి. కాని మరుక్షణమునసే నాకా అవకాశము లేకుండ జేసినారు. కారణమేమియో నాకు తెలియదు. దయ కలిగినచో నాకు తెలియజేయుడు'

అని అర్థించినాడు.

చానికి ముని నవ్వి, గడ్డము దువ్వుకొనుచు :

'మహారాజా,

నీవు నీభార్యను అరణ్యమున విడిచినవాడవు. భార్యారహితు నకు కర్మాధికారము పోవును. పదిహేనుదినములు కర్మను వీడినవాడు చండాలసముడు. అర్థమయినదా !'

అన్నాడు.

చక్రవర్తి తలవాల్చి, బ్రాహ్మణపత్నిని అన్వేషించు నూహతో, మునికి నమస్కరించి, రథముపై బయలుదేరి, యెట్టకేలకు ఆరాక్షసుని నివాసమునుజేరి, అందు ఒంటరిగనున్న ఆ బ్రాహ్మణుని భార్యను గుర్తు పట్టి ఆమెను పిలచి ఇట్లనినాడు :

'అమ్మా, నీ రూపురేఖలు పరిశీలిస్తూంటే విశాలుని పుత్రు డయిన సుశర్మ భార్యలా ఉన్నావు. నీవు ఈ అరణ్యంలోకి వచ్చిన కారణం ఏమిటి ? నీసంగతి సందర్భాలు వివరంగా చెప్పవమ్మా'

ఈవిధంగా పలికిన మహారాజుమాటల నాలకించిన సుశర్మ భార్య యిలా అన్నది:

'మహాపురుషా!

నేను అతిరాత్రుడనే మహాబ్రాహ్మణుని కుమార్తెను. విశాలుని ఇంటికోడలిని. ఇప్పుడు మీరుచెప్పిన పేరుగలవారి యిల్లాలిని నేనే. అది పుత్రుడయిన బలాకుడనే రాక్షసుడు నన్ను దొంగిలించి తీసికొని వచ్చి ఈ అరణ్యంలో ఉంచాడు. ఆరాత్రి నేను ఆకుబయట నిశ్చింతగా నిద్రిస్తుండగా ఈముష్కరుడు నన్నిలా చేసాడు. మహానుభావా, ఇక్కడ నేను అనుభవించే దుఃఖం శత్రువుకయినా వద్దు...'

అని తన కష్టపరంపరను వివరిస్తూ, మహారాజును ఒకప్రదేశానికి పిలిచి, అక్కడనుంచి యెదురుగాఉన్న ప్రదేశాన్ని చూడుమని సంజ్ఞచేసింది. మహారాజు కన్నులయెదుట భీకరరూపాలతో రాక్షసగణం ప్రత్యక్షమయింది.

అదే సమయానికి ఆ రాక్షసుడుకూడా ఈవైపు చూడటంవల్ల, మహారాజు వాడిదృష్టికి గోచరించాడు. ఆక్షణంలో వాడు బయలుదేరి హుటాహుటి మహారాజుని సమీపించి, దండప్రణామాలాచరించి:

'మహారాజా, అభివాదాలు- నేను నీరాజ్యంలో జీవిస్తున్నాను. నీ ఆజ్ఞను పాలించటానికి సర్వదా సంసిద్ధుణ్ణి. నీమనస్సులో నన్ను తలుచుకున్న క్షణంలో నీదగ్గర వాలతాను'

అన్నాడు.

మహారాజు బ్రాహ్మణపత్నిని రథముపై కూర్చుండుమని, రాక్షసునివైపు కృతజ్ఞతాసూచకముగ నవ్వి రథమును మునిఆశ్రమమువైపు మరలించి, తనభార్యయొక్క వృత్తాంత మేమయిన తెలుపుమని వేడెను.

ముని క్షణమాగి-మహారాజా, నీ ధర్మపత్ని ప్రస్తుతము పాతాళమున సురక్షితముగ నున్నది. నాగరాజామెను తన అంతఃపురమున

కడుజాగరూకతతో నుంచినాడు. ఆతని కుమార్తె అయిన నంద నీ భార్యయం దెంతయో అభిమానము ప్రదర్శించుచున్నందున, ఆమె తండ్రి ఆమెను మూగదానివి కమ్మని శపించినాడు-

అని ముని దీక్షలోనికి పోయినాడు.

మహారాజు రథమును రాజధానివైపు మరలించి బ్రాహ్మణుని యింటివద్ద ఆపి, ఆతని భార్యను ఆతనికి సమర్పించి-

"ఓ బ్రాహ్మణోత్తమా, నాకు నా ధర్మపత్నియం దెంతయో అనురాగము కలదు. కాని ఆమె నామీద ఎల్లవేళలందునూ అధికారము చెలాయించుటకే ప్రయత్నించుచుండుటచే ఆమెను అరణ్యమున విడిచివేసితిని. ఆమెకును నాయందు అనురాగము కలుగు దారియేమైన కలదా ?"

అని ప్రశ్నింప బ్రాహ్మణుడు దాని కొక యజ్ఞవిధి ఉన్నదనియు దానిని పూర్తిచేసినచో తప్పక అనురాగోదయ మగుననియు నుడువ, మహారాజు సంతుష్టచిత్తమతో ఆయజ్ఞమునకు సంకల్పము చేయ గోరినాడు.

సుశర్మ "మిత్రవింద" అను పేరుగల యజ్ఞము ఏడుమారులు పూర్తిచేయించి, మహారాజా, ఇక నీవు నీభార్యను తెచ్చుకొని ఆమెతో సర్వభోగము లనుభవించుచు శ్రద్ధాపూర్వకముగ యజ్ఞ, దానక్రియల నాచరింపుము-అనినాడు.

మహారాజు తన సౌధమునుచేరి రాక్షసుని స్మరింపగనే ఆతడు ప్రత్యక్షమైనాడు. ఆ రాక్షసునికి తనభార్యయున్న స్థలమునుచెప్పి, ఆమెను సురక్షితముగ గొనిరమ్మనినాడు.

మహారాజు ఆజ్ఞను కొలదికాలవ్యవధిలో పరిపాలించినాడు. రాక్షసుడు-

మహారాజును చూచుచునే మహారాణి సంతోషమో, దుఃఖమో తెలియని దివ్యానుభూతితో ఆలింగనము చేసికొని అతనియందు బద్ధానురాగ అయినది.

మహారాజామెను పీడలేకపోయినాడు. కొంతసేపటికి రాణి ఉద్వేగము సన్నగిల్లినది. అంత నామే-

"ప్రభూ, నన్ను నేటివరకూ కంటికి రెప్పవలె కాపాడిన నాగరాజు కూతురు నంద నామూలమున మూగదయినది. ఆమె మూగతనమును పోగొట్టుటకు మనము ప్రయత్నించి ఋణభారము తీర్చుకొనవలెను"

అన విని మహారాజు సుశర్మను జేరి విషయమును వివరింప సుశర్మ ఆశ్చర్యసూచకదృక్కులు బరపుచు-

'రాణీవారు తమ యిష్టసఖియందంత ప్రేమ కలిగియున్నచో 'సారస్వతీ' అను పేరుగల ఇష్టిని సాగించినచో ఆమెకు మూగతనము పోవును-అన్నాడు.

మహారాణి ఆనందభరితహృదయంతో ఆ ఇష్టిని నిర్విఘ్నముగ చేయించి మహారాజును వీడలేని గాఢపరిష్వంగమున నుంచినది.

అనంతరము రాజును, రాణియు బయలుదేరి పాతాళమున కేగి నందను చూచిరి. నందవిషయమును గ్రహించి పరమసంతోషముతో వారిరువురికి కృతజ్ఞతలు తెలిపి, వారితో భూలోకమునకు వచ్చి:

'మహారాజా, పరాక్రమవంతుడవు, ధర్మబుద్ధుడవు అయిన నీ అంశమున మా చెలియందు మహాతేజస్వి అయిన పుత్రుడొకడు జన్మించనున్నాడు. సర్వశాస్త్రజ్ఞాత అయిన అతడు ధర్మపరాయణుడై మనువు కాగలడు-అని చెలిని గాఢముగ కౌగిలించుకొని వీడలేక, వీడలేక పాతాళమున కేగెను.

కొంతకాలమునకు రాణి గర్భవతియై, ఒకానొక శుభసమయ మున చక్కని కుమారుని ప్రసవించినది. శాస్త్రజ్ఞులందరుచేరి ఉత్తముని వంశమున ఉత్తమలక్షణములతో జన్మించినాడు గావున ఈతనికి ఔత్త ముడని నామకరణము చేసిరి.

ఈ బాలుడు శుక్లపక్షచంద్రునివలె దినదిన ప్రవర్ధమానుడై, సర్వశాస్త్రపారంగతుడై అనంతరమున మనువయినాడు.

స్వధామా, సత్య, శివ, ప్రతర్ధన, వశవర్తి అనునవి ఈ మన్వం తరమున దేవతాగణములు. నామానుసారములయిన గుణములు ఈ గణములకు కలవు. పన్నెండుగురు సభ్యులు ఒక్కొక్క గణము దాయము. యజ్ఞశతమును పూర్తిగావించి యింద్రపదవి నధిష్ఠించిన వాడు 'సుశాంతి.'

సుశాంతి ర్దేవరాట్ శాంతః సుశాంతిం ప్రయచ్ఛతి
సహితః శివసత్యాద్యై స్తథైవ వశవర్తిభిః ॥

అని ఈ ఇంద్రు నుద్దేశించియే శాంతిగీతము కలదు.

అజ, పరశుచి, దివ్య అను పుత్రులు ఔత్తమ మనువునకు జన్మిం చిరి. బ్రహ్మర్షి వసిష్ఠుని వీడుగురు కుమారులూ ఈ మన్వంతరములోని సప్తర్షులు.

ఔత్తముని అనంతరము తామసుడు మనువయినాడు.

తామసుడు

తామసమన్వంతరమున దేవగణములు సత్య, సుధీ, సురూప, హరి అను పేర్లతో వ్యవహరింపబడినవి. ఈ గణములందు ఇరువది ఏసు సంఖ్యలో నుండెడివారు. ఈ సమయమున ఇంద్రపదవి నధిష్ఠించినవాని పేరు శిఖి. తామసమన్వంతరమున జ్యోతిర్ధామ, పృథు, కావ్య, చైత్ర, అగ్ని, బలక, పీవరనామధారులు సప్తర్షు లయిరి. నర, ఖ్యాంతి, శాంత, దాంత, జాను, జంఘు అను పేర్లుగల మహాబలపరాక్రమవంతు లీతని పుత్రులు.

రైవతుడు

తామసుని అనంతరము రైవతుడు మనువయినాడు. ఈ మనువు కాలమున సుమేధ, భూపతి, వైకుంఠ, అమితాభ అను పేర్లతో దేవ గణాలు వర్థిల్లాయి. ఈ మన్వంతరము విభు అను పేరుగల ఇంద్రుడు దేవగణాధిపతి. హిరణ్యరోమ, వేదశ్రీ, ఊర్ధ్వబాహు, వేదబాహు, సుధామ, పర్జన్య, వసిష్ఠులు సప్తర్షులు. బలబంధు, మహావీర్య, సుయ జ్ఞవ్య, సత్యక అనే పేర్లుగల పుత్రులు రైవతునికి కలిగారు.

చాక్షుషమనువు

స్వాయంభువ, స్వారోచిష, ఔత్తమి, తామస, రైవతమనువుల అనంతరము చాక్షుషనామ మనువు పరిపాలకుడయినాడు.

ఈ మన్వంతరమున ఆర్య, ప్రసూత, భవ్య, యూధగ, లేఖ అనే పేర్లతో విరాజిల్లే దేవగణాలకు మనోజన అనే పేరుగల ఇంద్రుడు ప్రభువయినాడు.

సుమేధ, విరజా, హవిష్మాన్, ఉన్నత, మధు, అతినామ, సహిష్ణు అనే పేర్లుగలవారు సప్తర్షులుగా పరిగణింపబడ్డారు.

ఉరు, పురు, శతద్యుమ్నులు చాక్షుషమనువుయొక్క కుమారులు. ఈతని అనంతరమే వైవస్వతుడు మనువయినాడు. ప్రస్తుతము నడచుచున్నది వైవస్వత మన్వంతరమే. దానిని వివరించెద.

★

వైవస్వత

ఆంధ్రులకే కాక సమస్త భారతప్రజానీకానికీ ఆరాధ్యుడయిన శ్రీరామచంద్రుడు పృథ్వివైై అవతరించినది వైవస్వతమన్వంతరములోనే.

కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగ, కలియుగాలు నాలుగు గతిస్తే ఒక మహాయుగం గడిచినట్టవుతుంది. ఇటువంటి మహాయుగాలు డెబ్భైయొకటి నడిస్తే దాన్ని మన్వంతరం అని ప్రాజ్ఞులు వ్యవహరిస్తారు. ఈ మన్వంతరాలలో యింతవరకూ స్వాయంభువ, స్వారోచిష, ఔత్తమ, తామస, రైవత, చాక్షుస మన్వంతరాలు గతించినవి. వైవస్వతమనువు పాలన నడుస్తున్నది. ఈ వైవస్వతమన్వంతరంలో కృత, త్రేతా, ద్వాపరయుగాలు పూర్తిఅయి, కలియుగంలో ప్రథమపాదం నడుస్తూన్నది. త్రేతాయుగంలో పరమేశ్వరుడు శ్రీరామచంద్రుడుగా మానవదేహంతో భూమిపై అవతరించి రావణాది రాక్షససమూహాన్ని నాశనంచేసి, అవతారప్రయోజనమయిన దుష్టశిక్షణ, శిష్టరక్షణలు చేసి ధర్మాన్ని ప్రతిష్ఠించాడు.

ద్వాపరయుగంలో—

శ్రీ మహావిష్ణువు శ్రీకృష్ణుడనేపేరుతో దేవకీనందుల నందును డుగా జన్మించి కంసాదులను సంహరించాడు.

దేశంలో ధర్మగ్లాని యేర్పడుతూన్న సమయంలో పాండవ పక్షాన్ని వహించి, భారతయుద్ధాన్ని నడిపించి ధర్మసంస్థాపనం చేసాడు.

ఇదే ప్రకారంగా కలియుగంలో కల్క్యవతారం యెత్తుతాడని పురాణాలు ఘోషిస్తున్నవి.

మూడు అవతారాలకు మూలమయిన ఈ వైవస్వతమనువు గాథ మనకు అవశ్యము తెలిసికోదగినది. మానవజాతికి మానవత్వాన్ని ప్రసాదించే మనువుల చరిత్ర అందరకూ సహనీయం కావాలి. ఆ మహాపురుషుల జీవితాలు అనుదిన ప్రాతఃస్మరణీయాలు. ఈ ప్రకరణంలో వైవస్వతమనువుగాథ సంక్షిప్తంగా వివరిస్తాను.

సంజ్ఞాదేవి

దేవతాకోటిలో ప్రముఖులుగా పరిగణింపబడేవారిలో ఒకడయిన విశ్వకర్మ కుమార్తె సంజ్ఞ. విశ్వకర్మ తనకుమార్తెకు అనురూపవంతుడయిన భర్తగా సూర్యుణ్ణి అర్థించాడు. సూర్యభగవానుడు విశ్వకర్మ అభ్యర్థనను అంగీకరించి సంజ్ఞాదేవిని భార్యగా స్వీకరించాడు. సంజ్ఞాదేవి సూర్యదేవుని ధర్మపత్నియై విఖ్యాతంగా సంసారం సాగించింది.

సూర్యభగవానునివలన సంజ్ఞాదేవి సర్వసుఖాలనూ అనుభవిస్తూ కొంతకాలం సంతోషప్రదమయిన సాంసారిక జీవితాన్ని నిర్వహించింది.

(ఆ సుఖమయ సాంసారికజీవితాన్ని నిర్వహిస్తూన్నపుడే సంజ్ఞాదేవి గర్భవతియై ఒక శుభముహూర్తమున కుమారుని కన్నది. ఆబిడ్డకే వైవస్వతుడని నామకరణ మొనర్చారు. వివస్వంతుని కుమారుడగుట వైవస్వతనామ మాతనికి ప్రాప్తించినది.)

అలా సాగుతూండగా—

ఒకనాడు...

సూర్యభగవానుడు సహస్రకిరణద్యుతితో సంజ్ఞాదేవి యెదుట నిలచినాడు. ఆ చండతీక్ష్ణస్ఫూర్తిని సహించలేక ఆమె కనులు మూసుకొన్నది. సూర్యుడు కుపితుడై :

'నన్ను చూసి నీవు నేత్రసంయమనం చేసావు కనక నీగర్భం నుండి సంయముడు ఆవిర్భవిస్తాడు.'

అన్నాడు.

సంయముడే సర్వప్రపంచధార్మికవ్యవస్థను పరిపాలించే యముడు. ప్రజానీకాన్ని శాసించే యమధర్మరాజితడే.

సూర్యుని నోటినుండి వెలువడే ఆ వాక్యాలు వినేసరికి ఆమె హృదయం గజగజలాడిపోయినది. ఆమె కన్నులు చలించాయి.

ఆ చంచలనయనాలను ఆలోకించిన సూర్యుడు తిరిగి క్రోధావిష్టుడై యిలా అన్నాడు–

'నువ్వు మళ్ళీ కన్నులను విచలింపజేస్తూ నన్ను చూశావు కనక నిరంతరం చలించే తరంగాలతో ఉండే నదీరూపంలో నీకు ఒక కుమార్తె కలుగుతుంది !

ఈ మాటలు విని సూర్యుని ధర్మపత్ని కొద్దిగా చకిత అయినా నిబ్బరించుకు నిలబడింది. మహామహుడయిన సూర్యుని వాక్యానుసారం సంజ్ఞా నదీరూపంలో ఒక కుమార్తెను ప్రసవించింది.

అదియే యమునానది. భారతవర్షమున పవిత్రమయిన నదులలో ప్రముఖముగా పరిగణింపబడే యమునా యిదే. దీనినే ఉత్తరదేశీయులు జమున అని వ్యవహరిస్తారు.

ఛాయ

రాను రాను సంజ్ఞాదేవి సూర్యుని ప్రతాపాన్ని సహించలేక పోయింది. కొంతకాలం విశ్రాంతిగా బ్రతకాలనిపించింది. ఆలోచించి ఆలోచించి పుట్టింటికి పోవటానికే నిశ్చయించుకుంది.

అదేసమయంలో తన శరీరంనుండి ఛాయను సృష్టించి, తనకు మారుగా తన ఛాయను సూర్యపత్నిగా వ్యవహరించమని, పిల్లలను ఆదరంతో సాకమని చెప్పి వెళ్ళిపోయింది.

తండ్రి ఆదరంతో స్వాగతమిచ్చాడు. కొంతకాలం సంజ్ఞ పుట్టింట గడిపింది. ఒకనాడు తండ్రి సంజ్ఞను పిలిచి ఆడవాళ్ళు పుట్టింట చిరకాలం ఉండటం మంచిదికాదమ్మా. మంచిరోజుచూచి, నీవు అత్తవారింటికి వెళ్ళాలి అని నెమ్మదిగా చెప్పాడు.

తండ్రిమాటలను ఆలకించి సంజ్ఞ ప్రయాణోన్ముఖురాలయింది. కాని మధ్యలో ఒక్కసారిగా సూర్యుని చండకిరణతీక్ష్ణత్వము సంజ్ఞను భయపెట్టినది. తక్షణము ఆమె ఉత్తరకురుభూములవైపు ప్రయాణం సాగించింది, అక్కడ ఒక ఆశ్రమసమీపమున అశ్వరూపము ధరించి తపస్సు చేయసాగింది.

అక్కడ ఛాయ సూర్యభగవానుని కృపావిశేషముచేత ప్రతాపవంతులయిన యిరువురు కుమారులను, సౌందర్యవతియైన ఒక కుమా

ైను కన్నది. ఛాయ సంతానము పెరిగి 'పెద్దవారయ్యాకొద్దీ ఛాయకు సంజ్ఞపిల్లలమీద ఒకవిధమయిన అలసభావం ఏర్పడింది. ఆమె చులకన భావాన్ని వైవస్వతుడు అంతగా పట్టించుకొనేవాడుకాదు. .కాని యమునికి ఆమెప్రవర్తనపై అసహ్యము, చిరాకు ఎక్కువకాసాగినవి. ఒకనాడు ఛాయను యముడు తీవ్రంగా ఎదిరిస్తూన్నసమయంలో ఛాయ కోపాన్ని పట్టలేక యిలా అన్నది.

"త్రిలోకైకసాక్షియైన సూర్యభగవానుని ధర్మపత్నిని నేను. అటువంటి నన్ను ఎదిరించి తిరస్కరించే నీసాహసానికి శిక్ష అవసరము. ఈక్షణములోనే నీ రెండుకాళ్ళు తెగి పడిపోవుగాక !"

ఈవిధంగా ఛాయ శపించేసరికి యముడు భయపడిపోతూ తండ్రిని సమీపించి జరిగిన వృత్తాంతమంతా వివరించాడు. వివరిస్తూ ఎంత కఠోరహృదయురాలయినా కన్నతల్లి తనబిడ్డమీద వాత్సల్యాన్ని పూర్తిగా పారద్రోలి యింతటిఘోరముగా శపించగలదా? అని ప్రశ్నించే సరికి సూర్యునికి ఒక్కమారుగ శరీరమంతా కంపించినంతపని అయింది. హుటాహుటి బయలుదేరి ఛాయను పిలిచి "సంజ్ఞ ఎక్కడ?" అని గర్జించాడు. ఛాయ గజగజవణికిపోతూ నేనే సంజ్ఞ నని చెప్పింది. సూర్యుని కోపము యినుమడించింది. మళ్ళీ ప్రశ్నించాడు. ఈసారి కూడా అదేజవాబిచ్చింది ఛాయ. మూడోసారి సూర్యుడు మరింత తీవ్రంగా అడిగేసరికి ఛాయ జరిగిన కథనంతా సవిస్తరంగా సూర్యభగవానునికి వివరించిచెపుతూ కాళ్ళమీదపడి ఏడ్వసాగింది. మరుక్షణంలో సూర్యుడు విశ్వకర్మగృహానికి చేరాడు. ఇంటికివచ్చిన అల్లుని ఆదరించి మర్యాదలు జరుపబోయాడు మామగారు. కాని సూర్యుడు అన్నిటిని కన్నులతోనే నిరాకరించి ఏదో అస్తవ్యస్తంగా ప్రసంగిస్తూ సంజ్ఞకోసం కలయచూచాడు. కాని ఆమెజాడ గోచరించలేదు. విశ్వకర్మను ప్రశ్నించాడు. విశ్వకర్మ సమాధానంలో సూర్యునికి సంజ్ఞఉండే ప్రదేశం

తెలియ లేదు. ఒక్క-సారిగా దివ్యదృష్టి తో చూచాడు. ఉత్తరకురు భూములలో అశ్వరూపాన్ని ధరించి తీవ్రంగా తపస్సుచేస్తూనట్లు కను గొనగలిగాడు. తక్షణము ఉత్తరకురుభూములనైపు ప్రయాణం సాగిం చాడు. అశ్వరూపంలోఉన్న సంజ్ఞను సమీపించి ఆమె మనస్సులో ఉన్న కోరికను యిలా పసిగట్టగలిగాడు. నాపతియైన సూర్యభగవానుని తీవ్రతపనశక్తి తగ్గించి సౌమ్యస్వభావాన్ని ఆయనకు కలుగునట్లుచెయ్య ఆభావాన్ని గ్రహించిన సూర్యుడు విశ్వకర్మను ఆహ్వానించి ఆమెకు ఆహ్లాదంకలిగేవిధంగా ప్రయత్నించమన్నాడు. తక్షణము విశ్వకర్మ సంవత్సారాన్ని ఆరుబుతువుల చక్రంగా ప్రవేశపెట్టి సంజ్ఞాసూర్యులకు ఆనందాన్ని కలిగించడంతో వారు సంతృప్తహృదయులయారు. అదే సమయంలో దేవతలు, దేవర్షులు సూర్యుణ్ణి అనేకవిధాల స్తోత్రము చేసారు. విశ్వకర్మ సూర్యునితేజస్సులో పదిహేనుఅంశలు తీసేసి ఒక్క అంశను ఉంచాడు.

సూర్యునిలోని ఋగ్వేదమయమయిన తేజస్సుతో భూమినీ, యజుర్వేదతేజస్సుతో ద్యులోకమును, సామవేదప్రకాశముతో స్వర్గ లోకమును ప్రతిష్ఠించాడు. సూర్యునినుండి ఆకర్షించిన ఆ తేజస్సునుండి శంకరుని త్రిశూలము, శ్రీమన్నారాయణుని చక్రము, వసువుల భయం కరశంఖువు, అగ్నియొక్క తాపశక్తి, కుబేరుని విమానము, దేవగంధర్వ యక్షవిద్యాధరాదుల అస్త్రశస్త్రములను నిర్మించెను. నాటినుండి సూర్యుడు షోడశాంశలలో ఒక అంశతో మాత్రమే ప్రకాశించు చున్నాడు.

అంతట సూర్యుడు ఉత్తరకురుభూములకుపోయి అశ్వరూపమున నున్న సంజ్ఞను సమీపించాడు. పరస్పరనాసికాస్పర్శతో సంజ్ఞ నాసత్య, దస్ర అను పేర్లుగల యిరువురు కుమారులను గన్నది. మరల రేవం తుడు అను పేరుగల పరాక్రమవంతుడు సంజ్ఞగర్భమున జన్మించాడు.

ఆతడు నిశితకరవాలము చేతధరించి కవచధారియై ధనుర్బాణయుతుడై సుసజ్జితాశ్వముమీద ఎటకోపోయాడు.

అనంతరము సూర్యుడు స్వస్వరూపముతో ప్రత్యక్షంగా సంజ్ఞ సంతోషతరంగింతస్వాంతయై నిజరూపముధరించినది. అంతట సూర్యుడు సంజ్ఞతో స్వస్థానము జేసినాడు. సంజ్ఞ అశ్వరూపములోఉండి ప్రసవించిన కుమారు లిరువురు అశ్వినీకుమారనామాంతరులై దేవవైద్యులయినారు. రేవంతకుడు గుహ్యకులకు ప్రభువైనాడు.

ఛాయసంతానములో జ్యేష్ఠుడైనవాడు సావర్ణి. ఇతడు రూపు కేశావిలాసములలో వైవస్వతుని సర్వవిధముల పోలియుండుటచే 'సావర్ణి' అసు పేరువచ్చినది. ఇతడే ఎనిమిదవ మనువు. ఈమన్వంతరమునసే బలిచక్రవర్తి ఇంద్రపదవిని వహిస్తాడు. రెండవకుమారుడైన శని సూర్యుని అనుగ్రహమువలన గ్రహమండలిలో మధ్యస్థానమున నియమితుడైనాడు. కురూపియైన తపతి సంవరణుడను చక్రవర్తిని పెండ్లియాడి అతనివలన 'కురు' అను పేరుగల కుమారుని గన్నది. ఇతడే కురువంశమునకు మూలపురుషుడు.

వైవస్వతమన్వంతరమున ఎనిమిది దేవగణము లుండును. ఆదిత్య, వసు, రుద్రసాధ్య, విశ్వేదేవ, మరుత్, భృగు, ఆంగిర అని ఈగణములకు పేర్లు. ఇందు ఆదిత్య, రుద్ర, మరుద్గణములు కశ్యపుని సంతతివారు. సాధ్య, విశ్వేదేవ, వసుగణములు ధర్ముని సంతతి భృగు సంతతివారు భృగుగణములు. మహర్షియైన అంగిరుని పుత్రులు ఆంగీరసగణము. ఈ మన్వంతరమున ఊర్జస్వి అనునతడు ఇంద్రపీఠాధిపతి.

అత్రి, వసిష్ఠ, కశ్యప, గౌతమ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని-వీరు సప్తఋషులు. ఇక్ష్వాకు, నృగ, ధృష్ట, శర్యాతి, నరిష్యంత, నాభాగ, అరిష్ట, కరూషధృష్టలు వైవస్వతుని కుమారులు.

వైవస్వతుని అనంతరము సావర్ణి మనువగును. యీతడు వైవస్వతుని సోదరుడు. శనికి అన్నగారు.

పరశురామ, వ్యాస, గాలవ, దీప్తిమాన, కృప, ఋష్యశృంగ, అశ్వత్థామ వీరు సప్తర్షులు. సుతపా, అమితాభ, ముఖ్య-ఇవి దేవగణములు. తపస్తపశ్చక్ర, ద్యుతి, జ్యోతి, ప్రభాకర, ప్రభాస, దయిత, ధర్మ, తేజ, రస్మి, వక్రతు ఆదిగాగల పేర్లుగలవారు సుతపదేవదాగణములోనివారు. ప్రభు, విభు, విభాస, ప్రభృతులు అమితాభగణములోనివారు. దమ, దాంత, రిత, సోమ, వింతప్రభృతులు ముఖ్యదేవగణములోనివారు. బలి ఇంద్రపదవిని అలంకరించును. ఈబలి నేటికిని తన వాక్యానుసారము పాతాళలోకమున విరాజిల్లుచున్నాడు. విరజ, అర్వావార, నిర్మోహ, సత్యవాక్, కృతి, విష్ణు వీరు సావర్ణిమనువు యొక్క పుత్రులు. ఇది మార్కండేయపురాణమున వివరింపబడిన మనువుల సంక్షిప్తచరిత్ర.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

వ్యాసుడు

సృష్టిచక్రపరిభ్రమణంలో బ్రహ్మ, పద్మ, అగ్ని, ఈశాను, గణేశాది అనే కల్పాలు గతించాయి.

ప్రస్తుతం నడచుచున్నది శ్వేతవరాహకల్పము. ఈకల్పమందు కూడ ప్రస్తుతం సృష్టికర్తయగు చతుర్ముఖునికాలంలో ద్వితీయపరార్ధం జరుగుతూ ఉంది. ఇప్పటికి స్వాయంభువ, స్వారోచిష, ఔత్తమ, తామస, రైవత, చాక్షుషులను ఆరుగురు మనువులు గతించారు. ఏడవ వాడగు వైవస్వతుని పరిపాలన సాగుతూ ఉంది. ఒక్కొక్కమనువు పరిపాలనలో ఇంద్రుడు, సప్తమహర్షులు, దేవగణాలన్నీ మారుతూ ఉంటాయి. అట్లే వారికి కాలనియమంకూడా ఉంది. డెబ్బదియొక్క మహాయుగమైతే ఒక మనువుకాల మవుతుంది. కృత, త్రేత, ద్వాపర, కలియుగాలు నాలుగూ కలిస్తే ఒక మహాయుగం. కృతయుగమున ధర్మము నాలుగుపాదములా నడుస్తుంది. త్రేతాయుగమున మూడు పాదములు ధర్మము, ఒక పాద మధర్మము నడుస్తుంది. ద్వాపరమున రెండుపాదములు ధర్మము, రెండుపాదము లధర్మము ఉంటాయి. కలియుగంలో మూడుపాదములు అధర్మం కలిగి ధర్మం పాదమాత్రావ శేషమై ఉంటుంది. కనుకనే "నిష్ప్రాలోభ గ్రహగ్రస్తావేద విక్రయ జీవినః, తద్వ చ్ఛూద్రా శ్చ యేకే చిద్బ్రాహ్మణాచార తత్పరాః, స్త్రీయ శ్చ ప్రాయశో భ్రష్టాః, పుత్రా పిత్రద్వేషిణః, భార్యా భర్తృషు

బద్ధవైరీ నిరతాః, ప్రాప్తే కలియుగే ఘోరే నరాః, పుణ్యావివర్జితాః. కలౌ పాపాత్మనాం సర్వే" మొదలుగా గల లక్షణములు కలియుగానికి విశేషంగా ఉంటాయని ఆర్ష సిద్ధాంతాల్లో గోచరిస్తుంది. గనుకనే కలియుగ మానవులు శ్రుతిసిద్ధమైన ధర్మాన్నుండి చ్యుతులై స్వేచ్ఛాచారా యణులై చరించుట జరుగుతూ ఉంటుంది. "పుణ్యస్య ఫల మిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవాః। న పాపఫల మిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతః।" సుఖం కావాలనేవాడే కాని సుఖానికి సాధనమగు పుణ్య కర్మలు చేయరు. దుఃఖం రాకూడదనే కోరతారు. ప్రయత్నపూర్వకంగా పాపమే చేస్తూ ఉంటారు. అట్టి అజ్ఞానులను తరింపజేయుటకే ప్రతి ద్వాపరాంతమందును వ్యాసుని అవసరం కలుగుతూ ఉంటుంది. వ్యాసుడనేది ఒక పదవి. మన్వాదులు మారినట్లే వ్యాసులుకూడా మారుతూ ఉంటారు. ఈ వైవస్వతమనువు పరిపాలన ఆరంభించిన తరువాత యిప్పటికి కిరువదిపేరు మహాయుగాలు గతించి ఇరువదియొకమిదవ మహాయుగం నడుస్తూంది.

ఈ వైవస్వతమన్వంతరంలో మొదటి చతుర్యుగ పరిభ్రమణ ద్వాపరాంతమున స్వయంప్రభువు వ్యాసుడైనాడు. రెండవ ద్వాపరాంతమున సత్యుడు. ఇట్లే మూడవద్వాపరమున భార్గవుడు. నాలుగవ ద్వాపరాంతమున అంగిరుడు. ఐదవ ద్వాపరమున సవిత. ఆరవ ద్వాపరమున మృత్యువు. ఏడవ ద్వాపరమున శతక్రతు. యొకమిదవ ద్వాపరమున వసిష్ఠుడు. తొమ్మిదవ ద్వాపరమున సారస్వతుడు. పదవ ద్వాపరమున త్రిధాముడు. పదునొకొండవ ద్వాపరమున త్రివృత్. పదిరెండవ ద్వాపరమున శతతేజుడు. పదమూడవ ద్వాపరాంతమున నారాయణుడు. పదునాల్గవ ద్వాపరాంతమున ధర్ముడు. పదిహేనవ ద్వాపరాంతమున త్రయ్యారుణి. పదునారవ ద్వాపరమున దేవనాయకుడు. పదునేడవ ద్వాపరమున దేవకృతంజయుడు. పదునెనిమిదవ ద్వాపరమున

ఋతంజయుడు. పదితొమ్మిదవ ద్వాపరమున భారద్వాజుడు. ఇరువదవ ద్వాపరమున గౌతముడు. ఇరువదియొకటి వాచశ్రవుడు. ఇరువదిరెండు శుష్మాయణుడు. ఇరువదిమూడు తృణబిందు. ఇరువదినాలుగు విభు యక్షి. ఇరువదియైదు శక్తి. ఇరువదిఆరు పరాశర. ఇరువదిఏడు జాతు కర్ణి. ఇరువదియెనిమిదవ ద్వాపరాంతమున శ్రీహరి. పరాశరునివల్ల సత్యవతియం దవతరించి కృష్ణద్వైపాయన నామాంకితుడే వ్యాసపదవి నలంకరించెను. వ్యాసునిగురించి ప్రత్యేక మొకగ్రంథమే వ్రాయవలసి యున్నది. ఇక్కడ సంగ్రహముగ నిచ్చుచున్నాము.

బ్రహ్మ మానసపుత్రుడు వసిష్ఠుడు, అతని కుమారుడు శక్తి. ఈతని పుత్రుడే పరాశరుడు. పరాశరుని తపఃఫలంగా శ్రీహరియే సత్య వతీగర్భసంభూతుడుగ అవతరించెను. అతడే ప్రస్తుతకాలమున వ్యాస పదవి నలంకరించినాడు. వేదములను శాఖోపశాఖలుగ సుమంత, జైమిని, పైలాదుల కుపదేశించి పదునెనిమిది పురాణములు ఉపపురాణ ములు, మహాభారతము, బ్రహ్మసూత్రములు మొదలగు గ్రంథములను ప్రసాదించుటయేగాక బ్రహ్మాండోత్తరఖండమున సర్వవిద్యాసారభూత మైన పార్వతీపరమేశ్వర సంవాదరూపమగు అధ్యాత్మరామాయణమును ప్రతి పాదించినాడు. అధ్యాత్మరామాయణపఠన, శ్రవణ, దర్శన పూజా నమస్కారాదులమాత్రాన కలియుగమానవులు తరించగలరనే సిద్ధాం తం మనకు అనేకప్రమాణాల్లో గోచరిస్తూఉంది. వ్యాసుని కుమారుడే శ్రీశుకుడు. బ్రహ్మవిద్యాపరంపరకు ప్రధానమైన వంశమున అవతరించి కలిమానవతరణోపాయమగు అధ్యాత్మమును ప్రసాదించిన వ్యాసభగ వానునకు నమోవాకములు.

మవసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనావట్టిక

పుస్తకం సంఖ్య	REH102B102
పుస్తకం పేరు	అధ్యాత్మరామాయణము
తారీఖు	21/11/24
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	674
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	C1, 2B, 4
లేని పేజీలు	C1, 2B, 4 NO
తయారు చేసినది	Prabhas Bhumi
పేజీలు విడదీసినది	Nandini
స్కాన్ చేసినది	RUKSANA
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good